# దండకారణ్య కథలు

2005 - 2012



# దండకారణ్య కథలు

(2005–2012)

విప్లవ రచయితల సంఘం

# దండకారణ్య కథలు
(2005-2012)

విరసం ప్రచురణ

Website : www.virasam.in

Mail : arunatara1977@gmail.com

ప్రథమ ముద్రణ :

జనవరి, 2014

కవర్ డిజైన్:

జుగాష్ విలి

ప్రతులకు :

దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్

సహచర బుక్ మార్క్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్.

నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్.

వెల : రూ. 125/-

ముద్రణ :

చరిత ఇంప్రెషన్స్, ఆజమాబాద్,

హైదరాబాద్ - 500 020

# కథల వరుస


| | | |
|---|---|---|
| దండకారణ్య యుద్ధ కథల పరిచయం | – అల్లం రాజయ్య | 4 |
| చాయ్ గ్లాసు | – నిత్య | 23 |
| శిక్ష | – మిడ్కో | 28 |
| నందె | – టుంబ్రి | 48 |
| గొడ్డుని కాను | – 'తాయమ్మ' కరుణ | 51 |
| ఓ పగ్ని కథ | – ఎన్.డి. | 61 |
| తల్లి ప్రేమ | – మిడ్కో | 71 |
| చైతే | – ఎన్.డి. | 91 |
| మూసుకున్న హృదయం | – మిడ్కో | 94 |
| గ్రీన్‌హంట్ ఉత్పాతాలు | – సాధన | 102 |
| ప్రజాయుద్ధంలో మట్టి వాసనలు | – సాధన | 154 |
| కొత్త చదువు | – బి. భానుమతి | 173 |
| నిరీమిల | – యామిని | 178 |
| బాల గెరిల్లాలు | – యామిని | 190 |
| ఇద్దరు 'శస్త్ర'కారులు | – ఎన్.డి. | 198 |
| లక్ష్మణ రేఖ | – నిత్య | 214 |

# ముందు మాట

# దండకారణ్య యుద్ధ కథల పరిచయం

- అల్లం రాజయ్య

తెలుగులో ఒక ఒరవడిగా - గత నలభై రెండేళ్ళుగా అనేక మలుపులను, ఉధృతిని, వైవిధ్యాన్ని, నూతన ప్రజాస్వామిక పోరాటాల దశ, దిశను, లోతును, తడిని చిత్రిస్తూ పరిపుష్టం చేస్తున్న విప్లవ కథను - అందులో ముఖ్యంగా 2005 నుండి 2012 దాకా విరసం అధికార పత్రిక 'అరుణతార'లో వచ్చిన దండకారణ్య కథలను విరసం ఒక సంకలనంగా ప్రచురించాలనుకొని - ఆ ప్రయత్నంలో నన్ను భాగం చేసింది. రకరకాల కారణాల చేత - తెలుగులో వచ్చిన అనేక ధోరణులు, వాద వివాదాలు-ఉద్యమాల మూలకంగా - నా వ్యక్తిగత పని ఒత్తిడుల మధ్య నా ఊపిరి అయిన తెలుగు కథ, నవలల గురించి పూర్తి శ్రద్ధతో అధ్యయనం చేయలేకపోయాను. ఇప్పుడిట్లా తెలుగులో గత ముప్పై రెండేళ్ళుగా ఒక గొప్ప సన్నివేశంలో అనేక ఒడిదుడుకుల మధ్య - ప్రజల్లో నుండి రూపొందుతూ - అన్ని మలుపులను సమర్థవంతంగా చిత్రిస్తున్న దండకారణ్య సాహిత్యాన్ని చదవడం - నా మట్టుకు నాకు కొత్త అనుభవాన్ని,, శక్తిని సమకూర్చాయి... అన్ని రకాలుగా మమేకమైన ఈ మా సాహిత్యం - సమష్టిగా, గుణాత్మకంగా ఒక గొప్ప గెంతుతో - ప్రపంచ సాహిత్యంలోనే - తొలి విప్లవాలు పెల్లుబికిన, ఫ్రెంచ్, రష్యన్, చైనా సాహిత్యాలకు దీటైన సాహిత్యాన్ని - సామ్రాజ్యవాదయుగంలో పోరాడుతూ... పోరాట సాహిత్యాన్ని సృష్టిస్తున్న కామ్రేడ్సందరికి నా ఉద్విగ్న హృదయపూర్వక లాల్‌సలామ్‌లు చెప్తూతూ - ఇంత విస్తృతమైన, బహుముఖాలైన - మన కాలపు గొప్ప సాహిత్యాన్ని అనుభవించి, పరిచయం చెయ్యడం-సంకలనం చేయడంలో పాలు పంచుకోవడం ఒక సదవకాశంగా భావిస్తున్నాను. చైనా వెళ్ళిన నా మిత్రులు మావో బతికి ఉన్న కాలంలో చైనీస్ మాడరన్ లిటరేచర్ పేర 1919 నుండి 1949 దాకా వచ్చిన గొప్ప కథల సంకలనం నాకు బహుమతిగా తెచ్చారు... అందులోని చాలా కథలు 'కతల పంట'గా అనువాదమయ్యాయి. రకరకాల ఇండ్లు మారడంలో ఆ పుస్తకం ఇప్పుడు కన్పించడం లేదు. కాని అందులోని కథలు - విప్లవకాలంలో వాళ్ళు పాటించిన పద్ధతులు - మావో యేటూన్, లూషన్‌లాంటి రచయితల నిబద్ధత, రచనల పట్ల వాళ్ళు అనుసరించిన పద్ధతుల విషయంలో... సాహిత్య జీవితంలో - ఉద్యమ జీవితంలో చాలా ఉపయోగపడ్డాయి... ఈ కథలు అలాంటి కథలే.

1980 తర్వాత నుండి ఇప్పటిదాకా వచ్చిన ఇలాంటి సాహిత్యంలో ఎక్కువ భాగం నాకు అందుబాటులో ఉన్న మేరకు గత అయిదారు నెలలుగా మళ్ళీ చదువుతున్నాను... ఒక పెద్ద కుదుపుతో ముందుకు జరగబోయే భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవంలోని ఒక్కొక్క

మలుపు–సుదీర్ఘ చరిత్ర, అనుభవం, ఆదిలాబాదు కరీంనగర్ గ్రామీణ ప్రాంతాలల్లో నుండి వెల్లువెత్తిన ఈ సుదీర్ఘ మూడు తరాల నలుభై రెండు సంవత్సరాల వీరోచిత, విషాద చరిత్ర అనుభవంలో – చిత్రీకరణలో– ఈ మారుమూల విప్లవ ముఖ ద్వారంలో... ఎన్నెన్నో అనుభవాలు పోటెత్తు తున్నాయి. ఈ సాహిత్యం చదువుతున్నప్పుడు నేను పొందిన అనేక అనుభూతులు–ఒక్కొక్క కథ అందులోని పాత్రల అంతరంగ చిత్రీకరణలు కథల వెనుక కథలు అన్నీ తెలుస్తున్నాయి. 'ఇద్దరు శస్త్రకారులు' కథలోని డాక్టరులా–మహాద్భుతమైన విప్లవ కథకుల–వాళ్ళు చిత్రించిన పాత్రల పట్ల తీవ్రమైన ఉద్వేగాలకు లోనయ్యాను...

ఇప్పుడు పుస్తకంగా తెస్తున్న ఈ కథలు–దండకారణ్య ఉద్యమానికీ, అదీ 2005 నుండి ఇప్పటిదాకా అనే కాల పరిమితిలో–నాకు అందినవాటిలో సుమారుగా నేను చదివిన వందకుపైగా విప్లవ కథల్లో పదిహేను మాత్రమే దండకారణ్య నేపథ్య కథలు కాగా వాటిని విరసం వారు ఈ సంకలనానికి ఎంపిక చేశారు. 2005 కన్నాముందు చాలా కథలున్నాయి. అవి త్వరలో సేకరించి విరసం ప్రచురించ సంకల్పించింది. నేను చదివిన వంద కథల్లో అవేకాక ఉత్తర తెలంగాణ–ఆదిలాబాదు, కరీంనగర్, నిజామాబాదు, శ్రీకాకుళం, అనంతపురం, నల్లమల ఆంధ్ర, ఒరిస్సా బార్డర్–అడవి ఉద్యమాలకు సంబంధించి గొప్ప కథలున్నాయి... మైదాన ప్రాంతంలో విప్లవాచరణకు సంబంధించిన అనేక కథలున్నాయి... బి. అనురాధ, ప్రశాంత్‌లాంటి వాళ్ళు రాసిన జైలు కథలున్నాయి. పటేల్ సుధాకర్‌రెడ్డి, షంషేర్ (గుండేటి శంకర్) ల సంకలనాలు, సుజాత, నిత్య, మైనా, ఫినెక్సు, జూరి, ప్రవీణ్, విశ్వం, పి. శంకర్, బి.డి. దమయంతి, పాండు, అమన్, రేల, అర్జున్, మరకం, లహర్, కోసా, లక్ష్మి, విశ్వం, స్వాతి, కాడి, తాల్వేశర్, అన్న, అసిధార, నరోటి, సవ్వడి, లేంగ్, శంకర్రావు, తేనెపట్టు, చందర్, జైరాం, ఉంగాల్, రాజు, కవిత, సోని, నిర్మల, చంద్రలాంటి అనేక మంది రచయితల రచయిత్రుల కథలు సేకరించాల్సి ఉన్నది... వీలునుబట్టి స్థలకాలాల నేపథ్యంలో–ఆ కథలను పుస్తకాల రూపంలో తేవాల్సిన కర్తవ్యం విరసం మీద ఉన్నది. 1980లో విప్లవోద్యమం ఆంధ్ర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ (అప్పుడు చత్తీస్‌గడ్ ఏర్పడలేదు) రాష్ట్రాల సరిహద్దులను చెరుపుతూ దండకారణ్యంలోకి ప్రవేశించింది. ఆనాటి దండకారణ్యం సువిశాల అడవి, కొండల భూభాగాన్ని విప్లవకారులకు పరిచయం చేసింది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల సరిహద్దు అటవీ ప్రాంతం విప్లవోద్యమానికి నెలవుగా మారింది. ఇప్పటికి ముప్పైరెండేళ్ళ క్రితం మూడు పదులైనా నిండని ముప్పై అయిదు మంది పీపుల్స్‌వార్ యువకుల అడివి ప్రవేశం భారతదేశ విప్లవోద్యమ చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని తెరిచింది. వాళ్ళకు అడవి కొత్త, ఆదివాసుల భాష, 'కోయ' రాదు... వాగులు, వంకలు, అడవిదారులు తెలియనివాళ్ళు. చిటకాంగ్ కొండల్లో మావో, చూటే నాయకత్వంలో ఏర్పడ్డ తొలి గెరిల్లాలానే సంఖ్యలో – అనుభవంలో తక్కువగా ఉన్నా వాళ్ళకు ప్రజాసైన్యాన్ని నిర్మించీ, దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా ఏర్పర్చాలనే సత్ సంకల్పం ఉన్నది. అప్పుడు వాళ్ళు ఎంచుకున్న దండకారణ్య ప్రాంతం – చంద్రపూర్–కాజీపేట బ్రాడ్‌వే రైల్వే లైను, పడమర సరిహద్దు, ఉత్తరాన చంద్రపూర్ నుండి గోందియామీదుగా చిన్నరైల్వేలైను, తూర్పున రాయపూర్ నుంచి విశాఖ వెళ్ళే జాతీయ రహదారి – ముఖ్యంగా చెప్పాలంటే గడ్చిరోలి, బస్తర్ జిల్లాల్లోనే మొదటి దశలో ఆదివాసి

ప్రజా పోరాటం ఆరంభమయ్యింది. కాలక్రమేణా నేపాల్ సరిహద్దుదాకా విస్తరించి ఉన్న రాష్ట్రాల్లోకి విస్తరించింది. ఇప్పుడు ఈ సంకలనంలోని కథల్లో ముఖ్యంగా కనిపించే జీవితం ఎక్కువ భాగం గడ్చిరోలీ, బస్తర్ జిల్లాలు ప్రధానంగాగల దండకారణ్యం మాత్రమే చిత్రితమైంది. ఈ ముప్పైదుగురు - అడవిదారులు శోధించారు - గూడాలు తిరిగారు. ప్రతి పదిహేను కిలోమీటర్లకు మారే భాషను అనేక కష్టాలు పడి నేర్చుకున్నారు. భయంకరమైన మలేరియాతో, అడవి అధికారులతో, పోలీసులతో యుద్ధం చేశారు... అక్కడ మొదట వాళ్ళు గమనించింది - ఆదివాసులను అన్ని రకాలుగా అతలాకుతలం చేసే అటవీ అధికారుల దోపిడీ దౌర్జన్యాలు-వాటికి వ్యతిరేకంగా పోరాటం చేశారు... అప్పటికే ఆదిలాబాదు జిల్లా ఆదివాసీ జనజీవన నేపథ్యంలో మొదలైన అధ్యయనం, నిర్మాణం, అనుభవం నేపథ్యంలోంచి వచ్చిన చైతన్యంతో చాలా మంది కథలు రాస్తున్నారు. ఏప్రిల్ 20, 1981 ఇంద్రవెల్లి కాల్పుల్లో అరువైమంది ఆదివాసులు చనిపోవడంతో తెలుగు సాహిత్యంలో ఆదివాసీ జీవన నేపథ్యంలో కథలు రావడం ఆరంభమైంది. తొలి దశలో అమరుడు సాహు ఎక్కువగా రాశారు. 1983లో కొమురం భీం నవల వచ్చింది. ఇదే ఒరవడిలో -మొట్టమొదటి దండకారణ్య కథ 1982లో 'కంకలట్టు తుపాకులు' రాడికల్ మార్చి-తరువాత నేలతల్లి విముక్తి కోసం సంకలనంలో ప్రచురితమైంది.. దండకారణ్యంలో పనిచేస్తున్న దళం కార్యకలాపాలతో ప్రభావితమైన టీనేజీ పిల్లలు వారి ఊళ్ళో ఉన్న చౌకిదారును రాత్రిపూట చీకట్లో బెదిరించడానికి ప్లాను వేస్తారు. కంకబొంగులను తుపాకుల్లాగా తయారుచేసుకుని చీకటి రాత్రిపూట చౌకిదారు ఇంటి మీద దాడి చేసి-వాడి అరాచకాలన్ని చెప్పించి-వాచర్‌ను ముక్కుభూమికి రాయిస్తారు. ఇంట్లో ఉన్న చౌకిదారు నిజంగ దళమే అనుకొని ఉచ్చబోసుకుంటాడు-'ఈ సంగతి దళానికి చెప్పాలె' అనుకుంటారు పిల్లలు. కథ ముగుస్తుంది. పరోక్షంగా దళం ప్రభావం, స్థానిక సమస్యలు తమంతట తామే పరిష్కరించుకునే చొరవ ఆదివాసుల్లో పెరగడం ఈ కథ ఇతివృత్తం. ఆ తరువాత ఆదిలాబాదు జిల్లా నేపథ్యంలో ఏప్రిల్ 1985 నుండి ఏప్రిల్ 1986 దాకా ఒక సంవత్సర కాలపు దళ జీవితం వసంత గీతం నవలలో చిత్రితమైంది... దళాల విస్తరణతోపాటు - పోరాట ప్రాంత విస్తరణగా-అందులోని భాగంగా దళాలు అదివరకే పని చేస్తున్న దళాలతోపాటు కొత్తదళాలతో ఆదిలాబాదు జిల్లా నుండి దండకారణ్యానికి అడుగు పెట్టడంతో నవల ముగుస్తుంది...

దండకారణ్యంలో తమ పోరాట అనుభవాలను, ఆదివాసి రైతాంగ సమస్యలను సమన్వయం చేసుకోవడం కోసం ఫిబ్రవరి 23-24, 1984 గడ్చిరోలి డివిజన్ రైతు - కూలీ సభలను కమలాపూర్‌లో ఏర్పాటు చేసుకున్నారు. ఆ ఏర్పాట్లలో భాగమైన చంద్రాపూర్ లాయర్ అమరుడు చందుపట్ల కృష్ణారెడ్డితో పాటు వందలాదిమంది ఆదివాసీలను అరెస్టు చేసి చంద్రపూర్ జైలు నింపారు. అయినా అడవిలో ఆదివాసులు సభలు జరుపుకున్నారు.. అప్పటికే ఉద్యమం బస్తర్‌లోకి విస్తరించింది. అబూజ్‌మాడ్ కొండలు-వాగులు గెరిల్లాలు తిరిగారు. అన్ని ప్రభుత్వాలు వొదిలేసిన, రాజ్యానికి, సభ్య ప్రపంచానికి తెలియని ప్రాంతానికి-ప్రజల్లోకి గెరిల్లాలు విస్తరించారు... తొలి దశలో కామ్రేడ్ పశుల రాంరెడ్డి (ప్రత్యూష), విజయభాస్కర్ (నర్మటోర్), నల్లా వసంత్ సాహిత్యకృషి చేసినట్లుగా ముప్పయ్యేళ్ళ దండకారణ్య చరిత్రలో రికార్డు చేశారు. వరంగల్ జిల్లా నుండి దండకారణ్యంలోకి విస్తరించిన పోరాట అనుభవంతో పటేల్ సుధాకర్‌రెడ్డి

1986లో మూడు కథలు రాశారు. బలహీనుడి బలంగా ప్రచురింపబడిన సుధాకర్‌రెడ్డి రచనల్లో ఈ కథలు చోటు చేసుకున్నాయి... మొదటి దశలో దళం దండకారణ్యంలో ప్రవేశించినప్పుడు అక్కడ ప్రజలు ఎదుర్కొనే సమస్య – ఏమాత్రం అందుబాటులో లేని వైద్యం – ఇప్పటికీ నలభై, యాభై కిలోమీటర్లు కొండల మీదుగా ప్రయాణిస్తేగాని వాళ్ళకు హాస్పిటళ్ళు అందుబాటులో లేవు. మామూలు జ్వరాలతో, అడవి జంతువుల గాయాలతో, జబ్బులతో ప్రతియేటా వందలాది మంది మరణిస్తుంటారు. అలాంటి దయనీయ పరిస్థితులు, దళం ఆదివాసులకు వైద్యం చెయ్యడం 'ప్రజల డాక్టర్'లో చిత్రించారు...

రెండో కథ 'సంస్మరణ సభ' – ఆదివాసులు చావుకు తాహత్తుకు మించి ఖర్చు చేస్తుంటారు... ఫలితంగా అప్పుల పాలౌతారు. గూడాలల్లో నివసించే ఎక్కువ మంది ఆదివాసులు చావు ఖర్చులు భరించగల్గే స్థితిలో ఉండరు. ఒక ఊళ్ళో సంఘ నాయకుడు కలరాతో చనిపోతే అతని తల్లిదండ్రులు దినాలు జరుపుకునే స్థితి లేకపోతే – పేదవాళ్ళకు తలకు మించిన భారమైన రీతిరివాజులను సంస్కరించి విప్లవ సాంప్రదాయంలో – సాంప్రదాయిక దినాలకన్నా ఘనంగా దళం వాళ్ళు సంస్మరణ సభ జరుపుతారు. సరైన సమయంలో సందర్భంలో అనుకూల పరిస్థితులను, పాత కాయిదాలను ఎట్లా అధిగమించాలో ఈ కథలో చూయించారు. మూడో కథ, 'బలహీనుడి బలం'... గాయపడిన దళ సభ్యుని రక్షించుకోవడానికి దళం పడే తపన ఈ కథ – అననుకూల పరిస్థితి – తిండి తిప్పలు లేవు – శత్రువు నిర్బంధం – అలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో దళం గాయపడిన తమ సహచరుణ్ణి కర్రల డోలీలో అడవిలో ముప్పై కిలోమీటర్లు మోసుకుపోతుంది. మధ్యలో కలిసిన గ్రామ ప్రజలు, సంఘ కార్యకర్తలు – సహాయపడుతారు. అట్లా ఒక బక్కపలుచని సంఘ నాయకుడు – గెరిల్లాల తపన అర్థం చేసుకొని – వాళ్ళను కష్టపెట్టవద్దని – చాలా దూరం తనే డోలీ మోస్తాడు.. సంకల్పబలం – బలహీనుడి బలంగా గుర్తించడం ఈ కథాంశం...

ఇదే కాలానికి సంబంధించిన దళ జీవితాన్ని అత్యంత ప్రతిభావంతంగా చిత్రించిన నవల వనజ (నర్సక్క) రాసిన 'అడవిపుత్రిక'. ఈ నవల రచనలో కూడా తన సహచరుడు పటేల్ సుధాకర్‌రెడ్డి సహాయసహకారాలున్నట్లు వనజ రాశారు. వరంగల్ జిల్లాలోని అడవి ప్రాంతంలోని ఏటూరి నాగారం రైతుకూలి బిడ్డ నర్సక్క ఒక గెరిల్లాగా ఎదిగి విప్లవోద్యమంలో తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించడం ఇందులోని కథాంశం. ఈ నవలలో వరంగల్– మహారాష్ట్ర– దండకారణ్య ప్రాంతాల జనజీవితం కన్పిస్తుంది. ఈ నవల 1995లో ప్రచురింపబడి అత్యంత ప్రజాదరణ పొంది హిందీలోకి అనువదింపబడింది. ప్రజలు విప్లవంలో తమ జీవితాన్ని తామే చిత్రించుకున్న గొప్ప మలుపుకు ఈ నవల ఉదాహరణ.

ఆత్మ కథాత్మకంగా వచ్చిన ఈ నవలలోని ప్రతివాక్యం, అనుభవం పుడమిపుత్రులైన ప్రజల నుండి వచ్చింది. విప్లవకాలంలో ప్రజల నుండి రచయితలు ఎట్లా రూపొందుతారో ఈ నవల నిరూపించింది.

ఇదేకాలంలో అప్పటికే సాహిత్యకారుడు ఐ.వి. సాంబశివరావు, కౌముది ('తెలంగాణ పల్లె' నవల రచయిత, కౌముది) లాంటి రచయితలు దండకారణ్యంలోకి వచ్చారు... ఆదివాసీ ఉద్యమాలు విస్తరించి–గడ్చిరోలి – బస్తర్ మీదుగా ముందుకు సాగుతున్నాయి. దండకారణ్యాన్ని

సి ఏలయుగా అభివృద్ధి చేయడానికి సంబంధించిన పనిలో భాగంగా – ఆదివాసి ప్రాంతాలల్లో బాలూని నిలదొక్కుకొని–అడవి అధికార్లకు వ్యతిరేకంగా, అభివృద్ధి నిరోధకంగా – అత్యంత పాశవిరమైన 'కాయిదాలు', ఆదివాసి ఉత్పత్తి విధానం అభివృద్ధి–వైద్య సౌకర్యాల కల్పనల మధ్య దళాలు ఎదుర్కొన్న అనేక సమస్యలు 1989లో సాధన 'అడవిలో అన్నలు' నవల–ఐవి సాంబశివరావు సలహాలతో రాశారు... వనజ 'అడవి పుత్రిక' ముగింపులో చిత్రించిన దండకారణ్య పోరాట జీవితం కొనసాగింపుగా ఈ నవల నడుస్తుంది... ఒకరకంగా ఈ రెండు నవలలు –ఆదివాసీ – ఆదివాసేతర అనుభవాల సారాంశంగా – నేరుగా విప్లవకారులు–నిత్య నిర్బంధంలో–పెన్ను, గన్ను పట్టి రాసిన రచనలు.... విప్లవోద్యమం నుండి నేరుగా వచ్చిన విప్లవోద్యమ సాహిత్యం ఇది... అధ్యయనం, నిలదొక్కుకోవడానికి సంబంధించిన గెరిల్లా జీవితానికి సంబంధించిన దండకారణ్య నవలిది. దండకారణ్య ఉద్యమం విస్తరించి బలపడడంతోపాటు ప్రభుత్వం కొత్త కొత్త రూపాలల్లో అణచివేతకు పూనుకున్నది... సివిల్, సిఆర్‌పియఫ్ పోలీసులకు ఆదివాసి పోరాటాలను ఎదుర్కోవడం సాధ్యం కాలేదు... బస్తర్‌లో 'జన జాగరణ్'లాంటి లోకల్ గుండాలకు, భూస్వాముల నాయకత్వంలో ప్రభుత్వం తర్ఫీదునిచ్చి ఆదివాసి గూడాలల్లో విచ్చలవిడి హింసకు ప్రోత్సహించింది... ఫలితంగా గూడాల మీద గూండాదాడులు పెరిగాయి. ఒక్కొక్కసారి పోలీసులతోపాటు ఈ గుండాలు దాడులకు బయలుదేరేవాళ్ళు. 1991 – 1994 ప్రాంతాలలో గడ్చిరోలి, బస్తర్‌లో సుమారుగా ఒక వందమంది ఆదివాసులను పాశవికంగా హత్య చేశారు. స్త్రీల మీద పాశవిక హత్యాకాండ చేశారు–గూడాలను తగులబెట్టారు... ఆదివాసి రైతు కూలి సంఘాలు, మహిళా సంఘాలు, చేతనా నాట్యమంచ్‌లాంటి ప్రజా సంఘాలు పెరిగాయి. అడవిలోని దళాల సంఖ్య పెరిగింది... ముఖ్యంగా గడ్చిరోలి–బస్తర్ నుండి ఆదివాసి యువకులు దళాలల్లో చేరి పనిచేయసాగారు. ఆదివాసీ ప్రాంతాలల్లో స్త్రీల మీద అనేక కట్టుబాట్లు, కాయిదాలతో అనాగరికమైన వివక్ష కొనసాగింది. పితృస్వామ్య వ్యవస్థ, 'గోటుల్' సంస్కృతి, పెళ్ళిలో విపరీతమైన ఖర్చు, బహుభార్యత్వంలాంటి వాటిని దళాలు ఎదురించి సంస్కరించాయి. పార్టీ మహిళలకు అండగా నిలిచింది. ఫలితంగా దళాలల్లో మహిళలు ఎక్కువ సంఖ్యలో చేరి ఉద్యమాన్ని పరిపుష్టం చేయసాగారు... ఇలాంటి పరిణామాన్ని సాధన తన రాగో (రామచిలుక) నవలలో చిత్రించారు. రాగో మాడియా గోండు యువతి– రాగో చిన్న పిల్లగా ఉన్నప్పుడే రాగో తండ్రి పిల్లనిస్తానని ఒక బీద యువకున్ని లామడే (ఇల్లరికం) తెచ్చుకుంటాడు. రాగో యుక్త వయస్కురాలైనంక – శారీరకంగా, మానసికంగా అతన్ని ఇష్టపడక మరో పెళ్ళైన యువకుని మీద (బహుభార్యాత్వం) మనసుపడి ఇల్లుసొచ్చింది.. అతను రాగోను ఉంచుకుంటే ఇల్లరికం అల్లునికి ఆచారం ప్రకారంగా వచ్చిన దగ్గరి నుండి జీతం కట్టి ఇవ్వాలి. ఇష్టపడ్డవాడు అంత డబ్బు ఇవ్వలేక భయపడ్డాడు. తండ్రి రాగోను గొడ్డును బాదినట్టుబాది మళ్ళీ ఇంటికి తీసుకవచ్చాడు. రాగో ఈ దుర్మార్గమైన కాయిదాను ఖాతరు చెయ్యదలుచుకోలేదు. తప్పించుకొని అడవిలో తిరిగితిరిగి స్నేహితురాలు ఇల్లు చేరుకున్నది. మళ్ళీ తండ్రికి దొరికింది. మళ్ళీ తన్నులు గుద్దులు. మళ్ళీ తప్పించుకొని–మనుషులంతా దుర్మార్గులేనని అడవిలో తిరుగసాగింది. ఆ క్రమంలో దళం కలిసింది. ఇక అక్కడి నుండి రాగో కొత్త జీవితంలోకి దళంలోకి ప్రవేశించి చివరకు పార్టీ

సభ్యురాలుగా మారడం – తండ్రి ఆమోదించడంతో నవల ముగుస్తుంది. కోట్లాది మంది చైనా ప్రజలు ఆదరించిన 'తెల్లకురుల అమ్మాయి' నాటకం స్థాయికి చేరతగినదీ నవల.

భారతదేశ విప్లవంలో – దండకారణ్యంలోకి విస్తరించడం, ఆదివాసి ప్రజలు గెరిల్లాల కొత్త రీతిరివాజులతో ఘర్షణపడి – ఆమోదించడం విప్లవాన్ని తమదానిగా చేసుకోవడం మార్క్సిజానికి ఒక కొత్త చేర్పు. రష్యా విప్లవంలో కార్మిక వర్గం, చైనా విప్లవంలో రైతాంగం, మనదేశంలో ఆదివాసులు, రైతాంగం విప్లవంలోకి రావడం ఒక కొత్త అనుభవం–ప్రపంచ విప్లవాలల్లో ముఖ్యంగా సాయుధ పోరాటంలో అన్ని విప్లవాలల్లో కన్నా స్త్రీలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనడం ఈనాటి మనదేశ వాస్తవికత–ప్రపంచ విప్లవానికి ఇది ఒక మహత్తర కొత్త అనుభవం, చేర్పు – ఇప్పుడు దండకారణ్యంలో రాగోలు నలుభై శాతం దాకా యుద్ధ రంగంలోకి వచ్చారంటే–అలాంటి గొప్ప మలుపును యుద్ధరంగంలో నిలబడి అక్షరీకరించడం, అదీ నడుస్తున్న చరిత్రతోపాటు రాయడం... ప్రపంచ విప్లవ సాహిత్యంలో ఒక కొత్త వొరవడి–అంతే కాకుండా విప్లవోద్యమంతోపాటు సాహిత్యం అడుగులో అడుగేసి నడవడం ఇంత సుదీర్ఘ కాలంగా సుమారుగా నలుభైరెండు సంవత్సరాల కాలంగా అనేక ఒడిదుడుకులతో కొనసాగుతున్న కొత్త సాహిత్య చరిత్ర.

దండకారణ్యంలో 1993 నాటికి విప్లవోద్యమం పెరిగి దళం పనివిధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రజలలో నీళ్ళలో చేపల్లాగా గెరిల్లాలు విస్తరించారు. అడవిదారుల రహస్యాలు తెలుసుకున్నారు... ఫలితంగా ప్రజా సంఘ కార్యకలాపాలకు, మిలట్రీ పనులకు విడివిడి నిర్మాణాలు అవసరమయ్యాయి. అన్ని రకాల పని విభజన పెరిగింది.

అప్పటికి పీపుల్స్‌వార్ (మా.లె) గా ఉన్న పార్టీ మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, చత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాలకు విస్తరించి–తన పని విధానాన్ని అనుభవాన్ని 1995 అఖిలభారత స్పెషల్ కాన్ఫరెన్సులో చర్చించి–గెరిల్లా జోన్లను నిర్మించడం, ప్రాథమిక స్థాయి గెరిల్లా జోన్లను ఉన్నత స్థాయి జోన్లుగా అభివృద్ధి చేయడానికి నిర్ణయం తీసుకున్నట్టు ముప్పయ్యేళ్ళ దండకారణ్య సాంస్కృతికోద్యమ చరిత్రలో రాశారు. ఫలితంగా దండకారణ్యంలో దళాల నిర్మాణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. 1995 నాటికి దళాల స్థానే ప్లాటూన్లు ఏర్పాటయ్యాయి. ప్రజా సంఘాలు, గ్రామ కమిటీలు, గ్రామ రాజ్య కమిటీలుగా ఏర్పడ్డాయి. ఫలితంగా ఆదివాసి ప్రాంతంలో ప్రాథమిక స్థాయిలో సమష్టి ఉత్పత్తి–గ్రామ వ్యవహారాలు ఒక క్రమ పద్ధతిలో అభివృద్ధి చెందసాగినయ్... ఈ విధంగా తొలిసారిగా దండకారణ్యంలో ప్రజారాజ్యాధికార నిర్మాణాలు ఆరంభమయ్యాయి. అప్పుడే దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ఏర్పాటయ్యింది. అమరులు నల్లా ఆదిరెడ్డి, సంతోష్‌రెడ్డి, శీలం నరేష్ అమరులైన తేది 2000 డిసెంబర్ 2 మొదటి వర్ధంతిన ప్రజా గెరిల్లా సైన్యం ఏర్పడింది. అదేవిధంగా భారత కమ్యూనిస్టు పార్టీ పీపుల్స్‌వార్ (మా.లె.) 2001లో 9వ కాంగ్రెసు జరిపి ఉన్నత స్థాయి గెరిల్లా జోన్లను విముక్తి ప్రాంతంగా నిర్మించే కర్తవ్యాన్ని చేపట్టాయి. గ్రామరాజ్య కమిటీలు జనతన సర్కారుగా ఏర్పడ్డాయి. జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో పని చేస్తున్న మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్‌తో కలిసి సెప్టెంబరు 21, 2004లో అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడిన తరువాత డిసెంబర్ 2, 2004లో ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం ఏర్పడి

విప్లవోద్యమం ఒక పెద్ద అంతర్గత పెనుముప్పుగా పీడిత ప్రజలకు ఆశాజ్యోతిగా నిలిచింది. దండకారణ్యంలో బేస్ ఏరియా నిర్మాణంలో భాగంగా 2004 డిసెంబర్ నాటికి మొట్టమొదటి ఏరియా స్థాయి విప్లవ ప్రజాకమిటి ఏర్పడింది. 2008 నాటికి దండకారణ్యంలో అన్ని స్థలాల్లో ఏరియా కమిటీలు ఏర్పడినట్టు యాన్‌మిర్డాల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆది నుంచి దండకారణ్య ఉద్యమంలో భాగమైన మురళి చెప్పారు... దండకారణ్యంలో చేతనా నాట్య మంచ్ ఏర్పడి దేశంలోనే అతిపెద్ద విప్లవ సాంస్కృతిక సంస్థగా ఎదిగింది. ఆదివాసీ రైతుకూలీ సంఘాలు, మహిళా సంఘాలు పెద్ద ఎత్తున ఏర్పాటయ్యాయి. అదృశ్య కొండలు, అడవులు (అబూజ్‌మాడ్) పాత సాంప్రదాయిక అభివృద్ధి నిరోధక కాయిదాలన్నింటిని వొదిలించుకుని కొత్త సమష్టి జీవన విధానంలోకి అడుగుపెట్టాయి. సరిగ్గా ఈ కాలంలోనే ప్రపంచ వ్యాపితంగా సామ్రాజ్యవాదం తన దోపిడిని తీవ్రతరం చేయడానికి గ్లోబలైజేషన్ పేర భారతదేశపు అత్యంత విలువైన ఖనిజాలను దోపిడి చేయడానికి దళారి ప్రభుత్వంతో అనేక ఒప్పందాలు చేసుకొని దండకారణ్యం మీదికి గద్దలా వాలింది. ఈ విధ్వంస-నిర్మాణ సంధికాలంలో విప్లవకారులు పూర్తిగా నిమగ్నమై ఊపిరి సలుపకుండా పని చేశారు. ఝుంకార్‌లాంటి పత్రికలో అడపా దడపా చిన్నచిన్న కథలు తప్ప-ఈ కాలానికి సంబంధించిన నవలలు రాలేదు..

2001లో పంజాబి రచయిత సత్‌నాం దండకారణ్యంలో తిరిగి రాసిన నవల 'జంగల్‌నామా' వచ్చింది. ఈ నవలలో సత్‌నాం తను ఎక్కడ ఏ మాత్రం జోక్యం చేసుకోకుండా-ఏక కాలంలో నాలుగు అంశాలు అత్యద్భుతంగా చిత్రించారు. ఆదివాసి పాత సాంప్రదాయిక సమాజం, ఉత్పత్తి విధానం, దానిననుసరించి రూపొందిన రాజ్య నిర్మాణం; భారత కమ్యూనిస్టు పార్టీ పీపుల్స్‌వార్ (మా.లె) చేపట్టిన ఉత్పత్తి వనరుల అభివృద్ధి, సమష్టి జీవన సంఘ నిర్మాణం, ప్రాథమికంగా ప్రజల ప్రమేయంతో నడుపబడుతున్న జనతన సర్కారు; మూడో అంశంగా పార్టీ వివిధ అంగాల అభివృద్ధి; నాలుగో అంశంగా అభివృద్ధి నిరోధకమైన భూస్వామ్య దళారి ప్రభుత్వపు నిర్బంధం... ఈ నాలుగు అంశాలను ఎక్కడా వాచ్యంగా చెప్పకుండా నవలీకరించాడు. ఒరియా రచయిత గోపీనాథ్ మహంతి, అమృతసంతానం', మహాశ్వేతాదేవి 'జంగల్ కా ధఫేదారు' లాగా భారతీయ సాహిత్యంలో 'జంగల్‌నామా' దండకారణ్య ఆదివాసీ జీవిత నేపథ్యంలో వచ్చిన గొప్ప నవలగా సాహిత్యంలో నిలిచిపోతుంది. ముఖియాల సాంప్రదాయిక అధికారాలు, ప్రభుత్వపు పంచాయితీ వ్యవస్థ బలహీన పడుతున్నకొద్దీ ప్రజాధికారం బలపడి విస్తరిస్తోంది. 1997 నుండి మహేంద్ర కర్మ రాజ్యపు అండదండతో గ్రామపెద్దల తరఫున నిలబడ్డాడు. గూండాలతో ఈ ముఠా స్థానిక కామ్రేడ్ల మీద దాడులకు, చిత్రహింసలకు పాల్పడ్డారు... గ్రామాలను తగులబెట్టారు. ఇలాంటి తెల్లబీభత్సాన్ని ఆపడానికి గ్రామప్రజల సహకారంతో గెరిల్లాలు ప్రతిదాడులకు దిగి - క్రూరులైన భూస్వాములను అక్కడకక్కడ మట్టుబెట్టారు. 2004 నాటికి చత్తీస్‌గడ్‌లో అధికారంలోకి వచ్చిన భారతీయ జనతాపార్టీ 2005 నాటికి బహుళజాతి కంపెనీలతో అపారమైన విలువైన ఖనిజ సంపదలను దోచిపెట్టడానికి వందలాది ఒప్పందాలు చేసుకున్నారు. అనగా భూస్వామ్యవర్గం-దళారీ ప్రభుత్వం ఒక్కటై లంపెన్ ఆదివాసి యువకులను చేరదీసి 05.06.2005 నుండి అదివరకే ఉన్న 'శాంతి అభియాన్' 'సల్వాజుడుం'గా మారింది. సుమారు 644 గ్రామాల నుండి 3 లక్షల మందిని నిర్వాసితులను చేసి బైరామ్‌గడ్,

బీజాపూర్‌లాంటి చోట్ల నిర్బంధ శిబిరాలు ఏర్పాటు చేశారు. వందలాది మందిని ఆడ, మగ, పిల్లలు అని చూడకుండా హింసించి కిరాతకంగా చంపేశారు. గూడాలు కాలబెట్టారు. ధాన్యం, డబ్బు ఎత్తుకపోయారు. పశువులను కోసుకతిన్నారు. ఆడవాళ్ళను కిరాతకంగా రేపులు చేసి చంపేశారు.

ప్రభుత్వమే ఒక క్రూరహంతక ముఠాగా తయారయ్యింది. ఇది దండకారణ్యంలో ప్రజలకు, పార్టీకి పెనుసవాలుగా నిలిచింది. ప్రజావిముక్తి సైన్యం, ప్రజా మిలీషియా జనవరి 2006 నుండి నిర్దిష్ట ప్రణాళిక ప్రకారంగా – నిర్బంధ శిబిరాల మీద దాడులు చేసి ప్రజా కంటకులను తెగటార్చి ప్రజలను విడిపించి మళ్ళీ గ్రామాలను – జనతన సర్కారు పునర్‌నిర్మించింది. 10.02.2006 కోయభూంకాల్ మిలీషియా ఏర్పడింది.

దేశవ్యాపితంగా–సల్వాజుడుం కిరాతక చర్యలకు నిరసన వెల్లువెత్తడంతో–సల్వాజుడుం నైతికంగా, భౌతికంగా దెబ్బతిని మే–జూన్ మాసాల్లో (2006) అధికారికంగా దాడులను నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది... అయినా దొడ్డిదారిన అక్కడక్కడ దాడులు కొనసాగించింది. కేంద్రం బలగాలు పంపి – రాష్ట్ర ప్రభుత్వ బలగాలకు తోడై దాడులు చేశాయి. నాగ, మిజో బెటాలియన్లు రంగంలోకి దిగాయి. ఈ చర్యను, నాగా, మిజో ప్రజలు వ్యతిరేకించారు. చివరగా సుప్రీంకోర్టు జోక్యంతో అక్టోబర్ 2009లో సల్వాజుడుం రద్దయి, అదివరకు పనిచేసిన ఎస్.పి.ఒలను కోయకమెండోలుగా ప్రభుత్వం భర్తీ చేసుకున్నది.

నవంబరు 2009లో కేంద్ర ప్రభుత్వం స్థానిక దుర్మార్గులైన భూస్వాముల తరపున, భారతదేశంలోని అపార ఖనిజ సంపదలను విదేశాలకు దోచిపెట్టడం కోసం తన ప్రజలమీదనే–లక్షమంది భద్రతా బలగాలతో ఆపరేషన్ గ్రీన్‌హంట్ ఆరంభించింది... తన ప్రజల మీదనే ప్రజల సొమ్ముతో సైనిక చర్యకు దిగడం అత్యంత ఫాసిస్టు చర్యగా ప్రజాస్వామికవాదులు పేర్కొన్నారు.

నూట ఇరువైకోట్ల ప్రజల తరపున–లక్షల కోట్ల ఖనిజాలను సామ్రాజ్యవాద దేశాలు కొల్లగొట్టకుండ నిలవరించడం కోసం–దోపిడి పీడన లేని నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని భారతదేశంలో విజయవంతం చేయడం కోసం–దండకారణ్యంలోని ఆదివాసి ప్రజలు–వాళ్ళతో మమేకమైన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)లు ఘనత వహించిన భూస్వామ్య దళారి కేంద్ర ప్రభుత్వ బలగాలతో యుద్ధంలో దిగి పోరాడక తప్పలేదు...

23.07.2010 భారత్, అమెరికా తీవ్రవాద వ్యతిరేక సహకార ఒప్పందం. 7.11.2010 నాడు ఒబామా భారత్ పర్యటన తరువాత అమెరికన్ యుద్ధ సలహాదారులు – విదేశీ ఆయుధాలు, మానవరహిత యుద్ధవిమానాలు, భారత సైన్యానికి తోడై ఇవ్వాళ దండకారణ్యం ఏకకాలంలో స్థానిక దోపిడి ప్రభుత్వంతోను, అమెరికన్ సామ్రాజ్యవాదంతోను యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది...

ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను విప్లవకారులు ఆదివాసీ ప్రజల అండదండలతో నిలువరించి తిప్పికొట్టారు. అమెరికా అండదండలతో మార్చి 2011 నుండి ప్రత్యక్షంగా సైన్య ప్రవేశంతో ఆపరేషన్ విజయ్, హాకా కొనసాగుతున్నాయి... యుద్ధం, నిర్మాణం ఏకకాలంలో చేపట్టవల్సిన కర్తవ్యంలో ఇవ్వాళ దండకారణ్యం తలమునకలయ్యింది. ప్రపంచీకరణ పేరుతో సామ్రాజ్యవాద

దేశాలు ముఖ్యంగా అమెరికా అన్ని దేశాల వనరులను కొల్లగొట్టుతున్న తరుణంలో ఆయా దేశాలలోని ప్రపంచ ప్రజలు దండకారణ్యంకేసి చూస్తున్నారు... సామ్రాజ్యవాదాన్ని మట్టి కరిపించే యుద్ధం బహుశా దండకారణ్య ప్రజలు ముప్పయి రెండు సంవత్సరాలుగా ఆరంభించి కొనసాగిస్తున్నారు.

2010లో దండకారణ్యంలో పర్యటించి తన అనుభవాలను, అక్కడి పరిస్థితులను తనదైన శైలిలో "కారడవిలో కామ్రేడ్స్‌తో" (Walking with the comrades) పేర ఔట్‌లుక్ పత్రికలో ఇంగ్లిషులో అరుంధతిరాయ్ ప్రచురించారు... దండకారణ్యంలోని సాంప్రదాయిక ఆదివాసి సమాజం, పార్టీ నిర్మాణం, సాయుధ పోరాటం, జనతన సర్కార్లను అవలోకించారు. ఆమె కంఠస్వరం ఏదైనా–మొదటిసారిగా అంతర్జాతీయంగా అరుంధతిరాయ్ దండకారణ్యాన్ని పరిచయం చేశారు...

అదే సంవత్సరం ఫిబ్రవరిలో స్వీడన్ రచయిత–అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నేత యాన్ మిర్డాల్ దండకారణ్యంలో విస్తృతంగా పర్యటించి–దండకారణ్య నాయకులతోను మావోయిస్టు కార్యదర్శి గణపతితోను మాట్లాడి ప్రపంచ విప్లవంతో ఈ ప్రజావిప్లవాన్ని జోడించి–ప్రపంచంలో జరిగిన విప్లవాలన్నీ తమ అంతర్గత వైరుధ్యాలతో ఏ విధంగా దిశ మార్చాయో చెప్తుతూ అలాంటి సందర్భంలో "భారత్‌పై అరుణతార"గా ఈ విప్లవాన్ని అభివర్ణించారు... ప్రపంచ మావోయిస్టులు, సామ్రాజ్యవాదులు భారతదేశంలోని ఈ పరిణామాలను జాగ్రత్తగా అధ్యయనం చేస్తున్నారు.

దండకారణ్యంలో ఏం జరుగుతోంది? అక్కడ ఆదివాసి జీవితం–నిర్బంధం, ప్రజల సంఘటిత పోరాటాలు– ముఖ్యంగా జనతన సర్కారు ఏర్పడి వ్యవసాయం, రక్షణ, న్యాయ, విద్య, సంస్కృతి ప్రచారం, వైద్యం, అటవీ రక్షణ, ఆర్థికం, వ్యాపారం–లఘు పరిశ్రమలు, ప్రజా సంబంధాలు ఈ తొమ్మిది శాఖలు ఏర్పడి పని చేస్తున్న క్రమాన్ని–సల్వాజుడుం గ్రీన్‌హంట్ దాడులను, ఎప్పటికప్పుడు ఔట్‌లుక్, ఫ్రంట్‌లైన్, దైనిక్ సమాచార్, హిందూ, తెలుగులో ముఖ్యంగా నమస్తే తెలంగాణ, ఆంధ్రజ్యోతి, దినపత్రికలు–నందినీ సుందర్‌లాంటి సామాజిక కార్యకర్తలు... రకరకాల సందర్భాలల్లో అక్కడి నాయకులు ఇచ్చిన ఇంటర్వ్యూలు అనేకం తెలియజేస్తున్నాయి. విస్తృతంగా సాహిత్యం, సమాచారం విరసం పత్రిక అరుణతార విరివిగా ప్రచురించి వెలుగులోకి తెచ్చింది.

బాసగూడ ఎన్‌కౌంటర్ తరువాత వెళ్ళిన మేధావుల బృందంలో అక్కడ పర్యటించిన బాసిత్, పాణిలు 2012లో విరసం తరఫున చింతల్‌నార్ పుస్తకంలో అక్కడి పరిస్థితులను వివరించారు...

విరసం ప్రచురణగా వచ్చిన ముప్పయ్యేళ్ళ దండకారణ్య సాహిత్యోద్యమ చరిత్ర, మహిళా ఉద్యమ చరిత్ర–అన్నింటికన్నా ముఖ్యంగా అరుణతారలో వచ్చిన అనేక రచనలు దండకారణ్య పోరాటాలను, నిర్మాణాలను పరిచయం చేశాయి.

దండకారణ్యంలోకి విస్తరించి ప్రజలకు పటిష్టమైన పార్టీని, ప్రజా సైన్యాన్ని నిర్మించి – భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడానికి జరుగుతున్న ఒక మహత్తర పోరాటంలోంచి–అదీ ఒకపక్క ప్రజా సమీకరణ, నిర్బంధం, జనతన సర్కారు నేపథ్యంలో

2005 నుండి 2012 దాకా అరుణతారలో వచ్చిన పదిహేను కథల వెనుక నేపథ్యం, నిర్మాణం గురించి ఇంత రాయవల్సి వచ్చింది. ఇవ్వాల్టి అవసరంగా గత నలుభై రెండేళ్ళుగా జరుగుతున్న ప్రజా పోరాటాలకు సంబంధించి–మూడు తరాలు తమ రక్తంతో, త్యాగాలతో నిర్మించిన పోరాటం ఇది. ప్రపంచంలోనే ఇంత సుదీర్ఘ కాలం కొనసాగిన పోరాటం మరొకటి లేదు. ఫ్రెంచి విప్లవం 70 రోజులు మాత్రమే నిలిచింది. రష్యా విప్లవం బోల్షివిక్ పార్టీ ఏర్పడిన 1906 సంవత్సరం నుండి అక్టోబరు 1917 వరకు విప్లవం విజయవంతమయ్యింది. అట్లాగే చైనా విప్లవం 1919 నుండి 1949 వరకు విముక్తి సాధించింది. ఇంత సుదీర్ఘ కాలం – విప్లవంలో మూడు తరాలు పాల్గొన్నాయి కనుక ఇప్పటి తరానికి ఆరంభం నుండి మొత్తం సాహిత్యాన్ని అందించవలసివుంది.

ఏదిఏమైనా ప్రపంచ సాహిత్యంలో నిలువగల్గిన యుద్ధ క్షేత్రం నుండి విప్లవాచరణలో ఉన్న రచయిత, రచయిత్రులు రాసిన ఈ పదిహేను కథలు ముందుగా దండకారణ్య కథలుగా ప్రచురించాలని సంకల్పించిన విరసానికి అభినందనలు... అలాంటి ఒక కొత్త మలుపుకు సంబంధించిన కథలు చదివి వాటిని పరిచయం చేసే చిన్న అవకాశం నాకు దొరకడం ఆనందించదగ్గ విషయం. ఒక్కొక్క కథను పరిచయం చేస్తాను.

'చాయ్‌గ్లాసు' – నిత్య కథ. 1994, 2001, 2004 కాలానికి సంబంధించిన దండకారణ్యంలోని సాంప్రదాయిక భావజాలం, విప్లవ భావజాలంగా ఏ విధంగా మార్పు చెందిందో తెలియజేసే గొప్ప చిన్న కథ–రచయిత్రి తను తొలిరోజు దండకారణ్యంలోని దళంలోకి (1994) వెళ్ళిన అనుభవంతో మొదలౌతుంది కథ. ఒక ఊరిలో దళం మకాం వేసింది... ఒక బుడతన్ని తను తాగిన చాయ్‌గ్లాసును తనే కడుక్కోమంటే పితృస్వామ్య భావజాలంతో కోపంతో ఆ బుడతడు చాయ్‌గ్లాసు విసిరికొట్టి వెళుతాడు. తిన్నవాటిని ఆడవాళ్ళే కడగాలి. అది రివాజు. మళ్ళీ 2001లో మాడ్ డివిజన్‌లోని ఇంద్రావతి ఏరియా భూంకాల్ స్కూలును చూస్తుంది రచయిత్రి. అక్కడ పింద స్థాయిలో జనతన సర్కారు అప్పటికే ఏర్పడి న్యాయ, రక్షణ, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్యా, సాంస్కృతిక శాఖలు పని చేస్తుంటాయి. ఆ స్కూల్లో అమ్మాయిలు అబ్బాయిలు తేడా లేకుండా కనిపిస్తారు–పూసు, మెస్సి, పుయిసు, మంచు లు స్కూలు టీచర్లు–గోండీ భాష నేర్చుకుందాం పుస్తకంలోని పాఠం ఈ విధంగా ఉంటుంది.

"అమ్మ పొలం దున్నుతున్నది
నాన్న ఊయల ఊపుతాడు
చందు అన్నం వండుతాడు
పెదనాన్న బియ్యం చెరుగుతాడు"

అనే వాక్యాలను పిల్లలు చదువుతూ ఉంటారు.. ఆడ, మగ తేడా లేని పని విభజన. మళ్ళీ 2005 ఫిబ్రవరి – 10 – భూంకాల్ ఉత్సవంలో 1994లో చాయ్‌గ్లాసు విసిరేసిన బుడుతడు నూనూగు మీసాల యువకుడై–గెరిల్లాగా మారి తన పళ్ళెం తనే కడుక్కొని, ఎదురుపడి "నేను మునుపటిలా లేనం"టాడు. వాస్తవ జీవితం నుండి వచ్చిన గొప్ప కథ. మిడ్కో కథ శిక్ష బైరాంగడ్ ప్రాంతంలో నవంబర్ 2007లో జరిగిన ఘటనల ఆధారంగా రాసిన కథ. బోక్లు, మంగాల్ ఇద్దరు పొట్టెం గ్రామ ఆదివాసి యువకులు–సల్వాజుడుం పట్టు ఉన్నప్పుడు జుడుంలో

కలిశారు. వాళ్ళు దారి చూపగా 'పొట్టెం' గ్రామం మీద జుడుం గుండాలు దాడి చేసి అయిదుగురిని చంపేశారు. అయిదుగురిని చెరిచారు. ఆ తరువాత జుడుం దాడులను తిప్పి కొట్టిన తరువాత బోక్లు, మంగాల్‌ను గ్రామ ప్రజలు విచారిస్తారు. ఆ విచారణలో న్యాయశాఖ బాధ్యురాలు జైని, జనతన సర్కారు అధ్యక్షుడు అడమాల్-జనతన సర్కారు సభ్యుడు జుగ్రు ఉన్నారు... ఆ పంచాయితిలో చెరచబడిన గులారీ, కమ్లీ, ఐతేలు కూడా ఉన్నారు. దళ కమాండర్ మంగ్తు కూడా ఆ పంచాయితీలో ఉండి మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తూ ఉంటాడు.

పంచాయితీ ఉద్రిక్తంగా ఉంది... జనం సల్వాజుడుం చేసిన అరాచకాలు, హింస, క్రూరత్వం అనుభవించి ఉన్నారు కనుక-ఆ మొత్తానికి బోక్లు, మంగాల్‌లే కారణమన్నట్లుగా-వాళ్ళిద్దరిని చంపాలనే తీవ్ర కోపావేశాలతో ఉన్నారు. స్వయంగా న్యాయశాఖ బాధ్యురాలు జైనికే వాళ్ళిద్దరిని చంపాలని ఉన్నది. జనతన సర్కారు కమిటీ సభ్యులకు-అధ్యక్షుడు అడమాల్‌కు 'వాళ్ళు తప్పు ఒప్పుకున్నారు కనుక ఒదిలేయాలనే' ఉన్నది... ఈ మాట చెప్పగానే తీవ్రమైన ఘర్షణ చెలరేగింది. అంత పెద్ద తప్పు చేసి ఒప్పుకుంటే సరిపోతుందా? అంటారు ప్రజలు.. "వాళ్ళు స్వయంగా ఏ తప్పు చేయలేదు-ఊగిసలాటతో గ్రామంతో ఉండకుండా - జుడుంతో ఉండడం బలహీనత" అనే అవగాహనను - ఆ కాలానికి సంబంధించిన పరిస్థితులను - ప్రజల సహకారంతో జుడుంను తన్ని తరిమేసిన వైనాన్ని పార్టీ లైనుగా కమాండర్ మంగ్తు ప్రజలకు చెప్తాడు. అయినా ప్రజల కోపం చల్లారలేదు. చంపడం కాకున్నా కనీసం కొట్టనైనా కొట్టాలని ప్రజలు నిర్ణయిస్తారు. అడమాల్ అతిగా కొట్టకుండా చూసి మొత్తానికి శిక్షను అమలు చేయిస్తారు...

పంచాయితిలో బోక్లు, మంగాల్ మాట్లాడలేదు. వాళ్ళు మనస్ఫూర్తిగా తప్పు ఒప్పుకున్నారో లేదో ప్రజలు పట్టించుకోలేదు. చర్చ ఆ దిశగా జరిగితే బావుండేది.

అయితే శిక్షకు గురైన తరువాత వాళ్ళిద్దరిని ఊరువాళ్ళు బహిష్కరించినట్లుగానే ప్రవర్తించారు. జనతన సర్కారుగాని, న్యాయ కమిటిగాని వారిని- వారి ఎదుగుదలను పట్టించుకోలేదు. ఫలితంగా వారిలో సంఘ చైతన్యం స్థానే వ్యక్తిగత ఆలోచనే ప్రధానంగా కన్పిస్తుంది. ఊరందరికి తమ మీద గురి కుదరాలంటే జుడుంకు వ్యతిరేకంగా ఏదో ఒకటి చేసి చూయించాలి. మళ్ళీ జుడుం నేత కర్రెడుంగాల్ దగ్గరికి వెళ్ళారు. వాన్ని మంచి చేసుకొని పీతలు పట్టే నెపంతో కర్రెడుంగాల్‌ను వెంట తీసుకుపోయి తల నరికి తెచ్చి గ్రామస్తుల ముందు పెడతారు.

ప్రజలు గుమిగూడి హర్షం ప్రకటిస్తారు. తలను తీసుకవెళ్ళి రోడ్డు మీద పారేస్తారు. పోలీసులు తీసుకెళ్ళి ఉల్టా ప్రచారం మొదలు పెడుతారు.

తరువాత వారం రోజులకు అడమాల్, జైని, జుగ్రు, దళాన్ని కలిసి మంగ్తుకు చెప్పుతారు.

మంగ్తు నేరము-శిక్షకు సంబంధించిన తీరును సమీక్ష చేసి-నేరస్తులను సంస్కరించడానికి మరింత కృషి జరుగలేదంటాడు. చొరవ శత్రువుకే ఇచ్చినట్లయ్యిందంటాడు. ఇది అతి సున్నితమైన జటిలమైన సమస్య-సమస్త హింసలకు మూలమైన దోపిడి ప్రభుత్వాలు ఏ చిన్న అవకాశాన్నైనా ఉపయోగించుకొని పోరాడే ప్రజలను హింసాకారులుగా, ఉగ్రవాదులుగా ముద్ర వేస్తుంది. జనతన సర్కారు డివిజన్ లెవల్లో ఇలాంటి విషయాలు చర్చించుకోవాలనుకుంటుంది. రష్యన్, చైనా సాహిత్యంలో రచయితలు ఇలాంటి విషయాలు జాగ్రత్తగా రాశారు.

'నందె' (2007 మార్చి) టుంగ్రి రాశారు... ఒక ఎన్‌కౌంటర్‌లో విధిలేని పరిస్థితిలో దళం మొత్తం సామాను కిట్‌బ్యాగులతో సహా వొదిలి సురక్షిత ప్రాంతానికి పోతారు. పోలీసుల కూంబింగ్ మధ్య మళ్ళీ వాళ్ళు ఆ ఊరికి రావడానికి కుదరదు. పోలీసులుకూడా అటుకేసిరారు. అక్కడికి దగ్గరగా ఉన్న సంఘానికి దళం కబురు చేస్తుంది. అప్పటికే ఆ ఊళ్ళో ఇద్దరు మనుషులను పోలీసులు చంపారు. సంఘ బాధ్యురాలు 'నందె' ఊరి వాళ్ళందరిని జమచేసి సంఘం సామాను భద్రపరుద్దామంటుంది. భయంతో ఎవరూ ముందుకు రారు. నందె అయిదుగురు పిల్లలను తీసుకొని చెట్లనార తీస్తున్నట్టుగా అడవిలోకి వెళ్ళి సామాను చూస్తుంది. అక్కడ పోలీసులు లేరని ఊరివాళ్ళకు కబురు పంపుతుంది. అప్పుడు ఊరివాళ్ళు వచ్చి సామాను గుట్టమీదికి మార్చి దళానికి అందిస్తారు. ప్రజలు, భౌతిక పరిస్థితులు విప్లవకారులకు ఎట్లా సహకరిస్తాయో ఈ కథాంశం చెప్తుంది. సుమారు 18 సంవత్సరాలు అతిచిన్న పేద దేశమైన వియత్నాంలో అమెరికా ఆకాశం నుండి యుద్ధం చేసి ఓడిపోయింది – 'నందె'లాంటి వారి సహకారం విప్లవకారులకు ఉండడం మూలకంగానే.

'గొడ్డును కాదు' తాయమ్మకరుణ కథ (జూలై 2009)... రూపక్క మనకు కథ చెప్తుతుంది. రూపక్క, శ్యామ్ టీచర్సుగా, వారితో పాటు ఒక డాక్టర్ బస్తర్ వెళ్ళుతున్నారు. జిల్లా కమిటీ సభ్యుడు పాండన్న వీళ్ళను గమ్యస్థానం చేర్చే వ్యక్తి... ఈ నలుగురి దళం జిపజిప కురిసే వర్షంలో–అడవిలో, బురదలో వాగులు, వంకలుదాటి దారి పొడుగునా గూడాలల్లో ఆతిథ్యం పొందుతూ–వారి సమస్యలను వింటూ–తీరుస్తూ సాగుతారు. అద్భుతమైన కథనంతో మనలను ఆ నలుగురితో పాటు బస్తర్‌లో ప్రయాణం చేయిస్తుంటుంది ఈ కథ. ఒక గ్రామంలో ఆగినపుడు పాయకీ తను ఉన్న పరిస్థితి చెప్పి పాండన్నను పంచాయితీ చెయ్యమంటుంది. పాయకీ బీద ఆదివాసి పిల్ల–తండ్రికి తన పెళ్ళి ఖర్చుపెట్టుకునే స్థోమత లేక తనకు నచ్చినవాని ఇల్లుసొచ్చింది. ఇల్లు సొచ్చడమంటే మరింక పెళ్ళి ఖర్చు ఉండదు. ఒక పిలగాడు పుట్టిన తరువాత అడవిలో భర్తను ఎలుగుబంటి చంపుతుంది. కాయిదా ప్రకారంగా ఇద్దరు మరుదులు వదినను మళ్ళీ పెళ్ళి చేసుకుంటామంటారు. మరుదులతో ఉండడం పాయకీకి ఇష్టం లేదు. పక్కూరు రామాల్ ఇల్లు సొచ్చింది... మరుదులు పంచాయితీ పెట్టి లంద (తాగడం) కోసం రామాల్‌ను మూడు వేలు అడుగుతారు. రామాల్ తనకు అంత స్తోమత లేదు వెయ్యి ఇస్తానంటాడు. పంచాయితీ నుండి తిరిగి వస్తుండగా రామాల్ మీద ఎవరో బాణం వేస్తారు. అది ఛాతీలో దిగుతుంది. డాక్టర్ ఆ బాణం తీసి మందులిస్తాడు. పాయకీ పాండన్నను పంచాయితీ చేసి, సమస్య పరిష్కరించు అంటుంది... తను వెళ్ళవలసిన పని అర్జంటు కనుక తిరుగు ప్రయాణంలో చేస్తానంటాడు. రామాల్‌తో తన సంబంధాన్ని రూపక్క దగ్గర దాస్తుంది పాయకీ... ఆ విషయం ఎందుకు దాచావు అంటుంది రూపక్క... 'నా యిష్టాయిష్టాలతో సంబంధం లేకుండా ఇదంతా జరుగుతోంది నేను గొడ్డును కాదు– నాకు మనసుంది. నాకు మరుదులకన్నా–వీడే నయం. వీని దగ్గరే ఉందామనుకున్న" అంటుంది పాయకీ. రూపక్క దిమ్మెరపోతుంది.

పాండన్నకు ఇలాంటి సందర్భాలు కొత్తకాదు. ఉద్రిక్తమైన, ఉద్విగ్నమైన ఆదివాసి సమాజంలోని అంతర్గత వైరుధ్యాలను పరిష్కరించి, స్త్రీ పురుష వివక్షను ఎండగట్టి–ప్రజలను ముఖ్యంగా మహిళలను సంఘాల్లోకి, పార్టీలోకి సమీకరించారు విప్లవకారులు... వర్షం అడవిలాగే

మూసివ జీవితంలోని సంఘర్షణను, ఆ కొద్ది సమయంలోనే-పరిమిత స్థలంలోనే ఎదుర్కొని పరిష్కరించిన విధానాన్ని కరుణ కళాత్మకంగా గొప్పగా చిత్రించారు. ఈ కథ చదువుతుంటే రష్యా కథ "నలుగురు ఆడ పిల్లల సైన్యం" గుర్తుకొస్తుంది.

ఎన్.డి రాసిన మరోకథ ఓ 'పగ్ని కథ'. ఈ కథ ఆదివాసి సమాజంలోని అస్తవ్యస్త స్త్రీ పురుష సంబంధాలు-వాటి చుట్టు అల్లుకున్న కాయిదాలు, అలాంటి కాయిదాల మధ్య నలిగిపోయి ఊపిరాడక గిలగిలలాడిన ఆడపిల్లల నిత్యము నిరంతరం యుద్ధ బీభత్స కథ-అయితే ఇలాంటి ఆదివాసి సమాజంలో అన్ని రకాల దోపిడికి, వివక్షతకు గురౌతున్న ఆడవాళ్ళను వేధించడం, హింసించడం ప్రతి కథలోను కన్పిస్తుంది.. పగ్ని, మైని ఒకే ఊరి ఆడపిల్లలు. నేస్తగాళ్ళు. మైని దళసభ్యురాలైంది. పగ్ని గ్రామ కమిటి మెంబరయ్యింది. మంచి ఉపన్యాసకురాలు. చురుకైన మహిళా కార్యకర్త... అన్న వరుస అయిన సుదురుని అనే యువకునితో పగ్ని జత కడుతుంది. ఊరిపెద్దలు ఈ సంబంధాన్ని ఒప్పుకోక ఇద్దరిని కట్టేస్తారు. దళం జోక్యం చేసుకొని విడిపిస్తుంది. తరువాత పగ్ని ఊరు విడిచి పోతుంది. అక్కడ కూడా పార్టీ పని చేస్తుంటుంది.. ఆశ్రయం ఇచ్చినతను అసభ్యంగా ప్రవర్తిస్తే మరో ఊరికి పోతుంది. అక్కడ పార్టీ పనులు చేస్తున్న సతీష్‌తో పెళ్ళి చేసుకోవాలని నిర్ణయానికి వస్తుంది. అతను పార్టీకి ద్రోహం చేసి డబ్బుతో సహా పరారౌతాడు... అయినా దిగులుపడకుండా పగ్ని పార్టీ కాంటాక్టులోకి వస్తుంది.. తను ఎదుర్కున్న అన్ని రకాల జీవితాలకన్న పార్టీ ముఖ్యమనుకుంటుంది. గ్రామ కమిటీ సభ్యురాలి నుండి-కొత్తగా రూపొందుతున్న జీవితంలో కూడా కొనసాగుతున్న వివక్షను ఎదుర్కొని-ముందుకు సాగి దళంలో చేరుతుంది పగ్ని-ఈ కథను మైనా దళకమాండరుగా చెప్తుంది. ఈ కథలో మానవ జీవన క్రమంలో ఎదురైన ఘర్షణలు-వైరుధ్యాలు వాటిని చైతన్యపూర్వకంగా పరిష్కరించుకోవడం -అంతకన్నా ముందుకు పోవడం కథాంశం.

మిడ్కో మరోకథ 'తల్లిప్రేమ' సల్వాజుడుం గుండాలు, పోలీసులు కలిసి దండకారణ్యంలో బీభత్సం సృష్టిస్తే-ఆ తెల్ల బీభత్సం మధ్య అతలాకుతలమైన ప్రజలు తిరిగి నిలదొక్కుకొని యుద్ధం చెయ్యడం – ఈ యుద్ధంలో కాలానుగుణంగా మార్పు చెందే మానవ సంబంధాల సంక్లిష్ట పరివర్తన చిత్రణ ఈ కథ- మంగ్లికి సుక్కు మిగిలిన ఒకే ఒక్క కొడుకు. భర్త చనిపోయాడు. ఆ గ్రామంలో జనతన సర్కారు ఏర్పడి పని చేస్తున్నది. ఆ గ్రామం నుండి కమ్లీ దళ కమాండరయ్యింది. సుక్కు ప్రజా మిలీషియాలో పని చేస్తున్నాడు. కాని అతనికి దళంలో పని చేయాలని ఉన్నది. మంగ్లి తనకు ఒక్కడే కొడుకని-కమాండర్ కమ్లీ చెప్పినా కూడా దళంలోకి కొడుకును వెళ్ళనివ్వలేదు.. ఒకనాడు బీజాపూర్‌లోని బేస్‌క్యాంపు జుడుం గుండాలు ఆ ఊరిమీద దాడిచేసి ఊరును మొత్తం కాల్చేశారు.. గ్రామస్తులు ఈ తెల్ల బీభత్సాన్ని ముందే ఊహించుకున్నారు కనుక అడవిలోకి తప్పించుకున్నారు. సుక్కు పనిమీద బయటకు పోయాడు కనుక జుడుం వాళ్ళకు దొరికిపోయాడు.. సుక్కును రాహత్ శిబిరానికి పట్టుకపోతారు... కొడుకును విడిపించుకోవడానికి మంగ్లి శిబిరానికి వెళ్ళుతుంది. అక్కడ జుడుం నేత కన్నాల్, జుడుం గుండాలు కొడుకుముందే తల్లిని రేప్ చేస్తారు... రెండు నెలలకు తల్లీ కొడుకులు శిబిరం నుండి తప్పించుకొని ఊరికి వస్తారు... కమాండర్ కమ్లీ మళ్ళీ కలుస్తుంది. సుక్కు ఇలాంటి పరిస్థితిలో తన తల్లిని ఒదిలి దళంలోకి రాలేనంటాడు. మంగ్లి కొడుకుకు అప్పుడు చెపుతుంది.

'కాదు బిడ్డా! ఇక్కడుంటే బతుకనియ్యరు. దళంలోకి పోవాల్సిందే'నంటుంది... యుద్ధబీభత్సంలో ప్రజలు నిలబడి పోరాడడం–తల్లిప్రేమ స్థితి ఈ కథ.

ఎన్.డి రాసిన 'చైతే' ఒక యుద్ధ స్మృతి గీతం. 17.08.2010 నాడు దండకారణ్య ప్రెస్ (ప్రభాత్ పత్రిక) నిర్వాహకురాలు, ముప్పయి సంవత్సరాల ఉద్యమ జీవితం గల సీనియర్ కామ్రేడ్ చైతే (లలితమడావి)ని–జుడుం రద్దయిన తరువాత ఇన్‌ఫార్మర్లుగా, ఏజంట్లుగా మారిన కొద్దిమంది గుండాలు గొంతు సగం కోసి చంపేసి అర్ధనగ్నంగా వొదిలేసి పోయారు. ఒక భయానక వాతావరణాన్ని సృష్టించడానికి ఇలాంటి రహస్య దాడులు మొదలయ్యాయి... ఇలాంటి వాళ్ళను పట్టుకొని విచారించి ప్రజలు శిక్షించి బుద్ధి చెప్పారు... దేహాలను నాశనం చెయ్యగలరుగాని ప్రభాతంలా–వెలుగులా–పాటలాగా సుళ్ళు తిరిగే చైతన్యాన్ని, చైతేను ఎట్లా రూపుమాపగలరనే కథాంశం...

'మూసుకున్న హృదయం'–మిడ్కో కథ. కన్నాల్ ఆదివాసి భూస్వామి–అతని భార్య మల్లే–జుడుం నాయకుడు రాహత్ శిబిరం నిర్వాహకుడు–పరమ కిరాతకుడు. భార్య అలాంటి కిరాతకపు పనులు ఒదిలిపెట్టుమని కోరుతుంది. పైగా బీజాపూర్‌లో చదువుకునే ఇద్దరు కొడుకులను కూడా జుడుంలో చేరుస్తానంటాడు... ఒకనాడు శిబిరం నుండి ఇంటికి వస్తున్న దారిలో యాక్షన్ టీం కమాండర్ బద్రు, విజ్జాల్ కన్నాల్ మీద దాడి చేస్తారు... ఒక్క క్షణంలో ఇంటిదాకా పరుగెత్తుకు వస్తాడు. ఇంట్లోకి వెళితే రక్షింపబడే వాడే కాని భార్య తలుపులు మూసింది–బద్రు చేతిలోని పిస్టల్ ట్రిగ్గర్ మీద వేలు బిగుసుకుంది... దండకారణ్యంలోని జుడుం కార్యకలాపాల నేపథ్యంలో రాసిన కథ ఇది...

తొమ్మిది కథనాల సమారోహం–ఒక డైరీ రూపంలో సాధన అందించిన విలక్షణమైన చారిత్రక డాక్యుమెంటు 'గ్రీన్‌హంట్ ఉత్పాతాలు'... ఈ కథనాలు ఒకరకంగా లాటిన్ అమెరికన్ దేశాలల్లో చేగువేరా 'మోటర్ సైకిల్ యాత్ర' లాంటిది. జులై 2011లో పుస్తకంగా వచ్చినా కూడా ప్రత్యేకమైన మన కాలపు కథల సమారోహం కనుక ఈ సంకలనంలోతప్పక ఉండాలని అనుకున్నాం... మారుమూల గ్రామం–వైద్య సౌకర్యాలు లేకపోవడం–రాహిదళం ఏదో విధంగా హాస్పిటల్‌కు చేర్చుదామనుకుంటే గ్రీన్‌హంట్ నిర్బంధం–ఈ పరిస్థితుల్లో నొప్పులు పడుతున్న మహిళకు ఏమి చేయజాలని స్థితిని ఈ కథ వివరిస్తుంది. రెండో కథ 'కుమిలి'. కుమిలి జనతన సర్కారు తరపున సమష్టి వ్యవసాయ క్షేత్రం బాధ్యత నిర్వహిస్తుంటుంది. జుడుం గుండాలు రహస్యంగా దారుణంగా హత్యచేసి ఊరిబయట పడేసి పోయారు. సమష్టి వ్యవసాయ క్షేత్రాలను ఒప్పుకోలేని పాతతరం–ఆమెను దయ్యంగా మూఢనమ్మకాలు ప్రచారం చెయ్యడం –చివరకు కుమిలిని చంపిన గుండాలను ప్రజలు పట్టుకుని విచారించారు. వాళ్ళు ఇన్‌ఫార్మర్లు –శత్రువు ప్రయోగించినవాళ్ళు–వియత్నాం, చైనా విప్లవాలల్లో ఇలాంటి ఘటనలు కోకొల్లలు. పాతకొత్త సమాజాల సంఘర్షణ అద్భుత చిత్రణ ఇది. 'ప్రజా యుద్ధంలో మట్టివాసన'–సాధన మరోకథ (సెప్టెంబరు 2011). బెజ్జి పోలీసు స్టేషన్ మీద ప్లాటూన్ దాడి–జుడుంను, పోలీసు, పారామిల్ట్రీ దళాలను తిప్పి కొట్టి–ఎదురుదాడికి ఆత్మరక్షణ కోసం దిగిన వైనం – అనేక పాత్రలు – ప్లాటూన్ కదలికలు, రిపోర్టులు, సమీక్షలు, ఒక తీవ్రమైన యుద్ధంలో ప్రజలు శత్రువుతో చేస్తున్న యుద్ధం అత్యంత ప్రతిభావంతంగా యుద్ధ విలేఖరిగా – యుద్ధం నడిపే

నాయకునిగా–రాసిన ఒక చారిత్రక కథనం...

యుద్ధరంగంలో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న దండకారణ్యం తొలితరం విప్లవకారుడు, రచయిత సాధన. దండకారణ్యంలోని ముప్పయ్యేళ్ళ సుదీర్ఘ విప్లవ జీవితాన్ని, మలుపులను ఒక యుద్ధ విలేఖరిగా రాస్తున్నారు... బహుశా ప్రపంచంలోనే ఇలాంటి విప్లవ జీవితం, రచన అరుదైన విషయం... కథ, నవల, వ్యాసం, నివేదికలు అనేకం–ఆయనకు దొరికిన సమయంలో బయటి ప్రపంచానికి అందించారు... దండకారణ్యం నుంచి వచ్చిన సాహిత్యంలో ఇప్పటికి ఎక్కువ భాగం సాధన కృషితోనే వచ్చాయి.

బి. భానుమతి కథ 'కొత్త చదువు' దండకారణ్య యుద్ధక్షేత్రంలో పిల్లల చదువులో కూడా చోటు చేసుకుంటున్న కొత్త చైతన్యం చిత్రించే కథ. సుక్రు ఎన్‌జిఒలు నడుపుతున్న ఒక అనాథ పిల్లల పాఠశాలలో చదువుకుంటూ వారే నడిపిస్తున్న హాస్టల్లో ఉన్నాడు. అతనికి పన్నెండు, పదమూడు సంవత్సరాల వయస్సుంటుంది. తను అనుభవించిన దుర్భర వేదనను, హింసను తనే చెప్పుకుంటాడు.. అడవిలో పుట్టి చెట్లను, అడవిని, జంతువులను చదువుకున్నవాడు. పార్టీ ప్రవేశం తరువాత తాగి తల్లిని కొట్టే తండ్రి పెనుమార్పులకు లోనై పుటంపెట్టబడి జనతన సర్కారు అధ్యక్షుడయ్యాడు. మిలీషియా అక్క గూడెం గురించి, దోపిడి గురించి, లెక్కలు, సాంఘిక శాస్త్రం అన్నీ మద్దిమాను బడిలో చెప్పి వాస్తవ ప్రపంచంలోకి కిటికీ తెరిచింది. సల్వాజుడుం, పోలీసులు కలిసి ఆ ఊరి మీద దాడి చేశారు. ఊరును కాలబెట్టారు. అందినవాళ్ళను చంపారు. అడవుల్లోకి పారిపోయినవాళ్ళు బతికారు. సుక్రును బేసు క్యాంపుకు తీసుకువచ్చారు. అతని తండ్రిని అదే క్యాంపుకు తీసుకవచ్చి చంపేశారు. తన తండ్రి శవాన్ని చూస్తూ దుర్భర జీవితాన్ని గడిపాడు సుక్రు–ఆ తరువాత క్యాంపునుండి తమ మాట తెలువని ఈ అనాథ స్కూలుకు సుక్రును మార్చారు. ఇంత చిన్న వయస్సులో ఛిద్రమైన అతని అంతరంగం నిరంతరం సలిపేది. నెలల తరబడి ఈ వేదనను ఒంటరిగా, దిగులుగా అనుభవించిన సుక్రు–ఏది ఏమైనా తన ఊరి మద్దిమాను బడికి–అడవికి చేరుకోవాలనుకున్నాడు. తన భాష, భావం తెలిసిన వంట అక్క సద్దికట్టి ఇచ్చింది. సుక్రు తనవాళ్ళను, కొత్త చదువును వెతుక్కుంటూ స్కూలు నుండి పారిపోయి అడవిలోకి పయనమయ్యాడు.

యామిని కథ 'నిరిమీల'. ఇలాంటి ఆఫ్రికన్ కథ సారాఫినా సినిమాగా వచ్చి, ప్రపంచ ప్రజల్లో ప్రాచుర్యం పొందింది. ఇది ఆఫ్రికన్ సాహిత్యానికి సరిపోల్చదగిన కథ (జనవరి 2012). నిరిమీల క్రాంతికారీ ఆదివాసి మహిళా సంఘటన్ నుండి ఏరియా సంఘటన్ జనతన సర్కారులో న్యాయ శాఖ బాధ్యురాలిగా పని చేస్తున్నది. పార్టీ సలహా మేరకు పెళ్ళి చేసుకుంది. ఈ కథ కాలం జూలై 2010–గ్రామంలో జనతన సర్కారు ఏర్పడి సమష్టి వ్యవసాయం – చెరువులు తవ్వడంలాంటివి చేస్తున్న కాలం... గ్రీన్‌హంటు పోలీసులు అలాంటి గ్రామాల మీద దాడిచేసి అలాంటి నిర్మాణాలను దెబ్బతీసి నాయకులను హత్యచేసి విధ్వంసం సృష్టించాలనుకుంటారు. దీన్ని ఎదుర్కోవడానికి ప్రజలను ఏకం చేయడానికి స్థూపం కట్టాలనుకుంటుంది నిరిమీల. అది తెలిసి నిరిమీల కోసం గ్రామం మీద దాడి చేస్తారు. నిరిమీల వారికి దొరుకకపోతే భర్తను అరెస్టు చేసి తీసుకపోతారు.. ఊరంతా కకావికలమౌతుంది. నిరిమీల అత్తమామలే నిరిమీలను తిడుతారు. ఇలాంటి సందర్భంలో అమరవీరులకు స్థూపం కట్టి ముందుకు పోవాలని నిరిమీల

నిశ్చయించుకుంటుంది. ప్రభుత్వ నిర్బంధం-కుటుంబం నుండి నిరసన-ఊరి పెద్దలు, ఊరి వాళ్ళ వ్యతిరేకత మధ్య నిరిమీల ఊరివాళ్ళందరితో ఒక సమావేశం పెట్టి ఈ నిర్బంధం మధ్య ఎందుకు నిలబడాలో, తమ జనతన సర్కారును ఎందుకు రక్షించుకోవాలో అమరుల జ్ఞాపకార్థం స్థూపం కట్టుకోవడం ఎందుకో ఊరి ప్రజలతో ఒప్పిస్తుంది. ఆ సమావేశం నుండి ఒక బృందం నిరిమీల భర్త లచ్చును విడిపించడానికి వెళ్ళుతుంది. ఒక బృందం స్థూపం నిర్మిస్తుంది. దళం రావడంతో స్థూపాన్ని ఆవిష్కరించుకుంటారు. ఒక ఆదివాసి మహిళా కార్యకర్త చొరవను, దీక్షను, నిర్బంధం మధ్య పని విధానాన్ని చర్చించే కథ.. పాత్రలు, సన్నివేశాలు, సంభాషణలు, సంఘటనలు చిత్రించేటప్పుడు నిరిమీలలాగా నేర్చుకోవాల్సి ఉన్నది.

'బాల గెరిల్లాలు' - యామిని కథ. దళం తిరిగే ప్రాంతంలో, ప్రభావితులైన పది సంవత్సరాలలోపు పిల్లలు బాలల సంఘంగా ఏర్పడి - చదువు, పరిశుభ్రతతో పాటు శత్రువు కదలికలను దళానికి చేరవేస్తుంటారు. బాలల సంఘంలో పెద్ద బచ్చు... పెట్రోలింగు చేస్తున్న రెండు పోలీసు ప్లాటూన్ల కదలికలను-ఎండ్రికాయలను పట్టేవాళ్ళుగా వెళ్ళి దళానికి చేరవేస్తారు. ప్లీనరీ కోసం ఎక్కువ మంది వస్తారు. వెంటనే దళం తనే ఫైరింగ్ ఓపెన్‌చేస్తుంది. అనుకోని పరిణామానికి పోలీసులు కకావికలై పారిపోతారు. దళం సామానులు రక్షించి, వాటికి పిల్లలు కాపలా ఉండి దళానికి అప్పగిస్తారు. దండకారణ్యంలో యుద్ధరంగంలో తమ తరపున పోరాడుతున్న ప్రజాసైన్యానికి బాసటగా నిలబడి పనిచేస్తున్న బాలగెరిల్లాల కథ ఇది. చైనా సాహిత్యంలో ఇలాంటి కథలు చాలా వచ్చాయి...

ఎన్.డి కథ ఇద్దరు 'శస్త్ర' కారులు. దండకారణ్యంలో జనతన సర్కారులో-ముఖ్యంగా యుద్ధరంగంలో పనిచేసే వైద్య సిబ్బంది కథ... తాత్కాలికంగా యుద్ధరంగంలో పని చేసే వైద్య శిబిరానికి గాయపడ్డ ఒక గెరిల్లా యోధునికి కంటిలోని తుపాకి రవ్వలు శస్త్ర చికిత్స ద్వారా తీయాల్సిన అవసరం రీత్యా బయటి నుండి అందుబాటులో ఉన్న ప్రభుత్వ డాక్టరు ఒక విప్లవ సానుభూతిపరుని ద్వారా కునాల్ వస్తాడు. అతను బయటి తన జీవితాన్ని - యుద్ధరంగంలో ఆదివాసుల జీవితాన్ని పోల్చి చూసుకోవడం అత్యంత నేర్పుతో చిత్రించిన కథ ఇది... కునాల్-ప్రభుత్వ డాక్టర్. ఊబకాయం. ఎప్పుడు ఏ నిర్ణయం సరీగ తీసుకోజాలని ఊగిసలాట. ఇడియే - ప్రజల డాక్టరు. యుద్ధరంగంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఎనిమిదవ తరగతి వరకు చదువుకుంది. గాయపడ్డ రోగులు... వాళ్ళ అంతరంగం-గాయాలు నొప్పులతో కూడా ధీరోదాత్తమైన గొప్ప ఆత్మ విశ్వాసంతో ప్రజలపట్ల ప్రేమతో వెలిగే వాళ్ళ ముఖాలు... డాక్టర్‌కు తను వైద్యం చేసిన గాయపడ్డ పోలీసు ముఖాలు గుర్తుకొస్తాయి. "వాళ్ళ పేదరికం, నిస్సహాయమైన ముఖాలూ, ఆత్మ విశ్వాసం లేని కళ్ళూ, అచ్చం బలికిపోయే గొర్రెపిల్లల్లాగా తమ ముందొక గొప్ప ఆశయం ఉందనిగానీ, తమ వెనుక ఒక మహాప్రజ ఉన్నారని గానీ వాళ్ళ హృదయాలల్లో ఓ దీపం వెలుగుతున్నట్టుగా నాకు ఎప్పుడూ అన్పించలేదు. యుద్ధంలో ఈ మావోయిస్టు గెరిల్లాలు గెలుస్తారో లేదో నేను చెప్పలేను. కనీసం ఇప్పుడే చెప్పలేనుగానీ ఒక యుద్ధంలో మాత్రం వాళ్ళు గెలుపు శిఖరాల మీద ఉన్నారని ఎందుకో పదేపదే అన్పిస్తోంది. వాళ్ళ గుండెల్లో ఆ దీపపు జ్వాల స్పష్టంగా కనిపించినట్టు తోస్తోంది." అనుకుంటాడు.

డాక్టర్‌కే కాదు ఈ కథ చదివిన పాఠకులకు అట్లాగే అన్పిస్తుంది... భావోద్వేగాలతో కథ

క్షతగాత్రులకు ఆపరేషన్ చెయ్యడం–ఆ వ్యవహారమంతా అత్యంత చాకచక్యంగా, కాల క్రమేణా చూస్తున్న, చేస్తున్న గెరిల్లా డాక్టర్... రెండు పదుల ఆదివాసి పిల్లను ఒకసారి కౌగలించుకోవాలనుకుంటాడు, ఆమె తన అనుభవాలను చెప్పి ముగించిన తరువాత అపుకోలేక డాక్టర్ తల నిమిరాడు.. ఇలాంటి తీవ్రమైన, అన్నీ కలగల్సిన భావోద్వేగాలకు తప్పక పాఠకులు లోనౌతారు.

కథాంశం, శిల్పం, భాష, సంఘటనలు, పాత్రలు, వాతావరణం, మానవ ఉద్వేగాలు కలెగల్సిన గొప్ప కథ.

బాగా చదువుకున్న సమర్థుడైన గొప్ప డాక్టర్–ఊబకాయం, ఊగిసలాట–ప్రభుత్వ డాక్టర్.

చదువు అంతగాలేని, శిక్షణ అవకాశం లేని, ఆత్మ విశ్వాసంగల చాకులాంటి పిల్ల గెరిల్లా డాక్టర్ గొప్ప ఆత్మ విశ్వాసంతో యుద్ధరంగంలో...

"సమకాలీన వైరుధ్యాల చలనం దశ దిశను విప్లవ సాహిత్యం చిత్రించాలని" శ్యామ్ (నల్లా ఆదిరెడ్డి) రాసిన మాటలు పూర్తిగా ఈ కథలో కన్పిస్తాయి.

సంగీతంలో ఆరోహణ అవరోహణ క్రమంలాగే – కథలోని సంఘటనలు, వాతావరణంతో పాటు మానవ ఉద్వేగాలను పతాక స్థాయిలో చిత్రించిన కథ – విప్లవానికుండే అంతర్ బాహిర్ శక్తులను చిత్రించిన మన కాలపు గొప్ప కథ–రష్యా, చైనా కథలతో సరిపోల్చదగిన కథ. బహుశా వీళ్ళంతా మనకాలపు గోర్కీలు, లూషన్‌లు–యుద్ధరంగంలో నిలబడి రాస్తున్న వీళ్ళు మానవ జాతి గర్వించదగ్గ గుర్తుపెట్టుకోగల మనకాలపు సాహిత్యాన్ని మరింత నేర్పుతో చిత్రించగలరని నా ప్రగాఢ విశ్వాసం.

'లక్ష్మణ రేఖ' – నిత్య–ఈ కథ మొత్తం దండకారణ్య ఉద్యమాన్ని రేఖామాత్రంగా చిత్రించిన కథ–జోగన్న దండకారణ్యం ప్రవేశించిన తొలి విప్లవకారుడు. జోగన్న అంతరంగ కథనంగా – అరువైమందితో కూడిన గెరిల్లా కంపెనీతో కదులుతూ గతాన్ని జ్ఞాపకం తెచ్చుకుంటాడు. వందేళ్ళ అంతర్జాతీయ మహిళా దినం వేడుకలు ఘనంగా జరుపుకోవాలని దండకారణ్య మహిళా సబ్ కమిటీ పిలుపునిచ్చింది.. ఆ సభలకు రక్షణ కోసం జోగన్న కంపెనీ వచ్చి కొంచెం దూరంలో దేరా వేసింది. కుడివైపు కిలో మీటర్ దూరంలో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ రెండవ కంపెనీ దేరా–భూంకాల్ స్కూలు పిల్లలు, డివిజన్ కెఎంఎస్ కార్యవర్గం, ఏరియా జనతన సర్కారు అధ్యక్షులు, కమాండర్ ఇన్ చీఫ్‌ల దేరాలు–

శత్రువు గ్రీన్‌హంట్ పేరుతో దాడులు ముమ్మరం చేశాడు. పైన హెలికాప్టర్లు తిరుగుతున్నాయి. ఇలాంటి యుద్ధ వాతావరణంలో పదిహేను వేలకు పైగా జనం మీటింగు జరుపుకున్నారు. అన్యాయం పక్షంతో చేతులు కలిపిన వాళ్ళంతా పట్టణాలకు – న్యాయం వైపుల నిలబడ్డవాళ్ళంతా అడవితల్లి ఒడిలోకి... ఈ రెండింటి మధ్య లక్షణరేఖ వర్గపోరాటం.....

సాహిత్యంలోను ఆ లక్ష్మణ రేఖ కావల నుండి వచ్చిన ఈ పదిహేను దండకారణ్య కథలు.

అబూజ్‌మాడ్ కొండల్లో – అడవుల్లో అనగా దండకారణ్యంలో నుండి అనేక దశలు దాటి విస్తరించిన ప్రజాసైన్యం, జనతనసర్కారు, మావోయిస్టు పార్టీ. యుద్ధరంగంలో నుండి వెలువడుతున్న ఈ కథా సాహిత్యం మనకాలపు విప్లవ సాహిత్యం. మిగతా ప్రపంచవ్యాపితంగా

వచ్చిన వస్తున్న సాహిత్యం కన్నా భిన్నమైన మనకాలపు మన నేల మీది సాహిత్యం... కథాంగాలైన కథాంశం, శిల్పం, భాష, సంఘటనలు, వాతావరణం పాత్రలు పూర్తిగా భిన్నమైనవి... సంఘర్షణ నుండి వర్గపోరాటం నుండి పుటం పెట్టబడి రూపొందినవి. ఈ కథలు కట్టుకథలు కాదు. పుట్టు కథలు.. రచయితలు యుద్ధ రంగంలో నిలబడి ఒక చేత్తో తుపాకి మరొక చేత పెన్నుపట్టి రాసినవి. ఒక ఉద్విగ్న, ఉద్రిక్త తుఫాను గాలిలాంటి పెను సంరంభంలోంచి రాసినవి... ఆట, పాట, నాటకం ప్రదర్శన యోగ్యమైన కళారూపాలల్లో ఇప్పటికే వేలాదిమంది విప్లవ కళాకారులు ఏర్పడి పని చేస్తున్నారు.. కథకులకు అంత అవకాశం లేకున్నా తమవంతు కర్తవ్యంగా ఇక్కడి చరిత్రను అద్భుతమైన నైపుణ్యంతో చిత్రిస్తున్నారు. అయితే సాధన కాక చాలా మంది రచయిత్రులే ఈ సాహిత్యం సృష్టించడం మరో విశేషం. ఎక్కువగా మహిళా సమస్యలకు మాత్రమే పరిమితమైన రచయిత్రులు–వర్గ పోరాటాన్ని సమస్త లోతులతో వైరుధ్యాలతో–సంఘర్షణలతో చిత్రించడం ప్రపంచ సాహిత్యంలోనే ఒక మనకాలపు అరుదైన విషయం.

అయితే–కథాంశం ఎంపిక, నిర్వహణ, శిల్పం, భాష విషయాలల్లో మరింత నేర్చుకోవాల్సి ఉన్నది–ముఖ్యంగా మూసపాత్రలకు, ఘటనలకు తావివ్వకుండా–అధ్యయనం చేయవలిసి ఉన్నది. దండకారణ్య రచయితలల్లో చాలా మంది మనదేశ సాహిత్యంతో పాటు ప్రపంచ సాహిత్యం తెలిసినవాళ్ళే.. ప్రత్యేకమైన అంశాన్ని జనరల్‌స్థాయికి అభివృద్ధి చేయాలంటాడు చైనా రచయిత మావోయేటూన్ – ఒక ఆదివాసి మహిళ జీవితమే తీసుకుందాం... ఆమెకీ ఇందులోని కథల్లోని పాత్రలైన రామాల్, పగ్ని జీవితాల్లో సారూప్యతలు, ప్రత్యేకతలున్నాయి... ఆదివాసి ప్రాంతాలల్లో పితృస్వామిక సమాజం బలంగా ఉన్న ప్రాంతంలో వేలాది మహిళా కథలన్ని ఇంచుమించుగా ఇంతే... అయితే రాగో విడివిడి అనుభవాల ఉమ్మడి ఆదివాసి మహిళలాగా కన్పిస్తుంది కనుకనే – దండకారణ్య మహిళకు గొప్ప ప్రతీక అయ్యింది. అణచివేత, తిరుగుబాటు, నిర్మాణం భారతదేశ మహిళలందరికి వర్తించే విషయం. రైతులు, భూస్వాములు, పోలీసులు, ఆదివాసి ప్రాంతంలోని అన్ని రకాల ప్రజల నుండి ప్రత్యేకతలను జనరల్ విషయాలను తేల్చుకోగల్గితే మూస పాత్రలు, మూస కథలు తగ్గి మరింత అద్భుతమైన సాహిత్యం వస్తుంది... సంఘటనల చిత్రీకరణ, తగిన విధంగా స్థలకాలాల చిత్రీకరణ, వాతావరణ చిత్రీకరణతోపాటు విధ్వంసం, యుద్ధం మధ్యలో నిర్మాణం–సుఖ దుఃఖాలు, రాగద్వేషాలు, ఆవేశకావేశాలు, సాంస్కృతిక వ్యక్తీకరణలూ, పండుగల నృత్యాలు, అవి ఆదివాసులవైనా పీపుల్స్ ఆర్మీవైనా అనేక జీవన పార్శ్వాలను తగిన విధంగా అన్ని రసాల మేళవింపులతో చిత్రించడం ద్వారా విప్లవ సాహిత్యం మరింత పరిపుష్టం ఔతుంది.

ఈ విషయాలన్ని నాకన్నా ఈ రచయితలకే ఎక్కువ తెలుసని నాకు తెలుసు. ఈ మధ్య చదివిన దండకారణ్య రచయితలు ఎంతటి సంక్లిష్ట విషయాలైనా–వాటి లోపటి లోతులు చిత్రిస్తున్నారు. నా యవ్వనారంభ ఉద్విగ్న కార్యాచరణ రోజుల సాహిత్యం, వేగం, పరిమళం తిరిగి నింపి నాకు వ్యక్తిగతంగా వచ్చిన యెడాన్ని పూరించి కాల ప్రవాహంలో – నా తరంతో–ప్రజలతో ఏకం కావడానికి కావాల్సిన చైతన్యాన్ని అందించాయి. ఈ గొప్ప చైతన్యాన్ని, అనగా ప్రజాసైన్యాన్ని, జనతన సర్కారును, మావోయిస్టు పార్టీని తమ సమస్త శక్తులతో, అత్యంత సుదీర్ఘ కాలంగా నిర్మిస్తున్న నా కాలపు వీరుల సహచరుల ఉక్కుసంకల్పం, వాళ్ళ

త్యాగం ఎంత గొప్పదో వాళ్ళు ప్రపంచ ప్రజలకు ఎంత ప్రియమైన వాళ్ళో - దోపిడిదార్లకు ఎంత తీవ్రమైన శత్రువులో-ఈ కథలు చిత్రిస్తాయి. ఆఖరుగా యాన్‌మిర్దాల్‌కు గణపతి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పినట్టుగా "ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశంలో మావోయిస్టు విప్లవం ఒక నూతన దశకు చేరుకోగలిగితే అది ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి తీవ్రమైన ప్రమాదంగా మారుతుంది. అందుకే సామ్రాజ్యవాదం, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదం ఈ పరిణామాలను సీరియస్‌గా తీసుకొంటోంది".

కనుక భారత ప్రభుత్వం ఆలౌటు (హఠాత్తు) యుద్ధం (మొత్తం తుడిచిపెట్టే) ప్రకటించింది. అమెరికా సలహా సహకారాలతో సైన్యాన్ని ఆదివాసి ప్రాంతాలల్లో దించింది.

దేశ జనాభాలో 95 శాతానికి పైగా ఉన్న మావోయిస్టు విప్లవకారులు, విశాల అటవీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసులూ, ఇతరస్థానిక ప్రజలూ, కార్మికులూ, రైతాంగం, పట్టణ మధ్య తరగతి, చిన్న, మధ్యతరహా పెట్టుబడిదారులూ, దళితులూ, మహిళలూ, మత మైనారిటీలు, పీడిత జాతులూ, ప్రజాస్వామిక సంస్థలూ, ప్రగతిశీల దేశభక్తయుత శక్తులూ, అంటే ఈ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న వారందరి మీద ఈ యుద్ధాన్ని రుద్దుతున్నారు. ఇది పూర్తిగా అన్యాయమైన యుద్ధం. ఈ దేశపు దళారీ నిరంకుశ బూర్జువాలూ, భూస్వామ్య శక్తులూ, అలాగే సామ్రాజ్యవాదులూ, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులూ భారతదేశ ఖనిజ సంపదను పూర్తిగా దోచుకొని దేశాన్ని బొందలగడ్డగా మార్చడానికి ఈ యుద్ధాన్ని ఆరంభించారు. ప్రజలు తమ రక్తాన్ని ధారపోసి ప్రతిఒక్క అన్యాయమైన యుద్ధానికీ వ్యతిరేకంగా పోరాడి అంతిమంగా గెలిచారు...

అలాంటి యుద్ధ రంగ కథకులతో ఆత్మీయ కరచాలనం చేస్తూ... ఇలాంటి సందర్భాన్ని విరసం కలిగించినందుకు కృతజ్ఞతలతో - ఈ పనిలో సహకరించిన సాహితీ మిత్రులందరికి నా ధన్యవాదాలు....

# చాయ్ గ్లాసు

– నిత్య

1994 సంవత్సరం అడవి జీవితం ప్రారంభం. పరవశింపచేసే ప్రకృతి సోయగాలు. గలగల పారే నది, అది నల్లతాచులా బుసలు కొట్టుకుంటూ ఉరికివస్తుంది కాబట్టి దాన్ని పాముల గౌతమి అంటారు. అకస్మాత్తుగా కనిపించి మాయం అయ్యే లేళ్ళ గుంపులు, విరగకాచి చెట్టుకు పండిన మామిడి పండ్ల తియ్యటి ఆహ్వానం. దారి పొడుగుతా నవ్వుతూ పలకరించే పువ్వులు. నవ్వే పువ్వుని తిరిగి తిరిగి చూసుకుంటూ నడవటం, కట్టెపుల్ల కాలికి తగిలి విరుచుకుపడటం, దెబ్బ బాధను మరిపించే నవ్వుల జల్లులు – ఇదీ గెరిల్లా జీవితంలోని ఆనందం.

దళం దినచర్యలో భాగంగా మేం గండవాయ నుండి పారెనార్‌కి బయలుదేరినాం. నది దాటి కొండ ఎక్కితే ఊరు వస్తుందని మా వాళ్లు చెప్పారు. ఈ దారంట రావటం ఇదే మొదటిసారి. కొండ ఎక్కటం అంటే నాకు ముందే గుండె దడ వస్తుంది. ఆ భయానికే కాబోలు ఎక్కటం మొదలుపెట్టగానే ఊపిరి సలపనట్లయింది. వేడెక్కిన శరీరాన్ని చల్లబర్చటానికి బయలుదేరిన స్వేద బిందువులు ధారలైనాయి.

'అదిగో! కొండ అంచున ఆకాశం కనిపిస్తున్నది. అక్కడికి అందితే గుట్ట అయిపోతుందిలే' అనుకుంటూ ప్రాణం ఉగ్గబట్టుకుని అక్కడికి చేరి 'హమ్మయ్య' అనుకునేసరికి మరోమెట్టు కనిపించింది. ఇలాంటివి పదిమెట్లు ఎక్కినంక, 'గుట్ట ఒడిసింది' మా వాళ్ల మాట విని ప్రాణం కుదుటపడ్డది.

'ఇంకెంత దూరం ఉందబ్బా ఊరు?'

'అందినం, అరంగంట దిగితే ఊరే.....' విమల జవాబు చెప్పింది.

గ్రామానికి చేరేసరికి దివాకరుడు తన దినచర్య ముగించుకోవటానికి ఆరాటపడుతున్నాడు. వెలుగు ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలని ఇల్లాలు తొందరపడుతున్నది. పోడు నరకటానికి పోయిన పురుషులు భుజాల మీద గొడ్డళ్ళు, ఖాళీ అయిన జావ బుర్రలు చంకలకు వేలాడేసుకుని ఇళ్ళకు చేరుతున్నారు. ముసలవ్వ వెలుగు కోసం నెగడు రాజేస్తున్నది. పలుచగా చీరిన వెదురుబద్దలతో సగం అల్లిన బుట్టను చంకనెట్టుకున్న ముసలాయన ఇంటి ముఖం పట్టాడు. రామె తల్లి బిడ్డకు పాలిస్తున్నది. చందు వాళ్ళమ్మ అన్నం వండుతున్నది. నేందని చెల్లెళ్ళు కోహాల దంచుతున్నారు. పన్నెండేళ్ళ చిన్నారి చిమిరి తన ఎత్తులో సగం ఎత్తున్న బిందెను తల

మంగు పెళ్ళరుసి వాగు నుండి వంటకు నీళ్ళు తెస్తున్నది. బర్మార్లు పట్టుకున్న నేండ, రాజులు రెండు ఉడుం పిల్లలు, కుందేలుతో వేట నుండి ఇంటికి తిరిగి వస్తున్నారు. ఉండేలు పట్టుకున్న ఋదురు తను పట్టుకొచ్చిన పక్షి పిల్లను చెల్లికి చూపిస్తున్నాడు.

* * *

గ్రామంలో ఐదు గడపలు, ఒక గోటుల్ ఉన్నాయి. మేం వచ్చామని తెలియగానే బుడతడు ఎగురుకుంటూ వచ్చి వాలాడు. నేను, విమల ఆ ఊరికి ఎక్కువగా పోతుంటాం. బుడత తల్లిని చందు వాళ్ళమ్మ అని పిలుస్తారు. ఆమె అడ్డాకు గింజలు, తునికి పండ్లు, రేఖ పండ్లు, దుంపలు, కూర అరటికాయలను మగ్గబెట్టిన అరటిపళ్ళు ఏది ఉన్నా మా కోసం దాచిపెట్టి పెట్టేది. ఆ కుటుంబంలో పెద్ద కొడుకు చందు. వాడికి పదేళ్ళుంటాయి. వాడి తర్వాత ఒక ఆడపిల్ల. చివరివాడు చిచ్చర పిడుగు. వాడే బుడతడు. వాడికి ఆరేళ్ళుంటాయి. నల్లటి నలుపు.చలాకీగా మెరిసే గుండ్రని కళ్ళతో చూపరులను ఆకట్టుకుంటాడు. వాడు పిలుపుకు అందడు. చేతికి చిక్కడు. తనకు తానుగా ఎన్నడూ ఒంటిమీద నీళ్ళు పోసుకోడు. ఎవరన్నా నీళ్ళు పోయించుదామంటే తూరీగలా తుర్రుమనేవాడు. ఇంట్లో వాళ్ళు ఎంత ప్రయత్నం చేసినా వాడికి లాగు తొడిగించలేక పోయారు. దొరకబెట్టి బలవంతాన ఎవరన్నా తొడిగినా విప్పి అవతల గిరాటేసేవాడు. దిసమొలతో హాయిగా తిరిగేస్తుండే వాడు.

నాకు పిల్లలంటే బోల్డంత ఇష్టం. తరచుగా వస్తూ పోతుండడంతో బుడతనితో నాకు దోస్తీ కలిసింది. నెమ్మదిగా దగ్గరికి వచ్చి కూర్చునేవాడు. నా మాట బుద్ధిగా వినేవాడు. ఊరి నుండి మేం వెళ్ళిపోయే వరకూ మాతోనే ఉండేవాడు. నేను చెప్పే కథలు ఎంత అర్థమయ్యేవో తెలియదు కాని గుడ్లు మిటకరించుకుని వినేవాడు.

రాత్రి అన్నం తిని ఊరిలో మీటింగు, పాటల కార్యక్రమం నడిచాయి. రాత్రి అదే ఊరిలో పడుకున్నాం. ఉదయం లేచి వ్యాయామం ముగించుకుని కాళ్లు చేతులు కడుక్కోవటానికని వాగుకు బయలుదేరినాం. బుడతడు మా వెంటే ఉన్నాడు.

'స్నానం చేస్తావా?' నెమ్మదిగా అడిగాను.

'ఊ' సమ్మతంగా తలూపాడు.

వాడు 'ఊ' అనటమే తడువు నేను, సీత వాడి వంటిని రుద్దటం మొదలుపెట్టాం. ఉప్పువేసి బండమీద చేపను తోమినట్లుగా తోమినం. మూడుసార్లు లైఫ్‌బాయి అరగదీస్తేగాని మురికి బంగారం వదల్లేదు. పండిన నేరేడు పండులా ఎంచక్కా మెరిశాడు బుడత.

'అమ్మ దగ్గరకు పోయి లాగు తీసుకురా..' అంటే బుద్ధిగా పోయి తీసుకొచ్చాడు. ప్రతిఘటన లేకుండానే లాగు తొడిగించుకున్నాడు. తలకి నూనె రాసి క్రాపు నున్నగా దువ్వాను.

* * *

చాయ్ విజిల్ వచ్చింది. వంట డ్యూటీలో ఉన్న మంగు నవ్వుతూ రెండు గ్లాసులతో చాయ్ పోసి ఇచ్చాడు. బుడతనికి ఒకటి ఇచ్చి, నేనొకటి తీసుకున్నాను. వాడికి కూడా నాలాగే చాయ్ పిచ్చి. అందుకని గ్లాసునిండా పోశాను. గ్లాసులో చాయ్ అయిపోయే దాకా నోటి దగ్గర నుండి గ్లాసు తియ్యలేదు. తాగటం అయిపోయినాక గ్లాసు పట్టుకున్న చేతిని నా ముందుకు

చాపాడు.

'ఇదిగో' అన్నాడు.

నేను గ్లాసు తీసుకోలేదు. 'కడిగి తీసుకు రా!' అన్నాను.

వాడు కదలలేదు. అట్లనే నించున్నాడు. కొద్దిసేపాగి మళ్లీ గ్లాసును నా ముందుకు చాపి 'ఊ' అన్నాడు.

'అక్కడ నీళ్ళున్నాయి. పోయి గ్లాసు కడిగి తెచ్చి ఇక్కడ పెట్టు'. కొంచెం నిదానంగా నొక్కి చెప్పాను.

అయినా వాడు కదలలేదు. అక్కడే నిలబడ్డాడు. గ్లాసు అందుకునే ప్రయత్నం నా వైపు నుండి ఏమీ లేకపోవటం చూసి గ్లాసుని విసురుగా మీద గిరాటేశాడు. తిరిగి చూడకుండా తుర్రుమన్నాడు.

'బుడతన్ని నేనేం అన్నాను విమలా? వాడికెందుకు కోపం వచ్చింది'? పక్కనే కూర్చుని ముసిముసిగా నవ్వుతున్న విమలను అడిగాను.

'నువ్వు వాడిని గ్లాసు కడగమన్నావు కదా! ఇళ్ళల్లో తిన్న కంచం, తాగిన గ్లాసు మగాళ్ళు కడుగుతారా? అందుకే వాడికి కోపం వచ్చింది' అంటూ పగలబడింది విమల.

ఆశ్చర్యపోవటం నా వంతయింది. లాగు తొడుక్కోవటం చేతగాని బుడతనికి పితృస్వామ్యం నేర్పిందెవరు? ఆలోచనల్లో మునిగిపోయిన నేను 'పోదాం అక్కా' అని కమాండరు జగత్ మాటతో ఈ లోకంలోకి వచ్చాను. త్వరత్వరగా కిట్టు సర్దుకుని భుజానికేసుకున్నాను.

* * *

గొంగవాడకి మా ప్రయాణం. నడుస్తున్నానే గాని ఆలోచనల నిండా బుడతడు నిండిపోయాడు. సమాజాన్ని మార్చే బృహత్ కర్తవ్యం కోసం పని చేస్తున్న సామాజిక కార్యకర్తలం కాబట్టి కర్తవ్యం గురించి ఆలోచన బుర్రలో సుడులు తిరుగుతున్నది. పార్టీలో, ప్రజా సంఘాలలో పొడసూపుతున్న పితృస్వామిక ధోరణులను సరిదిద్దటానికి 'దిద్దుబాటు కార్యక్రమం' తీసుకున్నం. క్లాసులు నడిపినం. విమర్శ-స్వయం విమర్శలు గ్రామాల వరకూ నడిపినం. ఏ సంఘంలోనూ సభ్యుడు కాని బుడతనికి పితృస్వామ్యం గురించి ఎలా చెప్పటం? వాడి వయసు చూస్తే బాలల సంఘానికి కూడా అర్హత లేదు. వేల... లక్షల..... బుడతల భావజాలాన్ని మార్చటం ఎలా? సామాజిక ఆచరణలో పితృస్వామిక భావజాలం ఎంత స్వాభావికంగా వ్యవస్థీకృతం అయిందో అంత సహజంగా స్త్రీ-పురుషులు సమానమనే నూతన ప్రజాస్వామిక భావజాలాన్ని వ్యవస్థీకృతం చేయటం ఎట్లా? మగ పనులు - ఆడ పనుల నడుమ గీయబడిన లక్ష్మణ రేఖలను తుడిచేయడం ఎట్లా? ఆచరణలో తేవలసిన మార్పు గురించి ఆలోచిస్తుండగానే మరో మజిలీ వచ్చేసింది.

* * *

2001 సంవత్సరం మార్చి నెలలో భా.క.పా.(మా-లె) (పీపుల్స్‌వార్) 9వ కాంగ్రెసు జరిగింది. ఆ కాంగ్రెసు భారత విప్లవ పురోగమనంలో గుణాత్మక గెంతులు తెచ్చే చారిత్రక నిర్ణయాలు తీసుకున్నది. ప్రాంతాలవారీగా రాజ్యాధికారం నెలకొల్పే లక్ష్యంగా దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా మార్చాలనే కర్తవ్యం తీసుకున్నది. గెరిల్లా బేసులలో బీజ రూపంలో

రాజ్యాధికారాన్ని స్థాపించే కృషిలో భాగంగా విప్లవ ప్రజా సమితుల నిర్మాణం ప్రారంభమయింది. పిండరూపంలో రాజ్యాధికార అంగాలైన 'జనతన సర్కార్లు' గ్రామాలను నడిపిస్తున్నవి. న్యాయ, రక్షణ, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్యా-సాంస్కృతిక శాఖలు ఈ సర్కార్లకు పట్టుగొమ్మలు.

* * *

మాడ్ డివిజన్ ఇంద్రావతి ఏరియాలో నడుస్తున్న భుంకాల్ స్కూలు అది.

ముదురు నీలం రంగు పాంటులు, ఆకాశం రంగు చొక్కాలు వేసుకున్నారు. అంతా కలగాపులగంగా కూర్చున్నారు. అమ్మాయిల బెంచీలు, అబ్బాయిల బెంచీలు విడిగా లేవు. అందరూ క్రాపులతో ఉండి ఎవరు ఆడ, ఎవరు మగ గుర్తించటం కష్టంగా ఉంది.

పూసు, మెస్సి, పుయిసు, మాంచులు భుంకాల్ స్కూలు టీచర్లు.

పుయిసు టీచరు క్లాసు నడుస్తున్నది. పిల్లల చేతుల్లో 'గోండి భాష కరియకడ్' (గోండి భాష నేర్చుకుందాం) పుస్తకం కనిపిస్తున్నది. పుయిసు ఒక్కో వాక్యం చెపుతుంటే పిల్లలంతా వల్లె వేస్తున్నారు.

'అమ్మ పొలం దున్నుతుంది
నాన్న ఊయల ఊపుతాడు
చందు అన్నం వండుతాడు
రామె అన్నం వడ్డిస్తుంది.
పెదనాన్న బియ్యం చెరుగుతాడు'.

సమయం పన్నెండు కావస్తున్నది. మధ్యాహ్నం భోజనం సమయం అయింది. మానిటర్ రాజు ప్రకటించింది 'కామ్రేడ్స్! అన్నం తిన్న తర్వాత గంట విశ్రాంతి తీసుకుని అందరూ కట్టెలు తేవాలి. 3.00 గంటలకు గ్రౌండ్‌కి రావాలి' అని.

* * *

పిల్లలంతా సబ్బుతో చేతులు కడుక్కుని ఎవరి ప్లేటు వాళ్లు తీసుకుని లైన్లో నిలబడ్డారు. ఆ రోజు వంట డ్యూటీలో రామాల్, కోసిలు ఉన్నారు. కోసి పప్పు వడ్డిస్తుంటే రామాల్ కూర వడ్డిస్తున్నాడు. అన్నాలు తిన్న తర్వాత ఎవరి ప్లేట్లు వాళ్లు శుభ్రంగా కడుక్కుని తమ బ్యాగ్‌లలో సర్దుకున్నారు.

అన్నం తిన్న తర్వాత వంటగది ఊడ్చే పని ప్రతిరోజు ఇద్దరికి వేస్తారు. ఆ రోజు డ్యూటీ లచ్చు, సిగినిలకు పడ్డది. అరగంటలో కిచన్ హాలంతా శుభ్రం చేసి విశ్రాంతి తీసుకోవటానికి వెళ్ళిపోయారు.

* * *

3.00 గంటలకు అందరూ గ్రౌండ్‌కి చేరారు. ఈ రోజు డ్రిల్లు చేయించే పని జైని వంతుకు వచ్చింది. 'జండా ప్రొటోకాల్' డ్రిల్లు చేయిస్తున్నది. ఎత్తుల వారీగా నిలబెడుతున్నది. కుడి నుండి ఎడమకు ఒకే వరుసలో అందరూ నిలబడ్డారు.

'సావధాన్'

'విశ్రాం'

'సావధాన్' తర్వాత ఒకటి రెండు మూడు నెంబర్లు ఇప్పించింది.

'ఏక్ దో తీన్ గిన్తీ కరేగా.... గినతీ కర్....' జైని కాషన్ ఇచ్చింది.

'ఏక్ నంబర్ వాలె ఏక్ కదం పీఛే హటేగా. పీఛే హట్' కాషను విని ఒకటో నెంబరు వచ్చిన వాళ్ళు ఒక అడుగు వెనక్కి వేశారు.

'తీన్ నంబర్ వాలే ఏక్ కదం ఆగే బఢేగా. ఆగే బఢ్' కాషను విని 3వ నంబరు వాళ్లు ఒకడుగు ముందుకు వేశారు. 'డ్రెస్ అప్' కాషన్ విని ముందువాళ్లు పిడికిలి బిగించిన కుడిచేయి పక్కవారి భుజానికి ఆనించి నిలబడగా వారిని చూసుకుంటూ వెనకవారు వరుసలోకి వచ్చారు. ఇలా మూడు వరుసల్లో సెట్ అయినంక మళ్ళీ సావధాన్-విశ్రాం చేయించింది.

'రెడ్ శాల్యూట్స్' కాషన్ ఇచ్చింది జైని.

ఇలా నాలుగు సార్లు చేయించినంక 'విసర్జన్' కాషన్ ఇచ్చింది.

* * *

2005 ఫిబ్రవరి 10.

భుంకాల్ స్కూలు వార్షికోత్సవ వేడుకలకు రావల్సిందిగా నాకు ఆహ్వానం వచ్చింది. పిల్లలంతా కొత్త బట్టలు వేసుకున్నారు. అన్ని పనులు పద్ధతి ప్రకారం వంతుల వారీగా చక చక నడుస్తున్నాయి.

రత్నీ, సుంజులు చీపుర్లు పట్టుకుని ఊడుస్తున్నారు. క్రాంతి, రమలు జనరేటరులో కిరోసిన్, పెట్రోల్ పోసి లైట్ల కనెక్షను కోసం వైర్లు వేస్తున్నారు. ఆడ పనులు-మగ పనులు తేడా లేకుండా అందరూ అన్ని పనులూ కలబడి చెయ్యటం చూసి ముచ్చటేసి అలాగే చూస్తూ నిలబడ్డాను.

ఇంతలో అన్నం విజిల్ వచ్చింది.

అన్నం తింటుండగా పిల్లలంతా చుట్టూ చేరారు.

'ఎప్పుడొచ్చినవ్ అక్కా' అంటూ విమల పలకరిస్తూ వస్తున్నది. విమల కలవక పదేళ్లు అయిపోయింది. నా చుట్టూ చేరిన పిల్లల్లో నూనూగు మీసాల నల్లటి యువకున్ని చూపిస్తూ 'గుర్తు పట్టినవా అక్కా' అన్నది.

'నీ బుడతడు' అంటూ నవ్వుతూ చిన్నప్పటి చాయ్ గ్లాసు ఘటనను గుర్తు చేసింది. అందరం నవ్వుకున్నాం.

'బుడతడు' కూడా నవ్వుకుంటూ పోయి తను తిన్న కంచం కడుక్కుని నిలబడ్డాడు. ఎవరి కోసమో చూస్తున్నట్లు అక్కడ నిలబడ్డాడు. నా పళ్లెం కడుక్కుంటుంటే నీళ్ళందిస్తూ గుసగుసలాడాడు.

'నన్న మున్నెట లెక్క హిల్లేన్'

(నేను మునుపటిలా లేను).

***అరుణతార, మార్చి-ఏప్రిల్ 2012***

# శిక్ష

– మిడ్కో

**బో**సినవ్వులతో ఒక్కో అడుగూ వేసుకుంటూ వస్తున్నాడు సన్ను. వాడిప్పుడిప్పుడే నడక నేరుస్తున్నాడు. పగలంతా నిద్రపోయి లేచి అమ్మ దగ్గర కడుపు నిండా పాలు తాగినందుకేమో, ముఖం ఎప్పటికంటే మరింత ప్రశాంతంగా, సంతోషంగా ఉంది. సాయంకాలపు నీరెండలో దిశమొలతో ఉన్న వాడి చామన ఛాయ దేహం మెరిసిపోతోంది. దేన్నో పట్టుకోబోతున్నట్టు ఒక చేయిని ముందుకు చాచి ఒక్కో అడుగు వేసుకుంటూ వస్తున్నాడు. వాడికి ప్రతి అడుగూ ఒక పెద్ద విజయంలాగే ఉంది. ఆ విజయ గర్వంతో కళ్లు మెరుస్తున్నాయి. వాడినలా చూస్తుంటే ఎవరిలోనైనా వాత్సల్యం పొంగకుండా ఉండగలదా?

అందుకే తమ పాకలోని మంచంలో కూర్చొని ఉన్న బోక్లు తన కేసి వస్తున్న సన్నును చూసి చేతులు చాచాడు.

బోక్లు చేతులు చాచడం చూసి, సన్ను కేరింతలు కొడుతూ మరింత వడిగా అడుగులు వేయసాగాడు.

సన్ను తన దాకా వచ్చేదాకా బోక్లు నిలువలేకపోయాడు. చేతులలాగే చాచి ఉంచి మంచంలోంచి లేచి పాక బయటకు వచ్చి రెండడుగులు వేశాడు. మరొక్క క్షణమైతే ఆ బుజ్జిగాడిని రెండు చేతులతో పైకెత్తి, రెండు బుగ్గల్ని ముద్దాడి, గుండెలకు హత్తుకునే వాడే! కానీ ఇంతలో సయ్యిమంటూ వచ్చింది సన్ను వాళ్లమ్మ గులారీ. సన్నును టకీమని లేపి చంకలో వేసుకొని, "నీ పాపిష్టి చేతులతో వాన్నెప్పుడూ ముట్టుకోకు" అని కోపంగా అంటూ పక్కనే ఉన్న తన ఇంటివైపు సర సరా అడుగులేసింది.

తన స్వేచ్ఛను హరించి జబర్దస్తీగా ఎత్తుకున్నందుకేమో సన్ను ఏడుపు లంకించుకున్నాడు.

హతాశుడయ్యాడు బోక్లు. మొహం నల్ల బడింది. అప్పుడే పాక పక్కనే ఉన్న తమ ఇంట్లో నుంచి గుమ్మంలోకి వచ్చిన బోక్లు భార్య కన్ని, పాకలోనే మరో మంచంలో కూర్చొని ఉన్న బోక్లు తల్లి అడిమే చూశారాదృశ్యాన్ని.

"ఈ గులారీ ఎప్పుడూ ఇంతే. ఈయనను చూస్తేనే కళ్లల్లో నిప్పులు పోసుకుంటుంది" అంది కోపంగా కన్ని.

"ఛ! ఊరుకో ఆ పిల్ల విన్నదంటే మళ్లీ గొడవలయి పోతయి" అడిమే.

"గొడవలకు భయపడి ఎన్ని రోజులిలా నోర్మూసుకొని ఉండాలి? ఆమె ఏమన్నా పడాల్నా?" కోపమూ నిష్టూరమూ కలగలిసి పోయాయి కన్ని గొంతులో.

"నోరు మూసుకునే ఉండాలి. తప్పు చేసిన వాళ్ళం పడాల్సిందే. ఏదో ఇలానన్న ఊళ్లో ఉండనిచ్చారు. దానికి మనం సంతోషపడాలింకా..."

కన్నిలో కోపం దిగిపోవడం మొదలయింది. "తప్పు ఒప్పుకున్నాడుగా. అంత పెద్ద పంచాయితీలో ఆయన్ని క్షమించాలనీ, అందరూ ఎప్పటిలాగా ఆయన్ని తమలో కలుపుకోవాలనీ తీర్పు చెప్పారుగా... దళం వాళ్లు కూడా ఆయనతో మంచిగానే ఉంటున్నారుగా..."

"కలుపుకోవాలని చెప్పారులే ...చెప్పగానే అందరూ అన్నీ మరిచిపోయి కలుపుకుంటారా? పాపం ఆ పిల్ల ఎంత గోస పడింది."

బోక్లు తిరిగివచ్చి మంచంలో వాలిపోయి కళ్లు మూసుకున్నాడు. భార్యా తల్లి మాట్లాడుతున్న మాటలు అతని చెవుల్లో పడుతూనే ఉన్నాయి.

అతన్నలా చూస్తుంటే ఆడవాళ్లిద్దరి హృదయాలు బాధతో మూల్గాయి.

"బాధ పడకు నాయనా. కొన్ని రోజులు ఓర్చుకోవాలి ఇవన్నీ. రోజులు గడుస్తున్నకొద్దీ అందరూ మర్చిపోతారు..." అంటూ ఓదార్చసాగింది తల్లి.

యాంత్రికంగా అక్కడ్నుంచీ కదిలి ఇంటి పనుల్లో పడింది కన్ని. నెలక్రితం జరిగిన పంచాయితీలో గులారీ గట్టిగా మాట్లాడిన మాటలు ఇప్పటికీ ఆమెకు చెవుల్లో వినబడుతూనే ఉన్నాయి.

* * *

"వీళ్లను బతకనియ్యడమా? వీళ్లే జుడుం గూండాలను వెంట బెట్టుకొని వచ్చింది. వీళ్లు లేకపోతే జుడుం వాళ్లు మన ఊరికి అంత నష్టం చెయ్యగలిగేవాళ్లే కాదు.." కోపంతో ఊగిపోతున్నాడు పొజ్జాల్.

"నిజమే కానీ ఇప్పుడు తప్పు ఒప్పుకుంటున్నారుగా..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు అడమాల్. అడమాల్ అక్కడి జనతన సర్కార్ అధ్యక్షుడు.

అతని మాటలను పూర్తి చేయనీయకుండానే అందుకుంది గులారీ. "ఏందన్నా నువ్వు చెప్పేది? చేసిందంతా చేసి, ఇప్పుడు తప్పయింది అంటే సరిపోయిందా? వీళ్లను బతుకనిచ్చుడా? నరికి పోగులు పెట్టినా పాపం లేదు..." ఆవేశంతో కందిపోయిందామె మొహం.

"అవును వీళ్లను బతకనిచ్చేది లేదు చంపాల్సిందే..." కమ్లి.

"అవును చంపాల్సిందే!" అనేక మంది గొంతుల్నుంచి వచ్చిందా మాట. అందరిలోనూ ఆవేశం రగులుతోంది.

అది దండకారణ్యంలోని భైరాంగఢ్ ప్రాంతంలోని పొట్టెం గ్రామం. దాదాపు నూటా యాభై ఇండ్లున్నాయా ఊళ్లో. ఊరికి కుడివైపున ఉన్న మామిడి చెట్ల వద్ద ఆ గ్రామస్తులే కాక జనతన సర్కార్లో ఉన్న మరో నాలుగు గ్రామాల ప్రజలు ఓ అయిదారు వందల మంది గుమిగూడారక్కడ. ఆగస్ట్ మొదటి వారం కనుక ఆకాశం మబ్బు పట్టి ఉంది. మధ్యాహ్నం

గ్రామాలు రాసిన్లు పంచాయితీకి వచ్చారందరూ.

న్యాయశాఖ బాధ్యురాలు జైని పంచాయితీని నడిపిస్తోంది.

ప్రజలంతా అర్ధ చంద్రాకారంలో కూర్చుని ఉన్నారు. చిన్న చిన్న రాళ్ల మీదనో, కర్ర పేళ్ళమీదనో కూర్చున్నారు కొందరు. మరి కొందరు తమ చెప్పులనే కింద వేసుకొని కూర్చున్నారు. కొందరు మాత్రం నిలబడే ఉన్నారు. వాళ్లకు ఎదురుగా బోక్లు, మంగాల్‌లు తలవంచుకొని కూర్చున్నారు. వాళ్లకి కుడివైపున అడమాల్‌తో పాటు మరికొందరు జనతన సర్కార్ సభ్యులూ, గెరిల్లా దళ సభ్యులూ ఉన్నారు. ఎడమ వైపు బోక్లు, మంగాల్‌ల కుటుంబ సభ్యులు కూర్చొని ఉన్నారు. జైని నిలబడే ఉంది.

"నిజమే వీళ్లు ఘోరమైన తప్పులే చేశారు. కానీ వీళ్లంతట వీళ్లు ఆ తప్పులు చేయలేదు. ప్రభుత్వం ఒక పథకం ప్రకారం జుడుంను తెచ్చింది. జుడుం నాయకులూ, పోలీసు ఆఫీసర్లు వీళ్ల చేత ఆ తప్పులు చేయించారు..."

ఇంకా వివరించబోతున్న అడమాల్ మాటలకు అడ్డం పడుతూ "వాళ్లు చేయిస్తే వీళ్ల బుద్ధేమయింది? అసలు వీళ్లు జుడుంలో ఎందుకు చేరారు? అప్పుడు మన మాట కాదని వెళ్లారు. మళ్లీ ఇప్పుడు ఏ మొఖం పెట్టుకొని వచ్చారు?" ఆవేశంగా అన్నాడు సోమాల్.

"తెల్సో తెలియకో, భయానికో భక్తికో చాలా మంది జుడుంలో చేరారు. ఇప్పుడు తప్పు తెల్సుకొని వస్తున్నారు. తప్పు తెల్సుకున్న వారిని మనం క్షమించాలి కదా..." మరో జనతన సర్కార్ సభ్యుడు జుగ్రు.

"తెలియక పోవడం ఏముంది? కమిటీ వాళ్లు మీరంతా మీటింగు చేసి చెప్పారు కదా..." గులారీ.

"మనం చెప్పినా గానీ అప్పటి పరిస్థితి ఎలా ఉంది? శత్రువు పెద్ద ఎత్తున ప్రచారం కూడా చేశాడు కదా. ఆ ప్రచారాన్ని చాలా మంది నమ్మారు..." జుగ్రు.

"జుడుంలో కలిస్తే కల్సారు. కల్సి ఏమన్నా మామూలుగా ఉన్నారా? ఎస్.పి.ఓ.ల్లో చేరారు. ఎన్నిసార్లు మన ఊరి మీద దాడులు చేయించారు? ఎన్ని ఇళ్లను తగుల బెట్టారు? ఎన్ని పంటలను నాశనం చేశారు? ఎందర్ని చంపారు? ఎంత మంది ఆడవాళ్లను బలాత్కారం చేయించారు?" ఆవేశం ఆగడం లేదు సోంవారీకి.

"మనూళ్లో అయిదుగురు ప్రాణాలను నిలువునా తీశారు. అయిదుగురు ఆడవాళ్లను బలాత్కారం చేశారు..." ఇడిమే అందుకుంది.

ఇడిమే ఆ మాటలంటున్నప్పుడు గులారీ, కమ్లి, ఐతేల్లో ఒకేసారి కోపమూ, దుఃఖమూ ముంచుకొచ్చాయి. వాళ్లు ముగ్గురూ అత్యాచారానికి గురయ్యారు. మరో ఇద్దరు యువతులు ఆ పీడకల నుంచి పారిపోవడానికి ఊరు వదిలి లోతట్టుగ్రామాల్లోని తమ బంధువుల ఇండ్లల్లో ఉంటున్నారు.

"సల్వాజుడుం దాడుల్లో మనూరికి చాలా నష్టమే జరిగింది. గానీ వీళ్లు స్వయంగానైతే ఎవర్నీ చంపలేదనీ, బలాత్కారం చేయలేదని మనకు తెల్సు కదా..." అడమాల్.

"వాళ్లు స్వయంగా చంపకపోవచ్చు. కానీ వీళ్లు తీసుకువచ్చిన మూకనే కదా అవన్నీ చేసింది..." సోంవారీ.

నిలబడి ఉన్న జైని అటూ ఇటూ కదులుతూ ప్రజల వాదనలూ వాళ్ల హావభావాలూ పరిశీలించసాగింది. ఆమెక్కూడా నిజానికి దోషులను విడిచిపెట్టకూడదని బలంగా ఉంది. అలా వాదిస్తున్న వారితో చేరి తన వాదనలు కూడా గుప్పించాలని ఉంది. కానీ న్యాయశాఖకు బాధ్యురాలిగా ఉన్న తను తన వ్యక్తిగత వాదనలను వినిపించడానికి వేదిక అది కాదని తెలుసు కనుక తనను తాను బలవంతంగా నిగ్రహించుకుంటోంది.

కమిటీ సభ్యులు ఎంత చెప్పినా ప్రజలు సమ్మతించక పోవడంతో దళ కమాండర్ మంగ్తు లేచి నిలబడ్డాడు. అతను ఉపన్యాస ధోరణిలో మాట్లాడ్డం మొదలు పెట్టాడు.

"కామ్రేడ్స్! ఒకసారి నేను చెప్పేది వినండి, విని ఆలోచించండి... సల్వాజుడుం మొదలైన కొత్తలో ప్రజల్లో భయాందోళనలు విపరీతంగా ఉండేవి. ఆ భయాన్ని మరింత పెంచుతూ దాని గురించి విపరీతమైన ప్రచారం ఉండేది. ఇక్కడ నక్సలైట్లను పూర్తిగా రూపుమాపుతామనీ, ఇవ్వాళ కాకపోతే రేపైనా ప్రజలందరూ శిబిరాల్లో చేరాల్సిందేననీ... ఇలా ప్రచారం జరిగినప్పటికీ చాలా మంది ప్రజలు ధైర్యంగానే నిలబడ్డారు. ఈ గడ్డను వదిలి వెళ్తే తమకు బతుకు లేదనుకున్నారు. కాబట్టి చావో బతుకో ఇక్కడే ఉండి పోవాలనుకున్నారు. కానీ కొందరు భయపడ్డారు. కొందరు అయోమయంలో పడ్డారు. ఇక్కడ ఉంటే అనవసరంగా చచ్చిపోతాం కదా అనుకున్నారు. పార్టీ కూడా తుడిచిపెట్టుకుపోవడమో, లేదంటే ఇక్కడి నుండి రిట్రీట్ అయిపోవడమో జరుగుతుందనుకున్నారు. దానితో జుడుంలో చేరిపోయారు. జుడుంలో చేరిన తర్వాత ఇక వాళ్లకు స్వేచ్ఛం ఉంటుంది? వాళ్లు ఎస్.పి.ఓ.ల్లో చేరమంటే ఎస్.పి.ఓ.ల్లో చేరాల్సిందే, గూండాల్లో చేరమంటే గూండాల్లో చేరాల్సిందే. కొందరు ఇష్ట పూర్వకంగానే చేరవచ్చు. కానీ కొందరు బలవంతంగా అయిష్టంగానే చేరారు. కానీ వాళ్లు భయపడ్డట్టు పార్టీ ఇక్కడ తుడిచిపెట్టుకుపోలేదు. మన ప్రతిఘటన పెరిగింది. అంతేకాదు జుడుంలో చేరినవాళ్లు తిరిగి తమ గ్రామాలకు రావాలని మనం పిలుపునిచ్చాం. దానికి తోడు శిబిరాల్లో అత్యాచారాలను భరించలేకపోయారు. అక్కడి రోత బతుకు మీద ఏవగింపు పుట్టింది. దానితో చాలామంది సరిగ్గా ఆలోచించడం మొదలుపెట్టారు. తిరిగి వచ్చి ఇక్కడే పి.ఎల్.జి.ఎ. రక్షణలో బతకాలనుకుంటున్నారు. ఇదొక మంచి పరిణామం. మొదట పొరపాటు చేసినా దాన్ని దిద్దుకోవడానికి సిద్ధపడుతున్నారు. మన పార్టీపై మన పోరాటంపై ప్రజల్లో పెరిగిన విశ్వాసానికి సూచిక ఇది. మరి ఇటువంటి ప్రజలను మనం కలుపుకోవాలా, దూరం చేసుకోవాలా? మనం కలుపుకు రావల్సిన వాళ్లను దూరం చేసుకోవడం ఉద్యమానికి నష్టమా? కాదా? అయితే జుడుంలో చేరి మరీ విచ్చలవిడిగా హత్యలూ, అత్యాచారాలూ చేసిన వారినీ, క్రూరంగా ప్రవర్తించిన వారినీ క్షమించాలని మనం అనుకోవడం లేదు. బోక్కు, మంగాల్‌లు ఎస్.పి.ఓ.ల్లో చేరారు. నిజమే! మూడు నెలలు పనిచేశారు. జుడుం మూకను మన గ్రామాల్లోకి తీసుకువచ్చారు. ఆ సమయాల్లో జుడుం మూక ఇక్కడ హత్యలూ, అత్యాచారాలు చేశారు. కానీ స్వయంగా

[illegible] చేయలేదు. శిబిరంలో కూడా ప్రజల్ని కొట్టారు గానీ మరీ క్రూరంగా ప్రవర్తించినట్టు, హత్యలూ, అత్యాచారాలు చేసినట్టు మనకు రిపోర్టు లేదు. మన పిలుపుకు స్పందించి వచ్చారు. [illegible] వీళ్లు చేరారే గానీ వీళ్ల కుటుంబాలు ఇక్కడే మనతోనే ఉన్నాయి. సంఘంలో పనిచేసినపుడు కూడా వీళ్ల నడవడిక మంచిగా ఉండింది. వీళ్ల మీద ఎవరికీ ఏ వ్యతిరేకత లేదు కదా. వాళ్లు చేసిన తప్పును ఒప్పుకుంటున్నారు. కనుక వాళ్లను క్షమించి వదిలేస్తే మంచిదని పార్టీ అభిప్రాయం, జనతన సర్కార్ అభిప్రాయం కూడా అదే. మన పిలుపుకు స్పందించి వచ్చిన వారిని మనం చంపితే ఇంకెవరైనా శిబిరాలను వదిలి రావడానికి సిద్ధపడుతారా అనేది కూడా ఆలోచించండి. మా అభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకొని మరోసారి మీరు సరిగా ఆలోచించి మీ నిర్ణయం తెలియజేయండి" అంటూ అందరినీ పరిశీలనగా చూస్తూ నిలబడ్డాడు.

మంగ్తు మాటలు కొందరికి సబబుగానే అన్పించాయి. వారిలో ఆవేశం స్థానంలో ఆలోచన మొదలైంది. కానీ కొందరు మాత్రం ఆమోదించలేక పోతున్నారు. గులారీకి కూడా మంగ్తు మాటలు నచ్చలేదు.

"మీకేం మంగ్తు దాదా మీరలాగే చెప్తారు. వీళ్లు మిమ్మల్నేం చేయలేదు కదా. వాళ్లు కొట్టింది మమ్మల్ని, చంపింది మమ్మల్ని, కరాబ్ చేసింది మమ్మల్ని" నిష్టూరమూ కోపమూ దుఃఖమూ కలగలసి జీరపోయిందామె గొంతు.

సమాధానంగా మంగ్తుకు నోట మాట రాలేదు. గాయపడ్డట్టుగా ఆమె వైపు చూశాడు.

"మరీ అంత అన్యాయంగా మాట్లాడకు గులారీ. మన బాధ, పార్టీది కాదా? మన కోసం కాకపోతే పార్టీ ఎందుకున్నట్టు?" అడమాల్.

గులారీ ఆ మాటలందే కానీ అనేసిన మరు క్షణమే "అయ్యో అలా అనకుండా ఉండాల్సింది. మంగ్తు దాదా ఎంత బాధ పడుతాడో" అనుకుంది.

అలా మాట్లాడినందుకు మనసులో పశ్చాత్తాప పడింది గానీ వాళ్లను చంపాలనే ఆమె నిర్ణయం కించిత్తు కూడా మారలేదు. రెండు నెలల క్రితం బోక్లు, మంగాల్‌లు తీసుకువచ్చిన జుడుం మూక తన చేతిలోని నెలల పసివాన్ని లాగిపారేసి తనను అత్యాచారం చెయ్యడాన్ని ఆమె ఎలా మరిచిపోగలదు? ఆ రోజు పక్కనే తన బిడ్డ కేరు కేరుమని గొంతు చిట్లేలా ఏడ్వడం, తన పెనుగులాట... అదంతా ఆమెకింకా పచ్చిపుండు లాగే ఉంది.

"ఎస్.పి.ఓ.ల్లో చేరినా గానీ మామూలుగా ఉంటే విడిచిపెట్టినా ఏం కాదు గానీ, వీళ్లు కర్రె ఉంగాల్ గాడితో రాసుకుపూసుకు తిరిగారుగా. వాడెంత పాపిష్టోడు? వాడితో అంత మంచిగా ఉన్నారంటే ఇక వీళ్లు ఎన్ని పాపిష్టి పనులు చేసి ఉంటారో మనం ఆలోచించాలి..." గంగాల్.

కర్రె ఉంగాల్ పేరు వినగానే పుండు మీద కారం చల్లినట్టయింది గులారీతో సహా చాలా మందికి. వాడు తనతో పశువులా ప్రవర్తించడం, మిగతా వారిని కూడా పశువుల్లా పురిగొల్పడం... మరో సారి జుగుప్స పాకింది గులారీకి.

కర్రె ఉంగాల్ ఇక్కడ ఉద్యమం బలపడేంత వరకూ భూస్వామిగా ఉన్నాడు. పరమ

క్రూరుడు. ఉద్యమం అతని కోరలు పీకేసింది. అప్పటి నుండీ అదను కోసం ఎదురు చూస్తూ అణగిమణగి ఉన్నాడు. ఇప్పుడు మళ్లీ జుడుంలో పడగ విప్పాడు. పొట్టెంకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండే జాంగ్లా రాహత్ శిబిరంలో ఉంటూ గ్రామాల మీద దాడుల్లో చురుగ్గా పాల్గొంటూ పరమ క్రూరుడైన సల్వాజుడుం నేతగా పేరు గాంచాడు.

"నువ్వేమయినా చెప్పు మంగ్తు దాదా. వాళ్లను ఉంచేదిలేదు" గులారీ గొంతు స్థిరంగా ఉంది. మరికొందరు ఆమె మాటను నొక్కి వక్కాణించారు.

మంగ్తు మాటలు విని అందరూ వాళ్లను వదిలేద్దామంటారేమోనని భయపడుతున్న శైని, వాళ్ల మాటలు విని "హమ్మయ్య" అనుకుంది. సంతోషాన్ని ఆమె మొహం దాచలేక పోతోంది.

"కామ్రేడ్స్ మీ కసిని నేనర్థం చేసుకోగలను. మీరు పొందిన బాధ నుంచి మీకా కసి పుట్టడం సహజమే. కానీ ఈ విషయాన్ని మనం వ్యక్తిగతంగా తీసుకోవద్దు. పార్టీ వైఖరిని ముందుకు తీసుకు పోవాలని ఆలోచిస్తే మంచిది. జుడుం నాయకులను చంపాలనేది, జుడుం శిబిరాల్లో చేరిన సాధారణ జనం తిరిగి వస్తే క్షమించాలనేది,అలాగే ఎస్.పి.ఓ.లు గూండాలుగా పనిచేసినప్పటికీ క్రూరంగా ప్రవర్తించని వాళ్లు వాళ్లంతట వాళ్లే లొంగిపోతే వాళ్లను క్షమించాలనేది, ఇలాంటి వాళ్ళను మనం మనలో కలుపుకొని మన పనుల్లో భాగం చేసి రాజకీయంగా ఎదిగేలాగా తోడ్పడడం మన పార్టీ వైఖరి కదా. వీళ్లు కూడా గైడ్స్‌గా పని చేశారు. ఇండ్లను తగులబెట్టారు... ప్రజలను కొట్టారు... కానీ ఎవర్నీ చంపలేదు. అత్యాచారం చెయ్యలేదు. కర్రె ఉంగాల్‌కు సన్నిహితంగా ఉన్నారు. అది వాళ్లు కూడా ఒప్పుకున్నారు కదా. వీళ్లు సంఘంలో పనిచేశారు కాబట్టి చంపుతారేమోనని భయపడి వాడిని కొంచెం మంచి చేసుకున్నామని. ఇప్పుడు వీళ్లను చంపితే మనం మన పార్టీ వైఖరికి వ్యతిరేకంగా ప్రవర్తించినట్టు అవుతుంది..." మంగ్తు.

"ఏమో వీళ్లు నిజంగా మారే వచ్చారో లేదంటే ఆ కర్రె ఉంగాల్ గాడు ఏమన్న ప్లాను ప్రకారం వీళ్లను పంపాడో..." కమ్లి.

"లొంగిపోతే ఏం చేయమని మనం ప్రకటించేప్పటికి ఇలా కూడా నాటకం ఆడుతున్నారేమో..." ఐతే

"అలా ఏమన్నా మోసం చేసే ఉద్దేశం ఉంటే మనం పరిశీలించుకుందాం. ఇక్కడ కమిటీ ఉంది... మిలీషియా ఉంది... ప్రజలున్నారు... వీళ్ల ప్రతి చర్యను గమనిస్తూ ఉండాలి. వాళ్లను పూర్తి స్వేచ్ఛగా వదిలెయ్యం కదా. కొన్ని షరతులు పెడుతాం. ఏ ఊరికి వెళ్లొద్దనీ... కొత్తవాళ్లెవరితో మాట్లాడొద్దనీ..."

"అవును అలా షరతులు పెడితే బాగానే ఉంటుంది..." అని ఒకరంటే మరి కొందరు "అవునవును..." అన్నారు.

"సరే చంపలేదు... కానీ ప్రజలనైతే కొట్టారుగా... ఇండ్లనైతే తగుల బెట్టారుగా... మరీ ఏ శిక్ష ఉండొద్దా?" అని ఒకరనేప్పటికి "ఔను ఉత్తిగనే ఎలా వదిలేస్తాం?" అన్నారు మరి కొందరు.

కొద్ది సేపట్లో అక్కడంతా గోలగోలగా తయారైంది. మాటలన్నీ కలగాపులగంగా కలిసి పోతున్నాయి. ఎవరేం అంటున్నారో అర్థం కావడంలేదు.

జైనికి తన బాధ్యత గుర్తొచ్చింది. "కామ్రేడ్స్ గోల గోల చెయ్యొద్దు. ఒకరి తర్వాత ఒకరు మాట్లాడండి " అని రెండు మూడు సార్లు అరిచేప్పటికి గొడవ కాస్త సద్దుమణిగింది.

"చంపకున్నా గాని ఏమన్న శిక్ష అయితే ఉండాల్సిందే ..." అని ఒకరంటే "అవును ఉండాల్సిందే" అన్నారు మరికొందరు కోరస్‌గా.

అరే మంగ్తు దాదా మాటలు వీళ్ల మీద బాగానే పనిచేశాయి. ఇప్పటిదాక చంపాల్సిందే అన్న వాళ్లు ఇప్పుడు ఒక మెట్టుదిగి చంపకున్నా గనీ ... అంటున్నారు విచారంగా అనుకుంది జైని.

"ఏం శిక్ష వేద్దామో చెప్పండి" అంది నీరసంగా.

"బాగా కొట్టి వదిలేద్దాం..."

"అవునవును కొట్టి వదిలేద్దాం..."

"కొట్టి వదిలెయ్యడమా... వీల్లేదు చంపాల్సిందే..." అన్న గులారీ మాటలకు మరి కొన్ని గొంతులు గట్టిగా మద్దతునిచ్చాయి.

జైనికి నీరసం ఎగిరిపోయింది. మళ్లీ వాతావరణం గోల గోలగా తయారయింది.

మళ్లీ జైని, రెండు మూడుసార్లు అరిచి పరిస్థితిని అదుపులోకి తెచ్చింది. ఇక పంచాయితీని ముందుకు తీసుకుపోదల్చిందామె. కొంచెం పక్కకు వెళ్లి మిగతా కమిటీ సభ్యులను దగ్గరికి పిల్చి గుస గుసలాడింది. మళ్లీ అందరి ఎదుటకు వచ్చింది.

బోక్లు, మంగాల్‌లు పంచాయితీ మొదలైనప్పటి నుంచీ తల నేలకేసే వాల్చి కూర్చున్నారు. ఒక రకమైన నిర్లిప్తత ఆవరించింది వాళ్లను. వాళ్ల కుటుంబ సభ్యుల మొహాలు మాత్రం దీనంగా ఉన్నాయి. చంపాలని వాదిస్తున్న వాళ్లకేసి "అయ్యో కొంచెం కనికరించండి" అన్నట్టు చూస్తున్నారు. బోక్లు, మంగాల్‌ల కేసి "అయ్యో వీళ్లేమయిపోతారో..." అన్నట్టు చూస్తున్నారు.

"సరే కామ్రేడ్స్. విషయమైతే అందరికీ స్పష్టంగానే అర్థమైంది. అందరూ అన్ని రకాల వాదనలు విన్నారు. ఇకిప్పుడు మెజారిటీ నిర్ణయం ప్రకారం చర్య తీసుకుందాం. కొందరు చంపాలంటున్నారు.. మరి కొందరు కొట్టి వదిలెయ్యాలంటున్నారు. కాబట్టి చంపాలనే వాళ్లు చేతులెత్తండి..." అందామె అన్ని వైపులా చూపుల్ని తిప్పుతూ ప్రజల్ని పరిశీలనగా చూస్తూ.

బోక్లు, మంగాల్‌ల మొహాల్లో ఏ భావమూ వ్యక్తం కావడంలేదు. ఇప్పుడు పైకి లేచే చేతులు తమ చావు బతుకులను నిర్ణయిస్తాయని తెల్సినప్పటికీ నిర్లిప్తంగా ఉండి పోయారు. నిండా మునిగాక... అన్నట్టుంది వాళ్ల పరిస్థితి. వాళ్ల కుటుంబ సభ్యుల ముఖాల్లో మాత్రం భయం స్పష్టంగా తొంగిచూసింది. ఊపిరి బిగబట్టారు వాళ్లు.

దిగ్గున పైకి లేచాయి అనేక చేతులు. జైని లెక్క పెట్టడం మొదలు పెట్టింది. అప్పటికీ బోక్లు, మంగాల్‌లు తలెత్తి చూడలేదు. వాళ్ల కుటుంబ సభ్యులు మాత్రం నెమ్మదిగా తలలెత్తి లేచిన ఆ చేతులవైపు ఆందోళనగా చూశారు. అవి చేతుల్లా కన్పించలేదు వాళ్లకి. బోక్లు,

మంగాల్‌ల మెడల మీదికి ఉరకబోతున్న కత్తుల్లాగా కనబడ్డాయి.

జైని లెక్క పెట్టడం ముగించి, "ఇప్పుడు కొట్టి వదిలెయ్యాలనే వాళ్లు ఎంత మందో చేతులెత్తండి" అంది. చంపాలన్న చేతులు సగం కంటే తక్కువే ఉన్నాయని అర్థమై అసహనంగా ఉందామెకు.

మిగిలిన అన్ని చేతులూ పైకి లేచాయి. ముందు ఎత్తిన చేతుల కంటే ఇవి ఎక్కువ కనబడ్డంతో దోషుల కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

తప్పదు కాబట్టి జైని అయిష్టంగా లెక్క పెట్టింది.

"ఇప్పుడు కొట్టకుండా, చంపకుండా వదిలెయ్యాలి అనే వాళ్లు చేతులెత్తండి" అంది. ఇంకెవ్వరూ మిగిలి లేనట్టున్నారు అనుకుంటూ.

ఒక్క చేయి కూడా లేవలేదు.

జైని యాంత్రికంగా తన కమిటీ సభ్యుల దిక్కు అడుగులేసింది. మంగ్తు, అడమాల్, ఊగ్రు తదితరులు కూడా వాళ్లతో చేరారు. అందరూ కాసేపు తర్జన భర్జన పడ్డారు. తర్వాత జైని చెప్పడంతో మిలీషియా సభ్యులు వెళ్లి ఓ రెండు వెదురు కర్రలను నరికి తెచ్చి ఇద్దర్నీ కొట్టడం మొదలు పెట్టారు.

జనాన్ని కొట్టనిస్తే చంపుతారని మంగ్తు హెచ్చరించడం వల్ల కొట్టే పనిని మిలీషియా వాళ్లకు అప్పజెప్పిందామె. ఆ మిలీషియా వాళ్లకు మంగ్తు ముందే జాగ్రత్తలు చెప్పాడు. మరీ ఎక్కువగా కొట్టవద్దని. మంగ్తు కసలు వాళ్లను కొట్టడం ఇష్టం లేదు. అలా కొడితే వాళ్లలో వ్యతిరేకత వస్తుందని అతని ఉద్దేశం. కానీ ప్రజా కోర్టు నిర్ణయానికి అతనూ తల వంచాడు. వాళ్లను చంపకూడదనే పార్టీ వైఖరిని మెజారిటీ ప్రజల చేత ఆమోదింప జేయడమే ఒక విజయంగా అతను భావించాడు.

మిలీషియా వాళ్లు కొట్టడం మొదలు పెట్టగానే ఆవేశం ఆగని జనంలోంచి కొందరు పరిగెత్తుకుంటూ వెళ్లి వాళ్ల చేతుల్లోని కర్రలు లాక్కొని కొట్టడం మొదలు పెట్టారు. మరి కొందరు మరిన్ని కర్రలను తీసుకు వచ్చి కొట్ట సాగారు. కొందరు పిడికిళ్లతో గుద్దసాగారు. మరి కొందరు కాళ్లతో తన్న సాగారు. అలా అక్కడ ఒక గుంపు తయారైంది. దోషుల కుటుంబ సభ్యుల్లో కొంత మంది లేచి ఆ గుంపు చుట్టూ తిరుగుతూ "ఇంక చాలు కొట్టకండి... చచ్చిపోతారు" అని వేడుకోసాగారు. మరి కొందరు కుటుంబ సభ్యులు మాత్రం కదలకుండా అలాగే కూర్చుండిపోయారు విచారంగా. ఆ మాత్రం శిక్ష వాళ్లకు ఇక ఎలాగూ తప్పదన్నట్టుగా.

మంగ్తు చెప్పిన జాగ్రత్తలేవీ జైనికి గుర్తు రావడంలేదు. అలాగే చూస్తూ నిలుచుంది. మంగ్తు పురమాయింపుతో అడమాల్ వచ్చి ఆ దెబ్బలను ఆపాడు.

* * *

చిన్నబోయిన మనసుతోనే వంట పూర్తి చేసింది కన్ని. చీకటి పడుతూనే పొయ్యి వెలుతురులో అందరూ భోజనాలు చేశారు.

అన్యమనస్కంగానే తిన్నట్టు చేసి కడుక్కున్న చేతుల్ని భుజం మీది తువ్వాలకు

తుడుచుకుంటూ ఇంటి ముందటి పాకలోకి వెళ్తున్న బోక్లుకు మంగాల్ వస్తూ కనిపించాడు.

"ఏరా పొద్దు పోయాక వచ్చావు? " అన్నాడు మంచంలో కూర్చుంటూ.

బోక్లు పక్కనే కూర్చుంటూ "ఊరికనే ఏం తోచక వచ్చానులే..." అని కాసేపు నిశ్శబ్దంగా ఉండి "పొద్దుండగా వద్దామంటే... ఆ చివరి నుండి ఈ చివరి వరకూ రావాలి గదా... వస్తూంటే ఎంతో మంది ఎదురు పడుతారు... ఎవరూ పలకరించరు... చూసి మొఖం తిప్పుకుంటారు. లేకుంటే ఈసడింపుగా చూస్తారు... కొందరైతే తిట్లు మొదలు పెడుతారు... అందుకే పగలు వీధిలోకి రావాలంటే భయమైతుందిరా... అటునుండి అటే చేల్లోకి వెళ్లి వస్తున్నా అంతే ..." నిట్టూర్చుతూ అన్నాడు మంగాల్.

"ఏం చేస్తాంరా ఊరంతా వెలివేసినట్టు చూస్తుంది మనల్ని. అలాగైపోయింది మన బతుకు..." భారమైన మనసులోంచి వస్తున్న బోక్లు మాటలు మరింత భారంగా ఉన్నాయి.

"మీరనవసరంగా బాధ పడకండి నాయనా. నాలుగు రోజులు ఎలాగో భరించండి అన్నీ సర్దుకుంటాయి..." ఓదార్పుగా అంటూ పక్కనే ఉన్న మంచంలో ఓ చింపిరి గుడ్డ పరుచుకొని ఒరిగింది అడిమే.

"ఏం నాలుగు రోజులు! పంచాయితీ జరిగిపోయి నెల రోజులైంది. అయినా పరిస్థితి ఏం మారలేదు..." బోక్లు.

ఈ బాధలేమీ పట్టనట్టుగా ముగ్గురు పిల్లలూ వచ్చి మంచంలో పడుకుండిపోయారు.

"ఆ ఉంగాల్ గాడి మాయమాటలు విని మనం జుడుంలో చేరితిమి. లేకుంటే మంచో చెడో కష్టమో నష్టమో ఊరందరితో పాటు మనం ఉండే వాళ్లం కదా.." మంగాల్.

"ఇప్పుడనుకొని ఏం లాభమన్నా. వాడు మిమ్మల్ని కల్సాడని తెలియగానే నేను చెప్పలేదా? వాని మాటలు మీరు వినొద్దని. చావైనా బతుకైనా ఊరందరితో పాటు మనం ఉందామని. మీరు విన్నారా? ఊరంతా ఏట్లో కొట్టుకుపోనీ మీరు మాత్రం మంచిగా ఉందామనుకున్నారు. ఇప్పుడేమయిందీ..." ఉక్రోశంగా అంది కన్ని పిల్లల మీద దుప్పటి కప్పుతూ.

ఆమె మాటల్ని అంగీకరిస్తున్నట్టు ఇద్దరూ కాసేపు మౌనం వహించారు.

"బుద్ధి లేక వాని మాట విన్నాం. జుడుంలో కల్సి అటే ఉండి పోవాలని మేం అనుకోలేదు. అట్లా అనుకుంటే మిమ్మల్ని కూడా రమ్మనే వాళ్లం. కానీ ఒకసారి లొంగిపోయి శిబిరంలో పేరు రాయించుకుంటే ఇక ఆ తర్వాత ఇంటికి వచ్చినా జుడుం వాళ్లు ఏమీ అనరని మాకా ఉంగాల్ గాడు చెప్పాడు. కానీ తీరా వెళ్లి పేరు రాయించుకున్నాక లొంగిపోయారు కనుక ఇప్పుడు తిరిగి వెళ్తే నక్సలైట్లు చంపుతారని చెప్పి అక్కడే ఉంచేశాడు... ఇక వాడు ఆడించినట్టల్లా ఆడాం..." మెల్లగా చెప్పుకుపోతున్నాడు మంగాల్.

ఇవేవీ కన్నికి కొత్త విషయాలు కావు. భర్త ఆమెకు ఎన్నోసార్లు చెప్పిన విషయాలే. కాసేపు మౌనంగా నిలబడి మంచంలో పడుకున్న చిన్నపిల్లను భుజానేసుకొని ఇంట్లోకి నడిచింది.

కాసేపటికే అందరూ నిద్రలోకి జారిపోయారు. బోక్లు, మంగాల్‌లు మాత్రం మాట్లాడుకుంటూనే ఉన్నారు.

"నాకు ఒక్కోసారి మంచో చెడో అక్కడే ఉండిపోయినా బాగుండు అన్పిస్తోంది. ఈ వెలి బతుకు భరించలేనట్టుగా ఉందిరా..." బోక్లు.

"ఛ ఏదో ఒకసారి దారి తప్పినం. అంత మాత్రాన తప్పుడు దారిలోనే ఉండిపోతామా?"

"కానీ అందరూ మనల్ని ఎలా చూస్తున్నార్రా? పురుగుల కంటే హీనంగా చూస్తున్నారు..."

"అవుననుకో..."

అర్ధరాత్రి దాటిపోయినా ఇద్దరూ అలా మాట్లాడుకుంటూనే ఉన్నారు. తాము అనుభవిస్తున్న బాధను వెళ్లగక్కుకుంటూ ఉన్నారు.

* * *

"అప్పుడే చంపి పారేస్తే పీడాబోయేది. మేం ఎంత మొత్తుకున్నా విన్నారా మీరు?" అడమాల్‌ని ఉద్దేశించి అంటోన్న గులారీ మొహంలో ఆవేశమూ, అసహనం, అసహాయత కలగలసి ఉన్నాయి.

మంచంలో కూర్చొని ఉన్న అడమాల్ బదులివ్వలేదు, తలా ఎత్తలేదు.

"వాళ్లు మారిపోయినం అని కల్లబొల్లి మాటలు చెప్పేస్తే వీళ్లు అమాయకంగా నమ్మారు..." కుష్లి.

"ఏదో ఎత్తు వేసుకుని వచ్చుంటారు కానీ మనం వాళ్లను పూర్తిగా నమ్మలేదుగా, ఓ కన్ను వేసి ఉంచామాయే. అందుకనే ఇక లాభం లేదనుకొని చెక్కేశారు..." సోమాల్.

"ఇప్పుడు మళ్లెన్ని దుర్మార్గాలు చేస్తారో..."

"మనం వాళ్లను గట్టిగా వ్యతిరేకించినం. చంపాలని కూడా గట్టిగా మాట్లాడినం... అందుకని మన మీద పగ బట్టినా పడుతారు..." కుష్లి.

"ఛ చేతికి దొరికిన వాళ్లను వదిలేస్తిమి. ఇంక మళ్లా దొరకమంటే దొరుకుతారా.." గులారీ.

"నాక్కూడా అప్పుడు వాళ్లను చంపేస్తే మంచిదని ఉండే. కానీ ఏం చేస్తాం అందరి మాటలు విని వదిలేస్తిమి..." అనకుండా ఉండలేక పోయింది జైని.

అలా ఆ యింటి ముందు గుమికూడిన దాదాపు వంద మంది తలో మాట అనసాగారు. ఇంతలో జుగ్రు వచ్చాడు. పక్క ఊరికి పని మీద వెళ్లి వస్తున్న అతనికి దారిలోనే విషయం తెల్సింది. అందరూ బోక్లు ఇంటి వద్దే ఉన్నారని తెల్సి సరాసరి అక్కడికే వచ్చాడు. వస్తూనే మంచంలో అడమాల్ పక్కనే కూలబడుతూ మిట్ట మధ్యాహ్నపు ఎండకు పట్టిన చెమటను టవల్‌తో తుడుచుకుంటూ "ఎప్పుడు పారిపోయారు?" అనడిగాడు. అప్పటికే అతనికి దాదాపు విషయం తెల్సినప్పటికీ వివరంగా మళ్లీ తెల్సుకోవాలని.

"వాళ్లనే అడుగు" అన్నాడు ఇంటి ముందటి చెట్టు కింద బిక్కు బిక్కు మంటూ కూలబడి ఉన్న కన్ని, అడిమేల వైపు కళ్లతోనే చూపిస్తూ అడమాల్.

"పారిపోతారని మీకేం అనుమానం రాలేదా కన్నీ..." ఆమె మొహంలోకి పరిశీలనగా చూస్తూ జుగ్రు.

నెమ్మదిగా తలెత్తి జుగ్రు కేసి క్షణం పాటు చూసిందామె. మళ్లీ తలదించుకుంది. ఆమె అసలు ఏమీ మాట్లాడలేని స్థితిలో ఉంది. దగాపడిన ఆమె హృదయం బండబారినట్టయింది. ఎవరికీ మొఖం చూపించాలని కూడా లేదు ఆమెకి. కానీ మాట్లాడక తప్పని స్థితి.

"రాత్రి అన్నం తిన్నాక మంగాల్ వచ్చాడు. ఇద్దరూ మాట్లాడుకుంటూ ఇక్కడ్నే ఈ మంచంలో కూర్చుండి పోయారు. అత్త ఆ మంచంలో పడుకుంది. ఇద్దరు పిల్లలు ఈ మంచంలో పడుకున్నారు. నేను, చిన్నపిల్ల లోపల పడుకుండిపోయాం. నడిజాము దాటిపోయాక మూత్రానికని లేచి వస్తే బయట మంచం ఖాళీగా ఉంది. నాకేం అనుమానం రాలేదు..." అంటూ కన్నీళ్లు బొట బొటా రాల్చింది. అతని మీదుంచిన విశ్వాసం దెబ్బ తిన్న వేదన ఆమె మొహాన్ని కమ్మేసింది. కొంగుతో కళ్లూ, మొహమూ తుడుచుకుంటూ జీరపోయిన గొంతును స్వాధీనంలోకి తెచ్చుకుంటూ "దొడ్డికేమన్నా వెళ్లాడేమో అనుకున్నా... మళ్ళా వెళ్ళి పడుకుండిపోయాను. తెల్లారి లేచి చూస్తే కూడా కనబడలేదు. అత్తను అడిగిన. తను తెలియదంది. ఎక్కడికి వెళ్ళాడబ్బా అనుకున్నం ఇద్దరం. వస్తడేమో చూద్దాం అనుకున్నాం. జావ తాగే వేళకు కూడా రాకపోయేసరికి అడమాల్ అన్న దగ్గరికి అత్తను పొమ్మని చెప్పిన..." ఇంక చెప్పే శక్తి లేనట్టు ఆగిపోయిందామె.

"రాత్రి అప్పుడప్పుడు మెలుకువ వచ్చినప్పుడు మాటలు వినబడుతూనే ఉన్నాయి. మళ్ళెప్పుడో మెలుకువ వచ్చేప్పటికి మాటలు వినబడలేదు. వీడు లోపలికి పోయి పడుకున్నడేమో అనుకున్న... ఇంత పని చేస్తాడని అనుకోలేదు..." దుఃఖం ముంచుకొచ్చి అడిమే మాటలు ఆగిపోయాయి.

తమ ఇంటి ముందు అంత మంది ఎందుకు గుమికూడారో, తల్లీ, నాయనమ్మ ఎందుకలా ఉన్నారో, కొంచెం కొంచెం అర్థమయినట్టే ఉంది ఆరేడేళ్ల కన్ని కొడుకులిద్దరికీ. తల్లి పక్కనే బిత్తర చూపులు చూస్తూ కూర్చున్నారిద్దరూ. ఏడాదిన్నారమున్న చిన్న పిల్లకు అంతా గోలగోలగా ఉన్న ఆ వాతావరణం నచ్చకనేమో మాటి మాటికీ ఏడవసాగింది. ఆ పాప ఏడ్చినప్పుడల్లా నాయనమ్మ ఒడిలోకి తీసుకొని జోకొట్టసాగింది. కొన్ని నెలల క్రితం వరకూ అందరూ ఎంతో ముద్దు చేసే ఆ పాపాయిని ఇప్పుడెవరూ ముట్టుకోవడం లేదు.

"మీకేం అర్థం కాలేదా? ఈ రెండు మూడు రోజుల నుండీ ఏమన్నా తేడా కనబడిందా తనలో?" జుగ్రు.

"లేదన్నా మాకేమీ అర్థం కాలేదు. మంచిగానే ఉన్నాడు..."

"మంగాల్ వచ్చినప్పుడు ఏం మాట్లాడుకున్నారు? మీరు విన్నారా?"

"ఊళ్లో ఎవరూ మనల్ని నమ్మడంలేదని బాధపడుతూ మాట్లాడుకోవడం మాత్రం విన్నామన్నా... తర్వాత ఏం మాట్లాడుకున్నారో తెలియదు... ఈయనకైతే నిన్నటిదాకా ఇటువంటి ఆలోచన ఉన్నట్టే లేదు..." చెప్పి మళ్లీ తలదించుకుంది కన్ని.

ఆ మంగాలే ఏమేమో చెప్పి ఉంటాడు... కొడుకు పైన చిరు నమ్మకం రెప రెప లాడుతోంది అడిమేలో.

"ఏదో నమ్మిద్దామని వచ్చాం గానీ ఎవరూ నమ్మేట్టు లేరనే విషయం పూర్తిగా అర్థమయి

ఉంటుంది. ఇక ఇక్కడ ఉన్నా లాభం లేదు అనుకొని ఉంటారు..." సోంవారి.

"మీకే విషయం తెల్సినా దాచకండి నిజం చెప్పండి..." సోమాల్.

మరి కొందరు కూడా "అవును చెప్పండి... మీకసలు తెలియకుండా ఎలా ఉంటుంది?" అన్నారు.

"ఇంతకంటే మాకే విషయం తెలియదన్నా మమ్మల్ని నమ్మండి..." భోరుమంది కన్ని. అంత వరకూ నొక్కి పడుతూ ఉన్న దుఃఖం కట్టలు తెంచుకుంది. అడిమే కూడా గట్టిగా ఏడవడం మొదలు పెట్టింది. తల్లీ, నాయనమ్మ అంతలా ఏడవడం చూసి పిల్లలూ తల్లి మీద పడిపోయి బెదిరిపోయినట్టు ఏడవసాగారు.

"ఛ! ఊరుకో అక్కా, నిన్ను మేం నమ్ముతున్నాం. ఊరుకో..." చటుక్కున తన చంకలో ఉన్న పిల్లాడిని నేల మీద దింపేసి కన్ని ఎదురుగా కూలబడి ఆమెను దగ్గరకి తీసుకుని సముదాయిస్తూ అంది గులారీ. కన్నినలా దైన్యంగా చూస్తుంటే గులారి కెలాగో ఉంది. "వాడిని పెళ్లి చేసుకున్న ఖర్మానికి ఇలా అందరి ముందు తలదించుకోవాల్సి వచ్చింది" అనుకుంది. ముందు కన్ని, గులారీలిద్దరూ మంచి నేస్తాలే. బోక్లు జుడుంలో చేరినప్పటి నుంచి గులారీ కన్నితో ముభావంగా ఉంటోంది. పంచాయితీ తర్వాత ఇద్దరి మధ్య మాటలే లేకుండా పోయాయి. గులారీ ఓదార్చడం చూసి మరికొందరు కూడా ఓదార్పుగా మాట్లాడసాగారు. మరి కొందరు పిల్లల్ని దగ్గరికి తీసుకొని ఊరడించసాగారు.

ఇంకొందరు మాత్రం అపనమ్మకంగా చూడ సాగారు. "నిజంగా వీళ్లకేం తెలియదా? తెలియకుండానే ఉంటుందా?" అనుకోసాగారు.

కన్ని బాధతో తన బాధను పోల్చుకుంది గులారీ. తను అత్యాచారానికి గురైయింది. కానీ తన భర్త తనను అక్కున చేర్చుకున్నాడు. ఊరి ప్రజలు తనకు అండగా నిలిచారు. తనెవ్వరి ముందూ తలవంచుకోలేదు. కానీ కన్ని పరిస్థితి... కష్టసుఖాల్లో తోడుగా ఉండాల్సిన భర్త ఆమెను నట్టేట్లో ముంచి వెళ్లాడు. అతను చేసిన నేరానికి ఆమె తలవంచుకుంది. అన్నింటికంటే ఇబ్బందికరమైంది... కొందరిలోనైనా ఆమె పట్ల అపనమ్మకం ఉంటుంది. ఆనాడు ఆ చేదు సంఘటనను ఎదుర్కున్నప్పుడు తానెంత దురదృష్టవంతురాలు అనుకుంది. కానీ కన్నితో పోల్చితే తానెంత అదృష్టవంతురాలు... ఇక్కడ కన్ని ఏడుస్తున్నట్టే అక్కడ మంగాల్ భార్య కూడా ఏడుస్తుందేమో...అనుకుంది గులారీ.

* * *

"నిజం మామా! నీకబద్ధం చెప్తామా?" ఇక్కడ ఉండీ ఉండీ విసుగుపుట్టి ఓసారి ఊరు చూసొద్దమని పోయినం. పిల్లల్ని చూడాలని కూడా మనసు పీకింది. అంతేగానీ అక్కడ్నే ఉండి పోదామని అనుకోలేదు మామా. అక్కడ్నే ఉండి పోవాలనుకుంటే మళ్లీ ఎందుకు వస్తాం?" అన్నాడు బోక్లు ఎదురుగా బెంచీ మీద కూర్చొని ఉన్న కర్రె ఉంగాల్‌తో.

"మా సంగతి నీకు తెలియనిదేముంది మామా? నీకబద్ధం చెప్తామా?" మంగాల్.

అరగంట నుండి ఆ ముగ్గురి మధ్య మాటలు నడుస్తున్నాయి. అప్పటికి ఉంగాల్‌కు

బోక్లు, మంగాల్‌ల మాటల మీద నమ్మకం కుదరసాగింది.

"మరైతే ఈ మాట నాతో ముందే ఏడ్చి ఉండొచ్చు కదరా..."

"చెప్తే నువ్వు పోనీయవని చెప్పకుండానే వెళ్ళాం..."

"మీ మొహం! మీరు చెప్పింది నేనయితే నమ్ముతా గానీ ఠానేదారు నమ్మొద్దూ.."

"నువ్వే ఎలాగైనా చెప్పాలి మామా ఠానేదారుకు... "

"సరే నేను నచ్చ జెప్తా గానీ మీరయితే అక్కడికి వెళ్ళిన తర్వాత ఏమేం చేశారో, మీకు ఎవరెవరు కల్సారో... అన్నీ వివరంగా చెప్పాలి."

సమాధానంగా రెండు తలలూ ఊగాయి.

"మరి మళ్ళీ ఇలా పారిపోరు కదా..."

"ఇంక బుద్ధొచ్చింది మామా. ఒక వేళ మేం పోయినా మమ్మల్ని ఊర్లో ఎవరూ నమ్మే పరిస్థితి లేదులే... ఇప్పుడే చంపకుండా వదిలేయడం గొప్పే. అక్కడ భయపడుతూ, అందర్నీ బతిమాలుతూ బతకడం కంటే ఇక్కడే హాయిగా బతకొచ్చు..."

"మరి ఈ సారన్నా పెళ్ళాం పిల్లలను తీసుకురాలేదెందుకురా.."

"ఆడోళ్ళు ఎంత జెప్పినా వినలేదు మామా.. నక్సలైట్లు చంపుతారని భయపడుతున్నారు..." మంగాల్.

"మీరు రాకపోతే మేం ఇక్కడ్నే ఎవర్నైనా పెళ్ళి చేసుకుంటాం అని చెప్పినా వినలేదు మామా... ఇక మా దారి మేం చూసుకోవాల్సిందే..." బోక్లు.

"ఈ మాట నేనెప్పుడో చెప్పిన కదరా. హాయిగా పెళ్ళిళ్ళు చేసుకొమ్మని మీరే మా పెళ్లాలు వస్తారు వస్తారు అని చెప్పుకొచ్చారు..."

"వస్తారనే అనుకున్నం మామా..."

"సరే మరి పోదాం పదండి పోలీస్ స్టేషన్‌కు. ఠానేదారుతో మాట్లాడుదాం. అయితే మిమ్మల్ని వెంటనే మళ్లా ఎస్.పి.ఓ.లుగా చేర్చుకోక పోవచ్చు. అయినా నారాజ్ కావొద్దు. ఇక్కడ్నే క్యాంపులో అందరితో పాటు ఉండిపోండి..." అంటూ బర్మార్ భుజానికేసుకొని లేచాడు ఉంగాల్.

* * *

"ఇదిగో మామా మాంసం... తిని చూడు.." ఇంటి ముందున్న బెంచీ మీద కూర్చున్న ఉంగాల్ చేతిలో కాల్చిన మాంసం చుట్టి ఉన్న చిన్న ఆకుల మూటను పెడ్తూ అన్నాడు మంగాల్. మంగాల్ వెంటే బోక్లు కూడా ఉన్నాడు. బోక్లు చేతిలో విల్లు బాణాలున్నాయి. మంగాల్ చేతిలో గొడ్డలీ గులేర్ ఉన్నాయి.

విల్లు బాణాలతో పక్షులను జంతువులను వేటాడుతారు. అయితే పక్షులను కొట్టడానికి బాణాలు వేరుగా ఉంటాయి. పక్షులను బాణాలతోనే కాకుండా గులేర్‌తో కూడా కొడుతుంటారు. ఉడుతలు వగైరా చెట్టు తొర్రల్లో దూరితే ఆ చెట్టును నరికైనా వాటిని పట్టుకుంటారు కనుక వేటలో గొడ్డలిని కూడా ఉపయోగిస్తారు.

"ఏం మాంసంరా ..." ఉంగాల్ మొహం చాటంతయింది.

"పిట్ట మాంసం.."

వాళ్ల సమాధానం కోసం చూడకుండానే ఆత్రంగా మూటను విప్పి ఓ మాంసం ముక్కను చేతిలోకి తీసుకొని నోట్లో వేసుకున్నాడు.

గబ గబా నములుతూ "భలే ఉందిరా" అంటూ మరో ముక్కను చేతిలోకి తీసుకున్నాడు.

ఆదివాసీలు సాధారణంగా మాంస ప్రియులు. అయితే ఉంగాల్‌కు విపరీతమైన పిచ్చి అని చెప్పుకోవాలి. ఆ పిచ్చిని తీర్చుకోవడానికి తమ ఊళ్లో ఉన్నప్పుడు వేటలోనే ఎక్కువ కాలం గడిపేవాడు. రాహత్ శిబిరంకు వచ్చేశాక మనుషుల వేటకే సమయం సరిపోవడం లేదు, ఇంక పక్షుల, జంతువుల వేటను ఎలా చేస్తాడు? ఒక వేళ చేయాలనుకున్నా లోతట్టు అడవిలోకి మునుపటిలా ఒక్కడూ వెళ్ళాలంటే భయం. శిబిరం ఉన్న రోడ్డుకు కొంచెం అటూ ఇటూనే చేయాలి. శిబిరంలో ఉన్న ఎంతో మంది రోడ్డుకు అటూ ఇటూ వేట కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. కనుక అక్కడ ఏమైనా దొరకడం చాలా అరుదు. ఉంగాల్ శిబిరంలోకి వచ్చినప్పటి నుండి గ్రామాల్లోకి దాడులకు వెళ్లినప్పుడు మేకలూ, పందులూ, కోళ్లూ, బాతులూ... వగైరా ఎత్తుకొచ్చి తింటూనే ఉన్నాడు. మాంసం తినని రోజులు చాలా అరుదుగా ఉంటాయి. కానీ రక రకాల పిట్టల మాంసాన్నీ, చేపల్నీ ఆకుల్లో చుట్టుకుని కాల్చుకొని తినడంలో, పీతల్ని నిప్పుల్లో కాల్చుకొని తినడంలో ఉండే రుచే వేరు. చాలా రోజుల తర్వాత ఆ రుచిని ఆస్వాదిస్తున్నాడు ఉంగాల్. మరో రెండు ముక్కలను తిని మిగిలిన ముక్కలను పట్టుకొని లోపలికి వెళ్లాడు. ఆ నాలుగు ముక్కలను కల్లుతో నంజుకొని తినాలనే కోరికతో.

బోక్లు, మంగాల్‌లు వెను తిరిగారు.

ఆ రోజు నుంచీ బోక్లు, మంగాల్‌లు తరచూ సాయంత్రం పూట ఉంగాల్‌కు ఆకుల్లో చుట్టి కాల్చిన మాంసమో, చేపలో, నిప్పుల్లో కాల్చిన పీతలో తీసికెళ్లడం, ఉంగాల్ లొట్టలేసుకుంటూ తినడం మామూలై పోయింది. ఇంట్లో వండిన మాంసం ఉన్నా వీళ్లు తీస్కెళ్లిన దాన్నే ఇష్టంగా తినేవాడు.

ఒకరోజు బోక్లు చేతి నుండి ఆకు మూటను అందుకుంటూ "ఏరా వేట బాగా చేస్తున్నారే..." అన్నాడు.

"మాకేం పనుంది మామా... పనేం లేకుండా ఊరకనే ఎలా కూచుంటాం? అందుకనే అలా తిరిగేసి వస్తున్నాం..." బోక్లు.

"మీరేమో మమ్మల్ని ఎస్.పి.ఓ.లుగా తీసుకోక పోతిరి..." నిష్టూరంగా మంగాల్.

"మీకేం భయం లేదు. ఈ నెల వెళ్లిపోయి ఫస్టు తారీఖు రానీయండి, మిమ్మల్ని ఎస్.పి.ఓ.లుగా చేర్పిస్తా నేను. నా మాట కాదనే వాడెవ్వడిక్కడ..." మాంసం ముక్క నములుతూ అన్నాడు.

బోక్లు, మంగాల్‌ల మొహాలు వెలిగిపోయాయి. "మాకు తెలుసు మామా. నీ మాట కాదనే ధైర్యం ఇక్కడ ఏ పోలీసోడికీ లేదనీ... నీకే మా మీద దయ కలగట్లేదనుకుంటున్నాం"

గర్వంగా నవ్వుతూ మిగిలిన మాంసాన్ని తీసుకొని ఇంట్లోకి వెళ్లిపోయాడు ఉంగాల్.

మరుసటి రోజు సాయంత్రం బోక్లు, మంగాల్‌లు కాలువ వైపు వెళ్లసాగారు. అప్పటికి వాళ్ళు మళ్ళీ శిబిరంలో చేరి రెండు నెలలు కావొస్తోంది.

"ఏరా ఎక్కడికి బయల్దేరారూ?" ఎదురుపడ్డ ఉంగాల్ అడిగాడు.

"పీతలు పడుదామని వెళ్తున్నాం మామా.."

"రాత్రిపూట అయితే బాగా దొరుకుతాయి కదరా..."

"ఇప్పుడు కూడా ఫర్వాలేదు మామా..."

ఒక్క క్షణం ఆలోచించి "సరే నేను కూడా వస్తాను పదండిరా ఈ రోజు..." అన్నాడు.

"ఏం మామా పీతలు పట్టాలని సరదాగా ఉందా ఏంటి?" నవ్వుతూ అన్నాడు బోక్లు.

"ఉండదార మరి! ఎన్ని రోజులాయే వాటి జోలికి పోక.."

"సరే పోదాం రా మామా... ఈ రోజు ఫుల్లు దొరుకుతాయి. అత్తను మంచిగా పులుసు పెట్టమను..."

ముగ్గురూ నవ్వుకుంటూ కాలువ కేసి సాగారు.

కాలువ సమీపించగానే తమ చేతుల్లోని విల్లు బాణాలు గొడ్డలీ ఓ పెద్ద చెట్టుకు ఆనించి పెట్టి రాళ్లు లేపుతూ ఒడుపుగా పీతలు పట్టసాగారు మంగాల్, బోక్లు.

ఉంగాల్ సరదా పడి వచ్చాడే గానీ పీతలు పట్టకుండా వాళ్ళ వెనుక వెనుక తిరుగుతూ చూడసాగాడు. ఇంతలో మంగాల్ ఓ పెద్ద బండరాయిని కొంచెం లేపి మోకాలు మీద వంగి దాని కింద పీత కోసం చేయి పెట్టాడు. రెండు మూడు క్షణాల తర్వాత "ఒరే బోక్లూ ఈ బండను కాస్త ఎత్తు... కింద పెద్ద పీత ఉంది" అనరిచాడు. పెద్ద పీతను పట్టబోతున్న సంతోషం ఆయన మొహంలో కనబడుతోంది. బోక్లు వెళ్లి తన రెండు చేతులతో బండను ఎత్తబోయాడు గానీ పట్టు దొరకలేదు.

"ఇంకొంచెం ఎత్తు నా చేతులింకా లోపలికి పోవాలి. లోపలుంది పీత..."

"అబ్బ బండ చాలా పెద్దగా ఉంది. పట్టు దొరకడం లేదు. మామా కొంచెం నువ్వు గూడ వచ్చి ఓ చేయివేసి చూడు..." అరిచాడు బోక్లు.

ఉంగాల్ భుజానికున్న బర్మార్‌ను ఓ రాయికానించి వచ్చి వంగి రెండు చేతులతో బండను పట్టుకున్నాడు.

"ఇంకొంచెం కిందికి పట్టుకో మామా నేను పైన పట్టుకుంటా..."

ఉంగాల్ తల మరి కొంచెం వంచి తన చేతుల్ని కిందికి పోనిచ్చాడు.

బండను పట్టుకున్న బోక్లు చేతులు నెమ్మదిగా వదులుకాసాగాయి.

* * *

పిల్లలూ, ముసలివాళ్లూ తప్ప పొట్టెం గ్రామస్తులు దాదాపుగా ఊరికి కుడివైపునున్న మామిడి చెట్ల దగ్గర పొద్దున్నే జమయితున్నారు. సూర్యోదయమై ఎంతో సేపు కాలేదు. నవంబర్ నెల కావడంతో ఇంకా చలిగానే ఉంది. కానీ అక్కడ చేరిన వాళ్లెవరూ చలిని పట్టించుకోవడం

లేదు. ఏవో కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు. సమిష్టి పంటను కోయడానికి అందరూ అక్కడ జమయితున్నారు. ఊడుం విధ్వంసం నడుమనే తమ ప్రాణాల్ని ఫణంగా పెట్టి రక్షించుకున్న పంట చేలను కనులనిండుగా చూసుకుంటున్నారు. అభివృద్ధి కమిటీకి చెందిన భీమాల్ తదితరులు అక్కడ జమయిన వారిని బృందాలుగా విభజిస్తున్నారు. ఇంకాసేపయితే అందరూ పక్కనే ఉన్న పంట చేలోకి దిగేవాళ్లే.

ఇంతలో "మిలీషియా వాళ్లు వస్తున్నారే..." అన్నారెవరో.

"ఎవర్నో పట్టుకొస్తున్నట్టుంది..." అన్నారు ఇంకొకరు.

"అరె బోక్లు, మంగాల్‌లు కదూ..,"

కొద్ది క్షణాలు ఎవరికీ నోట మాట రాలేదు. తర్వాత చిన్నగా కలకలం బయలు దేరింది.

"దొరికారు దొంగలు!" సోమాల్.

"ఇంక తప్పించుకోలేరు!" భీమాల్.

అడమాల్ గుంపు లోంచి ముందు కొచ్చి నిలబడ్డాడు. బోక్లు, మంగాల్‌లను అడమాల్ ఎదుట నిలబెట్టారు మిలీషియా వాళ్లు.

"ఎక్కడ దొరికారు?" అడిగాడు అడమాల్.

"ఊళ్లోకి వస్తుంటే పట్టుకున్నాం..."

కాసేపు ఏం మాట్లాడాలో తోచలేదు అడమాల్‌కు. అనేక ఆలోచనలు గజిబిజిగా మెదిలాయి బుర్రలో. ఆవేశం ముంచుకొచ్చిందతనికి. ఆ రోజు పంచాయితీలో ప్రజలంతా చంపాలని కోరుకున్నా అందరికీ నచ్చజెప్పి వాళ్లను వదిలేసినందుకు ఆ తర్వాత తామంతా ప్రజల ముందు తల వంచుకున్న విషయం గుర్తొచ్చింది.

అడమాల్ నోట్లో నుంచి మాట బయటకు రాకముందే అక్కడున్న వాళ్లంతా తలో మాటా అనడం మొదలు పెట్టారు.

కన్ని కూడా ఆ గుంపులో ఉంది. ఆమెకు భర్తను చూడగానే కాళ్లు వణికాయి. గుండె దడ దడలాడింది. అక్కడ నిలబడలేక ఆ గుంపుకు కొంచెం ఎడంగా జరిగి కూలబడిపోయింది.

మంగాల్ భార్య కూడా అక్కడ ఉండవల్సింది కానీ ఆమె ముందు రోజే పక్క ఊరికి వెళ్లింది.

గుంపులో క్షణ క్షణానికి ఆవేశం పెరుగుతోంది. ఎన్ని మాటలన్నా వాళ్లకు సంతృప్తి కలగడం లేదు. చేతలకు సిద్ధం కాసాగారు.

ఓ రెండు దెబ్బలు వాళ్ల వంటి మీద పడనే పడ్డాయి.

"ఆగండాగండి... ముందు కొంచెం మాట్లాడనీయండి..." అడమాల్ అడ్డం వచ్చాడు.

"వాళ్లతో ఇంక మాటలేంది చంపి పారేస్తే పోతుంది!" కుమ్మి.

"అంతే! చంపాల్సిందే ఇంక వాళ్లతో మాట్లాడేదేముంది?" ఒకేసారి చాలా మంది అన్నారు.

"అరె! కాసేపాగుతారా లేదా?" గట్టిగా కసిరాడు ఉగ్రు.

"ఆ మేమాగుతాం, మీరు వాళ్లతో మాట్లాడుతారు, వాళ్లేవో కథలు చెప్తారు, మీరు

నమ్ముతారు..." ఆవేశమూ, నిష్టూరమూ, వ్యంగ్యమూ కలగలసి పోయి గులారీ గొంతు వణుకుతోంది.

"అంతే! వాళ్ళతో మాట్లాడితే కథలు చెప్పక ఇంకేం చెప్తారు?" ఎర్రగా కంది పోయింది ఐతే మొహం.

కన్ని మనసంతా అల్లకల్లోలం కాసాగింది. చంపుతారా? చంపుతారా? తన కళ్ల ముందే చంపుతారా? అయ్యో చంపొద్దని ఏ మొహం పెట్టుకొని బతిమిలాడాలి? శరీరమంతా కంపిస్తోందామెకు.

కొంత మంది కన్ని దిక్కు కుతూహలంగా చూస్తున్నారు. గులారి కన్ని వైపు చూసి వెంటనే మొహం తిప్పుకుంది. ఆమెనలా దైన్యంగా చూడ్డానికి మనస్కరించలేదామెకు. ఈ రెండు నెలల్లో గులారీ కన్నిల మధ్య స్నేహం మునుపటి కంటే మరింత బలపడింది. గులారీ కన్నికి అన్ని విధాల అండగా నిలబడింది. మొదటి పంచాయితీ తర్వాత తన భర్త ఇంట్లో ఉన్న నెల రోజుల్లో అతన్ని ఈసడించుకుంటోందని గులారీపై కన్నికి అప్పుడప్పుడు కోపం వచ్చేది. కానీ ఈ మధ్య కాలంలో గులారీ స్నేహ హృదయాన్ని మరింతగా అర్థం చేసుకుందామె.

"వింటున్నారుగా జనమంతా ఏమంటున్నారో? చెప్పండి మరి ఏం చేయాల్నో మిమ్మల్ని..." అడమాల్.

"మేం చెప్పేది కాస్సేపు వినండి తర్వాత ఏమైనా చేయండి..." అన్నాడు బోక్లు ప్రాధేయపడుతున్నట్టుగా.

"చూడు ఇప్పుడిక కథలు చెప్తారు..." అంది కుష్లి గులారీతో.

అవునన్నట్టుగా తల ఊపింది గులారీ. ఆమె చూపులు మాత్రం వాళ్లిద్దరి పైనుంచి కదల్లేదు.

"మేం పోయినం గానీ ఎస్.పి.ఓ.లుగా చేయలేదుగా..." అంటారేమో ఐతే గుసగుసగా.

"ఎస్.పి.ఓ.లుగా చేయలేదంటే వాళ్లు చేయనిస్తే వీళ్లు చేయలేదా ఏంటి? వాళ్లే ఇయ్యలేదు ఎస్.పి.ఓ. ఉద్యోగం" అన్నాడు సోమాల్ గట్టిగానే.

"ఎస్.పి.ఓ.లుగా చేయక పోతే ఏంటీ? ఉంగాల్‌తో రాసుకొని పూసుకొని తిరిగిన విషయం మనకు తెలియదనుకుంటున్నారేమో పాపం..."

"చెప్పండి మరి" అంటూ అడమాల్ అందర్నీ నిశ్శబ్దంగా ఉండమని సైగ చేశాడు.

"మేం అనవసరంగా భయపడీ, కర్రె ఉంగాల్ గాడి మాటలు విని చాలా తప్పు చేశాం. కానీ నిజంగానే ఆ తప్పు తెల్సుకొని అక్కడి నుండి పారిపోయి వచ్చాం. చంపకుండా వదిలేశారు గానీ మమ్మల్ని ఎవరూ నమ్మలేదు. మమ్మల్ని వెలివేశారు. అందుకని మీరందరూ మమ్మల్ని నమ్మాలంటే ఏం చేయాలా అని ఆలోచించాం..." కాసేపు ఆగాడు బోక్లు.

"అందరూ నమ్మాలంటే మళ్లీ పారిపోవాలి..." కుష్లి వ్యంగ్యానికి కొందరు నవ్వారు.

"పారిపోవడమే కాదు కర్రె ఉంగాల్ గాడితో రాసుకు పూసుకు తిరుగాలి... వాడికి కమ్మగా మాంసం గీంసం కాల్చిపెట్టాలి..." అందించింది ఐతే.

ఆ నాలుగు మాటలూ మాట్లాడి బోక్లు మంగాల్‌కేసి చూశాడు. ఆ చూపులనందుకొన్న మంగాల్ తన భుజానికున్న చేతి సంచీని ఎడమ చేతిలోకి తీసుకొని కుడిచేతిని సంచిలోకి పోనిచ్చి బయటకు తీశాడు.

అంతే! మాట్లాడ్డానికో, తిట్టడానికో తెరిచిన వాళ్లందరి నోళ్లు అలాగే తెరుచుకొని ఉండిపోయాయి. అందరి కళ్లూ పెద్దవయ్యాయి. ఊపిరి తీయడం మరిచిపోయారందరూ.

మంగాల్ చేతిలో తల! మనిషి తల!!

దాన్ని పక్కనే ఉన్న ఓ బండరాయి మీద పెట్టాడతను.

"కర్రె ఉంగాల్ తల..." అన్నారెవరో.

"నిజమే... నిజమే..." సంతోషం పట్టలేక అరుస్తున్నారు చాలామంది.

"మమ్మల్ని మీ అందరికీ దూరం చేసిన వాడు వీడే ... మన ఊరిని సర్వ నాశనం చేసింది వీడే... అందుకే చంపేశాం. ఇప్పటికన్నా మమ్మల్ని నమ్మండి..."

"ఎట్ల ఎట్ల చంపార్రా..." రెండు చేతులతో ఇద్దరి భుజాల్ని ఒకే సారి చరుస్తూ అడిగాడు అడమాల్ . సంతోషం పట్టలేకపోతున్నాడతను. వాన్ని చంపాలని పి.ఎల్.జి.ఎ. చేసిన ఎన్నో ప్రయత్నాలు విఫలమయ్యాయె మరి.

"మాతో పాటు పీతలు పట్టడానికి వచ్చాడు. రెండు నెలల నుంచి అవకాశం కోసం చూస్తున్నాం. రాయిని పట్టుకోమన్నాం పట్టుకోగానే గొడ్డలి తీసుకొని ఒక్క దెబ్బతో తలను తెంచాం..."

విషయం తెలిసి ఊళ్ళోని ముసలివాళ్ళూ, ఆడ, మొగ, పిల్లలూ అక్కడికి వచ్చి గోలగోలగా అరుస్తున్నారు.

'ఇక ఆపండి' అని అడమాల్ రెండు మూడు సార్లు గట్టిగా చెప్పడంతో జనం అరుపులను ఆపేశారు.

తలనేమి చేయాలనే తర్జనభర్జన తరువాత "రోడ్డు మీద పారేయవల్సిందిగా జైని చెప్పింది.

* * *

వారం తరువాత అడమాల్, జైని, జుగ్రు పక్కూరిలో మకాంవేసిన దళాన్ని కలిసి కమాండర్ మంగ్తుకు బోక్లు, మంగాల్ కలిసి కర్రె ఉంగాల్‌ను చంపిన సంగతి చెప్పారు.

వాళ్ళ కంఠాలల్లో వినిపించిన ఉద్విగ్నత, కసి, కోపం మంగ్తు గమనించాడు.

మంగ్తు దాదా సంతోషపడి 'మంచి పని చేశారని' మెచ్చుకుంటాడనుకున్నారు అందరు.

మంగ్తుదాదా ఎందుకో కొంచెం విచారంగా కనిపించాడు. తలెత్తి అందరి ముఖాలల్లోకి చూశాడు.

'అయితే ఆ తలనేం చేశారు' అన్నాడు విచారంగా..

'మనవాళ్ళు తీసుకవెళ్ళి రోడ్డు మీద వేశారు. పోలీసులు తీసుకపోయారట' జైని...

'అదే పెద్ద కిరికిరి అయ్యింది. మన ప్రజా సంఘాలను, జనతన సర్కారునూ, పార్టీనీ రాక్షసులుగా చిత్రిస్తూ మన శత్రువులు అన్ని రకాలుగా ప్రచారం చేస్తున్నారు' మంగ్తు.

'వాడు చెప్పలేనన్ని దుర్మార్గాలు చెయ్యలేదా? మన ఊళ్ళోనే అంత చేపిచ్చిండు గదా! పైగా మన మిలీషియానే వాన్ని చంపుదామనుకున్నారు కదా!' జైని.

'నిజమే జైని-మనం యుద్ధరంగంలో చంపుతాం-జుడుం చేసిన పద్ధతిలో మనం చేయకూడదు గదా! మీరే ఆలోచించండి' మంగ్తు.

ఇంతలోనే కిచెన్ నుండి నలుగురికి చాయ్‌లు వచ్చాయి.

'కామ్రేడ్స్! మన జనతన సర్కారు హింసకు తావులేని ప్రపంచం కోసం ఏర్పడినది. ఉన్నత విలువల కోసం పనిచేస్తున్నది. దెబ్బకు దెబ్బ పాత పద్ధతి. మనం చరిత్ర, గతితార్కిక పద్ధతి తెలిసినవాళ్ళం. మనం కమ్యూనిస్టులం. బోక్లు, మంగాల్‌కు శిక్ష అమలు చేసిన తరువాత వాళ్ళను మనం పట్టించుకున్నామా? వాళ్ళను ఊరువాళ్ళు దూరంగా ఉంచారు. మన జనతన సర్కారు ఏమి చేయాలి? శిక్ష తరువాత వాళ్ళకు మన పనితో కలిసి మారే అవకాశం ఇవ్వాలి గదా? మనం వాళ్ళకు ఇచ్చిన పనేమిటి? ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను పోగొట్టడానికి వాళ్ళను మన సమిష్టి వ్యవసాయక్షేత్రంలోను-మిలీషియాలోను కలుపుకొని వాళ్ళ ఆచరణను పరిశీలించి-సరిదిద్దుకునే విధంగా సహాయం చేయాల్సింది కాదా? మనం దానికోసం ఏమైనా చేశామా?' మంగ్తు ఆగిచాయ్ పూర్తి చేశాడు.

'లేదు దాదా అట్లా ఆలోచించలేదు' అడమాల్.

'వాళ్ళు ఒంటరి వాళ్ళయ్యారు... విధిలేక కర్రె ఉంగాల్ దగ్గరికి వెళ్ళారు. ఔనా! ఉంగాల్‌ను చంపి వాళ్ళ నిజాయితీని నిరూపించుకోవాలనుకున్నారు... ఉంగాలే వీళ్ళను చంపి ఉంటే ఏమయ్యేది? జనతన సర్కారు మరింత ఎక్కువ మందిని తనతో కలుపుకోవాలి, బలం పెంచుకోవాలి... వ్యక్తుల నిర్ణయాలతో కాకుండా-మనకు ఒక నిర్మాణం ఉన్నది. సర్కారు చొరవతో ఏ పనైనా చర్చించి, నిర్ణయించి చెయ్యాలె-వ్యక్తుల ఆవేశకావేశాలతో నిర్ణయాలు కాకుండా-జనతన సర్కారు తన పనివిధానం మెరుగుపరుచుకోవాలి.

'వాని పీడ విరగడైంది గదా!' జైని...

'వాని పీడ విరగడ కావాల్సిందే-ఆ పని బోక్లు, మంగాల్ ప్రజా మిలిషియాతోపాటు చేస్తే-అది సమిష్టి నిర్ణయంతో అయితే. అట్ల తలలు తేవడం, ప్రదర్శించడం మన పద్ధతి కాదు... మనం కోపంతో, కసితో ఆ పని చెయ్యం. వాడి హింసనాపడానికి చేస్తాం. అదీ తప్పనిసరైతే-తక్కువ రిస్కుతో చేస్తాం. హింస మన ప్రవృత్తి కాదు. మనం అడవంత స్వచ్ఛమైన వాళ్ళం... మనం జనతన సర్కారుతో కొత్త లోకాన్ని నిర్మాణం చేసేవాళ్ళం. అట్లా ప్రదర్శించడం మన పద్ధతి కాదు. జనానికి-మన సంఘ సభ్యులకు ఈ తేడా చెప్పాలి. ఈ దిశలో మన జనతన సర్కార్లు తమతమ బాధ్యులతో చర్చించి నేరము-శిక్ష గురించి మరింత లోతుగా చర్చించాలని కోరుకుంటూ-రాబోయే కాలాలలో మరింత బాధ్యతగా ఉండాలని కోరుకుంటున్నాను.'

ముగ్గురు సెలవు తీసుకొని వాళ్ళ ఊరికి బయలుదేరారు.

ఆ ముగ్గురు మంగ్తు తమను అభినందిస్తాడనుకున్నారు. 'ఇట్లా మాట్లాడడం' మొదట

అర్థం కాలేదు. దారి పొడుగునా మాట్లాడుకుంటూనే ఉన్నారు.

'ఈసారి న్యాయబాధ్యులకు డివిజన్ మొత్తం ఒక మీటింగు పెట్టి ఇలాంటి విషయాలు చెప్పాలని కోరాలని' జైని మనసులో అనుకున్నది.

'బోక్లు, మంగాల్‌కు ఏ పనులు ఇవ్వాలి?' అడమాల్ మనసులో...

జుగ్రుకు ఇదంతా అర్థమై కానట్టే ఉన్నది.

* * *

***అరుణతార జనవరి-ఫిబ్రవరి 2012***

# నందె

– టుంబ్రి

"ఆలెరీ, దట్‌రీ, దట్" (పదండీ, పదండి") నందె హుషారు చేస్తూ అంది. "మాటు వాయోమ్. (మేము రాము) అని చాలా గొంతులు ఒక్కసారిగా అన్నాయి.

"బారి వావిరి? బాలె అత్త మీకిన్" (ఎందుకు రారు? ఏమైంది మీకు) అడిగింది, వాళ్ళు అలా అంటారని ఊహించని నందె. ఎందుకంటే సంఘం మాటను ఊరివాళ్ళు ఎప్పుడూ తిరస్కరించలేరు.

"అగ్గ పోలీసీర్ ఉద్దింతోర్" (అక్కడ పోలీసులు కూచుంటారు) సోమె అన్నది.

"ఇప్పటికి మూడు రోజులవుతుంది. ఎవరూ కూచోర్లే. పదండి" నందె

"మూడు రోజులయినా, ఎన్ని రోజులయినా, మనం అక్కడికి పొయ్యి వచ్చేటప్పుడు పోలీసులు ఆంబుష్ కూచుని మనలను పట్టుకుంటారు" రామాల్ అన్నడు.

"అవును. ఫైరింగ్ అయినా చేస్తారు" రామాల్‌ను సమర్థిస్తూ కోసాల్. "సామాన్లే కద. పోతే పోనియ్. ప్రాణాలు పోతే మళ్ళా వస్తయా" బిమల, నందెకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఏమీ మాట్లాడలేక వాళ్ళను ఎలా ఒప్పించాలో తెలియక అయోమయంలో వాళ్ళు చెప్పేది వింటూ ఉండిపోయింది.

నందె ఏమి మాట్లాడకపోవడంతో మిగతావాళ్ళు కూడా తలా ఒకరు తమ అభిప్రాయాన్ని, భయాన్ని వ్యక్తం చేయడం మొదలుపెట్టారు.

"ఇప్పటికీ దాదలకుసహాయం చేస్తున్నారని మొన్ననే కద ఐడిమాల్‌ను పట్టుకొని కొట్టీ కొట్టీ చంపారు పోలీసోళ్ళు".

"అక్కడ దాదల దగ్గరికి పోయిన భీమాల్‌ను కూడా పట్టుకొని తప్పుల జేసి చంపిరి".

'ఆ... వాడి చేతిల తుపాకి ఉందా ఏమన్ననా"

'అవును. తుపాకులున్నా లేకున్నా జంగల్‌ల కనిపిస్తే కాల్చిచంపుతున్నారు" ఇలా అలా ఒకమాట మాట్లాడారు.

"మరి ఇట్ల ఎన్ని రోజులని భయపడుతూ ఉంటామే" నందె.

"ఎన్ని రోజులంటె, కొద్ది రోజులు అయినాక పోదాం" ఒకరు.

"ఇంకా కొద్ది రోజులు ఆగితే సామానంత పాడైపోతది. నిన్న వాన కూడా వచ్చింది.

అన్ని తడిసిపోయి వుంటయ్" నందె ఆందోళన

"వాళ్ళకేంది (దాదలనుద్దేశించి) పొమ్మని చెప్తారు" ఎవరో తన అసహనాన్ని వెలిబుచ్చారు.

"ఏహే అంత భయమెందుకు? పోలీసోడు ఎక్కడ అంబుష్ కూచుంటాడో మనకు అర్థం కాదా ఏంది? గొడ్డళ్ళు పట్టుకొని అడవికి కట్టెలకు పోయినట్టు పోదాం" నందె. ఎవ్వరూ మేము రామంటే మేము రాము అన్నారు. ఇక చెప్పేదేమీ లేనట్టు ఒకరి తర్వాత ఒకరు లేచి వెళ్ళిపోయారు. నందెకు మాత్రం ఎలాగైనా 'ఆ సామాను'ను భద్రపరచాలని ఉంది.

నందె వయసు ఇరవై సంవత్సరాల వరకూ ఉంటది. గుండ్రటి మొఖం. సాయనలుపు. ఆదివాసీ అమాయకత్వం, స్వచ్ఛత, పట్టుదల కలగలసి ఉంటాయి. మధ్య పాపిడి నిలువుగా తీసి నూనె పెట్టి నున్నగా దువ్వుకొని ముడివేసుకుంటది. ముక్కుకు ముక్కుపుల్ల, చెవులకు జుంకాలు, చేతికి పట్టెడ ఉంటాయి. చీర, జాకెట్టు కట్టుకొని, పొడవుగా చక్కగా ఉంటుంది. చూడగానే ఆకర్షించే రూపం. అంతకు మించి స్వచ్ఛమైన నవ్వు మనలను కట్టిపడేస్తుంది.

దాదలు (నక్సలైట్లు) అంటే ఎనలేని అభిమానం. వారు పడే కష్టాలు, చెప్పేరాజనీతి ఆమెను ఎంతో ఉత్తేజితురాలిని చేస్తాయి. పూర్తికాలం దళంలోకి పోలేని బలహీనత.

ఊర్లో మహిళా సంఘం నాయకురాలు. పోలీసులు ఆ ఊరి వ్యక్తినే మూడు రోజుల కింద పట్టుకొని హింసించి చంపారు. విపరీతంగా కూంబింగ్ చేస్తున్నారు. గ్రామం అంచున తన పొలంలో పని చేసుకుంటున్న యువతి చేయిపట్టి లాగాడు ఒక పోలీసోడు. ఆ అమ్మాయి గట్టిగా ఏడ్వడంతో తల్లి కౌతుల్‌లోంచి బయటకు వచ్చి పోలీసుల మీద అరవడంతో వదిలిపెట్టి వెళ్ళిపోయారు. దాంతో ఊర్లోని యువకులంతా లోపలి అడవిలోకి వెళ్ళి దాక్కున్నారు.

అంతేగాక మూడు రోజుల క్రితమే ఆ ఊరి అంచునే మకాం ఉన్న దాదల మీద ఇన్ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు కాల్పులు జరిపారు. దాదల దగ్గర ఉన్న అమాయకుడైన ఆదివాసీ యువకుడు లచ్చాలును పట్టుకొని, హింసించి కాల్చి చంపారు.

ఆ ఫైరింగ్‌లోనే సామాన్లు తీసుకుపోలేని దాదలు ఛాలా వరకు మకాంలోనే వదిలిపెట్టి ఫైరింగ్ చేస్తూ రిట్రీట్ అయ్యారు.

లచ్చాలు శవాన్ని, అతని బ్యాగును, ఒక నీళ్ళ డబ్బాను పోలీసులు ఊరి జనం చేతనే మోయించారు. దాంతో సామానంతా పోలీసులు తీసుకుపోలేదనీ అసలు మకాం దగ్గరికే వాళ్ళు రాలేదనేది అర్థమైంది దాదలకు. అదే విషయం రిట్రీట్ అయిన తర్వాత ఇంకో ఊరి జనం ద్వారా తెలుసుకున్న నక్సలైట్లు మకాంలో చాలా సామాను వదిలివచ్చామని చెప్పి పంపారు.

ఆ కబురు పక్క ఊరు వాళ్ళ నుండి నందె వాళ్ళ ఊరికి కూడా అందింది. ఊర్లో యువకులు ఎవరూ లేరు. ఏం చేయాలో అని ఆలోచించి మీటింగు ఉంది రమ్మని కబురు చేస్తే జనమంతా పోగయ్యారు. ఆ మీటింగులో ఆ సామాను భద్రపరుద్దామని, మకాం దగ్గరికి పోదామని నందె తాపత్రయం. ఊరివాళ్ళు తన మాట వినలేదు. ఎలాగైనా దాదల సామాను దాయాలని ఉంది. ఏం చేద్దునా అని మధ్యాహ్నం వరకు ఆలోచిస్తానే ఉండి పోయింది. ఏ పని చేసుబుద్ధి కాలేదు. స్థిమితంగా ఉండలేకపోయింది. చివరికి ఒక ఐదుగురు చిన్న అమ్మాయిలను

అందరూ పదేళ్ళలోపువారే, ఒకమ్మాయి మాత్రమే పన్నెండేళ్ళది. ఐదుగురు పిల్లలు, తనూ మొత్తం ఆరుగురు కలిసి కట్టెలు కొట్టుకుంటూ, నారతీసుకుంటూ మకాం చుట్టూ తిరిగి చూసుకున్నారు. ముందూ వెనకాల, పక్కలకు, నీళ్ళ దగ్గర అంతటా కట్టెలు ఏరుతూ చూసారు. కొద్దిసేపు కోతులను గెదిమారు. అంతా చెక్ చేసుకుని చుట్టుపక్కల ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక మకాంలోకి అడుగుపెట్టారు.

"ఆలెరీ, ఎంత సామాను" ఆశ్చర్యపోయారు. ఈ సామానంత గుట్టకు పెట్టడం మనవల్లకాదనుకొని ఇద్దరు అమ్మాయిలతో ఊరికి కబురు పంపింది నందె.

అంతా బాగానే ఉందని, పోలీసులు లేరనీ, సామాను చాలా ఉందని, రమ్మని చెప్తే అప్పుడు ఆడవాళ్ళు మగవాళ్ళు కలిసి ఓ ఇరవై మంది దాకా వెళ్ళి సామానంతా గుట్టకు భద్రపరచి వెళ్ళిపోయారు.

ఆ తర్వాత దళం వాళ్ళ ఊరికి పోయిపుడు ప్రతీ వస్తువు తెచ్చి అప్పజెప్పారు.

నందె తెగువను, ప్రేమను, పట్టుదలను చూసి దాదలు ఎంతో ఉత్తేజాన్ని పొందారు. అవును. ప్రజల అండ ఉంటే ఎంతటి నిర్బంధాన్నైనా చేపల్లాగా ఈదేయగలం అనుకున్నారు. నందెకు లాల్‌సలామ్ అంటూ కృతజ్ఞతతో చేతులు కలిపారు.

***అరుణతార, మార్చి-ఏప్రిల్ 2007***

# గొడ్డుని కాను

– 'తాయమ్మ' కరుణ

ఆకాశానికి చిల్లులు పడ్డాయా అన్నట్టు కుండపోతగా వాన. తగ్గినాక బయలుదేరుదామని ఆ రాత్రికి ఆగాము. తెల్లారినప్పటికీ తగ్గే సూచనలు ఏమీ కన్పించలేదు. ఇక పొద్దున్నే కిట్లు వేసుకున్నాం. తుపాకీ, కిట్టు తడవకుండా పాలిథిన్‌లు కప్పుకున్నాం. ప్యాంట్లను మోకాళ్ళ వరకు మడిచి బయలుదేరాం.

వాన బరువుకూ, సంతోషానికీ చెట్లకొమ్మలు ఆనందంగా హాయిగా నెమ్మదిగా ఊగుతున్నాయి. కాలు తీసి కాలు వేయడం కష్టంగా వుంది. ఒక్కొక్క బూటుకు నాలుగైదు కిలోలకు తక్కువ గాకుండా బురద అంటుకుంది. అంతేనా, బ్యాలెన్స్‌గా నడవకపోతే పుసుక్కున జారిపడడం ఖాయం. తుపాకీ, కిట్టుతోసహా అన్నీ తడిచిపోయి పడిపోతే పక్క వాళ్ళు నవ్వుల జల్లులు కురిపిస్తారు. వారితోపాటు పడ్డ వారూ నవ్వుతారు. ఈలోగా ఎవరో ఒకరు వచ్చి చెయ్యి అందిస్తారు. ఆ తర్వాత ఎలా పడిందీ తల్చుకొని తల్చుకొని వర్ణించి వర్ణించి నవ్వుతారు కొందరు. అది అందరికీ సరదాగానే వుంటది, పడినవాళ్ళతో సహా. ఏ చిన్న అవకాశం దొరికినా గాలిలో తేలిపోతున్నట్టుగా ఉత్సాహంగా నవ్వుతారు. పడినప్పుడు దెబ్బలు తాకితే మాత్రం సీరియస్‌గా, చాలా జాగ్రత్తగా కాపాడుకుంటారు, సాయం అందిస్తారు.

ఇంకా నయం, బస్తర్‌లో అందరం ప్లాస్టిక్ బూట్లే వేసుకుంటాం. కాబట్టి తడిచినా బూటు బరువు వుండదు. బురద అంటినప్పుడు తప్పితే. మామూలు బూట్లయితే తడిస్తే వాటి బరువు, బురద బరువు కలిపి కాలు తీసి కాలు వెయ్యలేకపోయేవాళ్ళం.

బస్తర్‌లో అసలు ముళ్ళచెట్టనేదే కనిపించదు. అంతేకాదు. రాళ్ళు కూడా కన్పించవు. కొండలు కూడా మట్టితోనే ఉంటాయి. ఒక్కోసారి పొయ్యి పెట్టుకోడానికి రాళ్ళు దొరకక పచ్చి చెట్లు కొమ్మలను నరికి, వాటిని మూడువేపులా భూమిలోకి దిగ్గొట్టి వంట చేస్తాం. రాళ్ళూ, ముళ్ళూ లేకపోవడం వల్ల ప్లాస్టిక్ బూట్లు వాడతాం. అవి రోజూ కడుక్కోవడానికి సౌకర్యంగా ఉంటాయి. బాటా బూట్లు (ప్లాస్టిక్) దొరికాయంటే చాలా సంతోషిస్తాం. అవి కాలుకు చాలా అనువుగా ఉంటాయి. 'బస్తర్‌లో మన కోసమే బూట్ల కంపెనీ పెట్టినా నడుస్తది" అని నవ్వుకునేవాళ్ళం.

అట్లా బురద అంటిన బూట్లను ఈడ్చుకుంటూ తుపాకీ, కిట్టూ తడవకుండా కప్పుకున్న

పాలిథిన్‌ను సర్దుకుంటూ గట్టిగా పట్టుకుని నడుస్తున్నాం. పాలిథిన్ సరిగా కప్పుకోవడం రాక నా ప్యాంటు తడుస్తున్నది. షర్టు ముందు భాగం, చేతులూ తడుస్తున్నాయి. చేతులను హడావుడిలో మలవడం మర్చిపోయాను. దళంలోని సీనియర్స్ అస్సలు ఒక్క బొట్టు నీటిచుక్క పడకుండా అలవోకగా నడుస్తారు. నాకు కొత్త.

పాండన్న వెనక్కి తిరిగి నా అవస్థ చూసి 'రూపక్కా, ఎట్లా ఉంది వాన' అన్నాడు నవ్వుతూ.

పెదవుల కదలికను బట్టి నాకర్థమైనా 'వాన చప్పుడుకు నాకేమీ విన్పించడం లేదు' అని గట్టిగా అరిచిన. కప్పుకున్న పాలిథిన్ మీద వాన చినుకులు తప్పుడ తప్పడ బడుతుంటే దగ్గర్లో ఉన్నా గట్టిగా మాట్లాడితేగానీ విన్పించదు.

ఇప్పుడు మేం నల్గురం ఉన్నాం. మా దళమంతా ఈ నల్గురమే. జిల్లా కమిటీ సభ్యుడు పాండన్న, ఒక డాక్టరు, శ్యామన్న, నేను. శ్యామ్, నేనూ టీచర్స్ టీం సభ్యులం. మా టీచర్స్ టీమ్‌నూ, డాక్టర్‌నూ వేరే ప్రాంతానికి చేరవేయడానికి పాండన్న వస్తున్నాడు. పాండన్నకు కూడా పైకమిటీ వాళ్ళతో మాట్లాడే పని వుంది. మమ్మల్ని అక్కడ వదిలి, కొందరిని తన వెంట తీసుకువెళ్ళాల్సి ఉంది.

పాండన్నకు ఆ ప్రాంతమంతా కొట్టిన పిండి. చాలా సంవత్సరాలుగా ఆదివాసీ ప్రాంతంలో పని చేస్తుండడం వల్ల అక్కడి ప్రజల మీద, అడవిమీద మంచి పట్టు ఉన్నది. నట్టడివిలో నిలబెట్టినా ఏదారి ఎటు పోతదో చెప్పగలడు. హాయిగా, మనస్ఫూర్తిగా నవ్వుతాడు.

ఇక డాక్టరు, ఎంబిబియస్ చదివి ప్రజలకు సేవ చేయాలన్న దృక్పథంతో వచ్చినవాడు. గోండీ భాష రాదు. కొత్తగా వచ్చాడు. నేను గోండీ భాష తొందరగానే నేర్చుకున్నప్పటికీ గెరిల్లా జీవితానికి కొత్తే. ఇక శ్యామన్నకు గెరిల్లా జీవితం అలవాటే. పేరుకు తగ్గట్టు నీలమేఘశ్యాముడు.

అలా మా ఫోర్‌మెన్ ఆర్మీ ప్రయాణం మొదలు పెట్టింది. జోరువానలో ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా చేరుకోవాలి. మీరెలా చేరతారో చూస్తానన్నట్టుగా ఉంది వాతావరణం. మొత్తానికి రెండు గంటలు నడవాల్సిన ప్రయాణాన్ని నాలుగు గంటలు నడిచి ఒక ఊరు చేరుకున్నాం. అప్పటికీ ఊర్లో చిన్న పిల్లలు, ముసలివాళ్ళు తప్ప ఎవరూ లేరు. ఉన్న ఒకరిద్దరి యువకులతో అన్నం జమ చేయమని చెప్పిండు పాండన్న. నలుగురమే ఉన్నాం కాబట్టి అన్నానికి ఇబ్బంది లేదు. మధ్యాహ్నం వరకు వాన కూడా తగ్గిపోయింది. పోగానే అంతసేపు కప్పుకుని నడిచిన పాలిథిన్‌ను ఒకపొద మీద ఆరేసి, కిట్టులోంచి పరుచుకునే పాలిథిన్ వేసుకుని బురద అంటిన కాళ్ళను బయటపెట్టి పడుకున్నా. మిగతా ముగ్గురు చెట్టు మొద్దుల మీద కూర్చున్నారు. కిట్లు దింపుకుని.

'పెట్రోలు అయిపోయిందా రూపక్కా' అని నవ్వుతూ పాండన్న పలకరించాడు.

'ఆ....పూర్తిగా అయిపోయింది' అన్నాను.

పాండన్న లేచి నెమ్మదిగా టీ చేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టిండు. శ్యామ్, డాక్టరు పొయ్యి పెట్టడానికి రాళ్ళు ఏరుకొచ్చారు. పాండన్న సన్నటి పుల్లలు జమచేస్తుండు పొయ్యి అంటించడానికి.

వానా కాలంలో ఒకే ఒక్క అగ్గిపుల్లతో పొయ్యి అంటించడం ఒక కళ. కొన్ని రకాల ఎండిన కట్టెలు, వానలో ఎంత నానినా లోపలికి నీళ్ళు పోవు. పై తోలు ఆరిపోతే చాలు అవి మంచిగా మండుతాయి. ఒకరకం చెట్టు పుల్లలు వానలో ఎంత నానినా మండుతాయి. వాటి మీద పడ్డ చినుకులు తామరాకుల మీది నీటి బొట్టులాగా జారిపోతాయి. అయినప్పటికీ కొంత తడిగానే ఉంటాయి. అలాంటి పుల్లలు చేతిలో అమిరేటన్ని ఏరి, ముట్టిస్తే ఒక్క అగ్గిపుల్లతో అంటుకుంటాయి. వాటి మీద నెమ్మదిగా సన్నని కట్టెలు పేరుస్తారు. పాండన్నకు ఈ పని చాలా సులువు.

పాండన్న పొయ్యి అంటించేలోగా నీళ్ళు పట్టుకుని ఊరి నుండి ఇద్దరు కుర్రాళ్ళు వచ్చారు. పాండన్న చాయ్ చేసాడు. చాయ్ మరుగుతున్న వాసనకు లేచి ఒక పుల్ల విరిచి పండ్లు తోముకున్న, అట్లాగే బురదకాళ్ళనూ కడుక్కున్న.

'పాండన్న... నువ్వు మొఖం కడుక్కోపోవే, చాయ్ నేను పోస్తగని" అన్నాను. పాండన్న మొఖం కడుక్కొని వచ్చేసరికి నాలుగు గ్లాసుల్లో చాయ్ పోసిన. నల్గురం మాట్లాడుకుంట చాయ్ తాగినం. గెరిల్లాలంతగా ఆస్వాదిస్తూ బహుశ ఎవరూ చాయ్ తాగరేమో. తినే తిండిగాక దొరికే ఇతర ఆహారం చాయ్ ఒక్కటే. అదీగాక ఆకలితో ఉన్నవాళ్ళకు తక్షణం దొరికేది కూడా చాయ్‌నే. ఆకలి రుచిని పెంచుతదంటారు కద. చాయ్ అంటే అందరూ తాగే కప్పు చాయ్ కాదు. రెండు కప్పులపైనే ఉంటది. అసలు అది సరిపోదు. ఇంకా తాగాలని అన్పిస్తది. కానీ కోటా ప్రకారమే పాలపొడి వేసి చేస్తారు. అయితే కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అన్నం దొరకనప్పుడు ఎక్కువ చాయ్ చేస్తారు.

గాలి రావడంతో చెట్లమీది నీళ్ళు పడి పరిచిన నా పాలిథిన్ తడిసిపోయింది. తీసి ఆరేసిన. అన్నం జమ చేసుకుని ఊర్లోని పిల్లలందరూ వచ్చారు. అందరికీ చేయికలుపుతూ లాల్‌సలామ్ చెప్పాం. పార్టీ ఏరియాలో ఎక్కడ 'దాద'లు కనిపించినా (దాదలు అంటే అందులో దీదీలు కూడా భాగమే) లాల్‌సలామ్ చెబుతారు. వచ్చి చేయి కలుపుతారు.

ఒకతను వచ్చి, తన భార్యకు రొమ్ములో గడ్డలైనయని, ఆస్పత్రిలో జాయిన్‌చేస్తే కోస్తరని (ఆపరేషన్) భయపడి పారిపోయి వచ్చిందని, విపరీతమైన జ్వరంతో ఉందని, మందులు ఇమ్మని అడిగాడు. గోండీలో ఆ దాద చెప్పిన విషయాన్ని పాండన్న హిందీలో డాక్టరుకు చెప్తే పేషంటును తీసుకురమ్మన్నాడు డాక్టర్. ఈలోగా మేం అన్నాలు తిన్నాం. పిల్లలు పాటలు పాడమంటే పాండన్న ఒకపాట పాడిండు. నా గొంతు బాగుండదు అందుకని నేనెప్పుడూ పాటలు పాడను. గొంతు మంచిగా ఉన్నవాళ్ళు పాడితే అక్కడి నుంచి కదలాలన్పించదు. కొన్నిసార్లు పాడించుకొని వింటాను.

పేషంటును తీసుకొని వచ్చాడు దాద. వయసు ఇరవై, ఇరవై ఒకటి ఉండొచ్చు. బాలింత, బాబు పుట్టగానే చనిపోయాడట. కుడిరొమ్ము చాలా వాచిపోయి ఉంది. మనిషి జ్వరంతో కాలిపోతూ ఉంది. డాక్టరు చూడగానే చీము పట్టి ఉందని, ఆపరేషన్ చేసి చీము తీయకపోతే చాలా ప్రమాదమని చెప్పాడు.

పాండన్న పేషంటు భర్తతో 'డాక్టరు ఇప్పుడు చీము తీసేస్తడు ఏం భయం లేదు' అని చెప్పిండు. డాక్టర్ వేడినీళ్ళలో సిరంజిలను, సూదులను వేసి కొన్ని ఆపరేషన్ ఇన్స్ట్రుమెంట్స్ తేవడం చూసి ఆ అమ్మాయి లేచి నిలబడింది పోతానని. అవన్నీ తన కోసం కాదని, వేడి చేస్తున్నామని పాండన్న చెప్పిండు. అయినా భయం భయంగానే చూస్తూ కూచుంది.

డాక్టర్ మొదట మత్తు ఇంజక్షన్ ఇచ్చిండు. ఆ తర్వాత రొమ్ము చుట్టూ రెండు, మూడు చోట్ల మొద్దు బారే ఇంజక్షన్స్ చేసాడు. పిల్లలందరినీ ఊరికి పంపాం. సెంట్రీగా ఇద్దరు ఊరి దాదలను పెట్టుకున్నాం. డాక్టర్ రొమ్ము మీద గాటు పెట్టగానే ఒక్కసారిగా చీము చిమ్మించి కొట్టింది. డాక్టరు షర్టు మీద పడింది. చీమునంతా పిండేసి, ఆ తర్వాత స్పూన్‌లాంటి పరికరాన్ని రొమ్ములోకి దూర్చి గిన్నె మాడిపోతే ఊడ్చినట్టుగా లోపలంతా ఊడ్చాడు. కుట్లు వేసాడు. యాంటిసెప్టిక్ ఇంజక్షన్ ఇచ్చాడు.

ఆ తర్వాత అమ్మాయి ఛాతి భాగాన్నంతా కడిగి వేరే పాలిథిన్‌లో పడుకోబెట్టాం. అసలు ఆ చీము ఎంత వాసన ఉందో... – ఒకటి, ఒకటిన్నర లీటర్ల చీము వచ్చింది. డాక్టరు షర్టు విప్పి చీము పడిన మేర కడుక్కున్నాడు. చీముపడ్డ తన పాలిథిన్‌ను కడిగి ఆరబెట్టిండు పాండన్న.

మబ్బులు పూర్తిగా తొలగిపోలేదు. ఎండా, మబ్బు దోబూచులాడుతున్నాయి. 'వాన వస్తే మళ్ళీ సాయంత్రానికి రావచ్చు. 'రాత్రి వచ్చిన వానా, చుట్టమూ పోవంటారు' పదండి, తొందరగా సర్దుకోండి. చీకటి కాకముందే ఊరు చేరుకోవాలి" అని పాండన్న తొందర చేసాడు.

మేము సర్దుకునేలోగా పేషంటు లేచి కూర్చుంది. పారాసిటమాల్, యాంటిసెప్టిక్ టాబ్లెట్లు పేషంటుకు ఇచ్చి ఊరివాళ్ళను తోడు తీసుకుని మళ్ళీ నడక మొదలుపెట్టినం.

పొద్దున్న ఎక్కువ నడవడం, రెస్టు లేకుండానే మళ్ళీ నడవాల్సి రావడం వల్ల నేను నడవలేకపోతున్నాను. నా అవస్థ చూసి పాండన్న కిట్టు తీసుకున్నాడు. అయినా గంట కూడా నడవకుండానే కూచుంటానన్నాను. పాండన్న విజిల్ ఊదడంతో అందరూ ఆగారు. మామూలుగా అయితే యాభై నిమిషాలు కాగానే ఆగుతారు. పదినిమిషాల టైం ఉంటుంది. ఈ సమయంలోనే టాయ్‌లెట్లకు వెళ్ళేవాళ్ళు వెళ్తారు. రెస్టు తీసుకునేవాళ్ళు రెస్టు తీసుకుంటారు. పది నిమిషాల తర్వాత విజిల్ వేయగానే కిట్లు వేసుకుని నడక మొదలుపెడతారు. నేను నలభై నిమిషాల కంటే నడవలేకపోయా. నిజానికి ఎండ కూడా లేదు. ఎటు చూసినా పచ్చని పరుపులా అడవి, అప్పుడప్పుడు వీచేగాలి, హాయిగా ఉంది వాతావరణం.

ఎండాకాలంలో అయితే ఆకులన్నీ రాలిపోయి ఎండ, వేడి, ఉక్కపోతతో చెమటలు కక్కుతూ నడవడం చాలా ఇబ్బందిగా ఉంటది. చెప్పాలంటే ఏ కాలానికి సంబంధించిన ఇబ్బంది ఆ కాలానికి ఉంటది. వానాకాలంలో నడవడం ఇబ్బంది. దానికి తోడు బురద, పాలిథిన్‌లు మోసుకోవడం. వానలోనే టెంటు కట్టుకోవడం. కానీ ఆ తర్వాత ఆ వాన, చలిలో వేడి వేడి చాయ్ తాగడం చెప్పలేని అనుభూతి.

ఇక చలికాలం. స్వెట్టర్స్, శాలువాల బరువు. ఎన్ని కప్పుకున్నా చలి ఆగదు. రాత్రి పూట ఒకటే మంచు, తెల్లారేసరికి పైన ఉన్న దుప్పటి నానిపోతది. వర్షంలాగా మంచు

నీళ్ళుగా మారి ఆకుల మీంచి టప్పటప్ప పడుతుంటది. ఒక రకం చెట్టుకింద ఎందుకో మంచుపడదు. చలికాలం సెంట్రీ చేయడం చాలా కష్టం. చేతులు, మొఖం తిమ్మిర్లెక్కుతాయి. సెంట్రీ చేసి పడుకుంటే వెంటనే నిద్రపట్టదు. పొద్దున్నే లేచి కిట్లు వేసుకుని నడుస్తామా. పొదల మీద గడ్డిమీద నిలిచిన నీరంతా ప్యాంటుకు అంటుకుని నానిపోతాయి.

ఎండాకాలం ఇబ్బంది ఎండాకాలందే. స్నానానికి నీళ్ళు దొరకవు. ఉండడానికి నీడ దొరకదు. అంత పచ్చటి అడవి, పెద్ద పెద్ద మానులు ఆకులన్నిటిని రాల్చేసి మోడుల్లాగా కన్పిస్తాయి. ఇక రాత్రిపూట కాలుతీసి కాలు వేస్తే ఎండిన ఆకుల చప్పుడు.

ఎలాగో ఆగుతూ చీకటిపడే సమయానికి చేరాల్సిన ఊరు చేరాం. ఊరికి చివరి ఇంట్లో మకాం వేసాం. ఆ ఊర్లో ఇరవై నుంచి ఇరవై ఐదు దాకా ఇళ్ళుంటాయి. పెద్ద ఊరు అన్నమాట. నాలుగైదు ఇళ్ళు ఉన్నా అది ఒక ఊరే.

ప్రతి ఇంటి చుట్టూ ఎకరానికి తక్కువ గాకుండా పెరడు ఉంటుంది. ఈ పెరట్లో మొదటి వానకు మొక్క జొన్నలు విత్తుతారు. ఆ పెరడు చుట్టూ కట్టెలతో దడి అల్లుతారు. ఆ దడిలోపలే ఒక మూలకు ఇల్లు ఉంటుంది. ఇల్లు అంటే పంట గింజలు పోయడానికి ఒక గది, వంటకు ఒక గది. (అన్ని చోట్లా ఇలాగే ఉండదు. కొంత తేడాలున్నప్పటికీ ఇలాగే ఉంటాయి) ఆ ఇంటి ముందర పెద్ద వసారా. ఆ వసారాకు చుట్టూ గోడలుండవు. పైన కప్పు మాత్రం ఉంటుంది. మేము దిగిన ఇల్లు కూడా ఇలాగే ఉంది. కాకపోతే సన్న వానజల్లు మొదలైంది.

మేము కప్పుకున్న పాలిథిన్‌లు గుడిసె బయటే ఆరేసి బూట్లు విడిచి లోపలికి వెళ్ళాం. బట్టలు తడవకపోయినప్పటికీ మెత్తగా ఉన్నాయి. నల్గురమూ నిప్పు చుట్టూ చేరిపోయాం. అప్పటికే అక్కడ కూచున్న దాదా, అవ్వ పక్కకు జరిగి చోటిచ్చారు మాకు. దాదాకు అరవై ఏళ్ళ వరకూ ఉంటాయి. నిప్పును పెద్ద జేసారు. మాతోపాటు వచ్చిన దాదలు పక్క ఇంట్లోకి వెళ్ళారు – ఈ గుడిసెలో సరిపోమని. ఆ గుడిసె వెచ్చగా ఉండి శరీరానికి చాలా హాయిగా ఉంది. పాండన్న వారితో మాటలు కలిపాడు. మాట్లాడుతూనే టీ కోసం గిన్నె, నీళ్ళు అడిగాడు. నేను నిప్పు దగ్గరే కూచున్న, పాండన్న చాయ్ సామాన్లు తన కిట్టులో నుంచి తీసిస్తే చాయ్ పెట్టిన. ఆ ఇంటి దాద అవ్వతోపాటు అందరం టీ తాగినం. డాక్టరు బాగా అలిసిపోయినట్లున్నాడు. గుడిసె తడికెకు ఆనుకొన్నాడు.

ఆ ఇంటి దాదా పన్ను బాగా సలుపుతోందని, ఆ నొప్పితో నిద్దర రావడం లేదని చెప్పాడు. పాండన్న డాక్టర్‌కు చెప్పడమే ఆలస్యం, ఆ దాదా నోరు తెరిచి చూసి పన్ను పీకేయాలని చెప్పాడు డాక్టర్. ఆదివాసీలందరూ పొగాకు బాగా వాడతారు. పొగాకు, సున్నం కలిపిన ఉండ ఎప్పుడూ నోట్లో ఉంటుంది. పన్ను తీసేయాల్సిన విషయం దాదాకు చెప్తే వెంటనే ఒప్పుకున్నాడు.

ఇన్‌స్ట్రుమెంట్స్ వేడిచేయడమూ, ఈలోగా డాక్టరు అన్నీ తయారుచేసుకోవడమూ జరిగిపోయాయి. డాక్టర్ ఆ దాదా తలను తన తొడమీద పెట్టుకొని పన్ను లాగేసాడు. పన్ను తీసిన చోట కాటన్ పెట్టి యాంటిబయాటిక్స్ ఇచ్చాడు.

డాక్టరును చూస్తే నాకు ఆశ్చర్యమనిపించింది. మనిషి తెల్లగా పొడవుగా సున్నితంగానూ బలంగానూ అంటే మెత్తగా ఆరోగ్యంగా కన్పిస్తాడు. తాను ఎంత అలిసిపోయినా పేషంటు ఉంటే ఎక్కడలేని ఓపిక తెచ్చుకుంటాడు. పొద్దున చీము అతని షర్టు మీద పడ్డా మొఖం చిట్లించను కూడా లేదు. ఈ ముసలతను మురికి ఓడుతూ ఉన్నాడు. నోరు తెరిస్తే గప్పున వాసన వస్తున్నా అతని తలను తన ఒళ్ళో పెట్టుకుని పన్ను తీసాడు. పుస్తకాల్లో చదివిన డాక్టరును ప్రత్యక్షంగా చూస్తున్నట్టు అన్పించింది.

ఇంతలో సంవత్సరంలోపు వయసు ఉన్న బాబును ఎత్తుకుని ఒకమ్మాయి వచ్చి 'లాల్‌సలామ్' అంటూ అందరికి చేయి కలిపింది నవ్వుతూ. వయసు ఇరవైరెండు, ఇరవైమూడు ఉండొచ్చు. ఒడ్డూ పొడవు ఉంది.

కూచొమ్మని పక్కకు జరిగి నిప్పు దగ్గర చోటిచ్చాను.

'ఈమె ఒకప్పుడు మన సంఘ నాయకురాలు' అని పొండన్న పరిచయం చేసాడు.

'ఇప్పుడు చేయట్లేదా"

"ఇల్లు జొచ్చి పెండ్లి జేసుకుంది. ఆ ఊర్లోనే ఉంటోంది' అని పొండన్న అన్నాడు. ఊరి దాదాలు ఒకరొకరు జమ అవుతుంటే పొండన్న వసారాలోకి వెళ్ళాడు. అక్కడ కూడా పెద్ద నిప్పు రాజేశారు. బాగానే చీకటయింది. ఆకాశం మబ్బుపట్టి ఉండడంతో చీకటి చిక్కబడి పక్కన ఉన్నవారు కన్పించడం లేదు.

ఆదివాసీల్లో అమ్మాయి ఏ అబ్బాయినైనా ఇష్టపడితే బట్టలు తీస్కుని ఆ ఇంట్లోకి వెళ్తుంది. దాన్నే ఇల్లు జొచ్చింది అంటారు. అలా ఇల్లు జొచ్చిన అమ్మాయిని దాదాపు ఎవరూ విడదీయరు. ఆ అబ్బాయి తప్పకుండా పెండ్లి చేసుకుంటాడు. కన్యాశుల్కం చెల్లించలేని స్థితి, పెండ్లికి కావాల్సిన కల్లు, లంద భరించే ఆర్థిక స్థోమత లేకపోతే ఇద్దరు ముగ్గురు పిల్లలయ్యేంత వరకైనా ఆగి అప్పుడు పెళ్ళి చేసుకుంటారు.

'బాత్ పొరల్ దీదీ' (ఏం పేరు దీదీ)' అని అడిగా.

'పాయ్‌కీ' అంది.

'పాయ్‌కాల్' అని బయట నుండి వచ్చిన వాళ్ళను అంటారు. తను బయటివాళ్లలాగా ఉండడం వల్ల అలాంటి పేరు పెట్టారేమో.

తెల్లగా, ఎర్రగా ఉంటే 'మాలు' అని (మగవారిని), నల్లగా ఉంటే జూరు (పు) జూరి (స్త్రీ) అనీ, ఆదివారం పుడితే 'ఆయితాల్' (పు), ఆయితి (స్త్రీ) అనీ, సోమవారం పుడితే సోమల్ (పు), సోమె (స్త్రీ) అనీ, బుధవారం పుడితే బుద్రాల్ (పు), బుద్ధి (స్త్రీ) అనీ, శుక్రవారం పుడితే సుక్కు (పు), సుక్కి (స్త్రీ) అనీ పేర్లు పెడతారు. ఒకే ఊర్లో అవే పేర్లతో చాలామంది ఉంటారు. లేదంటే ప్రకృతికి సంబంధించిన పేర్లు పెడతారు.

'బెదు నాటెతోన లోనత్తిన్?' (ఏ ఊరతని ఇల్లు జొచ్చినవ్?) అడిగా. పాయ్‌కీ చెప్పింది. ఈ ఊరుకు పాయ్‌కీ అత్తగారి ఊరు కొంచెం దూరమే. బాబు పుట్టాక భర్త చనిపోయాడు. ఎలుగుబంటి కరవడం వల్ల. తర్వాత అత్తగారింట్లోనే ఉంది. భర్త చనిపోతే అతని అన్నదమ్ముల్లో

ఎవరో ఒకరు పెండ్లి చేసుకుంటారు. లేదంటే ఇంకెవరైనా వారు అడిగినంత ఓలి (కన్యాశుల్కం) ఇస్తే పెళ్ళి చేస్తారు. ఆ అమ్మాయికి ఇష్టముందా లేదా అనే దానితో సంబంధం ఉండదు. భర్త చనిపోయిన కొన్ని నెలలకు అలాంటి ప్రయత్నాల్లో ఉండగానే 'పాయ్‌కీ' తన తల్లిగారి ఊరివాడైన 'రామాల్' ఇల్లు జొచ్చింది. పాయ్‌కీకి తమలో ఎవరినీ మనువాడడం ఇష్టం లేదని భర్త అన్నదమ్ములు చాలా కాపలా కాసారు. పారిపోతదేమోనని వాళ్ళెంత కాపలాకాసినా అడివికి పోతున్నానని చెప్పి 'రామాల్' దగ్గరికి వచ్చింది. అయితే పాయ్‌కీ నాతో 'రామాల్' ఇల్లుజొచ్చిన విషయం చెప్పలేదు. తనను భర్త తమ్ముడు పెండ్లి చేసుకోవాలనుకుంటున్నాడని, తనకు ఇష్టంలేక పారిపోయి తల్లిగారింటికి వచ్చానని చెప్పింది.

పాండన్న జనంతో మాట్లాడి పంపిండు. నిజానికి దళం అంతా వస్తే ఊర్లో దిగరు. ఊరికి కొంచెం దూరంలో ఆగుతారు. ఊరు ఊరంతా కదులుతుంది దళం దగ్గరికి. బాలలకు, మహిళలకు, యువతకు సంఘాలకు వేర్వేరుగా మీటింగులు జరుగుతాయి. ఏ సంఘంలో లేని మిగతా ప్రజలకు విడిగా మీటింగు జరుగుతుంది. మీటింగులకు విడిపోవడానికి ముందే అందరూ కూర్చొని ఉండగా దళంవాళ్ళు పాటలు పాడతారు. వెన్నెల రాత్రుల్లయితే దళం, గ్రామ యువతీ యువకులు కలిసి డాన్సులు కూడా వేస్తారు. ఎంత రాత్రయినా మీటింగులు అయిపోయాక మకాం ఖాళీ చేసి కొంత లోతట్టు అడవిలోకి వెళ్ళిపడుకుంటుంది. మేము నల్గురమే అవడం వల్ల, అదీగాక అర్జంటుగా వెళ్ళాల్సి ఉండడం, ఆ ప్రాంతానికి కొత్తవాళ్ళం అవడం వల్ల వేర్వేరు మీటింగులు జరపడం లేదు.

జనాలు పోయినాక పాండన్న వచ్చి 'అన్నంత తిందామా మరి' అన్నాడు. పాండన్నను చూస్తే ఆశ్చర్యమేస్తది.ఎంత అలిసిపోయినా మొఖం మీద నవ్వు మాత్రం చెరగదు. అలాగే పై కమిటీ సభ్యుడిననే అహంభావం అస్సలు ఉండదు. అందరూ అలిసిపోయి పడిపోతే తను లేచి ముందుబడి వంట ఏర్పాట్లు చూస్తాడు. పాండన్నకు అంత ఓపిక ఎక్కడి నుండి వస్తదో అన్పిస్తది.

అన్నాలు తినేసరికి మళ్ళీ కుండపోత వాన. ఆ గుడిసెలోనే పడుకుని పొద్దున లేచి పోదామన్నాడు పాండన్న. 'రూపక్కా నువ్వు ఫస్టు సెంట్రీ చేస్తవా? లాస్ట్ చేస్తవా?' అని అడిగిండు.

'ఫస్టు సెంట్రీ చేస్తా' అన్నాను.

'ఇప్పుడు టైం పదవుతుంది. అందరం రెండ్రెండు గంటలు చేద్దాం' అన్నాడు. ఎవరు తర్వాత ఎవరు చేయాలో చెప్పాడు. అందరూ పడుకుని కాసేపట్లోనే నిద్రపోయారు.

సెంట్రీ చేస్తూ నిలబడ్డాను. వాన తగ్గుముఖం పట్టింది. అప్పుడప్పుడు కీచురాళ్ళ చప్పుడు తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది. గాలి వచ్చినప్పుడు చెట్ల కొమ్మలు దయ్యాల్లాగా ఊగి ఆకుల మీద నిలిచిన చినుకులను రాలుస్తున్నాయి. మధ్యమధ్య గొడ్లు కదులుతున్న చప్పుడు. మనసులోకి వస్తున్న ఏవేవో ఆలోచనలు.... కాలం నిమిషం తర్వాత నిమిషం కదిలిపోతోంది. సెంట్రీ ఇంకా గంట ఉంది. నెమ్మదిగా ఆకాశంలో మబ్బులు విడివడి నిండుచంద్రుడు వచ్చాడు. 'ఈ రోజు పున్నమినా', మర్చేపోయాను. వారం, పదిరోజులుగా మబ్బులు, వాన ఉండడం, దానికితోడు అలసట. పున్నమి సంగతే మర్చిపోయాను.

బహుశ రవి దగ్గర కూడా వెన్నెల వచ్చి ఉంటే తప్పక నన్ను గుర్తు చేసుకుంటాడు. ఎన్ని పనులు ఉన్నా ఏ రోజు మర్చిపోయినా ఈ నిండు వెన్నెల రోజున నన్ను గుర్తు చేసుకుని తన పెదవుల మీద దరహాసరేఖను పూయిస్తాడు. రవి గుర్తుకు రాగానే సంతోషంతో నా పెదవులు విచ్చుకున్నాయి. మళ్ళీ ఆలోచనల్లోకి వెళ్ళుతున్నానని చుట్టూ పరిసరాలను చూస్తూ ఉండిపోయాను.

వానలో తడిసిన చెట్లు వెన్నెల్లో బాలింతల్లాగా, మత్తుగా జోగుతున్నట్లు అన్పించాయి. వెన్నెట్లో అన్నీ స్పష్టంగా కన్పిస్తున్నాయి. నెమ్మదిగా గుడిసె నుండి బయటకు వచ్చాను. పచ్చని చిక్కటి చెట్లు, మాయామర్మం తెలియని స్వచ్ఛమైన గుడిసె, కనుచూపుమేర మొక్కజొన్న చేను, తెల్లని వెన్నెల మనసుకు హాయిగా ఆనందంగా. మిగతా గంట సెంట్రీ పూర్తి చేసి శ్యామ్‌ను లేపి పడుకున్నాను.

తెల్లారగట్ల అయిదున్నరకే పాండన్న అందరినీ లేపాడు. లేచి దుప్పటి, పాలిథిన్ మడతపెట్టి కిట్టులో పెట్టుకుని కాలకృత్యాలు తీర్చుకొని వచ్చేసరికి ఆరుంపావు కావస్తుంది. టీ తాగి కిట్లు వేసుకుంటే బాగుండునని మనసులో ఉంది. మబ్బులన్నీ విడిపోయి ఆకాశం తేటగా ఉంది. పాండన్న కిట్లు వేసుకోండని తొందర పెడ్తుండు. ఇంతలో ఒక దాదా వచ్చి 'రామాల్' అనే అతనికి బాణం ఎవరో వేశారని, మందులిమ్మనీ అడిగాడు.

'రాత్రి మీటింగుకు వచ్చినవు కద. అప్పుడే ఎందుకు చెప్పలేదు' పాండన్న అడిగాడు. వచ్చినతను నసిగాడు జవాబుగా.

డాక్టరు వెంటనే 'బాణం అంటే ఇనుపది కదా' అని పాండన్నను అడిగాడు. పాండన్న అవుననగానే 'అయితే వెళ్ళి చూసి, మందులిద్దాం" అన్నాడు డాక్టర్.

డాక్టరు, పాండన్న పేషంటు దగ్గరికి వెళ్ళుతుంటే నేనూ వస్తానని వాళ్ళతో బయలుదేరాను. మేం వెళ్ళేసరికి వసారాలో నిప్పుదగ్గర పడుకున్నాడు రామాల్. మమ్మల్ని చూసి లేవబోయాడు. 'లేవకు పడుకో' అని పాండన్న అన్నా వినిపించుకోలేదు. లేవడానికి శక్తి సరిపోలేదు. పక్కనే ఉన్న దీదీ సాయం చేసింది లేవడానికి. లేచి కూచున్నాడు.

సరిగ్గా రెండు ఎదుర్రొమ్ముల మధ్య దిగింది బాణం. బాణాన్ని లాగేసారు. కానీ ఛాతీ అంతా వాచిపోయి ఉంది. కారిన రక్తం అలాగే ఉంది – ఎండిపోయి. విపరీతమైన జ్వరం. 'ఎట్లా ఉంది ఒంట్లో' అని పాండన్న అడిగాడు.

ఊపిరి పీల్చుకోవడం కష్టంగా ఉందనీ, నొప్పిగా ఉందన్నాడు రామాల్. ఆ నాలుగు మాటలను కూడా ఆగి ఆగి చెప్పాడు.

'ఎవరు వేసారు, ఎప్పుడు వేసారు' అని పాండన్న అడిగాడు.

'ఎవరు వేసారో తెలియదు దాదా, వేసి రెండు రోజులవుతుంది' అన్నది దీదీ.

'ఎందుకు వేసారు' పాండన్న.

'ఏమో దాదా' దీదీ.

పాండన్న ఎంత అడిగినా తెలియదనే చెప్పారు. ఎవరు, ఎందుకు వేసారు అనే విషయం ఆదివాసుల్లో దాగడం కష్టం. చిన్నచిన్న ఊర్లు. ఎవరికి ఎవరిమీద శతృత్వం ఉందో ఇట్లే

తెలిసిపోతది. వాళ్ళు కావాలనే దాస్తున్నారని ఆఖరికి,

'బాణం ఎవరిది' అని అడిగాడు పాండన్న.

బాణం తయారుచేసిన విధానాన్ని బట్టి అది ఏ ఊరి వారిదో, ఎవరిదో వెంటనే తెలుసుకుంటారు. అడవిలోని జంతువులకు వేటాడినప్పుడు దిగబడిన బాణంతో ఆ జంతువు తప్పించుకొని ఎక్కడైనా చనిపోతే దాని శరీరంలో దిగబడిన బాణం ఏ ఊరి వారిదో గుర్తుపట్టి పంపుతారు.

అప్పుడు 'పాయ్‌కీ బావమరుదులు' అని చెప్పారు.

'ఎందుకు' పాండన్న.

'పాయ్‌కీ ఇల్లు జొచ్చింది దాదా' అన్నడు మమ్మల్ని తీసుకొచ్చిన దాదా.

'ఇల్లు జొచ్చితే ఎందుకు బాణం వేసారు' పాండన్న.

అప్పుడు 'పాయ్‌కీనీ రామాల్ ఎత్తుకొచ్చాడు దాదా–అది అత్తగారి ఊర్లో ఉన్నప్పుడు. కానీ దాదా! దానికి కూడా వీడి మీద మనసు ఉంది. ఆ విషయం తెలిసి పాయ్‌కీ బావమరుదులు మా దాదా ఇంటికి వచ్చారు దాదా. రామాల్‌ను కూడా పిల్చారు. అక్కడ కల్లు, లంద తాగుకుంటు కోడికూర తిన్నరంట' అని చెప్పారు.

డాక్టర్ తన పని తను చేసుకుపోతున్నాడు. రక్తపు మరకలను తుడిచి ధనుర్వాతం రాకుండా ఇంజక్షన్ ఇచ్చాడు. పాండన్న వినుకుంటూనే డాక్టరుకు అందించేవి అందిస్తున్నాడు.

కొనసాగించుమన్నట్టుగా పాండన్న 'ఊ...' అన్నాడు.

'కోడికూర తినుకుంట పాయ్‌కీ ముచ్చట ఎత్తింగ్రట దాదా. 'పాయ్‌కీని ఎట్లెట్ల ఎత్తుకొచ్చినవు. మరి ఓలికింద మూడువేల రూపాయలు, ఒక గొడ్డు, రెండు మేకలు, ఆరు కుండల 'లంద' (బియ్యపు పిండిని పులియబెడితే తయారయ్యేదే 'లంద'), ఇప్పసారా పది సీసాలు ఇవ్వాలని అడిగింగ్రంట దాద. రామాల్ అంత ఇచ్చుకోలేనని వెయ్యి రూపాయలు, ఒక మేకను, 'లంద'ను ఇస్తానని అన్నడంట. మేం అడిగినంత ఇవ్వు, లేదంటే పిల్లను తీస్కపోతమన్నరంట దాదా వాళ్ళు. పిల్లను వదలను, మీరు అడిగినంత ఇవ్వలేను అన్నడట. తగాదా పడ్డరంట దాదా. పంచాయితీ ఎంతకు తెగకపోయేసరికి 'తెల్లారి మాట్లాడుదాం లేరి' అని మా దాద అన్నడట దాదా. అప్పటికే బాగా చీకటయ్యింది దాదా. వీడు లేచి నడుసుకుంట ఇంటికి వస్తున్నడంట. ఎవరో గురిచూసి చెట్లలోంచి బాణం వదిలింగ్రంట దాదా. మబ్బులు పట్టి వెన్నెల మసక మసగ్గ ఉండబట్టిగని దాదా గొంతుల దిగితే అప్పుడే ప్రాణం పోవాల్సింది. ఏదో గురితప్పి ఎదర్రొమ్ము ఎముకల మధ్యన దిగింది. వీడికి భూమ్మీద నూకలుండబట్టి' అని ముగించారు.

'అయితే పాయ్‌కీ బావమరుదుల పనే అంటారు' పాండన్న అన్నాడు.

'ముమ్మాటికీ వాళ్ళే దాదా' అన్నారు.

ఏవో అర్థమైన కొన్ని ముక్కలను బట్టి 'ఇంత చిన్న విషయానికి ప్రాణాలు తీస్తరా' అని ఆదివాసీ సమాజానికీ కొత్తవాడైన డాక్టర్ ఆశ్చర్యపోయాడు.

యాంటిసెప్టిక్, పేరాసిటమాల్ మాత్రలు ఇచ్చి ఏవి ఎలా వేసుకోవాలో చెప్పాడు డాక్టర్.

కిట్టంతా అప్పటికే సర్దేసుకున్నాడు డాక్టర్. పాండన్నతో "ఊపిరితిత్తులకుగానీ ఏమన్న తాకిఉంటె ప్రమాదమే. హాస్పటల్‌కి తీసుకుపోతే మంచిది" అన్నాడు డాక్టర్.

పాండన్న అదే విషయం వాళ్ళకు చెప్పాడు. కానీ అక్కడి నుండి నారాయణపూర్‌లో ఉన్న హాస్పటల్‌కు పోవాలంటే కనీసం ముప్పై నుంచి నలభై కిలోమీటర్లు నడవాలి.

కొన్ని జాగ్రత్తలు చెప్పి, ఆ తర్వాత మా కిట్లు ఉన్న ఇంటికి వచ్చాం. శ్యామ్ ఎదురుచూస్తున్నాడు మా కోసం. అది బాగా పట్టు ఉన్న గ్రామం, లోతట్టు అడవి కాబట్టిగానీ లేకపోతే అలా ఒక్కరు ఎప్పుడూ ఉండరు. అప్పటికి టైం ఎనిమిది కావస్తుంది. 'పాండన్న చాయ్ తాగి పోదామె' అన్నాను.

శ్యామ్ టీ పెట్టాడు.

పాయ్‌కీ వచ్చి అక్కడక్కడే తచ్చాడుతుంది. రామాల్ ఇంటికి వెళ్ళివచ్చాము కద. దాని గురించి ఏమన్న మాట్లాడుతరు అనుకొనేమో.

అది గమనించి పాండన్న 'బాత్ పాయ్‌కీ' అన్నాడు ఏంటి విషయం అన్నట్టుగా.

"దాదా పంచాయితీకేసి హన్నుటు (దాదా పంచాయితీ చేసి వెళ్ళండి)" అంది అంతా మీకు తెలిసిపోయిందిగా, ఇంక నేను దానిగురించి చెప్పేదేమి లేదు అన్నట్టుగా.

'మీ అత్తవాళ్ళను పిల్చి పంచాయితీ చేయాలంటే ఒకరోజు ఇక్కడే ఉండాలి. అర్జంటు పని మీద పోతున్నం. తిరిగి వెళ్ళేటప్పుడు ఈ ఊరి మీంచే వెళతాము. అప్పుడు చేద్దాము పంచాయితీ' అన్నాడు పాండన్న.

ఏమీ మాట్లాడకుండా ఎత్తుకున్న పిల్లాన్ని ఇంకోసారి ఎగేసి ఎత్తుకుంది.

నేను దగ్గరికి వెళ్ళి 'బాత్‌పాయ్‌కీ, నాకివ్ పొయ్యి వెహిత్తినయ్యో' (ఏం పాయ్‌కీ, నాకు అబద్ధం చెప్పినవు కదా) అన్నాను.

నా మాట పూర్తికాకముందే అందుకొని 'దీదీ, సత్తె, మతి నన్న కోందనయో, నాకిన్ వెనె జీవమంత, ఆటుమ్‌త కోంద లెక్కవమ్మాయితోర. నాకిన్ మన్ మంతయా హిల్లెయా ఇంజి బోరే తాల్కోర్. వీన (రామాల్) పొర్రు వెన్నె నాకిన్ జీవహిల్లే. మతి హూడ్‌తేక్ నావ సగతోరికిన్ పొర్రు వీరే ఇచోన్ బనేక్ మంతోర్, అదీన్‌కే వీనయగే మందకన్ ఇంజి అలుస్తన్'.

(దీదీ, నిజమే. అబద్ధమె చెప్పినా కానీ, నేను గొడ్డును కాను. నాకూ మనసు ఉంది. సంతలో గొడ్డును అమ్మినట్టు నన్ను అమ్ముతున్నరు. నాకు ఇష్టమేనా లేదా అని ఎవరూ అడగరు. రామాల్ మీద కూడా నాకు ఇష్టమేం లేదు. కానీ నా బావమరుదుల కంటె నయం. అందుకే వీని దగ్గరే ఉందామనుకున్న) అని అన్నాళ్ళుగా తన మనసులో ఉన్నదాన్ని ఆవేశంగా, గబగబా అని, కొడుకును మల్లొకసారి ఎగేసి ఎత్తుకుంది.

ఇన్నాళ్ళుగా అణచిపెట్టబడినది అలా ప్రవాహంలా పాయ్‌కీ మాట మీద మాట అంటూ ఉంటే వింటూ ఉండిపోయా.

'రూపక్కా, ఎన్నిసార్లు పిలిచినా పలకడం లేదు నువ్వు. పద, పద లేటయిపోయింది. వేసుకో కిట్టు' అన్నాడు కిట్టు వేసుకుని దగ్గరికి వచ్చిన పాండన్న.

# ఓ పగ్ని కథ

**- ఎన్. డి.**

ఫార్మేషన్‌లో నడుస్తుందన్న మాటే గానీ మీన మనసంతా ఆ రోజు ఉదయం రాజేష్‌నుండి వచ్చిన ఉత్తరం మీదే ఉంది. శత్రువు కదలికలు తక్కువగా ఉన్న ఏరియా కనక మీనకి ఆలోచనల్లో మునిగిపోవడానికి కొంత వెసులుబాటుగా ఉంది. అడుగు వెంబడి అడుగు యాంత్రికంగా పడుతోంది. సాధారణంగా అప్పటివరకూ జరిగిన సమావేశాన్ని సమీక్షించుకుంటూనో, వెళ్లే ఊరిలో జరపాల్సిన కార్యక్రమం గురించో ఆలోచిస్తూ పరిసరాలు గమనిస్తో నడవడం అలవాటు మీనకి. కానీ ఈ పూట ఆమె కళ్ల ముందు ఒకటే రూపం కదుల్తోంది.

పగ్ని.

పగ్ని ఊరు ఉండిన ఏరియాకు దళం బదిలీ కాగానే కమాండర్ సన్ను ఆమెకు ఒక పరిచయం లాగ ఏరియా విషయాల్ని చెప్పి ఉన్నాడు.

అప్పటికి దళం కొత్తగా వచ్చి తిరగబట్టి ఏడాది అవుతోందట. డిఎకెఎంఎస్ సంఘాలు అప్పుడప్పుడే ఏర్పడుతున్నాయిగానీ కెఎఎంఎస్ సంఘాలు ఇంకా మొదలు కాలేదు. ఆ ఊరికి దళం వెళ్లినప్పుడు మైని, ఇంకొందరు యువతులూ వచ్చేవాళ్లు. తర్వాత బంద్ అయింది. ఎందుకు అని అడిగితే ఊరు పెద్దలు 'మీరు విడిగా దళం దగ్గరకు పోకండి, మాతో పాటే రావాలి, మాతో పాటే వెనక్కి రావాలి గానీ విడిగా దళంతో ఉండద్దు' అన్నారట. విషయం తెలిసి సన్ను ఊర్లో మీటింగ్ చేసి అర్థం చేయించాక మళ్లీ రావడం మొదలైందిట.

ఆ తర్వాత కొన్నాళ్లకే మైని తనను ఎత్తుకుపోయిన వారినుండి పారిపోయింది. 7, 8 ఊర్ల వాళ్లను పిలిచి పెద్ద పంచాయితీ చేశారు. అంత పెద్ద పంచాయితీ దళం వచ్చాక చేయడం మొదటిసారి. చాలాసార్లు మహిళల సమస్య మీదనే ఏరియాల్లో ఇలాంటివి మొదలు కావడం యాదృచ్ఛికం కాదనీ, ఆదివాసీ సమాజంలో తెగ పెద్దల పెత్తనానికి బలైతున్న ఆదివాసీ స్త్రీలకు అండగా నిలవడం వల్ల అనేకచోట్ల ఇదే జరిగిందనీ మీనకి దండకారణ్యానికి వచ్చిన కొద్ది రోజులకే అర్థమైంది. మైనీ, పగ్నిలు మైనిని బలవంతంగా ఎత్తుకుపోయిన వాళ్లను కసిదీరా కొట్టారట.

'అక్కా నువ్వు ఆ రోజు ఉండనుంటివి. వాళ్లలో ఎంత కసి అనుకున్నావ్. పెద్దలు కూడా ఇక కిక్కురుమనలేదు. మొత్తం ఏరియా మీద ప్రభావం పడింది. ఇక అక్కల సంతోషానికైతే

హద్దే లేదు. ఏ ఊరుకు పోయినా అక్కలు పెద్దెత్తున రావడం మొదలైంది. ఒక ఊపు ఊపిందనుకో పిళ్ల పోరాటం' మీన స్త్రీల విషయంలో ఎక్కువ స్పందిస్తుందని తెలిసి ఆ పంచాయితీనీ, ఆ ఇద్దరి వ్యక్తిత్వాన్నీ కళ్లకు కట్టాడు సన్ను.

'సన్ను చెప్పింది నిజమే. ఆ రోజు తను ఉండాల్సింది. పితృస్వామ్యం సంకెళ్లు తెగిపడ్తున్న ఆ చప్పుడును వీనులవిందుగా విని ఉండేది. తన చదువు మాన్పించి మేనరికం చేసుకోవాలని బలవంతం చేసినవాళ్లని తను ఇలా పంచాయితీ పెట్టి ఎదిరించగలిగిందా? ఇక్కడ ఆదివాసీ యువతులకు ఎంత గొప్ప అవకాశాలు దొరుకుతున్నాయి!' అప్పటి తన భావాలన్నీ గుర్తుకొచ్చాయి మీనకి.

సన్ను చెప్పింది విన్నాక ఆ ఊరికెప్పుడు వెళ్తామా, వాళ్లనెప్పుడు పరిచయం చేసుకుంటానా అని మీన ఎదురుచూసింది. ఆ రోజు త్వరలో రానే వచ్చింది

'అక్కా! నేను నిన్న చెప్పింది ఈమె గురించే, గుర్తుంది కదా' అడిగాడు సన్ను మైని కేసి చూపిస్తూ. మీన చిరునవ్వుకు మైనీ చిరునవ్వు నవ్వింది.

'దళంలోకి వచ్చేస్తావా అయితే? కొన్నాళ్లుండి గ్రామంలో మహిళలందర్నీ నీలాగ ధైర్యంగా తయారు చేసి వస్తే మంచిది కాదా?' అడిగింది మీన.

'ఏం కాదు, నేను దళంలోకి వచ్చేస్తాను, పగ్ని గ్రామంలోనే ఉండి అక్కల్ని సంఘంలో నడిపిస్తుంది' అంది మైని ధీమాగా. ఆమె గొంతులో తనను తీసుకోక తప్పదు అనే భావం బలంగా.

'పార్టీ చెప్పినట్టు చేస్తానన్నావు కదా, మరి ఈ మాట వినవా?' బనాయించింది మీన.

'ఏదన్నా వింటాను, ఇదొక్కటీ మీరు వినండి' మైని కూడా తగిన సమాధానం ఇచ్చానన్నట్లుగా.

'మరి పగ్ని కూడా వస్తానంటుందేమో, మీరిద్దరూ ఎప్పుడూ కలిసే అన్ని పన్లూ చేస్తారని సన్ను చెప్పాడే'

'అవును, చిన్నప్పటినుండి మేమిద్దరం జట్టే. సంఘంలోకీ ఇద్దరం అనుకునే వచ్చాం. దళంలోకి వచ్చే విషయం కూడా ఇద్దరం మాట్లాడుకున్నం. తను మీరు ఎట్లా చెప్తే అట్లా చేస్తానంది. నేను వెళ్తా అంటే కూడా మంచిదే అన్నది'

'చూడు మరి పగ్నినే పార్టీ మాట వింటోంది, నువ్వు వినడం లేదు'

'పగ్ని ఎట్లయినా చాలా మంచిదే, అక్కలందరికీ ఎంతో అభిమానం, మంచిగా నడిపిస్తది సంఘాన్ని'

ఇంకా తనని సందేహంలో పెట్టడం ఎందుకని 'నిన్ను ఇవాళ దళంలోకి తీసుకెళ్లాలనుకునే వచ్చాం' అని చెప్పేసింది మీన.

మైని సంతోషం స్పష్టంగా కన్పిస్తూనే ఉండింది. వెంటనే పగ్ని దగ్గరకు ఉరికింది. వాళ్ల స్నేహం చూసి ముచ్చటపడకుండా ఉండలేకపోయింది మీన. అలా మైని ఆ ఏరియాలో రిక్రూట్ అయిన మొదటి మహిళా కామ్రేడ్ అయింది.

పగ్నిని మొదటిసారి చూసినప్పటి రూపాన్ని మీన ఎప్పుడూ మర్చిపోలేదు. ఎంతమంది ఉన్నా చటుక్కున ఆకర్షించే మనిషి కాదు పగ్ని. చిన్నవైనా చురుకైన కళ్లు, ముఖాన్ని వెలిగించే చిరునవ్వు, కొద్దిగా రింగులు తిరిగిన జుట్టు, నుదిటిపై పచ్చబొట్టు, మరీ పొట్టి, మరీ పొడవు కాకుండా ఎత్తుకు తగ్గ లావు, నలుపు వైపుకే మొగ్గే శరీర ఛాయ. గలగలపారే సెలయేరులాంటి, దూకే జలపాతం లాంటి చురుకుదనం, చలాకీదనం లేదు. చురుకుదనం అంతా ఆమె కళ్లల్లో ఉండింది. తర్వాత ఆమె ఆలోచనల్లోని చురుకుదనం అర్థమైంది. 18 ఏళ్లు కూడా నిండని పగ్నిలో ఒకలాంటి గాంభీర్యం ఉండేది. ఆత్మవిశ్వాసం ఉండేది. గ్రామంలో సభ పెట్టి మీ సంఘం అధ్యక్షురాల్ని ఎన్నుకోండి అంటే ఆమెనే ఎన్నుకునే లాంటి నాయకత్వ లక్షణం ఉండింది.

'మన వాళ్లు దొడ్డికి పోతామంటున్నరు, కాస్సేపు ఆగుదాం' కమాండర్ మాటతో ఈ లోకంలోకి వచ్చిన మీన కిట్టు దించి చెట్టుకు ఆనుకునింది. ఆమె గార్డు కూడా 'పోతా' అంటే పొమ్మనింది.

రిక్రూట్ అయిన కొద్ది రోజులకే పార్టీ అవసరాల రీత్యా మైని వేరే దళానికి వెళ్ళిపోయింది. మైని స్థానంలో కెఎఎంఎస్ అధ్యక్షురాలిగా ఎన్నికైన పగ్నితో మీన అనుబంధం మాత్రం కొనసాగింది. బ్యాక్ పోచ్ ముందుకేసుకుని కూర్చున్న మీనకి పగ్ని ఫొటో తన దగ్గర ఉండాలని గుర్తుకొచ్చి తీసి చూసింది. మీనకి ఎవరివీ ఫొటోలు ఉంచుకునే అలవాటు లేదసలు. తన సహచరుడు కిరణ్ ఫొటోనే ఉంచుకోదు. 'మనసంతా నిండిన రూపానికి మళ్లీ ఫొటో ఎందుకు' అనేది కిరణ్ పెట్టుకోమన్నా కూడా. కానీ పగ్ని ఫొటో, సిఎన్మెం డ్యాన్సు చేస్తున్న పిల్లల ఫొటో మాత్రం చాలా నచ్చి ఉంచుకుంది. పగ్ని విడిగా ఫొటో కోసం పోజు ఇచ్చినది కాదది. మీటింగ్‌లో ఆమె మాట్లాడుతున్నప్పటిది. ఒక అమాయక ఆదివాసీ మహిళ ఆ చుట్టుపక్కల గ్రామాల్లో డిమాండ్ ఉన్న వక్తగా మారిన తీరును ప్రతిబింబించే ఫొటో అది. ధాటీగా ఒక చేయి పైకెత్తి తను చెప్పాలనుకున్న విషయాన్ని నొక్కి చెప్తున్నప్పుడు దళం వాళ్లే ఎవరో తీశారు. కిరణ్ రాసిన వుత్తరాలు ఉంచుకున్న కవర్‌లో ఉండొచ్చు అని గుర్తుకొచ్చి చూస్తే నిజంగానే వుందది. నాలుగేళ్ల క్రితం తీసినది. తమ ఏరియాలో వేరే ఊర్లకు కూడా వెళ్లి ఉపన్యాసాలు ఇచ్చిన మొదటి మహిళ పగ్నినే. ఆ తర్వాత ఇంకొందరు వక్తలుగా ఈ రోజు తయారయ్యారంటే ఆమె ఉత్తేజం కూడా ఒక కారణం కదూ. అదొకటేనా, ఏరియాలో ఎన్ని విషయాలకు తను ఆద్యురాలు!

దొడ్డికి పోయిన వాళ్లు రావడంతో తిరిగి నడక మొదలైంది. ఫొటోనీ, ఆలోచనల్నీ కూడా లోపల పెట్టేసి మీన బైల్దేరింది. ఊరిలో కొచ్చి ఆగారు. అందరూ సంతోషంగా చేతులు కలిపి లాల్‌సలాం చెప్పసాగారు.

'దీదీ, చైతు వాళ్ల ఇంటి దగ్గరే ఆగుదాం' అంది సరిత మీన దగ్గర కొచ్చి.

'సరే, మనం అనుకున్న అన్ని మీటింగులూ చేసేవరకూ మూడు రోజులైనా పడ్తుంది కనక అదే మంచిది. అయితే మంగ్లీ బాలింత. మనమే అన్నీ చేసుకోవడమే కాక ఆమెనూ చూసుకోవాలి. ఆ విషయం కూడా సభ్యులకు చెప్పు' అంది మీన.

'ఇంగో' అని రోల్‌కాల్ చేసి, కవర్స్ చూపించి చేయాల్సిన పనులూ, తాము వచ్చిన పనీ

అన్నీ చెప్పింది సరిత. అందరూ ఎవరి పనుల్లోకి వాళ్లు వెళ్లారు. సరిత చాయ్ పెట్టడంతో తాగి, మీటింగ్‌లో చెప్పాల్సిన అంశాల్ని అనుకున్నారు. సభ్యులందరూ రావడానికి ఇంకా సమయం ఉంది. కొందరు వచ్చిన ప్రజల్తో మాట్లాడుతున్నారు. కొందరు పిల్లల్తో ఆడుతూ పాటలు పాడిస్తున్నారు.

మీన గోడకు ఒరిగి కూర్చుని పేపర్ కటింగ్స్ తీసింది దొరికిన ఆ టైంలో చదువుదామని. పేపర్ గానీ, కటింగ్స్ గానీ దొరకడం రోజూ ఉండదు కనక దొరికినప్పుడు ఎన్ని పనులున్నా సాధ్యమైనంత త్వరగా వాటిని చదువుతూ ఉంటుంది మీన. కానీ ఇవ్వాళ కళ్లు అక్షరాల వెంబడి పరుగెడుతున్నాయి గానీ ఏవీ బుర్రకెక్కడం లేదు. దాంతో వాటిని పక్కన పెట్టేసింది.

ఇవ్వాళ వాళ్లు కలవబోయే జీపిసి (1) ఏరియాలో ఏర్పడిన నాలుగవ జీపిసి. మొదటి జీపిసి ఏర్పడింది పగ్ని వాళ్లతోనే. పగ్ని తమ ఏరియాలో మొదటి జీపిసి సభ్యురాలు. మూడు ఊర్ల పార్టీ సెల్ సెక్రటరీగా ఎదిగింది. ఆమె సెల్‌లో మిగతా ఇద్దరూ పురుషులే. కానీ వాళ్లు ఆమె నాయకత్వాన్ని హృదయపూర్వకంగా ఆమోదించేవారు. ఆమె వ్యక్తిత్వం, కలుపుగోలుతనం అలాంటిది. సెల్‌ని నడిపిస్తూనే కెఎఎంఎస్ గ్రామ కార్యవర్గాన్ని కూడా గైడ్ చేసేది. ఆమె నాయకత్వంలో ఎన్నో పోరాటాలు చేశారు. ఆ ఏరియాలో బలవంతపు పెళ్లిళ్లు తక్కువ కావడంలో వీరి పాత్ర చాలా ఉండింది. వాళ్ల జీపిసి కొన్ని వూళ్లకు బాధ్యత వహించినా బలమైన సంఘాలు ఉన్న వూళ్లు కావడంతో చుట్టుపక్కల సెల్స్ లేని 10, 12 గ్రామాల ప్రజలు కూడా వీరి వద్దకు వచ్చి సలహాలు తీసుకునేవారు లేదా పంచాతుల కోసమో, పోరాటాల కోసమో, సభల కోసమో తీసుకెళ్లేవారు. దళం అనేక పనుల్లో తలమునకలుగా ఉండి అన్ని గ్రామాలనూ అందుకోలేక పోయినప్పుడు వీళ్లే వారితోనూ సంబంధంలో ఉండేవారు.

ఆ ఊర్లల్లో పగ్ని నాయకత్వంలో పోరాటాలెన్నో జరిగాయి. పగ్ని ఎక్కువ మాట్లాడేది కాదు సమావేశాల్లోనైనా. కానీ మాట్లాడిన కొన్ని మాటలూ తనకు స్పష్టత ఉన్నవే అయి ఉండేవి. ఆ సూటిదనం, ఇతరులు మాట్లాడేదాన్ని శ్రద్ధగా వినడం, పోరాటాల్లో ముందు ఉండడం లాంటి లక్షణాలన్నీ ఆమెను ప్రజలకు దగ్గర చేశాయి.

పగ్ని వయస్సు వాళ్లు జతగాళ్లని వెతుక్కుంటున్నారు. పగ్నిని కూడా జీపిసి సభ్యురాలిగా తీసుకున్నాక మీననే పెళ్లి గురించి కదిపింది. అప్పటికి వాళ్లిద్దరి మధ్యా కలిసి పని చేయడం నుండి ఏర్పడే ఒక గాఢమైన అనుబంధం, స్నేహం ఏర్పడి ఉన్నాయి. తనకి నచ్చినవాళ్ళు ఎవరూ లేరనీ, వుంటే చెప్తాననీ అంది పగ్ని. అప్పటికే మిగతా చోట్ల ఎదురైన అనుభవాలనుండి మీన రెట్టించి కూడా అడిగింది. పార్టీ నియమాలూ చెప్పింది. కానీ నిర్మలమైన కళ్లతో పగ్ని అదే చెప్పింది. అప్పటికి అదే నిజం కూడా.

పగ్ని పూర్తికాలం రావడానికి సిద్ధంగా ఉన్నట్లు ఉండేది కనక కూడా మీన ఆమె తనకి తగని వ్యక్తిని ఎక్కడ ఎంచుకుంటుందోనని కూడా శ్రద్ధగా అడిగింది. ఆమెకున్నంత నిబద్ధత అతనికి లేకపోతే కష్టమౌతుంది. అలా కొందరు చురుకైన అమ్మాయిలు ఇంటికి పరిమితమైపోవడం అరుదుగానైనా జరిగింది కనక జాగ్రత్తగా ఉండాలని మీనకి ఉండేది.

ఆ తర్వాత మీన జిల్లా కమిటీ సభ్యురాలిగా ఎన్నికవ్వడంతో తీరిక లేకుండా అయిపోయింది. పగ్ని వాళ్ల ఊరు కేంద్రంగా ఒకప్పుడు దళం పని ఉండేది. క్రమంగా ఉద్యమ ప్రాంతం విస్తరించింది. కొత్త దళాలూ ఏర్పడ్డాయి. దాంతో మీన పగ్నిని కలిసే సందర్భాలు తక్కువైనాయి. అయినా కలిసినప్పుడు ఎప్పుడైనా కామ్రేడ్లీ సంబంధాలు వారి మధ్య గుబాళించేవి. పగ్ని వ్యక్తిగత జీవితం గురించి ఆ రోజుటి సంభాషణ తర్వాత మళ్లీ ఎప్పుడూ ప్రస్తావించే అవకాశం కలగలేదు మీనకి.

'తను పొరపాటు చేసిందేమో, మళ్ళా కొద్ది రోజులకు పగ్నితో మాట్లాడాల్సిందేమో' మీన ఏ వెయ్యోసారో తనని తాను నిందించుకుంది. అన్ని విషయాల్లో ముందు ఉంటూ పార్టీకి గొప్ప ఆశాకిరణంగా ఉండిన పగ్నీ ఈ విషయంలో ఎందుకు కాసుకోలేకపోయింది? అమాయకత్వమా? బలహీనతా?

సుదురుని మీన రెండు, మూడు సందర్భాల్లో కలిసింది గానీ అంతగా గుర్తు లేదు. అయితే 'సంఘటన' జరిగిన రోజు చూశాక గుర్తుపట్టింది. పగ్నికంటే నాలుగైదు ఏళ్లు పెద్దవాడే. మనిషి చక్కగా ఉంటాడు. కానీ బాగా తాగుతాడు. సంఘం సభ్యుడు. అన్ని కార్యక్రమాలకు తప్పక హాజరయ్యేవాడు. అతని లోపాల్ని పోగొట్టి పార్టీ సభ్యుడిగా ఎదిగించుకోవచ్చు అనే అంచనా కూడా ఇచ్చారట అక్కడి సెల్ సభ్యులు.

పగ్ని ఏం చూసిందతనిలో?

పెళ్లి విషయంలో అంత స్పష్టంగా మాట్లాడిన పగ్ని కొద్ది నెలల్లోనే ఎలా లొంగిపోయింది? తామే ఆమె అంతరంగాన్ని కొలవడంలో పొరపాటు పడ్డామా? తోడు కోసం ఆమె మనసు పడిన ఆరాటాన్ని ఎవరం గమనించలేకపోయామా?

'లాల్‌సలాం', పాండు గొంతు విని ఈ లోకంలోకి వచ్చింది మీన. జిపిసి సభ్యులందరూ వచ్చేశారు. అందరూ లాల్‌సలాం చెప్పుకుని చేతులు కలుపుకున్నారు.

'మనం ఏకంగా తిని కూచుందాం. వీళ్లు తినే వచ్చారు. ఈలోపు జిపిసి వాళ్లు ఊరు వాళ్లతోనూ మాట్లాడ్తారు'. ఊరివాళ్లూ తమ నాయకులైన ఆ జిపిసి సభ్యులతో మాట్లాడాలని చూస్తూ ఉంటారని తెలిసిన సరిత అంది.

అన్నాలు తిని కూచున్నారంటే మధ్యలో ఓ గంట సేపు తప్ప రాత్రి వరకూ సమావేశం కొనసాగించారు. చిన్న, చిన్న పనులు చేసుకుని తిని పాల్తీన్ మీద వాలేవరకు 11 కావొచ్చింది. దళం సెంట్రీనే కాక మిలీషియా సెంట్రీ కూడా నడుస్తోంది. నిద్రలో సునీత కప్పుకున్న దుప్పటి పక్కకు పోతే తీసి మంచిగా కప్పింది మీన. తన కళ్లు మాత్రం పత్తికాయల్లా విచ్చుకునే ఉన్నాయి. పగ్ని గురించిన ఆలోచనలు మది నిండా అలుముకున్నాయి.

సుదురు కూడా పగ్నికి వరసకు అన్న అవుతాడు. రోజూ సాయంత్రం ఆమె ఇంటికి వెళ్లి ముచ్చట్లు పెట్టేవాడు. తాగేవాడు. క్రమంగా కలిసి తాగడం మొదలు పెట్టారు. పగ్ని తల్లిదండ్రులకూ, చుట్టుపక్కలవాళ్లకూ వారి మధ్య పెరుగుతున్న చనువు అనుమానాలకు దారి తీసింది. ఇంట్లో కాక ఖేతుల్ వద్ద కలవసాగాడు. ఆ క్రమంలోనే ఎప్పుడో ఒక రోజు సంబంధాలు

కూడా పెట్టుకున్నాడు.

తప్పు జరిగాక కూడా పగ్ని దాన్ని తమకెందుకు చెప్పలేదో? గ్రామ ప్రజలు ఇలాంటి సంబంధాల్ని హర్షించరు సరి కదా నరికి పోగులు పెడ్తారని కూడా తెలుసు. పార్టీ కూడా ఇలాంటివాటిని హర్షించదు అనే అంశాన్నే చూసింది గానీ ఇలాంటి సమస్యల్ని పార్టీ సహాయంతోనే అధిగమించాలనే రెండో వైపు అంశాన్ని చూడలేకపోయింది. భయపడింది. తప్పు చేస్తున్నాననే అపరాధ భావం, మరోవైపు అతనికి లొంగిపోయిన బలహీనత. పగ్ని కొట్టుకుపోయింది. ఆమె కెక్కడా పట్టు దొరకలేదు.

ఇలాంటివి గ్రామాల్లో ఎంతకాలం దాగుతాయి? నెలరోజులు కూడా కాకుండానే ఖేతుల్‌లో ఇద్దరూ కలిసి ఉండగా గ్రామస్తులు పట్టుకున్నారు. ఇద్దర్నీ కొట్టుకుంటూ తీసుకొచ్చి గ్రామంలో కట్టేశారు.

ఆ రోజుని మీన జీవితంలో మర్చిపోలేదు. ఎప్పట్లాగే ప్రేమా, ఆప్యాయతల్తో స్వాగతం పలుకుతుందనుకున్న గ్రామం ఆ రోజు తాము వచ్చినప్పుడు 'పరిచయం లేనిదిగా' మారిపోయింది. నిర్మానుష్యంగా, అసాధారణమైన నిశ్శబ్దంతో ఉన్న గ్రామాన్ని చూసి దళానికి ఏం అర్థం కాలేదు. ఇంతలోనే

'పగ్నినీ, సుదురునీ కట్టేశారు, చంపేస్తామంటున్నారు'

పాండు ఉరికొచ్చి చెప్పిన మాటల్తో అందరూ నిశ్చేష్టులైపోయారు ఒక్క క్షణం. సన్ను అందరికంటే ముందు ఉరికాడు. అందరూ వెనకాలే ఉరికారు. అప్పటికే బాగా కొడ్తున్నారు ఇద్దర్నీ. పగ్ని శరీరం వాతలు తేలి ఉంది. సన్ను అమాంతం వెళ్లి అడ్డం నిలబడ్డాడు. దళం అంతా వాళ్ల చుట్టూ నిలబడింది. సరిత గబగబా వెళ్లి పగ్ని కట్లు విప్పింది.

మీన పగ్నినే చూస్తోంది. ఎంత నిర్వికారంగా ఉన్నాయామె కళ్లు! కళ్ల నుండి నీళ్లు కూడా కారడం లేదు. అనుభవించాల్సిందేదో అనుభవించక తప్పదు అన్నట్లుగా ఉంది. ఎన్నో పంచాతుల్లో తీర్పు చెప్పే స్థానంలో ఉండిన పగ్ని ఇప్పుడు దయనీయంగా తీర్పు చెప్పించుకునే స్థానంలో నిలబడి ఉంది.

వరసకి అన్న చెల్లెళ్లైన వారి మధ్య సంబంధం తప్పు కాబట్టి చంపేస్తాం అని గ్రామస్తులూ, తప్పు ఒప్పుకుంటే చాలని దళమూ......పెద్ద యుద్ధమే జరిగింది రెండు పక్షాల మధ్యా. ఇద్దరూ తప్పు చేసినా గ్రామస్తులు పగ్ని విషయంలో ఎక్కువ సీరియస్‌గా ఉండడం మీన దృష్టిని దాటిపోలేదు.

తమ నాయకురాలిగా ఉండి ఇలా చేసిందనా? స్త్రీ అనా?

దళం ఆ గ్రామంలో తనకున్న పలుకుబడి అంతా ఉపయోగించి నయానా, భయానా కూడా చెప్తే తప్ప గ్రామస్తులు ఒక పట్టాన దిగిరాలేదు. ఆ గ్రామం కోసం పార్టీ చేసినదంతా గుర్తు చేసి, ఇప్పుడు కూడా పార్టీ వాళ్ల మేలు కోసమే చేస్తోందనీ, చిన్న కారణాలతో చంపుకోవడం వల్ల ఉపయోగం లేదనీ అర్థం చేయించేసరికి దళం తల ప్రాణం తోకకొచ్చింది. సన్ను పెద్ద కొండ లాగా నిలబడి ఏ మాత్రం సందు ఇవ్వకుండా వాదించుకుంటూ వచ్చాడు. పగ్ని,

నుదురులు తప్పు ఒప్పుకున్నారు. మళ్లీ చేయం అని హామీ ఇచ్చారు. పగ్ని అదే గ్రామంలోనే ఉంటుందనీ, ఆమెకు ఎవరూ ఏ విధమైన హానీ తలపెట్టరాదనీ పదే పదే చెప్పింది దళం.

తాము అనుకోకుండా ఆ సమయానికి రావడం ఎంత మంచిదైందోననే భావం దళంలోని ప్రతి ఒక్కరి మనస్సులో మెదిలింది. సందేహం లేదు, అంబు వేసో, గొడ్డలితో నరికో చంపేసేవారే. మంత్రగాళ్లు, మంత్రగత్తెలనే పేరుతోనో, ఆచారాల్ని ఉల్లంఘించారనే పేరుతోనో ఎన్ని హత్యలు జరిగేవి! పార్టీ వచ్చాక హత్యల శాతం బాగా తగ్గినా అక్కడక్కడ అవశేషాలు ఉన్నాయనే చెప్పాలి. సాంస్కృతికంగా ఇంకా చాలా కృషి అవసరం ఉంది. ఆర్థిక జీవనంలో మార్పు రాకుండా ఇది పూర్తిగా సాధ్యం కాదని ఎన్ని సార్లు అనుకునేవాళ్ళు!

పగ్నిని ఆప్యాయంగా చేతులు కలిపి, మందులు ఇచ్చి ఇంటికి పంపేశారు. ఆ స్థితిలో ఆమెతో మాట్లాడేలా లేదు. జిపిసి ఆమెను పార్టీ సభ్యత్వాన్నుండి కొంతకాలం సస్పెండ్ చేసినప్పుడు పార్టీ చర్య సరైనదేననీ, తాను తప్పును సరిదిద్దుకుంటానని మాట్లాడిందనీ సన్ను ఉత్తరం రాసిందు తర్వాత.

ప్రజలపై గ్రామ పెద్దల పట్టును దళం అంచనా వేయలేకపోయింది. చాలా విషయాల్లో పార్టీ మార్గదర్శకత్వంలో నడిచే ప్రజలు కొన్ని విషయాల్లో ఇంకా పెద్దల మాటల్నే వింటున్నారు. గ్రామంలోనే పగ్నిని ఉంచాలనే నిర్ణయాన్ని ప్రత్యక్షంగా ఎదిరించకుండా, పరోక్షంగా ఆమెకి అక్కడ ఉండడం కష్టమయ్యేలా చేశారు. పగ్ని ఊరు వదిలి ఎందుకు వెళిపోయింది అనే ప్రశ్నకు సరైన సమాధానం రాలేదు. నోటితో చెప్పకున్నా పెద్దల పెత్తనం గురించి తెలిసిన దళానికి కారణం ఊహించుకోవడం కష్టం కాలేదు.

అదే కాలంలో మీనకి వేరే చోట బాధ్యతలు రావడంతో ఈ దళం ఏరియాకు రావడం దాదాపుగా ఆగిపోయింది. ఆ తర్వాత పగ్ని గురించిన సమాచారం సన్ను లేదా రాజేష్ రాసే ఉత్తరాల ద్వారానే ఆమెకు తెలిసేది.

'కా. పగ్ని మన ఏరియా పరిధిలో లేని ఒక దూరపు బంధువు దగ్గరకు వెళ్లిందని తెలిసింది. కాంటాక్టు చేసే ప్రయత్నం చేస్తున్నాం' అని మధ్యలో రాజేష్ ఉత్తరం రాశాక మీన కూడా ఇతర విషయాల్ని రాస్తూ కింద లైన్లు కొట్టి మరీ పగ్నిని ఎలాగైనా కలిసే ప్రయత్నం తీవ్రంగా చేయమని రాసిన విషయం మీనకి ఇంకా గుర్తుంది.

దాహం వేసి లేచి పక్కనున్న బాటిల్ నుండి నీళ్లు తాగింది. చల్లటి నీళ్లకు పళ్లు జివ్వుమన్నాయి. చప్పుడు కాకుండా లేచి తుపాకీ అందుకుని సునీతని కదిపింది. సునీత టక్కున లేచింది. కళ్లతో సైగ చేయగానే లేచి తుపాకీ అందుకుంది. ఇద్దరూ వెళ్లి సెంట్రీ చెకింగ్ చేసి వచ్చారు. అప్రమత్తంగానే ఉంది సెంట్రీ. మీన సంతృప్తిగా తిరిగి వచ్చింది. సునీత వెంటనే పడుకుంది గానీ మీనకి అస్సలు నిద్ర పట్టడం లేదు. దుప్పటి దగ్గరగా లాక్కుని సునీతకి దగ్గరగా జరిగింది.

ఆ తర్వాత....? మళ్లీ ఆ ఏరియాలో జిల్లా కమిటీ మీటింగ్‌కి వెళ్లినప్పుడు సన్ను చెప్పాడు పగ్నికి ఆ ఊర్లో ఎదురైన చేదు అనుభవం గురించి. ఆ దూరపు బంధువు పగ్నితో అశ్లీలంగా

వ్యవహరించడానికి ప్రయత్నించడంతో పగ్ని ఆ ఊరునుండి వేరే దగ్గరకు వెళిపోయిందని. జిల్లా కమిటీ అందరూ ఉన్నారు కనక పగ్నిని ఎలాగైనా కలిసి సంగం బలంగా ఉన్న గ్రామంలో ఉంచాలని నిర్ణయం తీసుకున్నారు.

కొన్నాళ్లకు పగ్ని తిరిగి చురుగ్గా పని చేస్తోందని, సన్ను ఉత్తరం రాసినప్పుడు తను ఎంత సంతోషించిందో తనకే తెలుసు. తను పగ్నికి ఉత్తరం రాసి పంపింది కూడా.

ఇప్పుడు మళ్లీ ఈ వార్త!

చపున కళ్లలో నీళ్లు తిరిగాయి మీనకి. బాధ, కోపం అన్నీ ఒక్కసారిగా ముంచు కొచ్చాయి.....

ఆలోచిస్తూ, ఆలోచిస్తూ ఎప్పటికో కళ్లంటుకున్నాయి.

* * *

రాజేష్ నుండి పగ్ని గురించి ఉత్తరం వచ్చి అప్పుడే నెల అయి ఉంది. కానీ మీన మనసు నుండి పగ్ని గురించిన ఆలోచనలు తొలిగింది లేదు. మధ్యలో భాస్కర్‌కు ఉత్తరం పంపాల్సి వచ్చింది. విషయాలు రాస్తూ చివరగా పగ్ని గురించి కూడా వివరంగా రాసింది. పార్టీలో మహిళల స్థితిని మెరుగుపర్చాలనే తపన ఉన్న కామ్రేడ్‌గా భాస్కర్‌కు రాయడంతో మీన మనసు కొంత తేలికపడింది.

'పగ్నిని కలవగలిగితే బాగుండు'

అని చాలాసార్లు అనుకుంటూ ఉందేమో రాజేష్‌తో అపాయింట్‌మెంట్‌కి వచ్చిన బ్యాచ్‌లో పగ్నిని చూడడంతో మీన ఆనందాశ్చర్యాలలో మునిగిపోయింది.

అందరికీ లాల్‌సలాం చేసి పగ్నిని ఆనందంగానూ, ఆర్ద్రంగానూ కూడా దగ్గరకు తీసుకుంది. పగ్ని గతంకంటే గంభీరంగా ఉన్నట్లు తోచినా కళ్లలోని ఆ మెరుపు తగ్గలేదని గమనించింది మీన.

అపాయింట్‌మెంట్‌కి వచ్చిన పని చూసుకుని తిరిగి సాయంత్రానికల్లా పగ్ని వాళ్లు వెళ్ళిపోతారని మీనకి తెలిసినా పగ్నితో మాట్లాడడానికి ఎక్కువ సమయం కేటాయించుకో లేకపోయింది. అయినా చివర్లో ఇక త్వరత్వరగా సరితకి కొన్ని పనులు అప్పగించేసి పగ్నితో కూచుంది. దేరాకు ఒక వైపు పెద్ద రాళ్లు ఉండడంతో ఇద్దరూ అక్కడే కూచున్నారు.

పగ్ని మాట్లాడ్తుంటే తన నిర్మలమైన ముఖాన్నీ, చిరునవ్వునీ తనివితీరా చూస్తోంది మీన. వాళ్ల ఏరియాలో ఈ మధ్య చేసిన కార్యక్రమాల్ని అడిగింది మీన ఉపోద్ఘాతంగా. అవసరమైన వివరాల్ని మాత్రం సూటిగా, ముఖ్యమైన అంశాలు ఏవీ వదలకుండా చెప్తోంది పగ్ని. మగవాళ్లు కూడా ఇంటిపన్లు చేయాలనే అంశాన్ని కూడా ఎలా అమలు చేయించడానికి ప్రయత్నించారో పగ్ని చెప్తుంటే మీన ఆసక్తిగా విన్నది.

ఇంకా వివరంగా తన అనుభవాలు వినాలని ఉన్నా సమయం ఎక్కువ లేదని ఇక వ్యక్తిగత విషయాన్ని తడమాలనుకుని ఉపోద్ఘాతంగా,

'పగ్నీ, ఈ మధ్య మైని ఏమన్నా కలిసిందా?'

'లేదు'

'సతీష్ విషయం ఇలా అయిందని తనకి తెలుసా? రాశావా?' మెల్లగా భుజం మీద చేయి వేస్తూ అడిగింది.

ఒక్క క్షణం కనిపించీ కనిపించనట్టుగా పగ్నీ ముఖంలో చిరునవ్వు మాయమైంది. తిరిగి కళ్లు మూసి తెరిచేంతలో అది ఆమె పెదవుల మీదకు పాకింది.

'అక్కడి దళంవాళ్లకి కూడా సతీష్ వెళ్ళిపోయిన విషయం డిసి నుండి తెలిసి ఉంటుంది కదా. నేనేం రాయలేదు'

'మీరు ఇద్దరూ అనుకున్నారా? లేక....?'

'ఆరు నెలలవుతుంది, సతీషే అడిగిండు, నాకూ నచ్చి సరే అన్నా'

'ఈ నెలలోనే పెళ్లి చేయాలని కూడా అనుకున్నారట కదా....వెళ్ళిపోయే ముందు కనీసం నీకు ఏమైనా అర్థమైందా, నీతో ఏమన్నా అన్నాడా?'

'అస్సలు అందాజనే అందలేదు దీదీ. అందితే రాజేష్ దాదాతో అనకపోదునా?'

'అవునులే. నాకు సతీష్ అంత పరిచయం లేదు, ఒకసారి చూశానంతే. నిజంగా ఇలా చేస్తాడనుకోలేదు. పార్టీకీ ద్రోహం, నీకూ ద్రోహం.....' మీన గొంతులో ఎంతో ఆవేదన. ఆమె తట్టుకోలేకపోతోంది. సమాజంలో మగవాళ్లూ మోసం చేసి, పార్టీ మనిషీ ఇట్లా చేస్తే ఎట్లా అని ఆమె మనసు కుతకుతలాడుతోంది.

'రాజేష్ దాదా కూడా అదే అన్నాడు. పార్టీకి చెప్పకుండా ఇలా వెళ్ళిపోవడం, అందులోనూ డబ్బులు తీసుకుని.....'

'నీకిట్ల చేసిండని బాధ పడ్తున్నావా పగ్నీ?'

'పార్టీలో మంచిగా ఉన్నాడనే కదా అడిగితే పెళ్లికి ఒప్పుకున్నా. పార్టీనే వద్దనుకున్నడు కదా..అందులోనూ ఇట్లా ద్రోహం చేసి...ఇంక బాధేముంటది? ఇట్లాంటి ద్రోహులతో ఎట్లుంటున్నామో అట్లుండాల్సిందే, ఇంకేముంది?' తొణకకుండా ప్రశాంతంగా చెప్పింది పగ్నీ.

మీన మనసులో ఒకేసారి ఎన్నో భావాలు ముప్పిరిగొన్నాయి. ఇలాంటి కామ్రేడ్ పట్లనా సతీష్ ఇలా చేసిందని అతని మీద కోపం, విషయాన్ని ఇంత సరిగా అర్థం చేసుకుందని పగ్నీ మీద గౌరవం, జీవితంలో ఇన్ని ఎదురుదెబ్బలు తిన్నా చెదరని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తున్న ఆమె పట్ల అబ్బురం...

'పగ్నీ, వ్యక్తిగత జీవితంలో నీకు వరసగా ఎదురు దెబ్బలు తగాలాయి. వాళ్లంతా సమాజంలో మగవాళ్లు. కానీ సతీష్ పార్టీ మనిషి అయి ఉండీ నిన్ను ఇలా మోసం చేశాడు, ఇలాంటివాళ్ల వల్ల పార్టీకి కూడా ఎంత చెడ్డ పేరు, నీకూ ఇది తట్టుకోవడం......'

ఇంతకాలానికి ఇన్ని ధక్కామొక్కీలు తిన్న తర్వాత, పగ్నీ సతీష్‌ని పెళ్లి చేసుకోవాలని ఇష్టపడ్డాక పార్టీ మనిషే ఇలా చేయడం అనేది మీనకి దుర్భరంగా ఉంది. అంత కాలంగా లోపల ఉన్న క్రోధం మాటల్లో ప్రతిఫలించింది.

పగ్నీ కూడా ఒక క్షణం మౌనంగా కళ్లు దించుకుని కూచుంది. తలెత్తి చిన్నగా నవ్వి,

'దీదీ, అతను ఇలాంటివాడని పెళ్లికి ముందే తెలిసింది మంచిదే అనుకుంటున్నా. కాదా? ఇక మహిళల విషయంలో ఎవరు తప్పు చేసినా పోరాడాలనే కదా మనం మహిళా సంగంలో చెప్తున్నది, నువ్వూ మాకు క్లాసుల్లో అదే చెప్పావు, ఊరి దాదా అయినా, పార్టీ దాదా అయినా అంతే అని, కదా? అతను పార్టీనే వద్దనుకున్నాక ఇక అతని మీద మన పోరాటం కూడా అలాగే ఉంటుంది' నిబ్బరంగా వెలువడ్డాయా మాటలు ఆమె నోటినుండి.

మీన తదేకంగా చూస్తో ఉండిపోయింది ఆమెని. అప్పటిదాకా అల్లకల్లోలంగా ఉన్న మనసు ఒక్కసారిగా తేటపడ్డట్లయింది. అ మాటల్తో ఏదో శక్తి వచ్చినట్లనిపించింది.

'సరిగ్గా చెప్పావు' అంది మీన మనస్ఫూర్తిగా.

'మీన దీదీ, పగ్నిని పంపు, కిట్లు వేసుకుంటున్నాం' కొద్ది దూరం నుండి విజ్జో కేకేసింది.

పగ్నీ, మీన ఇద్దరూ తుపాకులు తీసుకుని లేచారు.

పగ్ని ముందుగా నడుస్తోంది. మీన ఏదో అడగబోయి ఒక క్షణం సందేహించింది. కానీ మళ్లీ ఎప్పుడు కలుస్తుందో ఏమో అని పగ్నీ వెనకే గబగబా నడుస్తూ,

'పగ్నీ' అని పిలిచింది.

పగ్ని వెనక్కి తిరిగింది.

'పూర్తి కాలం దళంలోకి వస్తున్నావని రాజేష్ చెప్పిండు'

'ఇంగో'

'చాలా మంచిది'

' '

పగ్ని చేతిని చేతిలోకి తీసుకుంది. పగ్నీ ఏంటన్నట్లుగా మీననే తదేకంగా చూస్తోంది.

'మళ్లీ నీకు ఒక తోడు కావాలనిపిస్తే ఇలా అయిందని చెప్పకుండా ఉండవు కదా?'

పగ్ని నవ్వింది.

ఇద్దరూ డేరా కేసి వెళ్లారు. లాల్‌సలాం చెప్పుకుని వెళ్లే బ్యాచ్ విడిపోయింది. మీన పగ్నీ కనుమరుగు అయ్యేవరకూ ఆమెనే చూస్తూ ఉండింది.

జీవితానుభవంతో, ఉద్యమ ఆచరణతో రాటుతేలిన వజ్రంలా ప్రకాశిస్తున్న పగ్ని తేజస్సుతో అడివి కొత్త అందాన్ని సంతరించుకున్నట్లనిపించింది మీనకి.

1. జిపిసి - గ్రామ పార్టీ కమిటీ.

***అరుణతార, సెప్టెంబరు-అక్టోబరు 2011***

# తల్లి ప్రేమ

- మిడ్కో

"పొద్దు నెత్తిమీదికొచ్చింది. ఈ పూటకు ఏరింది చాల్లే. ఇగ పోదంపా అక్కా ఇంటికి. మళ్లా ఇంటికి పోయి నీళ్లు, గీళ్లు తెచ్చుకొని వండుకోవద్దా..." చిన్నబుట్టలో ఏరిన ఇప్పపూవును పెద్ద గంపలోకి పోస్తూ అంది మంగ్లి.

"పోదం పా. నీళ్లు కూడా అయిపోయినయి. దూప అయితాంది. ఇంటికి పోయి ఇంత జావ తాగితే పాణం కొంచెం నిమ్మలమయితది" అంటూ సోంవారి కూడా తన బుట్టలోని ఇప్పపూలను గంపలో పోసి సర్దుకోసాగింది. గుండు మల్లె మొగ్గల్లాగా ఉన్న ఇప్పపూలతో నిండిన గంపలు  కంటికింపుగా ఉన్నాయి.

"నీకు  కోడలుంది కదా. ఇంటికి పోయినంక చెరో పని చేసుకుంటే తొందరగయితది నేనొక్కదాన్నే జేసుకోవాల్నాయె" గంప నెత్తి మీద పెట్టుకొని నీళ్లు తెచ్చుకున్న సొరకాయ బుర్రను చేతిల పట్టుకొని త్వరత్వరగా అడుగులేస్తూ అంది మంగ్లి.

"మరి సుక్కుకు పెళ్లి సేయరాదూ. కోడలొస్తది. నీకూ జెర తిప్పలు తప్పుతయి" ఆమెను అనుసరిస్తూ అంది సోంవారి.

"నేను చేసుకొమ్మనే జెప్తున్నా గని ఆడింటున్నడా?".

"వానికి దళంలకు పోయే ఆలోచన ఉన్నట్టుంది"

"నేను "ఊ" అంటే పోతందుకు తయారుగున్నడు. కనీ ఆడొక్కడే కదా నాకు, ఆడు పోతే నాకు దిక్కెవరూ? అందుకనే వద్దని జెప్తున్నా"

"నువ్వొద్దంటే ఆడింటడా?"

"నా మాట కాదనడు వాడు. నేను బాధ పడితే సూడలేడు"

"నిజమే సుక్కు శానా బుద్ధిగల్లోడు"

సోంవారి అలా తన కొడుకును మెచ్చుకున్నందుకు మంగ్లి కళ్లు చిరు గర్వంతో మెరిశాయి. పెదవులపై చిరునవ్వు తొంగి చూసింది.

మంగ్లికి నలభై అయిదేళ్లు ఉండొచ్చు. చామన ఛాయతో కొంచెం పొట్టిగా ఉంటుంది. కాయకష్టం చేయడం వల్ల శరీరం దృఢంగా ఉంటుంది. గుండ్రటి మొహం, ప్రశాంతమైన చూపులు, చక్కటి పలువరుసతో ఆకర్షణీయంగా ఉంటుంది. సుక్కు కంటే ముందూ, వెనుకా అయిదారు

మంది పుట్టారు. కానీ సుక్కు ఒక్కడే దక్కాడు. అయిదేళ్ల క్రితం ఆమె భర్త కాలుకు ఏదో గడ్డ పుట్టింది. మేకలు, పందులూ అమ్మి బీజాపూర్‌కు తీసికెళ్లి వైద్యం చేయించింది. కానీ ఫలితం లేకపోయింది. ఏడాది పాటు అవస్థ పడి ఆయన చనిపోయాడు. అప్పటి నుండి ఇక ఆమెకు కొడుకే ప్రపంచం. ఉన్న భూమిలో ఇద్దరూ కష్టపడుతారు. భూమి పనితోపాటు దండకారణ్యా వాసులందరిలాగే అడవి మీద ఆధారపడుతారు. ఇప్పపూవు, గారపప్పు, తునికాకు, బంక, లక్క, తేనెవంటివి సేకరించి సంతలో అమ్ముకుంటారు. ఉన్నంతలో అందరిలాగే తృప్తిగా ప్రశాంతంగా సాగిపోతోంది వాళ్ల జీవితం.

సోంవారిది మంగ్లి పక్కిల్లే. వరుసకు అక్క అవుతుంది. ఇద్దరు బిడ్డలూ, అయిదుగురు కొడుకులామెకు. ఒక బిడ్డ, కొడుకు దళంలో పని చేస్తారు. ఒక బిడ్డకూ, కొడుక్కూ పెళ్లయింది. మిగితా ముగ్గురు కొడుకుల వయసు పదేళ్లకు అటు ఇటుగా ఉంటుంది. కోడలూ, చిన్న కొడుకులూ కల్సి తమ భూమిలోని చెట్ల కింద ఇప్పపూలు ఏరడం కోసం వెళ్లారు. ఆమె మాత్రం మంగ్లితో పాటు ఇటు వైపు అడవికి వచ్చింది.

ఇద్దరూ మోకాళ్ల కిందికి లుంగీ కట్టుకొని జాకెట్ వేసుకొని మరో లుంగీ ముక్కను పైటగా వేసుకున్నారు. ఆ పైటతో మొహానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ వడివడిగా నడువసాగారు. మార్చి నెల కావడంతో రాత్రుళ్లు చల్లగానే ఉంటున్నా పగలు ఎండ బాగానే కొడుతోంది. ఆకులు రాల్చుకున్న అడవి అప్పుడప్పుడే కొత్త చిగురును తొడుక్కుంటోంది. ఇప్ప చెట్లు మాత్రం పచ్చగా గుబురుగా పూల గుత్తులతో నిండుగా నవ్వుతున్నాయి. పూసుగు, తునికి చెట్లు కూడా పచ్చబడి కంటికి ఇంపుగా ఉన్నాయి.

వడివడిగా నడుస్తున్న మంగ్లి ఒక్క క్షణం ఆగి పక్కనే ఉన్న ఇప్ప చెట్టుకేసి నడుస్తూ "అల్లెంగు మిందే (ఎర్రచీమలున్నయి)" అంది. ఇద్దరూ  బుట్టలు దించుకున్నారు. ఒక కర్రను తీసుకొని సోంవారి కొమ్మను కిందికి వంచితే, మంగ్లి ఆ కొమ్మల్లో ఆకులతో కట్టుకున్న చీమల గూడును ఒడుపుగా లాగేసింది. సోంవారి నెత్తి మీద కుదురుగా పెట్టుకొన్న గుడ్డను తీసి నేల మీద పరిస్తే మంగ్లి తన చేతుల్లోని చీమల గూడును చెదురగొడుతూ చీమలనూ గుడ్లను ఆ గుడ్డలో పడేసి కిల కిలా నవ్వుకుంటూ కొంచెం దూరంగా పరిగెత్తింది. అప్పటికే ఆమె శరీరం నిండా ఎర్రని గండుచీమలు పాకుతూ కరిచేస్తున్నాయి. తన రెండు అర చేతులతో చేతులను, ముఖాన్ని, మెడను తుడిచేసుకుంటూ చేతులకు చిక్కిన చీమలను నలిపేయసాగింది. తర్వాత పైటను లాగేసి దానితో పారుతున్న చీమలను విదిలించి చేతుల మీద, పొట్టమీద, ఛాతీ మీద ఆ పైటతో కొట్టుకుంటూ చీమలను దులిపేసుకుంది. మండుతున్న వంటిని ఏ మాత్రం లక్ష్య పెట్టకుండా గుడ్డ మీద పోసిన చీమల దగ్గరికి వచ్చింది. అప్పటికే సోంవారి తన మీద పాకుతూ, కరుస్తున్న చీమలను దులుపుకుంటూ, చేతికి చిక్కిన వాటిని నలిపేస్తూ తెల్లని గుడ్లను, వాటితో పాటు చచ్చిన చీమలను ఇప్ప ఆకులతో రెండు మూటలు  కడుతోంది.

"పెద్ద గూడు. చాల్నే ఉన్నయి" అనుకుంటూ ఒక మూటను అందుకొని ఇప్పపూల బుట్టలో పడేసి మళ్లీ బుట్ట నెత్తికెత్తుకుంది మంగ్లి. సోంవారి ఆమెను అనుసరించింది.

ఇంటికి రాగానే ఇంటిపక్కనే ఇప్పపూలు ఎండబోసే దడిలోకి వెళ్లింది. నున్నగా చదునుగా ఉన్న నేలపై వాటిని పోసి సమంగా పేర్చింది. అప్పటికే అక్కడ ఎండబోసిన పూలున్నాయి. సగానికి పైన ఎండినవి ఒకచోట, ఇంక రెండు మూడు రోజులే ఎండవల్సినవి ఒకచోట, రెండు మూడు రోజులనుండే ఎండుతున్నవి ఒకచోట గుండ్రంగా ఆరబోసి ఉన్నాయి. ఓ మూలకు బాగా ఎండినవి కుప్పపోసి ఉన్నాయి. దడిలోంచి బయటకు వచ్చి గుడ్డ చుట్టను తీసి విదిలించి దండెం మీద పడేస్తూ బలంగా ఒక్క నిట్టూర్పు విడిచి క్షణం ఆలస్యం చేయకుండా చీపురందుకుంది. దాదాపు అందరి ఇళ్లలాగే రెండు గదుల చిన్న పెంకుటిల్లది. ముందు గదిలో పొయ్యి ఉంది. అందులోనే వండుకొని తింటారు. వెనుక గదిలో ధాన్యమూ అదీ దాచుకుంటారు. ఇంటి పక్కనే ఉన్న చిన్న పాకలో పడుకుంటారు.

గబగబా ఇల్లూ, వాకిలీ, పాక ఊడ్చేసి, రాత్రి వండుకున్న అంట్లగిన్నెలనూ, రెండు బిందెలను తీసుకుంది. ఓ బిందెను తల మీద పెట్టుకొని దాని మీద అంట్లగిన్నెలు సర్దింది. మరో బిందెను చంకలో వేసుకొని చేతులతో మరి కొన్ని గిన్నెలను పట్టుకుంది. భుజం మీద బట్టలను వేసుకొని ఇంటి బయటకు వచ్చింది. ఇంటి నుంచి నాలుగైదు నిమిషాల దూరం నడిస్తే ఓ చిన్న వాగుంది. వాగు ఎండిపోయింది గానీ లోతుగా ఉన్న చోట నిల్చిన నీళ్ల మడుగుంది. అప్పటికే ఆ మడుగు దగ్గర ఇద్దరు ముగ్గురు ఆడవాళ్లు గిన్నెలు తోముతూ బట్టలుతుకుతూ ఉన్నారు. వాళ్లను పలకరిస్తూ ఆ మడుగు పక్కనే కూర్చొని బిందెలనూ, గిన్నెలనూ మెరిసిపోయేలా తోమింది. వాటిని కడిగి ఒక చిన్న గిన్నెతో మడుగు పక్కనే ఉన్న చెలిమలోని నీళ్లు రెండు బిందెల్లో, అన్నం గిన్నెలో నింపింది. ఆ తర్వాత స్నానం చేయడం కోసం మడుగులో మునిగింది. ఓ రాయిని తీసుకొని కాళ్లూ చేతులూ, వళ్లూ రుద్దుకొని స్నానం ముగించి తెచ్చుకున్న బట్టలను కట్టుకొని విడిచిన బట్టలను బండమీద రెండు దెబ్బలు వేసి నీళ్లలో జాడించి గట్టిగా పిండి భుజం మీద వేసుకుంది. తల మీద కుదురు పెట్టుకొని, బిందెను తల మీది కెత్తుకుంది. కొంచెం వంగి పక్కనున్న మహిళతో ఆ బిందె మీద మరో బిందెనూ, అన్నం గిన్నెనూ పెట్టించుకుంది. చేతుల్లో తోమిన గిన్నెలను పట్టుకొని ఇంటికి తిరిగొచ్చింది.

చల్లటి నీళ్లతో స్నానం చేయడంతో అలసట తీరి హాయిగా అన్పించిందామెకు. బిందెలనూ గిన్నెలను సర్దేసి ఉట్టి మీది నుండి రాత్రి వండిన అంబలి కుండను దించింది. ఓ చిన్న స్టీలు గిన్నెలోకి దాన్ని వంపుకొని కడుపునిండా తాగింది.

సుక్కు సొరకాయ బుర్రతో అంబలి తీస్కెళ్లాడు, తాగే ఉంటాడు అనుకుంది. మధ్యాహ్నం వస్తానన్నాడు కదా...ఆకలితో వస్తడేమో తొందరగా వంట చేయాలె అనుకుంది.

అనుకున్నదే తడవుగా అంబలి తాగిన గిన్నె కడిగేసి పొయ్యి అంటించి గిన్నెతో ఎసరు పెట్టింది. దంపుడు బియ్యాన్ని కడక్కుండానే ఎసట్లో పోసి గంజి వార్చింది. అన్నం ఉమ్మగిల్లిన తర్వాత దించేసి కూర గిన్నెలో ఆ వార్చిన గంజిని సగం పోసి పొయ్యి మీద పెట్టేసింది. ఇందాకటి ఆకుల్లో చుట్టిన చీమగుడ్ల మూటను తెచ్చి పొయ్యిలో నిప్పులు కొంచెం బయటకు లాగి ఆ నిప్పుల్లో పెట్టింది. కాసేపటికి దాన్ని నిప్పులోంచి బయటకు లాగి కాలిన ఆకులను తీసేసింది.

ఉడికిన చీమ గుడ్ల కమ్మటి వాసన ఆమె ముక్కుపుటాలకు తాకింది. దాన్ని పొయ్యి మీదున్న గంజిలో వేసింది. వెదురు కవ్వంతో ఆ చీమల గుడ్లు గంజిలో కల్సిపోయేలా చిలికింది. ఆ తర్వాత ఉప్పు వేసి నాలుగు ఎండు మిరపకాయలూ, ఒక పచ్చి పసుపు కొమ్ము ముక్కనూ బండమీద నూరి దాన్ని తెర్లుతున్న గంజిలో వేసింది. ఓ చిన్న ఉల్లిగడ్డను కోసివేసింది. చివరగా ఉట్టి మీద ఓ గిన్నెలో దాచి వుంచిన నిన్నటి గంజిని తీసి ఆ వండుతున్న దాంట్లో వంపింది. చీమల పులుపుకు, పుల్లటి గంజి తోడవడంతో ఆ పులుసు పుల్లటి పులుపు వాసన వేస్తూ మంగ్లి నోట్లో నీళ్లూర సాగాయి. కొడుక్కు ఈ పులుసంటే బాగా ఇష్టం. కడుపు నిండా తింటడీయాల అనుకుంది తృప్తిగా.

తర్వాత రెండు దొప్పలు కుట్టి అన్నాన్ని వాటిలో సర్ది అన్నం గిన్నెలో నీళ్లు పోసి ఓ మూలకు పెట్టేసింది. ఆ దొప్పలను ఆకులతో కప్పి ఉట్టి మీద పెట్టింది. ఇంతలో సుక్కు రానేవచ్చాడు.

వస్తూ వస్తూ స్నానం చేసి ఉతికిన లుంగీని గట్టిగా పిండి తడిదే కట్టుకొని వచ్చాడు. రాగానే పాకలో దండెం మీదున్న పొడిబట్టలను కట్టుకొని తడి బట్టలను దండెం మీద ఆరేశాడు. అద్దం చేతిలోకి తీసుకొని పాకలో వాల్చి ఉన్న నులక మంచంలో కూర్చొని అద్దంలోకి చూసుకుంటూ తల దువ్వుకోసాగాడు.

"బాగా ఆకలయితుంది. తొందరగ రారా సుక్కూ అన్నం తిందాం" పళ్లాలు కడుగుతూ పిలిచింది మంగ్లి.

సుక్కు నిశ్శబ్దంగా లేచి చేతులు కడుక్కొని ఇంట్లోకి వచ్చి పీట మీద కూర్చున్నాడు. కొడుకు ముందు పళ్లెం పెట్టి అన్నం దొప్ప పక్కనే పెట్టింది. ఒక చిన్న గిన్నెలో కూర వేసి పక్కనే పెట్టింది. తనూ పళ్లెం ముందు కూర్చొని దొప్పలోంచి అన్నం తీసుకొని పళ్లెంలో వేసుకుంది. కూర వేసుకొని తినడం మొదలు పెట్టింది.

ఏదో ఆలోచనతో సతమతమవుతూ సుక్కు కూడా తినడం మొదలు పెట్టాడు.

"కమ్లి కల్సిందారా? బాగుందా?" అనడిగింది మంగ్లి. కమ్లి ఆ ఏరియా దళ కమాండర్.

"ఆ కల్సిందమ్మా. బాగుంది. నీకు లాల్ సలాం చెప్పమన్నది."

"మురిపెంగ నవ్వింది మంగ్లి. "ఈ మధ్య ఇటు రాలేదు కదరా శాన రోజులయితాంది."

"పనులు ఎక్కువై ఇటు వచ్చుడు కుదరుత లేదట."

"ఆ మధ్య జెరం బాగొచ్చి సచ్చిపోయేటట్టు అయ్యిందట గద ఇప్పుడెట్లుంది? జెర మంచిగయిందా?"

"ఇప్పుడు బాగనే ఉంది."

"ఆ నడుమ ఫైరింగు అయ్యే కదా ఎవరికి ఏం కాలేదు కదా!"

"ఆ! మనవాళ్లకేం కాలేదట. ఒక పోలీసుకే గాయాలయినట" అని చెప్పి ఇందాకటి నుంచీ సతమతమవుతున్న ఆలోచనను తల్లి ముందు పరిచే ఉద్దేశంతో "అమ్మా, కమ్లి నానో(అక్క) నన్ను దళంలో చేరమని అంటున్నదమ్మా. నాకూ జేరాలనుందే" అన్నడు మెల్లగా.

"ఒరే బాబూ. నాకున్నది నువ్వొక్కనివే. నువ్వు దళంలకు పోతే నేను ఎవరిని చూసి బత్కాలెరా"

"అందరు ఇట్లనే అనుకుంటే పార్టీ ఎట్ల పెద్దదయితది... మన లడాయి ముందుకెట్ల పోతది."

"అందరు అట్లెట్లనుకుంటర్రా. నీ తోడ ఇంకొక్కరున్నా నిన్ను నేను తోలేదాన్నే."

"అదేందమ్మా అట్లంటవు? ఒక బిడ్డ, ఒక కొడుకు ఉన్నోళ్లు ఎవ్వరు పార్టీల జేర్తలేదా?"

"జేర్తున్రు కావొచ్చు గని నేనయితే బత్కలేనురా నువ్వు లేకుంట..."

"కనీ నాకు దళంల పని చెయ్యాల్నని శానా ఇదిగా ఉందమ్మా. నువ్వు మహిలా సంగంల ఉన్నవు కదా.. అందరికీ పోరాడాలె అని చెప్తవు. నేను పోతనంటే వద్దంటవు..."

"నువ్విప్పుడు ఏం చెయ్యకుంట ఉంటున్నవారా? మిలీషియాల చేస్తున్నవు కదా. అది లడాయి గాదా ఏంది?"

"మిలీషియాల జేస్తే సరిపోద్దా అమ్మా, అందరం మిలీషియాల్నే ఉంటం, మా ఇంట్లనే ఉండి పని చేస్తం అంటే ఎట్ల కుదురుద్ది? ఈసారి మా మిలీషియా దళం నుంచి సన్ను, పగ్ను దళంల బర్తీ అయితుంర్రు. అందరు బర్తీ అయితుంటే నేను కానంటే నాకెంత నారాజుగ ఉంటదమ్మా."

"నువ్వు నా గురించి ఆలోచించు బిడ్డా. నువ్వు నన్నేమన్న అనుకో గని నువ్వు లేకుంట నేను బత్కలేనురా"

* * *

"లాల్ సలాం మంగ్లి నానో" దూరం నుంచే మంగ్లిని చూసి పాకలో పాలిథీన్ షీట్ మీద కూర్చొని ఉన్న కమ్లి లేచి నిలబడుతూ అంది. చామన ఛాయతో బక్క పల్చగా, పొడుగూ, పొట్టి కాకుండా ఉంటుంది కమ్లి. పొట్టిగా చేయించుకున్న క్రాఫ్ వల్ల తెలియని వాళ్లెవరెయినా నోరు తెరిచి మాట్లాడేదాక పురుషుడనే పొరబడుతారు. పాతికేళ్ల క్రితం అత్యంత సాధారణంగా ఈ గడ్డమీద ఆదివాసీ బిడ్డగా కళ్లు తెరిచిన కమ్లి ప్రస్తుతం ఈ ఏరియా ప్రజలందరికీ తల్లో నాలుక.

"లాల్ సలాం" అంటూ ముసిముసిగా నవ్వుతూ పాకలోకి వచ్చి గుడ్డలో చుట్టి తెచ్చిన అన్నం దొప్పను జాగ్రత్తగా ఓ మూలకు పెట్టి వచ్చి కమ్లి చాచిన చేయిని పట్టుకొని కరచాలనం చేసింది మంగ్లి. మంగ్లితో పాటు వచ్చిన మరో ఇద్దరు చిన్న అమ్మాయిలు కూడా తమ చేతుల్లోని దొప్పలను కింద పెట్టేసి వచ్చి చేతులు కల్పారు.

"నెల్లె మంతినా నానో (బాగున్నావా అక్కా)"

"నెల్లే మంతన్. మీరు బేలే మంతిర్? (బాగనే ఉన్న, మీరెట్లున్నరు?)" అంటూ సురేషుకూ, మంగుకూ చేతులు కల్పింది మంగ్లి.

"బాత పెద్దేర్ మీవ? (మీ పేరేంది?) అంటూ ఇద్దరమ్మాయిల చెంపలు పుణికింది కమ్లి.

ఓ అయిదు నిమిషాలు పరామర్శలయ్యాక "ముందుగాల మీరు అన్నం తినుండ్రి. తర్వాత మాట్లాడుకోవచ్చు" అంది మంగ్లి.

"ఆ సరే ఆకలి గూడ మస్తు అయితాంది. చలో మంగూ, సురేష్ తిందాం . మీరు తినొచ్చిన్రా" అంది మంగ్లితో కమ్లి.

"ఇప్పుడే తినొస్తున్నం. ముగ్గురే వచ్చిన్రు మూడిండ్ల నుంచి అన్నం తెస్తే సరిపోద్దని సుక్కు

తెచ్చింది అందుకని మూడే దొప్పలు తెచ్చినం" మంగ్లి.

"ఓ చాలు " అంటూ తన కిట్లోంచి ప్లేట్ తీసుకొని పాక బయట బిందెలో ఉన్న నీళ్ల తోటి ప్లేట్ కడుక్కొని అన్నం దొప్ప దగ్గరికి వచ్చింది కష్మి. సురేష్ కూడా ప్లేట్ పట్టుకొని వచ్చాడు. మంగు మాత్రం "ప్లేటెందుకు దండగ నేను దొప్పల్నే తింట" అంటూ చేతులు కడుక్కొని వచ్చాడు.

"ఆ నువ్వు దొప్ప ఖాళీ చేయగల్గితే దొప్పల్నే తిను " అంది కష్మి.

"ఆ మీ దొప్పల్ల మిగిలేది కూడా తింట" నవ్వుతూ దొప్ప చేతిలోకి తీసుకొని ఓ రాయి మీద కూర్చున్నాడు మంగు.

దొప్పల పక్కనే ఉన్న ఓ చిన్న మొద్దు మీద కూర్చున్న కష్మి ముందు, తను తెచ్చిన దొప్ప పెట్టింది మంగ్లి.

దొప్ప మీద కప్పిన ఆకును తీసేస్తూ "గోంగూర వట్టి చాపలు" అంటూ నవ్వి "నాకు తెల్సు నువ్వీ కూరనే వండుకొని తెస్తవని" అంది.

సమాధానంగా ముసి ముసిగా నవ్వింది మంగ్లి.

"ఎట్ల తెల్సు?" అన్నాడు సురేష్.

"ఓసారి చెప్పినలే చాలా ఇష్టమని. అప్పటి నుండి గోంగూర దొరికే సీజన్ల తప్పకుండ వండుకొని తెస్తది." ముగ్గురూ నవ్వారు. వీళ్ల నవ్వుతో మంగ్లి కూడా జత కల్పింది.

ఆ కూరను మూడు భాగాలు చేసి మంగుకూ, సురేష్‌కు వేసింది. దొప్పలోంచి సగానికి పైగా అన్నం ప్లేట్లో పెట్టుకొని కూరవేసుకొని మిగిలిన అన్నాన్నీ, కూరనూ ఆ పిల్లలను తినమంది.

"మేం ఇప్పుడే తినొచ్చినం" అన్నారా పిల్లలు.

"ఫర్వాలేదు. కొంచెం తినండి."

"ఇప్పుడే తిన్నరు తియ్ కష్మి మిగిలితే ఆ దొప్పలో ఉండనీ తర్వాత తింటరు" అని మంగ్లి అనడంతో ఆ దొప్పపై జాగ్రత్తగా ఆకు కప్పి పక్కనే ఉంచింది కష్మి. కొంచెం దూరంలో ఉన్న మిలీషియా సెంట్రీ రక్షణలో నిశ్చింతగా తినడం ముగించారు గెరిల్లాలు.

అన్నం తిన్నంక కష్మి, మంగ్లి పాకలోనే పాలిథిన్‌లో కూర్చున్నారు. మంగు, సురేష్ కొంచెం దూరంలో ఓ చెట్టు కింద పాలిథిన్ వేసుకొని కూర్చొని మంగ్లితో వచ్చిన పిల్లలతో కబుర్లలో పడ్డారు. ఓ పావుగంట అదీ ఇదీ మాట్లాడుకున్నంక "నీతో మాట్లాడే పనుందని నిన్ను రమ్మని కబురు పంపిన" అంది కష్మి.

సమాధానంగా గల గలా నవ్వింది మంగ్లి. కష్మి ఏం మాట్లాడ దల్చుకుందో కొంచెం ఊహించిందామె.

"నేను ఏం మాట్లాడాల్ననుకుంటున్ననో నీగ్గూడ తెల్సనుకో, సుక్కు విషయమే. సుక్కు దళంలకు భర్తీ అయితనంటే నువ్వొద్దంటున్నవట..."

"సమాధానంగా సిగ్గుపడుతున్నట్టుగా నవ్వింది. "నీకు తెల్సుగా కష్మి, నాకున్నది అడొక్కడే గదా. వాడు దళంలకు పోతే నన్ను చూసుకునేటోళ్ళెవరూ, వ్యవసాయం గిన చేసేటోళ్ళెవరూ."

"మన ఊళ్లె సంగాలున్నయి. పార్టీ కమిటీ ఉంది. జనతన సర్కారుంది. మన సర్కార్

బాధ్యత పడుతది. సహకార కమిటీ నీ భూములను దున్నిస్తది. నిన్ను అనాథగా వదిలేస్తమా? ఒక్క బిడ్డ, ఒక్క కొడుకు ఉన్నవాళ్ళు కూడా మన పార్టీలకు వచ్చిన్రు. ఇటువంటి వాళ్ళందరి తల్లిదండ్రుల గురించి పార్టీ పట్టించుకుంటనే ఉంది గదా?"

"ఎంత పట్టించుకున్నా కడుపులో పుట్టిన వాళ్ళు ఒక్కరన్న తోడుంటే ఆ తృప్తి వేరే కదా కష్మీ."

"తల్లిదండ్రులను పట్టిచ్చుకునే బాధ్యత పిల్లలకుంటది. ఉండాలె. కానీ పిల్లలే పట్టిచ్చుకోవాలె అనుకునుడు సరైంది కాదు. అసలు పిల్లలే లేనోళ్ళు కూడా ఎంతమందో ఉన్నరు. పిల్లలున్నా తల్లిదండ్రులను పట్టించుకోని పరిస్థితి గూడ ఉంది. మన ఆదివాసీ సమాజంలో ఈ పరిస్థితి ఎక్కువ లేకపోవచ్చు. గనీ బయట సమాజంలో పిల్లలుండి గూడ ఎంతమంది తల్లిదండ్రులో అడుక్కు తింటున్రు. వాళ్ళందర్నీ సమాజమే పట్టించుకునే పరిస్థితి ఉండాలె. అట్లా ఉండాలంటే ఇప్పుడున్న సమాజం మారాలె. మరి మారాలంటే నీలాంటి తల్లులు పిల్లల్ని పోరాటంలకు పంపాలె. మీరు కూడా త్యాగం చేయాలె..."

"సుక్కు మిలీషియాల ఉన్నడు కదా కష్మీ"

"ఉన్నడక్కా... నేను కాదంటలేను. కానీ సుక్కు చాలా చురుకైనోడు. ఇటువంటోళ్ళు పూర్తికాలం పార్టీలకొస్తే తనటువంటోళ్ళను ఎంతో మందిని తయారు చేస్తరు.."

"కానీ వాడు లేకుంటే నేనస్సలు ఉండలేను కష్మీ..." మంగ్లి గొంతు జీరగా పలికింది. కళ్ళు తడయ్యాయి.

ఆమె ఆవేదన చూస్తుంటే ఎంత మంది తల్లిదండ్రులు తమ కడుపు తీపిని చంపుకొని కన్నపిల్లల్ని ఉద్యమానికి అర్పిస్తున్నారో అనిపించింది కష్మికి. తమ పంచప్రాణాలైన పిల్లలకు దూరమై ఎంతమంది తల్లిదండ్రులు వేదనను అనుభవిస్తున్రో అనుకుంది.

"సుక్కు ఒక్కడే కదా అని నేను గూడ ఆలోచించిన్నక్కా. కానీ సుక్కుకు దళంల జేరాల్నని చాలా ఇదిగా ఉంది. మా అమ్మను ఒప్పించి దళంకు తీసుకొమ్మని ఒకటే పట్టుబడుతుండు. ప్రజల కోసం పని జేయాల్ననే సుక్కు కోరికను కాదనడం న్యాయమా చెప్పు. దళంలకు వచ్చినా అప్పుడప్పుడు వచ్చి కల్సి పోతుంటడు కదా..."

"లేదు కష్మీ నువ్వేమన్ననుకో. ఈ అక్క శానా స్వార్థం మనిషే అనుకో. కానీ వాడు లేకుంట నేను బత్కలేను. కాకపోతే మిలీషియాల ఇంక మంచిగ పనిజేయమను. నీకు అవసరమున్నప్పుడు తీస్కపోయి నాల్గు రోజులు ఉంచుకొని తోలు. నేను గూడ సంగం పని ఇంకా బాగా జేత్త. పార్టీ గురించి నాకు తెల్వదా? పార్టీ లేకపోతే మనసువంటోళ్ళకు బతుకెక్కడిది. అందుకని పార్టీ పని అందరు జెయ్యవల్సిందే. వాన్నింటికాన్నే ఉంచి ఎంత పనైనా జేయించు కానీ మొత్తంగా దళంలకైతే ఒద్దు కష్మీ..."

* * *

పొద్దు దగ్గర పద్దంతో ఒక పొదలో నక్కి కూచున్న మంగ్లి నెమ్మదిగా బయటకు వచ్చి నిలబడింది. చుట్టూ చూసింది. అసహజమైన అలికిడేం లేదు. నెమ్మదిగా అడుగులు వేస్తూ పక్కనే

కూలిన ఓ చెట్టు మొదలును చాటు చేసుకొని కూర్చున్న సోంవారి దగ్గరికెళ్లింది. నిస్తేజంగా కూర్చొని ఉందామె. పదేళ్ళ ఆమె కొడుకు ముడుచుకొని తల్లి ఒడిల వొదిగి పడుకున్నడు. మంగ్లి పోయి సోంవారి ఎదురుగ కూలబడింది. ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నరు. వెంటనే చూపులు తిప్పుకున్నరు. జీవితంలో ఎన్నడూ ఎదుర్కోని అతి పెద్ద విపత్తును ఎదుర్కున్న విల విల ఇద్దరి చూపుల్లోనూ మెదిలింది.

"పొద్దు గూకుతాంది మెల్లగ పోయి సూద్దమా అక్కా" అంది భారంగా మంగ్లి. పగలంతా నిశ్శబ్దంగా ఉన్న గొంతు వింతగా ధ్వనించింది.

"ఎల్లి పోయి ఉంటరానే ఆ గూండాలు..."

"ఎల్లిపోయిన్రు గావొచ్చు ఎక్కడ్నైనా పగలు దాడి చేసి పొద్దు గూకకముందే తిరిగి పోతున్రట" అని మళ్లీ తనే "ఆడీడ జుడుం దాడులు జరుగుతున్నయని ఇని బయపడ్తనే ఉంటిమి మనూరి మీద గూడ జరుగుతదేమో అని... జర్గనే జరిగే..." భారంగా నిట్టూరుస్తూ అంది మంగ్లి.

"దాడి జరుగుతది కావొచ్చు. తప్పిచ్చుకుంటందుకు తయారుగుండాల్నని పిల్లగాళ్లను కాపాడుకోవాల్నని అనుకుంటనే ఉంటిమి... కానీ వచ్చిన్రు వచ్చిన్రనంగనే గుండె దడదడలాడ వట్టింది... కాళ్లు ఒణకబట్టినయ్... ఎట్లనో ఈ పోరన్ని గొర్ర గొర్ర గుంజుకొని ఒచ్చిన... గని నీళ్ళకు బోయిన కోడలేమయిందో... పెద్దోడు సెంట్రీకి బోయిండు... ఆడేమయిండో... మీ బావ, సిన్న పోరగాళ్ళు కల్సి గొడ్లను, మేకలను తోలుక పోయింన్రు. ఆళ్లేమయిన్రో..." పొద్దట్నుంచీ భర్తా, కొడుకులూ, కోడలు ఏమయిన్రోనని ఆరాట పడుతున్న సోంవారి కన్నీళ్లను తుడుచుకుంటూ జీర గొంతుతో అంది.

"రంధి పడకక్క కుడి దిక్కు నుంచి గద గుండాలు దాడి చేసింది. పిల్ల నీళ్లకువోయింది. ఈళ్లు గొడ్లను తోల్క పోయింది ఎడమ దిక్కుకు గదా. మన లొల్లి ఇని తప్పిచ్చుకొని ఉంటర్లే. సెంట్రీ గూడ ఆ దిక్కుల లేదు గదా. పెద్దోడు గూడ మంచిగనే ఉండుంటడు."

"మంగ్లి మాటలు సోంవారికి కొంచెం ధైర్యాన్నిచ్చినయ్. నిజమే అందరు తప్పిచ్చుకున్రు కావొచ్చు" అనుకుంది ఆశగా.

"సుక్కు నిన్న బోయి ఇంక రాలేదు గదానే" అంది మంగ్లికేసి చూసుకుంట.

"అహ రాలేదు. కమ్లి మతులబు జేసిందని పోయిండు" తన కొడుకు దళం దగ్గరున్నడు కాబట్టి క్షేమంగానే ఉంటడని ధైర్యంగుంది మంగ్లి.

"రాక్క, మెల్లమెల్లగ చూసుకుంట పోదం" అంటూ మంగ్లి లేచేప్పటికి సోంవారి కూడా పిల్లాన్ని లేపుతూ తనూ లేచింది. పిల్లాడు బిక్కు బిక్కుమంటూ తల్లి చేయిని గట్టిగ పట్టుకొని తల్లి డొక్కలో తల దూర్చి నిలబడ్డాడు.

చుట్టూ పరిశీలనగ చూస్తూ చెట్లను, పొదలను, బండలను చాటు చేసుకుంటూ ఊరు దిక్కు నిశ్శబ్దంగా నడవసాగారు ముగ్గురూ. నిశ్శబ్దంగా ఉండకపోతే తమ ఉనికికే ప్రమాదం అని పిల్లవాడికీ అర్థమైంది.

ఊరును సమీపిస్తున్న కొద్దీ ఒక్కొక్కరూ వచ్చి వీళ్లతో కల్సారు. చూపులతోనే ఒకర్నొకరు

పరామర్శించుకున్నారు. ఆవేదనను పంచుకున్నారు. నిశ్శబ్దంగా నడుస్తున్న అందరి మనసుల్లోనూ కలగా పులగంగా రకరకాల ఆలోచనలు - తమ పిల్లలేమయ్యారో, భర్తలేమయ్యారో... వాళ్లేమయ్యారో... వీళ్లేమయ్యారో... అనే ఆలోచనలు ఒకవైపు... ఇండ్లన్నీ కాల్చేశారు గావొచ్చు... అన్నీ కాలిపోయి ఉంటయ్ గావొచ్చు అనే ఆలోచనలు మరోవైపు.

ఊహించనిదేం కాకపోయినా దూరం నుంచే లీలగా మొండిగోడలు, అక్కడక్కడా పైకి లేస్తున్న పొగ కనబడేప్పటికి అందరికీ కడుపులోంచి దుఃఖం ఎగదన్నుకొచ్చింది. అయినా ఉగ్గబట్టుకున్నారు. జుడుం గుండాలు పోయి ఉంటరా లేదా అనే సందేహం వాళ్ల దుఃఖాన్ని నొక్కి పడుతోంది. ఇంతలో ఊళ్లో నుంచి ఆవేదనా భరితమైన సామూహిక శోకం అలలు అలలుగా తేలిరాసాగింది. అంతే, అందర్లోనూ అదిమి పెట్టిన దుఃఖం హోరై ఎగిసింది. నడక వేగం పెరిగింది. క్రమంగా పరుగైంది. వీళ్లూ పోయి కలవడంతో ఊళ్లోని శోకం అనేక రెట్లు పెరిగింది. క్రమంగా పారిపోయిన వాళ్లంతా ఊరు చేరారు. అందరూ తమ తమ వాళ్లందరి కోసం ఆత్రంగా వెతుక్కున్నారు. కల్సినవాళ్లను కన్నీళ్లతో పలకరించుకున్నారు. బిడ్డలను ఆర్తిగా దగ్గరికి తీసుకున్నారు. పగలంతా కన్పించని తమ వాళ్లంతా పునర్జన్మ ఎత్తి వచ్చినట్టుగానే భావించారు. మొత్తానికి ఆ ఊరి వాళ్లెవరూ జుడుం చేతిలో పడలేదని తెల్సుకొని కాస్తలో కాస్త కుదుట పడ్డారు.

అందరూ తమ తమ ఇండ్లకేసి నిర్వేదంగా చూసుకున్నారు. ఇంకా చల్లారని మసిబారిన గోడలు, పగిలిపోయి చెల్లాచెదురుగ పడి ఉన్న గూన పెంకులు, బూడిద, బొగ్గులుగా మారిన పందుల, మేకల దొడ్లు, కోళ్ల గూళ్లు, పగిలిన కుండ పెంకులు, కాలి కరిగి ముద్దయిన అల్యూమినియం బిందెలూ, గిన్నెలు, కాలి బూడిదయిన ధాన్యం, బట్టలు. మేకలనూ, పందులనూ కాల్చుకొని తిన్న ఆనవాళ్లు. ఊళ్లో ఉన్న నలభై ఇండ్లూ కాలిపోయాయి.

నెత్తురును చెమటగా చిందించి కట్టుకున్న ఇండ్లు, కష్టపడి పైసా పైసా కూడబెట్టి కొనుక్కున్న బట్టలు, గిన్నెలూ... అలా కాలిపోవడం చూస్తున్న కొద్దీ అందరికీ ఉసూరుమనిపిస్తోంది. ఇంకా కాలుతున్న వాటిని నీళ్లు తెచ్చుకొని సల్లార్చుకుందామంటే కూడా ఒక్క బిందైనా, కుండైనా, గిన్నయినా మిగలని పరిస్థితి. ఎంతో జాగ్రత్తగా పేర్చుకున్న జీవితం ముక్కలు ముక్కలై చెల్లా చెదురయింది. చేసేదేం లేక కొందరు ఏడుస్తూ గుంపులు గుంపులుగా కూలబడితే, మరి కొందరు అలా కూలబడ్డానికి మనసొప్పక ఏదో ఆరాటంతో అటు ఇటూ తిరుగుతున్నారు. ఆకలితోనో, భయంతోనో, చికాకుతోనో పిల్లలు ఏడుస్తూ తల్లుల చుట్టూ తిరుగుతున్నారు. వాళ్లను ఎలా ఓదార్చాలో తెలియక తలలు నిమురుతూ, వీపులు నిమురుతూ, మరీ చంటిపిల్లలకు పాలిస్తూ ఆడవాళ్లు సతమతం కాసాగారు.

చూస్తుండగానే చీకటి పడింది. ఆ చీకటి ఎప్పటికంటే చిక్కగా తోచిందందరికీ. అసలీ చీకటి విడిపోతుందా? ఎప్పటికయినా తెల్లవారుతుందా? అందర్లోనూ నిరాశ గూడుకట్టుకుంది.

జుడుం దాడిచేసే అవకాశం ఉందనీ ధాన్యమూ, వస్తువులూ, పైసలూ జాగ్రత్త చేసుకొమ్మనీ ఎప్పటినుండో పార్టీ ప్రచారం చేస్తూనే ఉంది. కాబట్టి అందరూ ఎంతో కొంత ధాన్యం దాచుకోగల్గారు. ఉన్న వాటిల్లోనే కొన్ని గుడ్డలను, బిందెలను, గిన్నెలను దాచుకున్నారు.

క్షణ క్షణానికీ పిల్లల ఏడుపు పెరిగిపోతోంది.

"ఇంక మనం ఏడ్సుకుంట ఎంత సేపు కూర్చున్నా పోయినవేమీ చేతికి రావు. ఇంకా నయం మన ఊరోల్లెవరం జుడుం చేతుల్ల పడలేదు. సుట్టు పక్కల ఊళ్లల్ల జరుగుతున్న గోరాల గురించి ఎన్ని వింటలేం మనం? మన పార్టీ ముందుగాల్నే హెచ్చరించబట్టి మనం అంతో యింతో జాగ్రత్త చేసుకోగల్గినం. ఎన్నో వూళ్లల్ల ప్రజలు కట్టుబట్టలతో మిగిలిన్రు... మనం ఇంకా నయం. కాబట్టి మనం ధైర్యంగ ఉండాలె. ధైర్యంగ వుంటేనే ఈ జుడుంను ఎట్ల ఓడించాల్నో ఆలోచించగల్గుతం. ముంద్రైతే ఇగ ఇక్కడ ఉండుడు మంచిది గాదు. కాబట్టి అడవిలకు పోదం. ముందుగాల్నే మనం కొన్ని పాకలు వేసుకొని ఉన్నం గద, అక్కడికి పోయి ఉందం. అయితే ఇగ ఇప్పట్నుంచి అందరం ఒక్కచోట ఉండుడు సాధ్యం గాదు. నాలుగుచోట్ల పాకలు వేసుకున్నం గదా... మన ఊరివాళ్లమందరం విడిపోయి నాలుగు జాగలల్ల సదురుకొని వుందం. ముందుగాల్నయితే అడవిలకు పోయి దాచుకున్న బియ్యం, గిన్నెలు తెచ్చి జావగాసి పిల్లలకు పోద్దాం. లేకుంటే పిల్లలు ఆకలికి తట్టుకోలేరు " అన్నాడు అక్కడి జనతన సర్కార్ బాధ్యుడు సోమాల్.

* * *

ఒక మిలీషియా సభ్యుడితో కల్సి వస్తోన్న మంగాల్‌ను దూరం నుంచే చూసి ఆదుర్దాగా ఎదురెల్లి "సుక్కు ఏడిరా" అనడిగింది మంగ్లి.

"సుక్కును జుడుం గూండాలు పట్టుకున్నరు పెద్దమ్మా" అంటూ ఏడవసాగాడు మంగాల్.

కాళ్ల కింద నేల కదిలిపోయి కుప్పకూలిపోయింది మంగి,. వాళ్లూ వీళ్లూ పరిగెత్తుకుంటూ వచ్చారు.

"అసలేమయిందిరా? ఎట్ల దొరికిండు?" అడిగాడు అప్పుడే అక్కడికి వచ్చిన సోమాల్.

కన్నీళ్లు తుడుచుకుంటూ "నిన్న సాయంత్రం కల్మి నానతో మాట్లాడి మన వూరికి తిరిగి వస్తున్నం, మన వూరి మీద దాడి చేసి తిరిగొస్తున్రు కావొచ్చు గూండాలు. మమ్మల్ని జూసింద్రు. మేం ఉరికినం. కానీ సుక్కు పట్టుబడ్డడు. నేను ఎటెటో ఉరికి దారి తప్పిన. రాత్రంత అడవిల్నే ఉన్న తెల్లారినంక ఎట్లనో అట్ల దారి పట్టుకొని వచ్చిన" ఎర్ర బడిన కళ్లతో, రేగిన జుట్టుతో, దిగులు మొహంతో, నలిగిపోయిన బట్టలతో వేట నుండి తప్పించుకొన్న మేక పిల్లలా బెదిరిపోయి ఉన్నాడు మంగాల్.

మంగ్లి హృదయ విదారకంగా ఏడ్వసాగింది. ఆమెను ఓదార్చడం ఎవ్వరి తరమూ కావడంలేదు. ఆమెను ఓదార్చే శక్తి లేక వాళ్లు కూడా ఏడుస్తూ ఆమె చుట్టూ కూర్చున్నారు.

"మీరు గట్టిగా ఏడవొద్దు. ఏడుపు దూరం వినబడుతది. ఇక్కడికి కూడా జుడుం గుండాలు వస్తరు" హెచ్చరించారెవరో.

వెంటనే చాలా మంది ఏడుపునాపేశారు. మళ్లీ అందరూ మంగ్లిని ఓదార్చేదాంట్లో పడ్డరు.

"ఏడవకే. వాళ్లు ఇక్కడిక్కూడా వస్తరు. చిన్న చిన్న పిల్లలున్నరు. ఇప్పటికే ఊరిడిసి పెట్టినం. ఇక్కడికి వస్తే ఇంకెక్కడికి పోతం జెర వూకో." కోసి ఓదార్చసాగింది. ఆమె మంగ్లికి వరుసకు అత్త అవుతుంది.

"నా కొడుకు... నా కొడుకునేం జేస్తరో... నేనెట్ల సప్పుడుజెయ్యకుంటుండాలే..."

"ఊకో చిన్నమ్మా... ఎత్తుకపోయినోళ్లను శిబిరాల్ల పెడుతుండ్రు... మన సుక్కు ఎట్లనో అట్ల తప్పిచ్చుకొస్తడులే" ఆశలు అడుగంటిపోతున్నా మంగ్లిని ఓదార్చడం కోసం అన్నడు సోమాల్.

"అండ్ల పెట్టి నా కొడుకును ఎన్ని తిప్పలు పెడుతుండ్రో. ఆడు మిలీషియాల పని చేస్తుండని తెలిస్తే ఏం జేస్తరో..."

"నువ్వట్ల అధైర్య పడకత్తా... మనం ధైర్యంగుండాలె. ఈ సర్కార్ మన మీద పగపట్టింది. ఇగ ఎట్లయినా తిప్పలే పెడుతరు. ఏం జేస్తం భరించాలె" అన్నారు మరొకరు.

మధ్యాహ్నం వరకూ మంగ్లి ఇరాం లేకుంట ఏడుసుకుంటనే ఉంది. ఎవ్వరు ఎంత బతిమిలాడినా పచ్చి మంచినీళ్లన్నా ముట్టలేదు. అందరూ చెప్పీ చెప్పీ ఆ చెట్టు కిందా ఈ చెట్టు కిందా ఇన్ని ఆకులు పర్చుకొని నడుంవాల్చారు. మరి కొందరు వేరే చోట ఉన్న తమ పాకల దగ్గరికి వెళ్లిపోయారు. సోంవారి మాత్రం మంగ్లి పక్కనే కూర్చొని ఉంది.

మంగ్లి ఏడుస్తూ ఏడుస్తూ శోష వచ్చినట్లుగా నేల మీద వాలిపోయింది. కాసేపటికి ఏడుపునాపేసి లేచి కూర్చుంది. కన్నీళ్లు తుడుచుకుంది. సోంవారి ఇచ్చిన చెంబులోని నీళ్లు తాగింది. కొన్ని మొహమ్మీద చల్లుకుంది. విడిపోయిన జుట్టును గట్టిగ ముడేసుకుంటూ "నేను బీజాపూర్ క్యాంపుకు పోత" స్థిర నిశ్చయంతో అన్నది.

"నీకేమన్నా పిచ్చా క్యాంపుకు పోయి ఏం జేస్తవు?" అంది సోంవారి.

"వాళ్ల కాల్లు బట్టుకొనయినా సరే నా కొడుకును ఇడిపిచ్చుకుంట"

"నువ్వు పోతే ఇడిసిపెడుతరనుకుంటున్నవా? వాళ్లెంత పాపిస్టోల్లో మనం ఇంటలేమా?"

"పోయి ఒక్క తీరుగ బతిమలాడుత"

"అరె! జుడుమోళ్లంటే ఏమనుకుంటున్నవే నువ్వు, మనం ఇంటలేమా? కడుపులున్న పిండాలను కూడా బయిటికి తీసి సంపుతున్రు గాదే. పోయి పోయి యముల సేతుల్లకు పోతనంటవు. వాని మాట అటు పెట్టు. అసలు నువ్వు పోతే నిన్నిడిసి పెడ్తరా? సర్వ తిప్పలు పెడ్తరు!"

"ఏమన్న పెట్టనీ నా కొడుకు ఆళ్ల సేతుల్లుంటే నేనిక్కడ ఎట్లుంట? నా కొడుకుతోనే నేను."

"మంగ్లీ నువ్వు చెప్పిన మాట వినవే. ఏదో కర్మం గాలి వాడు ఆ యముల సేతుల్ల పడ్డడు. వాని రాతెట్లుందో. అదృష్టం బాగుంటే ఎట్లనో అట్ల కొడుకు ఆళ్ల సేతుల్నుంచి తప్పిచ్చుకొస్తడు. కానీ నువ్వెందుకే నిప్పుల గుండంల దునుకుతనంటవు. తల్లయినా, కొడుకయినా ఒకరి బాధను జూసి ఇంకొకలం బాధ పడుతం ఏడుస్తం. కానీ ఒకరి కోసం ఒకరం సచ్చిపోతమానె. నా మాటిను సెల్లే..." అనునయంగా అంది సోంవారి.

మంగ్లి కండ్లనుంచి కన్నీళ్లు జలజలా రాలాయి. "అక్కా ఇగ నువ్వు నన్నేం అనకు. నాకు అర్థం రాకు. వాడు నా పాణం. వాడు లేకుంట నేను బత్క నేను పోతే... బతిమిలాడితే ఏమో

ఎంత కఠిన గుండెైనా కరుగుతది గావొచ్చు. లేకుంటే వానితో పాటే నేను…"మంగ్లి లేచి కూర్చోవడం చూసి ఓ నలుగురైదుగురు దగ్గరికి చేరిన్రు. మంగ్లి నిర్ణయం తెల్సి వాళ్లూ వారించబోయిన్రు. కానీ మంగ్లి వినిపించుకోలేదు. వెళ్లడానికి సిద్ధమై లేచింది. "అయ్యో కమిటీ వాళ్లెవరూ లేరు. వాళ్లు జెప్తేనన్న వినేదేమో" అన్నారెవరో.

"అయ్యో ఒక్కదానివే ఎట్ల పోతవు నేను గూడ వస్త పా" అంది కోసి.

"నువ్వెందుకు అత్తా. నేనొక్కదాన్నే పోతా. నీకెందుకు తిప్పలు…"

"ఒక్కదాన్ని ఎట్ల పోనిస్తమే. నువ్వు పడే తిప్పలేవో నేనూ పడ్త పా…"

మంగ్లి, కోసి వెళ్తుంటే అందరూ చేష్టలుడిగి చూస్తుండిపోయారు.

* * *

చుట్టూ ఇనుప తీగెల ముళ్ల కంచె. ఆ కంచె నడుమ చిన్నవీ, పెద్దవీ టెంట్లు…కొన్ని ఇండ్లూ… నడుమ పోలీసు స్టేషన్, టెంట్లలోనూ, బయట గుంపులు గుంపులుగా కూర్చున్న మనుషులు… స్త్రీలు, పురుషులు, వృద్ధులు, పిల్లలు… సర్వం కోల్పోయిన వాళ్లుగా బిక్కు బిక్కుమంటూ… కొందరు మాత్రం పరిస్థితులతో రాజీ పడ్డట్టుగ యాంత్రికంగా అటూ ఇటూ తిరుగుతున్నారు. ఏవేవో పనులు చేస్తున్నారు. ఏదేదో మాట్లాడుకుంటున్నారు. బోరింగు దగ్గర నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. పిల్లలకు స్నానాలు చేయిస్తున్నారు. బట్టలుతుకుతున్నారు. వీళ్లందర్నీ ఆజమాయిషీ చేస్తూ, వాళ్లను తిడుతూ, కొడుతూ, బెదిరిస్తూ, వెక్కిరిస్తూ తుపాకులు పట్టుకున్న పోలీసులు, ఎస్.పి.ఒలు అటు ఇటు తిరుగుతున్నారు. అది బీజాపూర్ రాహత్ శిబిరం. మంగ్లి వాళ్ల ఊరికి రెండు గంటల దూరంలో వుందది.

ఈ శిబిరానికి వెళ్లడం కోసమే మంగ్లి, కోసి బీజాపూర్‌లో అడుగు పెట్టారు. అడుగుపెట్టగానే ఎస్.పి.ఒలు వీళ్లను శిబిరానికి లాక్కుపోయారు.

"మేం క్యాంపుల ఉంటందుకే ఒస్తున్నమయ్యా" అని వాళ్లు మొత్తుకుంటున్నా ఎవరూ పట్టించుకోలేదు. వాళ్లను శిబిరంలోని ఒక రూంలోకి లాక్కుపోయారు. అక్కడ పోలీసులూ, జుడుం నేతలు, ఎస్.పి.ఒలు… కుర్చీల మీద బెంచీల మీద కూర్చొని ఉన్నారు. కొందరు నిలబడే ఉన్నరు.

"ఎవర్రా వీళ్లు" జుడుం నేత కన్నాల్ వాళ్ల వైపు పురుగులను చూస్తున్నట్టు చూస్తూ అడిగాడు. "కాకే కోర్మ అట మామా. క్యాంపుల్నే ఉందమని వస్తున్నరట" చెప్పాడు ఒక ఎస్.పి.ఒ.

"అహా… కాకేకోర్మ వాళ్లా? ఈ వూరి వాళ్లు బద్మాషులు. నక్సలైట్లకు పుల్లు మద్దతిస్తరు. అందుకే వీళ్లూరి నుంచి ఒక్కరు కూడా లొంగిపోలేదు. వీళ్లను నమ్మొద్దు" అన్నాడు కన్నాల్.

"నిజం అన్నా. మేం ఇక్కడ్నే ఉందమని వచ్చినం" గొంతు పెగుల్చుకొని చెప్పింది మంగ్లి. ఆమెకు వాళ్లందర్నీ చూస్తుంటే గుండె దడదడలాడుతోంది. గొంతు ఎండిపోతోంది. కోసి పరిస్థితి కూడా అలాగే ఉంది.

"మీరిద్దరే వచ్చిన్రు. మీ మొగుళ్లు, పిల్లలు ఏరే?"

"నా మొగుడు సచ్చిపోయిండన్నా. ఒక్కడే కొడుకు… వాన్ని మీరే పట్టుకొచ్చిన్రన్న.

ఈమె మా అత్త. ఈమెకెవ్వరూ లేరు..."

"ఓహో... అట్ల జెప్పు. కొడుకును పట్టుకొచ్చిర్రని ఒచ్చినవు, లేకుంటే వచ్చేదానివి కాదులే..." హేళనగా అంటూ అసహ్యంగా నవ్వాడు కన్నాల్. మిగిలిన వాళ్లూ నవ్వారు ఆ మాటలకు. కోయ భాషలో మాట్లాడుకుంటున్న వాళ్ల సంభాషణ అర్థం కాకపోయినా అందరూ నవ్వేప్పటికి అక్కడున్న సి.ఆర్.పి.ఎఫ్., నాగా పోలీసులూ నవ్వారు, వికృతంగా.

తల దించుకుంది మంగ్లి.

మాకు మస్కా కొట్టి నీ కొడుకును తీస్కపోదమని వచ్చినావే"

"లేదన్న. ఎక్కడికి తీస్కపోత... ఆ ఊళ్ల మాకిప్పుడేం లేదు? అంతా కాలి బుగ్గయింది కదా. నా కొడుకుతోటి నేను గూడ ఇక్కన్నే ఉంట. ఈన్నే ఏదన్న పని జేసుకొని బత్కుతం. ఆ ఊళ్లె మాకేముంది? ఇగ అక్కడికి పోం..."

"నీ కొడుకు మిలీషియాల పని జేసిండు గాదె... వాన్ని ఎట్ల ఇడిసి పెట్టాలె."

"ఏదో అందరితో పాటు చేసిండన్న. వానికేం తెల్వదు. తప్పయిందన్న. ఆని బదులు నేను తప్పొప్పుకుంటున్న. ఆన్ని ఇడిసి పెట్టుర్రన్న."

"ఆన్ని ఇడిసి పెట్టుడా? అడొక్క మాట గూడ జెప్తలేడే పార్టీ గురించి. ఆన్ని ముక్కలు ముక్కలు జేస్తం..."

"అయ్యో అంత మాటనకన్నా. పార్టీ గురించి ఆనికేం తెల్సన్నా. ఆనికేం తెల్సునని సెప్తడన్నా... ఆన్ని తిప్పలు బెట్టకుర్రన్నా. మీకు పుణ్యం ఉంటది. మీ కాళ్లు మొక్కుత. దండం పెడ్త..." కన్నీళ్లతో వేడుకుంది మంగ్లి.

ఇంతలో ఆ గదిలోకి మరి కొందరు ఎస్.పి.ఒలు వచ్చారు. వారిలో ఒకడు మంగ్లి వాళ్ల పక్కూరి వాడే. వాడు మంగ్లిని చూస్తూనే "ఓ యిది మహిళా సంగంల పని జేస్తదన్నా. తల్లీ కొడుకులిద్దరు ఫుల్లు మద్దతిస్తరు నక్సలైట్లకు..." అన్నాడు.

"ఆహా అట్లనా. మెల్లగా మనల్ని మోసం చేసి కొడుకును తీసుకుపోదామని వచ్చిందిరా ఇది. దాన్ని ఆ రూంలకు గుంజుక పోర్రిరా. దీని కొడుకును కూడా తీసుకురార్రి. దీని సంగతి చూద్దాం."

కన్నాల్ ఈ మాటలు అన్న వెంటనే మంగ్లిని గొర గొర పక్కనే ఉన్న మరో రూంలకు గుంజుక పోయారు.

"అయ్యో దాన్నేం అనకుండ్రయ్యా. దానికేం తెల్వదు..." అంటూ కోసి కూడా వాళ్ల వెనకాలె ఆ రూంలకు వెళ్లబోయింది. కానీ ఆమెను గట్టిగా తోసేసి దర్వాజ దగ్గర కొందరు ఎస్.పి.ఒలు అడ్డం నిలబడ్డారు. ఆ తర్వాత ఆ రూంలోకి సుక్కును తీసుకువచ్చారు.

కొడుకును చూడగానే మంగ్లి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. దుఃఖం తన్నుకువచ్చింది. గుండె నీరయింది. అతని ముఖంలో దైన్యం తాండవిస్తోంది. మొహం ఉబ్బిపోయి కళ్లు ఎర్రగా ఉన్నాయి. జుట్టు చిందరవందరగా ఉంది. చొక్కా చిరిగిపోయి ఉంది.

"అయ్యో కొడుకును ఎన్ని హింసలు పెట్టిర్రో" తల్లి మనసు తల్లడిల్లిపోయింది. రెండు

చేతులతో కొడుకును వడిలోకి తీసుకోవాలన్పించిందామెకు. కానీ ఆమె చేతులు ఆమె స్వాధీనంలో లేవు. ఎస్.పి.ఒలు ఆమె పెడరెక్కలు విరిచి పట్టుకున్నారు.

తల్లిని చూడగానే సుక్కు "అయ్యో అమ్మెట్ల దొరికింది" అనుకున్నాడు. తనను పెట్టిన చిత్రహింసలు గుర్తొచ్చి "అమ్మ కూడా అవన్నీ భరించిందా" అని అనుకోగానే వెన్నెముకలో వణుకు పుట్టిందతనికి. ఏడుస్తున్న తల్లిని ఓదార్చాలనుందతనికి. కానీ తన పెడరెక్కలు విరిచి పట్టుకొన్న ఎస్.పి.ఒలు అతన్ని అడుగు కూడా ముందుకు వేయనీయలేదు.

"ఒక్కసారి ఇడిసి పెట్టన్రయ్యా. నా కొడుకు దగ్గరికి పోనియ్యన్రయ్యా. మీకు దండం పెద్త" వర్షిస్తున్న కళ్లతో అర్థించిందామె.

"ఇడిసి పెడ్తం ఇడిసి పెడ్తం తొందరపడకు" అంటూ కన్నాల్ వచ్చి ఆమె బట్టలు గుంజేశాడు. కన్నాల్ ఉద్దేశం అర్థమైన మిగతావాళ్లు వికృతంగా నవ్వసాగారు. ఆమె గింజుకుంది. మొత్తుకుంది. ఏడ్చింది. వేడుకుంది. అయినప్పటికీ ఆ మృగాలు ఆమెపై దాడిచేశాయి.

"ఒద్దు మా అమ్మనేం చేయొద్దు. కావాలంటే నన్ను సంపున్రి. మా అమ్మనేం జేయొద్దు" గట్టిగా అరుస్తూ, ఏడుస్తూ గింజుకుంటున్నాడు సుక్కు. సుక్కు పెనుగులాటను వినోదంగా చూస్తూ నవ్వుతున్నారు వాళ్లంతా.

తల్లిని ఆ స్థితిలో చూడలేక తన కళ్లను పొడుచుకోవాలనిపించింది సుక్కుకు. అది సాధ్యం కాని నిస్సహాయ స్థితిలో గట్టిగా కళ్లు మూసుకున్నాడు. తల్లి చేస్తున్న ఆర్తనాదాలు అతని చెవులను బద్దలు కొడ్తున్నాయి.

"అరేయ్ కళ్లు తెరిచి చూడురా" కొందరు ఎస్.పి.ఒలు కొట్టారు. అయినా కళ్లు తెరవక పోవడంతో అందరూ కల్సి బూతులు తిడ్తూ విపరీతంగా కొట్టసాగారు.

అంత దుర్భర హింస నడుమనే "అయ్యో నా కొడుకును ఏమనకున్రయ్యా" అంటూ వేడుకుంటోంది మంగ్లి.

లోపలి నుండి తల్లీ కొడుకుల ఆర్తనాదాలను వింటున్న కోసికి గుండె అవిసిపోయింది. గేటు కాడున్న వాళ్లను "అయ్యా నన్ను లోపలికి పోనియ్యండ్రయ్యా. అది నా కోడలయ్యా. వాడు నా మనుమడయ్యా" అని వేడుకోసాగింది.

"ఏయ్ ముసల్దానా పో ఇక్కడ్నుంచి. లేకుంటే దాని లెక్క నీగ్గాడ అయితది" అంటూ ఒక ఎస్.పి.ఒ. విసురుగా తోస్తే అంత దూరంలో పడిందామె.

కాసేపటికి ఆ గదిని ఖాళీ చేసి అందరూ వెళ్లిపోయారు. సుక్కును కూడా లాక్కుపోయారు. మంగ్లి ఒక్కతే అరిచి అరిచీ పెనుగులాడీ పెనుగులాడీ స్పృహ కోల్పోయి పడిఉంది గది మధ్యలో.

అందరూ వెళ్లిపోవడంతో కోసి మెల్లగా లేచి ఆ గదిలోకి వెళ్లింది.

దయనీయంగా పడిఉన్న మంగ్లిని చూస్తే గుండె తరుక్కుపోయిందామెకు. సల్వాజుడుంలో భాగంగా ఆడవాళ్లను అరిగోస పెడుతున్రని ఆమె వింటూనే ఉంది, కానీ కళ్లతో చూసేప్పటికి కడుపులో దేవి, కళ్లు తిరిగినయి. దుఃఖం ఎగదన్నుకొచ్చింది. అయినా ఎలాగోలా కూడ

దీసుకుంది. మంగ్గినలా చూడలేనట్లు పక్కనే పడిఉన్న గుడ్డలను తీసి కప్పింది. పక్కనే కూలబడి కన్నీళ్లు కారిపోతూ ఉంటే "మంగ్గీ, మంగ్గీ " అని పిలవసాగింది.

బదులుగా మంగ్గి మూలిగిందే కానీ కళ్లు తెరవలేదు. కోసి కన్నీళ్లు తుడుచుకొని మెల్లగా లేచి బయటకు వచ్చింది. దగ్గర్లో ఉన్న ఒక టెంట్లోకి వెళ్లి లోటలో నీళ్లు తెచ్చి మళ్లీ మంగ్గి పక్కన కూలబడి ముఖం మీద కొంచెం నీళ్లు చల్లింది. తన పైటతో మెల్లగా ముఖాన్ని తుడిచింది. నెమ్మదిగా కళ్లు తెరిచింది మంగ్గి. కోసి వైపు చూడకుండా ఎటో పిచ్చిచూపులు చూసింది.

"అయ్యో బిడ్డా ఎంత పని జేసిన్రే..." మంగ్గిని దగ్గరికి తీసుకుంటూ జీరగొంతుతో అంది కోసి.

మంగ్గి ఏం మాట్లాడలేదు. ఏడ్చి ఏడ్చి పొడారిపోయిన కళ్లతో భావరహితంగా చూస్తుండిపోయింది.

"ఇన్ని నీళ్లు తాగు బిడ్డా..." అంటూ గొంతులో నీళ్లు పోస్తే ఓ గుక్క మింగి మొహాన్ని అటువైపు తిప్పేసుకుంది. మెల్లగా ఆమెను లేవదీసి బట్టల్ని చుట్టబెట్టేసింది. మళ్లీ నిస్సత్తువగా నేల మీదికి ఒరిగి పోయింది మంగ్గి. "నేనేం పాపం జేసిన్నత్తా" అంటూ కుమిలి కుమిలి ఏడ్వసాగింది.

"ఊకో బిడ్డా. థూ... వాల్లు మనుషులు కాదు. వాళ్లు కడుపుకు అన్నం తింటలేరు..." కసితీరా తిట్టింది కోసి.

"నా కొడుకునేడికి తీస్కపోయిన్రత్తా" ఆ పరిస్థితిలోనూ కొడుకు గురించి పరితపించిపోతోందామె.

"తానాకు తీస్కపోయిన్రు..."

"అయ్యో వాన్ని ఇడిసిపెట్టేటట్టు లేరు. వాన్ని సంపుతరేమో" తన గాయం కంటే కొడుకును పెడుతున్న బాధే ఎక్కువగా సలుపుతున్నదామెను.

"ఊకో బిడ్డా! ఎట్లయ్యేదుంటే గట్లయితది మన సేతులేముంది జెప్పు..." ఊరడింపుగా మంగ్గి తలనిమురుతూ అంది కోసి.

మంగ్గిని తీసుకొని వచ్చిన దార్నే వెళ్లిపోవాల్నని ఉందామెకు. కానీ తుపాకులు పట్టుకొని కాపలా కాస్తున్న పోలీసులు వెళ్లనీయరని తెల్సు. మెల్లగా మంగ్గిని లేపి రెట్ట పట్టుకొని నడిపించుకుంటూ బయటకు తీసుకువచ్చింది. దగ్గర్లో ఉన్న ఓ చెట్టు దగ్గరికి తీస్కెళ్లి "ఈడ కూసో బిడ్డా" అంది.

యాంత్రికంగా కూర్చొని, కూర్చునే శక్తి లేనట్టు నేల మీదికి ఒరిగిపోయింది మంగ్గి.

సూర్యుడు పశ్చిమాన కుంగిపోతున్నాడు. దూరం నుంచే కొంతమంది మంగ్గిని చూస్తున్నారు. కానీ ఎవరూ దగ్గరికి రావడంలేదు. ఆడవాళ్లు దూరం నుంచే బాధగా నిట్టూర్పులు విడుస్తున్నారు. పొద్దు గుంకుతుండడంతో పొయ్యిలు రాజేసి పెద్ద పెద్ద గిన్నెలతో కొంత మంది వంటలు చేస్తున్నారు. శిబిరంలో బలవంతంగా నిర్బంధించిన వారికి రెండు పూటలా ఇంత

ఉండి పడేస్తూ ఉంటారు. దానికోసం శిబిరంలోని వారితో సమిష్టిగా వంటలు చేయిస్తారు. ఆ దుర్భర జీవితంలోనూ బతకాలనే ఆశ... తమ పిల్లల్ని బతికించుకోవాలనే ఆశ... వాళ్ల చేత్తో యాంత్రికంగా పనులు చేయిస్తుంది. తల్లుల పక్కనే పిల్లలు బిక్కు బిక్కుమంటూ ఒదిగి కూర్చున్నారు. ఆటలూ, పాటలూ అన్నీ వాళ్లకు ఎప్పటివో జ్ఞాపకాల్లా ఉన్నాయి.

చీకటి పడ్డది. "అక్కడ బోరింగున్నది... పా మంగ్లీ... జెర వంటి మీద నీళ్లు పోసుకుంటే మంచిగుంటది..." అంటూ లేవదీసింది కోసి.

కోసి భుజం చుట్టూ చేతులేసి నడిపిస్తే యాంత్రికంగా అడుగులేసింది మంగ్లి. ఆ క్యాంపు మధ్యనే ఉన్న ఒక ఇంట్లో అడిగి బిందె నిండా వేడినీళ్లు తెచ్చింది. వేడి వేడి నీళ్లు తలమీది నుంచి పోసి. ఆమె కట్టుకున్న గుడ్డలను నీళ్లలో జాడించి గట్టిగా పిండి వాటినే మళ్లీ చుట్టబెట్టింది. నిజానికి కోసిని కూడా ఎస్.పి.ఒలు కొట్టారు, విసురుగా తోసేశారు. అందువల్ల ఆమెకు వళ్లంతా నొప్పిగానే ఉంది గానీ మంగ్లి బాధ ముందు ఆమె తన బాధను పట్టించుకోవడంలేదు.

కోసి కూడా వంటి మీద నీళ్లు పోసుకుంది. "ఆ పొయ్యి కాడికి పోయి కూసుందాం రా బిడ్డ... బట్టలారుతాయి..." అంటూ ఓ టెంటు దగ్గరికి తీస్కెళ్లింది. పొయ్యి కాడ కూర్చొనే శక్తి లేక ఒరిగిపోతున్న ఆమెకు ఎవరో సానుభూతితో తాటాకుల చాప పరిచారు. దానిపై నిస్సత్తువుగా ఒరిగిపోయింది. తన స్థితి ఆమెకర్థం కావడంలేదు, ఆలోచనలు స్తంభించిపోయాయి.

"కొడుకునేం చేస్తారో..." ఆ స్థితిలోనూ పదే పదే వస్తోన్న ఆలోచన అదొక్కటే ఆమెకు.

కొద్దిసేపటికి ఓ పళ్లెంలో గంజి తెచ్చి "కొంచెం తాగు బిడ్డా" అనునయంగా అంది కోసి.

"ఉహు ఒద్దత్తా..."

"అట్లంటె ఎట్ల లే పొద్దట్నుంచి మెతుకు నోట్లబెట్టకపోతివి..."

"ఉహు నాకేం వద్దు" మరింత ముడుచుకుందామె.

ఓ నలుగురైదుగురు ఆడవాళ్లు దగ్గరికి వచ్చారు. ఆ పొయ్యి వెలుగులో పడుకొని ఉన్న ఆమె వైపు సానుభూతిగా చూశారు. "కొంచెం తాగు బిడ్డా. ఏం చేస్తాం పాపపు రోజులు వచ్చినయి. మనయింత గోరం బతుకులైతయని ఎన్నడనుకోలే..." నిట్టూర్పుతో అందొక ముసలమ్మ.

అందరూ విడవకుండా తలో మాటా అంటుంటే లేచి కూర్చొని బలవంతంగా రెండు గుక్కల గంజినీళ్లు మింగి మళ్లీ వాలిపోయింది.

* * *

మంగ్లి క్యాంపుకు వచ్చి నెలరోజులవుతోంది. మధ్యలో కోసి ఓసారి పారిపోదామని ప్రస్తావించింది. కానీ మంగ్లి రానంది. తాను పారిపోతే కొడుకును చంపేస్తారంది. కోసి కూడా మంగ్లిని వదిలేసి పోలేక ఉండిపోయింది.

"పోనీ నువ్వు పో అత్తా నా కోసం నీకెందుకు తిప్పలు" అంటే "నిన్నిట్ల ఇడ్సిపెట్టి నేనెట్ల

పోవాల్నే...” అన్నది.

తనను అత్యాచారం చేసినవాళ్లు రోజూ తన కళ్ల ముందే తిరుగుతుంటే, తనను చూసి ఎగతాళి చేస్తుంటే రక్తం ఉడికిపోతున్నా నిశ్శబ్దంగా కళ్లు దించుకునేది. అవమానాన్ని గొంతులో దిగమింగేది మంగ్లి.

రోజూ కొడుకును దొడ్డికి తీసుకుపోవడానికి బయటకు తెచ్చేవారు. అప్పుడు దూరం నుంచే చూసుకునేది. దగ్గరికి వెళ్లనిచ్చేవారు కాదు. దగ్గరికి వెళ్తే కొట్టి తోసేసే వాళ్లు. అయినా రోజూ వెళ్లే ప్రయత్నం చేసి దెబ్బలు తినేది. రోజూ ఠానాకు పోయి “నా కొడుకును ఇడిసి పెట్టన్రయ్యా... ఇడిసి పెడితే ఎక్కడికి పోం ఇక్కడ్నే ఉంటం ” అని వేడుకునేది. ఒక్కో సారి కోపంతో బాగా తిట్టేది.

క్యాంపులోని ఎవ్వరితోనూ మాట్లాడేది కాదు. పిచ్చిదానిలా ఎటో చూస్తూ కూర్చునేది. ఎవరన్నా పలకరిస్తే ముక్తసరిగా జవాబిచ్చేది. కోసి వేళకింత తెచ్చి పెడితే బలవంతంగా తినేది.

“అత్తే లేకుంటే నన్నాదుకునేవారెవ్వరు?” అనుకునేదామె. కోసి పట్ల కృతజ్ఞతతో మనసు నిండిపోయేది. ఆమెకు ఒక్కోసారి అయోమయంగా తోచేది. తానెక్కడుందో అర్థమయ్యేది కాదు. తమ ఇల్లూ, వాకిలీ, గొడ్డూ, గోదా, అడవీ, వాగులూ, వంకలను వదిలేసి ఈ ఇరుకులో ఈ రొచ్చులో ఎందుకున్నాను అని అయోమయంలో పడేది. దట్టమైన అడవిలో క్రూర మృగాలు, విషసర్పాల నడుమ సైతం భయమన్నది లేకుండా వంటరిగా సంచరించే తను ఈ మనుషులను చూస్తే ఎందుకింత వణికిపోతున్నదో అర్థమయ్యేది కాదు. వాళ్ల చేతుల్లోని తుపాకులను చూస్తే మనసు ఉడికిపోయేదామెకు.

తరచూ కమ్లి... కమ్లి వంటి మరికొందరు గుర్తొచ్చేవారు. వాళ్ల భుజాలకు వేలాడే తుపాకులను ముచ్చటగా చూసేదెప్పుడూ. “ఇది ఫలానా ఆంబుష్‌లో దొరికింది ” అంటే గర్వంగా తాకి చూసేది. ఆ తుపాకులు తమ కోసమేనని అనిపించేదామెకు.

సంవత్సరం క్రితం కమ్లి మాటలు విని కొడుకును దళంలకు పంపివుంటే ఇప్పుడు వానికీ నాకూ ఈ తిప్పలు ఉండేవి కాదు గదా అనుకునేది.

ఎట్టకేలకు మంగ్లి నిరీక్షణ ఫలించింది. సుక్కును వదిలేశారు. జీవచ్ఛవంలా తల్లి ఒడిన చేరాడు సుక్కు. ఏదోలా ప్రాణాలతో మిగిలాడు అదే చాలనుకుంది మంగ్లి. తన కన్నీళ్లతో కొడుకు గాయాలను కడిగింది. కదుములు కట్టిన చోట కాపడం పెట్టింది. రోజూ కోసి తెస్తే రెండు ముద్దలు బలవంతంగా మింగే మంగ్లి ఆ రోజు తనే పోయి అన్నం పట్టుకొచ్చింది. కొడుక్కు బలవంతంగా తినిపించింది. చీమల పులుసు గుర్తొచ్చిందామెకు. అదయితే ఇష్టంగా తినేవాడు. ప్చ్ కానీ ఎక్కడ తేగలదు. అదే తమ ఊర్లో అయితే ఇలా వెళ్లి అలా తేగల్గేది అనుకుంది.

* * *

“సుక్కూ, ఎట్లనో అట్ల అమ్మా, నువ్వు తప్పిచ్చుకొని వచ్చిన్రు. మళ్లీ ఇప్పుడు వాళ్ల చేతిల

బద్దవంటే ఇగ బత్కనీయరు. అందుకని దళంల జేరితే మంచిది. అమ్మతోటి నేను మాట్లాడుత, తనొప్పుకుంటే సరే... లేకుంటే నువ్వు అమ్మ మాటను పక్కన బెట్టయినా సరే దళంల జేరితేనే మంచిది." అనునయంగా చెప్పసాగింది కమ్లి. ఓ చెట్టు కింద వేసిన పాలిథిన్లో కూర్చున్నారిద్దరూ. ఎండలు ఇప్పుడిప్పుడే ముదురుతున్నయి.

"లేదక్కా అమ్మను వదిలి నేను దళంల చేరలేనక్కా" తలవంచుకున్నాడు సుక్కు

"అదేంది సుక్కూ, దళంలకు వస్తనని ఇన్ని రోజులు పట్టుబట్టినవ్. ఇప్పుడేమయింది?"

"నేను లేకుంటే అమ్మ బతుకలేదని అర్థమైందక్కా.. లేకుంటే నా కోసం ఆ నరకకూపంలోకి వచ్చేది కాదు. అన్ని తిప్పలు పడేది కాదు."

"నిజమే సుక్కూ, కానీ నువ్వక్కడ్నే వుంటవనుకొని నమ్మి వదిలేసింన్రు... ఈసారి దొరికితే మీ ఇద్దరికీ ఇంతకంటే తిప్పలుంటయి. అమ్మను గూడ ఒప్పిద్దం నేను నచ్చజెప్త..."

"అమ్మ ఒప్పుకుంటే గూడ నేను రానక్కా... నేను వస్తే అమ్మనెవరు జూసుకుంటరు? జుడుం గూండాలు చాలా తిప్పలు పెట్టిన్రక్కా... ఇప్పుడు మునుపటి లెక్క పనిజేసే శక్తిగూడ లేదమ్మకు..."

"జుడుం ఇట్లనే కొనసాగితే అమ్మసువంటోల్లు ఎందరో బలైతరు సుక్కూ, దీన్ని మనం ఆపాలె. ఆపాలంటే యుద్ధాన్ని తీవ్రం చేయడం తప్ప ఇంకో దారి లేదు. మరి నీ అసువంటోళ్లు భర్తీ కాకుంటే యుద్ధం ఎట్ల తీవ్రతరం అయితది... అమ్మనూ, అమ్మసువంటి ఎందర్నో ఇంత తిప్పలు పెడ్తున్నవాళ్లకు బుద్ధి జెప్పాల్నని, జుడుంను ఓడించాల్నని నీకు లేదా సుక్కూ?"

"బుద్ధి జెప్పుడు కాదక్కా ఒక్కొక్కన్ని ముక్కలు ముక్కలు జేయాల్నని ఉంది. ఇప్పట్నుంచి నన్ను అన్ని దాడులల్లకు తీస్కపోంన్రక్కా ఎర్ర బోరుల... రాణిబోదిలల నరికి సంపినట్టు సంపాలనుంది నాగ్గూడ..."

"అటువంటి దాడులు చేయాలంటే మన ప్లటూన్లు, కంపెనీలు పెరగాలె... మరి నీ అసువంటి యువతీ యువకులు భర్తీ కాకుంటే ఎట్ల చెప్పు..."

"కానీ అమ్మకు దూరంగా వుండలేనక్కా మిలీషియాల ఉంటే యుద్ధం చేయొచ్చు... అమ్మకు దగ్గరిగానూ ఉండొచ్చు...."

కమ్లి ఎంత జెప్పినా సుక్కు ఇదే నిర్ణయం మీద నిలబడ్డాడు.

ఇంతలో దూరంగా మంగ్లి వస్తూ కనబడింది. "అమ్మ వస్తుంది" అంటూ లేచి ఎదురెల్లింది కమ్లి, లాల్‌సలాం చేసి భుజం మీద చెయ్యేసి దగ్గరికి తీసుకుంది. మంగ్లికి కళ్లలో నీళ్లు తిరిగినయి. కమ్లికీ హృదయం ద్రవించింది. "ఎంత చురుగ్గా వుండేది. ఎట్లయిపోయింది అనుకుంది."

"బేలె మంతిన్ నానో(ఎలా ఉన్నావక్కా)"

సమాధానంగా తలవూపింది మంగ్లి. అలాగే పాలిథిన్ వరకూ నడిపించుకుంటూ వెళ్లింది. "రా కూర్చుందాం" అంది.

"ఎట్ల కొంచెం నొప్పులు తగ్గినయా? నువ్వసలు ఎందుకు పోయినవక్కా వాళ్లెంత

దుర్మార్గులో మనం వింటలేమా. ఆ రోజు నువ్వు పోంగనే మేం వూళ్లెకొచ్చినం. అయ్యో కొంచెం ముందు వస్తే నిన్నెట్లయినా ఆపేటోళ్లం అనుకున్నాం..."

"నేను పోకుంటే సుక్కును సంపుదురేమో కమ్లి..."

సమాధానంగా కమ్లి మౌనం వహించింది.

"పోనీలే ఎట్లనో అట్ల తప్పిచ్చుకొని వచ్చిన్రు..." అంది కాసేపటికి కమ్లి.

మళ్లీ తనే "ఎన్నో ఘోరాలు చేస్తున్రక్కా, ఇండ్లు తగలబెడ్తున్రు... పంటలు తగుల బెడ్తున్రు... గొడ్డూ గోదను చంపుతున్రు ఎత్తుకబోతున్రు... కనబడ్డోళ్లను చంపుతున్రు, లేకుంటే చిత్రహింసలు పెట్టి శిబిరాలల్ల పెడ్తున్రు... ఎస్.పి.ఒలుగా తయారు చేసి మన వేలుతోటే మన కంటిని పొడుస్తున్రు. ఇక ఆడవాళ్లు కనబడ్తే మృగాళ్లెక్కనే పీక్కు తింటున్రు. ఈ బాధ నీ ఒక్కదానిదే కాదు. మనల్ని ఇన్ని తిప్పలు పెట్టిన సర్కార్‌నూ, జుడుం మూకనూ చరిత్ర ఎప్పటికీ క్షమించదు... ప్రజలూ, ఉద్యమం తప్పక బదులు తీర్చుకుంటుంది...

ఇప్పటికే అది మొదలైంది కూడా, ఇన్ని ఘోరాలను జేసిన జుడుం మూక మట్టికరవడం మొదలైంది. బీజాపూర్ థానా వంటిదే ఎర్రబోరు థానా. దానిమీద దాడిచేసి 33 మందిని చంపినం. అట్లనే రాణిబోదిలల 55 మందిని చంపినం. అందులో మన ఆరుగురు కామ్రేడ్స్ ప్రాణత్యాగం చేసింద్రు.ఇంకా చాలా దాడులు చేసినం. ఊర్లమీద దాడి చేస్తందుకు వచ్చే మూక మీద, దాడి చేసి పోతున్న మూక మీద చాలా చోట్ల అంబుష్‌లు చేసినం. జుడుం వాళ్లనెందరినో చంపేసినం.మన ప్రతిఘటన పెరిగింది. కాబట్టి ప్రస్తుతం జుడుం బాగా తగ్గుమొఖం పట్టింది. నీక్కూడా అర్థమయ్యే ఉంటది ఈపాటికి. మునుపటిలా వురుకులు పరుగులు లేవుగా..."

శ్రద్ధగా వినసాగింది మంగ్లి. ఇన్నాళ్లుగా సలుపుతున్న గాయం కొంచెం ఉపశమించినట్టుగా అన్పించిందామెకు.

"కమ్లీ, సుక్కును దళంలకు పంపమంటే నేనప్పుడు పంపలేదు... నేను తప్పు చేసిన, ఇప్పుడు తీస్కపో..." అంది స్థిరంగా.

ఆమెనెలా ఒప్పించాల్నా అని తలమునకలవుతున్న కమ్లికి ఒక్క క్షణం నోటి మాట రాలేదు. జీవితానుభవం నుంచి మంగ్లి పోరాటావసరాన్ని మరింతగా గుర్తించింది అనుకుంది. అంతే కాదు పెరుగుతున్న విప్లవ విజయాలు ప్రజల్ని మరింతగా విప్లవోన్ముఖులను చేస్తయ్ అనుకుంది.

"సుక్కు తోటి ఈ మాటే మాట్లాడిన్నక్కా కానీ ఈ స్థితిలో నిన్ను ఇడ్సిపెట్టి రానంటుండు..."

"అవునా, వాన్ని పిలువు నేను మాట్లాడుతా..."

వెంటనే కమ్లి సుక్కును కేకేసింది. సుక్కు వచ్చి కూసుండు.

"అప్పుడు నిన్ను దళంలకు తోలకపోవుడే నేను చేసిన పెద్ద తప్పు. ఇప్పుడు నేను సంతోషంగ పొమ్మంటున్న పోరా సుక్కూ..."

అమ్మలో ఈ మార్పుకు సుక్కు ఆశ్చర్యపోయాడు. "నాకు తెల్సమ్మా. నన్నెందుకు దళంలకు

పొమ్మంటున్నవో, నేనుంటే మల్లెక్కడ వాళ్ల చేతికి దొరుకుతనోనని నువ్వు బయపడుతున్నవు... కానీ నేను మల్లా దొరక్కుంట జాగర్తగా ఉంట... ఈ పరిస్థితిల నిన్ను ఇడిసిపెట్టి నేనెట్ల పోత" అన్నాడు.

"సుక్కూ నేనప్పుడు పొరపాటుగ ఆలోచించిన... నువ్వు నాకు అండగ ఉండాలనుకున్న. కానీ ఈ దొంగ సర్కార్ మన మీద పగ బట్టింది బిడ్డా... ఈ సర్కార్ నుంచి కాపాడుకోవాలంటే నాకు నీ ఒక్కని అండ సరిపోదురా... మన సైన్యం పెద్దగ్గావాలె. మరి నీ అసువంటోళ్లు జేరకుంటే మన సైన్యం ఎట్ల పెరుగుద్ది? నువ్వు మన సైన్యంల జేరితే నా ఒక్కదానికే కాదురా, నా అసువంటి ఎందరో అమ్మలకు అండగుంటవు... అందుకని కమ్లి జెప్పినట్టు నువ్వు బర్తీ కావాలె బిడ్డా... నువ్వు బర్తీ అయ్యి నీ అసువంటోళ్లను శానా మందిని తయారు జెయ్యాలె..."

"కానీ నువ్వొక్క దానివి ఎట్లుంటవమ్మా"

"మన జనతన సర్కార్ మంచిగ పనిచేసినప్పుడు నా అసంటి ఒంటరోళ్లకు అండగ నిలిచింది. కానీ ఈ జుడుం దాడిల మన సర్కార్ చెల్లాచెదురయిపోయే... మల్లా మన సర్కార్ నిలబడితే నా అసంటోల్లకు ఏ తిప్పలూ ఉండయి బిడ్డా. నీ అసంటోల్లు బర్తీ అయితేనే మన లడాయి ముందుకు పోతది. మల్లా మన సర్కార్ నిలబడ్తది. కాబట్టి ఇగ నాగురించి ఏమాలోచించకు నువ్వు... నా అసువంటి తిప్పలు ఇంకెవ్వరికి రావొద్దంటే జుడుం ఆగిపోవాలె. ఇసువంటి జుడుంలను నడుపుతున్న దొంగ సర్కార్ కూలిపోవాలె..."

తల్లి కర్తవ్య బోధ కొడుకులోని విప్లవ సంకల్పాన్ని దృఢపరుస్తోంది.

* * *

(ఇది కథ కాదు. తమ భర్తలనూ, పిల్లలనూ జుడుం నుండి కాపాడుకోవడానికి ఎందరో బస్తర్ మహిళలు పొందిన చేదు అనుభవాలనూ, తమ గొంతులో జ్వలిస్తోన్న గరళాన్ని చల్లార్చుకోవడానికి కన్నబిడ్డలను ప్రజాసేనలోకి సాగనంపుతోన్న తల్లుల నిలువెత్తు త్యాగాలనూ అక్షరీకరించడానికి చేసిన చిరు ప్రయత్నం. జుడుంలో అతలాకుతలం అయిన సమస్త బస్తర్ ప్రజానీకానికి సంఘీభావంతో....)

***అరుణతార నవంబరు-డిసెంబరు 2011***

# చైతే

– ఎన్. డి.

అతను ఉరుకుతున్నాడు. కుంగిపోతున్న తన నవనాడుల్లోని అణువణువుల్లోంచి తన శక్తినంతా బొట్టు బొట్టుగా పిండుకుంటూ అతను ఉరుకుతున్నాడు. ప్రపంచంలో మరి దేని ఉనికినీ గుర్తించనట్టు, ఉన్నా వాటితో తనకేం సంబంధం అన్నట్టు అతను ఉరుకుతున్నాడు. అతను ఆమెకేసి ఉరుకుతున్నాడు.

అతని కాళ్లకు అడ్డం వచ్చిన బండలూ, రాళ్లూ పిండి పిండి అయిపోతున్నాయి. అతని వేడి నిట్టూర్పులకు తాళలేక అడవిలోని చిగురుటాకులన్నీ అల్లాడిపోతున్నాయి. ఎగసిపడ్తున్న అతని గుండెలు భూమిని అదిరిస్తున్నాయి.

దు:ఖం మనిషి రూపం దాల్చినట్టుగా ఉన్న ఆమె అతని కోసమే ఎదురు చూస్తున్నట్టుగా దయగా చేతులు చాచి అతన్ని ఆహ్వానిస్తూ నిలుచుని ఉంది. కొండంత అల విరిగిపడ్డట్టు ఒక పెద్ద కన్నీటి బిందువై అతను ఆమెను చుట్టుకుని ఆమె శరీరాన్ని నిలువెల్లా తడిపేశాడు. అగ్నికీలల్లాంటి అతని ఉఛ్వాస నిశ్వాసాలు ఆమెను దహించి వేస్తున్నాయి.

మెల్లగా అతన్ని తననుండి విడిపించుకుని, అతని రెండు భుజాల్నీ పట్టుకుంది. అతను నిలబడలేకపోతున్నాడు. అతని శరీర ప్రకంపనలకు చెట్లు వణికిపోతున్నాయి.

ఆమె కరుణ వాత్సల్యపూరితమైన తన చూపులతో అతని ముఖాన్ని సాంత్వనగా నిమిరింది.

"మన చైతేని ఒంటరిగా పట్టుకుని, గొంతు కోసి..."

సర్వసాక్షుల్లాంటి ఆమె కనులు తమకన్నీ తెలుసునన్నట్టుగా గంభీరంగా అర్ధ నిమీలితాలై ఉన్నాయి. వాటిలోని ఎర్రని జీరల్ని చూసిన అతను ఇక మాటలు రానట్లుగా ఆమె ఒడిలో కుప్పకూలాడు. ఆమె అతన్ని మెల్లగా లేపి, అతని భుజం చుట్టూ తన చేతిని వేసి, అలాగే అతన్ని పొదువుకుని నడిపించుకుని తీసుకెళ్లింది.

అతను ఆ దృశ్యాన్ని ఇక చూడలేనన్నట్టుగా అరచేతుల్తో తన ముఖాన్ని కప్పుకున్నాడు. తన విషాద నయనాల్ని అతనికేసి తిప్పి, అతని చేతుల్ని విడదీసి, చుబుకాన్ని పైకెత్తి, కన్నీటి కొలనులైన అతని కళ్లల్లో తన ప్రతిబింబాన్ని చూపిస్తూ,

"సరిగా చూడు, ఇక్కడ పడి ఉన్న ఆ నగ్నదేహం నాదే, గుర్తు పట్టావా? దశాబ్దం క్రితం అది ఒక చైతన్యపు హోరై నా దేహంలో కలగలిసిపోయింది. ఉత్తర్ బస్తర్‌నుండి మాడ్‌కు

ప్రవహించి దండకారణ్య క్షితిజం పై 'ప్రభాత'మై అది ఉదయించడాన్ని నువ్వు ప్రతి రోజూ చూస్తూనే ఉండింటావు. అత్యాచారం చీకటిని కప్పి వాళ్ళు శాశ్వతంగా గుంకేలా చేయాలనుకున్నది ఆ 'ప్రభాతా'న్నే. రోజూ దేశం నలుమూలల నుండీ ఎన్నో పాయలు నాలో కలగలసి ప్రవహిస్తూ ఉంటాయి. నా నగ్నదేహాన్ని అడ్డుకట్టగా వేసి వాళ్ళు అడ్డుకోవాలనుకున్నది ఆ ప్రవాహాన్నే."

అతను నిశ్శబ్దంగా ఆ దేహం ముందు మోకరిల్లాడు.

ఆమె అతని పై తన సజల నేత్రాలని వర్షిస్తూ,

"అలా కొద్దిగా నీ చూపుల్ని పైకి జరుపు. అక్కడ వేటు కనిపిస్తోందా? అది పడింది నా గొంతు మీదే. దాని చిరపరిచితమైన నాదం మూడు దశాబ్దాలుగా మహిళా విముక్తికై నేను వేసిన పొలికేకలో ప్రతిధ్వనించడం నీవు చెవొగ్గి వినే ఉంటావు. మాడ్ భూమిని రక్షించుకోవాలని నేను ఇచ్చిన పెనునినాదంలోని దాని పదునైన శృతిని నీ చెవులు పసిగట్టే ఉంటాయి. దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతం చేయాలని నేను ఎలుగెత్తి పాడిన పాటల్లో 'లలిత'ంగా వినిపించిన ఆ మృదుస్వరం నిన్ను పులకింపజేసే ఉంటుంది. ఆ నా గొంతునే వాళ్ళు మూగబరచాలనుకున్నది. ఆ గొంతులోని ప్రతిఘటన స్వరాన్నే వాళ్ళు తెగ్గొట్టాలనుకున్నది, గ్రహించావా?"

అతను భూమిని కౌగిలించుకుంటున్నట్టుగా నేల మీదకు వంగి రక్తంతో తడిచిన ఆ మట్టిని దోసిళ్ళకెత్తుకున్నాడు. ఆమె అతని ముందు మోకాళ్ళ పై కూచుని అంజలిలా పట్టిన అతని చేతుల్ని తన చేతుల్తో కప్పుతూ,

"చూశావా, ఎంత ఎర్రగా ఉందో నా రక్తం. భూమి పై రాలిన మొదటి చినుకు కంటే, ఆదిమ మంచుఖండం నుండి కరిగిన మొదటి నీటి బిందువుకంటే, ఈ సమస్త విశ్వంలో జన్మించిన మొదటి బిడ్డకంటే కూడా స్వచ్ఛమైనదీ, పవిత్రమైనదీ, ప్రాచీనమైనదీ అమరమైన నా ఈ రక్తమే. వేల ఏళ్ళుగా నువ్వు ఈ రక్తాన్ని చూస్తూనే వస్తున్నావు. స్పార్టకస్ శిలువ మేకుల పై అంటిన ఆ ఎర్రని మరకల్ని నీవు మరవాలన్నా మరవలేవు కదూ. నైలు నదీ తీరాన, పారిస్ నగర బ్యారికేడ్ల పై, స్టాలిన్‌గ్రాడ్ శిథిలాల్లో, టాటూ నది వంతెన గొలుసుల పై, తెలంగాణ మైదానాల్లో... ఒక చోటనేంటి, ఎల్లెడలా నేను ఈ ప్రపంచానికి పదే పదే జన్మనిచ్చినప్పుడల్లా ఈ రక్తం చిందడం నీకు గుర్తుండే ఉంటుంది. వాళ్ళు ఈ మట్టిలో ఇంకించి విలుప్తం చేయాలనుకున్నది నా ఈ జీవనదీ ప్రవాహాన్నే. పరికించి చూడు, ఈ మట్టిలో నా రక్తం లిఖించిన ప్రపంచ భవితవ్యం కనిపిస్తుంది"

అతను తన శ్రమైక జీవన కరుకు చేతుల్లోకి పరాగాల మృదుత్వాన్నంతా చేర్చుకుని, ఓ పువ్వులా ఆ దేహాన్ని ఎత్తుకుని ఆర్ద్రంగా తన గుండెలకదుముకున్నాడు. ఆమె లాలనగా తన చేతుల్ని చాచింది. అతను దాన్ని ఆమె చేతుల్లో పెట్టాడు. ఆమెను స్పృశించగానే అది నవజాత శిశువై ఆమె గుండెల్ని కరుచుకుంది. ప్రపంచంలోని మాతృత్వమంతా చనుబాలధారై ఆ శిశువు నోటిలోకి ప్రవహించింది.

కన్నీటి చారికలు ఎండిన అతని బుగ్గల్ని మార్దవంగా నిమురుతూ ఆమె అతని ముఖాన్ని

ముద్దాడింది. మరుక్షణం విడివడి దృఢంగా చేయి కలుపుతూ,

"చూశావు కదా, వాళ్లు నన్ను చంపలేకపోయారు, చంపలేరు కూడా, ఎందుకంటే వాళ్లు నన్ను చంపాలనుకున్న ప్రతీసారీ చైతేలు తమ ప్రాణాలను నా ప్రాణాలకు అడ్డు వేస్తారు"

తన అమృత సంతానాన్ని పొత్తిళ్లలో పొదువుకుని ఆమె వెనుతిరిగింది. అతను నిటారుగా నిల్చుని అనల ప్రవాహంలా తరలిపోతున్న వారిరువురికీ శిరస్సు వంచి నమస్కరించాడు. అతని చేయి పిడికిలై పైకి లేచింది. అతని పెదాలు

"కామ్రేడ్ చైతే అమర్ రహే"

అని ఉచ్చరిస్తున్నాయి.

(రుషికి ఆర్తిగా)

(17.08.2010న దండకారణ్య ప్రెస్ (ప్రభాత్ పత్రిక) కి చెందిన సీనియర్ ఎసి సభ్యురాలు కామ్రేడ్ చైతే (లలిత మడావి)ని ఒంటరిగా చిక్కించుకుని, అత్యాచారం చేసి, గొంతు కోసి చంపి, ఆమె అర్ధనగ్న దేహాన్ని పడవేసి పోయారు శత్రు ఏజెంట్లు. ఇదే నెట్‌వర్క్ 2010 భూంకాల్ దినాన (ఫిబ్రవరి 10) కుమిలి అనే వ్యవసాయ కార్యకర్తను ఇలాగే గొంతు కోసి, అత్యాచారం జరిపి, చంపేసి నగ్నదేహాన్ని పడవేసి పోయింది. ఈ పద్ధతిలో మహిళల హత్యలు గ్రీన్‌హంట్‌లో భాగంగా జరుగుతున్నవే. చైతే హంతకుల్లో నలుగురినీ, కుమిలి హంతకుల్లో ఒకడినీ పిఎల్‌జిఎ గెరిల్లాలు పట్టుకొని ప్రజాకోర్టులో ప్రవేశపెట్టగా, ప్రజలే వారికి మరణశిక్షను అమలు జరిపారు.)

***అరుణతార, జనవరి–ఫిబ్రవరి, 2012***

# మూసుకున్న హృదయం

– మిడ్కో

‘నీకు గిసువంటి పనులన్నీ ఎందుకూ? సూసినవా జిల్లాల్‌ను గూడా సంపిరి... ఇప్పటికన్నా గిసువంటియన్ని ఇడిసిపెట్టి సప్పుడు జెయ్యకుంటుండు...” భర్తకు కంచంల అన్నం పెట్టినప్పటి నుంచీ అనాలనుకున్న ఈ మాటలు, ఆయన తిని చేయి కడుక్కునేప్పటికన్నా అనగలిగింది మల్లే.

“ఏందీ, సప్పుడు జెయ్యకుంట ఉండాల్నా? ఆళ్లు ఒక్కర్ని జంపితే మేం పదిమందిని జంపుతం...” బుస్సుమన్నడు కన్నాల్.

“నేనెప్పుడు మాట్లాడినా నామీదికి ఇంతెత్తున ఎగురుడు నీకు బాగనే తెల్సుగని ఓసారి గాకుంటే ఓసారన్న జెర నా మాట సెవులేసుకోరాదూ...” విసురుగా గిన్నెలను ఓ పక్కన పెడుతూ అన్నది.

“ఎహె, ఎప్పుడు జూసినా నీకిదే లొల్లి...” కడుక్కున్న చేయిని భుజం మీది తువ్వాలకు తుడ్సుకుంటా దిగ్గున లేచి పందిట్లకు వెళ్లిపోయిండు కన్నాల్.

భర్త వెనకాల్నే మల్లేకూడా పందిట్లకు వచ్చింది. భర్త కూర్చున్న మంచంకు ఎదురుంగ కూలబడ్డది. అప్పుడప్పుడు భర్తతోటి  ఈ మాటలు చెప్తనే ఉన్నా ఈ రోజు ఎట్లనన్నా గట్టిగా మాట్లాడాలని అనుకుందామె.

“అయినా గని ఎందుకయ్యా గంత పాపం మూట గట్టుకునుడు...  ఆడ లేదు, మొగ లేదు, ముసలి లేదు, ముతక లేదు, ఎవర్ని బడితే ఆళ్లను కోళ్లను కోసిన దానికంటే అన్యాలంగా కొయ్యబట్టిరి. పసిపోరగాళ్లను కూడా సంపబట్టిరి. వావి లేదు వర్స లేదు, తల్లి లేదు సెల్లె లేదు... గంత పాపంగ ఆడోళ్లను కరాబ్‌చేయబట్టిరి. మనగ్గూడ ఆడపోరగాళ్లున్నరు. పసిపోరగాళ్లున్నరు. గిసువంటి పాపపు పనులు నీకెట్ల జెయ్యబుద్ధయితుంది?”

“పాపమేంది పుణ్యమేంది? మనం జేత్తున్నది యుద్ధమే!  సల్వాజుడుం అంటే ఏందనుకున్నవ్! యుద్ధం! యుద్ధంల గవన్నుండయి!” మామూలుగనయితే భార్యను విదిలించి పారేసేటోడు... ఏ కళనున్నడో గానీ తన వాదన వినిపిస్తుండు.

“ఎవరి మీదనయ్యా యుద్ధం, పసిపోరగాళ్ల మీదనా? ముసలోళ్ల మీదనా?”

“మనం అందర్ని వచ్చి శిబిరాలల్ల వుండమంటున్నం. కొందరు ఇంటున్నరు గని కొందరు

ఇంటలేరు... మరి ఇననోళ్లకు బుద్ధి రావాల్నంటే గిట్లనే జెయ్యాలె..."

"పుట్టి పెరిగిన ఊళ్లను, అన్నం బెట్టే అడవినీ, బూమిని ఇడిసిపెట్టుకొని రావాల్నంటే ఎవ్వరికైనా మనసెట్ల ఒప్పుతది? అట్ల ఇడిసిపెట్టి ఒస్తలేరని సంపుడు అన్యాలం గాదూ?"

"అది గాదే... పుట్టి పెరిగిన ఊల్లను ఇడ్సిపెట్టబుద్దిగాక కాదే ఆళ్లు రాన్ది. ఆళ్లు నక్సలైట్ల మద్దతు జూస్కొని ఒస్తలేరు..."

"నక్సలైట్ల మద్దతు జూస్కొనే ఒస్తలేరో ఇంకెందుకు ఒస్తలేదో రాకపోతే పోనీ... ఎవరి బతుకులు అళ్లయి..."

"ఎడ్డి మొకందానా నీకేం తెల్సే... ఆళ్లు రాకపోతే ఆళ్ల మద్దతుతోని నక్సలైట్లు ఇంక పెరిగిపోతరు. రోడ్డు మీది ఊరు గాబట్టి నీకు నక్సలైట్ల దెబ్బ తెలుస్తలేదు. మనూళ్లె నక్సలైట్లుంటే వందెకరాల బూమి మనకు ఉండేదనుకుంటున్నవా? ఇంత పెద్ద ఇంట్ల నువ్వు కాపురం జేద్దువనుకుంటున్నవా? నీ పోరగాల్లు నీ సేతుల్నే ఉందురనుకుంటున్నవా? మన బూమిని ఎన్నడో ఊరందరికి పంచుదురు. మన ఇల్లును ఏన్నడో బాంబులు పెట్టి పేల్చేద్దురు... మన పోరగాళ్లనన్న మనకు ఉంచుదురనుకున్నవా? ఆళ్లను గూడ దళంల షరీక్ జేసుకుందురు..."

"ఏమ్మో, ఉంటే ఏం జేద్దురో గని ఇప్పుడైతే మన జోలికి ఆళ్లు రాలేదు! ఆళ్ల జోలి మనకెందుకు?"

"ఇప్పుడు మన జోలికి రాలేదు గదా అని సప్పుడు జెయ్యకుంటుంటే అన్ని ఊళ్లను కబ్జ చేసుకుంట రేపు మన ఊరిగ్గూడ వస్తరు. మన గుండెల మీద తంతరు... సేతులు కాలినంక ఆకులు పట్టుకుంటే ఏం లాభం. అందుకే మన బూములను కాపాడు కోవాల్నంటే, మన పెత్తనాన్ని నిలబెట్టుకోవాల్నంటే నక్సలైట్లను ఏరిపారెయ్యాలె..."

"ఏం ఏరి పారేసుడో...అల్లను ఏరిపారేసుడు పేరుతోటి అన్నెం పున్నెం ఎరుగని జనాల్ని సంపుడు, ఆళ్ల గోస పుచ్చుకునుడైతే మంచిది కాదు. అట్ల జనాల్ని గోస పెట్టి అల్లకు కంటవుడు మంచిది గాదయ్యా. జనాలకు కంటయి ఈ బూమ్మీద ఎవలు బత్కలేరు! అంద్లగూడ ఆ జనాలందరు మన జాతోల్లేనాయె..."

"ఏ... గా జనాలు మనల్నేం జేత్తరే! పూటకు గతిలేనోళ్లు. మనదిక్కు సర్కారుంది. పేద్ద సైన్యముంది..."

"గా జనాలేం జేత్తరని గట్ల తీసెయ్యకు... శిబిరాల మీదనే దాడులు జెయ్యబట్టిరి..."

"ఆ... గా నక్సలైట్ల మద్దత్ జూస్కొని నీల్గుతుంద్రు, తీయ్... ఎన్ని రోజులు నీల్గుతరో సూద్దం! సర్కార్ పెద్ద ఎత్తున సైన్యాన్ని దించుతందుకు జూస్తాంది. అప్పుడు నక్సలైట్ల పని, అల్ల మద్దతు జూస్కుని మురుస్తున్న ఈ జనాల పని అయితది..."

భర్త ఎంత జెప్పినా మల్లే సరిపెట్టుకోలేక పోతున్నది. అందుకనే "ఏమో అయినప్పుడు సూద్దం తీయ్‌గని అప్పటిదాన్కనయితే నువ్వు జెర ఉరుకులాడకు..." అన్నదామె.

"నీ... ఎడ్డిమొకమా! ఎంత జెప్పినా నీ సోది నీకే. ఇప్పుడు మనం జుడుంల మంచిగ పని జేత్తనే రేపు ఇక్కడ్నుంచి నక్సలైట్లు లేకుంటయినంక మనం చక్రం తిప్పొచ్చు... ఇప్పుడు

మనం సప్పుడు జెయ్యక ఇంట్ల కూసుంటే అటెంకాల మనల్ని కానేదెవరూ..."

"అటెంకాల చక్రం తిప్పుడేమో గని నువ్విప్పుడు ఉరుకులాడినవంటే... సూడు, ఆ జిల్లాల్ సంగతి సూడు... ఏమయిందో పెండ్లం, పిల్లలకు లేకుంటయిండు..."

"నువ్వేం ఫికర్ పడకే నాకేం కాదు గని, ఇగో నా చేతిల తుపాకీ ఉన్నంత సేపు నాకేం కాదుగని" పక్కనే గోడకానించి ఉన్న డబుల్ బ్యారెల్ గన్‌ను చేతిలోకి తీసుకుంటూ అన్నడు.

"ఆ జిల్లాల్ దగ్గర లేదా ఏందీ తుపాకీ? తుపాకీ ఉండే. పోలీస్ స్టేషన్ ఎదురుంగనే అయన సేనుండే. ఆ సేన్లనే నక్సలైట్లు కాల్చిసంపి ఆ తుపాగ్గూడ ఎత్తుకపోయిరి..."

"ఆడు జెర లా ఫర్వాగున్నట్టుండులే..."

ఇంకెట్ల నచ్చజెప్పాల్నో అర్థం కాలేదు మల్లేకు.

"అది కాదు నా మాట జెరనన్న ఇనవయ్యా. మనమా ఉన్నంతల మంచిగనే బత్కబడ్తిమి. పెద్ద పిల్ల పెండ్లి జేత్తిమి... పెద్ద పిల్లగాడు మంచిగ ఎగుసం చేయబట్టే... తతిమ్మ పోరగాండ్లు మంచిగ సదువుకోబట్టిరి... అట్లనే మంచిగ సదివిస్తే ఆళ్లకు మంచిగ నౌకర్లొస్తయని అందరనబట్టిరి... ఏదో రంది లేకుంట బతుకుతున్నం. నువ్విప్పుడు లేని రంది పెట్టవడ్తివి... మనకెందుకయ్యా ఈ లొల్లంతా..."

మధ్యాహ్నం నుంచీ సాయంత్రం వరకూ ఇద్దరూ మాట్లాడుకుంటనే ఉన్నరు, వాదించుకుంటనే ఉన్నరు అయినా ఎవరి మాటలు వాళ్లయే, ఎవరి వాదనలు వాళ్లయే అయినయి.

❖ ❖ ❖

"నువ్వు జేసే పాపిష్టి పనులు సాలనట్టు ఇంక గా పోరగాళ్లను గూడ ఆంద్ల దిస్తవా? నీ ఇష్టమున్నట్టు ఆడుతుంటే నేను సప్పుడు జెయ్యక ఉంటననుకుంటున్నవా?" గొంతు చించుకొని అరుస్తున్నది మల్లే, మరొకప్పుడైతే భర్తతోటి గట్టిగ మాట్లాడాల్నంటేనే భయపడేది. ఆ విశాలమైన పందిట్ల ఆమె నిలబడి ఉంది. ఆమెకు ఎదురుంగ ఉన్న ఒక మంచంల భర్త కూసొని ఉంటే, మరొక మంచంల పెద్దకొడుకు మంగాల్, రెండో కొడుకు సంజయ్ కూసొని ఉన్నరు.

మల్లే-కన్నాల్‌లకు ఇద్దరు బిడ్డలు, నల్గురు కొడుకులు. అందర్లోకి ఒక బిడ్డ పెద్దది, ఒక బిడ్డ చిన్నదీ, నడుమ నల్గురు కొడుకులు. పెద్ద బిడ్డను, పెద్ద కొడుకును తప్ప మిగిలిన నల్గుర్నీ బీజాపూర్‌లో హాస్టల్ల ఉంచి చదివిస్తున్నరు. పెద్ద పిల్లలిద్దర్కీ ఇంట్లపెట్టిన ఆదివాసీ పేర్లే ఉన్నయి. మిగతా నల్గురికీ దాదాపుగా ఆదివాసీ పిల్లలందరికీ మార్చినట్టుగనే స్కూల్లో జేర్పించంగనే టీచర్లు పేర్లు మార్చేసింగ్రు. అందుకే రెండో కొడుకు సంజయ్ అయ్యిండు.

"సప్పుడు జెయ్యక ఉండకుంటే ఏం జేత్తవో జేస్కో... నీతోటి ఎప్పటికిదే లొల్లి... అరె మన పోరగాళ్లొక్కరే జేరుతుండ్రా? ఎంతమంది పోరగాల్లు ఎస్పీవోలుగ జేస్తున్రు! నేనే ఎంత మందినో జేర్పిచ్చిన. అందర్నీ జేర్పిస్తున్నవు గనీ వయసు పోరగాల్లు నీకాడ ఉన్నరు గద, నువ్వెందుకు జేర్పిస్తలేవు అంటే, నేను మొకం ఏడ బెట్టుకోవాలె..."

"మనగ్గింత బూముండే... నువ్వు ఊర్లమీద పడి తిరుగుతుంటే ఆడు, నేనే ఆ బూమిని

పట్టుకొని సేయించబట్టివి. ఆనికీయ్యేడు పెండ్లి జేత్తే కోడలొత్తది. నాగ్గూడ ఇంటికాడ సాకిరి కొద్దిగ తప్పుతది, పిల్లా జెల్లలతోటి ఇల్లు కళ కళలాడ్తదని నేననుకుంటాన్న. ఆన్ని తీస్కబోయి అంధ్ల జేర్పిచ్చి సంపుతవా? అడు మంచిగ సదువు కుంటాండు. ఎంధ్ల తప్పకుంట మంచిగ రాబట్టే, ఆదేదన్న మంచి నౌకరి గాడయితే సూద్దమని నేననుకుంటాంటే అన్ని సంపుతందుకు నువ్వు సూస్తున్నవు. పోరగాల్లు సల్లగుంటే నీకు సూడబుద్దయిత లేదా? జనాలు సల్లగుంటే జూడలేక ఆల్లను సంపుక తినబట్టివి. ఇప్పుడు నా పోరగాండ్లను గూడ సంపుకతింటవా..." ఆవేశంతోటి ఊగిపోతున్న దామె. గొంతు బొంగురుపోయింది.

"ఎందుకట్ల ఒర్రుతున్నవ్? ఎస్పీవోలుగ జేరినోల్లందరూ సస్తున్రానే. బూమ్మీద ఆయిసు తీరినోల్లు ఎట్లయిన సస్తరు, ఎస్పీవోలుగా సేరినా సస్తరు సేరకున్న సస్తరు. నువ్వుత్త పిరికి దానివి. ఆల్లగ్గూడ పిరికిమందు నూరి పొయ్యకు..." ఎప్పుడూ అణిగిమణిగి ఉండే భార్య అంత గట్టిగ మాట్లాతుంటే సహించలేక పోతుండు కన్నాల్.

తల్లిదండ్రులు అంత లొల్లిపెట్టుకుంటున్నా ఇద్దరు కొడుకులూ మాత్రం ఏం మాట్లాడకుంట కూసున్నరు, ఇద్దరి దిక్కు మార్చి మార్చి సూసుకుంట.

"ఇగో నువ్వెన్నన్న జెప్పు, నా పోరగాండ్లను అంధ్ల జేర్పిచ్చేది లేదు! నిన్నే బందు బెట్టమని నేను మొత్తుకుంటాంటే ఇప్పుడు ఆల్లను గూడ తయారు జేద్దమని జూత్తున్నవ్. నువ్వు జేత్తె జెయ్యి, నీ సావు నువ్వు సావు గని ఆల్ల జోలికి రాకు..." కరాకండిగా చెప్పిందామె.

"ఆల్లను జేర్పిచ్చుడు జేర్పిచ్చుడే... నువ్వు నోర్మూసుకొని కూసో... అయినా నిన్నెవడడిగిన్రు? ఆల్లను జేర్పియ్యాల్నా ఒద్దా ... అని, నా పోరగాండ్లను నా ఇస్టం ఒచ్చినట్టు తయారు జేసుకుంట..." ఇంక నీతోటి మాట్లాడేదేం లేదు అన్నట్టు తువ్వాలను విదిలించి భుజమ్మీదేసుకొని తుపాకీ చేతిల పట్టుకొని పందిట్లనుంచి విశాలమైన వాకిట్లకు వచ్చి, బజారు దర్వాజ దిక్కుకు అడుగులేసి బయటకు వెళ్లిపోయిండు.

"ఏందీ నీ పోరగాల్లా అబ్బో నువ్వే కని పెంచినవు..." లేచి పోతున్న అతని దిక్కు చూసుకుంట అరుస్తున్నదామె.

" ఊకో అమ్మా ఆయన సంగతి తెల్సిందే గదా మాటన్నడంటే అది నెగ్గితీరాల్నాయే..." తల్లి దిక్కు సానుభూతిగా చూసుకుంట అన్నడు సంజయ్.

"ఆయనెట్లనన్న పోనీ గని మిమ్ముల్నన్న బతుకనిచ్చేటట్టు లేదు గదరా... అయినా మీరెందుకు గొర్రెలెక్క ఆయన సెప్పింది ఇంటున్నరా..." కొడుకుల దిక్కు ఆవేదనగ చూస్కుంట కింద కూలబడ్డదామె.

"నాకైతే ఇష్టం లేదమ్మా ఎస్పీవోల్ల జేరుడు. వచ్చే ఏడు డిగ్రీ అయిపోతది. ఇంకో సంవత్సరం ట్రైనింగ్ చేస్తే, నాకు టీచర్ ఉద్యోగం వస్తది. నాకు టీచర్ గావాల్ననే ఉంది. నేను ఆయనకు చాల్నే జెప్పి సూసిన, ఇంటుండా? ఇప్పుడు ఎస్పీవోగ జేరితే ముందు ముందు పోలీసు ఆఫీసరువైతవని ఒకటే జెప్తుండు. ఆ పోలీసుద్యోగం... ఆ సంపుడు, సచ్చుడు... నాకైతే ఇష్టం లేదు. కానీ ఏం జేయాలమ్మా. నా సదువు అయిపోయి ఉంటే ఆయన మాట ఇనకుంట నా

బతుకు నేను చూసుకునేటోన్నే. సరే.. చేరకపోతే నీ ఇష్టం, నేనయితే నిన్నింక సదివియ్య... అంటుండు. ఇప్పుడు సదువు బంద్ పెడితే నాకే ఉద్యోగం రాదు...పోనీ వ్యవసాయం పనన్నా రాకపోయే..." సంజయ్ తన బాధను తల్లితోటి పంచుకుండు.

తల్లి హృదయం విలవిలలాడింది. ఇంత సేపూ కొడుకులిద్దరూ ఇష్టపూర్వకంగనే ఒప్పుకున్నరనుకుంది.

"నువ్వెందుకొప్పుకున్నవురా... మంచిగ కష్టం జెయ్య శాతనైనోనివి..." పెద్ద కొడుకు దిక్కు సూస్కుంట అడిగింది.

"మా అసువంటి వయసు వయసోళ్లు ఇట్ల తయారు కాకపోతే నక్సలైట్లు పెరిగిపోయి మన బూములను, ఆస్తులను గుంజుకుంటరట. నా వయసోళ్లంతా తుపాకులు పట్టుకొని, మోటారు సైకిళ్ల మీద తిరుగుతున్రు. నన్ను జూసి మా దోస్తులు నవ్వుతున్రమ్మా... ఆడోళ్లు కూడా ఎస్పీవోలుగ జేరుతుంటే నువ్వేందిరా పిరికోనిలెక్క... అంటున్రమ్మా... గందుకనే నాగ్గూడ సేరాల్నని ఎప్పట్నుంచో ఉంది గని, నేను జేరుతనంటే వ్యవసాయం ఎవరు జేత్తరని నాయిన తిడుతడేమో అనుకున్న. ఇప్పుడు ఆయనే సేరమంటుండు గద..."

తల్లి హృదయం ఇంకింత విల విలలాడింది. అయ్యో వీడు తండ్రి లెక్కనే తయారయ్యేటట్టుండు అనుకుంది. తుపాకులు పట్టుకొని మనుషులను చంపుడు, పాపపు పనులు జేసుడు గొప్పనుకుంటున్నడు వీడు అనుకుంది.

ఒక కొడుకు ఇష్టపడే ఒప్పుకుండు. మరో కొడుకు ఇష్టం లేకుంట ఒప్పుకుండు... ఈళ్లిద్దర్ని కాపాడుకునేదెట్లా. మిగిల్న పిల్లలు చిన్నవాళ్లు. కానీ రెండేండ్లు పోతే ఆల్లు గూడ ఇట్లనే తయారైపోతరా... పరి పరివిధాలుగా ఆలోచిస్తూ విచారంల మునిగిపోయిందామె.

❖ ❖ ❖

వడివడిగా నడుస్తున్నడు కన్నాల్. సాయంత్రం కావడంతోటి పాపపు పనులను ఆ రోజుకు చాలించుకొని రాహత్ శిబిరం నుంచి ఇంటికి పోతుండు. ఇంతకు ముందు రాత్రి వరకు శిబిరంల ఉండిపోయేటోడు. కానీ రోజు రోజుకూ పరిస్థితులు మారుతున్నయని ఈ మధ్యన సాయంత్రానికల్లా ఇంటికి వెళ్లిపోతున్నడు. ఒకవేళ శిబిరంల ఉండంగనే చీకటైపోతే ఇక ఆ రోజుకు శిబిరంల్నే ఉండిపోతుండు. అసలు బయట ఉంటే ప్రమాదమని కన్నాల్ జుడుం నేతగా తయారైనప్పటి నుండీ అతన్ని వచ్చి శిబిరంలోనే ఉండమని పోలీసు అధికార్లు, తతిమ్మా జుడుం నేతలూ చెప్తున్నారు.

కానీ ఎందరో ప్రజలను శిబిరంలో చేరమని నిర్బంధించే కన్నాల్‌కు శిబిర జీవితం నచ్చలేదు. తన స్వేచ్ఛకు అక్కడ ఏ అడ్డూ లేకపోయినా అంతా రొచ్చు... రొచ్చు. ఎటు జూసినా మందలు మందలుగా జనం... ఎప్పుడూ అరుపుల గోల. అందుకే రాత్రి పూటయినా తన ఇంట్ల నిమ్మలంగా ఉండాలనుకుంటడు. అందులోనూ తనది ఆ ఊరంతటిలోనూ పెద్ద యిల్లు. పైగా తాత, తండ్రుల నాటి నుండీ ఉంటున్న ఆ చోటిపై మమకారం. తన హయాంలో పాత ఇంటిని ఆనుకునే విశాలమైన గదులతో పెద్ద ఇల్లును చుట్టూ ఎత్తయిన ప్రహరీ గోడను

కట్టించిండు. ఆ ఇంట్ల తలుపులు బిగించుకొని ఉంటే చీమ గూడ జొరబడదని అతని ధైర్యం. శిబిరం నుండి తూర్పు దిక్కుకు పోతే అరకిలోమీటర్ దూరంల కన్నాల్ ఇల్లు ఉంటది. అయితే శిబిరం నుండీ కన్నాల్ ఇంటి వరకు వరసగా ఇండ్లుండయి. మధ్యలో కొన్ని పొలాలు, ఖాళీ జాగా, చెట్లూ, చేమా ఉంటయి. దాదాపుగా ఆదివాసీ గ్రామాలన్నింటిలో ఇండ్లన్నీ ఒకే చోట కాకుండా నాలుగైదు గుంపులుగా ఉంటాయి. ప్రతి గుంపుకు నడుమ పొలాలు చెట్లూ చేమా ఉంటయి. ఊరు పెద్దదైతే ఒక్కో గుంపులో పదుల సంఖ్యలో ఇండ్లుంటయి, చిన్నదయితే మూడు, నాలుగే ఉంటయి. అన్ని గుంపుల్లోనూ ఇండ్లు సమానంగ కూడ ఏమీ ఉండవు. సాధారణంగా ఒకటి పెద్దగా ఉంటుంది. కన్నాల్ వాళ్ల ఊళ్లో కూడా శిబిరం ఉన్న చోట దాదాపు వంద ఇండ్లున్నయి. కన్నాల్ వాళ్ల ఇంటి చుట్టు పక్కల దాదాపు ఇరవై ఇండ్లుంటయి. శిబిరం నుండి తన ఇంటికి వస్తుంటే ఇండ్లన్నీ అయిపోయిన తర్వాత ఉండే ఆ ఖాళీ జాగా తనకు ముప్పని కన్నాల్ అనుకుంటా ఉంటడు. పోలీసులు, తతిమ్మా జుడుం నేతలు కూడా ఇదే మాట చెప్పి అతన్ని హెచ్చరిస్తూ ఉంటరు. అందుకే ఎవరూ మాటు వేయకుండా బాటకు రెండు పక్కల పది ఇరవై గజాలు స్పష్టంగ కనిపించేటట్టు పొదలు నరికించిన్రు. ఆ బాటల రాత్రింబగల్లు ఇరాం లేకుంట ఎస్పీవోలు తిరుగుతనే ఉంటరు. కొత్త వాళ్లెవరన్న కనబడ్డరంటే సాలు, వాళ్ల మీద పడిపోతుంటరు. అందుకనే అటు దిక్కు ఎవ్వరూ రాలేరన్న ధీమా ఓ దిక్కు పనిచేస్తుంటది. అయినప్పటికీ లోడ్ చేసిన తుపాకీ చేతిల పట్టుకొని అటు ఇటు పరిశీలనగ చూసుకుంట తొందర తొందరగ నడుస్తుండు. మరో చేతిల కొడుకుల కోసం తీసుకున్న ఎస్పీవో ఫారాలున్నయి. ఇంతల ఎవరో ఇద్దరు దూరంగ ఉరుక్కుంట వచ్చుడు గమనించి ఉలిక్కిపడ్డడు. ఆ ఉలికిపాటు నుంచి ఆయన తేరుకోకముందే 'ధాం' అని ఒక తూటా అతని పక్కనుంచి దూస్కపోయింది. వెంటనే అప్రయత్నంగ ఒక చెట్టు సాటుకు ఉరికిండు. అతను చెట్టు సాటుకు చేరేలోగనే మరో రెండు తూటాలు పక్కనుండే దూస్కపోయినయి.

"ఛ! మూడు తప్పి పోయినయి" అనుకున్నడు బద్రు అసహనంగ. అతను యాక్షన్ టీం కమాండర్.

చెట్టును చాటు చేసుకొని తన తుపాకీని గురిపెట్టి కన్నాల్ రెండు తూటాలు ఫైర్ చేసిండు. కానీ రెండూ తప్పి పోయినయి. మల్లా ఫైర్ చేయాల్నంటే తుపాకీని లోడ్ చేయాలె.

కన్నాల్ తుపాకీ లోడ్ చేయక ముందే దగ్గరికి పోయి ఫైర్ చేయాల్నే లక్ష్యంతోటి మరింత వేగంగ ఉరుకుతుండు బద్రు. బద్రును అనుసరించిండు మరో సభ్యుడు విజ్జాల్. అది గమనించిన కన్నాల్ తుపాకీ లోడ్ చేసే ఆలోచన బందుపెట్టి కాలుకు బుద్ధి జెప్పిండు. అతని చేతిలోని ఎస్పీవో ఫారాలు ఎప్పుడో పడిపోయినయి.

బద్రు, విజ్జాల్ అతని వెంటబడ్డరు. మల్లోసారి బద్రు ఫైర్ చేయబోయిండు గని, అంత దూరం నుంచి, అదీ తాను ఉరుక్కుంటూ, ఉరుకుతున్న మనిషిని కొట్టడం కష్టం అని కొంచెం దగ్గరికి పోయి ఫైర్ చేయాలని అనుకుండు.

ముగ్గురూ శక్తిని వెలికి తీస్తూ ఉరుకుతుంద్రు.

కన్నాల్‌కు చావుబతుకుల సమస్య. ఉరుకుడు ఆపినా, వేగం తగ్గినా చావు ఖాయం. బద్రు, విజ్జాల్‌లకు ఎప్పటి నుండో ప్రాణాలకు తెగించి చేస్తున్న ప్రయత్నం, ఉరుకుడు ఆపినా, వేగం తగ్గినా విఫలం అవుతుంది.

పొలాలు దాటి ఇండ్లు వచ్చేశాయి. సాయంకాలం కావడంతోటి వీధుల్లో జనాలు తిరుగుతున్నరు. పరిగెత్తుకొస్తున్న వాళ్లను చూసి, వీధుల్ల, దర్వాజలల్ల ఉన్న వాళ్లందరూ ఎక్కడి వాళ్లక్కడ్నే కొయ్యబారిపోయి సూస్తున్రు. ఇండ్లు రాంగనే విజ్జాల్ కావాలనే కొంచెం వెనుక బడ్డడు. బద్రు దృష్టి కన్నాల్ మీదనే ఉంది. విజ్జాల్ మాత్రం అటూ ఇటూ చూస్తున్నడు. ఎదురుపడ్డ మనుషులను తేరిపార చూస్తున్నడు. తమ చర్యకు ఎవరూ అడ్డం రాకుండా చూడ్డం అతని బాధ్యత.

ఇండ్లు రాంగనే కన్నాల్‌కు ఆశలు చిగురించినయ్. మరు నిమిషంల తన ఇల్లు వస్తది. ఇంట్లో దూరి తలుపులేసుకుంటే ఇక తనను ఎవ్వరు ఏం చేయలేరు... అనుకుండు. తన్నుకొస్తున్న ఎగపోతను పట్టించుకోకుంట ఉరుకుతుండు.

బద్రును నిరాశ కమ్ముకోసాగింది. వీడింట్ల పడ్డడంటే... ఇక తన ప్రయత్నం విఫలమయినట్టే. ఇంట్లకు అడుగు పెట్టకముందే కాల్చేయ్యాలె అనుకుండు.

కన్నాల్ ఇల్లు ఉన్న సందు వచ్చేసింది. సందులకు అడుగుపెట్టంగనే కన్నాల్ ఇల్లు ఎదురుంగ ఉంటది. సందు ఆ యింటితోనే ఆఖరైతది.

సందులకు అడుగుపెట్టంగనే కన్నాల్‌కు తమ ఇంటి దర్వాజ కనబడ్డది. "హమ్మయ్య తలుపులు తెరిచే ఉన్నయి... గడపట్ల తన భార్య నిలబడుంది. తను గడపట్లకు అడుగుపెట్టంగనే ఆమె తలుపులు మూసేసిందంటే... ఇక తను బతికి బయట పడ్డట్టే..." ఆ క్షణాల్లోనూ కన్నాల్ బుర్ర సరిగ్గనే పని చేస్తున్నది.

అయ్యో వీనిల్లు వచ్చేసింది. భార్య తయారుగ గడపట్లనే నిలబడుంది. వీడు లోపలికి అడుగుపెట్టంగనే తలుపులు మూస్తది కావొచ్చు... తలుపులు మూయకపోయినా వీడు ఆ గడప దాటిండంటే ఏ అర్రల దూరుతడో. ఎక్కడ నక్కుతడో...ఎక్కడన్న నక్కి తుపాకీ లోడ్ చేసుకుంటే తనకే ప్రమాదం. ఇంకాయింట్ల ఎవరెవరు ఉన్నరో గూడ తెల్వదు... ఏదైనా గడప దాటి లోపలికి పోవుడు ప్రమాదకరం తనకు. కాబట్టి ఇక చివరి ప్రయత్నంగ ఇక్కన్నుంచే ఫైర్ చేస్త... తగులుతే తగులుతది లేకుంటే లేదు. ఇక ఇక్కడ్నుంచే తను వెనక్కి తిరిగితే మంచిది... వగర్సుకుంట ఆగిపోయిండు బద్రు. చెప్పలేనంత అసహనం, నిస్సహాయత, నిరాశ ముప్పిరిగొన్నయతన్ని. ఎన్నో ఆలోచనలు, ఎన్నో పథకాలు, ఎన్నో చర్చలు, ఎన్నో రెక్కీలు... వృథా అనుకున్నడు.

విజ్జాల్ సందు మొదట్లనే నిలబడ్డడు. ఎవ్వరినీ ఆ సందులకు రానీయకుండా చూడాలనే దానితో.

కన్నాల్ ఇంటికి మరింత దగ్గరయ్యిండు. కనురెప్ప మూసి తెరిచేలోగా అతను గడపదాటి రయ్యిమని దూస్కపొయ్యేటోడే!

కానీ... మల్లే చావు భయంతోటి ఉరుక్కుంటొస్తున్న భర్తను చూసింది. అతన్ని తరుముకుంట వస్తున్న చాకువంటి పిల్లగాన్నీ చూసింది. విషయం అర్థం అయ్యేటందుకు ఆమెకు క్షణకాలమే పట్టింది. మరుక్షణంల ఆమెక కఠినమైన నిర్ణయం తీసేసుకుంది. వేగంగా లోపలికి ఉరికి తలుపులు మూసేసుకుంది.

వేగంగా ఉరుక్కుంట వస్తున్న కన్నాల్ తలుపులకు గుద్దుకొని ఆగిపోయిండు. ఇంకో సారైతే భార్య ఇచ్చిన షాక్ నుంచి తేరుకుంటందుకు జీవిత కాలం పట్టేదతనికి. కానీ మృత్యువు వెన్నంటే వున్న ఆ సమయంలో వెంటనే తేరుకుండు.

"ఒసేయ్ తలుపు తియ్యవే... చచ్చిపోతున్ననే..." చేతులున్న తుపాకీ కింద పారేసి, దిక్కులు అదిరిపోయేటట్టు మొత్తుకుంట బలమంత ఉపయోగించి తలుపులను ఊపే ప్రయత్నం చేసిండు.

కానీ అందరి ఆదివాసీల ఇండ్ల లెక్క, కుక్కలు జొర్రకుంటనో, పందులు జొర్రకుంటనో చేయించిన తలుపులు కావాయే. తమ ఆస్తినీ, అధికారాన్నీ కాపాడుకుంటందుకు చేయించుకున్న తలుపులాయే. మరే ఆదివాసీ ఇల్లయినా అతను ఊపిన వూపుకు తలుపులే కాదు వాటితో పాటు గోడలూ కప్పులూ కుప్ప కూలిపోయేవే. కానీ గట్టిగా వున్న ఆ తలుపులు కొంచెం కూడా కదల్లేదు – మల్లే హృదయం వలెనే.

కన్నాల్ మరే పక్కకూ పారిపోలేదు. ఎందుకంటే ఇంటికి రెండు పక్కలా ప్రహరీ గోడలకానుకొని ఎత్తయిన ఇనుప తీగల ముళ్ల కంచె ఉంటుంది వాళ్ల చేన్లకు రక్షణగా. అట్లా ఆయనకు మూడు దిక్కులా మార్గాలు మూసుకొనిపోయినయి. నిస్సహాయంగ వెనక్కి తిరిగిండు.

బద్రు ఆశ్చర్యం నుంచి తేరుకోకుంటనే చేతులను ముందుకు చాపిండు. అతని రెండు అరచేతుల్లోని పిస్టల్ నీరెండకు సైతం మెరుస్తున్నది. ఇంకెంత మాత్రమూ గురి తప్పదానికి వీల్లేదన్నట్టుగ జాగ్రత్తగా గురి చూస్తున్నడు. అతని చూపుడు వేలు ట్రిగ్గర్‌పై బిగుస్తోంది.

*(వాస్తవ సంఘటన ఆధారంగా...)*

***అరుణతార, జూలై–సెప్టెంబర్, 2010***

# గ్రీన్‌హంట్ ఉత్పాతాలు

– సాధన

## 1. ఆ తల్లీ పిల్లలే మరణిస్తే ఆ పాపం ఎవ్వరిది ?

**జ**నవరి 13: తెలుగు ప్రపంచానికి సంక్రాంతి పండుగ రోజు. మరాఠీ సంస్కృతిలో గుడిపడ్వా పేరుతో జరుపుతుంటారు. ఆదివాసీలకు సంక్రాంతి, గుడిపడ్వాలు ఏం తెలియవు. కానీ ఆ సంస్కృతుల ప్రభావం పడ్డచోట వాటిని ఆదివాసీ ప్రజలు కూడా జరపడం పెరుగుతోంది. ప్రజల మధ్య ఉండే విప్లవకారులు ప్రజలతో వాటిని పంచుకోవడం సాధారణ విషయం. ప్రజలు జరుపుకునే పండుగలే వారికి పండుగలు.

రాహీ దళం ఆ రోజు ఉదయాన్నే కన్నెమర్క చేరింది. ఈ వూరు చత్తీస్‌గఢ్–మహారాష్ట్ర రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర గ్రామం. ఊళ్లో ఉన్నది ఒకే ఒక్క ఇల్లు. యిలాంటి ఒక్కిల్లు వూర్లు ఆదివాసీ ప్రాంతాలలో తారసపడడం విశేషం ఏమీ కాదు.

కన్నెమర్క ఊరుకు పక్కలోనే కొండలనుంచి దిగే నీళ్లతో నిరంతరం పారే ఓ పెద్ద వాగుంది. ఈ వాగు నీళ్లే ఆ ఇంటివాళ్లు వాడుతారు. ఊరుకు ఎటు చూసినా ఎత్తైన కొండలే దర్శనమిస్తాయి. దట్టమైన అడవీ–కొండల మధ్య కన్నెమర్క చోటు చేసుకుంది. కన్నెమర్కలో జనాభా ఆరుకు మించలేదు. ఆ రోజు ఆ కుటుంబ సంఖ్య ఏడుకు పెరుగుతుందని ఇంటి వాళ్లు లెక్కలు వేసుకుంటున్నారో లేదో తెలియదు గానీ సంబరపడడం మాత్రం లేదు. పైగా ఇంటి పెద్దల ముఖాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇంట్లో పెద్దలంటే తల్లి, తండ్రితో పాటు ఇల్లరికం అల్లుడు పోగా ముగ్గురు పిల్లలు. ముగ్గురిలో ఇద్దరాడపిల్లలు, ఒక్కడు మగాడు. పెద్దపిల్ల వయసు 16–17 లోపే వుంటాయి. ఆవిడ తన ఇష్టంతో పొరుగున ఉన్న సిరొంచ యువకుడితో పెళ్లి నిర్ణయానికి వచ్చింది. ఆయన ఎనిమిది వరకు చదివాడు. ఆ అమ్మాయి తన ఇష్టాన్ని తలిదండ్రులకు చెప్పగా వాళ్లు 'ఇంగో నీ ఇష్టం' అన్నారు. అల్లుడు యిల్లరికం వస్తే బాగుంటుందన్నారు. ఆయన యిల్లరికం అల్లుడుగా (లామడే) ఇంటికి చేరడంతో కుటుంబ సంఖ్య ఆరుకు పెరిగింది. పెద్ద కూతురుకు కలగబోయే సంతానంతో ఆ సంఖ్య ఏడుకు పెరుగుతుందో లేదా ప్రసవం మరో జన్మతో సమానమన్నట్టు అది తల్లి ప్రాణానికే గండంగా మారి కుటుంబ సంఖ్య ఐదుకు పడిపోతుందో లేదా శిశు మరణాలు అధికంగా ఉన్న దండకారణ్య వాతావరణంలో వెలుగు చూసే పిల్లల్లో

ఎంతమంది పురుడు పోసుకుంటారో తెలియదు కాబట్టి ఆ సంఖ్య ఆరుగానే వుండిపోతుందో తేలిపోయే క్షణాల్లో రాహీ దళం కన్నెమర్క వాగు ఒడ్డుకు చేరింది. ఆ రోజు ఉదయాన్నే అకాల వర్షం దిగింది. దళ సభ్యులు వెంటనే టెంట్ వేయసాగారు.

దళం చేరిందన్న వార్త తెలవగానే ఆ యింటి మహిళ దేబో పరుగున వచ్చి దళ కమాండర్ మోతీతో పరిస్థితి చెప్పింది. రాత్రినుంచీ తన కూతురు నొప్పులు పడుతోంది గానీ ప్రసవం కావడం లేదంటూ తన ఆందోళన వ్యక్తం చేసింది. నొప్పులు తీవ్రమై వెంటనే ప్రసవించే మందు ఏమైనా వుంటే ఇచ్చి నా పిల్లను బతికించండంటూ ఆ కన్నతల్లి మోతీని బతిమాలుతోంది. మోతీకి ఆవిడ వరుసకు కూచీ (చిన్నమ్మ) అవుతుంది.

ఆ ఇంటి పురుషులు మాత్రం యథావిధిగా తమ పనుల్లో మునిగిపోయారు. అల్లుడు ఉదయాన్నే లేచి మైలు దూరంలో ఉన్న గోర్గ చెట్టు కల్లు దింపడానికి వెళ్లి వచ్చాడు. ఇంటాయన ఆ యింటికి వచ్చిన చుట్టంతో కబుర్లాడుతూ కల్లు తాగడంలో మునిగిపోయాడు. ఆయన చిన్న కూతురు టౌన్ చూసే సంబరంతో అహిరి వెళ్లి వారం దాటుతోంది. పిల్లడు వాడి ఆటల్లో వాడు ఉన్నాడు. తల్లి కొంగు పట్టుకొని దళం వద్దకు చేరాడు.

ఏ మందు ఇవ్వాలో తెలియక మోతీ తన బాధ్యుడ్ని అడిగింది. మలేరియా, విరేచనాలు, గాయాలకు అవసరమయ్యే మందులే ఉంచుకునే దళం వద్ద అలాంటి మందులు లేవని బాధ్యుడు బదులు చెప్పి ఆ యింటావిడతో పరిస్థితి చర్చించాడు. ఆయనకు ఆ వూరితో, ఆ యింటివాళ్లతో పాతికేళ్ల పరిచయం. 'ఆ అమ్మాయిని ఎలా కాపాడడం?' అనే ఆందోళనతో మార్గాలు ఆలోచించసాగాడు. ఈ లోగా ఇంటి రైతు 'లాల్‌సలాం కామ్రేడ్' అంటూ వచ్చి వరుసగా అందరికీ చేయి కలిపాడు.

ఆయన పేరు బండు. వందలాది గడ్‌చిరోలి టాడా పీడిత రైతుల్లో బండు ఒకడు. టాడా ఎప్పుడో రద్దు అయినా గత 17–18 ఏళ్లుగా బండు మాత్రం ఎందరెందరో ఆదివాసీ రైతుల్లాగే తానూ కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. వెదురు కూపుల్లో, తునికాకు సేకరణలో తమ శ్రమశక్తిని ఇంటివాళ్లు వెచ్చించి సంపాదించే డబ్బులన్నీ ఆ కేసు కోసం కోర్టు చుట్టూ తిరిగే ప్రయాణాలకే సరిపోతున్నాయనీ, మేకలూ, గొడ్లూ అమ్ముకున్నామనీ ఇంకా కేసు తెగడం లేదనీ బండు దళ బాధ్యునితో చెప్పి వాపోయాడు. ఇల్లు గడవని పరిస్థితిలో ఈ మధ్య గోర్గ కల్లు అమ్మడం మొదలుపెట్టినట్లూ రోజూ సిరొంచ వాళ్లు వచ్చి లీటరుకు 20 రూపాయల చొప్పున చెల్లించి కల్లు తీసుకెళుతున్నారనీ, వాళ్లు అక్కడి పోలీసులకు దాన్ని అమ్మి మరిన్ని లాభాలు చేసుకుంటున్నారనీ చెప్పాడు. అంతలోనే అల్లుడూ అక్కడకి చేరాడు. అల్లుడి పేరూ, మామ పేరూ ఒక్కటే.

అల్లుడ్ని చూడడంతోనే మామ ఉగ్రుడైపోయాడు. నెలలు నిండిన నా బిడ్డను ఈ నడుమనే గెదుముకుంటూ కొట్టాడనీ, గర్భస్థ పిండం చచ్చి ఉంటుందనీ, వీడే దాని చావుకు కారణం అనీ గట్టిగా నిందించాడు. ప్రసవ వేదనతో మృత్యువుతో పోరాడుతున్న తన మల్లియ పట్ల పశ్చాత్తాపంతో కూడిన దిగులు అల్లుని ముఖంలో స్పష్టంగా వ్యక్తమవుతోంది. మామ మాటలకు

[illegible] చెప్పలేదు.

'[illegible] రాంపురం వరకు వెళతావా? అక్కడ నర్సుబాయి ఉంటుంది. ఆమె వస్తే [illegible]' అన్న బాధ్యుని మాటతో అల్లుడు బండు దిక్కులు చూడసాగాడు. 'నా [illegible]మో! వర్షంలో ఆరు కిలోమీటర్లు నడిచి రాదేమో!' అంటూ సందేహాన్ని వ్యక్తం [illegible]

'[illegible]మే, సాధారణ ఆదివాసీ మాట పట్టించుకుని ఏ ప్రభుత్వోద్యోగి సహాయం చేస్తాడు?' [illegible]కున్న బాధ్యుడు ఇద్దరు దళ సభ్యులను బండుకు తోడిచ్చాడు. నర్సుబాయిని తీసుకురావాలన్న [illegible]మైన ఆదేశాలు యిచ్చి వారిని పంపాడు.

'దాదా! బండూ, నర్సుబాయి రాకుంటే ఎలా? ఆమె వుందో, లేదో తెలియదు. అమ్మాయిని సిరొంచ తీసుకెళ్లితే అక్కడ వైద్య సిబ్బంది ఉండచ్చు, పెద్ద ఊరు కదా!' అన్నాడు ఇంటాయనతో బాధ్యుడు.

'చుట్టాన్ని కలిపి ఇంట్లో వున్న మగాళ్లం ముగ్గురం, ముగ్గురిలో నేను ముసలాన్ని. మిగిలింది ఇద్దరే. ఎత్తైన కొండలు ఎక్కుతూ, దిగుతూ అంత దూరం (ఐదు కిలోమీటర్లు) ఎలా మోసుకెళ్లేది?' అంటూ బండూ వాస్తవ సమస్యను బాధ్యుని ముందుంచాడు.

సమయం మధ్యాహ్నం మూడు కావస్తోంది. వర్షం పూర్తిగా తగ్గింది. దూరంగా కొండ పోడులలో కోసిన పంటకుప్పలు నూర్పిళ్లు కాకుండా అలాగే మిగిలి ఉన్నాయి. వర్షంతో ధాన్యం తడిసి ముతకపడుతుంది, యీ అకాల వర్షాలు రైతుకు అన్ని విధాలా నష్టాన్ని కలిగించేవే అంటూ బాధ్యుడు బండుతో మాట్లాడుతున్నాడు కానీ ఆయన ఆలోచనలన్నీ 'అమ్మాయిని సిరొంచ చేర్చడం ఎలా?' అనేదాని చుట్టే అల్లుకుపోతున్నాయి.

'రాంపురం నర్సుబాయి కోసం లామడేతో మా కామ్రేడ్స్‌ను ఇద్దరిని పంపినట్టు సిరొంచ ఆసుపత్రికి కూడా అమ్మాయిని మోసుకెల్లడానికి మా వాల్లను మీకు తోడుగా పంపవచ్చు. కానీ గ్రీన్‌హంట్ పేరుతో పెద్దెత్తున కొత్త, కొత్త బలగాలు అక్కడికి వచ్చి చేరాయి కదా. గస్తీ తీవ్రం చేశారు. ఎలా చేయడం?' అన్నాడు బాధ్యుడు.

'మీరు రావద్దు దాదా. ఆయుష్షుంటే నా బిడ్డ బతుకుతది. లేకుంటే చేసేది ఏం లేదు దాదా' అన్నాడు బండు. బండు, దేబో కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అడవి అంతా నిశ్శబ్దంగా ఉంది. దళ సభ్యులు టెంట్ విప్పి మడత పెడుతున్నారు. సామానులు సదురుకోడానికి కమాండర్ మోతీ విజిల్ ఊదింది. పది నిమిషాల్లో రాహీ దళ సభ్యులందరూ సామాను సదురుకొని ఒక్కొక్కరే ఊరి దాదా, ఆయన భార్యకు లాల్‌సలాం చేస్తూ చేయి కలపసాగారు. బాధ్యుని చేయిని ఆ జంట కాసేపు విడవకుండా అలాగే పట్టుకుంది. ముగ్గురి కళ్లల్లో ఒకే భావన. పిల్ల బతకాలన్నదే. 'పదిలం' అంటూ ఆ జంట వాగు దాటింది. దళం రాంపురం దారి పట్టింది.

పేపర్ మిల్లు వాళ్ల వెదురు తరలింపుకై దశాబ్దాల క్రితం వేసిన రోడ్డు పై నడుస్తున్న దళానికి కొద్ది దూరంలోనే రాంపురం వెళ్లి వంటరిగా తిరిగి వస్తున్న బండు కలిశాడు. ఆయన కళ్లల్లో దిగులు కన్నీళ్ల రూపంలో కారిపోతోంది. గుండెల్లో గూడు కట్టుకున్న బాధతో మాట

పెగలడం లేదు. బలవంతంగా రెండు మాటలు చెప్పగలిగాడు. 'నర్సుబాయి లేదు. పండుగ శెలవలకు ఇంటికెళ్లింది'

బాధ్యుడు దీర్ఘంగా నిట్టూర్చాడు. ఏమి చేయలేని నిస్సహాయ స్థితి. గ్రీన్‌హంట్ పుణ్యమా అంటూ ఒక నిండు ప్రాణం ఏమవుతుందోనన్న ఆందోళనతో ఆయన బందు చేతిని అలాగే పట్టుకుని 'డబ్బు అవసరమా' అన్నాడు.

బందు తల అడ్డంగా వూపాడు. 'సిరొంచ మోసుకెళ్లే ప్రయత్నం చేస్తాం' అన్నాడు.

'సరే' అనే అర్థంలో బాధ్యుడు తలూపుతూ బరువుగా అడుగులు వేయసాగాడు. వాతావరణం తేమగా ఉండి కొండల్లో పొగమంచు కమ్ముతోంది. కొండ పోడులలో ఉన్న రాంపురం రైతులు మునిమాపు వేళ ఇంటిదారి పడుతున్నారు. తల్లి కానున్న ఆ మహిళ గర్భస్థ శిశువుకు జన్మనివ్వలేక ప్రసవ వేదనతోనే కన్ను మూస్తే ఆ తల్లీ–బిడ్డల మరణానికి ఎవరు బాధ్యులు? తల్లి బతికి మృతశిశువుకి జన్మనిస్తే ఆ శిశు హంతకులెవరవుతారు? అన్న ఆలోచనలతో ముందుకు సాగుతున్న బాధ్యునికి పదే పదే గ్రీన్‌హంట్ మూకలు సిరొంచకి చేరకపోయి ఉంటే ఆ చెల్లిని గెరిల్లా సైనికులు కచ్చితంగా వైద్యుని వద్దకు చేర్చేవాళ్లే అన్న నిజం గుండెల్లో పొడుస్తోంది.

ఛత్తీస్‌గఢ్‌లో శిశుమరణాల రేటు ప్రతి వెయ్యికీ 79 నుంచీ 59 తగ్గిందనీ, గర్భిణీ స్త్రీల మరణాల రేటు ప్రతి లక్షకూ 407 నుంచీ 335 కు దిగిందనీ స్త్రీ–శిశు సంక్షేమ శాఖామాత్యురాలు లతా ఊసండి ఇచ్చిన అంకెల డొల్లతనాన్ని ఆ రాత్రి తన దళానికి చెప్పి 'కన్నెమర్క బందుదాదా బిడ్డ ఎలా వుందో!' అనుకుంటూ పక్కపై వాలాడు బాధ్యుడు.

చిన్నతనంలో అమ్మ వీధి పిల్లలందరినీ పిలిచి సంక్రాంతి పండుగ మూడు రోజులూ రేగుపళ్లూ, బొడబొడకాయలూ పోయడం కళ్లల్లో కదులాడింది. కొత్త బట్టలు వేసుకుని పిల్లలందరితో గడిపిన ఆ రోజులు గుర్తొచ్చాయి. సంక్రాంతి రంగవల్లులూ, చకిలాలూ, పండుగ సంబరాలూ, అమ్మ హడావుడి జ్ఞాపకాలు ఈ సంక్రాంతి విషాద జ్ఞాపకాలతో కలగలిసిపోయి అర్ధరాత్రి దాటాక గాని ఆయనకు కునుకు పట్టలేదు.

## 2. కుమిలి

రాహీ దళం ధుంనార్ చేరేసరికి పొద్దు వేడెక్కి చలి ప్రభావం తగ్గింది. టైం ఉదయం 9 కావస్తుంది. దళం అడవిలో డేరా వేయాలనుకొని ఊరికి దూరంగా ఆగింది. కమాండర్ రోల్‌కాల్ చేసి సెక్షన్‌ల వారీగా సభ్యులు ఎవరు ఏ వైపు కవర్‌లు తీసుకోవాలో చెప్పింది. డిప్యూటీ కమాండర్ సెంట్రీ, కిచెన్ డ్యూటీ కామ్రేడ్స్‌ను పనుల్లోకి పంపాడు. దాదాపు 30 అడుగుల వరకు పెరిగిన అరంగి చెట్లు పచ్చగా వుండి అడవికి అందాన్ని అందిస్తున్నాయి కానీ ఎండ వేడి నుండి తలదాచుకోడానికి నీడను మాత్రం తగినంత ఇవ్వలేకపోతున్నాయి. ఆ రోజు ఫిబ్రవరి 13వ తేదీ.

రాహీ దళం డేరా వేసిన అడవి అంచుల్లోని విశాలమైన ప్రాంతంలో జనతన సర్కార్

చేపట్టిన వ్యవసాయ క్షేత్రం ఉంది. ఆ క్షేత్రంలో ఈ సంవత్సరం వరి పంట, పప్పు దినుసులు, నూనెగింజల దిగుబడి బ్రహ్మాండంగా ఉంది. ఆ విశాల క్షేత్రం చాలా కాలంగా బీడుపడి ఉండడంతో జనతన సర్కార్ అందులో సమష్టి వ్యవసాయాన్ని చేపట్టి పరిసర గ్రామాల ప్రజల సహకారంతో పంటలు తీసింది. పండిన పంటను సర్కార్ నియమం ప్రకారం మూడు పాళ్లు చేసి ఏరియా వ్యవసాయ శాఖా బాధ్యుడు పంపకాలు చేశాడు. ఒక పాలు శ్రమలో పాల్గొన్న రైతాంగానికీ, ఒక పాలు మరుసటి సంవత్సరం విత్తనాలకూ, ఖర్చులకూ పోగా, మూడవ పాలు ప్రజావిముక్తి గెరిల్లా సైన్యానికి తీశారు. బోసిగా నిల్చిన ఆ పంట పొలాల పక్కలో పచ్చని పొరకలతో కూరగాయల చెట్లు చూడ ముచ్చటగా ఉండి టమాటా, మిరపకాయలు జోరుగా కాశాయి. అక్కడ డేరా వేసే దళానికైనా, కంపెనీకైనా కూరకు అవే ఆదుకుంటాయి. పరిసర గ్రామాల వాళ్లు ఎవరైనా ఏ పూటకు ఆ పూట అవసరమైన కూరగాయలు నిరభ్యంతరంగా అక్కడి నుండి తెంపుకు వెళుతారు. అయితే అడవిలో సీజన్ల వారీగా దొరికే ఆకు–అలం కూరకు ఏరుకు రావడమే జనానికి ఎక్కువ పసందుగా ఉంటుంది. పక్కనున్న వాగునుంచి నీరు తోడి ఆ కూరగాయల మొక్కలకు పోస్తారు. ఈ పనిలో వ్యవసాయ క్షేత్ర కార్యకర్తలే కాకుండా అక్కడికి వెళ్లే పార్టీ, పిఎల్‌జిఎ కార్యకర్తలు కూడా పాల్గొంటారు.

మాడ్ కొండల్లో కొన్ని వాగులు సాలు పొడుగుతా పారుతుంటాయి. వాటిలో ఈ ధుంనార్ వాగు ఒకటి. వాగు మధ్య, మధ్యలో పెద్ద, పెద్ద నీటి మడుగులు ఉన్నాయి. వాటిలో పెద్ద, పెద్ద చేపలు ఏ ప్రమాద భయం లేకుండా గెంతులు వేస్తున్నాయి. ఆ అడివంతా ఎటు చూసినా అరంగి చెట్లే – ఇవి సాలవృక్షాలుగా ప్రసిద్ధి. ఇవి అనేక రకాలుగా ప్రజలను ఆదుకుంటాయి. ఆకులతో డొప్పలు, విస్తర్లు కుట్టి వాడుకుంటారు. దీని బంక తీసి అమ్ముకుంటారు. 'ఊదు' (గుగ్గిలం) గా మార్కెట్లో దొరుకుతుందిదే. దీని గింజలను కూడా మార్కెట్లో అమ్ముతారు. వాటి నుంచి తీసే నూనె వనస్పతిలో విరివిగా వినియోగిస్తున్నారు. గతంలో బ్రిటిష్ హయాంలో ఈ చెట్టును నరికి పెద్ద, పెద్ద మొద్దులను తీసుకెళ్లి రైలు మార్గాల నిర్మాణంలో ఉపయోగించేవారు. ఇప్పటికీ మధ్య భారతంలోని అడవిలో అత్యధిక శాతం సాలవృక్షాలే దర్శనమిస్తాయి.

నీటి మడుగుల్లో చేపలను చూసిన డిప్యూటీ కమాండర్ ఊరి నుంచి వల తేవడానికి ఆలోచించసాగాడు. ఈలోగా కమాండర్ మోతీ బాధ్యునితో ప్రోగ్రాం ప్లానింగ్ చేసి వచ్చి సభ్యులతో 'ఈ రోజు సాయంకాలం కూడా ఇక్కడే ఆగుతుంది దళం' అని చెప్పింది. ఈ మాటలు విన్న దళ సభ్యులందరూ ఒక్కసారిగా జుగ్నూ (డిప్యూటీ కమాండర్) వైపు చూసి 'సాయంత్రం చేపల కూరే' అన్నారు. కమాండర్ మోతీకి చేపలంటే మహా ఇష్టం. ఆమె 'ఇంగో' అనడంతో సభ్యులు వంట పాత్రలూ, వలల కోసం ఊళ్లోకి వెళ్లారు. మోతీ, మరో ఇద్దరు సభ్యులతో కూరగాయల తోటలోకి వెళ్లింది. జుగ్నూతో కలిసి అంజూ కిచెన్ పనిలోకి దిగింది.

ఊళ్లోకెళ్లిన సభ్యులు గంజులతో పాటు ఊరి పిల్లలను కూడా తమ వెంట తెచ్చారు. టమాటాలూ, మిరపకాయలతో మోతీ వచ్చింది. ఆమెతో వెళ్లిన సభ్యులు ఏతం నీళ్లు తోడి కూరగాయల మొక్కలకు పోయడం కోసం అక్కడే ఆగారు. బాధ్యుడు తన రక్షణ గార్డులతో

స్నానానికి సిద్ధమయ్యాడు. కొత్తగా వచ్చిన డాక్టర్ తన కిట్‌నుంచి పుస్తకం బయటకు తీశాడు. ఈలోగా జుగ్నూ, అంజూలు సేమ్యా ఉప్మా వండారు. అందరినీ రమ్మంటూ జుగ్నూ విజిల్ ఊదాడు. ఊరి పిల్లలతో మాటల్లోకి దిగిన బాధ్యునికి ఆ పిల్లలే దేరాకు ఉత్తరం వైపు 100 గజాల దూరంలో ఉన్న చెట్లను చూపుడువేలుతో చూపుతూ 'అక్కడే మన కుమిలి శవం రెండు రోజుల క్రితం దొరికింది' అన్నారు. ఆ మాటలు విన్న బాధ్యుడు నిశ్చేష్టుడై 'కుమిలిని ఎవరు చంపారు?' అంటూ కనుబొమ్మలు చిట్లించి ప్రశ్నించాడు. 'పున్నోం (తెలియదు). శవాన్ని నర్సింగ్ దాదా వాళ్లు వచ్చి తీసుకెళ్లారు' అన్నారు ఆ పిల్లలు.

కుమిలిని ఎవరు చంపి ఉంటారు? ఈ లోతట్టు ప్రాంతంలో ఇంతటి ఘాతుకానికి పాల్పడ్డవాళ్లు ఎవరై వుంటారు? పరిసర గ్రామాల్లో వాళ్లకు ఎవరు తోడ్పడి ఉంటారు? రోజుల తరబడిగా జనం కంట్లో పడకుండా హంతకులు ఈ అడవిలో యెలా ఉండగలరు? రెండు రోజుల వరకు శవం దొరక్కుండా పోవడం ఏంటి? తేనెతుట్టెను కదిపితే జుమ్మంటూ లేచిన ఈగల్లా బాధ్యుని మెదడంతా ఆలోచనలతో నిండిపోయింది. ఊరి పిల్లలతో, తన దళం సభ్యులతో ఇవే ప్రశ్నలు చర్చించాడు. రష్యాలో విప్లవం జయప్రదం అయ్యాక అక్కడి 'కులక్కులు' నూతన వ్యవస్థను దెబ్బతీయడానికి చేసిన కుట్రలు ఆయన మదిలో మెదిలాయి. 'బీళ్లు దున్నేరు' నవలలోని అనేక విషయాలు తన వాళ్లతో పంచుకున్నాడు.

భోజనాలు ముగించుకున్న దళం ఆ రోజు అక్కడ ఆగాల్సిన కార్యక్రమం రద్దు చేసుకుంది. వెంటనే కృషి (వ్యవసాయ) బాధ్యులను కలవాలనే ప్లాన్‌తో రాహీ దళం సాయంత్రం 4 గంటలకు బయలుదేరింది.

ఏరియా జనతన సర్కార్ వ్యవసాయ శాఖ అధ్యక్షుడు కా. నర్సింగ్ తన క్షేత్రంలో పంట నూర్పిళ్లయిన తర్వాత మొత్తం ఏరియాలోని క్షేత్రాల పని తనిఖీలో నిమగ్నమయ్యాడు. చుక్కి మరో తోట వద్ద పని చూస్తుండడంతో ధుంనార్ క్షేత్రంలో కమ్లూ, కుమిలి ఇద్దరే వుంటున్నారు. ఈ పరిసరాల్లో గత కొద్ది రోజులుగా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు పెరిగాయన్న రిపోర్టులు అందుతుండడంతో ఏదైనా అఘాయిత్యం జరుగుతుండవచ్చన్న అంచనా వుంది. ఊహించినట్లే జరగడంతో 'బాధ్యుడి బలహీనతలను చూసి దెబ్బ కొట్టడం యుద్ధనీతే కదా' అని తనలో తాను అనుకుంటూ కొడ్డిలేర్ చేరాడు.

ఉదయం 9 గంటలకు మాడ్ డివిజన్ పార్టీ కార్యదర్శి రాజమన్ వచ్చి బాధ్యుడ్ని కలిశాడు. కుమిలి హత్యోదంతాన్ని వివరించాడు. శత్రువు తన శక్తులను రహస్యంగా పంపించి హత్య చేయించాడనీ, హంతకులు తలకూ-మొండానికీ కొంత అతుకు మాత్రమే వుండేలా మెడను మిగిల్చి మొత్తం స్వరపేటికనూ, నాలుకనూ కోశారనీ, శవాన్ని చూసిన వారెవరైనా ఈ హత్య నరబలి అయ్యుంటుందని భ్రమపడి, అసలు విషయం బయటపడకుండా పోతుందని కుట్ర పన్నారనీ, ఇది శత్రువు ఉద్దేశ్యపూర్వకంగా చేసిన హత్యేననీ రాజమన్ తన అభిప్రాయాన్ని స్పష్టం చేశాడు. ఈ హత్య జరిగిననాటి నుంచీ ఊళ్లల్లో పెద్దమనుషులు మరో ప్రచారాన్ని లేపి శత్రువు కుట్రలకు తగినట్టు వంత పాడుతున్నారనీ అన్నాడు. 'ఆ భూమిలో దయ్యం ఉందన్నా

వినకుండా అంధవిశ్వాసం అని కొట్టి పారేసి జనతన సర్కార్ వాళ్లు తెగబడి దున్ని, పంట తీసిన ఫలితం ఇది' అంటూ గుసగుసలను భగ్గుమని వ్యాపింపజేశారు. ఈ పెద్దల ప్రచారం, ఈ హత్యా, గత కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరించడం అన్నీ ఒకే తానులోని ముక్కలు అంటూ బాధ్యుడు తన అభిప్రాయం చెప్పి ' వాళ్ల మెకానిజం ఈ పరిసర గ్రామాల్లో లేకుండా ఈ హత్య జరగదు' అని కూడా చెప్పాడు.

'నిజమే మీరంటున్నది, ఇవన్నీ మా పరిశీలనలోనూ ఉన్నవి' అన్నాడు రాజ్‌మన్. రాజ్‌మన్ కుమిలి జ్ఞాపకాలను బాధ్యునితో పంచుకున్నాడు.

కుమిలి పైవేరు ఊరిపిల్ల. పేదరైతు బిడ్డ. చిన్నతనంలోనే కన్నతల్లి ప్రేమ కరువైన తల్లిలేని పిల్ల కుమిలి. ఎదిగే పిల్లకు కావల్సిన సరైన పోషకాహారం లేకుండా పోవడంతో రోగాల మధ్య పెరుగుతుండిన బిడ్డ ఆమె. దేశంలో పోషకాహార లోపంతో సతమతమవుతున్న పిల్లల్లో ఆదివాసీ పిల్లలే అగ్రభాగాన నిలుస్తారని ప్రభుత్వం గణాంక వివరాలతో సహా ప్రకటిస్తుందే తప్ప వాళ్ల కోసం చేసేదేమీ లేదని కుమిలిలాంటి వందలాది పిల్లలను ఖాకీలను ఎదిరించి మాడ్ కొండల్లోకి వచ్చి చూడ సాహసించే వారికెవరికైనా వెంటనే స్ఫురిస్తుంది.

ఒళ్లంతా గజ్జి కురుపులతో చీమూ, నుసీ కారుతూ పుళ్ల మంటలతో గడియ-గడియ గండంగా ఏడ్చే కుమిలి తన జీవితం పై ఆశ చాలించుకుందో లేదో కానీ ఆమె తండ్రి మాత్రం 'పోరి బతుకదు' అనే మాట తరచుగా అంటుండే వాడు. ఆ ఊరుకు ఇంద్రావతి దళం రెగ్యులర్‌గానే వెళుతుంది. కానీ కుమిలి సంగతి వాళ్ల దృష్టికి ఎప్పుడు రాలేదు.

దళం వెంట రాజ్‌మన్ ఓ రోజు ఆ ఊరు వెళ్లేసరికి పెంటకుప్ప పక్కనే పడుకొని ఏడుస్తున్న కుమిలి రాజ్‌మన్ కంటపడింది. పిల్లలంటే ఆయనకు ఎంతో ప్రాణం. ఒక్క పరుగున కుమిలిని చేరి ఆమె ఒళ్లంతా పునికి చూశాడు. సందు లేకుండా గజ్జి పుళ్లతో బాధపడుతున్న కుమిలికి వెంటనే చికిత్స ప్రారంభించాడు. పుళ్లను కడిగి శుభ్రం చేసి మందు రాసి, 15 రోజులకు సరిపడా గోలీలు ఇచ్చి అవి వాడే పద్ధతి వివరించి, పిల్ల బాధ్యత ఊరి జనతన సర్కార్‌కు అప్పగించినాడు. తల్లి లేని కుమిలి తన జీవితంలో ఈ మాత్రం ప్రేమను పొందింది బహుశ ఎన్నడూ లేదేమో! అప్పటివరకూ ఆమె పుళ్లను కడిగి శుభ్రం చేసిందెవరు? ఈ ఘటన కుమిలి జీవితంలో ఒక మంచి మలుపుకు దారి తీసింది.

15 రోజుల్లో కుమిలి గజ్జి తగ్గింది. ఆమె ఆ పై రెగ్యులర్‌గా దళం వద్దకు రావడం మొదలైంది. ఆమె దళం వద్దకు వచ్చిందంటేనే ఆమె కళ్లు మొదట వెతికేది బట్టతల, సూదిలాంటి మీసాలు, లోతు కళ్లు, చిన్న-పెద్ద, ఆడ-మగ తేడా లేకుండా అందరినీ ఆప్యాయంగా 'లాల్‌సలాం' అంటూ పలకరించే 'రాజ్‌మన్'నే. ఆమె ప్రాణాలను నిలిపిన ఆ అన్న అంటే ఆమెకెంత ప్రాణమో!

కుమిలి ఆ తర్వాత యేడాది లోపునే పుష్పవతి అయ్యింది. అన్ని పనుల్లో చొరవగా, శ్రద్ధగా పాల్గొనడం పెరిగింది. తన మనసులోని మాట ఎవరితోనైనా ఫ్రీగా పంచుకునే మనస్తత్వాన్ని ఆమె స్వంతం చేసుకుంది. ఊరి సంగంలో కుమిలి సభ్యురాలైంది.

పాశవిక సల్వాజుడుం దాడులు ఇంద్రావతి ఏరియాలోనూ మొదలయ్యాయి. దుంగ,

తాకిలోడ్, వెడమ, గోట్ మొదలైన గ్రామాల్లో జుడుం దాడులు జరిగి ప్రాణనష్టం, ఆస్తి నష్టం సంభవించాయి. దీనితో అనేక గ్రామాల రైతులు లోతట్టు కొండల్లోకి చేరి తల దాచుకోగా, కొందరు రైతులు దూర ప్రాంతాలకు వలసపోయారు. జుడుం గూండాలకు బందీలుగా చిక్కిన వాళ్లు హంతక శిబిరాలకు తరలించబడ్డారు. ఇలాంటి స్థితిలో ఏం చేయాలన్న ప్రశ్న కుమిలిని వెంటాడింది. కొండల్లోకి వెళ్లడమా, వలసపోవడమా, బందీగా చిక్కి చిత్రహింసల కొలిమిలో తల దూర్చడమా? కుమిలి కళ్లలో దళం, తనకు వైద్యం చేసి బతుకునిచ్చిన రాజ్‌మన్ నిలిచారు. కుమిలి ఇల్లు విడిచి విప్లవోద్యమంలో చేరిపోయింది.

ఆలివ్ గ్రీన్ డ్రెస్సు, తలకు ఎర్ర నక్షత్ర టోపి, వీపుకు కిట్టు, కాళ్లకు బూట్లు, చేతిలో ఆయుధం ధరించి దండకారణ్య విముక్తి ప్రాంత లక్ష్య సాధనలో మార్చింగ్ చేస్తున్న ప్రజా విముక్తి గెరిల్లా సైన్యాన్ని పాలించే, పోషించే జనతన సర్కార్‌లో ఆమె భాగమైంది. ధుంనార్ వ్యవసాయ క్షేత్రంలో నర్సింగ్‌దాదాకు తోడైంది. ఆమె నాగేటి చాళ్లలో కఱ్ఱు అయింది. పంట కాలువల్లో నీరైంది. వరి నాట్లలో ఎరువైంది. పంట కోతలో కొడవలైంది. చేతికొచ్చిన పంటలో ఆమె సిరిసిరి మువ్వ అయ్యింది. లేత వయసులోనే విప్లవానికి ఎరువైంది. ధుంనార్ వ్యవసాయ క్షేత్రానికి తన చెమటనూ, నెత్తురునూ ధారపోసి గింజ-గింజలో తన జ్ఞాపకాలను నిలిపి భవిష్యత్తు పంటలకు హామీనిచ్చింది.

ఆమె చరిత్రను వివరిస్తున్నంత సేపు రాజ్‌మన్ కళ్ల వెంట కన్నీళ్లు కారుతూనే ఉన్నాయి. ఆ అమరురాలితో వున్న అనుబంధాన్ని అవి చాటుతున్నాయి.

వారం రోజుల తర్వాత రాజ్‌మన్ నుంచి బాధ్యునికి ఉత్తరం చేరింది. కా. కుమిలిని చంపిన హంతకులు పట్టుబడ్డారనీ, గతంలో పోలీసు ఇన్ఫార్మర్లుగా పని చేసినందుకు ప్రజల చేతిలో శిక్షింపబడి నారాయణపూర్ పారిపోయి శతృవు పంచన చేరిన దుష్ట శక్తులే వాళ్లు అని రాశాడు. శత్రువు వీళ్లను హంతక గ్యాంగులుగా మలచి ప్రత్యేక శిక్షణనిచ్చి టార్గెట్లు నిర్ణయించి పంపాడనీ రాశాడు. వాళ్ల టార్గెట్లు స్థానిక పార్టీ నాయకురాలు కా. కౌసల్య, కా. దిలీప్‌లు అని కూడా ఇంటరాగేషన్‌లో తేలిందని రాశాడు. మన కామ్రేడ్స్ బలహీనతలను పరిశీలించి, దొరికిందే తడవుగా మావోయిస్టులను అంతమొందించాలని వీళ్లను శత్రువు ప్రేరేపించి పంపాడనీ, వీళ్లకు అక్కడక్కడ గ్రామాల్లో షెల్టర్లు ఇచ్చే శక్తులున్నాయనీ, యిలా అనేక విషయాలు వీళ్లను ఇంటరాగేట్ చేయడం ద్వారా తెలిశాయనీ సంక్షిప్తంగా రాశాడు.

ఉత్తరం చూసిన బాధ్యునికి చరిత్ర పునరావృతమవుతుంది అని హెచ్చరించిన మహోపాధ్యాయుల వ్యాఖ్యలు గుర్తొచ్చాయి. చైనా, రష్యా, వియత్నాం తదితర అనేక ప్రజా విప్లవోద్యమాలలో శత్రువు ఇలాంటి ఎత్తుగడలు ఎన్ని అనుసరించినప్పటికీ చివరకు ప్రజాయుద్ధం ముందు అవన్నీ దిగదుడుపే అయ్యాయి కదా! అనుకుంటూ ఆయన కిట్టు సదురుకోసాగాడు.

## 3. సిగ్గులేని మగతనం

రాహీ దళం మార్చి 8 'అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం' జరుపుకునే సంబరంలో

ముసిగిపోయింది. ఈ మార్చి 8 వందేళ్లది కావడంతో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. దండకారణ్య క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘటన్ వందేళ్ల వేడుకల ప్రత్యేక కార్యక్రమం రూపొందించింది. వారం రోజులు జరపాలని రోజువారీ కార్యక్రమాన్ని నిర్ణయించి అన్ని యూనిట్లకూ అందించింది. ఇందులో ఒక రోజు 'ముప్పై ఏళ్ల దండకారణ్య మహిళా ఉద్యమ చరిత్ర' పుస్తకావిష్కరణ కూడా వుంది. భారతదేశంలో వేల సంఖ్యలో ఆదివాసీ పీడిత మహిళలను తమ విముక్తి మార్గంలో సంఘటితం చేసి ఒక లక్ష సభ్యత్వంతో నిలిచిన 'క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్' ను ఏకైక అతి పెద్ద ఆదివాసీ మహిళా సంఘంగా స్థానిక మహిళలంతా సగర్వంగా చెప్పుకుంటున్నారు. రాహీ దళంతో పాటు అక్కడ సాయుధమై ఉన్న ప్లాటూన్ మహిళలంతా ఆలీవ్‌గ్రీన్ దుస్తుల్లో చక్కగా ముస్తాబై యువ గెరిల్లాలుగా దర్శనమిస్తున్నారు. పురుషులూ అంతే వుత్సాహంగా ఉన్నారు.

ఎర్రని జెండా మధ్యలో ఐదు కోణాలను కలిగిన తెల్లని మెరుపుల నక్షత్రం నూతన ఉషోదయానికి సంకేతంగా నిల్చి ఆకాశంలో ఎగురడానికి సిద్ధంగా ఉంది. రాహీ దళం కమాండర్ మోతీ విజిల్ ఊదడంతో గెరిల్లాలూ, గ్రామస్తులూ అందరూ మూడేసి వరుసల్లో నిల్చున్నారు. అందరికీ ఎదురుగా నిల్చున్న దక్షిణ గడ్‌చిరోలి డివిజన్ క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘం అధ్యక్షురాలు తారా సిడం చేతిలో ఆవిష్కరణకు సిద్ధంగా చరిత్ర పుస్తకం ఉంది. గ్రామస్తుల్లో స్త్రీలు, పురుషులు, పిల్లలూ ఉన్నారు. ప్రజా మిలీషియా కార్యకర్తలు నాల్గు వైపుల సెంట్రీలున్నారు. విడిగా పిఎల్‌జిఎ గెరిల్లాలు క్యాంపు సెంట్రీ చేస్తున్నారు. ఆ రోజు మహిళలకు సెంట్రీ మినహాయించారు.

గ్రీన్‌హంట్ ఆపరేషన్‌లో భాగంగా మహారాష్ట్రలోని గడ్‌చిరోలి జిల్లాకు సైతం కేంద్ర పారా మిలటరీ బలగాలు పెద్దెత్తున చేరాయి. అవి ఐదు వేలకు పైగా ఉన్నాయని పత్రికలు రాస్తున్నాయి. వేడుక జరుగుతున్న ప్రాంతమంతా రెండు రోజుల ముందే 'భద్రతా' బలగాలు కూంబింగ్ చేసి వెళ్లాయని అక్కడికి వచ్చిన ప్రజలు చెప్పుతున్నారు. కార్పెట్ సెక్యూరిటీ విధానంలో భాగంగా బలగాలను మోహరించడంతో మొత్తం ఆ ప్రాంతమంతా ఖాకీవనంలా తయారైంది. రాజ్‌నంద్‌గాం-గడ్‌చిరోలి జిల్లాల సరిహద్దులో ఇండో-టిబెటన్ బార్డర్ పోలీసు (ఐటిబిపి) బలగాలు 'నూతన సరిహద్దుల'ను నిర్మిస్తున్నారు. వాళ్లూ గెరిల్లాల్లాగే తయారై, రోజుల తరబడి అడవిలో గస్తీ చేస్తున్నారు. 'గెరిల్లాలతో గెరిల్లాగా పోరాడు' (ఫైట్ గెరిల్లా లైక్ ఎ గెరిల్లా) నినాదంతో కాంకేర్‌లోని 'కౌంటర్ టెర్రరిజం జంగల్ వార్‌ఫేర్ కాలేజీ'లో శిక్షణ పొందిన పోలీసు కమాండో బలగాలూ గెరిల్లాల వేటలో నిమగ్నమయ్యాయి.

ప్రజలనే సముద్రంలోని లోతైన నీళ్లలోకి జారుకొని 'సురక్షితంగా' సంచరించే ప్రజా గెరిల్లాలతో జీతం రాళ్ల కోసం కక్కుర్తిపడి పొట్ట కూటి కోసం పోలీసు విధులు నిర్వహిస్తున్న బలగాలు జనసంద్రపు ఒడ్డున తిరుగుతూ గెరిల్లాలను వేటాడుతాయనుకోవడం దోపిడీ పాలకవర్గాల ఆత్మవంచనతో గూడిన పరవంచనే తప్ప మరోటి కాదు. వరుసలు తీరి నిలబడిన

జండా వద్దకు హఠాత్తుగా కంపెనీ-4 సభ్యులు ఇద్దరు చేరుకున్నారు. అనుకోని వారు రావడంతో 'ఏదో జరిగి ఉంటుంద'ని అందరి ఆలోచనల్లో ప్రశ్నలు మెదులుతున్నాయి.

'నిన్న గడ్‌చిరోలి-ధనోరా రోడ్డు పై హత్తిగుట్ట వద్ద మన గెరిల్లాలు పదహారున్నర టన్నుల విస్ఫోటకం స్వాధీనం చేసుకున్నారు', వచ్చిన ఇద్దరిలో చరన్ గబగబా చెప్పాడు. వందేళ్ల వేడుకలకు మరింత వన్నె తెచ్చింది ఆ వార్త. గెరిల్లాలకు ఏదీ అందకుండా చేస్తామని '4-కట్' పాలసీని అమలు చేస్తున్న పోలీసులకు ఈ చర్య చెంపపెట్టులా ఉంటుందని రాహీ దళ బాధ్యుడు మనసులోనే అనుకున్నాడు.

'మహిళా ముక్తీ జండా హమ్ పహరాయేంగే
శోషన్ ముక్తీ జండా హమ్ లహరాయేంగే...'

అంటూ శ్రావ్యంగా సిఎన్నెం కార్యకర్తలు పాట పాడడంతో ఆకాశంలో మహిళా విముక్తి జండా ప్రశాంతంగా రెపరెపలాడుతోంది.పాట పూర్తయ్యే వరకూ అందరూ పిడికిలి బిగించి జండాకు ఎర్రెర్ర వందనాలు తెలుపుతూ నిశ్శబ్దంగా సావధాన్‌లో నిల్చున్నారు. పాట ముగిసిన వెంటనే కమాండర్ మోతీ 'మహిళా విముక్తి బాటలో పోరాడుతూ గత వందేళ్ల కాలంలో అసువులు బాసిన వీరవనితలందరికీ, ప్రజాయోధులందరికీ రెండు నిమిషాలు వారి స్మృతిలో మౌనంగా నిల్చి పేరుపేరునా జోహార్లు తెలుపుదాం' అంటూ 'ఉల్టా శస్త్ర్' కాషన్ ఇచ్చింది.

ఆ రెండు నిమిషాలూ ప్రతి వాళ్ల ఆలోచనల్లో తమ ప్రియమైన సహచరుల అమర జ్ఞాపకాలే మెదిలాయి. ఆ తర్వాత బరువెక్కిన గుండెలతో, చెమ్మగిల్లిన కళ్లతో, బిగించిన పిడికిళ్లు పైకి లేపి ముక్తకంఠంతో నినాదాల హోరు మొదలైంది. ఒకరు 'క్లారా జెట్కిన్ అమర్ హై' అంటే మరొకరు 'క్లారా తుజే లాల్‌సలాం' అంటున్నారు. 'అమర్ షహీదీర్‌కు మావా భూంకాల్ జోహార్' అంటూ అడవులు, కొండలు ప్రతిధ్వనిస్తున్నాయి.

వక్తలు వరుసగా ఒకరి తర్వాత మరొకరు మాట్లాడుతున్నారు. మార్చ్ 8 నేపథ్యం మాట్లాడాక వక్తలు ఎవరి అనుభవాలు వారు చెప్పుతున్నారు. అందరి జీవితాలకు ప్రతిబింబంగా, వారి పోరాట అనుభవాలను తెరిచిన కిటికీలా ముప్పై ఏళ్ల చరిత్ర పుస్తకం తమ మధ్య సాక్ష్యంగా నిల్చిందని కామ్రేడ్ తార మాట్లాడగా, చరిత్రను అక్షరబద్ధం చేసినవాళ్లకు పేరుపేరునా కాంత (ఉత్తర గడ్‌చిరోలి డివిజన్ క్రాంతికారి మహిళా సంఘం అధ్యక్షురాలు) విప్లవాభినందనాలు తెలిపింది. ఆ తర్వాత వక్తల వరుసలో కోస్మీకి చెందిన పుష్ప నిల్చింది. పుష్ప తన అనుభవాలను చెప్పుతుంటే రాహీ దళ బాధ్యుడికి రెండు దశాబ్దాల క్రితంనాటి కోస్మీ కళ్లల్లో మెదిలింది.

కోస్మీది ధనోరా తాలూకాలోని ఆదివాసీ గ్రామం. ఆదివాసీ గ్రామాల లెక్కల్లో అది ఒక పెద్ద గ్రామమే అనుకోవచ్చు. నూట పదిళ్లున్న గ్రామం అది. ఆ ఊళ్లో మడావీ, పూడో, నైతాం, హోడి, కోలా, పొట్టావీ, హల్లామీ, ఊసెండీ మొదలైన కోయ ఆదివాసీ కుదుర్లతో పాటు మహార్ (మాల), తేలి (గానుగ) కులస్తులు, రావుత్, పర్ఘస్, వతన్‌కార్‌లాంటి తెగలకు చెందినవాళ్లూ ఉన్నారు. బంగ్లాదేశ్‌నుంచి పెద్దెత్తున దండకారణ్యానికి వచ్చిన బెంగాలీ కుటుంబాలు అనేక ఆదివాసీ గ్రామాల్లో స్థిరపడ్డట్టే కోస్మీలోనూ ఓ బెంగాలీ కుటుంబం దుకాణం

గత ఇరవై ఏళ్ళుగా నడుపుకుంటోంది. ఆ ఊరికి పాండు హల్లామీ పటేల్‌గా ఉన్నాడు. ఊళ్లో చిన్న చిన్న దుకాణాలు నాలుగున్నాయి.

1987–88లో ఈ ప్రాంతానికి విప్లవ దళం చేరుకుంది. ఆ దళానికి పసుల రాంరెడ్డి (జగదీషు) నాయకత్వం వహించాడు. ఆయన సహచరి శాంతక్క మహిళా నాయకురాలిగా ఆ ప్రాంతానికి వెళ్లింది. ఆయన కొద్ది రోజుల్లోనే మదావి దాదాగా జనాల్లో గొప్ప విశ్వాసం పొందిన ప్రజానాయకుడయ్యాడు. (1999లో ఉత్తర తెలంగాణ పోరుగడ్డన పోరాడుతూ ఆయన అసువులు బాసాడు). తిప్పాగడ్ గుట్ట ఈ ప్రాంతంలో ప్రసిద్ధి చెందినది కావడంతో ఆ దళం తిప్పాగడ్ దళంగా ఉనికిలోకి వచ్చింది.

విప్లవ దళం వచ్చాక అన్ని గ్రామాల్లో ప్రజాసంఘాలు ఏర్పడినట్టే కోస్మీలోనూ ఏర్పడ్డాయి. వాటిలో డివికెఎంఎస్‌తో పాటు కెఎయంఎస్ కూడా ఉంది. కాకపోతే ఆదివాసీ పితృస్వామ్య సంకెళ్ల మధ్య నలిగిపోతున్న మహిళలు కోస్మీలో ప్రారంభంలో పెద్దెత్తున సంఘాల్లో సభ్యత్వం తీసుకోలేదు. ఆ రోజుల్లో సంఘంలో వారి సంఖ్య పదికి మించలేదు. ఆ సంఘానికి మైనాబాయి నైతాం తొలి నాయకురాలు. ఆమె అప్పటికే గృహిణి.

ఊళ్లో మహిళలు విప్లవ సంగంలో చేరడాన్ని పురుషుల్లో నరనరాన జీర్ణించుకుపోయిన మగతనం ఆమోదించలేకపోతోంది. 'ముత్తి మాట మూలకు' అని చెప్పి తరతరాలుగా అణచి వుంచిన ఆ ముత్తి (మహిళ) ఈ రకంగా ముందుకు రావడాన్ని వాళ్లు భరించలేకపోతున్నారు. ఏదో ఓ నెపంతో వారిని వేధించడం మొదలైంది. ఇంటిలో వేధింపులూ, తెగ వేధింపులూ వారిని అనాటికి వున్న రాజ్యహింసకన్నా నిజంగానే ఎక్కువగా వేధిస్తుండినాయి. రోజు–రోజు, ఘడియ–ఘడియ అన్నట్టు ఆ వేధింపులు వారిని హింసిస్తున్నాయి. 'సంఘంలో చేరి తప్పు చేశామేమో' అని అనుకునేలా చేస్తున్నాయి. కానీ సంగాన్ని వదులుకుందామనే ఆలోచనలు మాత్రం వారిలో రాకుండా మైనాబాయి వారికి నిరంతరం ధైర్యం చెబుతోంది. ఊళ్లోకి మదావి దాదా దళం వచ్చినప్పుడు దవడలు దగ్గర పడుతున్న ఊరి మగాళ్లు దళం వెళ్లిపోయిందంటేనే విరుచుక పడుతున్నారు. 'ఆడాళ్లకు రాజకీయాలు ఎందుకు?' ఇదే వారి ఏకైక, అసూయ నిండిన, వివక్షాపూరిత పితృస్వామ్యం విసురుతున్న సవాల్.

ఆ పదిమంది మహిళలు ఆ సవాల్‌ను స్వీకరించారు. అర్ధరాత్రినుంచే తన శక్తినంతా చేర్చి వడ్లు దంచడం మొదలుపెట్టే మహిళకు, కోళ్ళు కూయక ముందే, పొద్దు తల్లి కడుపులో ఉండగానే రోజుకు సరిపడా జావ కాచిపెట్టే మహిళకు, నాగలి పట్టడంలో, వేటకు వెళ్లడంలో మగాడితో సమానంగా శ్రమను పంచుకునే మహిళకు, అడవి అడవంతా తిరిగి ఆకూ–అలమూ, కూరా–నారా తెచ్చి ఇంటిల్లిపాదికీ వంటా వార్పు చేసి దొప్పల్లో వడ్డన చేసే ఆ కష్టజీవికి, నవమాసాలు మోసి పునర్జన్మతో సమానమైన ప్రసవంతో బిడ్డలకు జన్మనిచ్చి, తన రక్తాన్ని పాలుగా తాపి వారిని పెంచి పెద్ద చేసే ఆ తల్లికి 'రాజకీయాలు ఎందుకు పనికిరావు?' అన్నదే ఊరి మగాళ్లను పదే–పదే ఆ పదిమంది మహిళలు అడుగుతున్న ఏకైక ప్రశ్న. ఈ విషయం మార్క్స్ చెప్పాడా, మావో చెప్పాడా వాళ్లకు తెలియదు గానీ మదావి దాదా మాత్రం సంగం

పెట్టిన్నాడు సూటిగా అడిగిన ప్రశ్న ఇదే. ఈ ప్రశ్నకు జవాబుగానే వారు కెఎయంఎస్‌లో సంఘటితం అయ్యారు.

ఊరి మహిళలు రోజురోజుకూ మరింత పట్టుదలగా సంగంలో పని చేయడం పెరగడంతో పాటు ఊళ్లో ఎర్రెర్రని తోరణాలు కట్టి యేటా మార్చి 8 జరపడం కూడా మొదలైంది. దీనిని భరించలేని మగతనం ఇంకా బరి తెగించింది. ఊళ్లోని లంపెన్ శక్తులు ఏకమయ్యాయి. గ్రామ సంపన్న శక్తుల అదృశ్య హస్తం, బూర్జువా రాజకీయ పక్షాల అండ, రాజ్యం ప్రోత్సాహం అన్నీ కలిసి ఆ లంపెన్ శక్తులను విపరీతంగా రెచ్చగొట్టాయి. ఫలితంగా ఆ లంపెన్ యువకులు ఊరి సంగం మహిళల కార్యక్రమాలను దెబ్బ తీయడానికి వారి వెంటబడి వారిని అడవిలోకి తరమడం మొదలైంది. అడవిలో వాళ్లు తమ ఒంటి మీది గుడ్డలన్నీ తీసేసి నగ్నంగా నిల్చుండేవారు. అంతే కాదు. అడవిలో ఆ మహిళలను బలవంతంగా తమ నగ్న శరీరాల కాళ్ల నడుమనుంచి ఈగించడం అందులో భాగమైంది. ఆ పితృస్వామ్యం ముందు ఏ వావీ వరుసలకు అర్థం లేకుండా పోయింది. వాళ్ల వయస్సులతో నిమిత్తం లేకుండా, వారు గృహస్థులా, తల్లులా, చెల్లెల్లా అన్నదాన్ని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా సిగ్గులేని మగతనం అనాగరికంగా హద్దు మీరి పిచ్చిగా వ్యవహరించసాగింది.

మగపిచ్చిని భరించలేని ఆ మహిళల రక్తం వేడెక్కి తుకతుక ఉడకసాగింది. ఏ సామాజిక కట్టుబాట్లూ పాటించని ఆ దుర్మార్గ చర్యలతో మహిళలు విసిగి వేసారిపోయి ఆ మగతనానికి కళ్లెం వేయాలనుకున్నారు. గట్టిగా బుద్ధి చెప్పనిదే ఆ పితృస్వామ్యం తమను వదలదనుకున్నారు. ఓ రోజు వారు ఊళ్లోకి దళం వచ్చినప్పుడు తమ వెతనంతా నిర్భయంగా, నిస్సంకోచంగా మడావి దాదా ముందు వెళ్లబోసుకున్నారు.

దళం ప్రజా పంచాయితీ నిర్వహించింది. ఊరి జనాలంతా వచ్చినట్టే ఆ లంపెన్ శక్తులు కూడా వచ్చాయి. పూడో, ముకుంద్, నిజాం మొదలైన గూండాల బృందం చేరింది. మైనాబాయి నైతాం కెఎయంఎస్ వాళ్ల తరఫున అన్ని విషయాలూ పూస గుచ్చినట్టు మాట్లాడింది. మర్యాదస్తులూ, మానస్తులూ మౌనంగా తలదించుకుని వినసాగారు. గూండాలు తప్ప ఊరి వాళ్లందరూ తమ సహానుభూతిని ప్రకటించారు. అక్కడ చేరిన మహిళల రోమాలు నిల్చున్నాయి. మడావి దాదా, దళ సభ్యులూ ఆ గూండాల ఆగడాలను అరికట్టకపోతే ఏ ఊళ్లోనూ సంగాలు, అందులోనూ మహిళా సంగాలు దుర్మార్గమైన పితృస్వామ్యం ముందు బతికి బట్ట కట్టలేవనుకున్నారు. వెంటనే మడావి దాదా ముందుకు వచ్చి 'ఈ గూండాలకు ఏ శిక్ష విధిస్తారు?' అనడంతో జనాలంతా ముక్తకంఠంతో 'గట్టిగా బుద్ధి చెప్పాల'న్నారు.

ఆరుగురు గూండాలపై మహిళలు బరిగలతో విరుచుకుపడ్డారు. వారి వీపులు చిట్లి ఎరుపెక్కాయి. అయినా ఆ మహిళల ఉగ్రరూపం చూస్తుంటే వారిని ఆపడానికి ఎవరూ సాహసించలేకపోతున్నారు. చివరకు దళం జోక్యం చేసుకొని 'మహిళలతో మర్యాదగా వ్యవహరించని ఏ మగాడికైనా ఇదే గతి పడుతుంది' అనడంతో మైనాబాయి పేరుపేరునా మిగిలిన గూండాలను హెచ్చరించింది. ఆ ఘటన తర్వాత ఆ ఊళ్లో కెఎయంఎస్ అన్ని ఊళ్లల్లో

కెఎయంఎస్ కన్నా బలంగా తయారైంది. ఇంటికో మహిళ సంగంలో చేరింది. మెజార్టీ యువతులు చేరారు. కాలక్రమంలో వీరిలో కొందరు మహిళా విముక్తి మార్గంలో సాయుధమై గెరిల్లాలయ్యారు. మైనాబాయి సంగ నాయకత్వం నుంచి పార్టీ సభ్యురాలిగా ఎదిగి 2006-07 నాటికి కోస్మీ జనతన సర్కార్ అధ్యక్షురాలైంది.

'ఆడవాళ్లకు రాజకీయాలెందుకు?' అని ఒకనాడు ప్రశ్నించిన ఆ వూరి మగాళ్లు ఒక మహిళకు స్వచ్ఛందంగా తమ ఊరి సర్కార్ పగ్గాలు అప్పగించారు. ఆ పగ్గాలు అందుకున్న ఆరుగురు పిల్లల తల్లి కామ్రేడ్ మైనాబాయి నైతాం రాజ్యం కళ్లల్లో నలుసైంది. 2008 మే నెలలో గ్యారపత్తి పోలీసులు ఆమెను అరెస్టు చేసి సామూహికంగా అత్యాచారానికి గురి చేసి చిత్రహింసల కొలిమిలో ఆమె ప్రాణాలను బలిగొన్నారు.

ఇది ఒక కోస్మీ కథ. ఇది ఒక మైనాబాయి నైతాం జీవిత చరిత్ర. ఇది తరతరాల అణచివేతపై ఎగిసిన ఒక పోరు కేతనం అనుభవం. దండకారణ్యంలో ఇలాంటి పల్లెలు ఎన్నెన్నో! ఆ పల్లె కడుపులల్లో ఎందరెందరు మైనాబాయిలో!! వందేళ్ల పోరు మహిళకు వన్నె తెస్తున్న ఈ వీరవనితలే క్లారా జెట్కిన్‌కు నిజమైన వారసురాళ్లు. 'ముత్తి (మహిళ) మాట మూలకు' అన్న పురుషాధిపత్య నానుడిని తమ పోరాటాలతో, త్యాగాలతో జయిస్తూ 'ముత్తి మాటను ముందుకు' తెస్తున్నారు. పితృస్వామ్యానికి సమాధి కట్టేది వీళ్లే. ఇన్ని విజయాలను సాధించిన వీళ్లు ఈనాడు గ్రీన్‌హంట్ అభియాన్ కొనసాగిస్తున్న దాడులను తమ విజయాల స్ఫూర్తితో ఓడించకుండా ఎలా వుంటారు? వాళ్లు గత 30 ఏళ్లలో సాధించుకున్న ప్రతీ విజయం గ్రీన్‌హంట్ దాడులను కచ్చితంగా సవాలు చేస్తాయి అని రాహీ దళ బాధ్యుడు అనుకుంటూ ఒక్కసారి తల పైకెత్తి చూడగా జనాలందరూ 'కెఎయంఎస్ జిందాబాద్, మైనాబాయి, శ్యామల, సునంద, సరిత, సాధన అమర్ హై - అమర్ హై' అంటూ నినదిస్తున్నారు. ఆయన చేయి కూడా బిగించిన పిడికిలితో పైకి లేచి 'అమర్ హై' అంటూ గొంతు కలిపింది. 'గ్రీన్‌హంట్‌తున్, అంటూ ఆ గొంతు గట్టిగా నినదించడంతో 'హోరా కీకాల్, హోరా కీకల్' అంటూ వందల గొంతులు బదులిచ్చాయి. అడవులూ - కొండలూ - జనవాసాలూ ప్రతిధ్వనించాయి.

డికె ఆదివాసీ మహిళలు గత ముప్పయ్యేళ్లుగా తెగ పితృస్వామ్యాన్నీ, ఇంటిలోని పురుషాధిపత్యాన్నీ అడుగడుగునా ఎదుర్కొని దానిని ఓడిస్తూ మరింత సంఘటితమవుతున్నారు. రాజ్యహింసను ఓడించడానికి వాళ్లు సాయుధమవుతున్నారు. ఒకనాడు 'జనజాగరన్', ఆ తర్వాత 'సల్వాజుడుం', ఈ రోజు 'గ్రీన్‌హంట్'తో వాళ్లు జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. జీవించడానికి వాళ్లు చావుకైనా తెగించి అడుగడుగునా పోరాడుతూ న్యాయమైన జీవన పోరాటంలో గెలుస్తున్నారు. పితృస్వామ్యాన్ని ముక్కలు ముక్కలుగా నరికి పోగులు పెట్టి దోపిడీరహిత సమసమాజ నిర్మాణ మార్గంలో తమ విముక్తి కై వడివడిగా అడుగులు వేస్తున్నారు. 'మహిళ లేని విప్లవం గెలవబోదు' అన్న చారిత్రక సత్యాన్ని పదే పదే నిరూపిస్తున్నారు. మహిళా లోకానికి ఆదర్శప్రాయంగా దండకారణ్య ఆదివాసీ మహిళలు భారత పోరాట చరిత్ర పుటల్లో తమ స్థానాన్ని భద్రపరచుకుంటున్నారు.

మేడే, 2010

(పోరు దారిలో ధైర్యంగా నిలిచి ఆదర్శమూర్తిగా అందరి హృదయాలలో చోటు చేసుకున్న మైనాబాయి నైతాం లాంటి ఎందరెందరో పోరు మహిళలందరికీ వందేళ్ల మహిళా దినం సందర్భంగా వినమ్రంగా అంకితం)

## 4. జయంతి

ఎండ బాగా తీక్షణంగా ఉండి వేడి అదరగొడుతోంది. ఎండ తీవ్రత 46, 47 డిగ్రీలు దాటుతోందనీ, గత రికార్డులను మించిపోయిందనీ రేడియో రోజూ చెప్పుతూ యింకా అదరగొడుతోంది. నీడ కోసం శరీరం తన్లాడుతోంది. నీళ్ల కోసం మనసు వెతుకులాడుతోంది. గత సంవత్సరం వర్షాలు సరిగా కురవకపోవడంతో ఈ యేడు అడవిలో నీళ్లూ, నీడ మరీ కరువయ్యాయి. రాహీ దళ సభ్యులంతా చద్దర్లతో నీడను ఏర్పాటు చేసుకొని ఎవరి కవర్లలో వారు ఉష్...ఉష్ అనుకుంటూ తమ తమ పనుల్లో మునిగిపోయారు.

చెట్ల ఆకులన్నీ రాలిపోయి అడవి బోసిగా నిల్చింది. ఆకులు రాలిన పొరకలు మిగిలి చాటు అంటూ లేకపోవడంతో చాలా దూరం వరకూ ప్రతీదీ అగుపడుతోంది. అడవిలో సంచరించే మనుషులు, పశువులు, జంతువులు చాలా స్పష్టంగా అర్థమౌతున్నాయి. నీళ్ల తావు ఉందంటే దాహార్తులందరూ జమ అవుతున్నారు. మనుషులను వేటాడే ఖాకీ (మానవ) మృగాలూ, జంతువులను వేటాడే వేటగాళ్లూ ఎవరి యావతో వాళ్లూ అక్కడే విడిది చేయడం పరిపాటైంది.

వేసవి అంతా టిసిఓసి (ఎత్తుగడల ప్రతిదాడి క్యాంపెయిన్) వార్తలతో అట్టుడుకుతోంది. 2010 ఏప్రిల్ 6 దండకారణ్య విప్లవోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిల్చిన సమరదినం. ప్రపంచంలోనే అతి పెద్ద అర్ధ-సైనిక బలగంగా గొప్పలు చెప్పుకునే భారత కేంద్ర రిజర్వు పోలీసు ఫోర్సు (సిఆర్‌పిఎఫ్) కు చెందిన 62వ బెటాలియన్‌లోని ఒక కంపెనీ బలగాలను ప్రజాయుద్ధంలో పిఎల్‌జిఏ గెరిల్లాలు పూర్తిగా మట్టిగరిపించిన రోజు అది. భారత విప్లవోద్యమ సమూల నిర్మూలనకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోవాదీ)ని అంతమొందించే దుష్ట తలంపుతో దేశంలోని ఐదు రాష్ట్రాలకు చెందిన 33 జిల్లాల్లో దాదాపు మూడు లక్షలకు మించిన ఖాకీ బలగాలు సృష్టిస్తున్న భయ-బీభత్సకాండను ఎదుర్కోవడంలో భాగంగా ఆ దాడి జరిగింది. దండకారణ్యంలోని దక్షిణ బస్తర్ డివిజన్‌లో వందలాది ప్రజలూ, ప్రజా మిలీషియా కార్యకర్తలూ తాము అమితంగా ప్రేమించే ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంతో కలిసి ఆ దాడిని సఫలం చేసి దేశ-దేశాల్లో పార్టీ, పిఎల్‌జిఏ, జనతన సర్కార్‌ల గౌరవ ప్రతిష్టలను నూతన ఎత్తులకు తీసుకెళ్లిన ఈ విజయోత్సవ వేడుకలను అన్ని దళాలూ, ప్లటూన్‌లూ, కంపెనీలూ, ప్రజలూ సంతోషంతో చేసుకుంటున్నారు. రాహీ దళం ఆ వేడుకల్లో పాల్గొనడానికి ఆ రోజు కుర్సనార్ చేరుకుంది.

కుర్సనార్‌లో ఉన్నవి నాలుగిళ్లే. మాడ్ కొండల్లో అలాంటి గ్రామాలు పదుల సంఖ్యలోనే ఉంటాయి. ఆ ఊరిలో ఉన్న నాల్గు ఇండ్లల్లోనుంచి యింటికొకరు విప్లవోద్యమంలో చేరిపోయారు. వారిలో ఒక మహిళ దశాబ్దం క్రితం పాముకాటుతో ప్రాణాలు కోల్పోయి నవయవ్వన

ప్రాయంలోనే తన ప్రాణాలను విప్లవోద్యమంలో ధారపోసింది. దండకారణ్య విప్లవోద్యమంలో చేరినవాళ్లలో పాముకాటుతో ప్రాణాలు కోల్పోయిన తొలి మహిళ ఆ కామ్రేడ్. ఆ మహిళ స్మృతిలో గ్రామస్తులు నిర్మించుకున్న స్మారక స్థూపం పరిసరాల్లోనే రాహీ దళం దేరా వేసింది.

బట్టతల, బానపొట్ట, కళ్లజోడు, నోట్లో బీడీ పొగతో ప్రవీణ్ 'లాల్‌సలాం భయ్యా' అనడంతో రాహీ దళం బాధ్యుడు తల పైకెత్తి చూసి 'లాల్‌సలాం ప్రవీణ్' అంటూ ఆప్యాయంగా ఆహ్వానించాడు. చేతిలో చేయి కలిపి బలంగా కాసేపు అలాగే పట్టుకొని 'బాగున్నావా' అన్నాడు. 'సబ్ ఠీక్ హై' అంటూ బదులు ఇచ్చి పాలిథీన్‌లో కూచున్నాడు ప్రవీణ్.

కాసేపు ఇద్దరి మధ్య టిసిఓసి సైనిక చర్యల వార్తలు సాగాయి. ఈ లోగా 'గుడ్డు' చాయ్ తేవడంతో వాళ్ల సంభాషణలకు బ్రేకు పడింది.

'రాహీ దళం చాయ్ సూపర్బ్ దాదా' అంటూ ప్రవీణ్ తన చాయ్ ప్రియత్వాన్ని చాటుకున్నాడు.

బాధ్యుడు ముసిగా నవ్వి మళ్లీ చర్చల్లోకి దిగాడు.

'భర్తీ పరిస్థితి ఎలా వుంది ప్రవీణ్'

'డివిజన్‌లో అనుకున్న టార్గెట్ 80 శాతం సాధించాం. మర్కనార్, ముగ్నేర్, హత్తిగుట్ట, లాహిరి సైనిక విజయాల ప్రభావం యువత మీద అమోఘంగా పడింది. ఈసారి భర్తీలో ఒక బెంగాలీ అమ్మాయి కూడా ఉంది. పేరు జయంతి పెట్టాం'

'గుడ్! ఇది ఈ మధ్య బెంగాలీలలో మనం సాధించిన మొదటి విజయం అనుకోవచ్చా?'

'ఆ'

'ఇప్పుడు ఎక్కడుంది జయంతి? చదువుకుందా? కుటుంబ వివరాలు తెలుసా? ఏ ఊరు ఆమెది?' బాధ్యుడినుండి ప్రశ్నల వర్షం.

'చదువు సంధ్యలు ఉన్నవాళ్లకు మన దగ్గర గిరాకీ ఎక్కువ కదా భయ్యా! ఆమె పిఎల్-3 లో ఉండింది. కానీ ఆమె చురుకుదనం, విద్యా బుద్ధులూ, కలుపుగోలుతనం చూసి ఆమెను మనవాళ్లు కెఎయంఎస్‌కు మార్చారు. కెఎయంఎస్ ఆర్గనైజర్ లిమ్మి వెంట ఆమె వుండి ఉండాలి' అన్నాడు ప్రవీణ్.

గత 6, 7 దశాబ్దాలుగా దండకారణ్యంలో బెంగాలీలు వలస రావడం కొనసాగుతూనే ఉంది. 1971లో బంగ్లాదేశ్ యుద్ధ శరణార్థులు వేల సంఖ్యలో వచ్చారు. వీరందరికీ ప్రభుత్వ గుర్తింపు ఉంది. వీరిని దండకారణ్య ప్రాజెక్టు పేరుతో మూడు రాష్ట్రాల సరిహద్దుల్లోని (ఒడిషా, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర) అడవిలో కేంద్ర ప్రభుత్వం స్థిరపరిచింది. వీళ్ల సంఖ్య ఇప్పుడు లక్షల్లోనే ఉంటుంది. వలస వచ్చినవాళ్లలో అత్యధికులు పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన శ్రమజీవులే. పైగా వీరిలో దళితుల సంఖ్య అధికంగా వుంటుంది. ఈ విశాల అటవీ ప్రాంతంలోని ఆదివాసీల మధ్యకు వీరు రావడంతో ఇక్కడ ఒక నూతన వైరుధ్యానికి తెర లేపినట్టయింది.

జయంతి వయసు 18 లోపే. పేద కుటుంబం నుండి వచ్చింది. శ్రమజీవుల బిడ్డ. జయంతి తండ్రి చాలాకాలంగా విప్లవోద్యమ సానుభూతిపరుడిగా ఉన్నాడు. జయంతి

విప్లవోద్యమంలో భాగం కావడం ఆయనకు సంతోషంగా ఉంది. సమాజంలోని యువతను దోపిడీ దుష్ట సంస్కృతి అన్ని రకాలా చెడగొడుతున్న నేటి పరిస్థితులలో తన కూతురు విప్లవోద్యమంలో భాగం కావడం ఆయనకు నిజంగా గర్వంగానే ఉంది. తరతరాలుగా బెంగాలీలు తమ మాతృదేశాన్ని వదిలి పొరుగు దేశానికి వలస రావడం వెనుకగల కుట్రాజకీయాలు గానీ, సమాజంలో మహిళల పట్లా, పేద ప్రజల పట్లా అమలవుతున్న అసమానత, వివక్ష, దోపిడీ, అన్యాయం, దుర్మార్గాల గురించి గానీ జయంతికి తెల్సింది తక్కువే. ఆమెకు తెల్సిందల్లా మావోయిస్టులు మంచివాళ్ళు, పేదల మనుషులు. తాను వాళ్లతో కలిసి మంచి మనిషిగా జీవించాలి. ఇంతే. ఈ కోరికనే ఆమెను ఆ వయసులో విప్లవోద్యమం వైపుకు తీసుకెళ్లింది.

జయంతిని దళానికి అప్పగిస్తూ 'అప్పుడప్పుడు తెచ్చి చూపండి దాదా అన్నాడు వాళ్ల నాన్న' అంటూ ప్రవీణ్ గుర్తు చేసుకున్నాడు.

'జయంతి విప్లవోద్యమంలోకి రావడం మంచి విషయం. ఉత్సాహంతో వచ్చింది. విప్లవోద్యమ నిర్మాణాలతో ఉన్న అనుభవం లేదు ఆమెకు. కాబట్టి ఆమెను నిలబెట్టుకోవడం అనేది ఒక పెద్ద పరీక్షే! గతంలోనూ యిలా ఒకరిద్దరు ఉత్సాహంతో, తమ సమస్యలతో వచ్చారు. కానీ నిలబడలేకపోయారు. ఉద్యమంలో నిలబడడానికి ఉత్సాహం ఒక్కటే సరిపోదు కదా! అయితే యిలా నిలబడలేకపోవడం అనేది ఒక్క బెంగాలీల సమస్యే కాదు ప్రవీణ్. ఇప్పటికీ మన దండకారణ్య విప్లవోద్యమంలో డ్రాపవుట్ రేట్ 30–35 శాతం ఉందని ప్రతిసారీ సమీక్షించుకుంటున్నాం. అయితే ఈ మధ్య ఈ రేఖ కొంత కిందికి వాలింది' అంటూ బాధ్యుడు ఉద్యమ బలహీనతనూ, జయంతిని నిలబెట్టుకోవాలన్న బాధ్యతనూ గుర్తు చేశాడు.

వేసవిలో చిన్న తేనెటీగల (కడువీసి) సమస్య విపరీతంగా ఉంటుంది. అవి ఏ పనీ చేసుకోనీయకుండా విసుగెత్తిస్తాయి. కళ్ల చుట్టూ, చెవుల చుట్టూ తిరుగుతూ ముక్కుల్లోకీ, అవకాశం వస్తే జుంయిన నోట్లోకీ దూరుతాయి. కళ్లజోడు ఉన్నవాళ్లకయితే కొంత రక్షణ ఉంటుంది కానీ అవి లేనివాళ్ల కళ్లల్లో పడి మరీ ఇబ్బంది పెడతాయి. వర్షాలు పడేవరకు వీటితో వేగలేక చదువూ ఏదీ సాగకుండా పోయి పొద్దస్తమానం రుమాలుతో వాటిని ఊపుకోవడమే సరిపోతుంది. పొద్దు గూకే సమయానికి వాటి జోరు తగ్గుతుంది.

సాయంత్రం మసక అవుతుండగా మనోజ్ కుర్సనార్ చేరాడు. ఆయన 50వ పడిలో ఉన్నాడు. దాదాపు 20 ఏళ్లుగా విప్లవోద్యమంలో కొనసాగుతున్నాడు. ఇంటి దగ్గర కాస్త మోతుబరి కుటుంబం గావడంతో ఇద్దరు భార్యలతో కాపురం పెట్టగలిగాడు. కుచేలుడి సంతానంలా ఆయనకు దాదాపు డజనుమంది పిల్లలు. భార్యా పిల్లలు ఇంటి వద్దే ఉంటారు. మనోజు పార్టీ అనుమతితో వెళ్లి అపుడపుడు వారిని కలిసి వస్తుంటాడు. అయితే గ్రీన్‌హంట్ ఆపరేషన్ మొదలయ్యాక ఆయన ఇంటికి వెళ్లి భార్యల్నీ, పిల్లలనీ కలవలేకపోతున్నాడు. మనోజు కాస్త కురచగా, సౌష్టవంగా ఉంటాడు. మాడియా పల్లెల్లో ఆయనకు మంచి సౌమ్యుడిగా పేరుంది. భామ్రాగఢ్ ఏరియా జనతన సర్కార్ అధ్యక్షుడిగా బాధ్యతలు కొనసాగిస్తున్నాడు.

మనోజ్ డేరాకు చేరుకొని వరుసగా అందరికీ లాల్‌సలాం చేయసాగాడు.

'కైసా హై సర్కార్' అంటూ రాహీ దళ బాధ్యుడు నవ్వుతూ చనువుగా చేయి గట్టిగా కలిపాడు.

మనోజ్ నవ్వుతూనే 'ఠీక్ హై' అన్నాడు. ఆయన ప్రవీణ్ వైపు నేల చూపులు చూస్తూ 'జయంతి యాక్సిడెంట్‌లో చనిపోయింది' అన్నాడు. ఆ క్షణాన మనోజ్‌లో తన బిడ్డను కోల్పోయినంత బాధా, ఆమెను నిలబెట్టుకోలేకపోయామనే అపరాధ భావనా స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రవీణ్‌కు నోట మాట రావడం లేదు. 'అదెలా?' అని మాత్రం అనగలిగాడు.

"సైనిక నిర్మాణం ప్లటూన్‌లో రెన్నెల్లు ఉన్న తర్వాత జయంతి బదిలీ అయ్యి కెఎయంఎస్ ఆర్గనైజర్ వెంట ఉంటోంది. ఆదివాసీ ప్రజల మధ్య విప్లవోద్యమ నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, గెరిల్లా జీవితంలో అనివార్యమైన కష్టాలూ, పోలీసుల నిర్బంధాన్ని తట్టుకొని వారి కంటబడకుండా అడవిలోని ప్రజల మధ్య జీవించడం, తరచుగా వినవస్తున్న ఎన్‌కౌంటర్ వార్తల్లో శత్రువు మరణంతో పాటు సహచరుల అమరత్వం, వార్తా పత్రికలలో, రేడియోలలో, టీవీలో 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' అంటూ భయం కొలిపే వార్తలు జయంతికి అడుగడుగునా పరీక్షలా మారాయి. ఆమెలోని వుత్సాహం రోజు రోజూ పలచబడసాగింది. దళాల్లో అందుతున్న రాజకీయాలు ఆమెకు ఇక మనసుకెక్కకుండా పోయాయి. అవి రుచించకుండా పోయాయి. ఎట్టకేలకు జయంతి ఇంటికి వెళ్లాలని నిశ్చయించుకుంది.

జయంతి ఇంటికెళ్లడాన్ని తల్లిదండ్రులు ఇష్టపడలేదు. తన బిడ్డ పార్టీలోకి వెళ్లిందని అప్పటికే రెండుసార్లు స్థానిక ఎస్ఐ జయంతి తండ్రిని ఠాణాకు పిలిచి అనేక విధాలుగా హింసించాడు. జయంతి ఇంటికి వచ్చిందని తెలిస్తే ఆ ఖాకీలు వదలయి అని తండ్రి భయపడ్డాడు. గ్రీన్‌హంట్ పేరుతో పల్లెల్లో జరుగుతున్న దాడులు తీవ్రంగా ఉన్నాయి. అందులో మహిళల పై జరుగుతున్న అత్యాచారాలకు అడ్డూ-అదుపూ లేకుండా పోయిందని తండ్రి వాపోయాడు. తన బిడ్డ బతుకు బుగ్గి పాలవుతుందని తల్లి ఏడ్చింది.

బిడ్డను ఎలా కాపాడుకోవడం? ఎక్కడ దాపెట్టడం? పార్టీలోనే భద్రతా, రక్షణా వుంటాయని ఎంత చెప్పినా జయంతి అపరాధ భావనతో తిరిగి పార్టీలోకి పోవడానికి సిద్ధపడలేదు. చివరకు దూరపు చుట్టాల వద్దకు పంపి అక్కడే ఆమె పెళ్లి చేసి స్థిరపర్చాలని కుటుంబం నిశ్చయించుకుంది. జయంతి తన అన్నతో ఫట్‌ఫట్ (మోటార్ సైకిల్) పై కూచోని వెళుతుండగా దారిలో ట్రక్కు ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో జయంతి చనిపోగా, అన్న గాయాలతో ఆసుపత్రి పాలయ్యాడు" అంటూ మనోజ్ జరిగిందంతా కళ్లకద్దినట్టు చెప్పాడు.

'ఈ ఫాసిస్టు పోలీసు వ్యవస్థ మనిషికి జీవించే హక్కు లేకుండా చేసింది. జయంతి చావుకు పోలీసులు, గ్రీన్‌హంట్‌లే కారణమని బయటి ప్రపంచానికి తెలిసేదెలా?' అంటూ ప్రవీణ్ దీర్ఘంగా నిట్టూర్చాడు.

## 5. కబ్జాం

రాహీ దళ బాధ్యుడు చాలా ఆసక్తిగా 'వాకింగ్ విత్ కామ్రేడ్స్' అరుంధతీ రాయ్ వ్యాసం చదువుతూ దళానికి చెప్పుతున్నాడు. దళ సభ్యులందరూ 'దీదీతో మాట్లాడుతున్నట్టే ఉంది వింటుంటే' అని పైకీ, లోపలా అనుకుంటూ వింటున్నారు.

'ఖమ్మంలో 49.5 డిగ్రీల ఎండ' అంటూ రేడియో చెప్పింది. దండకారణ్యంలోనూ అటూ ఇటుగా ఎండ తీవ్రత 48 డిగ్రీలకు తగ్గదన్నంత తీవ్రంగా తన ప్రతాపాన్ని చూపిస్తోంది. రాహీ దళం తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న పందిరి కింద చద్దర్లు కట్టుకొని సమిష్టి అధ్యయనం కొనసాగిస్తోంది. అకాల వర్షాల పుణ్యమా అంటూ ఈసారి అడవి కొంత ముందుగానే అంటే జూన్‌కు ముందే పచ్చబడింది. అక్కడక్కడ వాగుల్లో వర్షపు నీళ్లు అగుపడుతున్నాయి. ఈ వర్షాలే లేకపోతే పరిస్థితి చాలా గంభీరంగానే ఉండేది. గత సంవత్సరం వేల సంఖ్యలోనే ఆదివాసుల పశువులు అడవిలో నీళ్లూ, మేతా దొరకక మృత్యువాత పడ్డాయి. ఎన్నెన్నో పల్లెలు నీటి కోసం వలస వెళ్లక తప్పలేదు. ఈ సంవత్సరం మాత్రం ఆ దుస్థితి రానందుకు పల్లెముఖాల్లో, పసుల మందల్లో వరుణ దేవుడికి కృతజ్ఞతలు వెల్లడవుతున్నాయి.

క్యాంపు బాధ్యుడు రెండుసార్లు 'లాంగ్ విజిల్' ఊదడంతో సెక్షన్‌ల వారీగా సభ్యులందరూ తూనీగల్లా వచ్చి నిల్చున్నారు. ఆ రోజు పౌర్ణమి కావడంతో నిండు చంద్రుడు కూడా విజిల్ విన్నట్టే వచ్చి తన జాగాలో తాను వుండిపోయి అన్నీ పరిశీలిస్తున్నాడు.

'కామ్రేడ్స్! మనం యిప్పుడు అమ్మోనియం నైట్రేట్ విస్ఫోటన పరీక్షలు చేయాలి. ఊరివాళ్లకూ, సెంట్రీలకూ కబురు వెళ్లింది. అందరూ అలర్ట్‌లో, జాగ్రత్తగా ఉండాలి' అని చెప్పి రోల్‌కాల్ ముగించాడు.

అమ్మోనియం నైట్రేట్‌ను దంచి వస్త్రగాళితం పట్టి మెత్తని పిండిలా తయారు చేసి అందులో కిలోకు 50 గ్రాముల చొప్పున డీజిల్ కలిపి తేమ ఏ మాత్రం లేకుండా అయ్యేవరకూ ఎండలో రోజూ ఆరబెట్టి కంటేనర్‌లలో నింపిన గగన్ ముఖంలో పున్నమి వెలుగులు నిండాయి. మిగతా సభ్యులందరూ విస్ఫోటన శబ్దాల కోసం ఉవ్విళ్లూరుతుంటే మోతీ బ్యాటరీ తెచ్చి డిటోనేటర్‌కు కనెక్షన్ ఇచ్చింది. క్యాంపు బాధ్యుడు కౌంట్ మొదలుపెట్టాడు. ఒకటీ, రెండూ,మూడూ...అనేసరికి అడవిలోని కొండల నడుమ పెద్ద ఉరుములాంటి శబ్దంతో విస్ఫోటనం తన శక్తిని ప్రదర్శించింది. అక్కడ గుమిగూడిన సభ్యులందరూ ఆనందోత్సాహాలతో ఎగిరి గంతులు వేస్తూ కేరింతలు కొడుతున్నారు.

రాహీ దళ బాధ్యుడు తన పక్కనున్న ఓ వారపత్రికను తదేకంగా చూస్తున్నాడు. దాని అట్ట పై ఉన్న పోలీసు డిఐజి విశ్వరంజన్ ఫోటో 'ఇంత శక్తివంతమైన పేలుడా' అని ఆశ్చర్యపోతున్నట్టు అన్పించి తనలో తాను ముసిముసిగా నవ్వుకున్నాడు. హిట్లర్‌ను పోలిన ఆ ముఖాన్ని చూస్తుంటే సరిగ్గా యేడాది క్రితం 15వ లోక్‌సభ ఎన్నికలకు కొద్ది ముందు 'ఎన్నికలకు ముందు నక్సలైట్లు చేసే ఆగడాలను వారి విస్ఫోటనం జప్తు చేసుకొని అరికట్టామ'ని ఛత్తీస్‌గఢ్

[illegible] ప్రకటన, అనాదు విశ్వరంజన్ అందుకున్న వాహ్వాలు బాధ్యునికి [illegible]

[illegible] 18 [illegible] పీఎల్‌జీఏ శత్రువునుంచి పదహారున్నర టన్నుల విస్ఫోటనాన్ని జప్తు [illegible] పొగరుకు ఫిట్టింగ్ రిప్లై. కొండలు ప్రతిధ్వనించిన పిడుగులాంటి [illegible] గర్జిస్తున్నాయి.

'శత్రువు అనుసరిస్తున్న 4-కట్ పాలసీకి ఇది మరో పెద్ద దెబ్బ. విప్లవకారులకు అందే అన్ని రకాల సరఫరాలను దెబ్బతీయడానికి పోలీసులు అన్ని దారులూ మూస్తున్నామను కుంటున్నప్పటికీ ఎప్పటికప్పుడు కొత్త దారులు తెరుచుకుంటూనే ఉన్నాయి. గతంలోని సల్వాజుడుంకూ, 'అంకుల్ చిదం' ముందుకు తెచ్చిన గ్రీన్‌హంట్‌కూ తూట్లు పడుతూనే ఉన్నాయి. నిధులు అందకుండా అడ్డుకోవాలంటే విప్లవకారులు దాడులు చేసి బ్యాంకు నిధులు సమకూర్చుకుంటున్నారు. వారికి కొత్త శక్తులు రిక్రూటు కాకుండా నియంత్రించాలని రకరకాల చిట్కాలూ, దుష్ప్రచారం ఎంత చేస్తున్నా 'సింగిల్ లార్జెస్ట్ థ్రెట్' పెరుగుతూనే ఉంది. దింపిన బలగాలలో నక్సలైట్లను ఎదుర్కొంటామనే ఆత్మస్థయిర్యం మావోయిస్టుల దాడులతో తీవ్రంగా దెబ్బ తింటోందని మీడియానే తెలుపుతోంది. శత్రువు తలపెట్టిన దాడులు విఫలమవుతుంటే ప్రజలపై విరుచుకుపడి అది కొనసాగిస్తున్న ఫాసిస్టు చర్యలు తీవ్రమవుతున్నాయి. సామూహిక హత్యలు, అత్యాచారాలు, గృహ దహనాలు ప్రజల్లో బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. వీటిని మీడియా దృష్టికి రాకుండా పోలీసులు పూర్తిగా నియంత్రిస్తున్నారు. ప్రజల పక్షం మాట్లాడేవారినెవరినీ అడవుల్లోకి రానివ్వడం లేదు. ఇది మారాలి. దీన్ని మార్చాలి' అనుకుంటూ తీవ్ర ఆలోచనల్లో మునిగిపోయిన రాహీ దళ బాధ్యుడు 'లాల్‌సలాం' అంటూ వినబడడంతో ఈ లోకంలోకి వచ్చి తలెత్తి చూశాడు.

ఎదురుగా ఎనిమిదిమంది యువతీ-యువకులు నిలబడి ఉన్నారు. వారంతా 'చేతనా నాట్య మంచ్' సభ్యులు. ఆకుపచ్చ గేర్ (పొడుగాటి లంగా) ధరించి, స్త్రీలైతే పైన జాకెట్, పురుషులైతే బనియన్ వేసుకుని తలకూ, నడుంకూ ఎర్రని గుడ్డ కట్టి, చేతిలో తమ సంఘ చిహ్నంతో (డోలు, కలం) ఉన్న జండాను పట్టుకొని ఒక్కొక్కరుగా చేయి కలుపుతూ కదులుతున్నారు. వారంతా గ్రామ జనతన సర్కార్ విద్యా-సంస్కృతి ప్రచార విభాగం వారి కోరికపై ఆ రోజు క్యాంపులో తమ కళా ప్రదర్శనను చూపడానికై తయారై వచ్చారు. చివరన ఉన్న ఒక యువతి చేతిలో కంజర ఉంది. మహిళ చేతిలో కంజర చూసిన రాహీ దళ బాధ్యుడు ఒక్కసారి కనుబొమ్మలు ఎగురవేసి కళ్లు పెద్దవిగా చేసి చూస్తూ 'పెద్ద మార్పే' అనుకున్నాడు. ఆదివాసీలలో మహిళలు/యువతులు డప్పు, డోల్లు పట్టి నృత్యం చేయడం గానీ, విల్లంబులు చేతబట్టి వేటలో పాల్గొనడం కానీ మేలో అంటారు. కానీ విప్లవ సాంస్కృతిక మహిళా కార్యకర్తలు ఆ పురుషాధిపత్య సంప్రదాయాన్ని పక్కన బెట్టగా, ప్రజా మిలీషియాలోని మహిళలేమో ఆత్మరక్షణ కోసం నిరభ్యంతరంగా విల్లంబులను ఆయుధంగా ఉపయోగిస్తున్నారు. 'విప్లవోద్యమం ఎన్నెన్ని మార్పులను సునాయాసంగా తేగల్గుతుంది' అనుకుంటూ బాధ్యుడు లేచి వేదిక వైపు వెళ్లి

అందరిలో కలిసిపోయి ప్రేక్షకుడిగా కూచున్నాడు.

బృంద నాయకురాలు ముందుకు వచ్చి తమ బృందం పాడబోయే పాటను పరిచయం చేసింది. అది విస్థాపన సమస్య పై పాట అని అర్థమైంది.

ఒక మహిళా కళాకారిణి పాడుతూ నృత్యం చేస్తోంది. మిగతా వాళ్లంతా కోరస్ ఇస్తూ వాళ్లూ నృత్యంలో భాగమవుతున్నారు. అక్కడ కూచున్న పిఎల్‌జిఎ గెరిల్లాలూ, ప్రజలూ పాట వింటూ నృత్యాన్ని చూస్తూ మురిసిపోతున్నారు. పున్నమి వెలుతురులో అందరి భావాలూ ఎలాంటి దాపరికం లేకుండా వారి ముఖాలపై అగుపడుతున్నాయి. కానీ రాహీ దళ బాధ్యుడు పదే, పదే పెదవులు విరుస్తున్నాడు. పాటకు తగినట్టుగా నృత్యం లేదు, భావానికి ప్రతిబింబంగా హావభావాలు లేవన్నదే ఆ పెదవి విరుపులకు సంకేతం అని సిఎన్నెం బలహీనత అర్థమైన వాళ్లకెవరికైనా సులువుగానే బోధపడుతుంది. 'ఇది శిక్షణలోనే ఉన్న లోపం' అనుకుంటూ ఆయన దీర్ఘంగా ఆలోచిస్తుండగానే ఆయన ఆలోచనలకు వేదిక పైన వెలువడుతున్న ప్రకటనతో తెరపడింది. 'విస్థాపన సమస్యపై నాటకం చూడండి' అంటూ పరిచయం చేశారు.

పదిహేను నిమిషాల్లో కళాకారులు నాటకం పూర్తి చేశారు. తాము ఇవ్వదలుచుకున్న సందేశాన్ని అద్భుతంగా వ్యక్తం చేశారు. పాత్రోచితంగా ఆహార్యం ధరించారు. భావయుక్తంగా ఆ హావభావాలున్నాయి. ఎక్కడా ఏ లోపం లేకుండా డైలాగులు ఉచ్చరిస్తూ ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. అది నటన కాదు, జీవితం. ఈ రోజు దండకారణ్యంలోని వేలాది ఆదివాసీ రైతుల జీవన్మరణ సమస్య. తమ ఇండ్లూ, పంట భూములూ, తమకు ప్రాణంలాంటి అడవీ, తమ ఆత్మీయ సంబంధాలూ, తరతరాల సంస్కృతీ, గాలీ, నీరూ అన్నీ వదులుకొని టాటా, ఎస్సార్, జిందాల్‌ల కోసం జీవితాలను బలి తీసుకోవద్దనే సందేశం ఆ నాటకం ద్వారా ఇచ్చారు. గ్రీన్‌హంట్ మొదలైందందుకే అని చెప్పారు. మనిషి తన వ్యక్తిగత ఆస్తి కోసం ఎంతగా గింజులాడినా, సమష్టి కోసం అంతకన్నా అనేక రెట్లు సమైక్యతతో పోరాడకుండా ఏదీ కాపాడుకోలేమని ప్రతి పాత్ర చేతా మాట్లాడించారు. రాహీ దళ బాధ్యుడు కూడా ఆ వెలుగుల్లో వెలుగయ్యాడు. జనం నవ్వులో భాగమయ్యాడు. దీనితో ఆయనలో మరో ఆలోచన ముందుకు వచ్చింది. పక్కనే కూచున్న ఎస్‌జెడ్‌సి సభ్యుడు రాజుతో 'భావం అర్థమైన కళాకారుల హావభావాలు యాంత్రికంగా ఉండవు రాజుదా' అన్నాడు. రాజు తలూపుతూ ముసిముసిగా నవ్వాడు. వీళ్లు మాటల్లో ఉండగానే సిఎన్నెం కళాకారులతో పిఎల్‌జిఎ గెరిల్లాలూ, జనం అందరూ కళాకారులైపోయారు. వారంతా సామూహికంగా సంప్రదాయ నృత్యంలో మునిగిపోయారు. మిగిలింది రాజూ, బాధ్యుడే.

ఊళ్లోనుంచి ప్రజా మిలీషియా కమాండర్ ఫాగు పరుగెత్తుకుంటూ వచ్చాడు. ఆయన ముఖంలో వ్యక్తమవుతున్న ఆందోళనను అర్థం చేసుకున్న రాజు 'ఏదో జరిగింది' అని రాహీ దళ బాధ్యుడితో అంటుండగానే కమాండర్ ఫాగు విషయం వెల్లడించాడు.

'ఈ రోజు ఉదయం పోలీసులు పక్కూరు కజ్జూం వచ్చి మన అనిల్ యింటితో పాటు, జనతన సర్కార్ సభ్యుడి యిల్లు తగులబెట్టారు. ఇంట్లో దాచిపెట్టుకున్న డబ్బులు కూడా

దోచుకెళ్లారు. ఇంట్లో వున్న ఇప్పపూలూ, పంటగింజలూ, గుడ్డలూ అన్నీ తగులబడిపోయాయి. అనిల్ ఇంటిని పోలీసులు తగలబెట్టడం యిది రెండోసారి. మొదట సల్వాజుడుం గూండాలు కాలిస్తే, ఇప్పుడు గ్రీన్‌హంట్ పోలీసులు కాల్చారు' అంటూ ఫాగు తాను చూసిందంతా చెప్పాడు.

కమాండర్ చెప్తున్నదంతా శ్రద్ధగా వింటున్న బాధ్యుని వైపు చూస్తూ రాజు '2010 మార్చ్‌లో వయనార్‌లో కొత్తగా పోలీసు క్యాంపు వేశారు. దాదాపు 250 మంది కమాండోలున్నారు. వీరు చేయని దుర్మార్గం అంటూ లేదు. ఇప్పటికే రెండు బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి ఏడుగురు ఆదివాసీ యువతీ-యువకులను కాల్చి 'మావోయిస్టుల మరణం' అన్నారు. వీళ్ల వెంటే స్థానిక లంపెన్ శక్తులు సుఖ్‌లాల్, మున్నా, జుగ్నూలు ఎస్పీవోలుగా ఉంటున్నారు. వీళ్ల పీడ ఎప్పుడు విరగడవుతుందా? అని జనం అనుకోని రోజుండదు. వయనార్‌లో కొత్తగా బడి పేరుతో కడుతున్న పోలీస్ క్వార్టర్స్ నిర్మాణ పనుల్లో కజ్జాం ఊరివాళ్లు పాల్గొనడం లేదు. వాళ్లను ఎలాగైనా లొంగదీసుకోవాలని ముందు మన పార్టీ ఏరియా కమిటీ సభ్యుడి ఇల్లు, మరో నాయకుడి ఇల్లు కాల్చారు. ఉదయం హెలికాప్టర్ మూడు రౌండ్లు తిరిగిందంటేనే అనుమానమొచ్చింది కామ్రేడ్' అన్నాడు. రాజు ఫాగు వైపుకు తిరిగి 'ఇంకేం చేశారు పోలీసులు?' అని అడిగాడు.

'ఇంకేముంది? షరా మామూలే. ఆ పోలీసుల దుర్మార్గానికి దారిలోని మరో మూడూళ్లలో అమరుల స్థూపాలు నేలమట్టమయ్యాయి. ఒక రైతును తమ వెంట తీసుకెళ్లారు. మేం చెప్పిన పనికి రాకుంటే మిగిలిన ఇండ్లనూ కాలుస్తాం అని ఎస్పివో సుఖ్‌లాల్ హెచ్చరించాడు. నన్ను వాడు చూడలేదు. నేను దూరంగా ఉండి అన్నీ గమనించాను' అంటూ కమాండర్ ముగించాడు.

'ఊరోల్లు ఏమంటున్నారు ఫాగూ? అనిల్ భార్యా పిల్లలూ ఇంటి వద్దే ఉన్నారా?' అంటూ రాజు ప్రజా మిలీషియా కమాండర్‌ను మరో రెండు ప్రశ్నలు అడిగాడు.

'ఊరి వాళ్లంతా ఈ సమయంలో మన కంపెనీ వస్తే బాగుండు అనుకుంటున్నారు. అనిల్ భార్య జాడ లేదు కామ్రేడ్. తన కళ్ల ముందే తన కష్టార్జితమైన ఇప్పపూలూ, వడ్లూ, పప్పు దినుసులూ కాలిపోతుంటే ఆవిడ తట్టుకోలేకపోయింది. తన ఒంటి మీది నగలూ, కూడబెట్టుకున్న డబ్బూ పోలీసుల పాలవడంతో వలవలా ఏడ్చింది. ఇంట్లో దొంగలు పడ్డా ధనం పోయి ధాన్యం మిగులుతుంది. ఇల్లూ వుంటుంది. కానీ ఈ దొంగలు ఏదీ మిగల్చడం లేదు. ఏ క్షణాన మళ్లీ వచ్చి తననేం చేస్తారో అనే ఆందోళనతో ఆమె ఆ మంటల్లోనే పడి సజీవంగా ప్రాణం తీసుకోవడానికి సిద్ధపడగా ప్రజలు అడ్డుకున్నారు. తను పోగు చేసుకున్న సంపదంతా తన కళ్ల ముందే కాలి, కూలుతుంటే ఆ దృశ్యాలను భరించలేక చివరకు ఆమె పిచ్చిదానిలా అడవిలోకి పరుగెత్తింది. ఎటు పోయిందో! ఏమవుతుందో! ఊరోళ్లకు దిక్కు తోచడం లేదు. అయితే పోలీసుల పనికి మాత్రం ఊరోల్లు పోమంటున్నారు' అంటూ ఫాగు అంతా పూసగుచ్చినట్టు చెప్పాడు.

'పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లిన ఊరి రైతును ఐదు వేల రూపాయల లంచం ఒప్పందంతో వదిలిపెట్టారు. నేను రాంగా ఆయన అప్పుడే ఇంటికి వచ్చిండు' అంటూ ఫాగు

అదనంగా జోడించాడు. రాజు తలూపాడు. దీర్ఘ శ్వాస తీసుకుని 'సరే' అన్నాడు. చేతి గడియారం చూడగా రాత్రి ఎనిమిది అవుతుంది.

బిబిసి హిందీ సర్వీస్‌లో 'ఇండియా బోల్' ప్రసారమౌతోంది. బాధ్యుడు శ్రద్ధగా వింటున్నాడు. 'మావోయిస్టులు సాధారణ ప్రజలను చంపుతున్నారు. ఆ నెపంపై కేంద్రం సైన్యం దింపే అవకాశం ఉందా' అనే అంశం పై రూపా ఝా ప్రోగ్రాం నడిపిస్తోంది. దంతెవాడలో మందుపాతర పేలుడులో పోలీసులతో పాటు ప్రయాణీకుల ప్రాణాలు పోవడం, ఝూర్‌గ్రాం (పశ్చిమ బెంగాల్) రైలు ప్రమాదంలో ప్రయాణీకుల ప్రాణాలు పోవడంపై రూపాతో బిబిసిలో ఎవరూ తమ అభిప్రాయాలు పెద్దగా పంచుకోవడం లేదు. ఎందుకంటే అప్పటికే దంతెవాడలో పొరపాటున జరిగిన బస్సు దుర్ఘటన ప్రమాదం పై మావోయిస్టులు క్షమాపణలు చెప్పి ఉండడం, ఝూర్‌గ్రాం రైలు దుర్ఘటనలో తమ హస్తం లేదని స్పష్టం చేయడం జరిగింది. దీనితో ఇద్దరు, ముగ్గురు తప్ప అందరూ దాదాపు ఒకే స్వరంగా మావోయిస్టుల విప్లవోద్యమ మూలాలు ఈ హంతక వ్యవస్థలోనే ఉన్నాయన్నారు. బిబిసి ఎంచుకున్న టాపిక్ దాదాపు అడ్రస్ లేకుండా పోయింది. వార్తల్లో మాత్రం ఆ రోజు చిదంబరం ఎప్పటిలాగే మరోసారి 'నక్సలైట్లు హింసను వదులుకోవాలి' అని వాగాడు. 'కజ్జాం లాంటివి ఎన్నెన్నో దండకారణ్య అడవుల్లో దాగున్నాయి, జనం గుండెల్లో లావాలు బద్దలవుతున్నాయి, ఖాకీల హింసోత్పాతానికీ, గ్రీన్‌హంట్ ఆగడాలకూ బలవుతున్న పల్లెలు అనేకం ఉంటున్నాయి, ఇంతకంటే మించిన హింస ఇంకేముంటుంది!' అంటూ రాజు వైపు చూస్తూ రేడియో కట్టేశాడు రాహీ దళ బాధ్యుడు.

## 6. బుధురాం

ఎండాకాలం. నీళ్ల కటకట తీవ్రంగా ఉంది. పచ్చని అడవులుగా భారత దేశ ప్రకృతి పటంలో స్థానమాక్రమించిన విశాల దండకారణ్యంలోనూ మార్చ్ నుంచీ జూన్ వరకూ నీడ కరువవుతుంది. ఈ సమయంలోనూ అడవిలో నీడనిచ్చే చెట్లంటే పూనుగు చెట్లే. పోతే మామిళ్లు. పూనుగు చెట్లు అరకొరగానే అడవిలో వుంటాయి. వేసవిలో ఈ చెట్ల నీడను ఖాకీలే ఆక్రమిస్తాయి. కాబట్టి అవి దళాల దేరాలకు నిషేధిత స్థలాలే అయ్యాయి. ఇక ఈ అడవిలో మామిళ్లు అరుదే అని చెప్పుకోవచ్చు. కాకపోతే ఊరి పొలిమేరల్లో, రైతుల పొలాల్లో, వాగు ఒడ్డున మేమున్నామంటాయి. అందుకే గడ్‌చిరోలిలో అన్ని దళాలూ ఎండాకాలం అంతా చద్దర్లతోనే నీడనిచ్చే గూళ్లు ఏర్పరుచుకుంటాయి. ఆ గూళ్లు అర్ధనగ్న ఆదివాసీలకు ఏ మాత్రం తీసిపోవు. రాహీ దళం కూడా అలాంటి గూడునే ఏర్పర్చుకుంది. కాకపోతే ఆ ఒక్క రోజు దేరాకు కూడల్ దొడ్డ (వాగు) ఆతిథ్యమిచ్చి కాపాడింది.

కూడల్ దొడ్డ అంచున తన దేరాలో ఉన్న రాహీ దళ బాధ్యుడు తనలో తాను నవ్వుకుంటుంటే 'బాతా కామ్రేడ్! కవ్వీనిన్?' (ఏంటి కామ్రేడ్! నవ్వుకుంటున్నారు?) అంటూ దళ కమాండర్ మోతీ నవ్వుతూ అడిగింది.

'ఈ దొడ్డ పేరు గుర్తొచ్చి నవ్వొస్తుంది మోతీ! కూడల్ దొడ్డ అంటే తెలుగులోనూ నగ్న

వాగే అవుతుంది. ఈ పేరు ఎలా వచ్చిందో ?' అంటూ ఆయన తన సందేహాన్ని ఆమెతో వెలిబుచ్చాడు.

'బారాయో' (తెలీదు) అనుకుంటూ మోతీ గుడ్డలు తీసుకుని అంజూని వెంటేసుకుని వాగుకేసి వెళ్లింది. అంతలోనే రుషి అందుకున్నాడు.

'ఆదివాసీలెవరైనా స్త్రీ, పురుషులు బరిబాతలనే స్నానాలు చేస్తారు కదా! వెనుకట ఎవరో దాదాలు నగ్నంగా స్నానాలు చేస్తున్నప్పుడు వరద వచ్చి వాళ్లను తన్నుకపోయిందట. దాంతో ఆ పేరు వచ్చింది' అంటూ చరిత్ర చెప్పుకొచ్చాడు.

రాహీ దళ బాధ్యుడు తన పక్కన పడి ఉన్న మరాఠీ పత్రికల్లోకి తల దూర్చాడు. గత నెల రోజుల పత్రికలు ఆయన పక్కన పడి ఉన్నాయి. అన్ని పత్రికల్లోనూ ప్రత్యేక విదర్భ వార్తలే పతాక శీర్షికల నిలిచాయి. దాదాపు గత వందేళ్లుగా ఈ డిమాండ్ నాన్తూనే ఉంది. క్రమక్రమంగా ఈ డిమాండ్ రాజకీయ అసంతృప్తి జీవులకే పరిమితమైంది. దశాబ్దాల ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కుతూ తమ పబ్బం గడుపుకోవడానికే ప్రత్యేక విదర్భను ముందుకు తెచ్చే రాజకీయులంటేనే ప్రజల్లో అసహ్యమేర్పడింది. కాకపోతే దేశవ్యాప్తంగా ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్ నెగళ్లను మరోసారి రాజేయడానికి తాజాగా ఉవ్వెత్తున లేస్తున్న ప్రత్యేక తెలంగాణ పోరుకేకలు తోడ్పడుతున్నాయని రాహీ దళ బాధ్యుడు చరిత్రను సమీక్షించుకుంటూ పత్రికలు తిరగేస్తుంటే జుగ్నూ కాల్చుకొచ్చిన మొక్క జొన్న కంకులతో ఆయన వద్దకు వచ్చాడు.

'అరె! అప్పుడే కంకులు రావడం, కాల్చడం, అందరికీ పంచడం అన్నీ అయిపోయాయే' నవ్వుతూ జుగ్నూ చేతిలోని కంకులను బాధ్యుడు అందుకున్నాడు. 'ఎవరిచ్చారు జుగ్నూ' జొన్న గింజలు ఒలుచుకుంటూ ప్రశ్నించాడు.

'డొల్తానా పేకల్' (మృతుని కొడుకు), అని చెప్పి అతను వాళ్ల తండ్రి ఫోటో అడుగుతున్నాడన్నాడు జుగ్నూ. 2008, నవంబర్ 14 నాడు కేంద్ర రిజర్వు బలగాలు కూరెనార్ వద్ద కాల్పులు జరిపి ఇద్దరు రైతులను పొట్టన పెట్టుకున్నాయి. ఆ రోజు ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికలు. ఆ పేరుతో వచ్చిన 'భద్రతా బలగాలు' ఓట్ల పెట్టెలతో తిరిగి వెళుతూ మందుపాతరను కవ్వించారు. ఫలితంగా ఒక జవాను మృత్యువాత పడక తప్పలేదు. పనికిరాని ఓట్లతో పనేముందని ఉదయాన్నే అడవికి వెళ్లిన కుటుంబాలు అడవినుంచి సాయంత్రం తమ భార్యా పిల్లలతో ఇంటికి తిరిగి వస్తున్నాయి. జవాను మృతితో రెచ్చిపోయిన సిఆర్‌పిఎఫ్ జవాన్లు ఆ ప్రజలపై కాల్పులు జరపడంతో ఒక రైతు అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. వారికసలు ఆ మందుపాతరతో ఎలాంటి సంబంధమూ లేదు. ఆయన చేసిన నేరమేమంటే ఓట్లలో పాల్గొనకపోవడమే. భారత ప్రజాస్వామ్యాన్ని నిలుపుతుందని పాలకవర్గాలు చెప్పుకునే ఓట్ల ప్రక్రియలో పాల్గొనకపోవడమే. ఆ తుపాకులస్వామ్యం వాళ్ల ప్రాణాలు తీసింది. చనిపోయిన ఆ రైతు కొడుకే మొక్కజొన్న కంకులతో దళం వద్దకు వచ్చాడు.

రాహీ దళ బాధ్యుడు జనతన సర్కార్ తొలి సంచికలో (మే, 2009) అచ్చయిన వాళ్ల తండ్రి ఫోటోను చూపిస్తూ జుగ్నూ చేతిలో పత్రిక పెట్టి, 'వీళ్లైతే వాళ్ల అమ్మను పంపించమను,

మాట్లాడి వెళ్దాం' అన్నాడు.

ఉద్యమ ఫలితంగా దోపిడీ అటవీ శాఖ నుంచి అడవి విముక్తమై జనం చేతికి వచ్చింది. జనతన సర్కార్లు ఏర్పడిన చోట అటవీ రక్షణ విభాగం ఉనికిలోకి వచ్చి అడవులను కాపాడుతున్నాయి. భూమి లేని వేలాది కుటుంబాలకు అటవీ భూములు దొరికి, వాళ్ల జీవితాల్లో రెండు పూటలా తిండికి హామీనిచ్చాయి. శరణార్థులుగా చేరిన బెంగాలీలు కూడా ఈ లబ్ధి పొందుతున్నారు. భూములు దొరికిన పేద బెంగాలీలంతా తామూ చారు మజుందార్ వారసులమే అన్నంతగా మురిసిపోతూ దళాలకు చెప్పుకుంటూ ఉంటారు. వారు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో సేద్యం చేస్తూ వేసంగి జొన్న వేయడంతో కూడల్ దొడ్డ అందాలే మారిపోయాయని అనుకుంటున్న రాహీ దళ బాధ్యుడి ఆలోచనలకు గాలి దుమారంలా పరుగులు బెడుతూ వస్తున్న రైతుల దండు బ్రేకు వేసింది.

రైతుల దండులో అన్ని వయస్సుల వాళ్లూ ఉన్నారు. పిల్లల చేతుల్లో గులేర్లున్నాయి. అందరూ ఒగురుస్తున్నారు. వాళ్లలో పెద్ద వాళ్లెవరికీ ఒంటి మీద చిన్న అడ్డుగా తువ్వాలు తప్ప ఇంకే గుడ్డా లేదు. వాళ్లంతా ఎందుకు పరుగు దీస్తున్నారబ్బా! అనుకొని ఆరా తీస్తే, వాళ్లు ఒక చిన్న పక్షిని తరుముకు వస్తున్నారు. ఇంత ఎండలో కూడా అది ఎంతో వినోద క్రీడగా ఉంది వాళ్లకు. ఆ పక్షి కుమ్మాంగోల్, ఎండకు తట్టుకోలేక వీళ్లకన్నా అధికంగా ఒగురుస్తూ ఓ చెట్టు నుంచి మరో చెట్టుకు అయాసంగా ఎగురుతూ అలసిపోయింది. దాన్ని ఏ చెట్టు కొమ్మ మీదా కాసేపు కూడా సేద తీర్చుకోనీయకుండా గుల్లేర్లతో కొడుతూ, అరుస్తూ, కేరింతలతో తరుముతూ ఆనందిస్తున్నారు. వాళ్ల ముఖాల పై ఆనందం, నవ్వులూ తప్ప ఏ అలసటా, ఆయాసమూ, గ్రీష్మ తాపం కానరావడమే లేదు. ఆ క్షణంలో రాహీ దళ బాధ్యుడికి 'రాలిపడిన పువ్వుల కై, గాయపడిన పిట్టల కై' అంటూ రాసిన తెలుగు కవి గుర్తొచ్చి తనలో తాను నవ్వుకుంటుంటే, 'వాళ్లను అడ్డుకోవేంటీ' అని అంజూ ఆయన్ని ఆటపట్టించింది.

తన దళ సభ్యులు ఇలాంటి చిన్న, చిన్న పక్షులనూ, పిల్ల జంతువులనూ సంబరంగా వేటాడితే నివారించడం రాహీ దళ బాధ్యుడికి అలవాటు. కానీ అదే క్షణంలో 'భిన్న సంస్కృతుల భావ ఘర్షణ ఇది' అని సమాధానపడడమూ ఆయనకు అలవాటే. అంజూ జోక్‌తో తనలాగే కోసాదా కూడా నివారించడం, సమాధానపడ్డం చేస్తుంటాడని గుర్తొచ్చాడు. మరో రెండు రోజుల్లో కోసాదా కలుస్తాడని గుర్తొచ్చి కనుబొమ్మలు ఎగరేసాడు.

* * *

కోసాదా పక్కనే ఆయన సహచరి రాధక్క 'పోరుమహిళ వందేళ్ల అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం ప్రత్యేక సంచిక' చదువుతూ కూచుంది. రాహీ దళం అక్కడకి చేరడంతోనే కోసాదా ఎదురొచ్చి ఆప్యాయంగా 'లాల్‌సలాం' అంటూ అందరికీ చేయి కలిపాడు. ఆయన వెనుకే రాధక్క, ఇతరులూ కలుపుతూ వచ్చారు. చేతులు కలపడాలూ, లాల్‌సలాం, పలకరింపులూ, నవ్వులూ...ఆ గుంపులో పరిచయం ఉన్న వాళ్లెవరూ? లేనివాళ్లెవరూ అంటూ అందరి కళ్లూ

అందరినీ పరిశీలిస్తూ ఎవరి సన్నిహితులతో వాళ్లు మాటల్లో ఉండగానే 'మీరు ఈ వైపు దేరా వేసుకోండి' అంటూ కోసాదా సెక్యూరిటీ దళం కమాండర్ నిర్మల చెప్పింది.

రాహీ దళం కిట్లు దించుకొని మోతీ వెంట నడువగా ఆమె ఎవరి ఫైరింగ్ ఆర్క్‌లు వాళ్లకు కవర్ సహా చూపింది.

'ఇప్పుడే వస్తా మోతీ' అంటూ రాహీ దళ బాధ్యుడు కోసాదా దేరా వైపు దారి తీశాడు. అయన వెంటే ఆయన గార్డులు కదిలారు.

కోసానీ, రాహీ దళ బాధ్యుడినీ చూస్తూ రాధక్క తనలో తానే నవ్వుకుంది. 'కలుసుకున్నారంటే మళ్లీ విడిపోయేవరకూ ఒక్క క్షణం కూడా విడిచి ఉండరు వీళ్లు, ఎంత మంచి గోతి (స్నేహం) వీళ్లది!' అనుకుంటూ వాళ్ల మూడు దశాబ్దాల సహచర్యాన్ని గుర్తు చేసుకుంది. 'రా అన్నా కూచో' అంటూ పాల్తీన్ పర్చింది.

కోసాదా ఎప్పటిలా హుషార్‌గా అగుపడడం లేదు. ఆయన బట్టతలను మధ్య మధ్యలో చేత్తో నిమురుకుంటూ దీర్ఘశ్వాస వదులుతున్నాడు. తాడు కట్టిన కళ్లజోడు మెడలో వేలాడుతోంది. ఓ పక్కన హిందీ, మరాఠీ, తెలుగు దిన పత్రికల్నీ, మరో వైపు ఉత్తరాల కుప్పనూ చూస్తుంటే దండకారణ్య పార్టీ కార్యదర్శిగా ఆయన వ్యస్థత చెప్పకనే అర్థమవుతోంది. 'ఏంటీ కోసాదా! ఈ రోజు అదోలా వున్నావు?' అంటూ రాహీ దళ బాధ్యుడు పాల్తీన్‌లో కూచున్నాడు.

'వయనార్ జ్ఞాపకాలు నన్నొదలడం లేదు రాహీ '

'ఏంటో, అంత వదలని జ్ఞాపకాలు!'

'నన్ను ఇప్పటికీ బుధురాం పిలుస్తున్నట్టే అన్పిస్తోంది'

'ఎవరాయన?'

'కేస్‌కల్ ఏరియా డివికెయంఎస్ అధ్యక్షుడు బుధురాం. ఆయన తూర్పు బస్తర్ డివికెయంఎస్ డివిజన్ కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు కూడా. ఆయనా మార్చ్‌లో కేస్‌కల్ నుంచి నా వెంటే వచ్చాడు. వచ్చే ముందు పార్టీ డివిజనల్ కమిటీ కార్యదర్శి కమలేష్ ఆయనతో విడిగా చాలా సేపు మాట్లాడాడు' అంటూ కాసేపు ఆగి మళ్లీ తనే కొనసాగించాడు.

'బుధురాంకు భార్యా, ముగ్గురు పిల్లలున్నారు. ఊళ్లో ఆయన మంచి పేరున్న ఆదివాసీ రైతు. ఊరి ప్రజల విశ్వాసం చూరగొన్నాడు. ఊరి వాళ్లే ఆయనను ప్రోత్సహించి డివికెయంఎస్ అధ్యక్షుడిగా నిలుపుకున్నారు.

ఆయన గతంలో సల్వాజుడుం ఘాతుకాల గురించి విన్నవాడే. సల్వాజుడుం గూండాలు వాళ్ల ఊరిపై దాడి చేయకపోయినా దండకారణ్యంలో, ముఖ్యంగా దంతెవాడ, బీజాపూర్‌లలో ఇండ్లు కాల్చడం, పంటలు తగులబెట్టడం, స్త్రీలపై అత్యాచారాలూ, సామూహిక హత్యలూ, లూటీలూ ఆయనకు తెలుసు. గ్రీన్‌హంట్ మొదలైనప్పటినుండీ మనిషిలో చాలా దిగులు పట్టుకుంది'

కోసాదా బీడీ బయటకు తీశాడు. మళ్లీ తనే 'కాల్చుకుంటే నాకు సమస్య, కాలిస్తే నీకు సమస్య, కాల్చనులే' అంటూ దానిని పక్కన పెట్టేశాడు.

'బుధురాం ను మధ్యలో ఆపావు' గుర్తు చేశాడు రాహీ.

'లేదు రాహీ, నీకు పూర్తిగా చెప్పాలి. నువ్వు ఆయన జీవితాన్ని తప్పక ప్రజలకు చెప్పాలి. నువ్వు రచయితవు కదా' అన్నాడు కోసా.

రాహీ ముసిగా నవ్వుతూ 'సరే' అని హామీ ఇచ్చాడు.

'గ్రీన్‌హంట్ షురువయ్యాక ఫిబ్రవరిలో ఓంగ్‌నార్‌లో ఐదుగురు గ్రామ యువతను పోలీసులు దారుణంగా చంపడం, అడవులూ, ఊళ్లూ విస్తృతంగా గాలించడం, రేషన్ షాపులను మూసివేయడం, పోలీస్ స్టేషన్లలోనే దుకాణాలను పెట్టడం చేశారు కదా. కార్డు తీసుకుని స్టేషన్‌కి వెళితే తప్ప ఏదీ దొరకని స్థితి. చీకటి పడిందంటేనే ఊరు బయట ఎవరు కనబడినా ఫైరింగ్ తప్పదనే చాటింపు, వాహనాల తనిఖీ, చాలా చోట్ల కొత్త పోలీసు క్యాంపులూ, స్టేషన్లూ తెరవడం సహా పోలీసులు కొనసాగిస్తున్న ప్రచార యుద్ధం ఆయన్ని చాలా పరేషాన్ చేసింది. పోలీసులు అరెస్టు చేసి, తీసుకెళ్లి పెడ్తున్న చిత్రహింసలు వినీ, వినీ మనిషి నాతో కూడా చాలాసార్లు 'నేనైతే వాటిని తట్టుకోలేను దాదా' అనేవాడు. నేనూ ధైర్యం చెప్పాను, కమలేషూ మాట్లాడాడు. అయినా మనిషిలో ఏదో కోల్పోయిన ఫీలింగ్ ఎప్పుడూ అగుపడేది రాహీ'

రాహీ ప్రతి ఒక్క మాటనూ ఇంకించుకుంటూ అలాగే తల వంచుకుని శ్రద్ధగా వింటున్నాడు. రాహీ దూరంనుండి నడుచుకుంటూ వచ్చాడు, తనకూ బుర్ర వేడెక్కుతోంది అని కోసాదా తన గార్డు మంగ్తూను కేకేశాడు.

'మంగ్తూ, మా ఇద్దరికీ కొద్దిగా చాయ్ దొరుకుతుందా'

మంగ్తూ చిరునవ్వుతో 'ఇంగో' అంటూ వెళ్లాడు. కోసాదా మళ్లీ బుధురాం జ్ఞాపకాల్లోకి వెళ్లాడు.

"ఆ రోజు మార్చ్ 5 అనుకుంటా. ఉదయం పది గంటలకు గజేన్ సెంట్రీకి వెళ్లాడు. కొద్ది సేపటికే సెంట్రీకి వెళ్లిన గజేన్ ఒక్క ఉదుటున నా వద్దకు ఉరికి వచ్చాడు. మనిషి చెమటలు కక్కుతున్నాడు. నోట మాట రావడం లేదు. బాతా, కోస్కా (ఏంటీ, పోలీసులా) అని అడిగాను. కాదు అంటూనే బుధురాం డొల్తోర్ అన్నాడు. ఆ మాటతో నేను అదిరిపడ్డాను. ఎక్కడ అనడంతో నన్ను గజేన్ సెంట్రీ వద్దకు తీసుకెళ్లాడు. చెట్టుకు బుధురాం శవం వేల్లాడుతోంది. ఫ్చ్, గ్రీన్‌హంట్ బుధురాంను బతుకనియ్యలేదు రాహీ' కోసాదా పెదవి విరిచాడు.

'బుధురాం వెత వింటుంటే ఒకప్పటి అహిరి పరికి నారాయణా, దామరంచ మల్లన్నా, ఇంకెందరో దిగులు గుండెల రైతులు గుర్తుకొస్తున్నారు కోసాదా. అందుకే మావో విప్లవం అత్యంత నిర్దాక్షిణ్యమైంది అన్నాడు. గ్రీన్‌హంట్‌ను గట్టిగా ప్రతిఘటిస్తూ అసువులు బాస్తున్న వాళ్లు ఎందరో కాగా, దాని దారుణాలకు తట్టుకోలేక బలవుతున్న వాళ్లు కొందరు' అంటూ రాహీ చేతి గడియారం చూసుకున్నాడు. సరిగ్గా పన్నెండవడంతో రేడియో ఆన్ చేశాడు. ఆకాశవాణి ఆంగ్లంలో వార్తలు మొదలుపెట్టింది. మొదటి వార్తే చిదంబరం మావోయిస్టులకు చేస్తున్న విజ్ఞప్తి – 'అబ్‌జూర్ వయొలెన్స్' అంటూ.

'ఇంతకన్నా క్రూరమైన పరిహాసం ఏముంటుంది' అనుకుంటూ రాహీ రేడియో బంద్

చేశాడు.

'నిజాయితీ గల ఆదివాసీ రైతు బుధురాం నిర్బంధ నిప్పుల కొలిమిని తట్టుకోలేక, ప్రజలకూ, విప్లవోద్యమానికీ ద్రోహం చేయలేనని, తనలో తాను మధనపడి మరో దారి లేదనుకొని ప్రాణాలు తీసుకుని ఏ హానీ తలపెట్టకుండా కన్ను మూశాడు. కానీ ఆయనను తయారు చేసిన పార్టీ నాయకుడు రాము ఇందుకు విరుద్ధంగా శత్రువు ముందు తలొంచాడు. ప్రాణ భీతితో వరంగల్లో శత్రువుకు లొంగిపోయి ఉద్యమానికి తీరని నష్టం చేశాడు. ఒకరు నిజాయితీకీ, మరొకరు ద్రోహానికీ ప్రతీకగా నిల్చారు, కదా రాహీ' అంటూ కోసదా నిట్టూర్చాడు.

## 7. ఇంద సాక్షిగా

మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు మధ్య దాదాపు 100 కి.మీ. పొడవునా ఇంద్రావతి నది సరిహద్దుగా నిలిచింది. దండకారణ్యంలో ఆ సరిహద్దు గ్రామాలలోని ఆదివాసీ ప్రజలు ఇంద్రావతి నదిని 'ఇంద' అని ముద్దుగా పిలుచుకుంటారు. విశాల ప్రాంతంలో నదికి ఇరువైపులా ఛత్తీస్‌గఢ్ గ్రామాలే ఉన్నాయి. ఈ విశాల అటవీ ప్రాంతాల్లో భైరాన్‌గఢ్ ఒకటి. భైరాన్‌గఢ్ ప్రాంతంలోని ఇంద్రావతి నదికీ, మాడ్ కొండలకూ మధ్య గల పోరాట ప్రాంతాన్ని ఇంద్రావతి ఏరియాగా వ్యవహరిస్తూ గత రెండు దశాబ్దాలుగా భా.క.పా. (మావోయిస్టు) విప్లవ కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ఇంద్రావతి ఏరియాకు భైరాన్‌గఢ్ నుండి పోలీసులు రావాలంటే ఇంద నది దాటి రావల్సిందే. అందుకే ఒడ్డు జనాలు ఎప్పుడూ ఇంద నిండుగా ఉంటే పోలీసులను అడ్డుకుంటుందని నమ్ముతుంటారు. పాములా బుస కొడుతూ నది పొంగుతుంటే మరీ సంతోషిస్తారు. కానీ వారి నమ్మకాలను మొదట సల్వాజుడుం, ఆ తర్వాత గ్రీన్‌హంట్ వమ్ము చేశాయి. ఇప్పుడు పోలీసులు వేసవి కాలమైనా, వర్షాకాలమైనా, శీతాకాలమైనా ఎప్పుడైనా రావచ్చని ప్రజలకు అర్థమైంది. సల్వాజుడుం చేసిన తొలి దాడులకు నష్టపోయిన వెడ్మా, దుంగా, రేకవాహి, నాయుంపార ఇంకా కొన్ని ఆదివాసీ గ్రామాలు ఇంద ఒడ్డు నుంచి కొండల్లోకి వెళ్లాయి. గ్రామస్తులు అక్కడే పిల్లాపాపలతో భయం-భయంగా కాలం వెళ్లబుచ్చుతున్నారు. అక్కడ పిల్లల కోసం జనతన సర్కార్ పాఠశాలలు తెరిచింది. ప్రజా మిలీషియా, పిఎల్‌జిఏ రక్షణలో తిరిగి కొండల్లోని గూళ్లకు రావడం గత ఐదేళ్లుగా అలవాటైంది. మహిళలు ఇప్పపూలు, గార (ఇప్పకాయ) ఏరుకోవడం కానీ, పాత ఊరి ముఖం చూసి రావడం గానీ అదే పద్ధతుల్లో జరుగుతోంది. ఇంద్రావతి ఏరియా జనాలు భైరాన్‌గఢ్ సంతకు వెళ్లాలంటే ఇంద దాటి వెళ్లాల్సిందే. కానీ వాళ్లు సల్వాజుడుం మొదలయ్యాక సంతకు వెళ్లడమే దాదాపు మానుకున్నారు. పొరపాటున వెళ్లినవాళ్లు తిరిగి ఇంటికి వస్తారన్న హామీ లేదు. ఎందరివో ప్రాణాలను తీసి సల్వాజుడుం గూండాలు శవాలను ఇందలోకి విసిరేశారు. నదీ ప్రవాహంలో కొట్టుకుపోయే ఆ శవాలు ఎక్కడ తేలుతాయో చూసి చెప్పేదెవరు? మరెందరినో ఆ గూండాలు సల్వాజుడుం చిత్రహింసల శిబిరాల్లోకి తరలించారు. నది దాటిన మహిళలు అత్యాచారాల పాలై ఇందకు బలవ్వడమో లేదా జుడుం శిబిరాలకు వెళ్లి దినమొక గండంగా బతుకులు ఈడ్వడమో తప్పదు.

ఈ దారుణాలన్నింటికీ ఇంద మౌనసాక్షిగా నిలిచింది.

అది ఫిబ్రవరి నెల కావడంతో ఇంకా పూర్తిగా చలి వదల్లేదు. రాత్రివేళ మంచు కురుస్తోంది. పైన ఏ కప్పూ లేకుండా అడవిలో చెట్ల కింద గెరిల్లాలూ, సర్కారీ జులుం పీడిత ప్రజలూ పడుకుంటే తెల్లారేసరికి వారు కప్పుకున్న దుప్పట్లు మంచుతో తడవడం ఖాయం. గెరిల్లాల తుపాకులూ నాన్తాయి. సల్వాజుడుం, గ్రీన్‌హంట్ దాడులు మొదలయ్యాక నెగళ్లు రాజేసి పడుకోవడం నిషేధం కావడంతో తెల్లవార్లూ వణుకుతూనే పక్కలో పొర్లాల్సిందే తప్ప తెలివిపడ్డా చేసేదేం ఉండదు. మరీ ముఖ్యంగా గెరిల్లా జీవితంలో తెల్లారే సమయంలో బ్యాటరీ లైటు వెలుతురులో చదువుకోవడమూ నిషేధమే. దీనితో రాహీ దళ బాధ్యుడు ఉదయాన్నే తెలివిపడినా లేవకుండా బ్లాంకెట్ ముసుగు తీయకుండానే పక్కపై దొర్లుతున్నాడు. రాత్రి క్లోరోక్విన్ మాత్రలు మింగి పడుకోవడంతో కడుపులో వికారంగా ఉంది. ఒంట్లోంచి జ్వరం ఇంకా పూర్తిగా జారలేదు.

ఉదయాన్నే ఐదున్నరకు కమాండర్ రెండుసార్లు చిన్నగా విజిల్ ఊదడంతో రాహీ దళ సభ్యులందరూ లేచారు. పదిహేను నిమిషాల్లో కాలకృత్యాలు తీర్చుకుని రెండవసారి కమాండర్ విజిల్ ఊదేసరికి అందరూ తయారుగా ఉన్నారు. విజిల్ ఊదడంతోనే కిట్లూ, తుపాకులూ భుజాలకు తగిలించుకుని ఎవరి వరుసల్లో వాళ్లు నడవసాగారు.

రాహీ దళం రేకవాహి చేరేసరికి ఉదయం తొమ్మిదవుతోంది. ఆ ఊర్లో జనతన సర్కార్ ఏర్పాటు చేసిన ప్రాథమిక పాఠశాల దగ్గర్లోనే రాహీ దళం డేరా వేసింది. జుడుం దాడులతో కొండల్లోకి జారుకున్న ఊళ్లల్లో ఇదొకటి. రోల్‌కాల్ ముగిసిన వెంటనే కిచెన్ డ్యూటీ వాళ్లు పొయ్యి అంటించి చాయ్ పెట్టారు. మిగతా సభ్యులు ఎవరి పనుల్లో వాళ్లుండగా కమాండర్ మోతీ ఊళ్లోకి ఇద్దరిని పంపింది. రాహీ దళ బాధ్యుడు చాయ్ కోసం ఎదురు చూస్తూ జిల్లీపై వాలాడు. ఆ పరిసరాల్లో పాటలు వినవస్తుండడంతో 'పాటలు పాడేదెక్కడ మోతీ' అని కోయలో అడిగాడు.

'బడి పిల్లలు పాడుతున్నట్టున్నారు. ఊళ్లోకి వెళ్లిన వాళ్లు వస్తే గానీ విషయం తెలియదు' అంది మోతీ.

'సరే, జావ తెమ్మన్నావా? కడుపులో గాబరవుతోంది' అన్నాడు.

మోతీ 'ఇంగో' అని జవాబిచ్చింది.

ఊళ్లో నుంచి రైతులూ, యువతీ యువకులూ అరగంటలో దళం వద్దకు చేరుకున్నారు. వాళ్లలోని ఒక యువతి తన తలపై నుంచి జావ గంజు దించి పొయ్యి దగ్గర పెట్టింది. దానితో పాటు నంజుకోవడానికి తెచ్చిన గళ్లుప్పు దొప్పను మరో యువతి జావ గంజు పక్కన పెట్టింది.

'మోతీ, బల్లే ప్రకాష్ గురూజీ పెళ్లవుతోంది. దళం అక్కడికే వస్తే బాగుంటుంది' అంటూ గ్రామ జనతన సర్కార్ అధ్యక్షుడు సన్ను కోరాడు.

'పెళ్లి పిల్ల ఎవరు?' మోతీ ప్రశ్న.

'గురూజీ రత్ని'

ఈ మాటలు విన్న రాహీ దళ బాధ్యుడు 'నేనైతే తప్పకుండా వస్తాను' అనడంతో

కమాండర్‌కు ఆయన అనుమతి కోరాల్సిన అవసరం లేకుండా పోయింది. చాయ్, జావ తాగాక దళం పెళ్లి వేడుక దగ్గరకు ఊరి జనాలతో కలిసి వెళ్లింది.

నేలపై పరిచిన జిల్లీ మీద ప్రకాష్, రత్ని ఒకరి పక్కన ఒకరు కూచున్నారు. వాళ్ల పక్కన జనతన సర్కార్ న్యాయ విభాగ అధిపతి మంగ్లో చేతిలో కాయితంతో నిలబడి వుంది. గ్రామస్తులు వాళ్లకు ఎదురుగా కూచున్నారు. బడి పిల్లలు హుషారుగా డాకాలు వేస్తూ ఆదివాసీ నృత్యంలో మునిగిపోయారు. కొద్ది దూరంలో తన చేతిలో పసికందుతో కూచున్న సుక్‌మతి ముఖంలో మాత్రం ఏ భావమూ వ్యక్తం కావడం లేదు. దళం అక్కడకి చేరుకోగానే పెళ్లి పిల్లా, పిల్లాడు సహా అందరూ పరుగున వచ్చి లాల్‌సలాం..సలాం..సలాం అంటూ చేతులు కలపసాగారు. అందరికన్నా ఆఖరున సుక్‌మతి చేయి కలిపింది.

సుక్‌మతి చేతిలోని పిల్లాడ్ని రాహీ దళ బాధ్యుడు తీసుకుని ముద్దుగా బుగ్గలు నిమురుతూ, 'నీ కొడుకు బాగున్నాడు కామ్రేడ్, ఈ హీరో పేరు ఏం పెట్టావ్?' అని ప్రశ్నించాడు.

'దివాకర్'

'బాగుంది' అంటూనే 'ఏయ్ దివాకర్, నీవు పెరిగి పెద్దవాడివై మీ బద్మాష్ నాయిన్ని తన్నాలి. వాడు పిరికివాడు. మీ అమ్మకు నమ్మకద్రోహం చేసి, ప్రజలకూ ద్రోహం చేసి శత్రువు ముందు లొంగిపోయాడు. నువ్వు మీ లడాయి తల్లి పాలు తాగుతున్నావు. నువ్వూ అమ్మలాగా ధైర్యంగా ఎదగాలి' అంటూ దివాకర్ బుగ్గలను ముద్దాడి, వాడిని తిరిగి తల్లి చేతికి ఇచ్చాడు.

పలకరింపులు అయిపోవడంతోనే పెండ్లి పెద్ద మంగ్లో 'ఇక నా కార్యక్రమం పూర్తి చేయనా' అంటూ సన్ను వైపు చూసింది. జనతన సర్కార్ ఉనికిలోకి వచ్చాక, న్యాయ విభాగం వారు పెళ్లి చేయడం అనే పద్ధతి మొదలైంది.

'ఇంగో' సన్ను జవాబు.

ప్రకాష్, రత్నిలు ఇద్దరూ నిలబడి పెళ్లి ప్రతిజ్ఞ చేశారు. మంగ్లో ఒక్కొక్క పదం చెప్తుండగా వాళ్లిద్దరూ ఆ పదాలు అంటూ ప్రతిజ్ఞ పూర్తి చేశారు. ఇష్టపడి పెళ్లి చేసుకుంటున్నామనీ, తమ మధ్య తలెత్తే సమస్యలు ఏవైనా పార్టీ కమిటీల ముందు పరిష్కరించుకుంటామనీ, తమ వికాసానికి పెళ్లి మరింత తోడ్పడాలనీ, చివరి వరకూ విప్లవ ఆశయ సాధనలోనే నిలిచి ఉంటామనీ ప్రతిజ్ఞ చేశారు. ఆ ప్రతిజ్ఞ వింటుంటే రాహీ దళ బాధ్యుడికి 1987 జనవరి 16 గుర్తొచ్చింది. ఆ రోజు తన పెళ్లికి సందర్భవశాత్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ కార్యదర్శి హాజరవడం, తన సన్నిహితులంతా పెళ్లి వేడుకలో పాల్గొనడం, తామూ ఆనాడు అలాంటి ప్రతిజ్ఞే చేయడం, తన పక్కన తన జీవిత సహచరి విమల రత్నిలాగే నించొని వుండడం అంతా కళ్ల ముందు తిరగసాగింది. అక్కడే దూరంగా నిల్చుని ఉన్న సుక్‌మతిని చూస్తుంటే పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి, గర్భవతిని చేసి చెప్పా పెట్టకుండా పారిపోయిన పిరికివాడి మూలంగా ఆమెకు ఇలాంటి వేడుక లేకుండా పోయింది కదా అన్న ఆలోచన ఆయన్ను విడవడం లేదు. ప్రతిజ్ఞ విన్న సంతోషంలో జనం చప్పట్లు కొట్టడంతో ఆయన ఈ లోకంలోకి వచ్చి అందరితో పాటు చప్పట్లు కొట్టాడు.

రాహీ జనతన సర్కార్ అధ్యక్షుడు సన్నును పిలిచి ఏరియా విషయాలు తెలుసుకుంటున్నాడు. గ్రీన్‌హంట్ ఆపరేషన్ మొదలయ్యాక పరిస్థితులు ఎలా ఉన్నాయని అడగడంతోనే సన్ను ముఖం గంభీరంగా మారిపోయింది.

'కామ్రేడ్, మన పార్టీ అంచనా వేసినట్టే ఉంది పరిస్థితి. సల్వాజుడుంకూ, గ్రీన్‌హంట్‌కూ జనం దృష్టిలో పెద్ద తేడా ఏం లేదు. సల్వాజుడుం గూండాలకూ, అది సృష్టించిన ఎస్పీవోలకూ గిర ఇంకా పెరిగింది. రైతులను చంపడం యింకా పెరిగింది. కాకపోతే ఇప్పుడు పోలీసులు చేసే ప్రతీకార హత్యలూ, హంతక ముఠాలు చేస్తున్న రహస్య హత్యలూ ముందుకు వస్తున్నాయి. ఈ మధ్య మన గెరిల్లాలు సంతలో దుర్మార్గ పోలీసు అధికారిని మట్టుబెట్టారు. దీనితో వెంటనే పోలీసులు రాత్రికి రాత్రే ఇందను దాటి వచ్చి ముగ్గురు రైతులను చంపారు. మావోయిస్టుల యాక్షన్ టీంను ఇంత వెంటనే ఖతం చేయడం ఇదే మొదటిసారి అని అబద్ధాలకోరు విశ్వరంజన్ వాగిన వాగుడును రేడియో కూసింది. ఇది గ్రీన్‌హంట్‌లోనే సాధ్యమైంది అని కూడా పత్రికల్లో రాయించాడు. నేను వెళ్లి ఆ రైతు కుటుంబాలను కలిసి వచ్చాను కామ్రేడ్. ఆ ముగ్గురు ఆదివాసీ రైతులూ చాలా పేదవాళ్లు. వాళ్ల మరణంతో ఆ కుటుంబాలకు దిక్కు లేకుండా పోయింది. నన్ను చూడగానే వాళ్ల పిల్లలు వచ్చి నా మీద బడి ఏడుస్తుంటే...' అని కోయలో చెప్పుతున్న సన్ను బుగ్గలపై కన్నీరు ధార కడుతోంది.

కాసేపు మౌనం చోటు చేసుకుంది. రాహీ దీర్ఘ శ్వాస వదిలి చేతి గడియారం చూసుకున్నాడు. సాయంత్రం ఏడు కావస్తోంది. పుష్యమాసం కావడంతో దట్టంగా చీకటి అలుముకుంది.

'రాజ్‌మన్ వచ్చేది వుంది సన్ను' అన్నాడు రాహీ.

'ఇప్పుడే ఉందా కామ్రేడ్ ఎపిటి?' అడిగాడు సన్ను.

'ఇంగో, ఇప్పుడు రాలేకపోతే రేపు ఉదయం తప్పక రావాలి' అన్నాడు రాహీ.

ఈ సంభాషణ జరుగుతుండగానే రాజ్‌మన్ దాదాపు 25 మంది గెరిల్లాలతో రానే వచ్చాడు. వాళ్లందరికీ గైడ్‌గా సంపత్ ముందు నడుస్తున్నాడని వాళ్లు ఒక్కొకరే వచ్చి చేతులు కలుపుతుంటే రాహీకి అర్థమైంది.

దక్షిణ బస్తర్ (దంతెవాడ జిల్లా), పశ్చిమ బస్తర్ (బీజాపూర్ జిల్లా), మాడ్ (నారాయణ్‌పూర్ జిల్లా)లలో బలమైన ప్రజా పునాది ఉండడంతో ప్రజలు గెరిల్లా జీవితం నుంచి వెనక్కి వచ్చినవాళ్లను తమ మధ్య 'భద్రం'గా కాపాడుకుంటున్నారు. అలాంటి వాళ్లలో సంపత్ ఒకడు.

చేతులు కలపడం పూర్తి కాగానే రాజ్‌మన్ పిడికిలెత్తి 'తాకిలోడ్ ప్రజా అమరవీరులకు జోహార్లు', 'అమరవీరుల ఆశయాలను తుదకంటా కొనసాగిద్దాం', 'ఫాసిస్టు గ్రీన్‌హంట్ దాడులను ఓడిద్దాం' అంటూ బిగ్గరగా నినదించాడు. అక్కడ ఉన్న వాళ్లంతా నినదించడంతో అడవులూ, కొండలూ ప్రతిధ్వనించాయి. రాజ్‌మన్ నినదించడం ఆగిపోయినా స్కూలు పిల్లలంతా తమకు తెలిసిన అమరులను పేరు పేరునా తల్చుకుంటూ నినదిస్తుంటే వాతావరణం ఉద్విగ్నంగా మారింది.

రాజ్‌మన్ నినాదాలతో రాహీకి ముందు రోజు సాయంకాలం రేడియో వార్తల వెనుకగల అసలు విషయం అర్థమైపోయింది. శత్రువు గ్రామాలపై దాడులు చేస్తూ ,పేద ఆదివాసీ రైతాంగాన్ని విచక్షణారహితంగా కాల్చి చంపుతూ, వాళ్లపై మావోయిస్టులంటూ ముద్ర వేస్తున్నాడు. ఈ 15 రోజుల్లోనే ఈ ఏరియాలో జరిగిన రెండవ హత్యాకాండ ఇది. వారం రోజుల క్రితం తాకిలోడ్ పరిసరాల్లోని కోడ్కా గ్రామంపై దాడి చేసిన పోలీసులు ముగ్గురు రైతులను హత్య చేసి మావోయిస్టుల యాక్షన్ టీంను మట్టుబెట్టామన్నారు. ఇప్పుడు మరో ఏడుగురు రైతులను హత్య చేశారు. 'ఫాసిస్టు గ్రీన్‌హంట్‌కు ప్రజలూ, పిఎల్‌జిఎ గెరిల్లాలూ తప్పకుండా బుద్ధి చెపుతారు, దానిని ఓడించి తీరుతారు' మనసులోనే అనుకుంటూ రాహీ రాజ్‌మన్ వద్దకు వచ్చాడు.

'తాకిలోడ్ వివరాలు తెలుసుకుని రావడంతో మాకు కొంత ఆలస్యమైంది కామ్రేడ్' అంటూ రాజమన్ అనడం పూర్తి కాక ముందే రాహీ గద్గద స్వరంతో 'ఈ విషాదం ఎలా జరిగింది కామ్రేడ్?' అని ఆతృతగా అడిగాడు.

రాజ్‌మన్ కళ్లల్లో ఒక్కసారిగా తాకిలోడ్ ఊరు మెదిలింది. ఇంద్రావతి ఉద్యమంలో దృఢంగా నిలిచిన గ్రామాల్లో తాకిలోడ్ ఒకటి. ఆ ఊరు ఆ పరిసరాల్లోనే కాస్త పెద్దూరు. ఆ ఊళ్లో నిర్మించిన అమరులు కామ్రేడ్స్ శ్యాం, మహేశ్, మురళిల 25 అడుగుల సిమెంట్ స్థూపం ఊరికి వచ్చేవాళ్లందరినీ ఆహ్వానిస్తూ వుంటుంది. సల్వాజుడుం తొలినాళ్లలో (2006 జనవరి) ఆ స్థూపాన్ని కూల్చడానికీ, ఆ ఊరును కాల్చడానికీ వచ్చిన ఫాసిస్టు ఖాకీ మూకలకు ఇల్లిల్లూ మందుపాతరై జవాబిచ్చింది. ఖంగు తిన్న పోలీసులు ఈనాటి వరకూ ఆ స్థూపాన్ని కూల్చలేకపోయారు. ఆ ఊరును కాల్చలేకపోయారు. ఆ ఊరు రాములాంటి యువకులనూ, ఇందిర లాంటి యువతులనూ, సోమాల్ లాంటి పిల్లలనూ ఎందరినో ఉద్యమానికి అంకితం చేసింది. మరెందరో మెరికల్లాంటి యువతీ యువకులు రమేశ్, రతన్, సిలుక్, ఐతేలు ఆశయ సాధనలో అసువులు బాసి తాకిలోడ్ అనే నాలుగు అక్షరాలను దండకారణ్య ఉద్యమ చరిత్రలో నెత్తురుతో రాసి దానికి అమర స్థానాన్ని కల్పించారు. ఆ ఊరు శత్రువును ఎప్పుడూ నిద్రపోనివ్వదు. ఆ ఊరు శత్రువుకు ఒక సవాలుగా నిలిచింది. అందుకే వాడు దానిపై పదే పదే దాడులకు దిగుతున్నాడు. తాకిలోడ్ వీర జనాలను మట్టుబెట్టాలని వాడు రోజూ కలలు కంటుంటాడు. నేటి భారీ బూటకపు ఎన్‌కౌంటర్‌తో వాడు తన కలలకు ఈ రోజు ఒక రూపం ఇవ్వగలిగాడు – ఇదంతా చరిత్ర పుటల్లోంచి తవ్వి గుర్తు చేసుకుంటున్న రాజ్‌మన్ కళ్లు వర్షిస్తున్నాయి. ఆ చరిత్ర నిర్మాతల్లో తానొకడు కావడం వల్ల ఆయన బాధ అధికంగానే వున్నది. ఆ ఊరంతా ఆయనను ఒక కొడుకుగా, ఒక అన్నగా, ఒక గురువుగా, ఒక ఆప్తుడిగా అన్నింటికన్నా మించి ఒక కామ్రేడ్‌గా చూసుకుంటుంది. ఆ వూరితో ఆయననకు గల పుష్కరకాల అనుబంధం ఆయనెన్నటికీ మరిచిపోలేడు.

వర్షిస్తున్న రాజ్‌మన్ కళ్లల్లో బాధ్యుడు ఖాకీల గ్రీన్‌హంట్ ఉత్పాతాన్ని స్పష్టంగానే చూడగల్గుతున్నాడు. తమకు పిఎల్‌జిఎ అండగా వుందనీ, ఊరవతల ప్రజా మిలీషియా

సాయుధంగా కాపలా ఉందనీ పూర్తి విశ్వాసంతో ఆదమరచి నిద్రిస్తున్న తాకిలోడ్ ఊరు మీద కోడేళ్ల మందలా ఖాకీలు పడ్డారు. ఆ మందకు ముందు ఎస్పీవో రాములున్నాడు. రాములు అగుపడగానే రాహీకి వాడు జనతన సర్కార్ స్కూల్లో టీచర్‌గా పని చేసి ద్రోహిగా మారాడనీ, వాడు దొంగదారుల్లో మందను తెచ్చి ఊరి మీద పడ్డాడనీ సులభంగానే బోధపడింది.

ఊరి మీద పడ్డ మంద ఇళ్లల్లోనుంచి జనాలను ఈడ్చుకొచ్చి స్థూపం ముందు పోగేసింది. స్త్రీలూ, పురుషులూ, పిల్లలూ, ముసలోళ్లూ అందరూ పోలీసుల్నీ, ఎస్పీవోల్నీ తిడుతున్నారు, ఏడుస్తున్నారు, గుంజులాడుతున్నారు. కానీ వారి శక్తి ఆ మంద ముందు సరిపోవడం లేదు. ఆ మంద ఏడుగురిని బంధించింది. ఆ ఏడుగురూ ఊళ్లో ప్రజా పోరాటానికీ, జనతన సర్కార్‌కూ ప్రాణంలాంటి వాళ్లని చెబుతూ రాములు ఒక్కొక్కరినీ వేలెత్తి చూపుతున్నాడు. వారిలో 35 ఏండ్ల బార్స మోటు, 23 ఏండ్ల కల్మం అనంతరాం, ముప్పై ఏళ్ల వేకో అనంతరాం, ఏముల జైరాం, ఆశారాంలతో పాటు నవ యువకులు, నిండా రెండు పదులు దాటని కల్మామి, రాము, మురామి రాజులు కూడా ఉన్నారు.

వర్షిస్తున్న కళ్లల్లో బార్స మోటును చూడగానే రాహీకి ఆయన భార్య, ఐదుగురు పిల్లలు అగుపడ్డారు. పిల్లల్లో రెన్నెల్ల పసిగుడ్డును చూసి రాహీ గుండెలవిసిపోయాయి. ఆ పసిగుడ్డు తన తండ్రినీ, గ్రీన్‌హంట్ ఉత్పాతాన్నీ చూస్తోంది. నేను పెద్దయ్యాక తప్పక బదులు తీర్చుకుంటానంటూనేమో ఆ గుడ్డు పిడికిళ్లు బిగుసుకుంటున్నాయి. ఆ దృశ్యం పక్కనే వేకో అనంతరాంను చూసిన రాహీ కళ్లు ధారలు కడుతున్నాయి. అనంతరాంను చూడగానే ఆయితే గుర్తొచ్చిన రాహీకి 2007 స్మృతిపథంలో మెదిలింది. సల్వాజుడుం గూండాలు సిలుకను పట్టుకొని ముక్కలు ముక్కలుగా నరికారు. ఆ వీరనారి స్మృతులతో జీవిస్తున్న అనంతరాంను ఈ రోజు గ్రీన్‌హంట్ హంతకులు హతమార్చుడం చూసిన రాహీ బిగబట్టిన పెదవుల నుంచి ఉబికి వస్తున్న దు:ఖం. తాకిలోడ్ ఆకాశ వీధుల్లో ఆ అమర జంట చిరస్థాయిగా నిలిచి పోతుందని ఆయన అనుకుంటుండగానే మోటు కూతురు ఏడుపు విన్నాడాయన. ఆ చిన్నారి 'మా నాన్న ఏం నేరం చేశాడు? ఆయనకు డ్రెస్సు తొడుగుతున్నారెందుకు? మా నాన్నను చంపొద్దు' అంటూ రోదిస్తోంది. ఆ బిడ్డ ఏడుపు ఖాకీల కరకు గుండెలను కదిలించలేకపోతోంది కానీ మోటు మాత్రం ధైర్యంగా బిడ్డను ఓదారుస్తున్నాడు. పక్కనే జైరాం-ఆశారాంలు అతుక్కుపోయిన దృశ్యం రాహీ కంటపడింది. ఆ అన్నదమ్ములిద్దరూ 'మనం విడిపోకుండానే చనిపోదాం' అంటున్నారు. ఆ మాటల్లోని ఆర్ద్రత మానవీయ సంబంధాలనూ, ఆత్మీయాను బంధాలనూ అర్థం చేసుకున్న మానవత్వమున్న మనుషులను కదిలిస్తుందే కానీ నల్ల సరపు బండలాంటి మెదళ్లను తాకవని రాహీకి తెలియంది కాదు. ఖాకీలు ఆ చివరి కోర్కెనైనా మన్నించేలా లేరని పేలుతున్న తూటాల కర్కశ చప్పుళ్లు జవాబునిస్తున్నాయి. రాహీ కళ్లు మూసుకున్నాడు.

స్కూలు పరిసరాల్లోని వాతావరణమంతా బరువెక్కింది. చుట్టూ నిల్చిన ఎత్తైన కొండలు 'తాకిలోడ్ త్యాగాలు మాకన్నా ఉన్నతమైనవ'ని కీర్తిస్తూ తమ శిఖరాల్ని వాల్చినట్టుగా

అవుపడుతున్నాయి. ఆదివాసీలను గ్రీన్‌హంట్ సంపూర్ణంగా హతమారుస్తుందేమోనన్న బాధతో అడవంతా మౌనం దాల్చినట్టుంది. స్వచ్ఛమైన ఇంద నీరు గత ఐదేళ్లుగా ఎర్రగా పారుతోంది. సుక్‌మతి చేతుల్లోంచి తప్పుకొని వచ్చిన పసికందు దివాకర్ రాహీ బుగ్గలు నిమురుతూ కన్నీళ్లు తుడుస్తుండగా కళ్లు తెరిచిన రాహీకి స్కూలు పిల్లలంతా రాజ్‌మన్ చుట్టూ చేరి పిడికిళ్లు బిగించడం అగుపడింది. ఇన్ని దుర్మార్గాలు చేస్తూ ఈ చిన్నారుల హృదయాలనూ, మెదళ్లనూ గెలుచుకోవడం అంకుల్ చిదం కాదు కదా వాడి అబ్బ అంకుల్ శామ్ తరం కూడా కాదనుకుంటూ రాహీ దివాకర్‌ను సుక్‌మతికి అందించాడు. రాహీ దళం కిట్లు వేసుకొని కదిలింది.

## 8. వార్తావాహిని

ప్రభాత్ పత్రిక రాహీ దళ బాధ్యుడికి చేరింది. 2010 జనవరి జూన్ సంచిక అది. కానీ అది అక్టోబర్ మధ్యలో వెలువడింది. తొలి కాపీ తన చేతికి అందడంతో రాహీ దళ బాధ్యుడు ఒక్కొక్క పేజీ తిరగేస్తున్నాడు. గ్రీన్‌హంట్ ఫాసిస్టు దాడులు, పిఎల్‌జిఎ గెరిల్లాల అపూర్వ విజయాలు, విజయాల వెనుక ఉన్న గొప్ప త్యాగాల రిపోర్టులతో పత్రిక విప్లవ స్ఫూర్తిని నింపుతోంది. కానీ తిరగేసిన ప్రతి పేజీలో 'చైతే' కనబడుతూ పలకరిస్తూనే ఉంది. ఆయన్ని చైతే జ్ఞాపకాలు వదలడం లేదు. దండకారణ్య పార్టీ కార్యదర్శి ఇచ్చిన ఉపన్యాసం కూడా చైతే జ్ఞాపకాల మధ్యనే పదే పదే ప్రతిధ్వనిస్తోంది. "మన విప్లవ మహిళలు అబలలు కారు. మీరు గొప్ప ధైర్య సాహసాలు ప్రదర్శించాలి. ఏ పురుషుడు కూడా మీ కళ్లల్లోకి చూసే సాహసం చేయనంతగా మీ చూపులు ఉరమాలి. మీ సరసన చేరడానికి ఏ మగాడికి ధైర్యం సరిపోనంతగా మీ వేష భాష వ్యక్తం కావాలి. మీరు చైతే నుంచి నేర్చుకోవాలి. ఆమె అమరత్వం మీలో శత్రువు పట్ల కసినీ, కోపాన్నీ నింపాలి. ఆమె ప్రజల కోసం నమ్మిన ఆశయాల కోసం తన ప్రాణాలను త్యాగం చేసింది" అంటూ పార్టీ 6వ పుట్టిన రోజు సందర్భంగా కార్యదర్శి చెప్పిన విషయాలు చెవుల్లో మోగుతూనే ఉన్నాయి. ప్రభాత్‌ను పక్కన పెట్టిన రాహీ దళ బాధ్యుడు తదేకంగా శూన్యంలోకి చూస్తూ కూచున్నాడు.

ఆకాశంలో మబ్బులు ముసురుకుంటున్నాయి. పొద్దు గూకిన వేళ కావడంతో దట్టంగా అల్లుకున్న మబ్బులు మసక చీకట్లను ఇంకా మందపరిచాయి. చూస్తుండగానే అడవి అంతా చీకట్లు కమ్మాయి. కారు చీకట్లు కమ్మిన నల్లని మేఘాలు ఎంతో భారంగా తయారయ్యాయి. ఉరుములు–మెరుపులతో ఆకాశం అంతా అల్లకల్లోలంగా తయారైంది. చెవులు చిల్లులు పడేలా ఉరుములూ, కళ్లు మిరిమిట్లు గొలిపేలా మెరుపులూ రావడంతో దళం అంతా టెంట్ సదరడంలో మునిగిపోయారు. ఎవరి సామానులు వాళ్లు ఎవరి పక్క (పడుకునే పాల్తీన్) వాళ్లు తడవకుండా ముందే సర్దేసుకున్నారు. డాక్టర్ కరుణ మాత్రం కమల పక్కనే కూచోని సెలైన్‌ను చూస్తోంది. నెల రోజులుగా కమల సెలైన్‌ల మీదనే బతుకుతోంది. కరుణకు తెలిసిన వైద్యం అంతా అయిపోయింది. కమల జ్వరం మాత్రం తగ్గడం లేదు. వదలడం లేదు. కరుణ ఐదు వరకే

పల్లెటూరు చదువు చదివినా వైద్యం మాత్రం శ్రద్ధతో నేర్చుకుంది.

మోతీ అప్పుడే క్లాసురూం నుంచి డేరాకు వచ్చింది. ఆ వెనుకే విక్కీ, రుషీ వచ్చారు. ఎవరి నోటుబుక్కులు వాళ్లు కిట్ల పక్కన పడేసి కాళ్లు, చేతులు కడుక్కుని టీ తాగడానికి కిచెన్ వైపు వెళ్లగా మోతీ మాత్రం బాధ్యుడి వద్దకు చేరింది. 'చాయ్ తాగారా' అంటూ నవ్వుతూ కోయలో అడగడంతో 'లేదు' అని అడ్డంగా తలూపాడు. మోతీకి చాయ్ తాగే అలవాటు లేకపోయినా బాధ్యునికి మాత్రం టైం ప్రకారం అందించడం మర్చిపోదు.

'మొత్తానికి వర్షం పడ్డట్టే చేసి అదరగొట్టింది. చల్లగాలి హాయిగా ఉంది. ఉరుములు, మెరుపులతో శ్యాందాదా మమ్మల్ని అరగంట ముందే క్లాసు ఒదిలాడు'

'ఈ రోజు రాత్రికి శ్యాం ఏం ప్రశ్నలు ఇచ్చారు మోతీ?'

'ఉత్పత్తి శక్తుల అభివృద్ధితో మానవుల శ్రమశక్తి దోపిడీ పెరిగిందా, తగ్గిందా? ఇదీ ఈ రోజు మా చర్చ'

'గుడ్, బాగుంది ప్రశ్న. జవాబు ఆలోచించావా మరి?'

'లేదు, ఇక్కడ తెలుసుకుని వెళ్లాలి నేనిప్పుడు'

'నో నో నో, అది నడవదు. నువ్వే చెప్పాలి అక్కడ. ఇక్కడ విని అక్కడ చెప్పితే లాభం లేదు మోతీ' అంటూ ప్రేమగా నవ్వుతూ బాధ్యుడు అంటుండగానే విక్కీ చాయ్ తాగి కిచెన్ నుంచి వచ్చాడు.

'శ్యాం గురూజీ' రాహీ దళం అన్నిట్లో ఫస్ట్ అంటాడు. ఇప్పుడు మీరు చెప్పకుంటే మన దళం పేరు వెనక్కు పోతుంది, మీకే సమస్య' అంటూ విక్కీ చేతులు తిప్పుతూ బంతి బాధ్యుడి కోర్టులోకి విసిరాడు. ఈలోగా 'అలే! దట్' (వెళ్దాం, పదండి) అంటూ రుషి రానే వచ్చాడు.

'రుషీ, మన నర్సింగ్‌దా చూపుడు వేలు తెగిపోయింది ఎలా? గుర్తుందా కామ్రేడ్?' అంటూ రాహీ దళ బాధ్యుడు ఒక కొత్త విషయాన్ని ప్రారంభించాడు. ఇప్పుడు ఈ విషయం ఎందుకు గుర్తొచ్చిందో అనుకుంటూ మోతీ ఈ రోజు జవాబు చెప్పేలా లేదు అని డీలా పడిపోయి 'పదండి టైం అవుతుంది' అంటూ లేచింది.

'కూచోండి! ప్రశ్న వేసి పోవడం బాగుండదు కదా!' బాధ్యుడు.

వాళ్లు ముగ్గురూ ఒకరి ముఖాలు మరొకరు చూసుకుంటున్నారు. అందరి కనుబొమ్మలు ముడిపడ్డాయి. 'వాళ్ల ప్రశ్నకూ, నర్సింగ్‌దా వేలుకూ సంబంధం ఏమిటి?' ఇది అర్థం కావడం లేదు. ఈ లోగా రుషి 'ఆఫ్‌సెట్ తినేసింది' అన్నాడు.

'వేలును ఆఫ్‌సెట్ తినడం ఏంటి?' విక్కీ అమాయకంగా అడిగితే మోతీ 'ఆకలైందేమో పాపం' అనడంతో అందరూ గొల్లున నవ్వారు.

'ఆకలి కాదు మోతీ, ముందు మన ప్రెస్ పని స్క్రీన్‌ప్రింట్‌తో హాయిగా నడిచేది. స్క్రీన్ బాగులేదని ప్రకాశ్ మాష్టారు బేబీ ఆఫ్‌సెట్ సిఫారస్ చేశాడు. ఇంకేం మన గౌతం, టుగ్గెలు ఎగిరి గంతేశారు. అమరుడు శ్యాం 'డికె వాళ్లడిగింది ఏదైనా చేర్చాల్సిందే' అనే కామ్రేడ్ గావడంతో మిషన్, మిషన్‌తో పాటు నేర్పే మనుషులూ రెండు నెలల్లో వచ్చారు. వాళ్లు నేర్పేది

నేర్పారు. కానీ మనం అంతా ఆదివాసులం కదా! మన స్పీడ్ తక్కువ. దాని స్పీడ్‌ను నర్సింగ్‌దా అందుకోలేకపోయాడు. 'పేపర్‌తో పాటు వేలునూ ఫీడ్ చేశాడు' అంటూ రుషి గుక్క తిప్పుకోకుండా చెప్పి నవ్వుతూ వాచీ చూసుకుని, 'రెండు నిమిషాలు దాటింది, పదండి' అన్నాడు.

'నేనే గెలిచాను, ఆఫ్‌సెట్‌కు ఆకలేసింది. నర్సింగ్‌దా వేలును ఫీడ్ చేశాడు. మా ప్రశ్నకూ, నర్సింగ్‌దా వేలుకూ ఇదన్న మాట లింకు. శ్రమ తీవ్రత పెరిగింది. దోపిడీ తీవ్రత పెరిగింది. రాహీ దళం ఫస్ట్, దాయినోం (వెళ్తున్నాం)' అంటూ ముగ్గురూ కలిసి క్లాసురూం వైపు నడిచారు.

బుద్ధిజీవి విక్కీ చేతులు తిప్పుకుంటూ, వేళ్ళు లెక్కిస్తూ తనలో తానే గొణుగుతూ 'చేతిరాత, స్క్రీన్‌ప్రింట్, బేబీ ఆఫ్‌సెట్, భారీ ఆఫ్‌సెట్ ఇదీ యంత్రాల వికాస క్రమం. ఇదే ఉత్పత్తి శక్తుల అభివృద్ధి. మనిషి యంత్రమైనాడు, మనిషి సరుకు అయ్యాడు, మనిషి అమ్ముడుపోయాడు, మానవ సంబంధాలు మృగ్యమయ్యాయి' అనుకుంటూ క్లాసురూంకు చేరాడు. వెనుకనుంచి రాహీ దళ బాధ్యుడు 'ఈ రోజు మోడర్న్ టైమ్స్ చార్లీ చాప్లిన్ సినిమా చూడండి' అంటూ అరవడం మాత్రం ముగ్గురూ విన్నారు.

రుషి చెప్పిన ఆఫ్‌సెట్ చరిత్రను తిరిగి గుర్తు చేసుకుంటున్న రాహీ దళ బాధ్యుడికి మళ్లీ చైతే గుర్తొచ్చింది.

'చైతే అసలు పేరు లలిత. ఆదివాసుల్లో ఇలాంటి లలిత, కోమల, సౌమ్య, రమ, లతలు ఉండరు. కానీ లలిత పుట్టి పెరిగిన ప్రాంతంలో హిందూ మత ప్రభావం, బెంగాలీల వలస, పెరిగిన మార్కెట్ సంబంధాలు, కొత్త సంస్కృతిని పరిచయం చేస్తున్న ఫలితమే ఈ కొత్త పేర్ల మోజు. వీటికి తోడు ఆ ప్రాంతానికి విప్లవోద్యమం విస్తరించాకే లలిత తరం పుట్టింది. లలితకు ఇరువై ఏళ్లు నిండక ముందే విప్లవోద్యమంతో పరిచయమైంది. బస్తర్‌లోని దక్షిణ ప్రాంతం నుంచి ఉత్తరానికి విస్తరించిన విప్లవోద్యమానికి కోయిలబేడ ప్రాంతం మంచి బలమైన ప్రాంతంగా ముందుకొచ్చింది. దీనికి పడమరన అప్పటికే బలమైన గడ్‌చిరోలి ఉద్యమం ఉండడం కూడా తోడ్పడింది' అనుకుంటూ గతాన్ని పొరలు పొరలుగా గుర్తు చేసుకుంటున్న రాహీ దళ బాధ్యుడి జ్ఞాపకాలు 2003లో ప్రెస్‌లో జ్యోతి పేరుతో ఒక టీనేజ్ కామ్రేడ్ పరిచయం గావడం దగ్గర ఆగాయి.

అందరాదివాసీ అమ్మాయిల్లాగే జ్యోతీ చదువుకోలేదు. మనిషి కురచగా, బొద్దుగా ఉండి చురుగ్గా ఉంది. మధ్యతరగతి కుటుంబం తాలూకు తెలివితేటలు ఆమెలో చూడగానే వ్యక్తమవుతున్నాయి. ఈ తరంపై విప్లవోద్యమ ప్రభావం గాఢంగా ఉందనడానికి జ్యోతి దేహభాషే సాక్ష్యంగా ఉంది. ప్రెస్ యూనిట్ వాళ్లకు పార్టీ ప్లీనం సమీక్ష చెప్పడానికి వెళ్లిన రాహీ దళ బాధ్యుడు జ్యోతిని చూడగానే 'ఇక్కడికి ఎప్పుడు వచ్చావు' అంటూ పలకరించాడు.

'ఈ మధ్యే' ముక్తసరిగా జవాబు.

'ఇంటి దగ్గర ఉన్నపుడు వూళ్లో కెఎయంఎస్‌లో ఉన్నావా?' బాధ్యుడి మరో ప్రశ్న.

'ఇంగో' కనుబొమ్మలు ఎగరేస్తూ మరీ టూకీగా జవాబు.

'క్లాసులో కూచుంటావా?'

'పున్నేన్' (తెలీదు)

'నీకు పార్టీ సభ్యత్వం ఉందా?'

జ్యోతి మౌనం దాల్చింది. అది బహిరంగంగా అడగకూడదు అనేది ఆమె మౌనానికి అర్థం కాబోలు అని రాహీ అనుకుంటుండగానే ప్రెస్ యూనిట్ కమాండర్ భీమన్న 'కాదు' అని జవాబు ఇచ్చాడు.

'జ్యోతి పేరు బాగుంది, ఎవరు పెట్టారు?' అంటూనే 'మీ ఊళ్లో నీ గోటుల్ పేరు ఏంటి?' అని జోడించాడు.

ఒకసారి అటూ, ఇటూ చూసి అక్కడ కమాండర్ భీమన్న మినహా ఇంక సభ్యులు ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక జ్యోతి తన గోటుల్ పేరు 'లలిత' అంది నెమ్మదిగా. పార్టీలోకి వచ్చాక సొంత పేరూ, ఊరూ బాధ్యులకు తప్ప మరొకరికి చెప్పకూడదనే నియమం తెల్సిన జ్యోతి ఆ గోప్యాన్ని బాధ్యుడికే చెప్పింది.

ఆదివాసుల్లో తమ తల్లిదండ్రులు పెట్టిన పేర్లు పిల్లలు కొంత పెరిగే వరకే ఉంచుకుంటారు. బుద్ధెరిగిన పిల్లలు తమ పేరు మార్చుకునే సంప్రదాయం కొన్ని చోట్ల బలంగానే ఉంది. ఆ రెండవ పేరు తమ ఇష్టమైంది పెట్టుకుంటారు. ఇకపై వాళ్లను వాళ్ల గోటుల్ మిత్రబృందం అంతా ఆ మార్చుకున్న పేరుతోనే పిలుస్తారు. ఇంట్లో మాత్రం మొదటి పేరే ఉంటుంది. ఆ పేరు మార్పుకు ఏ కోర్టూ, ఏ సర్టిఫికెట్లు, ఇంకే ఖర్చులూ ఉండకుండా హాయిగా ఉంటుంది అని ఆదివాసీ రీతి–రివాజులను ప్రత్యేక దృష్టితో అధ్యయనం చేస్తూ చర్చించే సహ కామ్రేడ్స్ మాటలు నెమరు వేసుకుంటుండగానే జ్యోతి తన పేరు అడగడంతో రాహీ దళ బాధ్యుడు ముసి ముసిగా నవ్వుతూ 'నాకు చాలా పేర్లున్నాయి. నీకు ఏ పేరు చెప్పాలి? సరే, ఇక్కడ అందరూ టుగ్గె అంటున్నారు, నువ్వూ అలాగే పిలువు' అంటూ చెప్పిన విషయం రాహీ దళ బాధ్యుడికి ఇప్పటికీ బలంగానే గుర్తుంది. ఆయన జ్ఞాపకాలు అలా పొరలు పొరలుగా చరిత్ర పుటలు తిరగేస్తూ సాగుతుండగా వినపడిన లాంగ్ విజిల్‌తో రాహీ దళ బాధ్యుడు తన చేతి గడియారం చూసుకున్నాడు. సరిగ్గా రాత్రి ఎనిమిది అవుతోంది. 'ఛ్! బిబిసి టైం దాటిపోయింది. కాశ్మీర్‌లో ఈ మధ్య తీవ్రమైన ప్రజా ఆందోళనపై మన పార్టీ ప్రకటన రావల్సి ఉండే, ఏమైందో!' అనుకుంటుండగానే క్లాసురూం నుంచి మోతీ బ్యాచ్ రానే వచ్చింది. అదే సమయానికి కిచెన్ నుంచి కరుణ రెండు పళ్లేల్లో భోజనం తీసుకొని వచ్చి ఒక పళ్లెం బాధ్యుడి వద్ద పెట్టి మరొకటి పేషెంట్ వద్దకు తీసుకెళ్లింది. కమల తినదని తెలిసినా రోజూ బుక్కో, అరబుక్కో తినిపించే ప్రయత్నం మాత్రం కరుణ మానుకోవడం లేదు.

భోజనాలు పూర్తయ్యాక ఎవరి పనుల్లోకి వాళ్లు జారుకున్నారు. సెంట్రీ వెళ్లాల్సిన గగన్ వెళ్లి డేరాకు కొద్ది దూరంలో ఉన్న పెద్ద చెట్టు కవర్‌లో నిలబడి పహరా చేస్తున్నాడు. 'తమ బాధ్యుడు ఉన్న టెంట్ వైపు రాత్రివేళ అనుమతి లేనివాళ్లనెవరినీ రానీయకూడదని' ఉదయాన్నే క్యాంపు బాధ్యుడు సుధాకర్ చెప్పిన మాటలు గగన్‌కు పదే పదే గుర్తొస్తున్నాయి. గ్రీన్‌హంట్ మొదలయ్యాక ఇన్ఫార్మర్ల, కోవర్టుల సమస్య పెరిగిందనీ సుధాకర్ చెప్పిన విషయం మనసులోకి

రాగానే గగన్ తన తుపాకిని అలర్ట్ పొజిషన్‌లోకి తీసుకుని దేరా వైపు చూశాడు. బాధ్యుని మీద దృష్టి నిలిపాడు. 'ఆయన్ని కాపాడే బాధ్యత నాది' అనుకుంటూ మరింత ధృఢంగా చెట్టుకు కరుచుకుని గగన్ నిలబడ్డాడు.

'నిద్ర రావడం లేదా రుషీ' అంటూ బిబిసి కోసం రేడియో స్టేషన్ కలుపుతూ రాహీ అడగడంతో రుషి 'ఈ రోజు క్లాసులో విన్నది ఓసారి చూసుకుంటున్నాను కామ్రేడ్' అంటూ కోయలో జవాబు ఇచ్చారు.

'క్లాసు పూర్తిగా అర్థమవుతుందా రుషీ'

'చాలావరకు అర్థమవుతోంది, కాకపోతే కోయలో లేని పదాలు హిందీలో చెప్పేసరికి అవి గుర్తుండడం లేదు. ఇంగ్లీషు పదాలైతే మరీ కష్టంగా ఉంది' అని రుషి క్లాసులో ఎదురవుతున్న భాష సమస్యను ముందుంచాడు.

'ఆ రెండు భాషలకన్నా తెలుగు పదాలు మీకు కొంత సులువుగా బోధపడతాయేమో! రేపు శ్యాం గురూజీని అడగాలి' అంటున్న బాధ్యుడి మాట ముగియక ముందే పక్కలోనుంచే విక్కీ 'నహీ, నహీ, హిందీ హీ హోనా హై' అంటూ ముసుగు తన్నాడు.

'ఎందుకు కామ్రేడ్? నీవు మరాఠీలో చదువుకున్నావుగా, మరాఠీ వద్దా' నవ్వుతూ బాధ్యుడు మళ్లీ రుషి వైపు చూస్తూ 'నిద్రొస్తుందా?' అంటూ సంభాషణను పొడిగించాడు.

'లేదు కామ్రేడ్! గగన్ తర్వాత నాదే సెంట్రీ. కాసేపు ఒరుగుదామని. అంతే. ఏమైనా పని ఉందా?' అంటూ రుషి బాధ్యుని అవసరాలు కనుక్కున్నాడు.

'ఆ, కాసేపు మాట్లాడుదామని ఉంది. ఉదయాన్నే అంటే మళ్లీ ఎవరి కాలసారిని వారిదే కదా, ముఖ్యంగా నీకు క్లాసుంది కదా' రుషి సంసిద్ధతను తెలుసుకుంటూ.

రుషి లేచి టెంట్ బయట నెగడు పక్కన వెదురుతో వేసి ఉన్న బడ్డీ (బెంచీ) వైపుకు నడిచాడు. రాహీ చిన్న శాలువా కప్పుకుని పక్క నుంచి లేచి రుషి వెనుకే నడిచాడు. రుషి నిప్పుకర్రలు దగ్గరకి చేర్చి ఊదడంతో చిన్నగా మంట మండడంతో నక్షత్రాల మసక వెలుతురుకు మంట తోడై ఒకరి ముఖం మరొకరికి స్పష్టంగానే ఆ చీకట్లో అగుపడుతోంది. బడ్డీ వద్దకు కామ్రేడ్స్ రావడం గమనించిన సెంట్రీ కొంత దూరంగా వెళ్లి మరో చెట్టు దగ్గర కవర్ చూసుకొని నిలుచున్నాడు.

రుషి బక్కపలుచగా ఐదున్నర అడుగుల ఎత్తు ఉంటాడు. ఆయన చిరునవ్వు ఆయన కోలముఖానికి మరింత అందాన్ని ఇస్తోంది. చక్కని పలువరుసతో మనిషి ముసిముసిగా నవ్వుతూ మాట్లాడుతుంటే గారపట్టిన ఆయన పళ్లు చిన్నప్పటి నుంచి తనలోని పౌష్టికాహార లోపాన్ని తెలుపుతుంటాయి. ఇంటి వద్ద రుషి చదువుకోలేదు. చిన్నతనంలోనే విప్లవపార్టీ రాజకీయాలతో ఉత్సాహం చెంది దళంలోకి వచ్చాడు. ఆయన చురుకుతనాన్ని, క్రమశిక్షణను, నిజాయితీని అర్థం చేసుకున్న పార్టీ ఆయనను ప్రెస్‌లోకి పంపింది. ఆయన స్థానిక కామ్రేడ్ కావడంతో పరిసరాలపై మంచి పట్టు ఉండడం, ప్రజలతో సత్సంబంధాలు కలిగిన కుటుంబ నేపథ్యం గావడం కూడా ఆయన ప్రెస్‌లోకి వెళ్లే అర్హతలకు బోనస్ పాయింట్లయ్యాయి.

'చైతేను కాపాడుకోలేకపోయాం కామ్రేడ్. కుమిలీ హత్య తర్వాత మీరు అనేక జాగ్రత్తలు పాటిస్తూ వచ్చారు. కానీ దోపిడీ ప్రభుత్వ హంతక ముఠాలు మీ ఇంట్లోకే చొరబడి మన చైతేను హతమార్చి వెళ్లాయి. ఇంత దారుణంగా ఎలా జరిగి ఉంటుంది రుషీ' ఆత్మవిమర్శనా పూర్వకంగా అంటూ రాహీ నెగడు కర్రలు సదరసాగాడు.

వినీలాకాశం వైపు చూస్తున్న రుషి ముఖం బాధ్యుడికి స్పష్టంగానే అగుపడుతోంది. అయన చెంపల పైకి జారిన కన్నీటి ధారలు ఆయన మనసులోని బాధను వ్యక్తం చేస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం చైతే ఆయన జీవిత భాగస్వామిని కావడం ఆ కన్నీటి ధారల వెనుక దాగిన జ్ఞాపకాలను రాహీకి గుర్తు చేస్తున్నాయి.

'ప్రెస్‌లో దాదాపు గత 3-4 మాసాల నుంచి పని పెద్దగా నడవడం లేదు. మేమూ టిసిఓసిలో భాగమై ఏప్రిల్ నుంచి జూలై వరకు గ్రీన్‌హంట్ దాడుల ప్రతిఘటన చర్యల్లో భాగమయ్యాం. వర్షాలు మొదలయ్యాక దేరా వెతికి పనుల్లోకి దిగాం. ఇంకా మా బాధ్యుడు వచ్చి మాకు కలిసి సమావేశం వేసి పనులు అప్పగించనే లేదు. ఈ దారుణం జరిగిపోయింది' అంటూ రుషి అగస్టు 17 జ్ఞాపకాల్లోకి వెళ్లాడు.

తన కళ్ల ముందే అర్ధనగ్నంగా తన సహచరి శవం పడి ఉంది. హంతకుల మృగప్రాయమైన కామవాంఛకు ఆమె దేహం హూనమై హృదయవిదారకంగా అక్కడ పడి ఉంది. నరబలికి సంకేతంగా ఆమె గొంతుక సగం వరకు తెగి ఉంది. తమ 'దేవతలకు' నైవేద్యంగా దొప్పల్లో రక్తం పట్టారో లేదో కానీ నెత్తుటి రుచి మరిగిన ఆ హంతకులు చైతే పైంటు విప్పుకొని తాము జరిపిన హత్యకు సాక్ష్యంగా చూపడానికి పోలీసు అధికారుల వద్దకు తీసుకెళ్లినట్టున్నారు. కళ్లు మూసుకుని ఉన్నాయి. జుట్టంతా చెదిరిపోయి బురద-బురదగా ఉంది. ఆమెను కాపాడలేకపోయిన ఆమె .303 తుపాకీ ఆమెను హంతకులు పట్టుకున్న జాగాలో తన తప్పేమీ లేదన్నట్టు పడి వుంది. తూటాలు మౌనంగా నిండుగా వున్నాయి. ఈ జ్ఞాపకాలన్నీ నెగడు మంటల వెలుతురులో బాధ్యునితో పంచుకున్న రుషి 'ఊరివాళ్ల ద్రోహాన్ని చైతే పసిగట్టలేకపోయింది. రోజూ కలిసే దాదాలే కదా అని అమాయకంగా నమ్మింది. ఆమె తన రైఫిల్‌ని పక్కన పెట్టి స్నానానికి దిగుతుండగా దాదాలు పిలిచి నోరు మూసి కొద్దిదూరం బలవంతంగా ఎత్తుకెళ్లి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు' అంటూ రుషి ఆగాడు.

రుషి తన జ్ఞాపకాల్ని పంచుకుంటున్నంత సేపూ బాధ్యుని కళ్లల్లో చైతే కదలాడసాగింది. ఆమె జ్యోతి నుంచి చైతేగా పేరు మార్చుకోవడం, ఆమె ప్రెస్‌లో ఆఫ్‌సెట్ మిషన్ ముందు కూచోని పేపర్ ఫీడ్ చేయడం, అచ్చయిన కాయితాలను ఆమె నెంబర్లవారీగా సదిరి పత్రిక, పుస్తక రూపాల్లో ఇవ్వడం, కట్టింగ్ బ్లేడ్, స్కేల్ పట్టుకొని కాగితాలను సమానంగా కట్ చేసి అందంగా తయారు చేసి పిన్ వేయడం, లెటర్ ప్యాడ్‌లు తయారు చేయడం, అవసరమైనప్పుడు పెద్ద, పెద్ద పోస్టర్లను స్క్రీన్‌ప్రింట్‌పై తీస్తుండడం, తన డ్యూటీ నాడు గుర్రాలను తీసుకొని అడవంతా తన పసినాటి గొడ్లగాసిన జ్ఞాపకాలతో తిరుగుతూ వాటిని మేపుకొని రావడం, కిచెన్ డ్యూటీ రోజు ఉన్నవాటితోనే శుభ్రంగా, రుచికరంగా వంట చేసి పొదుపుగా వడ్డన

చేయడం, పనులు ముగియగానే తన చదువులో తాను నిమగ్నం కావడం మొదలైన ఆమె దినచర్యలన్నీ పదే పదే గుర్తొస్తున్నాయి. ఆమె తన బాధ్యతగా పత్రికలు-పుస్తకాలు పెద్ద-పెద్ద బండిల్స్‌గా సదురుకొని వాటిని గుర్రాలపై వేసి అవి జారకుండా గట్టిగా కట్లు కట్టి తన టీంను వెంటేసుకొని టైం ప్రకారం అపాయింట్‌మెంట్లకు వెళ్లి వాటిని చేరవేసిన ఆ 'వార్తావాహిని చైతే నిజంగా ఇక మనకు లేదే' అని తన కళ్ల ముందు కదులాడుతున్న దృశ్యాలతో సంభాషిస్తున్నట్టుగానే రుషి జ్ఞాపకాల్లో భాగమైన బాధ్యుడు చివరి మాటలను పైకే అనేశాడు.

ఒక ఆదివాసీ కుటుంబంలో పుట్టిన లలిత విప్లవ జ్యోతిగా మారి వార్తావాహిని చైతేగా బాధ్యతలు నిర్వహించి దాదాపు ఆరు-ఏడేళ్లు పార్టీ ప్రెస్‌కు తన విప్లవ జీవితాన్ని నిస్వార్థంగా అంకితం చేసిన చైతే, ప్రెస్సుకు ఏ బాధ్యులు వెళ్లినా ప్రేమగా, ఆప్యాయంగా చూసుకునేది. వారితో తన భావాలు పంచుకునేది. వాళ్ల నుంచి అనేక సమాచారాలు అడిగి తెలుసుకునేది. ఒక సాధారణ ఆదివాసీ రైతు కుటుంబంలో పుట్టిన ఆమె విప్లవ కార్మికవర్గ పుత్రికగా, ఏరియా కమిటీ స్థాయి కలిగిన పార్టీ కార్యకర్తగా ఎదిగింది. అలాంటి చైతేను ద్రోహంగా చంపిన హంతకులెవరై ఉంటారని బాధ్యుడు రుషిని అడిగేలోపు సెంట్రీలో ఉన్న గగన్ తమ వైపు రావడం రుషి గమనించాడు. 'వెళ్తా'నంటూ రుషి లేస్తుండగా దూరం నుంచే చూసిన గగన్ వారించాడు. 'మీరు మాట్లాడుకోవచ్చు, వేరేవాళ్లను డ్యూటీకి లేపుతాను' అంటూ గగన్ టెంట్ వైపు నడిచాడు.

'సరే!' అంటూ రుషి హంతకుల పేర్లు వరుసగా చెప్పాడు. 'కేశబైరల్ (కుతుల్), దల్లు (పర్సవేడ), దుర్గా, కోత్వాల్, బండు (కోహ్కమెట్ట) – వీళ్లు పోగా మనం ఆధారపడ్డ గ్రామాల్లో నుంచి మొడ్డాల్, కొరియా, చుక్కు (పోదంగోట్టి), కోసా (ఊసేవాడ)లు ఉన్నారు. స్థానికులందరూ మన ప్రజా నిర్మాణాల్లో ఉన్నవారే. కొరియా పార్టీ సభ్యుడు కూడా. కానీ వీళ్లను కుతుల్ కేశబైరల్ కుదురు సంబంధాలతో చేరదీసి డబ్బుల ఆశ చూపి లోబర్చుకున్నాడు. కేశబైరల్ ఇలాంటి రహస్య హంతక ముఠాలకు నాయకత్వం వహిస్తున్నాడు' అంటూ రుషి తనకు తెల్సిన సమాచారం బాధ్యుని ముందుంచాడు.

'కేశబైరల్‌కు సహకరించిన స్థానికుల కుటుంబాలు విప్లవోద్యమంచేత గతంలో శిక్షలకు గురయ్యాయనుకుంటా!' బాధ్యుడు సందేహంగా అడగడంతో రుషి 'కొన్ని కుటుంబాలు' అంటూ జవాబు ఇచ్చాడు.

'కట్ట సంబంధం కన్నా, కామ్రేడ్ అనుబంధాలు మిన్న అనే వర్గ చైతన్యం పెరగనపుడు మనుషులు పరిసరాల ప్రభావాలకూ, డబ్బు కక్కుర్తికీ, బంధు ప్రీతికీ ఇంకా రకరకాల ప్రలోభాలకూ లోనై ద్రోహానికి తలపడడం కొత్తేమీ కాదు. పైగా వాళ్లు ఏ నిర్మాణాల్లో ఉన్నా ప్రతీకార భావనతో ఉన్నంతకాలం వారితో ప్రమాదం ఉంటూనే ఉంటుంది. వారిపై ప్రజల నిఘా, ప్రజల సగటు చైతన్యం పెరగకుండా ఇలాంటి అరిష్టాలను మనం నివారించుకోలేం కామ్రేడ్. చరిత్రలో పెద్ద, పెద్ద రాజ్యాలే తల కిందులయ్యాయి. పసికందుల్లాంటి మన ప్రజారాజ్య కమిటీలు వీటన్నింటినీ అర్థం చేసుకొని, తట్టుకొని కాపాడబడి విస్తరించాలంటే అనేక రంగాల్లో ఇంకా

ఎంతగానో మనం రాజకీయ కృషి చేయాల్సి ఉంటుంది. భౌతిక శిక్షలు ఎప్పుడూ పూర్తి పరిష్కారం కావు. ఇవి నిప్పులపై నీళ్ళు చల్లినట్టుగా తాత్కాలికంగానే కొంత ఉపకరిస్తాయి. వీటి నెగటివ్ ఫలితాలు తీవ్రంగానే ఉంటాయి' అంటూ బాధ్యుడు స్థానిక ద్రోహులపై వ్యాఖ్యానించాడు.

ఆయన మాటలు పూర్తి కాగానే రుషి ఆ తర్వాతి పరిణామాలను క్లుప్తంగా చెప్పసాగాడు. "చైతే హత్యలో కేశబైరని హంతక ముఠాకు తోడ్పడిన స్థానిక వ్యక్తులు తెల్లారే బయటపడ్డారు. కానీ అప్పటికే వాళ్ళు కేశబైరన్ని సురక్షితంగా అడవి దాటించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చైతే అంత్యక్రియల్లో పెద్దెత్తున పాల్గొన్నారు. వాళ్ళు చైతేకు కన్నీటి వీడ్కోలు చెప్పారు. వారంతా ద్రోహులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వాళ్లే ద్రోహులను అనేక రకాలుగా ప్రశ్నించారు. అంతిమంగా ప్రజలు వారికి మృత్యుదండన విధించారు. వారికి సహకరించిన మరో 6–7 గురి పేర్లు వెలుగులోకి వచ్చాయి కానీ వారు ప్రజల ముందు నిజాయితీగా తమ తప్పు ఒప్పుకోవడంతో జనం వారిని హెచ్చరించి వదిలారు" అంటూ రుషి లేచాడు.

'సరే! వెళ్లి పడుకో కామ్రేడ్' అంటూ బాధ్యుడు డబ్బాలో నీళ్ళు మగ్గులోకి వంచుకొని తాగి బడ్డీపై ఒంటరిగానే కూచున్నాడు. ప్చ్! హత్యలకు హత్యలే శాశ్వత పరిష్కారం మాత్రం కాదు. కుమిలి హత్య తర్వాత వెంటనే దొరికిన హంతకుల్లో ఇద్దరిని చంపివేశారు. ఆ తర్వాత ఇంద్రావతిలో ఇలాగే మొడ్డాల్‌ను హతమార్చిన వాళ్లను తీసేశారు. ఇప్పుడు చైతేను చంపినవాళ్లలో నల్గురు చచ్చారు. కానీ అసలు కేశబైరాల్ బతికే ఉన్నాడు. మరతుపాకులు వాళ్లను పూర్తిగా మట్టుబెట్టలేవు. మనలనీ రక్షించలేవు. యుద్ధంలో వాటి పాత్ర వాటికి ఉన్నప్పటికీ మనుషులే నిర్ణయాత్మకం. అందుకే ఆ రోజు కార్యదర్శి తన ఉపన్యాసంలో 'కేశబైరల్ లోపలికి రావడానికి అసలు దారి ఎలా దొరికింది? ఆ ముఠాకు అన్ని రోజులు తిండి ఎలా దొరికింది? మన సమాచారం ఆ ముఠాకు అందుతూంది కానీ వాళ్ల సమాచారం మన జనం నుంచి మనకు చేరలేదే! లోపం ఎక్కడుంది? మన విప్లవ ప్రజాసంఘాలు, మన ప్రజా మిలీషియా, మన జనతన సర్కార్లు ఎక్కడ అప్రమత్తతను కోల్పోయాయి? వీటిని మనం పరిశీలించాలి. వర్గపోరాటాన్ని నీరుగార్చడానికి శత్రువు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడతాడు. కానీ, మనం ప్రజల రాజకీయ చైతన్యాన్నీ, వారి అప్రమత్తతనూ పెంచాలి' అంటూ యావత్తు పార్టీని కార్యదర్శి అలర్ట్ చేయడం బాధ్యునికి పదే పదే గుర్తుకొస్తున్నాయి. 'రహస్య హంతక ముఠాలను మట్టుబెడదాం, గ్రీన్‌హంట్ ఉత్పాతాలను ఓడిద్దాం, ప్రజా నిర్మాణాలను, ప్రజలను జాగృతం చేద్దాం, కంటికి రెప్పలా పార్టీని కాపాడుకుందాం, జనతన సర్కార్లకే సర్వాధికారాలు' అంటూ ఆయన వేదికపై నుంచే నినదిస్తుంటే అక్కడ చేరిన కంఠాలన్నీ ప్రతిధ్వనిస్తున్నాయి. పదే పదే గుర్తొస్తున్న ఆ దృశ్యాల మధ్యనే బాధ్యుడు తలూపుకుంటూ చీకట్లో తన డేరాకు నడిచాడు. ఆయనకు నిద్ర రావడం లేదు. పక్కపై దొర్లుతున్నాడు. సెంట్రీలు తమ విధులను తాము పూర్తి చేస్తున్నారు.

తన డ్యూటీ ప్రకారం క్యాంపులోని కోడి అందరినీ తన కూతతో ఎప్పటిలాగే లేపుతుంటే

బాధ్యుడు కూడా కళ్లు నులుముకుంటూ లేచి నిప్పు వైపు నడిచాడు. నెగడు మంటలు నూతన ఉషోదయానికి స్వాగతం పలుకుతుంటే బడ్డీపై కూచున్న బాధ్యుడు చూపులు విముక్క (తెల్లారేవేళ పొడిచే నక్షత్రం) పైనే నిలిచాయి. అందులోనూ ఆయన ప్రభాత్ పత్రిక పట్టుకున్న వార్తావాహిని చైతేనే చూస్తున్నట్టున్నాడు. ఒక ఆదివాసీ అమ్మాయి తాను అక్షరాస్యురాలు కాకపోయినా అందరినీ చదివించే, సమాజాన్ని సంస్కరించే గురుతరమైన బాధ్యతలు కొనసాగిస్తూ శత్రువుకు టార్గెట్ అయి తారల్లో సితారగా, చిరస్మరణీయురాలుగా మారడాన్ని ఆయన మరువలేకపోతున్నాడు. విముక్క కనుమరుగై లేలేత కిరణాల ప్రభాత భాస్కరుడు నూతన ఉషోదయానికి సంకేతంగా వెలుగులు ప్రసరిస్తున్నాడు. బాధ్యుడు మెల్లగా బడ్డీపై నుంచి లేచి పొద్దుపొడుపు వైపు అడుగులు వేస్తూ గ్రౌండుకు చేరేసరికి అనేకమంది గెరిల్లా నవ యువతీ యువకులు మిలట్రీ డ్రిల్స్‌లో మునిగిపోయి ఉన్నారు. వారంతా ఆయనకు చైతేలాగే అగుపడుతున్నారు. వారి వైపు చిరునవ్వుతో చూస్తూ "చైతేకు మరణం లేదు" అని తనలో తాను ఎన్నిసార్లు అనుకుంటూ ఉండిపోయాడో..... వారంతా ఆయనకు వార్తావాహిని చైతేకు ప్రతిబింబాల్లాగే కనపడసాగారు.

## 9. తల్లిపేగు

కుండపోతగా వర్షం కురుస్తోంది. అన్ని వాగులు, వంకలూ పొంగి పొరలుతున్నాయి. ఇంద్రావతి, గోదావరి నదులు ప్రమాద సూచికలను ఎగురవేసినట్టు రేడియో వార్తల్లో పదే పదే హెచ్చరిస్తున్నారు. నదులతో, వరదలతోఎవరికీ ఎటూ ప్రయాణాలకు దారి దొరకడం లేదు. వాగులు, నదులు అడ్డు తగలని దారులు ఎన్నుకొని ప్రయాణం చేసేవాళ్లు మాత్రం చేస్తున్నారు. ఇలాంటి వారిలో రాహీ దళం ఒకటి. ముందే పెట్టుకున్న అపాయింట్‌మెంట్ ప్రకారం కన్నెమర్క చేరాల్సి ఉంది. అక్కడ రాహీ దళం కోసం మైనక్క ఎదురు చూస్తూ ఉంటుందనే గాబరాతో కమాండర్ మోతీ రెండు గంటలుగా దళాన్ని నడిపిస్తోంది. దళంలో సగం మందికి ఛత్రీలు ఉంటే, సగం మంది పాలీన్ కవర్లు కప్పుకొని నడుస్తున్నారు. ఆ జోరు వర్షానికి ఛత్రీల వాళ్లు మూడొంతులు తడిచారు కానీ పాలీన్ కప్పుకున్న వాళ్లు ఏ మాత్రం తడవకుండా హాయిగా నడుస్తున్నారు. ముందు నడుస్తున్న పైలెట్లు కుడిమేర దొడ్డ (వాగు) దగ్గర ఆగిపోయారు. ఒకరి వెనుక ఒకరు అందరూ వాగు వద్దకు చేరారు. అప్పటికి వర్షం జోరు తగ్గింది. వాగు వరద జోరు మాత్రం పెరిగింది. చిన్న చిన్న కాలువల్లోని నీరు, వంకల్లోని నీరు వేగంగా వచ్చి కలుస్తూ వాగు వరద తీవ్రతను పెంచుతున్నాయి.

'వాగు దాటడం కష్టమేమో దీదీ' విక్కి మెల్లగా తన అభిప్రాయాన్ని జారవిడిచాడు.

'స్పీడ్ బాగుంది' దళంలో అందరికన్నా చిన్నవాడు వికాస్ ఈతరాని విక్కీ మాటకు తన మాట కలిపాడు.

మోతీ నీటి ప్రవాహవేగాన్ని చూస్తూ నిల్చుంది. వర్షం దాదాపు పూర్తిగా తగ్గుదలకు వచ్చింది. మోతీ జిల్లీ కప్పుకుని ఉండడంతో తడవలేదు. దళంలో ఇద్దరు, ముగ్గురు తప్ప అందరూ ఈదగలవారే. మోతీ ఈదుతుంది. అయితే తాము ఆగిన చోట ప్రవాహవేగం ఎక్కువగా

ఉండడంతో నీరు నిలవగా ఉండే మడుగు కోసం మోతీ అటూ ఇటూ చూస్తూ 'కామ్రేడ్ రాందేర్' అంది.

దళంలో రాందేర్ మంచి ఈతగాడు. గోదావరి నది ఒడ్డున వాళ్ల ఊరు ఉండడంతో ఎంతటి ప్రవాహంలోనైనా డోంగా (కఱ్ఱతో తయారు చేసిన చిన్న ఓడ) కూడా నడిపే అనుభవం ఉంది. మనిషి పొడవుగా ఉండి దృఢంగా ఉంటాడు. ఆయన తల్లి పార్టీ సభ్యురాలు. జనతన సర్కార్ ఆర్థిక శాఖ కమిటీలో సభ్యురాలు. తండ్రి పార్టీ సభ్యుడు కాకపోయినప్పటికీ జనతన సర్కార్ అటవీ శాఖ కమిటీలో సభ్యుడు. వాళ్ల కుటుంబం నమ్మకమైంది కావడంతో రాందేర్‌ను అక్కడి పార్టీ ఎంపిక చేసి రాహీ దళానికి పంపింది. ఆయనకు గగన్, మేఘనాథ్ తోడు ఉన్నారంటే నిమిషాల్లో టెంట్ కూడా తయారవుతుంది. ఎంతటి ప్రవాహవేగంలోనైనా ఆ టీం వాళ్ల దళాన్ని సురక్షితంగా దాటిస్తారనే నమ్మకం మోతీకి ఉంది. అందుకే ఆమె రాందేర్ అనడంతో రాందేర్‌తో పాటు గగన్, మేఘనాథ్‌లు కూడా టెంట్‌తో వచ్చి నిలిచారు.

'మనం వెళ్లాలి. ఎపిటి ఉంది. వాగు దాటడం కుదురుతుందా కామ్రేడ్స్' అంటూ మోతీ వాళ్ల వైపు చూస్తూ అడిగింది.

'ఈ వాగు ఎంత దీదీ, వెళ్లచ్చు మనం' అని రాందేర్ అనడంతో 'స్పీడ్ మంత మతి వెండకల్' (వేగం ఉన్నా దాటచ్చు) అంటూ గగన్ మాట కలిపాడు.

'ఊరు వాగు ఆవల ఉంది, అటు వెళ్లకుండా రాత్రికి తిండి కూడా దొరకదు. వెళితేనే మంచిది విక్కీ' అంటూ మోతీ విక్కీని సిద్ధం చేస్తుండగానే 'ఇప్పుడే ఆకలైతోంది, ఇటు ఉంటే ఆకలికి చస్తం' కోయలో అంటూ వికాస్ తన ఆకలి పేగులు విప్పాడు.

మరో వైపు మేఘనాథ్, రాందేర్, గగన్ టెంట్ పర్చి అందులో అందరి కిట్లూ, తుపాకులూ, డ్రెస్సులూ, చెప్పులూ తీసుకుని సదురుతున్నారు. అరగంటలో పెద్ద మూట తయారైంది. సన్నటి తాళ్లతో టెంటును గట్టిగా బిగించారు. ఆ తాళ్లకు నీళ్ల డబ్బాలు తగిలించారు. సామాను సహా టెంట్ బరువు దాదాపు రెండు క్వింటాళ్లుంటుంది. దానికి పది మీటర్ల పొడవాటి తాడు ఊడిపోకుండా గట్టిగా ముడివేశారు. తెలంగాణ పల్లెల్లో పెద్ద బతుకమ్మను జాగ్రత్తగా నీళ్లలోకి జారవిడిచినట్టుగా ఆ టెంట్ మూటను అందరు కలిసి పదిలంగా లేపి నీళ్లలోకి వదిలారు. 'టెంట్ జాగ్రత్త, కింద పెట్టవద్దు, చిన్న చిన్న మురం ఉంది, గుచ్చుకొని రంధ్రాలు పడితే టెంట్‌లోకి నీళ్లు పోయి మునుగుతుంది' అంటూ రాహీ దళ బాధ్యుడు టెంట్ మోస్తూనే హెచ్చరిస్తున్నాడు. అందరూ 'ఇంగో, ఇంగో' అంటూనే మూటను పదిలంగా నీళ్లలోకి విడిచారు.

ఎనిమిదిమంది తాళ్లు పట్టుకొని మూటను కరుచుకొని ఆ మూట చుట్టూ నిల్చున్నారు. పొడువాటి తాడును పట్టుకొని కొద్దిగా దూరంగా నీళ్లల్లో రాందేర్ టీం నిలబడింది. 'వెళ్దామా? గట్టిగా పట్టుకోండి, ఈత వచ్చినవాళ్లు మూటను కొంత నెట్టుతూ ఉండండి' అంటూ రాందేర్ నీటి ప్రవాహంలో పాటించాల్సిన జాగ్రత్తలు ఓసారి హెచ్చరించాడు.

'మంచిగా పట్టుకున్నారా కామ్రేడ్' అంటూ మోతీ బాధ్యుడ్ని అడిగింది. ఆయన 'ఇంగో' అనడంతో రాందేర్ టీం మూటను ప్రవాహంలోకి లాగింది. 'ఇది ప్రమాదభరిత సాహసమే'

అని మనసులో అనుకుంటూ బాధ్యుడు తాళ్లను మరింత గట్టిగా పట్టుకున్నాడు. ముగ్గురూ యువకులు, బలిష్టంగా ఉండడంతో మూట రెండు నిమిషాల్లో అవలి ఒడ్డుకు చేరింది. మూట విప్పడం, ఎవరి డ్రెస్సులు, తుపాకులు, చెప్పులు సహా అన్ని సామానులూ వాళ్లు తీసుకోవడం, టెంట్ కడిగి మడత పెట్టడం అన్నీ 15 నిమిషాల్లో పూర్తయ్యాయి.

దళం తిరిగి ఫార్మేషన్‌లో బయలుదేరింది. ఐదు నిమిషాల్లో ఊరు వచ్చింది. ఉదయాన్నే మేతకు వెళ్లిన పశువులు మునిమాపువేళ కావడంతో తిరగి ఊరు చేరుతున్నాయి. అడవికి వెళ్లిన రైతులు ఇళ్లకు వస్తున్నారు. వర్షం తగ్గి వాతావరణం పొడిగా ఉండడంతో ఊరి అంగన్‌వాడి క్వార్టర్ ముందు పిల్లలంతా సంతోషంగా ఆడుకుంటున్నారు. వాగులో నీళ్లు ఎర్రమట్టి రంగుతో పారుతుండడంతో మహిళలు బోరింగ్ నీళ్లు తీసుకెళుతున్నారు. బోరింగ్‌కు తూర్పు పక్కన ఉన్న సర్కార్ బడికి తాళం వేసి ఉంది. దానికి ఎదురుగా ఉన్న గోటుల్ (గ్రామ రాజకీయ, సాంస్కృతిక కేంద్రం)లో ఇద్దరు యువతులు చీపుర్లతో ఊడుస్తున్నారు. ఊళ్లోకి వచ్చిన దళం గోటుల్ వైపు నడుస్తుండగా దళంలోని వికాస్ 'లాల్‌సలాం తమ్మో' అనడంతో ఆడుకునే పిల్లలంతా వరుసగా నిలబడి నవ్వుతో వెలిగిపోతున్న ముఖాలతో 'లాల్‌సలాం, లాల్‌సలాం' అంటూ చేతులు కలుపుతున్నారు. ఈ లోపు బోరింగ్ నీళ్ల కోసం వచ్చిన మహిళలు కూడా పరుగున వచ్చి లైన్‌లో చేరి దళానికి 'లాల్‌సలాం' అంటూ వాళ్లూ చేతులు కలపసాగారు.

'కోస్కీర్ హిల్లేరా' (పరాయివాళ్లు లేరా) అంటూ మోతీ ఊరి మహిళలను వాకబు చేసింది.

'మావోయిస్టుల భయానికి బడికీ, అంగన్‌వాడీకీ తాళ్లం పడ్డది, వాళ్ల భద్రతకు ముప్పు ఏర్పడ్డది' అంటూ బాధ్యుడు వ్యంగ్యంగా అనడంతో ఎదురుగా చేతులు కలుపుతున్న వరుసలోని ఒక వృద్ధ మహిళ 'వాళ్లు ఎన్నడూ వచ్చిన పాపాన పోరు కానీ పార్టీ పేరు బదనాం చేస్తారు' అంటూ నిష్ఠూరంగానే ఉన్న నిజాన్ని బయటపెట్టింది.

దళం నేరుగా గోటుల్‌లోకే వెళ్లింది. గోటుల్ విశాలంగా, శుభ్రంగా ఉంది. మధ్యలో నెగడు రాజేసి ఉంది. గోటుల్ గుంజలకు రకరకాల సైజుల డోళ్లు వేళ్లాడుతున్నాయి. గోటుల్‌లోని నిట్రాడు గుంజకు అతి చిన్న సైజులో స్త్రీ-పురుషుల బొమ్మలు చెక్కి ఉన్నాయి. గోటుల్ మీద ఈతగడ్డి దట్టంగా కప్పి ఉండడంతో ఎక్కడా ఉరవకుండా పొడిపొడిగా ఉంది. గోటుల్ పైన అటుకు తయారు చేశారు. వచ్చే అతిధుల కోసం అటుకు మీద తిండి సరుకులు పెట్టి ఉంచారు. అక్కడే ఒక రిజిస్టర్ ఉంచారు. జనతన సర్కార్‌లు ఏర్పడ్డాక వచ్చిన పద్ధతి ఇది. గోటుల్‌కు వచ్చిన అతిథులు అటుకు పైనుంచి తీసుకున్న సరుకుల వివరాలు అందులో రాయాల్సి ఉంటుంది. గోటుల్‌లో కట్టిన దండెం పైన కప్పుకునే గుడ్డలున్నాయి. గోటుల్‌లో మరో మూలకు నెగడు కర్రల మండె పడి ఉంది. ఆ పక్కనే వంట పాత్రలున్నాయి. అంటే ఉదయం పూట ఈ ఊరికి ఎవరో అతిధులు వచ్చి ఉంటారనే అంచనాతో మోతీ 'ఉదయం ఎవరు వచ్చారు కామ్రేడ్' అంటూ గోటుల్ శుభ్రపరిచిన యువతులను అడిగింది.

'జనతన సర్కార్ మీటింగ్ అత్త' (జనతన సర్కార్ మీటింగ్ జరిగింది) ఒక యువతి జవాబు.

'ఊరివాళ్లేనా? ఎవరైనా వేరే వాళ్లు వచ్చారా?' మోతీ మరో ప్రశ్న.

'దీదీ వాత్త' (అక్క వచ్చింది) – మరో యువతి ఈ రహస్యం విప్పింది. రాహీ దళానికి రహస్యమెందుకు అని ఆ యువతికి తెలిసే ఆ మాట అంది.

మోతీ ముఖంలో చిరునవ్వు వ్యక్తమైంది 'దీదీ ఉదయాన్నే వచ్చిందన్న మాట' అనుకొని బాధ్యుని వద్దకు వచ్చి ఆ మాటే చెప్పింది.

'తెలిసింది. పిల్లలు ఇందాకే లాల్‌సలాం చేస్తూ చెప్పారు' అంటూ బాధ్యుడు అనడంతో థ్రిల్ ఎగిరిపోయిన మోతీ 'రోల్‌కాల్ చేయనా' అంటూ విజిల్ ఊదడంతో దళం సింగిల్ లైన్ ఫార్మేషన్‌లో నిలబడింది.

'దీదీ వచ్చింది. ఆమె డేరా వివరాలు తీసుకుని ఉదయం వెళ్దాం' అని చెప్పి ఇతర సైనిక ఆదేశాలు ఇచ్చింది. వెంటనే దళం నియమం ప్రకారం పొజిషన్స్ కోసం కవర్లు చూసుకుంది.

నెగడు పక్కనే ముకేష్ తన పాల్తీన్ పరిచాడు. ఆయన ఏ గోటుల్‌కు వెళ్లినా ఆయన జాగా నెగడు పక్కనే. కిచెన్ డ్యూటీ వాళ్లు తమ పనిలోకి దిగారు. ఈ లోపు ఊరి యువతులు బిందెలల్లో బోరింగ్ నీళ్లు తెచ్చి పెట్టారు. వాళ్లను చూసిన వెంటనే కరుణ తన పని అంతా వదిలి వెళ్లి వాళ్ల పక్కన చేరింది. కరుణను గమనిస్తున్న ముకేష్ బాధ్యుని వైపు చూస్తూ 'కరుణ మందు పుచ్చుకుంటుంది' అంటూ సైగ చేశాడు. 'ఎంత చెప్పినా ఆ పొగాకు తినడం మానడం లేదు' అనే భావంతో బాధ్యుడు తలూపుతూ పెదవులు విరిచాడు.

మైనక్క జనతన సర్కార్ స్కూలుకు వెళ్లి ఉంటుంది. ఈ ఊరి సర్కార్ చాలా చక్కగా పని చేస్తోంది. ఆదర్శ వ్యవసాయ క్షేత్రం, జనతన సర్కార్ స్కూలు, రాత్రి పాఠశాల, ఊళ్లో సమిష్టి చెరువు, చెరువులో చేపల పెంపకం, వాగు పక్కన పండ్ల తోట అన్నీ శ్రద్ధగా కొనసాగిస్తున్నారు. పార్టీ అంటే ఎంత ప్రాణమో వీళ్లకు! రామన్న, మైనక్కల కృషి లేకుండా ఇవి సాధ్యమయ్యేదే కాదు అంటూ మనసులోనే అనుకుంటున్న బాధ్యునికి మైనక్క కళ్లల్లో మెదిలింది. ఆలోచనల్లో కదిలింది.

మైనక్కకు 45 ఏళ్లు దాటాయి. ఆమె గత రెండు దశాబ్దాలుగా కేర్ ఆఫ్ దండకారణ్యంగానే పని చేస్తోంది, కాదు జీవిస్తోంది. ఆమె ప్రజల్లో మంచి అభిమానం సంపాదించుకున్న కామ్రేడ్. ఆమెకున్న ఉద్యమ అనుభవం, పోరాట పట్టుదల, రాజకీయ అధ్యయనం, కేడర్లతో గల ప్రేమానురాగాలు ఆమెను దండకారణ్య విప్లవోద్యమ నాయకురాళ్లలో ఒకరిని చేసింది. ఆమె దండకారణ్య జనతన సర్కార్ ఉపాధ్యక్షురాలుగా బాధ్యతల్లో ఉంది. ఆమె నిరంతరం శ్రమిస్తుంది. ఎంత అనారోగ్యం ఉన్నా జనం మధ్య ఎప్పుడూ నవ్వుతూ నిండు మనసుతో పని చేస్తుంది. పిల్లలంటే ఆమెకు ఎంత ప్రేమో! ఆశయాల సాధనకై పొత్తిళ్లలోని తన కన్న కూతురుని కూడా వదిలి దండకారణ్యం చేరిన ఆమె ఊరూరా ఆదివాసీ పిల్లల్లో, ఆ ఎదిగే తరంలో వాళ్ల భవిష్యత్తు గురించి కలలు కంటూ ఆ తల్లి పేగు ఎంతో మురిసిపోతుంది. అడవిలోకి వచ్చిన తొలినాళ్లలో ఆమె ఎంత బాగుండేదో! కానీ ప్రమాదభరిత సుదీర్ఘ గెరిల్లా జీవితం, తీవ్ర అనారోగ్యం, మానసిక ఒత్తిళ్లు, శత్రునిర్బంధం అన్నీ కలిసి ఆమె వయసును ఉన్నదానికన్నా మరింత అధికం

చేస్తూ నిలబెడుతున్నాయి. దండకారణ్యంలో పేరు ఉన్న రచయిత్రులలో మైనక్క ఒకరు. దండకారణ్యంలో ఉన్న తెలుగు రచయిత్రుల సమూహం చాలా చిన్నది కానీ వాళ్ల ముందు పరుచుకున్న కాన్వాసు మాత్రం ఎల్లలెరుగునిది అనే ఆలోచనల మధ్య నిండా మునిగిన బాధ్యని వద్దకు చంకలో పిల్లతో వచ్చిన ఊరు మహిళ 'లాల్‌సలాం' అంటూ పలకరించడంతో 'ఓహ్! అల్లె, వయి దీదీ' (రా అక్కా) అంటూ తన జిల్లీలోనే 'ఉద' (కూచో) అంటూ చేతితో సైగ చేశాడు.

'ఈ పాప ఎవరు కుమ్మో' అంటూ ఆ మహిళను అనుమానంగానే అడిగాడు. కుమ్మెకు పెళ్లి కాలేదనే ఆయనకు తెలుసు. అందుకే అనుమానంగా అడిగాడు.

కుమ్మె సిగ్గుపడుతూ 'నా పాపే' అంటూ పసికందుని మరింత గట్టిగా తన ఒంటికి కరుచుకుంది.

'పాప తండ్రి ఎవరు? నీ పెళ్లి ఎప్పుడు అయింది?' ఆశ్చర్యంగా మరో రెండు ప్రశ్నలు వేశాడు.

'జన మిలీషియా కమాండర్ విజ్జాల్' అంటూ కరుణ సిగ్గుపడ్తున్న కుమ్మెకు బదులు జవాబు ఇచ్చింది. 'లోన్ ఒడిత్తా' (ఇల్లు చొచ్చింది) అని మరో మాట కలిసింది.

'కామ్రేడ్, వీటిని వివాహపూర్వ సంబంధాలు అనుకోవచ్చా' అంటూ విక్కీ వాళ్ల సంభాషణ మధ్యలో దూరాడు. 'వీళ్లకు పెళ్లి కాలేదు. పాప పుట్టింది. నిరభ్యంతరంగా ఊళ్లో అందరి మధ్య వితవుట్ మ్యారేజి కాపురం చేస్తున్నారు. సో వీటిని ఏమనడం' అంటూ కోయలో ఇంగ్లీషు దూరుస్తూ తన సందేహాన్ని మరింత ముందుకు లాగాడు.

'కోయను ఎందుకు సంకరం చేస్తావు విక్కీ, సుబ్బరంగా కోయలోనే అడుగు, మన కామ్రేడ్‌కు కోయ వచ్చుగా' అంటూ ముకేష్ తన సహజ ధోరణిలో విక్కీని జోక్ చేశాడు.

'విక్కీ, నీవు ముందు వివాహం అంటే ఏమిటో, వివాహ తంతు ఏంటో తెలుసుకో, ఆ తర్వాత చర్చిద్దాం' అంటూ బాధ్యుడు కుమ్మెతో 'విజ్జాల్ లేదా' అని అడిగాడు.

'సెంట్రీ పోయిండు. ఆయన వస్తే నేను సెంట్రీ పోవాలి. ఈలోగా మిమ్మల్ని కలిసి పోదామని వచ్చాను' అంటూ కుమ్మె లేచి నిలబడింది. 'దీదీ స్కూల్‌లో ఉంది' అంటూ మెల్లగా చివరి మాట జోడించి 'వస్తా'నంటూ బాధ్యుడికి చేయి కలిపింది.

'ముకేష్ నీ దగ్గర ఎంగెల్స్‌ది...' అంటూ విక్కీ మాట ఎత్తుకునేసరికే ముకేష్ 'కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాంగాల పుట్టుక నా వద్ద లేదు, తాపీ ధర్మారావుగారి పెళ్లి – దాని పుట్టు పూర్వోత్తరాలు కూడా లేదు' అంటూనే 'పదిమందికి విందు చేయడం, బ్రాహ్మలు మంత్రాలు చదవడం అంతా వివాహ తంతు లేదా రూపం కాగా వాళ్ల ఆమోదంతో స్త్రీ పురుషులు కాపురం చేయడం వివాహం సారం' అంటూ ముకేష్ తన భాషలో టూకీగా చెప్పి 'ప్రతీదీ పుస్తకాల్లో ఉండదు విక్కీ, నీ మెదడుకు కూడా పని చెప్పాలి' అన్నాడు.

ఆయన మనసులో మాత్రం 'మా విక్కీ భలే మేధావి' అనే భావన బలంగానే ఉన్నా పైకి అనలేదు. తన మాటపై బాధ్యుడి ప్రతిక్రియ ఏం వస్తుందా! అని ముకేష్ చూస్తుండగానే 'విక్కీ,

పరిస్థితులకు తగిన సర్దుబాట్లు, వెసులుబాట్లు ఈ సమాజంలో మనకు చాలా అగుపడతాయి. సమాజ సంస్కృతి వికాసంలో భాగంగా ఇవి అన్నీ సమాజంలో ముందు ఉన్నవే. వయసు వచ్చిన తర్వాత యువతీ-యువకులకు కాపురం పెట్టడం ఒక అవసరం. పెళ్లి అంటే ఇప్పుడు ఖర్చుతో కూడుకున్న కార్యం. అప్పటివరకూ కాపురం నిషేధం అంటే అనేక అనర్థాలు ముందుకు వస్తాయి. కాబట్టి యువతీ యువకులకు కాపురమూ కావాలి, పెళ్లీ కావాలి, ఒకటి తక్షణం అనివార్యం, మరొకటి సామాజిక అవసరం. కాబట్టి వారి అనివార్యత నుంచి బహిరంగంగానే కాపురాలు పెడ్తున్నారు. ఈ కాపురాలకు సమాజం ఆమోదం వుంది. అయితే పెళ్లి అనే తంతు కూడా పూర్తికావాలిగా మరి! దానికి ఈ ఆదివాసులు పెళ్లి తంతు జీవితంలో ఎప్పుడైనా పూర్తి చేసుకోవాలన్న వెసులుబాటు నియమం పెట్టుకున్నారు. దీనితో వాళ్ల శారీరక, మానసిక, సామాజిక బాధ్యతలూ అవసరాలూ తీరుతున్నాయి. ఆలస్యంగానైనా తంతూ పూర్తవుతోంది. ఇది ఒక సంధి దశ విక్కీ, గుంపు పెళ్లిళ్ల నుంచి జంట పెళ్లిళ్లకు మారుతున్న క్రమంలో సాగుతున్న సామాజిక కార్యాచరణ ఇది. ఇంకా సోదాహరణంగా చెప్పాలంటే మన కొండగాం ప్రాంతంలో నిన్నటి వరకు కొనసాగిన గోటుల్ సెక్స్ సంబంధాలు కూడా గుంపు పెళ్లి కాలం నాటి సామాజిక కార్యాచరణ అవశేషమే కామ్రేడ్! గత చరిత్రను, సామాజిక కార్యాచరణను లోతుగా అర్థం చేసుకోవడానికి పుస్తకాలతో పాటు ఇక్కడి సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు శ్రద్ధగా, గతితార్కికంగా పరిశీలించడం చాలా అవసరం. దండకారణ్యం అందుకు మనకు ఒక పెద్ద ప్రయోగశాలగా ఉపయోగపడుతూ వుంది. మనం ఈ సామాజిక ఇంజినీరింగ్‌లో కూడా పట్టా సంపాదించాలి విక్కీ' అంటూ బాధ్యుడు సుదీర్ఘంగా చెపుతున్న విషయాలకు కిచెన్ నుంచి వచ్చిన భోజనం విజిల్ బ్రేక్ వేసింది. ఈ విషయాలు వింటున్నంత సేపు ముకేష్‌లో తెలంగాణ పల్లెల సందెవేళ సరసాలు, పట్టణాల సందుల్లో సాగే వెకిలి చేష్టలు, మహానగరాల్లో సాగే వేశ్యావాటికల సంస్కృతి గుర్తొచ్చి వాటి అన్నింటికన్నా గోటుల్ సెక్సే ఆరోగ్యకరమైనది. గోత్రాల కట్టుబాట్ల సరసాలు ప్రమాదం లేనివి అనే విషయం ఆయన మనసులో ఘూర్ణించింది.

ఎవరి పళ్లాలు వాళ్లు తీసుకుని భోజనానికి లేచారు. వరుసగా నిల్చుండి ఒకరి తర్వాత ఒకరు అన్నం, కూరలు తీసుకుంటున్నారు. కిచెన్ డ్యూటీ వాళ్లతో పాటు ఆ రోజు మోతీ వడ్డన చేస్తోంది. భోజనాలు తింటున్న దళం మళ్లీ ముకేష్ మాటతోనే చర్చలోకి దిగింది. 'కేంపుల తిండికీ, ఊరు తిండికీ ఎంత తేడా' అన్నాడు ముకేష్.

'నిజం ముకేష్, నాకు కేంపు తిండి అంటేనే విసుగు వస్తుంది. పప్పు, పప్పు, పప్పు, కాదంటే కర్కు (వెదురు మొలకలు) స్పెషల్ అంటే గొడ్డు మాంసం, ఇవి వరుసగా తినడం అంటేనే నాకు చిరాకు' అన్నాడు విక్కీ

'నాకు రోజూ కర్కు పెట్టినా తింటాను. అది అడవిగోబిలా వుంటుంది' అని వికాస్ అంటే, 'నాకు పప్పు చాలా ఇష్టం' అన్నాడు గగన్. 'నాకు రోజూ మాంసం పెట్టినా తింటాను' అన్నాడు రాందేర్. ఇలా నడుస్తున్న వాళ్ల చర్చకు మేఘనాథ్ అడ్డు తగిలాడు. 'కర్కు ఒకరు

తినరు, కూకు (పుట్ట గొడుగులు) మరొకరు తినరు, వంకాయ గిట్టదొకరికి, గుమ్మడి పడదు ఒకరికి, మేక ఒకరికి దేవుడు, పంది మరొకరికి నచ్చదు, యే కైసే క్రాంతికారీ హై భాయి' అంటూ తన కోయలో ఒక హిందీ మాట తగిలించి చేయి కడుక్కోడానికి లేచాడు.

'సెంట్రీ రాశావా విక్కీ, ప్రజా మిలీషియా వాళ్లు రెండు వైపులా ఉన్నారు. మన సెంట్రీ గోటుల్ ముందు ఉంటే సరిపోతుంది' కమాండర్ మోతీ ప్రశ్న–జవాబుతో తన మాట ముగించింది.

* * *

ఉదయాన్నే దళం పెద్ద గుట్ట ఎక్కుతోంది. అందరికీ ఆయాసం వస్తోంది. కాకపోతే మోతాదులో కొంత తేడా వుంది. వెదురు వనాల గుట్టలు కావడంతో నడుస్తున్న వాళ్లను సైతం దోమలు విడవడం లేదు. కొన్ని గుయి అంటూ చెవుల చుట్టూ చేరుతూ సంగీతం విన్పిస్తోంటే సందు చూసుకుని కుట్టేవి కుడుతున్నాయి. దోమలు కుట్టిన చోట ఒంటి మీద కొందరికి పెద్ద కంతులు వస్తున్నాయి. వాతావరణం పొడిగా ఉండడంతో అంత ఉదయాన్నే అయినప్పటికీ అందరికీ చెమటలు కారుతున్నాయి. కనబడనంత దూరంలో కరుణ అందరికన్నా వెనుక నడుస్తుంటే రాందేర్ ముందు నడుస్తున్నాడు. ఆయాసంతో బరువులు నాలుగు రెట్లు అధిక భారంగా మారి కొందరిని విసిగిస్తున్నాయి. 'ఇదేం విప్లవంరా బాబు!' అని పైకి అనలేదు కానీ విక్కీ అంత బాధగా ముఖం పెట్టాడు. 15 నిమిషాల్లో 'జనతన సర్కార్' లో దళం అడుగు పెట్టింది.

పిల్లలంతా ఎవరి పనిలో వారు హడావుడిగా ఉన్నారు. కిచెన్‌కు నీళ్లు తెచ్చే టీంకు ఒంటి మీద షర్టులు లేవు. కర్రకు బకెటు తగిలించుకొని ఇద్దరు చిన్నారులు పది లీటర్ల నీళ్ల బకెట్ కష్టంగా మోసుకు వస్తున్నారు. బర్ల పేడ తీసేవాళ్లు తీసేస్తుంటే పాలు పితికేవాళ్లు పిండుతున్నారు. నల్గురు పిల్లల టీం కిచెన్ డ్యూటీలో ఉన్న మహిళకు సహాయ పడుతున్నారు. అంతలోకే మరో నల్గురు పిల్లల టీం పేందనుంచి (అడవి నరికి చిరుధాన్యం కోహ్‌ల పండించే ప్రాంతం) కర్కు తెచ్చారు. గురూజీతో పదిమంది పిల్లలు వ్యాయామం చేస్తున్నారు. ప్రజా మిలీషియా కార్యకర్త ఒకరు తన బర్మార్‌తో సెంట్రీ వెళుతున్నట్టున్నాడు. మరో ఇద్దరు మిలీషియా మహిళలు పాలిథీన్ షీటుతో కప్పిన నాలుగు గుడిశెలు శుభ్రపరుస్తున్నారు. మైనక్క క్రాంతితో కబుర్లు పెడుతుంటే టీచర్ వనిత చాయ్ పెడుతోంది. రాహీ దళం రాకను గమనించిన గురూజీ లాలు ఒక లాంగ్ విజిల్ ఊది మరో షార్ట్ విజిల్ ఊదడంతో పాలోమంటూ పిల్లలంతా తమ పనులు వదిలేసి ఒక్క ఉదుటున వచ్చి లైన్ కట్టారు. బడినీ, బడి పిల్లలనీ చూడగానే దళం అలసట అడ్రస్ లేకుండా పోయింది. అందరి ముఖాల్లో నవ్వు విరిసింది. పొడుస్తున్న పొద్దు లేలేత కిరణాలు రాహీ దళం సభ్యుల ముఖం మీద పడుతుంటే వారి ముఖం పైనున్న చెమట బిందువులు మెరుస్తున్నాయి.

వాళ్లంతా దండకారణ్య ఉద్యమ బిడ్డలు. ఈ పిల్లల కుటుంబాల్లో ఎవరో ఒకరు విప్లవోద్యమంలో ఏదో రూపంలో పిఎల్‌జిఎ సైనికులుగానో, పార్టీ కార్యకర్తలుగానో, ప్రజా

మిలీషియా కార్యకర్తలు గానో, వైద్యం, వ్యవసాయం, ప్రెస్సు, టెక్నికల్ రంగం తదితర యూనిట్లలో భాగమై ఉన్నవాళ్లే. వాళ్లతో పాటు స్కూల్లో ఉన్న ఊరి పిల్లల సంఖ్యే అధికంగా ఉంది. బలపాలు దిద్దే బాల్యాన్ని కూడా మీరు నక్సలైట్ల పిల్లలంటూ స్కూళ్లల్లోకి సైతం వచ్చి అవమానపరిచే పోలీసుల అమానుష చర్యల నుంచి ఈ పిల్లలకు జనతన స్కూళ్ల ద్వారా విముక్తి కలిగిందన్న భావనతో నడుస్తున్న రాహీ దళ బాధ్యుడికి లైన్ చివరన మైనక్క, ఆమె చేతిలో ఉన్న క్రాంతి చేయి కలిపారు. 'హాయ్ క్రాంతి!' అంటూ పెద్దగా నవ్వుతూ ఆ పదేళ్ల పాపను తన చేతుల్లోకి ఎత్తుకుని ముద్దాడసాగాడు. క్రాంతి అంటే ఆయనకు ఎంతో ఇష్టం. ఆమె తల్లి-తండ్రి ఆయనకు అంగరక్షకులుగా ఉన్నప్పుడే క్రాంతి వాళ్లకు పుట్టింది. క్రాంతి తండ్రి కామ్రేడ్ సాయినాథ్ 2009 అక్టోబర్‌లో లాహెరి మాటుదాడిలో 17 మంది కర్కోటక కమాండోలను మట్టుబెట్టిన వారిలో ఉండి శత్రు తూటాకు బలైనాడు. క్రాంతి తల్లి కెఎయంఎస్ నాయకురాలు. ఆ చిన్నారి క్రాంతి ఆయన్ని తాతయ్యా అంటూ సంబోధిస్తూ ఆయన కలిస్తేనే 'కా.సాయినాథ్ అమర్ హై' అంటూ తన తండ్రి జ్ఞాపకాలను ఆయనతో పంచుకుంది. ఆ నినాదంతో అక్కడి వాతావరణం బరువెక్కింది. టీచర్ వనిత కళ్లల్లో నిలిచిన నీరు స్పష్టంగా అగుపడుతోంది. ఆమె సహచరుడు 1996లో గెరిల్లాలు జరిపిన రెయిడ్‌లో అమరుడైనాడు. ఆయన జ్ఞాపకాల చిహ్నాలే కావచ్చు ఆ కన్నీళ్లు లేదా తన కొడుకు లాంటి సాయినాథ్ తాజా అమర జ్ఞాపకాల ఫలితమేమో అవి!

'బాగున్నావా మైనక్కా, దక్షిణ పర్యటన వార్తలు ఏంటి' బాధ్యుడి ప్రశ్న.

'సల్వాజుడుం దాడులు ఎన్నడూ లేని విధ్వంసాన్ని సృష్టిస్తే, గ్రీన్‌హంట్ దాడులు ఆ విధ్వంసం పైన మరింత విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. ప్చ్! ఊళ్లల్లో పరిస్థితి చాలా భయంకరంగా ఉంది. కానీ మన ప్రజలు మాత్రం మనకే ధైర్యం చెపుతున్నారు. గ్రీన్‌హంట్ మొదలయ్యాక పోలీసులు చేస్తున్న సామూహిక హత్యలు పెరిగిపోయాయి. పోలీసులు భారీ సంఖ్యలో దాడులకు వస్తున్నారు. కొత్తగా మన బెటాలియన్ ఏర్పడిన విషయం అర్థమైన శత్రువు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాడు. కొత్తగా చేరుతున్న బలగాలన్నీ ఊళ్లల్లో తమ ఇన్ఫార్మర్ నెట్‌వర్క్ పెంచుకోవడంపై కేంద్రీకరించాయి. గతంకన్నా ఎస్పీవోల సంఖ్య పెంచారు. గొంపాడు, సింగన్‌మడుగు, టెట్టమడుగు, నాంగల్‌గూడెంలలో అనేకమందిని ఊచకోత కోశారు. 2009 సెప్టెంబర్ నుంచి డిశంబర్ మధ్య మూడు నెలల కాలంలో 80 మంది రైతాంగాన్ని హత్య చేశారు' అంటూ మైనక్క కళ్లు మూసుకుని దీర్ఘశ్వాస తీసుకుంది. కొద్ది క్షణాల విరామం తర్వాత తిరిగి కళ్లు తెరిచి 'రెండేళ్ల పాప నుంచి 80 ఏళ్ల వృద్ధురాలు వరకూ ఖాకీ బలగాల ఆగడాలకు బలి అయ్యారు. దారుణమైన చిత్రహింసలు. ఆ దుర్మార్గాలకు అంతు లేదు. ఊర్లకు ఊర్లను చుట్టుముట్టి ఆదివాసీ రైతులను కాల్చి చంపుతున్నారు. వాళ్ల దాష్టీకాలకు అక్షరరూపం ఇవ్వలేవు మన కలాలు. వాళ్ల దుర్మార్గాలకు పట్టం కడుతున్న రాజ్యహింసనూ, గ్రీన్‌హంట్ అకృత్యాలనూ చిత్రించలేవు మన కళలు' అంటూ ఆమె ఆగింది. వాళ్ల గంభీర సంభాషణ మధ్య క్రాంతి ఎప్పుడు అక్కడ నుంచి జారుకుందో వాళ్లు గమనించనే లేదు. తిరిగి ఆ పాప ఉడకబెట్టిన అడవిదుంపలు (కిరింగ్ మాటి) తెచ్చి వారి పక్కన పెట్టింది. అవి అచ్చం కందగడ్డనే పోలి ఉన్నాయి. 'తింటూ' (తినండి) అంటూ ఆ పాప వాళ్ల వైపు చూస్తూ నవ్వింది.

కిరింగ్ మాటీ అంటూ, 'ఎంత నిర్బంధంలోనైనా ఈ అడవిలో మనం బతకవచ్చు మైనక్కా, ఎన్ని రకాల గడ్డలో. వెదురు మొలకలు, పుట్ట కొక్కులు, తేనె, పండ్లు, కాయలు ఎన్నెన్నో ఉన్నాయి ఈ అడవిలో. అందుకే ఆదివాసులకు అడవి అంటే ప్రాణం. అడవికీ, ఆదివాసులకూ మధ్య అల్లుకున్న తల్లిపేగు అనుబంధం సల్వాజుడుం, గ్రీన్‌హంట్‌లకు అర్థం కాదు మైనక్కా. ఈ అడవిలో భూగర్భ ఖనిజాలే కాదు, జలవనరులే గాదు, కలప సంపదే గాదు, ఆకలి గొన్న ఆదివాసుల కడుపు నింపే కమ్మని పదార్థాలు అనేకం ఉన్నాయి. పురాతన సంస్కృతికి నిలయం ఇది. అందుకే మోర్గాన్ మధ్యఅమెరికా ఆదివాసుల మధ్య 40 ఏళ్లు జీవించి అపూర్వమైన మానవ చరిత్రను పరిశోధించి మనకు అందించాడు'

'నువ్వు చెప్పింది నిజం. ఈ అడవి అద్భుతమైనది. అందులో ఉన్న ఆదివాసులు అమాయకులు. 'నాగరిక సమాజం' స్వార్థ బుద్ధులు ఇంకా అబ్బనివాళ్లు. అలాంటి అడవిలో, అందులోని ఆదివాసీ ప్రజల మధ్య టాటాలు, ఎస్సార్లు, జిందాల్లు, మిట్టల్‌లు చిచ్చు పెడుతున్నారు. వాళ్లకు కర్మలు, కశ్యప్‌లు తోడవుతున్నారు. ఫలితంగా ఒక మారణహోమం మండుతోంది. దానికి మడ్కం సన్ను, పొడియం సోములు లాంటి వాళ్లు ఎందరెందరో బలి అవుతున్నారు' అని మైనక్క తన మాటను అర్థాంతరంగానే ఆపేసింది. రెండుసార్లు తల అడ్డంగా ఊపి 'ఆ రైతులు ఎంత మంచివాళ్లో' అంటూ మరో వాక్యం మాత్రం అనగలిగింది.

'మడ్కం సన్ను ఎవరు' రాహీ.

'మన భైరాన్‌గఢ్ ప్రాంతంలోని కేశముండి గ్రామం ఆయనది. దాదాపు 40 ఏండ్ల వయసుండచ్చు. సోములు కూడా అక్కడివాడే. సన్నుకన్నా ఓ పదేళ్లు వయసులో చిన్నోడే, వీళ్లిద్దరినీ గ్రీన్‌హంట్ పొట్టన పెట్టుకుంది. సల్వాజుడుం ప్రారంభించే నాటికి బీజాపూర్ పోలీసు జిల్లాగా ఉంది. కానీ ఇంకా రెవెన్యూ జిల్లాగా ప్రకటితం కాలేదు. ఫాసిస్టు సల్వాజుడుంను నడపడానికి మొదటగా పైలట్ బ్లాకులుగా ప్రభుత్వం ఎంచుకున్న రెండింటిలో భైరాన్‌గఢ్ ఒకటి. మరోటి బీజాపూర్. 2005 జూన్ నుండి డిశంబర్ వరకు సల్వాజుడుం సృష్టించిన అపూర్వ విధ్వంసానికి ఈ రెండు బ్లాకులు విలవిలలాడాయి. వందలాది గ్రామాలు భస్మీపటలం అయ్యాయి. వేలాది జనం నిరాశ్రయులయ్యారు, అనేకమంది ప్రజలు ఎలాంటి చిరునామా లేకుండా పోయారు. ఎన్ని తలలు నరకబడ్డాయో! ఎన్ని శరీరాలు చిత్రహింసలపాలయ్యాయో! ఎన్ని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయో! ఎన్నెన్ని శవాలు మట్టిలో పాతిపెట్టబడ్డాయో, ఇంకెన్ని శవాలు నదుల్లోకి విసిరివేయబడ్డాయో ఎవరూ చెప్పలేరు. మహిళలు ఎంత హింస అనుభవించారో! అనేకమంది యువతులు, పిల్లలు, వృద్ధులు ఏ తేడా లేకుండా పరమ దారుణమైన లైంగిక హింసకు బలి అయ్యారు. పంటలు నాశనమయ్యాయి. సొమ్ములు దొంగలపాలయ్యాయి. ఆదివాసీల ఆత్మగౌరవం మంట కలిసింది. ఫాసిజం అంటే ఏమిటో ప్రజలకు వివరించాల్సిన అవసరం, ఇంకేమీ వ్యాఖ్యానించాల్సిన అవసరం లేకుండా పోయింది.

'ఆగస్టు 7 నాడు కమ్ముకగుండ దగ్గర పేలిన తొలి గ్రీన్‌హంట్ తూటాలకు ఆ ఇద్దరు ఆదివాసీ రైతులు బలి అయ్యారు. ఆ ఇద్దరికీ కోబ్రాలు ఆలీవ్ గ్రీన్ డ్రెస్సులు తొడిగి మావోయిస్టుల శవాలుగా కట్టుకథ అల్లి కల్లూరికి కబురు చేశారు. ఆ డిఐజి పత్రికలకు కోబ్రాల గొప్పతనాన్ని

వివరించాడు. నాకు సన్నుకన్నా ఎక్కువగా ఆయన భార్య గుర్తొస్తోంది రాహీ'

'ఎందుకు?'

'ఆమె బతికుండి నరకాన్ని అనుభవిస్తోంది' అంటూ మైనక్క ఆమె జ్ఞాపకాల్లోకి వెళ్లింది.

'వద్దు! నా బాబును చంపొద్దు! నా బాబును నాకు వదలండి! వాడు ఏ పాపం ఎరుగడు. వాడే సంగంలో లేడు. వాడు పసికందు. వాడు నా ప్రాణం' అంటూ ఓ కన్నతల్లి పరుగెడుతోంది. ఆమె పరాయి మనుషులెవరికీ అందనంత దూరంగా పరుగెత్తడానికి మొసపోస్తూంది. ఆమె సన్ను జీవిత సహచరి. గత రెండేళ్ల పైగా ఆమె పరిస్థితి ఇది.

వాళ్ల ఊళ్లో సల్వాజుడుం గూండాలు, పోలీసులు కలిసి సృష్టించిన ఘోరమైన హత్యాకాండ, విధ్వంసంతో ఆ తల్లి దాదాపు పిచ్చిదైంది. ఆమె ఏ పరాయివాడిని చూసినా అనుమానిస్తోంది. అందులో ప్యాంటూ, షర్టు వేసుకున్న వాళ్లను చూసిందంటే మాత్రం వణికిపోతూంది. ఖాకీల డ్రెస్సులు అగుపడ్డాయంటేనే తన బాబును వాళ్లు తప్పకుండా పొట్టనబెట్టుకుంటారన్న భయంతో ఆమె పరుగెడుతుంది. ఆమె ఒక్క క్షణం కూడా తన బాబును వదిలి ఉండలేకపోతోంది. ఆమె గుండెలకద్దుకునే తన బాబును కాపాడుకుంటుంది. కానీ ఆ చిన్నారి బాబుకు ఇవేవీ తెలియవు. ఎరిగిన ముఖాలను చూస్తే ఆ పసికందు ముఖం బోసినవ్వులతో నిండుకుంటుంది.

మతిస్థిమితం లేని భార్య స్థితితో సన్ను దాదాపు ఒంటరివాడయ్యాడు. భార్య, ఆ పసిగుడ్డు ఎప్పుడు బుక్కెడు తింటారో, ఎక్కడ ఉంటారో, కునుకు తీస్తారో లేదో తెలియదు. ఎదిగిన బిడ్డ, పోలీసులు వస్తే తనను ఊళ్లో బతకనివ్వరని తన బతుకు దారి తాను చూసుకుంది. ఆమె సాయుధమై ఊరూరూ వెళుతుంది. ఆమె ఆ ఏరియా ప్రజల కళ్లల్లో ప్రాణమైంది. ఆమె పిఎల్‌జిఎ సభ్యురాలుగా పోరాటమార్గంలో జీవిస్తోంది. సన్నుకు రైతు సంగ కార్యకలాపాలు తప్ప మరే వ్యాపకం లేకుండా పోయింది. వర్షాలు పోయి అకాల పరిస్థితులు ఎదురై పంటపొలాలు పేద రైతుల గుండెల్లా పూర్తిగా ఎండిపోయి వాటికి కాపలే అవసరం లేకుండా పోయింది. ఊరి గొడ్లకు ఆ ఎండిన పంట చేనులు మేత అయ్యాయి. సన్నుకు మిగిలిందల్లా తన భార్యను తిరిగి మంచి మనిషిగా మార్చుకోవడమే. తన కన్న కూతురు డ్రెస్సూ, తుపాకితో వచ్చినా ఆ పిచ్చి తల్లి వణికిపోతూ ఆమెతోనైనా కాసేపు మాట్లాడలేకపోతోందనీ, తన తమ్ముడితో కాసేపైనా ఆమె ఏడుస్తూ అయినా నవ్వులు పంచుకోలేకపోతోందని కూతురు అంకిత ఎప్పుడు ఇంటికి వచ్చినా సివిల్ డ్రెస్సులోనే రావడం అలవాటు చేసుకుంది. అంకిత వస్తే ఏమైనా మందు తెస్తుందేమోనని ఆమె కన్నతండ్రి సన్ను ఎప్పుడూ ఆమె కోసం ఎదురు చూస్తూ ఉండేవాడు. పిచ్చిదానిలా తయారైన భార్యను పట్టుకొని ఆయన ఎందరెందరో పూజారుల ఇండ్లు తిరిగాడు. కానీ ఆమె మానసిక స్థితి లో పెద్ద మార్పు లేదు. అయినా సన్ను మాత్రం తన ప్రయత్నాలు మానుకోవడం లేదు.

నిరంతరం ప్రజా మిలీషియా ప్రతిఘటనతో అనేక నష్టాలు పొందుతున్న పోలీసులకు వెన్నుజ్వరం పుట్టి వాళ్లు గొట్టోడు గ్రామం రావడం కొద్దికాలంగా నిలిచిపోయింది. ఆ వెసులుబాటుతో సన్ను తన సహచరిని తీసుకొని ఆ ఊరు వెళ్లాడు. అక్కడి జనతన సర్కార్ సహాయంతో తన భార్యకు పూజారి దగ్గర వైద్యం ప్రారంభించాడు. ఏ వత్తిళ్లు లేకుండా రోజులు

గడుస్తుండడంతో ఆమె మానసిక స్థితిలో క్రమంగా మార్పు మొదలైంది. ఆమె ఊరివాళ్లతో కలిసి వ్యవసాయ పనుల్లో పాల్గొనడం, సంతకు వెళ్లి రావడం, పదిమంది పిల్లలతో తన బాబును ఆడుకోడానికి వదలడం, ఊళ్లోకి సంగం వాళ్లు వస్తే ఇరుగు, పొరుగు వార్తలు అడిగి తెలుసుకోవడం చేయసాగింది. తన భార్య మానసిక స్థితిలో వస్తున్న మంచి మార్పుకు సంతోషపడి మధ్య మధ్యలో సన్ను కేశముండి వచ్చి వెళ్లడం కూడా చేస్తున్నాడు. తన తల్లి కోలుకుంటున్న వార్త తెలిసిన అంకిత ఆ మాట తన ప్లటూన్ వాళ్లతో చెప్పి ఎంతో సంబురపడింది.

శనివారం తన భార్యను రమ్మని చెప్పి సన్ను వారం రోజుల ముందే కేశముండి వెళ్లాడు. తన భార్య వస్తే ఇల్లు గడవడానికి కావలిసిన తిండి గింజలు సమకూర్చుకోవడానికి ఆయన ఆమెను విడిచి ముందే తన ఊరికి వచ్చాడు. ఆయన ఎంతో సంతోషంగా ఉన్నాడు. తిరిగి తన భార్య ఒక మామూలు మనిషి అవుతున్నందుకు చాలా తృప్తిగా ఉన్నాడు. గొట్టుదు ప్రజా మిలీషియాకు, జనతన సర్కార్‌కు ఆయన చేతులెత్తి దండం పెట్టని రోజు లేదు. వాళ్ల మూలంగానే ఆమె ఒక సాధారణ మనిషి అయ్యిందని ఆయనకు తెలుసు. తన బాబు, తన భార్యతో ఇక తన ఇల్లు గడుస్తుందనీ, తన అంకిత జనం మధ్యే జీవిస్తుందనీ ఆయన ఎన్నెన్నో వాస్తవాలను ఊహిస్తూ ధాన్యం కోసం శుక్రవారం పొరుగూరు బంధువుల వద్దకు వెళ్లాడు. కానీ అప్పటికే గ్రీన్‌హంట్ పోలీసులు ఆ ఊరిని చుట్టుముట్టి ఉన్నారు. దారులన్నీ వాళ్లు తమ నియంత్రణలో పెట్టుకున్నారు. అయితే ఇవేవీ తెలియని సన్ను మామూలుగానే ఊళ్లోకి అడుగుపెట్టాడు. అంతే! ఆయన అవాక్కయిపోయాడు. ఆయన నోట మాట రావడం లేదు. ఆ ఊరి రైతు సోములు పోలీసుల వలలో బందీగా విలవిలలాడడం సన్ను కంటబడింది. ఏం చేయాలో సన్నుకు పాలుపోవడం లేదు. ఎటు చూసినా పోలీసులే. చూస్తుండగానే కోబ్రాలు ఆయనను చుట్టుముట్టాయి. నోట కరుచుకున్నాయి. ఊరి మధ్యే, జనం ముందే కోబ్రాల తుపాకులు ధాం, ధాంమని ఉరుములాంటి శబ్దాలతో పేలిపోతున్నాయి. సజీవంగా ఉన్న సన్ను, సోములు ఆ కాల్పుల మధ్యనే శవాలయ్యారు. ఏ దాపరికం లేకుండానే ఊరి జనం ముందే కోబ్రాలు తమ కిట్లలో నుంచి అలీవ్ గ్రీన్ డ్రెస్సులు తీసి ఆ శవాలకు తొడిగారు. ఊరివాళ్లతో ఆ ఆలీవ్ గ్రీన్ రైతుల శవాలను పోస్టుమార్టం కోసం పోలీసులు బీజాపూర్ తీసుకెళ్లారు. 'వాళ్లు కరుడుగట్టిన మావోయిస్టులు, ఎదురుకాల్పుల్లో చనిపోయారు' అనే రిపోర్టు శవాలతో పాటే మీడియాకు వెళ్లింది. పోలీసుల గ్రీన్‌హంట్ సైనిక దాడులు సాధించిన తొలి విజయంగా తెగ మురిసిపోతున్న పోలీసులు మీడియాలో ప్రసారం అయ్యే ఆ ప్రకటన కోసం కాచుక్కూచుంటారు.

భర్త చెప్పినట్టు శనివారం తన బిడ్డను ఎత్తుకొని ఒంటరిగానే సన్ను సహచరి కేశముండి చేరింది. ఆమె నేరుగా తన ఇంటికి వెళ్లింది. కానీ సన్ను, తన ప్రియమైన సహచరుడు సన్ను, తన బాబుకు కన్నతండ్రి సన్నూ ఆమెకు ఆ ఇంట్లో అగుపడడం లేదు. సన్ను ఏమై ఉంటాడు? ఆయన ఎక్కడికి వెళ్లి ఉంటాడు? నొసలు చిట్లిస్తూ ఆమె మనసులో ఎదురైన తుఫానులాంటి ప్రశ్నలకు జవాబు చెప్పేదెవరు? ఏ మానవ హక్కుల సంఘాలు ఆ తల్లీ బిడ్డలకు సన్ను అడ్రస్ అందిస్తాయి? ఛిద్రమవుతున్న ఆ ఆత్మీయ అనుబంధాల విషాదం ఏ కలాలు ఈ ప్రపంచానికి తెలుపుతాయి? తల్లి ఎడబాటెరుగని ఆ పసికందు భవిష్యత్తును ఏ కళలు చిత్రిస్తాయి? ఆ

తల్లికి ఆధారం ఇక తన అంకితేనా?

మైనక్కలో పొరలు పొరలుగా తన్నుకుంటూ వస్తున్న మరువలేని సన్ను జ్ఞాపకాలను ఓపిగ్గా వింటూ పంచుకుంటున్న రాహీ 'సల్వాజుడుంతో మంగ్లీ పిచ్చిదైతే, గ్రీన్‌హంట్‌తో సన్ను శవమయ్యాడు. ఇక మిగిలింది ఆ పసికందుకు తల్లిపేగు అనుబంధం కలిగిన అంకిత, ఆమెకు అండ పిఎల్‌జిఎ' అనుకుంటుండగా

'అ – అమరులు, ఆ – ఆదివాసులు, క – కసేరు (కత్తి), జ – జనతన స – సర్కార్, ల – లడాయి' అంటూ పక్క గదిలో పిల్లలు బిగ్గరగా అంటుండడం వినపడుతూంది. 'అవును...ముప్పై ఏండ్ల పోరాట దండకారణ్యంలోని పిల్లలకు ఈనాడు లడాయి, ఆయుధాలు, త్యాగాలు, అధికారం నిత్యవాచకాలు అయ్యాయి. సల్వాజుడుంలు, గ్రీన్‌హంట్‌లు అంతమయ్యే వరకూ ఇవి తప్పవిక' అనుకుంటూ ఆయన లేచి తరగతి గది వైపు అడుగులు వేశాడు.

* * *

# ప్రజాయుద్ధంలో మట్టి వాసనలు

– సాధన

అది జూన్ నెల. మొత్తం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనే అదిరిపోయే ఎండలకు కుంట ప్రాంతం పెట్టింది పేరు. 48 డిగ్రీలు దాటిన ఎండలు ఒక వైపూ, తీవ్ర నీటి ఎద్దడి మరోవైపు. ఈ సంవత్సరం ఏప్రిల్ మాసంలో అకాల వర్షాలు రావడంతో అడవి పచ్చబడి నీడను ఇచ్చి కాపాడుతోంది. లేకపోతే మనుషులు మరింత ఆగం కావల్సిందే. ప్రజా గెరిల్లాలు ఓ చిన్న నీటి వనరును ఆధారం చేసుకొని పొలాల్లోనే డేరా వేశారు.

ఎండలోనే పొయ్యి పెట్టారు. ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు వంట డ్యూటీలో ఉన్నారు. టి.సి.ఒ.సి. కావడంతో పెద్ద సంఖ్యలో గెరిల్లాలు యుద్ధ చర్యల కోసం జమయ్యారు. కంపెనీ (80 మంది) ప్రాతిపదికన వంట చేయడం కన్నా ప్లటూన్ ప్రాతిపదికన (27 మంది) చేయడం బాగుంటుందని, అదే రీతిలో పొయ్యిలు పెట్టి వంటలు చేస్తున్నారు. రాత్రిపూట మంటలను నిషేధించడంతో వెలుతురుండగానే రెండు పూటలకూ వండుతున్నారు. దీనితో వంట డ్యూటీ వారికి దినమంతా ఊపిరి సలపకుండా పోతూంది.

రాత్రి 12 దాటితే గానీ భూమి చల్లబడడం లేదు. పగటి ఎండకు ఇంకా కాలుతున్న భూమిపైనే పాల్తీన్ జిల్లీ పరచుకుని పడుకున్న రాహీకి రాత్రి 11 దాటినా నిద్రపట్టడం లేదు. జిల్లీపై పల్చని చద్దర్ పరిచినా వేడి కాక తగులుతూనే ఉంది. ఇటూ అటూ దొర్లుతున్న రాహీకి పగలు నరేందర్ చెప్పిన మాటలే మళ్లీ మళ్లీ గుర్తొస్తున్నాయి. ఆ పొలాల్లోనుంచే మూడు వైపులుగా వచ్చి గొంపాడు, గచ్చన్‌పెల్లి ఇంకా ఇతర ఊర్లను చుట్టుముట్టిన కోయ కమాండోలు, కోబ్రాల దారుణాలే ఆయన కళ్ళ ముందు కదలాడుతున్నాయి. 70 ఏండ్లు దాటిన ముసలి దూది మూయెను రొమ్ములు కోసి చంపిన కోబ్రాలు, కోయ కమాండోలు ఎంతటి కిరాతకులో గుర్తొస్తున్న రాహీకి గత ఆరేండ్లుగా జుడుం దాడులకు బలవుతున్న వందలాది ఆదివాసీ ప్రజలు అనుభవించిన దారుణాలే గుర్తొస్తూ కళ్లకు కునుకు పట్టనివ్వడం లేదు. గచ్చన్‌పల్లి, పాలచెలిమి, సింగన్‌మడుగు, గట్టపాడు, గొంపాడులలో హతులైన 24 మందిలో పదేండ్లు దాటని పిల్లలూ ఉన్నారు. ఏడాది నిండని పాప చేతివేళ్లు నరికిన మనుషుల క్రూరత్వాన్ని ఏ మృగత్వంతో పోల్చగలం? అనుకుంటూ రాహీ తన పక్కపై దొర్లుతూంటే సెంట్రీ దగ్గర మేఘనాథ్ దేన్నో కర్రతో బాదుతున్న చప్పుడు వినపడడంతో 'ఏంటి? పామా!' అంటూ ప్రశ్నించాడు రాహీ.

'ఆ, కట్లపాము' అంటూ బదులు ఇచ్చిన సెంట్రీ కర్ర దూరంగా విసిరాడు.

అర్ధరాత్రి దాటిన తర్వాత ఎప్పుడు కునుకు పట్టిందో గానీ, కిచన్ వాళ్ల గంజుల చప్పుడుతో రాహీకి తెలివిపడింది. వాచీ చూస్తే ఇంకా ఐదు కావడానికి 15 నిమిషాలు బాకీ ఉండడంతో మళ్లీ కళ్లు మూశాడు. సాయంత్రం వెళ్లాల్సిన దాడి గురించి ఆలోచిస్తున్న రాహీకి, కరుణ 'చాయ్' అనడంతో లేవక తప్పలేదు.

'మనవాళ్లు సంతకు వెలుతున్నారు దాదా, దళానికి కోటా సామానులు పూర్తయ్యాయి. తెప్పిస్తే బాగుంటుందేమో!' అంటూ కరుణ చాయ్ గంజుతో వెనక్కి తిరిగింది.

'ఈ రోజు ఎక్కడి సంత సోనారు?' ప్రశ్నించాడు రాహీ.

'బూర్లంక శనివారం సంత' అంటూ గడుగ్గాయి వికాస్ మధ్యలో దూరాడు. తనకు కావల్సిన సామానుల లిస్టు పట్టుకొని మోతీ ముందు నిలబడ్డాడు.

'సామాను లిస్టు ఇమ్మన్నాడు నరేందరన్నా, అందరూ ఒకేసారి తెచ్చి ఇవ్వండి' అంటూ కమాండర్ మోతీ వికాస్ ఇచ్చిన లిస్టు అందుకుంది.

'ప్రజాయుద్ధంలో అన్నీ ప్రత్యామ్నాయంగా సృష్టించుకోక తప్పడం లేదు. ఖాకీలు అన్నీ విధ్వంసం చేస్తూపోతూ ఉంటే ఉద్యమం మళ్లీ అన్నీ తయారు చేసుకోక తప్పడం లేదు. ఈ ప్రాంతంలోని సంతలన్నీ పదేళ్ల క్రితం పోలీసులు మూసేస్తే జనతన సర్కార్లు జనం కోసం ఈ మధ్య తెరిచిన కొన్ని సంతల్లో బూర్లంక ఒకటి. ఈ సంతే ఇక్కడి 60-70 ఊర్లకు దిక్కవుతోంది. మిగతా పెద్ద సంతలకు వెళ్లాలంటే అన్నీ ఖాకీల వలయంలోనే ఉన్నాయి కదా' అంటూ క్రితం రోజు నరేందర్ చెప్పిన నిధుల కొరత విషయం గుర్తొచ్చిన రాహీ మోతీ వైపు చూస్తూ, 'లిస్టుతో పాటు డబ్బు కూడా ఇవ్వు మోతీ, ఇక్కడ డబ్బుకు చాలా సమస్యగా ఉంది' అన్నాడు.

రోజంతా గెరిల్లాలు ఎవరి పనుల్లో వాళ్లు పూర్తిగా మునిగిపోయారు. ఉదయాన్నే కమాండర్ నాగేశ్ సాయంత్రం జరపబోయే దాడి గురించి డ్రిల్ రిహార్సల్ చేయించాడు. లేత ఎండలోనే డ్రిల్ చేసిన గెరిల్లాల ఒళ్లు చెమటలు కక్కడంతో గుడ్డలు పూర్తిగా తడిసిపోయాయి. గ్రౌండ్‌లో ఎంత చెమట కక్కితే యుద్ధభూమిలో అంత నెత్తుర్లు పారకుండా అరికట్టవచ్చునన్న స్పృహ గెరిల్లాల్లో బలంగా ఉంది. డ్రిల్ పూర్తయిన వెంటనే అందరూ స్నానాలకు వెళ్లారు. అరగంటలో వచ్చేశారు. చాలాకాలంగా టిఫిన్ అంటే 'పోపు అన్నం'గానే తయారైంది. వేడి వేడి పోపన్నం తిని వేసవి కావడంతో పొద్దస్తమానం గెరిల్లాలంతా పులిసిన అంబలి ప్రియంగా తాగుతున్నారు. దక్షిణ బస్తర్‌లో సంతలన్నీ ఉదయం పది లోపే పూర్తవుతాయి. సాహుకార్లు సంచులు సర్దుకొని కొట్లు కట్టేసి తిరుగు ప్రయాణం చేయడం అలవాటు. మరెక్కడా ఇలా లేదు. సంత అంటే సాయంకాలం వరకు సాగుతుంది.

బూర్లంక సంత నుంచి తెచ్చిన కూరగాయలతో పాటు జనం ఇచ్చిన చేపలు కలిపి కిచెన్ వాళ్లు వంట చేశారు. మధ్యాహ్నం భోజనాలు చేశాక తిరిగి సాయంకాలం ఆరు లోపే తినేవాళ్లు తిన్నారు. కొద్దిమంది సీనియర్ కామ్రేడ్స్ రాత్రి తింటామని క్యారియర్‌లో పట్టుకున్నారు.

ఈ లోపు రోల్‌కాల్ విజిల్ రావడంతో పాలోమంటూ అందరూ పరుగు తీసి తమ తమ ఫార్మేషన్ ప్రకారం వరుసగా నిల్చున్నారు.

కమాండర్ అందర్నీ అటెన్షన్‌లోకి తెచ్చి ఉదయం చేయబోయే దాడి గురించి వివరించాడు. బలగాల మోహరింపూ చెప్పాడు. పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలోకి వెళ్లి దాడి చేయాల్సి ఉంటుంది కాబట్టి పూర్తి రహస్యాన్ని పాటించాలనీ, వేగంగా చర్యను పూర్తి చేసుకోవాలనీ, దృఢంగా ఉండాలనీ మూడు మాటల్లో గెరిల్లా ఎత్తుగడల మౌలిక నియమాలను గుర్తు చేశాడు. జుడుంకు వ్యతిరేకంగా చేసిన అనేక గెరిల్లా దాడుల్లో పాల్గొని మంచి అనుభవం సంపాదించిన తమ గెరిల్లాలకు ఆ బ్రీఫింగ్ సరిపోతుందనీ ఆయనకు తెలుసు. ఆ మాటలు విన్న అందరి ముఖాల్లో అగుపడ్తున్న సంసిద్ధతను చూసిన కమాండర్ ముసిముసిగా నవ్వుతూ 'విసర్జన్' అన్నాడు. వెంటనే గెరిల్లాలందరూ లైన్‌ల నుంచి విడిపోయారు. క్యాంపులోనే ఉండాలని కమాండర్ చెప్పిన పేర్లవాళ్లంతా నిట్టూర్పులతో డేరాలోకి వెళ్లారు.

బెజ్జి పోలీస్ స్టేషన్ పరిసరాల్లోకి పూర్తిగా తెల్లారక ముందే చీకట్లోనే చేరిన గెరిల్లాలు తమ తమ పొజిషన్‌లలో కెమోఫ్లేజ్ అయి కూచున్నారు. శత్రు క్యాంపుకు 200 గజాల దూరంలో దాడికి సిద్ధంగా ఉన్న గెరిల్లాలు శత్రువును తీక్షణ చూపులతో నిశితంగా గమనిస్తున్నారు. పొజిషన్‌లలో కూచున్న వాళ్లంతా శత్రువును కొద్దిగానో, పూర్తిగానో క్యాంపు పరిసరాలన్నీ చూడగల్గుతున్నారు. వాళ్లు ఎప్పుడు బయటకి వస్తారా! అంటూ ఊపిర్లు బిగపట్టుకుని గెరిల్లాలు దాడి లక్ష్యంతో పట్టుదలగా నిరీక్షిస్తున్నారు. సమయం కౌంట్‌డౌన్ మొదలయింది. తమ కమాండర్ నుంచి వస్తోన్న వైర్‌లెస్ ఆదేశాలు గెరిల్లాలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నాయి.

కమాండర్‌తో పాటు ఎత్తైన ప్రదేశంలో కూచున్న నరేందర్‌కు బెజ్జి గ్రామం ఊళ్లో ఉన్నట్టుగానే స్పష్టంగా అగుపడుతోంది. పోలీసు స్టేషన్‌ను దాటిపోయిన ఆయన చూపులు వల్లకాడుగా మారిన బెజ్జిపైనే నిలిచాయి. 'జుడుంకు ముందు బెజ్జి ఎంత బాగుండేది!' అనుకుంటున్న నరేందర్‌కు రెండు దశాబ్దాల క్రితం తను కమాండర్‌గా ఉన్నప్పుడు తిరిగిన ఇల్లిల్లూ, మనిషి, మనిషీ గుర్తుకు వచ్చి గుండె బరువెక్కింది. ఆ ఇండ్లన్నీ ఇప్పుడు మట్టికొట్టుకుపోతున్నాయి. మనుషులు మాయమయ్యారు. ఒకరి అడ్రస్ మరొకరికి దాదాపు తెలవకుండా పోయింది. జుడుం విధ్వంసానికి గురైన గడ్డి గుడిసెల కప్పులు కాలిపోయి మిగిలిన మట్టి గోడలు తల లేని మొండాల్లా మొండిగా అగుపడ్తున్నాయి. తలుగులు తెంపుకోగల్గిన పశువులు మాత్రం ఆగమైన మనుషుల్లాగే దిక్కు దివాణం లేకుండా ఆగమాగంగా తిరుగుతున్నాయి. ఊరకుక్కలకు పోలీస్ క్యాంపు పూటకూళ్ల కేంద్రమయింది. వాటిలో ఎన్ని శునకాలు నాగా పోలీసుల తూటాలకు బలై వారికి ఇష్టమైన భోజనంలో కూరగా మారాయో! ఊళ్లోని చిన్నపిల్లల బడి కమాండోలకూ, కోబ్రాలకూ నిలయమైంది. జుడుం బెజ్జిలో ఎందరిని చంపిందో, ఎంతమంది మహిళలపై అత్యాచారాలు చేసిందో చెప్పేదెవరు? బెజ్జి ఊరంతా అడ్రస్ లేకుండా పోవడంతో అక్కడ మిగిలింది పోలీసులు, జుడుం గూండాలే అని బెజ్జి చరిత్రను గుర్తు చేసుకుంటున్న నరేందర్‌కు ఎదురుగా వస్తున్న ఖాకీలు అగుపడ్డారు. వెంటనే

ఆయన దేహభాష మొత్తంగా మారిపోయింది. ఆయన చూపులు అతివేగంగా తన బలగాలను కలియజూస్తున్నాయి. పక్కనున్న కమాండర్‌తో కంటి సైగలతోనే ఖాకీల రాక గురించి మాట్లాడుతున్నాడు.

తమ మృత్యువు ఎదురుగా తాము ఎక్కబోతున్న పొలం గట్టు ఆవల పొంచి ఉందన్న సంగతిని గ్రహించలేకపోయిన పోలీసులు తాపీగా ఆ గట్టువైపే వస్తున్నారు. గట్టు ఎక్కబోతున్న పోలీసుకు అవలి వైపు ఎ.కె.తో కాల్చడానికి సిద్ధంగా ఉన్న గెరిల్లా హఠాత్తుగా కనబడడంతో మాట పెకలక 'అ! ఆ!' అంటూ నోరు వెల్లబెడుతూ వెనకడుగు వేస్తుండగానే గెరిల్లాల తూటాలతో ఆ ఖాకీ దేహం నేలకూలింది. ఇరుపక్షాల మధ్య భయంకరమైన కాల్పులు ప్రారంభమయ్యాయి.

పొలాల్లో పడిపోయి ప్రోన్ పొజిషన్‌లో గెరిల్లాలపై కాల్పులు జరుపుతున్న పోలీసులకు మద్దతుగా క్యాంపులోని పోలీసులు రాపిడ్ ఫైరింగ్ చేస్తూనే మోర్టార్ షెల్స్ వేస్తున్నారు. పిడుగుపాటు శబ్దాలతో షెల్స్ పేలిపోతున్నాయి. గెరిల్లాలు మాత్రం చాలా ఆచి-తూచి కాలుస్తున్నారు. శత్రువుకు కొంత దూరంగా ఉన్న గెరిల్లాలు అసలు కాల్చడమే లేదు. శత్రువుకు తూటాల కొరతేముంది? షెల్స్‌కు తక్కువేముంది? కానీ గెరిల్లాలకు అన్నీ కొరతే. పది నిమిషాల ఫైరింగ్‌లోనే ముగ్గురు పోలీసులు నేలకూలగా, మరో ముగ్గురు గాయపడ్డారు. గుండె జారిన పోలీసులు మాత్రం వెంటనే కాలికి బుద్ధి చెప్పి చిటికెలో క్యాంపులో పడ్డారు. ఆ కాల్పుల మధ్యనే శత్రువు తూటాకు గెరిల్లా మంగ్డూ అమరుడయ్యాడు. అది గమనించిన సహచరులు ఇద్దరు ఒక్క ఉదుటున లేచి వెళ్లి తమ సహచరుడి శవాన్ని వేగంగా తీసుకొచ్చి కమాండర్ వద్ద వేశారు. కిల్లింగ్ గ్రౌండ్ పరిస్థితి గమనిస్తున్న కమాండర్ సీజింగ్ కాషన్ ఇవ్వడంతో ఒక టీం కవర్ ఫైరింగ్‌లో వెళ్లి చచ్చిన పోలీసుల మూడు ఏ.కె.లు, వాళ్ల బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లూ, వాళ్ల తూటాల పోచ్‌లూ అన్నీ ఖాకీల ఒంటిపై నుంచి స్వాధీనపర్చుకున్నారు. క్యాంపు నుంచి శత్రువు పిచ్చిగా తూటాలు కాలుస్తూనే ఉన్నాడు. మోర్టారు షెల్స్ వేస్తూనే ఉన్నాడు. ఆ పరిసరాల్లోనే ఉన్న మందుపాతరల నిరోధక వాహనం గెరిల్లాల పైకి దూసుకురావడానికి సాహసించక ఉన్న చోటు నుంచే పిచ్చోడి చేతిలో రాయిలా గురి లేకుండా కాలుస్తూనే ఉంది. ఈ మధ్య ఒకే ఒక నెల రోజుల వ్యవధిలోనే గెరిల్లాల చేతుల్లో రెండు ఎం.పి.ఒలు తునాతునకలయ్యాయన్న వాస్తవం వాళ్లను నీరుగారుస్తోంది. వైర్‌లెస్ ఆపరేటర్ మొసపోస్తూ భయం, భయంగా పై అధికారులకు పంపిస్తున్న సందేశాలు గెరిల్లాలు వింటూనే ఉన్నారు.

అరగంటలో గెరిల్లా చర్య ముగిసింది. కిల్లింగ్ గ్రౌండ్‌లో పోలీసుల శవాలు దిక్కులేకుండా పడి ఉన్నాయి. వాటిని తీసుకెళ్లడానికి క్యాంపు నుంచి ఏ పోలీసూ రావడం లేదు. క్యాంపులో నుంచి వాళ్ల కాల్పులు ఆగడం లేదు. నరేందర్ పక్కనున్న మంగ్డూ శవం విజయానికీ, త్యాగానికీ గల సంబంధాన్ని ఎత్తిపడుతోంది.

'వెళ్దాం' అన్న ఆదేశం కమాండర్ నుంచి రావడంతో గెరిల్లాలు మంగ్డూ శవాన్నీ, మూడు కొత్త తుపాకులనూ, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లనూ పట్టుకొని విజయోత్సాహంతో బయలుదేరారు.

నరేందర్ మరోసారి ఎదురుగా ఉన్న బెజ్జి వైపు చూశాడు. శవంతోపాటు నడుస్తున్న

సరేందర్‌కు బెజ్జి ఎర్రెర్రగా అగుపడుతోంది. పోలీసులు ఇంకా షెల్స్ వేస్తున్నప్పటికీ ఆ చప్పుళ్లకన్నా ఆయన ఊహల్లో బెజ్జిలో మళ్లీ ఆడుతున్న పిల్లల కేరింతలే వినపడుతున్నాయి. దాదాపు 20 ఏండ్ల కిందట తెలుగు గూడెంలోని యువతతో కబడ్డీ ఆడిన జ్ఞాపకాలు, ఆ ఆటలో గెరిల్లాల టీమే గెలిచి ప్రైజ్ పొందిన సంతోషం, బతికి చెడిన బెజ్జి సంస్థానాధీశుల వారసుల మెచ్చుకోలు సహా అలనాటి జ్ఞాపకాల చిత్తడిలో మునిగిన ఆయన తూటాల చప్పుళ్లకు విసురుగా తోకలు లేపుతూ పరుగెడుతున్న పశువులు నాగళ్లతో దున్నడానికి వెళుతున్నట్టు ఊహించుకుంటున్నాడు. సల్వాజుడుం సృష్టించిన విధ్వంసంలో నుంచి ఫీనిక్స్‌లా ఎన్నో ఊళ్లు పుట్టుకొచ్చినట్టూ బెజ్జి మళ్లీ వస్తుందన్న ఆశతో నరేందర్ శవం మోస్తున్న వాళ్లకు తన భుజాన్ని అందించాడు. నెత్తుటి వాసనల మధ్య ఆయన ఆలోచనలు బెజ్జి చుట్టే తిరుగుతున్నాయి. మట్టివాసనలతో మురిసిపోతున్నాయి.

మంగ్డూ శవం చుట్టూ వందలాది గెరిల్లాలు, జనాలు గుమిగూడి ఉన్నారు. శత్రువు నుంచి స్వాధీనం చేసుకున్న తుపాకులు శవం పక్కన విజయచిహ్నంగా నిల్చి ఉన్నాయి. వాళ్లంతా మంగ్డూ గురించే మాట్లాడుకుంటున్నారు.

చాలా పేదరికంలో పుట్టి పెరిగిన మంగ్డూ గత ఆరేళ్లుగా విప్లవోద్యమానికే అంకితమై పని చేస్తున్నాడంటూ ఆయన మంచితనాన్నీ, ఆదర్శాలనూ గెరిల్లాలు తలచుకుంటున్నారు. ఊరి పిల్లలు శవాన్నీ, తుపాకులనూ పదే పదే పుణికి పుణికి చూస్తున్నారు. శవంపై జనతన సర్కార్ వాళ్లు రెండు నక్షత్రాలతో పాటు మధ్యలో సారించిన విల్లును హత్తిన జెండాను కప్పారు. అప్పటికే కమాండర్ పార్టీ జెండా కప్పగా, తమ సంప్రదాయం ప్రకారం జనం శవం దగ్గర డబ్బులు పెడుతున్నారు. కలిగిన వాళ్లు కొత్త గుడ్డలనూ శవం పక్కన ఉంచుతున్నారు. అక్కడ ఎవరూ పెద్దగా శోకం పెట్టి మాత్రం ఏడవడం లేదు. విచారంతో మనసులు చిన్నపుచ్చుకుని చేష్టలుడిగినట్టు ఏ ఒక్కరూ అగుపడ్డం లేదు. 'జీవితమే యుద్ధం అయిన చోట, త్యాగమే జీవితమైన వేళ అలాగే ఉంటుందేమో'నని రాహీ సమాధానపడుతూ శవం గుండెపై గుర్తుగా మిగిలిన గాయాన్ని పరిశీలించి, జనాన్నీ, పిల్లలనూ చూస్తూ నరేందర్ వైపు అడుగులు వేశాడు.

'కామ్రేడ్ రాహీ! మంగ్డూ సంస్మరణ సభ జరిపి శవాన్ని వాళ్ల ఇంటికి పంపుదాం' అంటున్న నరేందర్ మాట ముగుస్తుండగానే రాహీ తలూపుతూ 'సరే' అన్నాడు.

ముగ్గురు ముగ్గురుతో కూడిన వరుసల్లో గెరిల్లాలు, ప్రజలు నిశ్శబ్దంగా శవం ముందు నిల్చున్నారు. 'ఉల్టాశస్త్ర్' కాషన్ వినబడడంతో గెరిల్లాలు తమ టోపీలు తీసి, తుపాకి గొట్టాలను నేల వైపు చేసి అమరుడికి గౌరవంగా, ఆయనను స్మరిస్తూ మౌనంగా తలలు వంచి నిల్చున్నారు. నిముషం తర్వాత వాళ్లంతా 'పొడియం మంగ్డూ అమర్ రహే, అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం, గ్రీన్‌హంట్‌ను ఓడిద్దాం, దండకారణ్యాన్ని విముక్తి చేద్దాం, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోవాది) జిందాబాద్, పిఎల్‌జిఎ జిందాబాద్' అంటూ ఒక్కసారి గొంతెత్తి నినదిస్తుంటే మధ్యలో దూరంగా హెలికాప్టర్ వెళుతున్న చప్పుడు విన్న రాహీ మృతపోలీసుల కోసం 'పుష్పక విమానం' వెళుతూందనుకున్నాడు.

శవం ముందు కూచున్న గెరిల్లాలనూ, ప్రజలనూ ఉద్దేశించి కమాండర్, రాహీ మాట్లాడారు. మంగ్డూ జీవితాన్ని కమాండర్ ప్రజలకు పరిచయం చేయగా, రాహీ మంగ్డూ ఆశయాల స్ఫూర్తితో ప్రజాయుద్ధాన్ని మరింత తీవ్రం చేయాలన్నాడు. 'దండకారణ్యాన్ని వల్లకాడుగా మార్చాల'ని ఈ మధ్యే మాడ్ కొండల్లోకి భారత సైన్యం దిగింది. ఇప్పటికే ఖాకీల దాడులతో మన దగ్గర వందలాది ఆదివాసీ గ్రామాలు బెజ్జిలా తయారయ్యాయి. వందలాది మంది ప్రజలు, గెరిల్లాలు ఆత్మరక్షణా పోరాటంలో తమ అతి విలువైన ప్రాణాలు ధారపోస్తున్నారు. దండకారణ్య భూమిలో దాగి ఉన్న గనులు, ఖనిజాలు కబళించడానికే ఖాకీలు దిగాయి. వాటికి అండగా ఇప్పుడు సైన్యం దిగింది. కానీ ఇక్కడి మట్టంతా నెత్తుటి వాసనతో, నీళ్లన్నీ ఎరుపు రంగుతో, గనులూ, ఖనిజాలూ పడియోర సుదీర్ఘ పోరాట చరిత్రతో, అడివంతా ఆత్మగౌరవంతో, ఆకాశమంతా అమరుల సందడితో జీవిస్తోందని భారత సైన్యాలకు గట్టిగా తెలుపుదాం, దోపిడీ పాలకవర్గాలు వదిలిన ఆఖరి అస్త్రం సైన్యాన్ని సైతం ఎదుర్కోవడానికి మనం సిద్ధం కావాలి' అంటూ బిగించిన పిడికిలి పైకి ఎత్తడంతో మరొక్కసారి విప్లవ నినాదాలు మిన్నుముట్టాయి.

శవానికి అంతిమ వీడ్కోలు చెప్పడంలో భాగంగా గెరిల్లాలు వరుసగా ఒక్కొక్కరూ వచ్చి మంగ్డూకు బిగించిన పిడికిళ్లతో లాల్‌సలాం చేస్తున్నారు. మహిళలు కొద్దిమంది మాత్రం ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రేమగా శవం తల నిమురుతూ తమ తలకు వేళ్లు నొక్కుకుంటున్నారు. ఆదివాసీలలో అది ఆప్యాయతకు నిదర్శనం. దూరంగా నరేందర్ రేడియో వార్తలు వింటూ భారంగా తలూపడం చూసిన రాహీ అటు కదిలాడు.

'కామ్రేడ్, ఛత్తీస్‌గఢ్ వార్తలన్నీ ప్రజలను చాలా రెచ్చగొడుతున్నాయి. నెలరోజుల్లో మన చేతిలో దాదాపు 40 మంది పోలీసులు చనిపోయారనీ, ప్రజలంతా అతి సంవేదనాభరితంగా ఉన్నారంటూ న్యూస్‌రీడర్ తాజా వార్తగా కోయ కమాండోలతో కూడిన పోలీసు వాహనం ఒకటి ఇప్పుడే తృటిలో మందుపాతర ప్రమాదం నుంచి బయటపడిందని చెప్పాడు. వల్లకాడుగా మారిన బెజ్జి గురించి వాస్తవాలను దాచి పెట్టిన మీడియా, సైన్యం దిగిందన్న నిజాన్ని మరుగున పెడుతున్న మీడియా జనాలను రెచ్చగొట్టడానికి అంకితమైంది' అంటూ నరేందర్ చెపుతుండగా శవాన్ని గెరిల్లాలు ట్రాక్టర్ వద్దకు తరలించారు. వందలాది జనం 'పొడియం మంగ్డూ అమర్ రహే' అంటూ నినదిస్తుండగా ట్రాక్టర్ హెడ్‌లైట్లు ప్రసరించిన వెలుగులతో దారి అంతా కాంతులు చిమ్మింది. ఆకాశంలోని నెలవంక పూర్ణిమ వైపు సాగుతోంది. 24 గంటల్లో మంగ్డూ జీవితం చరిత్రకెక్కింది. పోరాట వారసుడిగా అది పడియోర జాబితాలో చేరింది. నెత్తుటి వాసనలతో ట్రాక్టర్ సాగింది. కొత్త స్మృతులతో మంగ్డూ జీవితం మొదలైంది.

## స్మృతి నెగళ్లు

రాహీ దళం ఇంద్రావతి నదిని దాటింది. నది మోకాలు లోతు మించని నీళ్లతో పారుతోంది. కొన్ని చోట్ల మరీ తగ్గింది. ఏప్రిల్ నెలలోనే నది ఇంత చిక్కిపోతే జూన్ ఎండలకు ఇంకెంత చిక్కిపోతుందోనని ఊహించుకుంటూ దళంతో పాటు నది దాటిన రాహీకి ఎదురుగా ఎత్తైన కొండ అగుపడింది. ఒక్కసారి కళ్లు పైకి లేపి చూశాడు. కానీ కొండ శిఖరం కనుచూపు

మేరలో అగుపడలేదు. 'ప్చ్! కాకూర్, దారకొండ, డొంకరాయి కొండల ముందు ఈ కొండెంత?' అనుకుంటూ ఎత్తైన ప్రతి కొండ ఎక్కే ముందు గత అనుభవాలను గుర్తు చేసుకోవడం అలవాటైన రాహీకి అదే కొండెక్కే ధైర్యాన్నిస్తోంది.

కొండెక్కుతున్న రాహీకి వెనుక వస్తున్న శ్యాం అగుపడడం లేదు. కానీ శ్యాంకన్నా భారీకాయం రఫీక్ మోస ఎగబోస్తూ, కొండెక్కుతూ అగుపడ్డాడు. 'శ్యాంకన్నా 20 ఏండ్లు చిన్నవాడు. ఆ మాత్రం ఎక్కకపోతే రఫీక్‌ను యువకుడని ఎలా అంటాం?' అని తనలో తానే అనుకుంటూ ముసిముసిగా నవ్వుతూ రాహీ ముందుకు చూస్తే బక్కపల్చని రతన్ ఊతకర్రతో వడివడిగా అడుగులు వేస్తూ అగుపడ్డాడు. ఎండలో నడుస్తున్న మోతి ముఖం కందిపోయి కోతిముఖంలా తయారై అందర్నీ నవ్విస్తోంది. నడుస్తున్న దళం పది నిముషాల్లో శిఖరాన్ని చేరింది. కమాండర్ చిన్నగా విజిల్ ఊదడంతో అందరూ ఆగిపోయారు. తల మీది బరువులూ, వీపుల కిట్లూ దించుకున్నారు. తమ వెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ డబ్బాల్లోని నీళ్లు గటగటా తాగి, చెమటలు కక్కుతున్న ముఖానికి చేతి రుమాలుతో గాలి తగిలిస్తున్నారు.

తొలిదళాల వాళ్ల చేతుల్లో వేసవి వస్తుందంటే నీళ్ల కోసం జనం దగ్గర అడుక్కున్న సొరకాయ బుర్రలే ఉండేవి. వాటికి దట్టంగా చెట్ల నార అల్లడం, అదీ అందమైన డిజైన్‌లో అల్లడం, స్టైల్‌గా జబ్బకు వేలాడదీసుకుని నడవడం గుర్తొచ్చిన రాహీకి ప్లాస్టిక్ డబ్బాలను పరిచయం చేసిన రంగన్న వెంటనే గుర్తొచ్చాడు.

రంగన్నకి కమ్మరి కులస్థ నేపథ్యం ఉంది. జగిత్యాల ప్రాంతం వాడు. పనిలో మంచి నిపుణుడు. నిరంతరం కష్టపడే అర్ధశ్రామికుడు. దశాబ్దంన్నర కాలం విప్లవోద్యమంలో పని చేసిన ఆయన గెరిల్లా జీవితానికి సరిపడే టెక్నిక్కులు కనిపెట్టడంలో, సరళమైన సాహితీ రచనలు చేయడంలో, ప్రజల బాణీల్లో పాటలల్లడంలో మంచి పట్టు సాధించినవాడు. కానీ అనైతికత ఆయనలో పరాకాష్టకు చేరి ఆయన విప్లవ జీవితానికి చరమగీతం పాడింది అంటూ తనలో తానే సుదీర్ఘ గతాన్ని గుర్తు చేసుకుంటుండగా శ్యాం ఆయన ముందు కిట్టు దించుకుని చతికిలపడ్డాడు.

'మాకన్నా ఏడు నిమిషాలు, రఫీక్ భాయి కన్నా నాల్గు నిమిషాలు లేటు' అన్నాడు శ్యాంను ఉద్దేశిస్తూ రాహీ.

శ్యాం ముసిముసిగా నవ్వుతూ 'అంతే కదా!' అన్నాడు.

'చూడు శ్యాం, గుట్టకు ఏడు నిమిషాలు, గంటకు 10 నిమిషాలు నీవు వెనుకబడితే మనం నరేందర్‌ను చేరడానికి కనీసం పది గుట్టలు ఎక్కి దిగాలి, కనిష్టంగా 70 గంటలు నడవాలి అంటే నీవు ఎంత వెనుకబడతావో చెప్పు' – రాహీ.

'అబ్బ! లెక్కల గొడవ పడలేక ఇంట్లో, స్కూల్లో చివాట్లు పడేవాడిని. నువ్వు మళ్లీ ఇక్కడ అదే లెక్కల ప్రశ్నతో వస్తున్నావు. నీ ముందు వరుసలో మా లెక్కల టీచర్ మీనా ఉంది. ఆమెను అడుగు. అయినా రాహీ, చేగువేరా చెప్పాడు కదా, 'గంటకు ఒక దళం ఎంత వేగంగా వెళ్తుందంటే, చివరివాడి వేగమంత' అని, కాబట్టి మీరెంత పరిగెత్తినా నా కోసం ఆగాల్సిందే

కదా, వీ ఆర్ కామ్రేడ్స్ ఇన్ ఆర్మ్స్' అంటూ గలగలా నవ్వాడు. రాహీ ఆ నవ్వులో భాగమయ్యాడు.

చిన్నగా రెండు విజిల్స్ రావడంతో అందరి కిట్లూ యథావిధిగా వీపెక్కాయి. మూటలు తల మీద కూచున్నాయి. నడక సాగుతోంది. అరగంట నడిచిన దళం ఓ చోట ఆగింది. ఈ పూట ఇక్కడే మన డేరా అన్నాడు రతన్. అందరికన్నా సంతోషంగా రాహీ, శ్యాం, రఫీక్‌లు క్షణం కూడా లేట్ చేయకుండా కిట్లు దించుకున్నారు. పాలిథిన్ షీట్లు పరుచుకున్నారు. కాళ్లు బార్లా జాపి చేతులు వెనక్కి ఆన్చి అలసిన ముద్రలో కూచున్నారు.

ముగ్గురు పెద్దల అవస్థ చూసిన సమర్ వినయంగా చాయ్ సంచీ, మగ్గూ తీసుకుని కిచెన్ వైపు దారి తీశాడు. అరగంటలో ముగ్గురికి చాయ్ అందడంతో వాళ్లు చాయ్ తాగుతూ తమ అలసట తీర్చుకున్నారు.

'ఈ రోజు బ్రూస్‌లీ సినిమా చూడాలి' అంటూ గడుగ్గాయ్ వికాస్ తన ప్రతిపాదనను ముందుకు తెచ్చాడు. 'లేదు, ఓంపురి నటించిన 'అర్ధసత్య' అంది కరుణ. '300 స్పార్టా అవుతేనే నేను చూస్తా' అన్నాడు గగన్. 'నాది మరో ప్రపోజల్ ఉంది. 'హమ్ ఖేలే హై జీ జాన్‌సే' కొత్తగా వచ్చిన సినిమా ఉంది. అది చూద్దాం. అది స్వాతంత్ర్య సమరం నాటి చిట్టగాంగ్ ఘటన ఆధారం చేసుకుని తీశారు. సూర్యాసేన్ పాత్రకు అభిషేక్ సరిపోలేదు గానీ సినిమా మనం చూడొచ్చు' అన్నాడు రఫీక్. 'ఈ ప్రపోజల్ బాగుంది' అన్నాడు శ్యాం. క్షణాల్లో బ్యాటరీ, డీవీడీ అన్నీ తయారైనాయి. ప్రేక్షకులూ వచ్చారు. 'గెరిల్లాలు తెలుగుకన్నా హిందీనే ఎందుకు కోరుకుంటారు శ్యాం' అన్నాడు రాహీ.

'మన చర్చలు తర్వాత బాబు, ముందు చిట్టగాంగ్ సినిమా చూద్దాం' అంటూ శ్యాం కళ్లజోడు సర్దుకుంటూనే 'మనది ఉత్తరాది ప్రయాణం కదా' అని మాత్రం కలిపాడు.

రోజుకు మూడు పూటలూ నడుస్తూ, ఒకటీ, రెండు కొండలు రోజూ ఎక్కుతూ, దిగుతూ పది రోజుల్లో రాహీ దళం నరేందర్ వద్దకు చేరింది. రాహీ దళానికి స్వాగతం పలుకుతూ దాదాపు అరఫర్లాంగ్ పొడవునా నిల్చున్న గెరిల్లాల లైన్‌లో నరేందర్ ఎక్కడబ్బా అనుకుంటూ రాహీ కళ్లు లైన్ వెంట పరుగెడుతున్నాయి. సందెలు పడే వేళ ఆ శ్యామవర్ణుడు ఎక్కడబ్బా అనుకుంటూనే ప్రతీవాళ్లను పరికించి చూస్తూ 'లాల్‌సలాం' అంటూ ఆప్యాయంగా బదులు చెప్పుతూ ముందుకు కదులుతున్నాడు. రెండడుగుల దూరంలో మరో కామ్రేడ్ ఆవల నరేందర్ ఆకారం అగుపడడంతో రాహీ ముఖం శుభోదయ కమలంలా విప్పుకుంది. నరేందర్ అంతే ఆప్యాయంగా తన చేయి చాచడంతో రెండు చేతులూ బలంగా కరచాలనం చేసుకున్నాయి. సీనియార్టీ, పెద్దా అనే పనికిమాలిన భావన వాళ్లిద్దరి ఆలింగనానికి అడ్డు తగిలి నిండుగా ఇద్దరూ కళ్లతోనే 'క్షేమం' అన్న సైగలు చేసుకున్నారు. అలా మరో 50 అడుగులు వేయడంతో 'లాల్ సలాం' సంప్రదాయం ముగిసింది.

'ప్రయాణం ఎలా సాగింది? మనవాళ్లంతా క్షేమమేనా' – నరేందర్.

'ఆ! పెద్ద ఇబ్బంది ఏం కాలేదు. పోలీసులు అంతా ఉప ఎన్నికల లొల్లిలో మునిగారు. చాలా చోట్ల అదనపు పోలీస్ క్యాంపు వేశారు' – రాహీ.

'మోతీ! మీ బ్యాచ్ వాళ్లు ఆ ఇప్పచెట్టు నుంచి ఈ తిర్మన్ చెట్టు వరకూ కవర్లు చూసుకోండి కామ్రేడ్. తూర్పు దిశకు ఫైరింగ్ ఆర్క్ చెప్పు. ఉదయాన్నే ఒక పందిరి వేస్తే నీడ అవుతుంది' అంటూ గెరిల్లా బలగాల కమాండర్ మోతీతో చెప్పి వెళ్లిపోయాడు.

మోతీ తన దళం వాళ్లందరికీ కవర్లు చూపింది. పరిసరాల్లో తాడివనంలాగే పెద్ద-పెద్ద తాడిచెట్లుండడంతో ఉదయాన్నే తాటి కమ్మలతో చల్లని పందిరి వేసుకోవచ్చు అని మనసులో ఊహించుకున్న మోతీ ఆ మాటే సోనారు, గగన్‌లతో అంది.

వాళ్లిద్దరూ ఒకేసారి 'ఇంగో' అన్నారు.

రాహీ, నరేందర్, శ్యాం, రఫీక్‌లు తమ మాటల్లో తామున్నారు. పశ్చిమాసియా నుంచి అన్నా హజారే వరకు వాళ్ల చర్చలు నడుస్తున్నాయి.

'పట్టణ యువతలో గూడు కట్టుకున్న నిరసనను, నిప్పులు చెరుగుతున్న ఆగ్రహాన్నీ హజారే చక్కగా తన అవినీతి వ్యతిరేక పోరాటం వైపు మళ్లించుకోగలుగుతున్నాడు. నిజానికి వీళ్లంతా విప్లవోద్యమంలో సమీకరించబడాల్సిన వాళ్లు' అన్నాడు రఫీక్.

'అవును, పరిస్థితి చాలా అనుకూలంగా ఉంది. కానీ ఏం లాభం? మనం పట్టణాల్లో చాలా దెబ్బ తిన్నాం కదా' శ్యాం.

'ఆ నిప్పు కణికలు చల్లారేవి కావు. అన్నాకు అంత శక్తి లేదు. మన అడవి ఉద్యమం తప్పకుండా త్వరలోనే వాళ్లను చేరుకోగలుగుతుంది' అన్నాడు రాహీ.

'అదెలా?' అన్నాడు నొసలు చిట్లిస్తూ రఫీక్.

'మన నరేందర్ చింతల్‌నార్ రిపోర్టు చెప్పితే మీకే తెలుస్తుంది' అన్నాడు రాహీ.

'సరే, మీరు అలిసిపోయి ఉన్నారు. రేపు ఉదయం కూచుందాం' అంటూ నరేందర్ చర్చకు తెర దించాడు.

* * *

ఉదయం నాల్గుగంటలకే క్యాంపు అంతా అలర్ట్ అయ్యారు. క్యాంపు చుట్టూ పరిసరాలు చెక్ చేయడానికి పెట్రోలింగ్ బ్యాచ్‌లు వెళ్లి వచ్చాయి. ఆరు గంటలకు ముందే రోజంతా ప్రచండ నిప్పులు కురిపించే రవితేజుడు తన ప్రతాపంతో కొండల్లో నుంచి పొడుచుకు వస్తున్నాడు. ఉదయాన్నే పాచి అంబలి తాగి కడుపు చల్లార్చుకున్న గెరిల్లాలు స్నానాలకు బయలుదేరారు. అప్పటికే స్నానం పూర్తి చేసుకున్న రాహీ, శ్యాంలు నరేందర్ వద్దకు చేరుకున్నారు. రఫీక్ స్టెత్ పట్టుకుని బి.పి. ఆపరేటర్‌తో తన టీంను వెంటేసుకొని అన్ని డేరాలు తిరుగుతున్నాడు.

'క్యా రఫీక్ భాయి? మరీంజోంకా హాల్ క్యాహై?' (రఫీకన్నా! రోగుల పరిస్థితి ఎలా ఉంది?) – రాహీ ప్రశ్న.

'ప్రస్తుతం బాగానే ఉంది' అంటూ డాక్టర్ జవాబు ఇచ్చాడు. 'మీ బి.పి. చూడమంటారా? డాక్టర్ ప్రశ్న.

'థాంక్స్, ఫర్వాలేదు. తర్వాత మీ వద్దకే వస్తాను' రాహీ జవాబు.

నరేందర్ ఇవేవీ పట్టించుకోవడం లేదు. ఆయన ఆలోచనలన్నీ తింపురం, ముద్రుం,

తాడిమెట్లల చుట్టే తిరుగుతున్నాయి. మార్చ్ 11-16 మధ్య జరిగిన ఘటనలే ఆయన గుండెల్లో పొటమరిస్తున్నాయి.

'రాహీ, ఏప్రిల్ నుంచి మన టి.సి.ఒ.సి. ప్రారంభమవుతుంది కదా! దానికి ముందే మనలను ఒక గట్టి దెబ్బ తీయాలనే పెద్ద ప్లాన్‌తోనే పోలీసులు దాడికి వచ్చారు. అలాగే 2010 ఏప్రిల్ 6, మన పిఎల్‌జిఎకు గొప్ప విజయ దినం. దానికి విరుగుడుగా ముందే పోలీసులు మనపై దాడికి దిగారు. ఇదీ వాళ్ల దాడికి అసలు నేపథ్యం. కాకపోతే అనేక కట్టుకథలు మీడియాకు విడుదల చేశారు' అంటూ నరేందర్ రిపోర్టు మొదలుపెట్టి ఒక్కసారి చుట్టూ పరిసరాలు కలియజూశాడు.

నరేందర్‌లో ఎలాంటి ఉద్వేగం, ఉద్రేకం కనబడడం లేదు. ఉద్రిక్తత అంతకన్నా లేదు. తాను చెప్పాల్సిన విషయాలు చాలా నెమ్మదిగా, సౌమ్యంగా తన వాళ్లతో పంచుకుంటున్నాడు. ఏ విషయం చెప్పినా మూలాల్లోకి వెళ్లి అమూలాగ్రంగా చెప్పడం ఆయన స్వభావం. ఆయన అందులో ఎంతగా లీనమైపోతారంటే ఆయన చెప్పింతర్వాత ఎదుటి వాళ్లకు మళ్లీ ప్రత్యేకంగా ఎదురు అడగడానికి పెద్దగా ఏమీ మిగలకుండానే చెప్పడాన్ని ఆయన ఒక కళగానే అభ్యసించాడు. నరేందర్ మళ్లీ తన సంభాషణను ప్రారంభించాడు.

'మార్చ్ 11నాడు పోలీసులు ఉదయాన్నే ముర్రుం (మోరపల్లి) చేరారు. పోలీసులు వస్తున్న సమాచారం మిలీషియా అందించిన వెంటనే గ్రామస్తులు ఎప్పటిలాగే అడవిలోకి జారుకున్నారు. మాడవి  చూలాలు మాత్రం చెట్టుపై దాక్కుంటే అగుపడనేమో అనుకొని చింతచెట్టు ఎక్కాడు. కాగా పోలీసుల రాక కబురు వినని మహిళలు ఇద్దరు ఊళ్లోనే ఉండిపోయారు. ఊరి పక్కన ఇప్పపూలు ఏరుకుంటున్న ఒక కుటుంబం అక్కడే ఉండిపోయింది. ఊళ్లోకి వచ్చిన పోలీసులు వెంటనే ఇండ్లపై పడ్డారు. చేతికి దొరికిందల్లా సదురుకున్నారు. కంటబడిన ఇద్దరు మహిళలపై అత్యాచారం చేశారు. ఇదంతా జరుగుతుండగానే ఇండ్లకు నిప్పంటించే బ్యాచ్ ఆ పని పూర్తి చేసింది. ఇప్పపూలు ఏరుకునే తండ్రి, కూతురు, కొడుకును కాపలా నిలిచిన పోలీసులు కట్టడిలో తీసుకున్నారు. తమ పని ముగిశాక పోలీసులు క్షణం కూడా ఆలస్యం చేయకుండా వచ్చిన దారిన ముగ్గురు గ్రామస్తులతో బయలుదేరారు. వెనక్కి వెళుతున్న పోలీసుల్లో ఒక కోయ కమాండో తన డేగచూపులతో చెట్టు పైనున్న చూలాలును పసిగట్టిన వెంటనే ఫైర్ చేశాడు. ఆ కాల్పుల్లో చూలాలు పైనే కన్నుమూశాడు. ఈ కబురు మాకు సరిగ్గా 10.30కు చేరింది. మేము ఏ మాత్రం ఆలస్యం చేయకుండా పరుగు పరుగున ముర్రుం వెళ్లేసరికి సరిగ్గా పగలు 12 అయింది' అంటూ నరేందర్ గట్టిగా శ్వాస పీల్చి వదిలాడు.

'ఇదన్న మాట పోలీసుల ప్రతాపం. నక్సలైట్ల ఆయుధాల ఫ్యాక్టరీని ధ్వంసం చేయడానికి వెళ్లినారన్న వార్తలోని వాస్తవం ముర్రుంలో 33 ఇండ్లకు నిప్పంటించడం. వీళ్లన్న మాట ప్రజల హృదయాలనూ, మెడల్లనూ గెల్చుకునేవాళ్లు' అన్నాడు శ్యాం.

'ప్రాణాలు తోడేసే మృత్యుక్రీడలో పోలీసులు చరమ స్థాయికి చేరారు శ్యాం. చూలాలును

చెట్టుపైనే కోయ కమాండోలు కాల్చడం రజాకార్లను తలపింపజేస్తున్నది. గర్భిణీ స్త్రీల పొట్టలను చీల్చడం, చిన్నారి పిల్లల చేతివేళ్లు నరకడం, వృద్ధురాళ్ల వక్షోజాలు కోయడం, యువతులపై మృగాల్లా పడి సామూహికంగా అత్యాచారం జరపడం, పురుషుల మర్మాంగాలను నుజ్జు నుజ్జు చేయడం అబ్బా! ఇరాక్‌లోని అబూగ్రేబ్‌లాంటి జైళ్లలో అమెరికా సైనికుల ఆగడాలను గుర్తుకు తెస్తున్నాయి శ్యాం' అన్నాడు రాహీ.

ఎండ తీక్షణం పెరిగింది. తాటికమ్మలతో వేసిన పందిరిగావడంతో కొంత చల్లగానే ఉంది. పందిరి గుంజకు వేలాడుతున్న షాగల్ తీసుకుని చల్లటి నీళ్లు ముగ్గురూ తాగారు. బయట ఎవరూ అగుపడడం లేదు. సెంట్రీ వెళ్లాల్సినవాళ్లు వెళుతుంటే, డ్యూటీ ముగిసిన వాళ్లు డేరాల్లోకి వచ్చి సేద తీర్చుకుంటున్నారు. నరేందర్ తిరిగి తన జ్ఞాపకాల్లోకి వెళ్లాడు. ఆయనలో జ్వలిస్తున్న ఆ స్మృతి నెగళ్ల సెగలు బయటి వేడికన్నా ఎక్కువగా ఆయనను దహించి వేస్తున్నాయనడానికి ఆయన గంభీర ముద్రే సాక్ష్యంగా ఉంది.

'మన గెరిల్లాలంతా ఊళ్లోకి వెళ్లేసరికి ఊరి దృశ్యం చాలా భయంకరంగా అగుపడుతోంది. ఇండ్లు తగలబడిపోతున్నాయి. ఆ అగ్నికీలలకన్నా ప్రజల గుండెలు అధికంగా రగిలిపోతున్నాయి. తమ ప్రాణం కన్నా మిన్నగా చూసుకునే ధాన్యం, పప్పులు, అడవి గెడ్డలూ జనం ఆ మంటల్లోనే బయటకు తెచ్చుకుంటున్నారు. ఎండిన మాంసం ముక్కలు మాడులు అయ్యాయి. అవి కాలి గబ్బు వస్తున్నాయి. పోలీసులు చంపిన కోళ్లు, పందులు, మేకల తోళ్లన్నీ కాల్పులతో కమురు వాసన వేస్తూ అడవి గాలి అంతా కలుషితమైపోయింది. ఆ దృశ్యాలు చూసిన గెరిల్లాలు ప్రజలతో కలిసిపోయారు. పొద్దుగూకులు మేమంతా అక్కడే ఉండి మంటలు చల్లార్చి సాయంకాలం తిరిగి డేరాకు బయలుదేరాం. ఇండ్ల మంటలు చల్లారాయి గానీ వాళ్ల గుండెల్లోని మంటల్ని చల్లార్చడం ఎవరి వల్లవుతుంది రాహీ?' అంటూ నరేందర్ ఆగాడు.

'పోలీసులు తమ వెంట తీసుకెళ్లిన రైతు, ఆయన కూతురు, కొడుకు పరిస్థితి ఏంటి?' అంటూ శ్యాం, నరేందర్ వైపు చూశాడు.

'ఆ! వాళ్లను విడిచిపెట్టాలని కోరుతూ 25 మంది మహిళలు తెల్లారి చింతల్‌నార్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులతో ఘర్షణపడ్డారు. చివరకు రైతునూ, ఆయన కొడుకునూ, ఒంటి మీద గుడ్డలు లేని స్థితిలో అతి దైన్యంగా అగుపడుతున్న ఆయన కూతురునూ ఠాణా నుంచి తమతో పాటు ప్రజలు ఊళ్లోకి తెచ్చుకున్నారు' అంటూ సమాధానమిచ్చాడు నరేందర్.

'గొప్ప జనం! అది కాశ్మీరైనా, మణిపూరైనా, దండకారణ్యమైనా 'ఘర్షణ ప్రాంతాలు' ఏవైనా ప్రజల సమస్యలు ఒకటే. వాళ్ల ఔన్నత్యం చాలా గొప్పది. ఒకనాడు దొరల గడీల్లో అత్యాచారానికి గురైన ఆడపడుచులను తెలంగాణ వీరజనం ఇదే విధంగా తమ అక్కున చేర్చుకున్నారు. పోలీసులు పోరుబిడ్డలపై అత్యాచారాలు చేయగల్గుతున్నారేమో గానీ వాళ్ల గుండెల్లోని ఆశయాల సౌధాలను చీల్చడం ఎవరి తరం అవుతుంది నరేందర్?' అంటూ శ్యాం చాలా ఉద్రేకంగా తన భావాలను వాళ్ల ముందు పెట్టాడు.

నరేందర్ ఔనన్నట్టు తలూపుతూ మళ్లీ రిపోర్టును మొదలు పెట్టాడు. "12వ తేదీ పోలీసులు

ఎవరూ రాణా బయటకు రాలేదు. 13నాటి ఉదయాన్నే మేం మళ్లీ ఊరు పరిసరాల్లోకి వెళ్లాం. ప్రజలు తమ పనిలో తాము ఉంటే వాళ్లకు మేం రక్షణగా ఉండిపోయాం. సరిగ్గా ఉదయం 11 గంటలకు చాలా దూరంగా అస్పష్టంగా ఏవో కేకలు పకడో! పకడో! అంటూ వినపడ్డాయి. మళ్లీ తోడేళ్ల మంద వస్తుందనుకున్నాం. మేం చాలా అలర్ట్‌గా ఉంటూ ప్రజలను అలర్ట్ చేశాం. కానీ మధ్యాహ్నం వరకూ వాళ్ల జాడ లేదు. దీంతో మేం భోజనాలకు వెళ్లిపోయాం. పగలు రెండు గంటలప్పుడు పుల్లాన్‌పెల్లి వైపు మోర్టార్ షెల్స్ పడిన చప్పుడు విన్నాం. వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకూడదంటూ కమాండర్ అనడం పూర్తికాక ముందే గెరిల్లాల పరుగు మొదలైంది. మళ్లీ మేమంతా ఊరి పరిసరాల్లోకి చేరేసరికి చీకటి పడింది. కాసేపు అక్కడే ఆగిపోయాం. తింపురం ఊళ్లో ఖాకీలున్నట్టు అర్థమైంది. మేం ఇండ్ల పక్క పొలాల్లోనే కవర్లు తీసుకుని కూచున్నాం. పోలీసులు తెల్లవార్లూ చావుభయంతో కాల్పులు జరుపుతూనే ఇండ్ల బయటికి రాకుండా ఊళ్లోనే బందీలయి ఉండిపోయారు. మేం పొద్దుపొడవక ముందే ఊరికి దూరంగా అడవిలో పోలీసులు వెళ్లే దారిలో మాటుదాడికి కూచున్నాం. 14 నాడు ఉదయం 10 గంటల వరకు ఊళ్లో నానా బీభత్సాన్ని సృష్టించి మెల్లగా కొల్లగొట్టిన సొమ్ముతో బయలుదేరారు. వీళ్ల ప్రతి చర్యా, ప్రతి కదలికా జనం మాకు వేగుల్లా వెంట వెంట చేరవేస్తున్నారు. సరిగ్గా 10.45 నిమిషాలకు 350 మంది కమాండోలు మా మధ్యకు చేరుకున్నారు. ఇంకేముంది? మన స్నైపర్ సమీర్ కాల్చిన మొదటి తూటాకే ఒక కోయ కమాండో కిమ్మనకుండా నేలకూలిపోయాడు. సమరం మొదలైంది. 12.15కు కాల్పులు ఆగిపోయాయి. మన సీజింగ్ బ్యాచ్ అడ్వాన్స్ అయి కిల్లింగ్ జోన్ అంతా గాలింపు జరిపింది' అంటూ నరేందర్ చెపుతుండగానే శ్యాం మధ్యలో ఆపాడు 'కిల్లింగ్ జోన్ ఎంత స్థలం ఉంటుంది?' అంటూ.

'అక్కడికే వస్తున్నాను శ్యాం, మన గతకాలం కిల్లింగ్ జోన్ 80-100 గజాలు మించేది కాదుగా, కానీ ఇప్పుడు మనం, మన ప్రజా మిలీషియా, ప్రజలు అందరం కలిసే యుద్ధం చేస్తున్నాం కదా! శత్రువు కూడా వందల సంఖ్యలో వస్తున్నాడు. కాబట్టి కిల్లింగ్ జోన్ అర కిలోమీటరుకు తగ్గడం లేదు' అంటూ నరేందర్ రిపోర్టును కొనసాగించాడు. 'కిల్లింగ్ జోన్‌లో ముగ్గురు కోయ కమాండోల శవాలు, మూడు తుపాకులు దొరికాయి. ఈలోగా వందలాది జనం మన చుట్టూ మూగారు. మనం మన వీర గెరిల్లా ముచాకి గంగాల్‌ను కోల్పోయాం. ప్రజలు కిల్లింగ్ జోన్ అంతా మహాసంబరంగా తిరిగారు. ఊళ్లోకి పారిపోతున్న పోలీసులు దారెంట పారేసుకున్న సొమ్మంతా ప్రజలు తిరిగి సంతోషంగా స్వాధీనం చేసుకున్నారు. ముక్కుపుల్లలు, చెవుల పోగులు, దండ కడియాలు, కత్తులు, విల్లంబులు, డబ్బు, కోడి, పంది, మేకలు చివరకు పచ్చి మాంసపు ముద్దలు కూడా జనం వదలలేదు. అవి వాళ్ల కష్టార్జితం కదా! ఎలా వదులుతారు. మేం పగలు రెండు గంటల వరకు ప్రజల వేడుకలో భాగమై అక్కడే ఉండిపోయాం. ఊళ్లో చిక్కిపోయిన పోలీసులు తమ అధికారులతో జరుపుతున్న సంభాషణను మేం దాడిలో వాళ్లు వదిలేసిన వాకీలో స్పష్టంగా వినగలిగాం. కాలిన ఇండ్లల్లో దాగిన పోలీసులు ఒక్క అడుగు కూడా బయటకు రావడానికి సాహసించడం లేదు. "మన కమాండోలు ముగ్గురు

చచ్చారు. అదనపు బలగాలు రాకుండా మేం ఇక్కడి నుంచి రాలేం. చాలామంది కమాండోలు గాయాలతో పడి ఉన్నారిక్కడ" అంటూ పోలీసులు ఇక్కడి నుండి మెసేజ్ పంపుతుంటే అవతలి నుంచి డిఐజి కల్లూరి గట్టిగా ఆదేశాలిస్తున్నాడు – 'నాకు వంద శవాలు కావాలి. మీరు ఏమైనా చేయండి. మీకు హైదరాబాద్ నుండి హెలికాప్టర్‌లో తూటాలు వస్తున్నాయి. గాయపడిన వాళ్లను హెలికాప్టర్‌లో తరలించండి షాల్' అంటూ కల్లూరి అరుస్తున్నాడు. ఈలోగా హెలికాప్టర్ వచ్చి ఇండ్ల పక్కన వాలింది. గాయపడిన కమాండోలను తరలించారు. కమాండోల శవాలు మాత్రం ఇంకా మా స్వాధీనంలోనే ఉన్నాయి. మేం మధ్యాహ్నం మూడు వరకు ప్రజలతో ఉండి వాళ్లను జాగ్రత్తగా అడవిలోకి వెళ్లండి అని చెప్పి ముచాకి గంగాల్ శవంతో డేరాకు వెళ్లాం. కానీ వాళ్లు ముందర రోజు ఊళ్లో పట్టుకున్న బాడ్సె భీమా, మన్నూ యాదవ్‌లను మాత్రం తీసుకురాలేకపోయాం. అప్పటికే వాళ్లిద్దరినీ పోలీసులు చంపేశారు'.

'మరి పోలీసులు ఊరు వదిలి వెళ్లింది ఎప్పుడు?' – శ్యాం.

'మేం అడవిలోకి చేరాక సాయంత్రం హెలికాప్టర్ మళ్లీ వచ్చి కమాండోల శవాలను, మున్నా యాదవ్ శవాన్ని తీసుకెళ్లింది. కోయ కమాండోలు రాత్రి 10 గంటలకు ఊరు వదిలి అర్ధరాత్రి 12 గంటలకు పోలీస్ స్టేషన్ చేరినట్టు వాళ్ల వాకీ ద్వారానే మనం వినగలిగాం' అంటూ నరేందర్ ముగించాడు.

'ఇదీ అసలు విషయం. కానీ పోలీసు ఉన్నతాధికారులు ఎన్ని అబద్ధాలతో మీడియాను వాడుకున్నారు! ముప్పై మంది నక్సలైట్లు మరణించి ఉంటారని ప్రాంతీయ, జాతీయ వార్తల్లో ఊదరగొట్టారు. దూరంగా ఉన్నవాళ్లు కూడా నమ్మలేని స్థితికి వీళ్ల ప్రచారం దిగజారుతోంది' అంటూ రాహీ టైం చూసుకున్నాడు.

'సరే, మిగతా విషయాలు భోజనాల తర్వాత మాట్లాడుకుందాం' అని నరేందర్ అనడంతో ముగ్గురూ లేచారు.

కిచెన్‌లో 'కోయ కమాండోలు ఉల్టా బాణంపుల్లల్లా మోహరించి నక్సలైట్లను గట్టిగా ఎదుర్కొన్నారని పత్రికల్లో అనేక పొగడ్తలతో రాశారు. అదేంటి రాహీ?' అంటూ శ్యాం అడుగుతుండగానే నరేందర్ అక్కడకు చేరుకుని 'అంతా పత్రికల మాయ, అది పోలీసుల ఉల్టా ప్రచారం. ఆత్మస్థయిర్యం కోల్పోతున్న పోలీసులను నిలబెట్టుకోవడానికి అధికారులు సృష్టించిన పదక్రీడ అది బతుకు జీవుడా! అంటూ ఇళ్లల్లోకి దూరి బయటకు రాని కమాండోలు అంటూ ఏ పత్రిక వాస్తవాన్ని రాస్తుంది చెప్పు శ్యాం' అన్నాడు.

భోజనాలు ముగించుకున్న ముగ్గురూ తమ తమ పాల్తీన్ షీట్లపై నడుం వాల్చారు. నరేందర్ క్యాంపు విషయాలు, చుట్టుపక్కల విషయాలు కమాండర్‌ను అడిగి తెలుసుకుంటున్నాడు. 'ఊళ్లో ఎవరైనా జబ్బు పడ్డవాళ్లుంటే రమ్మనండి. మన డాక్టర్ ఉన్నాడు, వైద్యం చేస్తాడు' అంటున్న నరేందర్ తన మాట ముగించక ముందే 'ఆ పని జరుగుతూంది. కాకపోతే సరిపడా మందులు లేవు' అన్నాడు కమాండర్.

'మందులు రావడం పెద్ద గగనమవుతోంది. పోలీసులు మెడికల్ షాపు వాళ్లను చాలా

కట్టడి చేశారు. అయినా ప్రయత్నిద్దాం. అవసరమైన మందుల లిస్టు డాక్టర్‌తో రాయించు' - నరేందర్.

'సరే కామ్రేడ్' - కమాండర్.

నిద్ర లేవడంతోనే మళ్లీ ముగ్గురూ కూచున్నారు. నరేందర్ తన రిపోర్టు ప్రారంభించాడు. కానీ ఆయన ముఖంలో ఒక రకమైన బాధ స్పష్టంగా అగుపడుతోంది. ఆయన చాలా గిల్టీగా ఫీలవుతూ 'మన గంగాల్ శవాన్ని జనతన సర్కార్ ద్వారా ఇంటికి పంపలేకపోయాం. చాలా దూరం వాళ్ల ఊరు. పోతే, మన దగ్గర మనుషులు తప్ప మరే సాధనమూ లేదా రోజు' అంటూ 'ఇక్కడే మేము, ప్రజలు కలిసి విప్లవ సంప్రదాయాలతో మన కామ్రేడ్ గంగాల్‌కు అంత్య క్రియలు పూర్తి చేశాం' అన్నాడు. '15వ తేదీ పోలీసులు ఈ గ్రామాల్లోకి ఎక్కడికీ రాలేదు గానీ 16 నాడు తాడిమెట్లపై దాడి చేసి 207 ఇండ్లు కాల్చి బూడిద చేశారు. ముర్రంలో 33, తింపురంలో 56, తాడిమెట్లలో 207, మొత్తం 296 ఇండ్లు కోయ కమాండోల విధ్వంసానికి బూడిదయ్యాయి. ఇద్దరు మహిళలు వారి లైంగిక హింసకు బలి కాగా దాదాపు 30 మంది ప్రజలు తీవ్ర హింసకు గురయ్యారు. ఇదీ జరిగింది. కానీ వాస్తవాలు ప్రపంచానికి వెల్లడి గావడం లేదు. భారీ సంఖ్యలో మావోయిస్టులు చనిపోయారంటూ, మావోయిస్టులే గృహదహనాలు చేశారంటూ విడుదలైన పోలీస్ ప్రకటనలతో వాస్తవాలు గ్రహణం పట్టిపోయాయి'.

సాయంత్రం ఉక్కపోతకు ముగ్గురూ లేచి నీటి చెలిమ వైపు దారి తీశారు. అక్కడికి నేరుగా చూస్తే 100 గజాల దూరంలో తునికి ఆకు కళ్లం అగుపడుతోంది. అక్కడ చాలా సందడిగా ఉంది. నెత్తి మీద బరువైన మూటలతో కళ్లంలోకి వచ్చేవాళ్లు వస్తుంటే పోయేవాళ్లు పోతున్నారు. ఆకుల కట్టల లెక్క పూర్తి అయిందంటే వాటిని వరుసగా ఒక్కొక్కటిగా సర్ది పెట్టి వెళ్లాలి. ఎండిన ఆకులను పెద్ద పెద్ద సంచుల్లోకి ఎత్తి కుప్ప పెట్టారు. పూర్తిగా ఎండని ఆకులు ఆ బస్తాల కుప్ప పక్కనే వరుసగా ఉన్నాయి. ఆ కళ్లం వైపే చూస్తున్న రాహీ 'ఈ సంవత్సరం తునికి ఆకు కోత కూలి ఎంత ఇస్తున్నారో' అని స్వగతంలోనే మాట్లాడుకోగా తన గార్డు గగన్ 'షేకడా 105 రూపాయలు ఇస్తున్నారు కామ్రేడ్' అని బదులిచ్చాడు.

'ఈ సంవత్సరం ఆకు ఎట్లుంది గగన్?'

'అకాల వర్షాలు అన్నిటికీ ముప్పే గానీ ఆకులకు వరంలాంటిది. ఈ యేడు ఆకు చాలా బాగుంది. కానీ కొంతమందికి ఆకుల కోత రుచించడం లేదు. ఆంధ్ర కూలికే అలవాటు పడుతున్నారు.'

'ఎందుకు? ఆంధ్ర కూలికన్నా ఆకులు కోస్తే డబ్బు ఎక్కువగా వస్తుందిగా' - రాహీ.

'నిజమే, కానీ ఆ పట్టణాల సోకులు, సినిమాలు, హోటళ్లు, తిరుగుళ్లు వాళ్లను ఆకట్టుకొంటున్నాయి. ఆకుల కోత వాళ్లకు నచ్చడం లేదు. అసలు ఆదివాసీ జీవన విధానమే వాళ్లకు గిట్టడం లేదు' కమాండర్ బదులిచ్చాడు.

'కూలీకి వెళ్తున్న వాళ్లలో కొందరు చాలా చెడిపోతున్నారు. సామ్రాజ్యవాద సంస్కృతికి వాళ్లు బానిసలవుతున్నారు. దాన్నే అనుకరించడానికి ఉవ్విళ్లూరుతున్నారు. జుడుం శిబిరాలలో

చూసిందాన్నే పట్టణాల్లో వెలగబెడ్తున్నారు' అన్నాడు శ్యాం.

స్నానాలు పూర్తి చేసుకుని కిచెన్ దగ్గరకు చేరారు.

'చింతల్‌నార్ వాస్తవాలన్నీ పత్రికలకు ఎలా ఎక్కాయి నరేందర్?' – శ్యాం.

'అది రెండో అంకం, టీ తాగి చెప్పుకుందాం' – నరేందర్.

ఆరుబయటలాగా 'అడవి బయట' చెట్టు లేని ప్రాంతంలో పాలిథీన్ షీట్లు పరుచుకొని ముగ్గురూ కూచున్నారు. వాళ్లకు కొద్ది దూరంలో వాళ్ల అంగరక్షకులు పహరా కాస్తున్నారు. గత దశాబ్ద కాలంగా మధ్యస్థాయి నుంచి అత్యున్నత స్థాయి నాయకత్వ కామ్రేడ్స్ అందరికీ అంగరక్షకులను సమకూర్చడం తీవ్రమవుతున్న శత్రు సైనిక దాడులను తెలియచేస్తోంది. టీ తాగి ఉక్కపోత అవస్థల మధ్యనే నరేందర్ మీడియా ప్రపంచంలోకి వెళ్లాడు.

'రేడియో వార్తలే కదా అడవిలో మనకు పెద్ద దిక్కు. ఆకాశవాణి పూర్తిగా అవకాశవాణి, అవాస్తవాల వాణి అని మనకు తెలుసు గానీ అమాయక ప్రజలకు తెలియదు కదా! ఇక పత్రికల్లో పోలీసు కలాలు ఎన్ని విచిత్రాలు గుప్పిస్తున్నాయో ఊహించుకోవల్సిందే! ఇలాంటి సందిగ్ధ, అనిశ్చిత పరిస్థితులతో వాస్తవాలను బయటపెట్టడం ఎలా? భారీ పోలీసు వలయాల్ని ఛేదించుకొని మీడియ పర్సన్స్ రావడం సాధారణ విషయమేమీ కాదు. ఆర్‌టీఐ (రైట్ టు ఇన్ఫర్మేషన్) అంటూ, హక్కులంటూ అరిచేదంతా వాళ్లకు ప్రమాదం కాని, నష్టం లేని, హితవు కోరి రాసే విషయాలకే పరిమితం అని తెల్సిందెందరికి? అసలు ఈ విషయాలు పొక్కకుండా పాలించడమే వాళ్ల గొప్పతనం కదా! ఏమైనా, మీడియా పర్సన్స్‌ను ఆహ్వానించాలి, వాస్తవాలు వెల్లడించాలి. కొత్త మార్గాలు వెతకాలి. ఇలాంటి విషయాల్లో మనం ఇచ్చే ప్రకటనలకన్నా విలేఖర్లు రాసే విషయాలకే ఎక్కువ సాధికారత ఉంటుంది. వాళ్లే ప్రజల గొంతుకను అక్షరాల్లోకి అనువదించగల శక్తిమంతులు అనుకున్నా రాహీ' అంటూ నరేందర్ గుక్క తిప్పుకోకుండా నేపథ్యాన్ని తన సహచర కామ్రేడ్స్‌కు వివరించాడు.

'సమాచార హక్కు, విద్యా హక్కు, ఈ హక్కూ, ఆ హక్కూ అంటూ ఊదరగొట్టేదంతా ప్రజలను పక్కదార్లు పట్టించడానికే. అవేవైనా వారి కోసమే అనుమతించబడుతాయి తప్ప మరో రకంగా కాదని విప్లవ సంక్షోభమే నగ్నంగా బయటపెట్టగలుగుతుంది నరేందర్' అన్నాడు రాహీ.

'అదే జరిగింది రాహీ, జరిగిన ఘోరం విషయం మనం కబురు చేయగానే హిందూ, తెహెల్కా, హక్కుల సంఘాల కార్యకర్తలూ ఒకరి తర్వాత ఒకరు రెక్కలు కట్టుకుని వాలారనుకో! వాళ్లను నేరుగా జనం మధ్యకే వెళ్లమన్నాం. తీసుకువెళ్లే బాధ్యత జనమే తీసుకున్నారు. వాళ్లలో ఏ ఒక్కరినీ మనం కలవలేదు. వాళ్ల పని వాళ్లు స్వేచ్ఛగా చేసుకోవడమే మంచిది అనుకున్నాం మేమంతా. వాళ్ళల్లో ఎవరు వాస్తవాలు రాస్తారు? ఎవరు వక్రీకరిస్తారు? హక్కుల కార్యకర్తల్లో ఎవరు ఏ వైఖరి తీసుకుంటారు? వాళ్ల కలాల శక్తి ఎంత? నేరుగా జనానికే తెల్సిపోతుందనుకున్నాం. వాళ్లు మార్చ్ 19, 20 తేదీలు జనం మధ్య ఉండి తర్వాత బయటకు వెళ్లి రాసింది 23 నాటికి గానీ వెలుగు చూడలేదు' అంటూ నరేందర్ అభినందనపూర్వకంగా మీడియావాళ్ల, హక్కుల కార్యకర్తల పర్యటన వివరాలన్నీ విప్పి చెప్పాడు.

'జనం తల్చుకుంటే ఏమైనా చేస్తారు. వాస్తవాలను వెలికి తేవాలన్న ఆరాటం, అఫ్‌కోర్స్ కెరీరిజంతోనే ఎందుక్కాకూడదు, కానీ అది మనం తప్పకుండా ఉపయోగించగలగాలి. మనం గెరిల్లా బేసులు, జనతన సర్కార్లు నిర్మించుకోలేకపోతే ఇంతటి ప్రజాపునాదే సాధ్యమయ్యేది కాదు' అన్నాడు ఉద్వేగంగా ఉపన్యాస ధోరణిలో.

'ఆ తర్వాతే అనుకుంటా ఢిల్లీ నుంచి స్వామి అగ్నివేశ్, మరొకరు, మరొకరు వచ్చింది' – రాహీ.

'ఆ, వాళ్ల రాకనేమో మీడియాలో ప్రచారమైంది. వాళ్లు కాకుండా ఇంకా చాలా మంది ఖాకీల కంటపడకుండా అడ్డదారుల్లో వచ్చి కలం పని పూర్తి చేసుకున్నారు' – నరేందర్.

'ఎస్.పి.ఓ.లు ఎంత బరి తెగించారు. కల్లూరి పచ్చి ఫాసిస్టు. ఖాకీ బలగాల్లో కూడా పచ్చి రియాక్షనరీ భూస్వామి పాత్ర డిఐజీగా గొప్పగా వెలగబెడుతున్నాడు. మేధావులనూ, సంఘ సేవకులనూ ఏమైనా అంటే లోకం దుమ్మెత్తిపోస్తుందన్న లోకజ్ఞానం కూడా మర్చిన మదమెక్కిన అధికారి అతగాడు. ఎస్.పి.ఓ.లతో ఐఎఎస్, ఐపిఎస్‌లనే కొట్టించిన దాష్టీకుడు, ప్రతిపక్షాల నాయకులనే రోడ్డు దాటనివ్వలేదు, పల్లెలో అడుగుపెట్టనివ్వలేదు, ప్రజలను చూడనివ్వలేదంటే ఎంతటి ఫాసిస్టు పాఠాలు నేర్చుకున్నాడో ఆ ఖాకీ దుర్మార్గుడు' – శ్యాం.

'ఇలాంటి పరిస్థితులలో సైన్యం దిగింది శ్యాం, ఇంకా చూడు ఎంతటి దారుణాలు జరిగిపోతాయో! కాశ్మీర్‌లో, మణిపూర్‌లో సైన్యం చేతుల్లో మాయమైన అమాయక పౌరులు వేల సంఖ్యలో ఉంటారు. ఇంకా గడ్డు రోజులే ముందున్నాయి' రాహీ గంభీరంగా విషయాన్ని వాళ్ల ముందు పెట్టాడు.

'ప్రజల స్పందన బాగుంది రాహీ, పత్రికల్లో తాడిమెట్ల వాస్తవాలు బయటకు రావడంతో మూడు గ్రామాల ప్రజలను ఆదుకోవడానికి డబ్బు, ధాన్యం, గుడ్డలు వాళ్లకున్నదాంట్లోంచి ఉడతా భక్తిలా అందించడం మొదలుపెట్టారు. అయితే అప్పటికే మన జనతన సర్కార్లు పి.ఎల్.జి.ఎను పట్టుకొని రంగంలోకి దిగాయి. తాటికమ్మలతో తాత్కాలిక నీడ తయారు చేసి పెట్టారు' అంటూ నరేందర్ ముగిస్తూ పక్కకు వచ్చి నిల్చున్న కమాండర్‌ను చూశాడు.

'సర్కార్ అధ్యక్షుడు ఇడ్మాల్ వచ్చిండు. నిన్ను కలవాలంటున్నడు' అంటూ కమాండర్ తను వచ్చిన పనిని కోయలో చెప్పాడు.

'సరైన టైంకే వచ్చాడు, ఇక్కడికే పంపించు, మిగిలింది ఆయన చెప్పాల్సిందే' – నరేందర్.

'ఈ లోగా మనం డేరా దాకా వెళ్లి వద్దాం' అంటూ శ్యాం లేచాడు.

'అవును ఇది మన ప్రైంటైం కదా. వరుసగా అన్ని వార్తలు వచ్చేదిప్పుడే. తెలుగు, మరాఠీ, ఒడియా, హిందీ చివరకు బీబీసి పూర్తయ్యేసరికి ఎనిమిదిన్నరవుతుంది. పద నేనూ వస్తా' అంటూ రాహీ రేడియోతో లేచాడు.

'ఫర్లేదు, మనం వార్తలు, భోజనాలు ముగించుకొనే వద్దాం, ఇడ్మాల్ రాత్రి ఇక్కడే పడుకుంటాడు, ఫ్రీ టైం' అన్నాడు నరేందర్.

* * *

రాత్రి తొమ్మిది కావస్తోంది. వెన్నెల అడవిని నింపేసింది. రాత్రివేళ ఏ లైటూ చేతిలో పట్టుకోకుండానే ఎక్కడికైనా వెళ్లే గెరిల్లాలకు అడవి వెన్నెల ఆనందాన్నిస్తోంది. మునిమాపువేళ తిండ్లు ముగించుకున్న గెరిల్లాలు ఏ అల్లరీ లేకుండా తమ తమ డేరాల్లో పడుకున్నారు. దూరంగా ఆగి, ఆగి కుక్కలు మొరుగుతుంటే సెంట్రీలు చెవులు నిక్కిరించి వింటున్నారు. ఈ మధ్య చిన్న చిన్న హంతక టీములు రహస్యంగా అడవిలో తిరుగుతూ ఒంటరి గెరిల్లాలను హతమార్చడం ప్రారంభమయ్యాక సర్వత్రా అప్రమత్తత పెరిగింది.

రాహీ, శ్యాంలు టిఫిన్ క్యారియర్‌లో తెచ్చిపెట్టిన అన్నం తింటూ ఇంగ్లిషు బిబిసి వార్తలు వింటున్నారు. ప్రపంచం ఆర్థిక సంక్షోభ తాకిడికి బిబిసి గతంలోలా రోజంతా హిందీలో నాలుగు ప్రసారాలు కాకుండా కేవలం రాత్రిపూట ఒక్క ప్రసారం మిగలడంతో దాన్ని మాత్రం తప్పనిసరిగా అందరూ వింటారు. అప్పుడే రఫీక్ చేరుకున్నాడు.

'క్యా రఫీక్ భాయీ, ఆన్‌లైన్ న్యూస్ క్యా హై?' – శ్యాం.

'ఏం వార్తలో కానీ హిందీ నేర్చుకోవడం మాత్రం రంభకష్టంగా ఉంది. కోయ హాయిగా నేర్చుకోవచ్చు. సగం తెలుగుతో కలుస్తుంది. ద్రావిడులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఈ హిందీలో లింగభేదాలతో మాట్లాడలేక నవ్వులపాలవుతున్నాననుకోండి. మీసాన్ని స్త్రీ లింగంలోనూ, గెడ్డాన్ని పుంల్లింగంలోనూ చెప్పాలంటే ద్రావిడులకు ఎలా ఉంటుందో చెప్పండి' అంటూ రఫీక్ భాషతో పడుతున్న కుస్తీనంతా బాధగా చెప్పుకొచ్చాడు.

'ముస్ ముస్ కవ్వీనిన్ రాహీ' అంటూ శ్యాం ముసిగా నవ్వుతున్న రాహీ వైపు చూస్తే రఫీక్ 'చూశారా! మీరు రెండు పదాలు మాట్లాడితే అందులో ముస్, ముస్ అన్నది తెలుగులోనూ ఉంది. అందుకే హిందీకన్నా కోయపైనే శ్రద్ధ పెట్టడం సమంజసం అంటాను' అంటూ రఫీక్ తన అభిప్రాయాన్ని ఈసారి మరింత గట్టి నిరసనతో వ్యక్తం చేశాడు.

'ఏం లేదు శ్యాం, ఓ రోజు దారిలో నిన్ను గెరిల్లాలకు హిందీ భాషపై మోజు ఎందుకని అడిగితే, మనది ఉత్తరాది ప్రయాణం అంటూ ఇచ్చిన జవాబు గుర్తొచ్చి నవ్వుతున్నాను' అంటూ రాహీ తన నవ్వులోని అర్థాన్ని చెప్పి చేయి కడుక్కోడానికి లేచాడు.

'భాష విషయంలో మనం చాలా అధ్యయనాన్ని చేయాల్సి ఉంది' స్వగతంలోనే అనుకుంటూ శ్యాం కూడా లేచాడు.

'ఓహ్! రఫీక్ భాయీ, ఆప్ భీ యహా పర్? బడియా' అంటూ నరేందర్ ఇడ్మాల్‌ను వెంటబెట్టుకుని రాహీ డేరాలోకి వచ్చాడు.

'ఔను కామ్రేడ్, నిద్ర రావడం లేదు, చదువుకుందామంటే రాత్రి లైట్లు వెలిగించకూడదనుకున్నాం కదా! క్యాంప్‌లో పేషెంట్లు ఎవరూ లేరు, అందుకే మన కామ్రేడ్స్ దగ్గరికి వచ్చాను' అంటూ వచ్చీరాని కోయలో బదులిచ్చాడు రఫీక్.

'మీ 'కోయగు' బాగుంది' అని నరేందర్ అనడంతో రఫీక్ వెంటనే 'మీ పదప్రయోగం బాగుంది – కోయగు, తెలుగు, హిందీ' అంటూ మరోసారి ఆ విశేష పదాలను ఉచ్చరించాడు.

ఇడ్మాల్ మర్యాదగా 'లాల్‌సలాం కామ్రేడ్స్' అన్నాడు.

'లాల్‌సలాం, కూచోండి' శ్యాం వారి కోసం మరో పాల్తీన్ షీట్ పరిచారు.

ఇడ్మాల్ నల్లగా, బక్కపలుచగా ఉన్నాడు. పొడవు అయిదున్నర అడుగుల పైనే ఉంటాడు. ముఖం నున్నగా ఉంది, మీసాలు, గెడ్డాలు పెద్దగా లేవు. వేసవి కావడంతో ఆయన ఒంటిపై షర్టు లేదు. ఒంటిపై ఎక్కడా ఒక్క వెంట్రుక కనబడడం లేదు. అచ్చమైన ఆదివాసీకి ప్రతిరూపంగా ఇడ్మాల్ అగుపడుతున్నాడు. అంగవస్త్రంగా టవల్ మాత్రమే చుట్టుకుని వాళ్ల ముందు నిల్చున్న ప్రజా ప్రభుత్వపు అధ్యక్షుడిని చూస్తున్న రాహీకి చాలా గర్వంగా ఉంది. ముప్పయి ఏండ్ల దండకారణ్య ఉద్యమంలో పేదల చేతుల్లోకి ఈ మేరకైనా అధికారం వచ్చిందన్న తృప్తి ఆయన మాటల్లో ఎప్పుడూ వ్యక్తం అవుతూ ఉంటుంది. ఢిల్లీ ఇంకా చాలా దూరం ఉందనడానికి ఆయన ఎప్పుడూ 'సై, సై ఓ నల్లగొండ వీరుడా, నువు ఎత్తేదే ఎర్రజండా.. నల్లగొండ నీ పేరు చెప్పితే ఢిల్లీ కోటలో గుండె ఝల్లుమనే' అనే పాత పాట విన్పిస్తూ ఉంటాడు. ఇడ్మాల్ వయస్సూ ముప్పయికి మించలేదు. ఉద్యమంతో పాటే పుట్టి పెరిగిన తరం ఆయనది. నరేందర్ ఎత్తుకుని ముద్దాడిన వాళ్లలో ఇడ్మాల్ లాంటివాళ్లు అనేక మంది నేటి దండకారణ్య ఉద్యమ బాధ్యతల్లో ముందున్నారు. నరేందర్, ఇడ్మాల్‌లు జిల్లీపై కూచున్నారు.

'నీ శేషప్రశ్నకు ఇడ్మాల్ జవాబు ఇస్తాడు. అడవి ఉద్యమం ఢిల్లీని ఎలా ఆగం చేస్తుందో ప్రత్యక్షంగా విను కామ్రేడ్' అంటూ రాహీ గత సంభాషణను గుర్తు చేశాడు. ఇడ్మాల్ గొంతు సవరించుకొని కోయలో మొదలుపెట్టాడు.

'ఏప్రిల్ రెండవ తేదీనాడు మా గూడేనికి ముఖ్యమంత్రి వచ్చాడు. ఆయన వెంట మందీ, మార్బలం తక్కువ రాలేదు. అయితే అందులో చాలా మంది పోలీసులే ఉన్నారు. కోయ కమాండోలు మాత్రం చాలామంది సివిల్‌లో జనం మధ్య కూచున్నారు' అని ఓసారి గొంతు సవరించుకుని ఇడ్మాల్ మొదలుపెడుతుండగా రఫీక్ 'ఏప్రిల్ ఒకటికి రావల్సింది ముఖ్యమంత్రి' అన్నాడు.

'ఎందుకు దాదా?' అన్నాడు ఇడ్మాల్ అమాయకంగా.

'అది అమాయకులనూ, నిజాయితీపరులనూ మూర్ఖులను చేసే రోజు అంటారు బయట' అని నరేందర్ 'నువ్వు చెప్పు' అంటూ ఇడ్మాల్‌ను ప్రోత్సహించాడు.

'ముఖ్యమంత్రి హిందీలో చాలా సేపు మాట్లాడాడు. మరెవరో పెద్ద మనిషి కోయలో చెప్పుతూ పోయాడు. మీకు డబ్బు ఇస్తాం, నూకలిస్తాం, ఇండ్లిస్తాం, మందులిస్తాం అంటూ పదే పదే మావోవాది, మావోవాది అనేవాడు. కోయలో మాత్రం దాదాలోర్, దాదాలోర్ అనే చెప్పాడు. సారాంశం మాత్రం మావోవాదిలను మీ వద్దకు రానివ్వగూడదు అనే చెప్పాడు. అసలు వాళ్ల మాటలు మా మధ్య కూచున్న కోయ కమాండోలు విననిస్తే కదా, 'వాళ్లు ఇస్తుంటారు, మేం కాలపెడుతాం, కూలగొడుతాం, ఇది ఆగేది కాదు' అంటూ కోయలో బహిరంగంగానే చెప్పుతుండేవాళ్లు. చివరకు పైసలు పంచిండు. అయితే ఇదంతా బజార్ల జరుగుతుంటే మా ఇండ్ల చాటుకు పోలీసోల్లు కోళ్లూ, మేకలూ చంపుతనే ఉన్నారు' అంటూ ఇడ్మాల్ సీరియస్‌గా చెపుతుంటే రఫీక్ 'ఎందుకు అడ్డుకోలేదు' అన్నాడు.

'అగ్నివేశ్‌ను రానివ్వలేదు, అధికార్లనూ రానివ్వలేదు. పైగా రాళ్లతో, కోడిగుడ్లతో కొట్టిన కోయ కమాండోలు ప్రతిపక్షాలను కూడా అడుగుపెట్టనివ్వలేదు. తనకూ ఆ గతి ఎక్కడ పడుతుందోనని సిఎం కోయ కమాండోలకు జడిసి పదిహేను రోజులు ఈ వైపు చూడలేదు. అలాంటివాళ్ల ఆగడాలను ఆపడం ప్రజా గెరిల్లాలకు తప్ప మరొకరికి సాధ్యమా'! అంటూ ఇద్మాల్ బదులు నరేందరే జవాబివ్వడం పూర్తవ్వగానే తిరిగి ఇద్మాల్ తన జ్ఞాపకాలలోకి వెళ్లాడు.

'ముఖ్యమంత్రి పోయినాంక కొద్దిరోజులకు ఎవరో పెద్దమనిషి వచ్చి ఢిల్లీ కోర్టు పంపిందనీ, ఆకలి చావుల గురించి తెలుసుకోవడానికి వచ్చాననీ చెప్పాడు. ఆయన్ను కూడా తింపురం దాటనివ్వలేదు. పత్రికల్లో ఏం రాసిండో తెలియదుగానీ మనిషి మర్యాదగానే ఉన్నాడనిపించింది. ఇంకా చానమందే వచ్చిండ్రు' అని ఇద్మాల్ అంటుండగానే 'సుప్రీం కోర్టు హర్షమందర్‌ను పంపింది. ఆయన జాతీయ ఆహార కమిషనర్‌గా ఉన్నాడు' అంటూ శ్యాం వివరించాడు.

'ఆయన సంస్కరణవాది. పోలీసులూ, మావోయిస్టుల మధ్య ఆదివాసీలు నలుగుతున్నారనే పక్షం ఆయనది. ఆకలితో ఎవరూ చావలేదు గానీ, ఆకలి చావుల పరిస్థితే నెలకొందంటూ రిపోర్టు ఇచ్చాడు. చనిపోయిన రైతు అడవిలో దారి తప్పి తిండిలేక చనిపోయాడని రిపోర్టులో రైతు మరణాన్ని అపహాస్యం చేశాడు' అంటూ రాహీ తాజాగా మీడియాలో వచ్చిన రిపోర్టు గురించి ప్రస్తావించాడు.

'దండకారణ్యం నెగళ్లు ఢిల్లీకి దగడు అందిస్తున్నాయి. ఇక్కడి మరణాలు మానవహక్కుల కార్యకర్తలను కదిలిస్తున్నాయి. అయితే ఇక్కడి హత్యలు, అత్యాచారాలు, విధ్వంసం హజారేలకూ, బాబాలకూ పట్టవు. ఈ మట్టివాసనలు వారికి సోకవు. కానీ ఈ మట్టిలో దాగిన కల్లోల అంతరంగం మహా భూకంపాన్ని సృష్టించి తీరుతుంది' అంటూ రాహీ తన పక్కన కూచున్న ఇద్మాల్‌ను తదేకంగా చూస్తూ ధృవతారపై దృష్టి నిలిపాడు. ఉద్యమం తన ప్రశ్నకు హామీగా ఎదుగుతుందన్న విశ్వాసంతో తలూపుతూంటే ఇద్మాల్ తన స్మృతి నెగళ్ళ నుండి బయటపడి నరేందర్ వైపు చూస్తుంటే తను వాచీ చూసుకుని 'రేపు దగ్గర పడుతోంది, వెళ్దామా' అంటూ లేచాడు.

*అరుణతార, సెప్టెంబరు-అక్టోబరు 2011*

# కొత్త చదువు

**– బి. భానుమతి**

సుక్రు ఎన్.జి.వోలు నడుపుతున్న ఒక అనాథ పిల్లల వసతి గృహంలో ఉన్నాడు. అది, ప్రత్యేకంగా మడియాగోండు అనాథ పిల్లలకోసం ఏర్పాటు చేసిన వసతిగృహం. సుక్రు వంటి యాభైమంది పిల్లలు అందులో ఉన్నారు. సుక్రు పన్నెండు, పదమూడు సంవత్సరాల మధ్య వయస్సు పిల్లగాడు. సుక్రును అనాథగా మార్చిన కథ సుక్రూ చెప్పితేనే వినాలి. తన కథ చెప్తున్నంత సేపు కళ్ళు నిప్పురవ్వల్లా మండుతాయి.

"జుడుం వాళ్ళు మా గూడెం మీద పడి దాడి చేయక ముందు మా బతుకులు వేరుగా ఉండేవి. కల్లో, గంజో తాగి మా అడవిలో మేం శాంతంగా ఉండేవాళ్ళం. మాది పెద్ద సంసారం. మా తాత, నాయన, అవ్వ, నలుగురు పిల్లలం. అందరం ఒకే గుడిసెలో ఉండే వాళ్ళం. నేను మా తమ్ముడు సోను, అడవిలో పశువుల్ని మేపుకు వచ్చే వాళ్లం. మా అవ్వ ఆకలైనప్పుడు తాగడానికి సొర బుర్రలో మక్క అంబలిపోసి ఇచ్చేది. మా అడవిలో మేము ఇష్టం వచ్చిన చోట పశువుల్ని మేపుకొనే వాళ్ళం. అడవి కాయలు ఏరుకొని తినేవాళ్ళం. మా గూడెం పిల్లలందరం ఒక దాపునే పశువుల్ని మేపుకునే వాళ్ళం.

మా తాత నన్ను ముద్దుకు 'చెవుల పిల్లీ' అని పిలిచేవాడు. నేను అడవిలో చెవుల పిల్లిలా చెంగు చెంగున పరిగెత్తుతానని తాత అనేవాడు. నన్ను తాత చెవుల పిల్లి అని పిలవడం నాకు చాలా ఇష్టం. రాత్రిపూట నెగడు పక్కన, తాత పక్కలో దూరి పడుకోవడం నాకు చాలా ఇష్టం. పున్నమి రోజు రాత్రి, తాత నాకు చందమామ మధ్యలో చెవుల పిల్లిని చూపించేవాడు. తాత నాకు ప్రతి పున్నమి రాత్రి చెవుల పిల్లి కథ చెప్పేవాడు. పున్నమి రోజు అర్ధరేతిరి చెవుల పిల్లి నెలవంక మధ్య నుంచి అడివిలోకి మబ్బుల మీద నడుచుకుంటా దిగుద్ది. ఎవ్వరూ చూడకుండా అడవిలోకి దిగుద్ది.. చెవులపిల్లి చందమామ లాంటి తెల్లటి కూనల్ని గచ్చపొద చాటున ఈని ఏడుస్తూ తిరిగి వెళ్ళలేక, వెళ్ళలేక చందమామలోకి వెళ్లిపోతది. చెవులపిల్లి చెంగు చెంగున గెంతుతూ చూసుకోకుండా మునికాలు తొక్కినందుకు ముని శాపం పెట్టాడట. అడవిలో నీ వాళ్ళను వదలి దూరంగా ఒంటరిగా చందమామలో ఉండమనే ముని శాపానికి చెవులపిల్లి చందమామలో ఉంది. కానీ చెవుల పిల్లి మనసు ఎప్పుడూ అడవి పైన, తన కూనలపైన, అడవిలో ఉన్న సమస్త జీవాలపైన ఉంటుంది. చెవుల పిల్లి ఎప్పుడూ అడవిని, అడవిలో సమస్త ప్రాణుల్ని కాపాడుతుంది.

చల్లగా చూస్తుంది. అందుకే మనవడా నిన్ను చెవుల పిల్లి అని పిలుస్తారు, అని తాత చెప్పేవాడు. మా గూడెంలో పిల్లలం అందరం చెవుల పిల్లిలాగా వేగంగా పరుగెడతాం.

పశువుల్ని అడవిలోకి తోలుకుపోయిన పిల్లలందరం నడిపొద్దు వేళకి అంబలి తాగడానికి మద్దిచెట్టుకిందికి చేరేవాళ్ళం. ఆ వేళకు మద్ది చెట్టుకాడికి మిలీషియా అక్క కూడా వచ్చేది. అక్క, మాకు రోజూ చదువు చెప్పేది. చెట్టుకింద మట్టి నున్నగా చేసేవాళ్ళం. పుల్లతో ఆ మట్టిలో అక్షరాలు రాయడం నేర్చుకొనేవాళ్ళం. అక్క మాతో పాటే పాటలు పాడేది. మా కొండగాడు పాట పాడితే అడవి పక్షులు కూడా వినేవి. వాడి పాట గలగల పారే ఏటి రాగంలా ఉంటుంది. అక్క మాతో కథలు చెప్పించేది.

నేను మా తాత చెప్పిన చెవుల పిల్లి కథ చెప్పేవాడిని. మా బుద్రు సీతాకోక చిలుకల కథ చెప్పేవాడు. మా డింగ్రి గాడు ఇంద్రధనస్సు కథ చెప్పేవాడు. మా మద్ది చెట్టు ఒడిలో కథలు పుస్తకంలో రాస్తే పది పుస్తకాలు నిండిపోతాయి. అక్క మాకు, కొమ్రం భీం దాదా కథ, భీర్సాముండా దాదా కథ చెప్పేది. మా పాటలు, మా కథలు, మా మాటలు, మా తాత తండ్రుల బతుకులు మా భాషలో రాయడమే చదువులో ఒక భాగం అని అక్క చెప్పింది. చదవడం, రాయడం మనచుట్టూ జరుగుతున్న సంగతులు తెలుసుకోవడం చదువు అని అక్క చెప్పింది. మనిషి జ్ఞానం మనిషి బతుకును తెలుసుకోవడానికి, మనిషి బతుకును మెరుగు పరచడానికి ఉపయోగపడాలని అక్క చెప్పింది. జ్ఞానం వలననే మనిషి చంద్రుడి దగ్గరికి వెళ్ళి వచ్చాడని అక్క చెప్పింది.

అక్క మాకు అంకెలు, కూడికలు, తీసివేతలు, హెచ్చవేతలు, భాగహారాలు నేర్పించింది. మా లెక్కల చదువుకు మేం ఏరుకొచ్చే రాళ్ళు, గింజలు ఉపయోగపడేవి. మేం అడవిలో పోగుచేసే జిగురు, కుంకుడుకాయలు, చింతపండు, తేనెలాంటి సరుకులు అమ్మేటప్పుడు సరైన తూకం ఎలా వేయాలో అక్క మాకు తక్కెడతో చూపించేది. మమ్మల్ని మోసం చేసే సావుకార్ల దొంగతూకాలను ఎలా కనిపెట్టాలో అక్క చెప్పింది. ఎంత బరువు సరుకుకు ఎంత డబ్బులు వస్తాయో లెక్కకట్టడం నేర్పించింది. మేం పనులు చేసినప్పుడు కూలి డబ్బులు లెక్కప్రకారం ఎలా వసూలు చేసుకోవాలో అక్క చెప్పింది. సేట్‌ల దగ్గర మేం కొనుక్కునే కిరసనూనె, ఉప్పు, పప్పులకు లెక్కకట్టి డబ్బులు ఇచ్చే విధానం చెప్పింది. మా దగ్గరి సరుకులు పావలాకి తీసుకోవడం, మాకమ్మేటప్పుడు పనికిమాలిన సరుకులైనా రూపాయికి అమ్మడం కుదరదని మా లెక్కల చదువు మూలంగా మేం తెలుసుకున్నాం. మాకు ఇన్నాళ్ళు లెక్కలు రాకపోవడం వల్ల సావుకార్లు, సేట్లు ఎలా దొంగలెక్కలతో మోసం చేశారో అర్థం అయింది. మా లెక్కల చదువు సంగిసేట్‌ల మోసం సంగతి మా తాతకు చెప్పాను. సేట్‌లు మనల్ని ఇంత దగా చేస్తున్నారా అని తాత వింతగా చూశాడు.

అక్క మన బతుకులు మనం మార్చుకోవాలంటే, మనం ఎక్కడ ఉన్నాం, ఎలా ఉన్నాం అని తెలుసుకోవాలి అని చెప్పింది. అందుకే మా సాంఘికశాస్త్రం చదువులో, రాష్ట్రపటాలు, దేశపటాలు, ప్రపంచపటాలను గురించి మొదట నేర్చుకొనేవాళ్ళం. మా గూడెం, మా తాసీల్,

మా జిల్లా, మా రాష్ట్రపటంలో ఎక్కడున్నాయో చూసేవాళ్ళం. మా రాష్ట్రాన్నే పాలిస్తున్న రమణసింగ్ సర్కార్ ఎక్కడ కొలువైంది చూసేవాళ్ళం. దేశపటంలో మనదేశాన్ని పాలిస్తున్న మన్మోహన్‌సర్కారు ఎక్కడ కొలువైంది అక్క చూపించేది. ప్రపంచ దేశాలన్నిటిని కొట్టుకుతిని బతుకుతున్న పెద్దపులి, అమెరికా దేశం ప్రపంచపటంలో ఎక్కడ ఉందో అక్క చెప్పింది. అమెరికా వెనకాల గుంటనక్కల్లా పేదోళ్ళను పీల్చుకుతింటున్న బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు ఎక్కడ ఉన్నాయో చూశాం. మా మఢ్ కొండలంత లేని దేశాలు ఏడు సముద్రాలను మాంత్రికుడిలా దాటివచ్చి మన బతుకుల్ని పీల్చి పిప్పి ఎలా చేస్తున్నారో అక్క చెప్పింది. అమెరికా పంజాదెబ్బకు చితికిపోయిన ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ దేశాలను చూపించింది. అక్కడి పిల్లలు ఆకలికి, రోగాలకు ఎలా బలైపోతున్నారో అక్క వివరంగా చెప్పింది. మా కొండా, మా గూడెం, మా అడివిని మా నుంచి ఏ రాజకీయం గుంజుకుంటుందో తెలుసుకోవడమే మా సాంఘికశాస్త్రం చదువు. నాగరికత అని చెప్పి, అభివృద్ధి అని చెప్పి మానోటికాడ కూడు లాక్కొనే సర్కారు గుట్టు తెలుసుకోవడమే మా సామాజిక శాస్త్రం చదువు ఉపయోగం అని మేం తెలుసుకున్నాం.

అడవిలో మానుల్లో మానులా, మొక్కల్లో మొక్కలా, జంతువుల్లో జంతువులా, కలగలసి పోయిన బతుకుమాది. అడివిలో ఏ గింజ, ఏ మొక్క, ఏ వేరు, ఏ పువ్వు ఎందుకు పనికి వస్తాయో పరిశీలించడం, వాటిని సేకరించి ఉపయోగించడం మా సామాన్యశాస్త్ర చదువు మొదటి పాఠం. ఏ కాలంలో వానలు పడతాయి. ఏ వానకు గింజలు చల్లితే మా చెలకల్లో పైరులు బాగా పెరుగుతాయి. ఎప్పుడు ఎరువులు చల్లాలి, చీడపీడలకు ఏ మందులు చల్లాలి, పంట బాగా ఎట్లా పండించాలో తెలుసుకోవడం మా రెండో పాఠం. మా గూడెం పిల్లలం బక్కచిక్కి పోకుండా సరైన తిండి ఎలా పెట్టాలి, జ్వరం వచ్చినప్పుడు, విరోచనాలు వచ్చినప్పుడు, కురుపులు వచ్చినప్పుడు, ఏ తీరుగా ఉండాలి. అనేదే మూడోపాఠం. మాకు దొరికే ఆకులు, వేర్లు, పువ్వులతో మందులెలా తయారుచేసుకోవాలి, రోగాలు, రొస్టులతో మా పిల్లలు చచ్చిపోకుండా ఉండాలంటే మా జాతిని కాపాడుకోవాలంటే ఏం చెయ్యాలో చెప్పేదే మా సామాన్యశాస్త్రం నాలుగోపాఠం.

మొత్తంగా చూస్తే మా చదువు మా జీవితాలను చుట్టుకుని ఉన్నట్టు అనిపించింది. అందుకే మిలీషియా అక్క చెప్పే చదువు మా గూడెం పిల్లలందరికీ ఇష్టం. ఒక కంటితో జీవాలని, గొడ్లని చూసుకుంటూనే పాఠాలు నేర్చుకొనేవాళ్ళం. మద్ది చెట్టు బడికి నేను లీడర్‌ను. అక్కకు ఏదైనా పని తగిలి బడికి రాలేకపోయినా మా బడి మామూలుగానే జరిగేది. మా బడి పిల్లలకు అక్క పరీక్షలు పెట్టేది. ఆ పరీక్షలో నూటికి నూరు మార్కులు సంపాదించాలని అందరం పోటీపడేవాళ్ళం. మా సిండే గాడికైతే అన్ని పరీక్షల్లో వందకు వందమార్కులు వచ్చేవి. వాడు మా బడి ఫస్టు. మా బడిలో చదువురాని వాళ్ళు, మొద్దులు అస్సలు ఉండేవాళ్ళేకాదు. మద్ది చెట్టు చదువు తరువాత మేము పెద్దబడిలో చేరాలని, పెద్ద పెద్ద చదువులు చదివి మా జాతికి మేలు చేయాలని అక్కచెప్పేది. మా గూడెం పిల్లలం బాలల సంఘం పెట్టుకున్నాం. అందరం ఒకరికొకరం సాయం చేసుకోవాలనేది మా సంఘం ఆశయం.

మా తాత అందరికీ గొప్పగా చెప్పేవాడు. మా నాయన బాణం వేశాడంటే దెబ్బకి బెబ్బులైనా పడిపోయేదని మా నాయన బాణం గురి తప్పదని తాత చెప్పేవాడు. మా గూడెంలో జనతన సర్కారు నడిచేది. మా నాయన జనతన సర్కారులో వేట బాధ్యుడు. జనతన సర్కారంటే మనం ఏర్పరచుకొన్న మన రాజ్యం అని మా నాయన చెప్పాడు. మన రాజ్యం మనమే నడిపించాలి. మనమే కాపాడుకోవాలని నాయన చెప్పాడు.

జనతన సర్కారు మా గూడెం రాకముందు, మా నాయన ఫుల్లుగా తాగొచ్చి మా అవ్వను చావగొట్టేవాడు. మా నాయన తన్నులకి మా అవ్వ ఒళ్ళు వాసి పోయేది. ఇంట్లో పిల్లలం ఆకలితో అన్నం పెట్టమని ఏడ్చే వాళ్ళం. మా ఆకలి తీర్చలేక అవ్వ ఏడ్చేది. జనతన సర్కారుతో పాటే మా గూడేనికి మహిళా సంఘం వచ్చింది. మహిళా సంఘం, దొంగ సారా అమ్మకాలు బందు పెట్టిచ్చింది. తాగి పెళ్ళాన్ని తన్నే మొగోళ్ళను మహిళా సంఘం నిలదీసింది. జనతన సర్కారు భూమిలేని పేదోళ్ళను దున్నుకోమని భూమి పంచింది. గుడిసెల్లో పిల్లలు పస్తులుండడం తగ్గింది. జనతన సర్కారు రాకతో మా గూడెం బతుకుల్లో మార్పు వచ్చింది.

మా గూడెం జనం బతుకుల్లో వచ్చిన మార్పు మా సావుకార్లకు నచ్చలేదు. పటేల్ పట్వారీలకు నచ్చలేదు. సర్కారుకు అస్సలు నచ్చలేదు. ఆ రోజున మా గూడెం జనం మొత్తం ఎవరి పనుల్లో వాళ్ళు ఉన్నారు. పొద్దు నడినెత్తి మీదకు వచ్చింది. అడివిలో పశువుల్ని మేపుతున్న మాకు గూడెం మీద నుంచి పొగలు, మంటలు కనిపించాయి. పరుగు పరుగున పిల్లలందరం గూడానికి పరుగెత్తుకు వచ్చాం. జుడుం మూకలు, పోలీసులు దొరికినోళ్ళను దొరికినట్టు పట్టుకు బాదుతున్నారు. పిల్ల, పెద్ద, ముసలి, ముతక భేదం లేదు. వరుస బెట్టి గొడ్లను బాదినట్లు బాదుతున్నారు. గూడెంలో గుడిసెలన్నిటికి నిప్పు పెట్టారు. గూడెం యువకులు చాలా మంది అడివిలోకి పారిపోయారు. ఆ బీభత్సంలో మా అవ్వ, నాయిన, తమ్ములు ఏమై పోయారో అజ లేదు. గూడెంలోకి పరిగెత్తుకు వచ్చినప్పటికీ ఇళ్ళలో పదిమంది పోలీసోళ్ళకు చిక్కాం. మమ్మల్ని పట్టుకొని లారీలో వేసుకున్నారు. క్యాంపుకు తీసుకుపోయారు. క్యాంపులో ఒక మూలన ఉన్న షెడ్‌లో పడవేశారు. చుట్టూకాపలా. నేను ఏడుస్తూ మూలన పడి ఉన్నాను. అవ్వ, నాయన, తమ్ముళ్ళు గుర్తుకు వచ్చారు. పోలీసులు చితకబాదిన తాత గుర్తుకొచ్చాడు. అడివిలోకి పోలీసులు తోలేసిన మా ఎర్రావు, దూడ గుర్తుకొచ్చాయి. ఎంత ఆపుకున్నా ఏడుపు తన్నుకొస్తోంది. పిల్లలందరం ఏడుస్తూనే ఉన్నాం. ఒక బాన పొట్ట పోలీసు నా దగ్గరికి వచ్చాడు. ఏడుపు ఆపమని కసురుకున్నాడు. నేను బిక్కచచ్చిపోయి ఏడుపు మానేశాను. నన్ను మిలీషియా అక్క గురించి అడిగాడు. అక్కను పట్టిస్తే తన బొడ్లో ఉన్న పిస్తోలు ఇస్తానన్నాడు. డబ్బులు ఇస్తాను, మీ గూడెం పంపించేస్తాను అన్నాడు. నాకు ఏడుపు ఆగలేదు పెద్దగా ఏడిచాను. ఆ పోలీసోడు ఒక్క తన్ను తన్ని మొకం మీద కాండ్రించి ఊసి వెళ్ళిపోయాడు. జుడుం వాళ్ళు మాకు రోజూ పప్పు అన్నం పెట్టే వాళ్ళు, నాకు తిన బుద్ధి అయ్యేదికాదు.

జుడుం వాళ్ళు నాతో క్యాంపు ఊడిపించే వాళ్ళు. సాయంకాలపు కాంపులో పిల్లలందరిని ఒకచోట పోగేసి, నక్సలైటులు మనుషులను పీక్కుతినే రాక్షసులని, కథలు కథలుగా చెప్పే

వాళ్ళు. నాకు రాత్రిపూట నిద్రపట్టేది కాదు. తగలబడుతున్న గూడెం, జుడుం వాళ్ళు తన్నుతున్న తాత గుర్తుకు వచ్చేవి.

మమ్మల్ని పోలీసులు కాంపుకు లాక్కువచ్చి వారం రోజులు గడిచిపోయాయి. ఆ రోజు జుడుం వాళ్ళు, పోలీసులు తుపాకులు తీసుకొని ఆదరాబాదరగా జీపులెక్కి బయటికి వెళ్ళారు. ఒక గంట గడిచింది. ఒక జీపు నిండా శవాలు వేసుకొని వచ్చారు. మొత్తం లెక్కపెట్టాను. పద్దెనిమిది శవాలు. అన్నిటిని క్యాంప్ గోడ పక్కన పడేశారు. సాయంకాలం అయింది. పొద్దుగూకింది. ఆ వాతావరణంతో పిల్లలందరం భయంతో వణికి పోయాం. అన్నం తింటానికి శవాలున్నదారిలో పోవాలి. అన్నానికి పోయేటప్పుడు లైటు వెలుతురులో భయం, భయంగా శవాల వైపు చూశాను. శవాలలో మా నాయన శవం. పరిగెత్తికెళ్ళి మీద పడిపోయాను. పొర్లిపొర్లి ఏడ్చాను. జుడుం వాళ్ళు నన్ను తన్నుకుంటూ లాక్కుపోయారు. 'నక్సలైట్ నా కొడుకు' అని నాయన శవం జుడుం వాళ్ళు కాళ్ళతో తొక్కారు. ఆ రోజు రాత్రి నాకు జ్వరం వచ్చింది. క్యాంప్ అంతా శవాలు కుళ్ళిన వాసన. మా నాయన్ను చంపేశారన్న బాధ. వాంతులు, విరేచనాలు పట్టుకున్నాయి. ఒంటి మీద సోయి తప్పి స్పృహలేకుండా పడిపోయాను.

సోయి తెలిసేటప్పటికి ఇక్కడ ఈ అనాథల వసతి గృహంలో ఉన్నాను. మేం యాభైమంది పిల్లలం ఒక షెడ్‌లో ఉన్నాం. అదే మా నివాసం. అదే మా బడి. ఈ బడి కూడా పోలీసు క్యాంప్‌లాగే ఉంది. ఇక్కడ పిల్లలం మా కష్టసుఖాలు మాట్లాడుకోకూడదు. రోజంతా ఎవరెవరో తెల్లగుడ్డల వాళ్ళు వచ్చేవాళ్ళు. మమ్మల్ని వింత జంతువుల లెక్క చూసేవాళ్ళు. మేం పాడే మా అడివి పాటలు ఆ తెల్ల గుడ్డల వాళ్ళ ముందు పాడమని మా భాషలో మాట్లాడమని హోం ఆర్గనైజేషన్ వాళ్ళు మమ్మల్ని బలవంతం చేసేవాళ్ళు. మేం పాడే మా అడివి పాటలు ఆ తెల్లగుడ్డల వాళ్ళకి అర్థం అయ్యేవి కావు. మా పాటలు మా మనసులో బాధలాగే ఉండేవి. తెల్లగుడ్డల వాళ్ళను చూడగానే లేచి నమస్కారం పెట్టాలి. లేకపోతే క్యాంప్‌లో టీచర్ బెత్తంతో కొట్టేది.

ఈ హోం, ఈ బడి, నాకస్సలు నచ్చలేదు. టీచరు ఫలకమీద రాయించే తెలుగు అక్షరాలు నాకు రాయడం వచ్చేది కాదు. టీచర్ చదవమని చెప్పే తెలుగు మాటలు అర్థం అయ్యేవికావు. చదువురాని మొద్దును అని టీచర్ తిట్టి పోసేది. నాకు అక్క, మద్దిచెట్టు బడి గుర్తు వచ్చేవి. మనసు అడివివైపుకు లాగేది. అవ్వ, నాయన గుర్తుకు వచ్చేవారు. రాత్రిపూట కలలో, మా అడివి సుక్రూ... రా రమ్మని పిలిచినట్టు అనిపించేది. హోం నుంచి పారిపోవడానికి ప్రతి నిమిషం ఎదురు చూసేవాడిని.

మా హోంలో వంట చేసే అక్క ఒక్క దానికే మా భాష తెలుసు. మా బాధ ఆ అక్క అర్థం చేసుకునేది. నెల మొదటి తారీకున పంతులమ్మ ఆర్గనైజేషన్ వాళ్ళు జీతాల కోసం పట్నం పోయారు. వంట అక్కతో నేను పారిపోతున్నాను అని చెప్పాను. అక్క నాకు ఒక కవర్‌లో అన్నం కట్టి ఇచ్చింది. అక్క ఇచ్చిన అన్నం మూట భుజాన వేసుకొని అడివిదారి పట్టాను.

***అరుణతార, నవంబరు–సెప్టెంబరు, 2011***

# నిరీమిల

- యామిని

సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం...

నిరీమిల చలాకీగా ఉంటుంది. సన్నగా చామన ఛాయ రంగుతో విప్పారిన కళ్ళతో చూడముచ్చటగా ఉంటుంది. అందరిలో ఏదో ఒక కళ ఉన్నట్లే నిరీమిల కళ్ళు చూడగానే ఆకట్టుకుంటాయి. తేటగా, ఎప్పుడు ఏదో వెతుకుతున్నట్లు ఉంటాయి. మొదటిసారి నేను నిరీమిలను చూసినపుడు నన్ను ఆకట్టుకొంది నిరీమిల కళ్ళు. ఆపై ఆమె వాక్చాతుర్యం. సింపుల్‌గా, సూటిగా, నిక్కచ్చిగా మాట్లాడే స్వభావం. మొదట ముభావంగా ఉన్నా, నా పరిచయం పెరిగిన కొద్దీ చనువుగా ఉండేది. అప్పటికే ఆమె గ్రామ కె.ఎ.ఎం.ఎస్. బాధ్యురాలు. మామూలు సభ్యురాలు కాదు. ఒక యాక్టివిస్ట్. అక్కడున్న సర్కార్ న్యాయ శాఖలో ఒక సభ్యురాలు. మొదట అభినందించింది మహిళా సంఘ బాధ్యురాలిగా పరిచయ మైనప్పుడు. ఎప్పటిలాగే ఆ రోజు కూడా మా కమాండర్ సర్కారు మీటింగ్ వేద్దామంటే 'సరే'! అని తయారయ్యాను.

సాయంత్రమయింది. టీ తాగి మీటింగ్ దగ్గరకు వెళ్ళాను. నా కళ్ళు అక్కడ కూర్చున్న నిరీమిల మీద పడ్డాయి. చూడగానే నవ్వుతూ 'లాల్ సలామ్' అంటూ చేయి కలిపింది. ఆశ్చర్యపోతూ ప్రతిగా నా చేయి అందించాను. నా ఆశ్చర్యాన్ని గమనించిన మా కమాండర్ 'నిరీమిల సర్కారులో కూడా ఉంది. ఇందాకే వచ్చింది గానీ నువ్వు పడుకొని ఉండడంతో లేపలేదు.' అని పేజీలు తిప్పుతున్నాడు సర్కారు ఎజెండా రాయడానికి. 'సూటబుల్ పర్సనే' అని మనసులో అనుకున్నాను. రెండుపనుల్లో ఇష్టంగా... బాధ్యత పడుతూ... తన అభిప్రాయాలను సూటిగా, స్పష్టంగా మాట్లాడుతూ అందరి మన్ననలు అందుకోవడం. ఎందరికో కొద్దిమందే ఇలా ఉంటారు కదా అనిపించింది.

* * *

2010 జూలై నెల. వర్షాకాలం ఊపందుకోవడంతో మళ్ళీ పనులు ప్రారంభమయ్యాయి. నిరుడు కూలగొట్టిన స్థూపాన్ని పునర్నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు ఆ గ్రామ ప్రజలు. ఆ పనుల్లో ఉండగానే... ఒక రోజు ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిళ్ళపై స్థూపం రోడ్డు మీదుగా వచ్చారు. ఆ మోటారు సైకిళ్ళ వాళ్ళు నిర్మాణమవుతున్న స్థూపాన్ని, అక్కడున్న నిరీమిలను ఎగాదిగా చూస్తూ ముందుకు వెళ్ళి పోయారు. నిరీమిల వాళ్ళను అంతగా పట్టించుకోలేదు.

వాళ్ళు ముందుకు వెళ్ళినట్లే వెళ్ళి రిటన్ వచ్చేశారు. స్థూపం వరకు బండిని స్లోగా రానిచ్చి మరోసారి నిరీమిలను అంతే చూస్తూ స్పీడ్‌గా వెళ్ళిపోయారు. నిరీమిల కనుచూపుమేర చూస్తుండిపోయింది. సాయంత్రమయింది. ఇంకా పని మిగిలే ఉంది. మిగతాది రేపు చూద్దాంలే! అనుకొంటూ ఇంటి కొచ్చింది.

ఆ రోజు మధ్యాహ్నం ఆ ఊరి పటేల్, గామతల్ ఇంకా కొద్ది మంది సియాన్‌లు 'ఇంకా ఎంత దాకారా! అయినా ఆడోళ్ళదే రాజ్యమై పోయింది' అని మాట్లాడుకోవడం లచ్చు చెవిన పడింది. వెంటనే ఇంటికొచ్చాడు. తల్లికి చెపుదామని మనసులో అనుకుంటూ ఆవేదన పడుతున్నాడు. ఊరి పెద్దలే ఇలా మాట్లాడుతుంటే ఒక రకంగా భయం అలుముకుంది లచ్చుకు.

రాత్రయ్యింది. ముగ్గురూ అన్నం దగ్గర కూర్చున్నారు. నిరీమిల ఇద్దరికీ చెరోదొప్ప (ఆకులతో తయారు చేసిన గిన్నె) అందించింది. కూరను చిన్న చిన్న దొప్పల్లో పెట్టి ముగ్గురికీ పంచింది. మౌనంగా తింటున్నారు తప్పితే దించిన తల ఎత్తడం లేదు. నిరీమిలనే అది ఇది కల్పించుకొని మాట్లాడుతోంది. వాళ్ళు ముక్త సరిగా ఆ... ఊ... అంటూన్నారేగానీ మాటలు కలపడం లేదు. నిరీమిలకు విషయం అంతుపట్టక

"ఏంటి? ఈ రోజిలా ఉన్నారు?"

'...'

"ఎందుకలా ఉన్నారు?" మళ్ళీ.

'ఎందుకా, నువ్వాస్థూపాలు, మీటింగ్‌లని ఊర్లు పట్టుకొని తిరగక పోతే ఇంటిపట్టున ఉండరాదా?' అత్త.

"మీటింగ్‌లంటే సరేలే అనుకున్నాముగానీ స్థూపాల దగ్గర క్కూడా నువ్వే మగరాయుడిలా తిరుగకపోతే ఏంటట. ఊళ్ళో తల ఎత్తుకోలేకుండా చేస్తున్నావ్, ఎక్కడ చూసినా నీ చర్చే. నిరుడు కూడా ఇంతే. అసలే చుట్టు పక్కల పరిస్థితి చూస్తున్నదే కదా! పోలీసులు రాని రోజంటూ లేదు. ఎప్పుడో ఇల్లుగుల్ల చేసేంత వరకు నీకు బుద్ధిరాదనుకుంటా" నిరుడు పోలీసుల దెబ్బలు చవి చూసి ఉన్నాడు కాబట్టి గట్టిగానే నిలదీశాడు.

నెమ్మదిగా 'ముందునుంచి చేస్తున్నదేకదా!' నిరీమిల.

"ముందునుంచి ఉన్నదే కానీ, ముందుకి ఇప్పుడుకి పరిస్థితుల్లో మార్పు వచ్చింది. ఎప్పుడు ఏ క్షణాన ఆ మూకలు వస్తారోనని భయంగా ఉందే పిల్లా! మీటింగ్‌లకు పోవద్దనడం లేదుగానీ, ఊళ్ళో అంత మంది ఉండగా నీ వొక్కదానివే నెత్తి మీదేసుకోవడం, రేపు ఏదన్నా అయితే మనకేగా జరిగేది. మాకు మాత్రం పార్టీ అంటే ఇష్టం లేక కాదు. మనమా ముగ్గురం. మనకా ముందు వెనుక ఎవరూలేరు. ఉన్న ఆ ఆరెకరాల పొలం సాగు చేసుకోవడం – తినడం. అనుకోకుండా మనకేదన్నా అయితే రెండు కాళ్ళల్లో ఒక కాలు విరిగినట్టే" అత్త.

"ఊరు ఊరంతా మన గురించే మాట్లాడుతున్నారు. భార్యను అదుపులో పెట్టుకోలేక పోతున్నానని. అందరి ముందు మా పరువు తీస్తున్నావ్!" అంటూ అన్నం పూర్తిగా తినకుండా చేయి కడుక్కొని బయటికెళ్ళిపోయాడు లచ్చు. భర్త మాటలకు నివ్వెరపోయింది నిరీమిల.

పిలుస్తున్నా వినిపించుకోకుండా బయటికెళ్ళిపోయాడు. కొడుకు అన్నం తినకుండా వెళ్ళిపోయాడన్న బాధతో తల్లి కూడా లేచి వెళ్ళిపోయింది. వెళ్ళి వాకిట్లో ఉన్న మంచం వాల్చుకుంటుంటే దగ్గర కెళ్ళి పిలిచింది నిరీమిల. ససేమిరా తిననంది అత్త. లోపలికి వచ్చింది. తనూ తినకుండా చేయి కడుక్కొని ఎక్కడి సామాను అక్కడ సర్దింది. ఏం చేయాలో అర్థం కాలేదు నిరీమిలకు. పదే పదే వాళ్ళన్నవి చెవుల్లో రింగుమంటున్నాయి. వారిని ఏవో భయాలు వెంటాడుతున్నాయని అనిపించింది. పార్టీ అంటే వ్యతిరేకత లేదుగానీ శత్రువంటే భయం... తను ఆ పనుల్లో ఉంది గాబట్టి తమను, ఇంటిని ఏదన్నా చేస్తారేమోనని ఆందోళన. నిర్బంధం పెరిగినప్పుడు ఆందోళన పడడం మధ్య తరగతి స్వభావం, సహజం కూడా. శత్రువు ఈ వర్గాన్ని లోబర్చుకోవడానికి, భయ పెట్టడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తాడు. ప్రస్తుతం చేస్తున్నది కూడా అదే. ఆ రోజు కె.ఎ.ఎం.ఎస్. మీటింగ్‌లో కా. పార్వతి చెప్పనే చెప్పింది. "మన పార్టీని, సంఘాలను, ప్రజలను అణచివేయడానికి శత్రువు రకరకాల ఎత్తుగడలు తీసుకు వస్తున్నాడు. మన వాళ్లే మనల్ని వ్యతిరేకించే విధంగా, మన పని మీద నీళ్ళు చల్లే పద్ధతిని చూడా నేర్పుతున్నాడు. ఇది చేతకాదన్నప్పుడు అణచివేత. సంఘ నాయకుల, ప్రజల అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్స్... ఇవన్నీ గ్రీన్‌హంట్ అభియాన్‌లో భాగమే. అందుకే ఈ నిర్బంధాన్ని ఇంట్లో వాళ్ళకు అర్థం చేయిస్తూ, రహస్యంగా పని చేస్తూ, ఇచ్చిన బాధ్యతను నెరవేర్చడం ద్వారానే అమరుల ఆశయాలను ముందుకు తీసుకుపోగలుగుతాం".

అవును... అందరం బతకాలంటే పోరాటం తప్పదు. 'పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్ళు తప్ప' ర్యాలీల్లో తీసిన నినాదం గుర్తుకు వచ్చింది.

ఇవన్నీ ఆలోచిస్తూ ఎప్పటికి నిద్రపట్టిందో తెలియదు.

దుమ్ఃః... మ్ఃః... మ్ఃః...

శబ్దానికి ఉలిక్కిపడి లేచింది నిరీమిల. పక్కనే పడుకున్న భర్తను చూసింది. పగలంతా కాయకష్టం చేసి ఉండడంతో ఆదమరిచి నిద్రపోతున్నాడు. మంచం మీద నుంచి నిదానంగా లేచింది. ముందుగదిలోకొచ్చింది. అత్తలేచి కూర్చుంది. అత్త లోగొంతుతో ఏంటే? అంటే దగ్గరగా వచ్చి 'నేనే' అని సమాధానమిచ్చింది.

'ఏందే ఆ చప్పుడు?' అత్త

'అదేనత్తా! నాక్కూడా...' అంటూ ఆగింది.

అడుగులో అడుగు వేసుకుంటూ మెల్లగా బయటికి వచ్చింది. చుట్టూ చిమ్మచీకటి ఊరంతా ప్రశాంతంగా అనిపించింది. మినుకు మినుకు మంటూ నక్షత్రాల వెలుతురు. పైకి చూసింది. జాము చుక్కలు చక్కగా నడినెత్తినుంచి కిందికి ఉన్నాయి. అంటే సమయం 3గం. అవుతుందన్నమాట.

నిరీమిల మళ్ళీ పైకి చూసి పక్కింటి సోమ్లు ఇంటికి నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళింది. వెళ్తూ వెనక్కి తిరిగి చూసింది. ఏం లేదు. వర్షాకాలం ఊపందుకోవడంతో ఇళ్ళల్లో నెగళ్ళు రాజుకుంటున్నాయి. సోమ్లు దాదా ఇంట్లో నుండి చిన్నగా మంట వెలుగుతోంది.

సోమ్లు చప్పుడుకు లేచినట్టున్నాడు. నెగడు దగ్గర కూర్చోని కట్టెలను ఎగదోస్తూ, కదలికలను వింటున్నాడు. నిరీమిల వాకిట్లోంచి తలుపు దగ్గరకు వెళ్ళింది. తలుపు తెరిచే ఉంది.

'దాదా! దాదా!...' అంటూ పిలిచింది.

ఆడగొంతును పసిగట్టి 'ఎవరు పాపా' ఇవతలికి వచ్చి

'నేనే నే... నిరీమిలను'

'చప్పుడు విన్నవేందే?' సోమ్లు

'ఊఁ... ఏమైయ్యుండచ్చో?' నిరీమిల

'అదే! నేను కూడా విని ఇదిగో ఈడకొచ్చి కూర్చున్నాను' సోమ్లు

'స్థూపం కాదు కదా!' నిరీమిల

'నేను కూడా అదేననుకుంటున్నా' సోమ్లు.

ఒక్కసారిగా సూర్యమన్న, జానకీ దీదీల రూపం కళ్ళముందు కదలాడింది.

'సరేగానీ! నువ్వింక లేట్ చేయమాక. వాళ్ళేగనక అయితే ముందు మన ఇళ్ళనే చుట్టుముడుతారు. నేను ముందుకెళ్ళి చూసొస్తా' అంటూ నిప్పు దగ్గరి నుంచి లేచి లుంగీని బిగించి కట్టాడు. మూలన ఉన్న బడుగాను తీసుకొని 'ఇదిగో సుక్కిని తీసుకొని ఆ జొన్నచేలో దాక్కో' అన్నాడు. వీళ్ళ మాటలకు లేచిన భార్యకు విషయం చెప్పాడు. పక్కనే కంటినిండా నిద్రపోతున్న 9 సంవత్సరాల సుక్కిని లేపాడు. 'ఏయ్ సుక్కి! అత్తెంట పోవే!' అంటూ పురమాయించాడు. తెలియని నిద్రతో సుక్కి కళ్ళు నలుపుకుంటూ 'ఊఁ... ఊఁ...' అంటూ నిలబడింది. సోమ్లు భార్య మంగ్లి పరాస్‌తో (పరాస్ అంటే సొరకాయ బుర్ర – సొరకాయను ఎండబెట్టి దాన్ని గుండ్రంగా ఉన్నవైపున రంధ్రం చేసి నీళ్ళు తోడుకోవడానికి అనువుగా ఇక్కడ ఉపయోగిస్తారు.) నీళ్ళు తెచ్చి సుక్కి కళ్ళు తుడిచింది. కానీ సుక్కికి నిద్రమత్తు వదలలేదు. మంగ్లి శాలువాను సుక్కి భూజం మీద వేసింది. నిద్రమత్తు వదలని సుక్కి తడబడే అడుగులు వేస్తూ నిరీమిల వెంట నడిచింది.

సోమ్లు రెండిళ్ళవతలకు వెళ్ళాడో లేదో బూట్లు టకటక లాడిస్తూ, పెద్దపెద్ద అంగల శబ్దం వినిపించింది. గబుక్కున దగ్గరలో ఉన్న పెద్ద మామిడి చెట్టు వెనక్కి వెళ్ళాడు. ఆ పెద్ద పెద్ద ఆకారాలు లైట్లను అటు, ఇటు తిప్పుతున్నాయి. ఆ లైట్ల ఫోకస్ పడ్డ ఎద్దులు భయపడి తాళ్ళు తెంచుకొని పరుగందుకున్నాయి. సోమ్లుకి భయం ఎక్కువైంది. "ఆ లైట్ల వెలుతురు నామీద పడుతుందేమో! పడిందంటే నా పనయినట్టే" నని భయంతో మరీనక్కి కూర్చున్నాడు. ఆ ఆకారాలు భయంకరంగా చప్పుడు చేసుకుంటూ తిన్నగా నిరీమిల ఇంటి వైపు సాగాయి.

'ఏయ్ఁ... ఎవరు లోపల?' గద్దింపు

మళ్ళీ 'ఏయ్ఁ... మిమ్మల్నే' బూటు కాళ్ళతో తలుపును ఒక తన్ను తన్నే టప్పటికీ అది కాస్తా ఫెటాలున విరిగిపడింది. విరగడం వెంటనే 4 కాళ్ళు ముందుకు రావడం ఒకేసారి జరిగింది. వచ్చిన ఆ నాలుగు కళ్ళు ఇంటినంతా వెతికాయి. నిరీమిల కనబడలేదు. నిరీమిలను అరెస్ట్ చేసి చితకబాదుడు బాదాలని వచ్చారు. కానీ అది కనపడకపోయేటప్పటికీ భర్త, అత్తలను

గద్దించడం మొదలు పెట్టారు.

"ఏయ్‌ః! ముసలిదానా ఎక్కడే అది?"

"..."

'ఏరా! ఎక్కడరా అది?' గద్దింపు. దానితో పాటే పెఢీమని దెబ్బ. గూబ మీద పడేటప్పటికి గూబ గుయ్యిమంది. ఒకడు ఎగిరొచ్చి డొక్కలో తన్నేటప్పటికి అంతే కూలబడి పోయాడు భర్త.

'లేవరా! లెగు' కాలితో తన్నులు.

లచ్చు లేవడానికి ప్రయత్నిస్తుంటే మళ్ళీ పిడిగుద్దులు. అడ్డం పడిన అత్తను జుట్టు పట్టుకొని ఈడ్చి అవతలికి విసిరేప్పటికీ తలగోడకు గుద్దుకొని అంతే పడిపోయింది. దిమ్మెక్కిన తలను పట్టుకొని లేచి 'కొట్టొద్దండయ్యా' అని ఎంత మొత్తుకున్నా కర్ర విరిగేంత వరకు కొట్టారు. కర్ర విరిగినాంక ఆ కర్రను 'ఛీ' అంటూ విసిరేశాయి ఆ మూకలు. వీళ్ళను కొట్టేవాళ్ళు కొడుతుంటే, మరో ఎనిమిది మంది లోపలంతా ముదియాల్ కోలి (ధాన్యం నిల్వ చేసుకునే గది) నంతా వెదికారు. ఆ ముదియాల్ కోలిలో ఉన్న వడ్లు, మినుములు, ఉలవలు, కోహల బియ్యాన్ని చెల్లా చెదరు చేశారు. బియ్యంలో ఇంటిముందున్న ఇసుకను తెచ్చి కలుపుతూ విరగబడినవ్వుతున్నారు. నవ్వుతూ నవ్వుతూ సంచులన్నీ వెతికారు. పాత జోర (సంచి) లో ఉన్న నాలుగు వేల రూపాయలను ఒకడు బయటికి తీసి జేబులో పెట్టుకోబోయాడు. బియ్యంలో మందు కలుపుతున్న మరొకడు కళ్ళు ఇంతవి చేసుకొని చూశాడు.

మరొకడు వెనక్కి వచ్చి 'ఏయ్‌ః... ముసలిదానా! రేపు నీ కోడలిని తెచ్చి సరెండర్ చేయిస్తే సరి! లేదంటే చూస్తారుగా మా తడాఖా! ఏయ్... కుర్రకుంకా... ఆడదాన్ని అదుపులో పెట్టడం నేర్చుకో!" అంటూ కాలితో ఒక తన్ను తన్ని ముందుకు వెళ్ళిపోయాడు.

మేకలు, కోళ్ళు అరుపులు వినిపిస్తున్నాయి. అయ్యో! దొంగనాకొడుకులు ఇవన్నీ దోచుకుపోతున్నారని మనసు విలవిల్లాడిపోతోంది.

లచ్చుకు కళ్ళంతా బైర్లు కమ్మాయి. లేచే ఓపిక లేదు. గానీ కొంచెం కొంచెం అటు ఇటు కదులుతున్నాడు. తల్లివంక చూశాడు. స్పృహలేదు. శవంలా పడి ఉన్న తల్లిని చూస్తుంటే భోరున ఏడుపొస్తోంది. పక్కనే ఉన్న నీళ్ళ కుండలో నీళ్ళు తెచ్చి ముఖం మీద చల్లుదామంటే ఒళ్ళంతా నుజ్జు నుజ్జు అయిపోయింది. కళ్ళ నుండి కన్నీళ్ళు ధారలా కారుతున్నాయి. ఆరుగాలం కష్టపడి సంపాదించినదంతా బూడిద చేశారు. ఇంకేముంది మాకు? తన్నులు, గుద్దులు ఉన్నదంతా తుడిచి పెట్టుకుపోయారు. అసలు ఇదంతా దీని వల్లనే జరిగింది. దీనికంతటికీ నిరీమిల కారణం. దానికి ఎన్నిసార్లు చెప్పినా బుద్ధి రావడంలేదు. ఇల్లు గుల్లయినా దానికి లెక్కలేదు. ఇలాగే ఉంటే మమ్మల్ని కూడా చంపేస్తారు. అందుకే దాని కాళ్ళు విరగొట్టి ఇంట్లో నన్నా కూర్చోబెట్టాలి. లేదంటే ఇంట్లోంచి వెళ్ళగొట్టాలనుకుంటూ కొంచెం ఓపిక తెచ్చుకొని లేవడానికి ప్రయత్నిస్తున్నాడు.

పోలీసులు వెళ్ళిపోయాక ఒక్కొక్కళ్ళే వచ్చి లచ్చును లేపి కూర్చోబెట్టి రాత్రి మిగిలిన జావ ఉంటే తాగించారు. స్పృహతప్పి పడి ఉన్న ముసలమ్మ మొఖం మీద నీళ్ళుచల్లారు. ఆమె

తిప్పరిల్లింది. లేపి కూర్చోబెట్టి కొన్ని నీళ్ళు తాగించి చిందర వందరగా ఉన్న సామానును సర్దుతున్నారు. తలా ఒకమాట మాట్లాడుతున్నారు. అసలు దాని వల్లనే కదా, ఇదంతా ఏదో మీటింగ్ అంటే ఏం కాదుగానీ ఈ స్థూపాల గొడవ దానికెందుకంట. పక్కింటి సుకియారి.

'అదే వొదినా! ఆ పిల్ల చెపితే వినదు కదా! నిన్న కూడా పొద్దున్నుంచి సాయంత్రం దాకా అక్కడే' మంగ్రే.

ఇంతలో జొన్న చేలోంచి లోపలకు అడుగు పెట్టింది నిరీమిల. అందరూ ఒకేసారి తనవైపు చూసి మొఖం పక్కకు తిప్పుకున్నారు. అత్త దగ్గరకు వెళ్ళింది. ఆమె కూడా అంతే ఉంది. తమ ఈ స్థితికి తనే కారణమన్నట్లు వారి చూపులు చెపుతున్నాయి. చెల్లాచెదురుగా పడేసిన సామాను సర్దుతుంటే సుకియారి అందుకొంది.

'నువ్వింక ఇంటిపట్టున ఉండవే! చూడు ఇల్లు ఎలా గుల్ల చేశారో! వీళ్ళను చూడవే! దెబ్బ పడని చోటే లేదు ఈ శరీరాల మీద' .

'అవునే పిల్లా! సంఘంలో ఉన్నావ్‌గా, ఎప్పుడో నీకు తీరిక ఉన్నప్పుడు పనులు చూద్దువు గానీ...' మంగ్రే.

అలా తలా ఒకమాట తననే అంటున్నారు. వాళ్ళు అంటున్నప్పుడు ఎదురు మాట్లాడాలనుకుంది గానీ మౌనంగానే తన పని చేసుకుంటూపోతోంది.

* * *

మరునాడు తెల్లవారుఝామున్నే సోమారు ఇంటి దగ్గర్నుంచి టకటక బూట్ల శబ్దంతో పోలీసులు నిరీమిల ఇంటికి వచ్చి దభీమని తలుపును తన్నారు. పడుకొని ఉన్న లచ్చును లేపి కొట్టుకుంటూ "ఎక్కడరా, నీ పెళ్ళాం? ఎవరింట్లో ఉందిరా? ఎవడి దగ్గర..." అనరాని మాటలతో కొట్టుకుంటూ ఈడ్చుకు పోతున్నారు. ఒకటే తన్నులు, గుద్దులు. ముక్కునుంచి నోటినుండి రక్తం కారుతోంది. కాళ్ళను ఈడ్చుతూ, కుదేస్తూ ఎవరికిష్టం వచ్చినట్లు వాళ్ళు నుజ్జు నుజ్జు చేస్తుంటే తల్లి ఏడుస్తూ, నెత్తినోరు కొట్టుకొంటూ "నా బిడ్డను వదలండయ్యా" అంటూ వెనకాల పడింది. ఆమెను ఈడ్చి కొట్టేటప్పటికి అంతే స్పృహతప్పి పోయింది. కాసేపటికి తేరుకొని చుట్టూ చూసింది. ఏం జరిగిందో గుర్తుచేసుకొంది. పోలీసులను తిట్టుకుంటూనే కుంటి నడకతో, సత్తువ లేక వంగిన నడుముతో ఏడుస్తూ ఊరి మలుపు వరకు వెళ్ళింది. మలుపు దగ్గర కాచుకున్న జీబు స్టార్ట్ అయ్యి లచ్చును ఎత్తుకుపోతుంటే "అయ్యా! నా బిడ్డను వదలండయ్యా" అంటూ దణ్ణం పెడుతూ ఏడ్చింది. జీబు కనుచూపు మేర కనబడే వరకు గుండె పగిలేలా ఏడ్చింది. తల కొట్టుకుంటూ అక్కడే కూలబడింది. సుకియారి, మంగ్రేలు పరుగు పరుగున వచ్చి లేవదీయబోతుంటే వాళ్ళ మీదపడి "నా కొడుకే"! అంటూ నెత్తి బాదు కుంటుంటే ఇద్దరికీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

పమిట చెంగుతో కళ్ళను అద్దుకొంటూ 'పదవ్వా పోదాం' అంటూ చెరోపక్క చేతుల్ని పట్టుకొని నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్నారు.

"నేను రానే! నా కొడుకును ఎత్తుకుపోయారు. ఏం చేస్తారో....... ఓరిదేవుడా!" అంటూ

శోకందాలు పెట్టింది. ఎందుకంటే అప్పటి వరకు ఇలా అరెస్ట్ చేసిన వాళ్ళను జైల్లో పెట్టడమో, చంపడమో చేస్తున్నారని విని ఉన్నది.

'వస్తాడులే! రావే పోదాం!' కన్నీళ్ళను తుడుచుకుంటూ ఇద్దరూ బలవంతంగా నిలబెట్టారు.

'నేను రానే! నా కొడుకును ఏం చేస్తారో' చేతులతో గుండెను బాదుకుంటూ 'అస్సలు దీనికంతటికీ కారణం అదే. దాన్ని చేసుకున్న కాన్నుంచి మాకీ తిప్పలు తప్పడం లేదే. ఏం చేయనురా బాబో' పెద్దగా ఏడుపు లంకించుకొని నెత్తి బాదుకొంది.

నిదానంగా ఆమెను ఇంటి దగ్గరకు తీసుకొచ్చారు. సుకియారి అవ్వను పట్టుకొంటే మంగ్రే కొట్టంలో మంచం వాల్చి దండెం మీద వేలాడుతున్న పాత శాలువాను పరిచి అవ్వను పడుకోబెట్టింది. సుకియారి ఇంట్లోకి వెళ్ళి జావ కోసం వెతికింది. జావలేదు. గబగబా తనింటి కెళ్ళింది. ఒక బురఖానిండా జావ, రెండు దొప్పలు తీసుకొంది. అంతే స్పీడ్‌గా వచ్చి మంచం దగ్గరే కూర్చుని బురఖాలోని జావ దొప్పలోకి వంచుతూ 'అవ్వా! ఈ వేడి జావ తాగవే! కొంచెమంత తాగవే! లే! లే!' అంటూ బలవంతం చేసింది.

'ఏయ్! మంగ్రే! దాన్ని నిదానంగా కూర్చోబెట్టవే' సుకియారి.

మంగ్రే అవ్వను కూర్చోబెట్టింది. అవ్వ ఏడ్చి ఏడ్చి ఉండడంతో గొంతు బొంగురుపోయి నొప్పి పెడుతోంది. కొంచెం తాగుదామని నోటిదగ్గర పెట్టుకుందో లేదో నిరీమల ఎట్లా తప్పించుకున్నదోనని లోపల అనుకుంటూ పైకి మాత్రం నిరీమిల వస్తూ ఉండడాన్ని చూసింది. అంతే ఛివుక్కున ముఖం పెట్టేసి 'ఇది నా ఇంట్లో ఉన్నంత కాలం ఇంతే! ఇది నా ఇంట్లోకి రావద్దు. నిరుడు నా ఇల్లుగుల్ల చేశారు. ఇప్పుడు నా కొడుకును లేకుండా చేసింది ఛీ... ఏం బతుకే నీది? నా ఇంట్లో అడుగు పెట్టొద్దు పో ఇక్కడ్నుంచి' ఆవేశం, ఏడుపు కలగలసిన అరుపుతో.

అవాక్కయ్యి నిలబడింది నిరీమిల.

'ఏంటి! ఇంకా నిలబడ్డావ్! నా ఇంట్లో అడుగు పెట్టావంటే ఊరుకోను' అంటూ సూరులో ఉన్న బడుగాను తీసుకొని ముందుకు రాబోయింది.

'ఊరుకో అవ్వా! ఊరుకో' మంగ్రే, సుకియారిలు.

'ఏంటే ఊరుకొనేది. మన పనులు కావే అంటే విన్నదా? దీన్ని కట్టుకున్న పాపానికి వాడు ఆ మూర్ఖుల చేతిలో ఎంత ఇబ్బంది పడుతున్నాడో? మా ఇబ్బందులు నీ కెందుకే? పో... అక్కడికే...' గట్టిగా అరిచి ఏడుస్తూ మంచంలో కూలబడింది అవ్వ.

నిశ్చేష్టురాలై చూస్తుంది నిరీమిల. నిత్యం ఇటువంటి సంఘటనలెన్నో చూస్తున్నది. ఆ బాధితులను ఓదార్చుతున్నది. అలాంటి తనకు ఈ రోజు ప్రత్యక్ష అనుభవం ఎదురైంది. తన కర్తవ్యం ఏంటి? అనేక విధాలా ఆలోచించిన నిరీమిల ధైర్యాన్ని కూడదీసుకొని అత్తను ఓదార్చాలని అడుగు ముందుకు వేసింది. అంతే ఘొల్లుమంటూ అరిచి లేని సత్తువను తెచ్చుకొంటూ మంచానికి ఆనించిపెట్టుకొన్న బడుగాను అందుకొంది అత్త. ఆమె కోపం చూసిన నిరీమిల ముందుకు వెళ్ళలేక పోయింది. చిందర వందరైన సామానును సర్దుదామని ఇంట్లోకి వెళుతుంటే,

'ఏయ్ ఎక్కడికి పోయేది?' గట్టిగా రోదిస్తూ.

నిరీమిల అడుగు అక్కడే ఆగిపోయింది. ఇంకా ఎందుకే నా ఇంట్లో?... పో... అని లేచి నిలబడింది. సుకియారి, మంగ్రేలు వారిస్తున్నా వినడం లేదు. వారు కూడా జరుగుతున్న దాన్ని భయంగా చూస్తున్నారు.

బయటినుంచే ఇంట్లోకి కలియచూసింది నిరీమిల. జావ కుండ పగిలిపోయి జావ ఒలికిపోయి ఉంది. ఒలికి పోయిన జావ మీద ఈగలు ఝుమ్ఁఁఁ... మంటూ ముసురుకుంటున్నాయి. ఇక్కడ సామాను అక్కడ, అక్కడ సామాను ఇక్కడ ఇష్టం వచ్చినట్లు గిరాటేశారు. అక్కడ ఉన్న చిందర వందర సామాను, భర్తను కొట్టిన గుర్తులను, భర్త పెనుగులాటను చెపుతున్నాయి. నూకలను చిల్లర చిల్లరగా చల్లేశారు. ఒక్కొక్క వస్తువు వంక చూస్తూ నిలబడింది. లోపలకు వెళదామని మనసు ఆరాట పడుతోందిగానీ అత్త సందివ్వడం లేదు. కిందికి చూసింది. నిదానంగా అడుగు వెనక్కి వేసి అక్కడ్నుంచి కదిలింది. కదిలింది గానీ మనసు పరి పరి విధాలా ఆలోచిస్తుంది.

'ఎక్కడికని వెళ్ళాలి? ఎవరి దగ్గరికని వెళ్ళాలి?' తనలో తనే

సోమ్లు దాదా ఇంటికి వెళ్ళింది. ఇంట్లో ఎవరూ లేరు. పనులకు పోయారు. లోపలకు వెళ్ళి గోడవారగా కూర్చుంది. కొడుకును పోలీసులు పట్టుకు పోయారనే బాధతో అత్తనన్ను అన్ని మాటలన్నది గానీ నిజంగా నేనంటే ప్రేమ లేదా? నేను ఈ ఇంట్లో అడుగుపెట్టినప్పటి నుంచి కన్న తల్లి కన్నా ఎక్కువగా చూసిందే! ఎప్పుడూ పల్లెత్తు మాట కూడా అనలేదే! పార్టీ అండ కావాలి గానీ పార్టీ పనులు చేయవద్దనే కదా! ఆమె ఉద్దేశ్యం. మా కుటుంబానికి పార్టీ చేసిన సహాయం మరచిపోయిందా? లేదా పార్టీ అవసరం ఇంక లేదనుకుంటుందా? గత పరిస్థితి కళ్ళముందు ప్రత్యక్షమవుతుంటే...

అత్త, మామలకు నాలుగు ఎకరాల పొలం ఉంది. అడవి దగ్గరలో ఉండడం వలన ఏ పంట వేసినా కోతుల నుంచి రక్షించుకోవడం వారి దినచర్యగా ఉండేది. మామ ఉన్నప్పుడు పగలు, రాత్రనే తేడా లేకుండా చేను దగ్గరే కావలి ఉండేవాడు. తిండి, నిద్ర అన్నీ అక్కడే. ఎప్పుడో ఒకసారి ఇంటికి వస్తూపోతూ ఉండేవాడు. పగలు కోతుల బెడద, రాత్రి పందుల బెడద. ఎంత కావలి ఉన్నా వాటి పని అవి కానిచ్చేవి. అందుకే అవి తినగా మిగిలింది వీరికి దక్కేది. అలా ఉంటున్న క్రమంలో రిజర్వ్ అంచునే ఉందని ఫారెస్ట్ వాళ్ళు ఒత్తిడి చేయడం, డబ్బులు అడగడం మొదలుపెట్టారు. ఎదురు మాట్లాడిన మామను కొట్టారు. ఒక రోజు రాత్రికి రాత్రే వచ్చి మామను కొట్టి పంచెలో దాచుకున్న డబ్బులను ఊడబీకి హెచ్చరించి వెళ్ళారు.

అదే సమయంలో అనుకోకుండా పార్టీ అక్కడికి వచ్చింది. పరుగు పరుగున వాళ్ళ దగ్గరకు వెళ్ళి గోడు వెళ్ళబోసుకున్నారు అత్త, మామలు. వెంటనే ఫారెస్ట్ వాళ్ళకు కబురు పంపించారు. ముందు రాలేదు. తర్వాత వచ్చారు. చుట్టు పక్కల ప్రజలందర్ని పిలిపించారు. ప్రజల తీర్పుమేరకు ఫారెస్ట్ వాళ్ళకు దేహశుద్ధి చేసి పంచాయితీ చేసి వీళ్ళ భూమిని వీళ్ళకప్పగించారు. అప్పట్నుంచి పార్టీ అంటే ఎనలేని విశ్వాసం కలిగింది ఆ కుటుంబానికి.

తర్వాత మామ కాలం చేశాడు. మామ కాలం చేశాక అత్త పార్టీ వాళ్ళను అడిగి ఊరికి అందుబాటులో పడావు పడిన రెండు ఎకరాల భూమి ఉంటే దాన్ని బాగు చేసి సాగు చేసుకుంటున్నారు. ఆ రోజు వాళ్ళు ఆ మాత్రం సహాయం చేయబట్టే ఈ రోజు ఇట్లా బతుకుతున్నాం. వాళ్ళే కనుక భూమి ఇప్పించకపోతే ఇప్పుడసలు తినడానికి నూకలెలా వచ్చేవి? 'కొడుకు' బాధతో ఇవన్నీ మరచిపోయిందా?

పక్కూరి గాయతల్ కొడుకు బలవంతంగా తన్నెత్తుకుపోయినప్పుడు ఊరిపెద్దలు ఏమని తీర్పు ఇచ్చారు? 'ఆ పిల్లగాడు ఇష్టపడుతున్నప్పుడు పోతే తప్పేముంది?' అని సెలవిచ్చారు. తనకు ఇష్టం లేదంటుంటే పెద్దలు పెద్దల తరహాలో తీర్పు చెప్పినప్పుడు కాదని తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. ఇంటికి వచ్చిన వెంటనే గాయతల్ కొడుకు ఎత్తుకు పోవడానికి వస్తే దాక్కొంది. ఒకటి కాదు, రెండు రోజులు కాదు......చాలా రోజులు జరిగింది. ఇంటి దగ్గర ఉంటే ఎప్పుడో ఒకసారి వచ్చి పట్టుకు పోతారని భయపడి పక్కూర్లో కొన్ని రోజులు ఉంది. ఆ ఊర్లో ఉంటున్న క్రమంలో కూడా తనని పట్టుకుపోవడానికి సంతకు పోయే దారిలో అటకాయించేవారు. ఏదో ఒక సమయంలో ఎత్తుకుపోతారని భయపడి పార్టీతో తన సమస్యను పంచుకొంది. పార్టీ అక్కడ సర్కారుకు బాధ్యత అప్ప చెప్పింది. తర్వాత పార్టీ సహాయంతో సర్కారు వాళ్ళు పంచాయితీ చేసి గాయతల్ కుటుంబాన్ని గట్టిగా హెచ్చరించింది. వాళ్ళ పెత్తనానికి అడ్డుకట్టవేశారు. అప్పట్నుంచి నిరీమిల క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్ (కె.ఎ.ఎం.ఎస్) లో పని చేస్తూ ఉంది. గ్రామ సంఘం నుండి ఏరియా మహిళా సంఘటన్, సర్కార్‌లో న్యాయశాఖ బాధ్యురాలిగా ఎదిగింది. ఆ సమయంలోనే తనకు నచ్చినతన్ని పార్టీ సలహామేరకు పెళ్ళి చేసుకుంది.

ఇవేకాదు. పార్టీ వచ్చాక వాస్తవంగా చెప్పాలంటే మా బతుకుల్లో మార్పు వచ్చింది. వెనుకబడి ఉన్న ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. తునికాకు రేట్ల పెంపకం, చెరువులు తవ్వించడం, కూరగాయల పెంపకం, అధిక ఉత్పత్తి తీయించడం, పశుపాలన, విద్య, వైద్యం......ఒకటా? రెండా? ఎన్నెన్నో. ఈ రోజు ప్రజలకు ఏదైతే అవసరమో దాన్ని గుర్తించి, ప్రజల జీవనవిధానంలో పెనవేసుకుపోయింది పార్టీ. అందుకే గ్రీన్‌హంట్ అభియాన్. ఇది మొదలైనప్పటినుండి ఎంతమంది అమాయకులను వారి తూటాలకు బలిచేశారో? విచ్చలవిడిగా చేస్తున్న ఈ బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపేదేలా? ఈ దుర్మార్గాలను సామూహికంగానే నిలదీయాలి. దాని కోసం అందరిని కూడగట్టాలి. అవును కూడగట్టాలి. అనుకొంటూ స్థిరమైన నిర్ణయానికి వచ్చింది.

* * *

నిరీమిల కబురు అందుకున్న ప్రజలందరూ గుమిగూడారు. పటేల్ గాయతల్ కూడా వచ్చిన వాళ్ళల్లో ఉన్నారు. చివరిగా కూర్చుని గొణుక్కుంటున్నారు. ఏం మాట్లాడుతోందని ఆత్రుత ఒక వైపు, ఇలా జమయ్యి ఉన్నప్పుడే ఆ మూర్ఖులు వచ్చి పిట్టల్లా కాల్చేస్తే........అనే ఆందోళన మరోవైపు ఆ మొఖాల్లో ప్రస్ఫుటమైంది. నిరీమిల ఇద్దరు యువకులను పిలిచింది.

రెండు వైపులా సెంట్రీ పెట్టింది. మధ్య మధ్యలో చెక్ చేస్తుండమని సోమ్లు దాదాకు చెప్పింది.

'ఏం చేద్దామని' జనంలో పెట్టింది నిరీమిల.

'ఏం చేసేటట్లు లేదే' ఒక దీదీ.

'మొగుడ్ని పోలీసులు పట్టుకుపోతే దీనికేంటే ఈసమెత్తు బాధ కూడా లేదే. పైగా అందర్ని పిలిచింది' గుంపులో నుండి.

'ఎంత నిమ్మళంగా ఉందో?' మరొకరు.

వాళ్ళు, వీళ్ళు మాట్లాడుతున్నవి స్పష్టంగా వినపడక పోయినప్పటికీ మొత్తానికి తననే అంటున్నారని అర్థమైంది నిరీమిలకు. అసలు విషయం బయటపెట్టింది.

ఒకటి స్టేషన్‌కు వెళ్ళి లచ్చును విడిపించుకు రావడం.

రెండు స్థూపం కట్టడం.

అందరూ అవాక్కయ్యారు. ఎవరూ పెదవి విప్పడం లేదు. అందర్ని కలియ తిరిగి చూసింది. మధ్య మధ్యలో సోమ్లు దాదా, పక్కూరి సంతు కల్పించుకొని మాట్లాడుతున్నారు. కానీ జనం నుంచి స్పందన రావడం లేదు. భయపడుతున్నారు. గ్రీన్‌హంట్ భయం.

'నే పోతున్నా ఎద్దుల్ని వదలాలే!' సుఖమిత్తి లేచింది.

'అయ్యింది చాలు! ఇంక మా వల్ల కాదు' రాజు బత్తి.

'ఏం చేద్దాం నిరీమిల, మాకు భయమేస్తుందే' హీరాలాల్

"ఆ రోజు ఏమన్నారో విన్నావా? వెళ్తూవెళ్తూ మీ ఇళ్ళను కూడా కాల్చేస్తామన్నారే!" సుఖ్‌లాల్.

చివరి నుండి పటేల్, "ఇంకా చాలులే! ఇప్పుడేవీ తలపెట్టినా మననెత్తికే అంటుకొంటుంది."

పటేల్ నోటి నుండి మాట రావడం ఆలస్యం. అందరూ వెంటనే వంతు పలికారు. ఒక వేడి నిట్టూర్పు. వాళ్ళ ధోరణిని మార్చడానికి ఇలా ప్రశ్నించింది నిరీమిల. "మనమేమీ చేయలేమని చేతులు ముడుచుకుంటే రోజుకొకర్ని పట్టుకెళ్ళరా? ఊరు మిగులుతుందా?"

"..."

"మనం చేసేదేమీ లేదంటే ఎలా? ఏం చేయలేకపోతే వాళ్ళు రావడం ఆగుతుందనుకుంటున్నారా? ఎంత మాత్రం ఆగక వాళ్ళ ఆగడాలు ఇంకా ఎక్కువవుతాయి. ఇంకా మనకు భయం పెరుగుతుంది. మనకోసం పనిచేస్తున్న. మనం పెట్టింది తింటూ మనకు 'నిజాలను' తెలియజెప్పిన వారిని పిట్టల్లా కాల్చి చంపుతుంటే మనం ఏం చేయలేమా? ఆలోచించండి. సంఘాల్లో పనిచేస్తున్న వారిని పట్టుకొని అరెస్ట్ చేస్తే వారి విడుదల కోసం మనం ఏం చేయలేమా?

"ఏం సుఖబత్తి! మనం ఏం చేయలేమా? ఆ దుకాణంవోడు నీ గంగకు సరైన పైసలు ఇవ్వనంటే తన్ని పైసలు ఇప్పించిన రోజును మరచిపోయావా?"

"ఏం హీరాలాల్ దాదా! ప్రతి సంవత్సరం మనం కాయకష్టం చేసి తునికాకు కోస్తే సరైనరేటు ఇవ్వకుండా బలిసిన కాంట్రాక్టర్లు 'చక్కర్లు' కొడుతుంటే వాళ్ళ మెదలు వంచి మన

కష్టానికి ఫలితం ఇప్పించిన రోజులను మరచి పోదామా?"

"ఏం బాబాయ్ (పటేల్ నుద్దేశించి) ఫారెస్టోళ్ళు భూములు గుంజుకుంటే మన భూములను మనకిప్పించిన రోజులను మరచి పోదామా? వేటిని మరచిపోదాం? ఎన్నని మరచి పోదాం? ఆ రోజు కనుక వారే లేకుంటే మన బతుకులు మారేవా? చెప్పండి. ఏ మాత్రం మార్పు వచ్చేది కాదు. ప్రతి పనిలో తపన పడేది మన కోసమే. త్యాగం చేసేది మన కోసమే. అంత త్యాగం చేస్తున్నప్పుడు మనం వారికి స్థూపాలు కట్టించలేమా? ఆ స్థూపాల రూపంలో రెండు నిముషాలు వారిని స్మరించుకోలేమా? పోలీసులు వస్తారు. కూలుస్తారు. ఎన్నిసార్లు కూలిస్తే అంతకు మించి కడతాం. అరెస్ట్ చేస్తే విడిపించేదాకా పోరాడుదాం. భయపడుతూ ఉంటే ఇంకా భయపెడతారు. ఎదురు తిరిగితే తోక ముడుస్తారు. ఎంత కాలమని బిక్కు బిక్కు మంటూ కాలం గడుపుదాం? సమస్య అందరిది. అందరం బాధ్యత పడుదాము." అంటూ ఆవేశంగా మాట్లాడుతూ అక్కడున్న వారి నందరినీ ఉత్తేజితులను చేసింది. ఒకరిద్దరు అలాగే 'చేద్దామనడం' తో అందరిలో కదలిక వచ్చింది. అప్పటికే ప్రజలను వెనక్కు లాగడానికి పటేల్, గాయతల్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలే అడ్డు కట్టవేశారు. అట్లా అరగంట చర్చ తర్వాత అంతా ఒక స్థిర నిర్ణయానికి వచ్చాక రెండు బ్యాచీలు ఏర్పడ్డాయి. ఒకటి లచ్చును తీసుకొచ్చే బ్యాచ్, రెండు స్థూప నిర్మాణ బ్యాచ్.

అక్కడ్నుంచే ఒక సైన్యం లాగా మహిళలంతా కలిసి నిరీమిల భర్త విడుదల కోసం బయల్దేరారు. మరొక బ్యాచ్ స్థూప నిర్మాణ పనులను మొదలు పెట్టింది. తెల్లారితే జులై 28 ఇప్పటికిప్పుడు సిమెంటుతో కడుదామంటే సమయం కూడా లేదు. అందుకే అందరితో మాట్లాడిన పిదప 'మరమట్టు' (మర అంటే చెట్టు. మట్టు అంటే స్థూపం – అంటే చెట్టు మొద్దును మంచిగా చెక్కి స్థూపం ఆకారం చేస్తారు) కట్టించుదామనే నిర్ణయానికి వచ్చారు. అనుకున్నదే తడవుగా దాదాలు మొద్దును నరకడానికి వెళ్ళారు. చీకటి పడేంత వరకు చెక్కుతూనే ఉన్నారు. మొత్తానికి అనుకున్న విధంగానే స్థూప నిర్మాణం పూర్తయ్యింది. ఆ రాత్రి రెండు వైపుల సెంట్రీకి అనుమానం వచ్చింది. అనుమానం కాదు నిజమే. ఎవరివో రెండు ఆకారాలు ముందుకు వస్తున్నట్టు గమనించిన సెంట్రీ 'ఎవరు?' అని గద్దించే టప్పటికీ కాలికి బుద్ధి చెప్పారు.

జులై 28 తెల్లారింది. బారులు తీరిన జనం మిన్నంటే నినాదాలతో ర్యాలీగా స్థూపాన్ని చేరుకున్నారు. అమర వీరుల పాటలు ఉత్తేజ కరమైన ఉపన్యాసాలతో సభ ముగుస్తుండగా...

తూర్పు దిక్కున దిక్కులు పిక్కటిల్లేలా నినాదాల హోరుతో అంతా అటువైపు చూశారు. 'కా. పటేల్ సుధాకర్ రెడ్డి అమర్ హై, కా. జానకీ దీదీ అమర్ హై, కా. కమల, కా. పార్వతి, పాగు, అంజు, మంగ్లి, కా. కిషోర్, కా. విక్రమ్ అమర్ హై, అమరుల ఆశయాలను కొనసాగిద్దాం! గ్రీన్‌హంట్ అభియాన్‌ను ఓడిద్దాం!' నినాదాల హోరు మోగుతోంది. పిల్లా, పాప, ముసలి, ముతక అందరూ పిడికిలి బిగించి నినాదాలకు గొంతు కలుపుతుంటే, నిరీమిల నినాదాలు ఇస్తూ ఎత్తిన చేతుల మధ్యలో నుంచి తిన్నగా చూస్తే... చూసిన మొఖం కనపడింది. నినాదాలను ఆపకుండా తదేకంగా చూసే... అత్త 'తనా? కాదా?' అన్నట్లు పరికించి చూసింది. నిజమే అత్తే. ఏమాత్రం సందేహం లేదు. తన గొంతుకు వంతు కలుపుతుంది.

ఒక వైపు కన్నకొడుకు ప్రేమ... మరొకవైపు పార్టీ అండతో ఇలా బతుకుతున్న పరిస్థితి. ఈ రెండు రకాల ఆలోచనలతో రాత్రంతా సతమతమైంది అత్త. తొలినాళ్ళల్లో కా. సుఖదేవ్ దాదా చూపిన ప్రేమ, ఇచ్చిన అండ, చెప్పిన రాజకీయాలు పై చేయి అయ్యి ఆమెను అమరుల స్థూపం దిశగా అడుగులు వేయించాయి. రాత్రంతా ఆమె పడిన ఘర్షణ తెలియని నిరీమిల అత్త గొంతులోని ఉత్తేజాన్ని చూసి ఆనందం పట్టలేకపోయింది.

దూరంగా మహిళా సైన్యం గుంపుగా వస్తూ ఉంది. నినాదాలు ఇచ్చుకొంటూ సూటిగా స్థూపం దగ్గరకు వస్తోంది. గుంపు దగ్గర కొచ్చే కొద్దీ మొఖాలు స్పష్టంగా కనపడుతున్నాయి. గుంపు మధ్యలో నుండి భర్త 'అక్రమ అరెస్ట్‌లను ఖండించండి' 'గ్రీన్‌హంట్ అభియాన్‌ను ఓడిద్దాం!' నినాదాలు. నిరీమిల సంభ్రమాశ్చర్యాలకు లోనయింది. కలా? నిజమా? అని తేరిపార చూసింది. నిజమే! అత్త, భర్తలు అలా కళ్ళముందు కదలాడేటప్పటికీ సంతోషం పట్టలేక పోయింది. ఆ ఆనందంతో నినాదాలు...

"అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతి నాపలేరు!"

"సమైక్య శక్తితో గ్రీన్‌హంట్ అభియాన్‌ను ఓడిద్దాం!"

(నిత్యం పోలీసు దాడులు అరెస్ట్‌లతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న సమయంలో సంఘాలను, ప్రజలను ధైర్యంగా ముందుకు నడిపిస్తూ. అనుకున్న లక్ష్యాన్ని సాధించిన నిరీమిల పట్టుదలకు స్పందించి....

ఈ కథ రాసి చదివి వినిపించినప్పుడు తమదైన సలహాలు, సూచనలు అందించిన కామ్రేడ్స్‌కు విప్లవాభినందనలు తెలుపుతూ...)

***అరుణతార, జనవరి–ఫిబ్రవరి 2012***

# బాల గెరిల్లాలు

- యామిని

'ఒరేయ్ బచ్చు! ఇటు రారా!' వంటింట్లో నుంచి అమ్మ పిలుపు. 'ఆఁఁఁ...' అంటూ అమ్మ పిలుపులు వినిపించుకోకుండా దూరంగా వస్తున్న దళాన్ని చూస్తూ తుర్రుమంటూ పరుగెత్తాడు బచ్చు.

'వాడెప్పుడూ ఇంతే, అస్సలు మాటకందడంటూ' పొయ్యిలో మంట రాజేసి బయటవున్న నీళ్ళగిన్నె తీసుకురావడానికి వస్తూ గుమ్మంలో నిలబడే దూరంగా వస్తున్న దళాన్ని చూస్తూ ఉంది.

బచ్చు చురుకైన పిల్లవాడు - 9 సంవత్సరాలు ఉంటాయేమో. 5వ తరగతి చదువుతున్నాడు. చదువులోనూ, ఆటల్లోనూ, పాటల్లోనూ హుషారే. పార్టీ అంటే అమితమైన ప్రాణం. దళం గ్రామానికి వచ్చిందంటే చాలు బడికి ఎగనామం పెట్టేసి అన్ని రోజులూ దళం దగ్గరే ఉండిపోతాడు. తన చిన్ని కంఠంతో పాటలు పాడుతుంటే ఇంత చిన్ని గొంతు ఆ రాగాలను ఎలా పలుకుతుందా? అని ఆశ్చర్యమేస్తుంది. ఎప్పుడూ తన చుట్టూ నలుగురు స్నేహితులతో కనపడుతుంటాడు.

ఏడుగురితో కూడిన దళం ఆ గ్రామానికి వస్తూంది. దానికి కమాండర్ నిర్మల. మంచి కలివిడి కలిగి ఎవర్నైనా ఇట్టే కలుపుకునే మనస్తత్వం. మిగతా కామ్రేడ్స్ మున్నాల్, భీమాల్, చందు, లక్మి, సగ్గోంతి, బద్రులు కూడా ఈమెకేమీ తీసిపోనట్టుంటారు. మున్నాలైతే మరీనూ. ఈ ఊరివాడే కావడం వల్ల పిల్లకాయలందర్ని వెంటేసుకొని వారికి చదువు, ఆట పాట నేర్పిస్తూ ఉంటాడు. నిర్మల దారిలో ఎవరో కలిస్తే మాట్లాడుతూ వస్తూంది. మున్నాల్ ముందు దారి తీస్తుండటంతో మున్నాల్‌ను గుర్తు పట్టిన బచ్చు గబుక్కున వచ్చి దళాన్ని లాల్‌సలామ్‌తో నిలబెట్టాడు.

'ఏరా! బచ్చు, ఎలా ఉన్నావ్?' మున్నాల్.

(మున్నాల్ వాళ్ళ కుటుంబంవాడే కావటంతో అప్పుడప్పుడు'రా' అని సంబోధిస్తుంటాడు.)

'మంచిగానే.....' తన తొర్రి పళ్ళతో కిలకిలనవ్వుతూ ఒకచేత్తో నిక్కరు పైకి దోపుకుంటూ చేతులు కలుపుతున్నాడు.

'ఏం బచ్చు? అంతా మంచేనా? మరి మేము అదుగో... ఆ పెద్ద చెట్టు దగ్గర ఉంటాంగానీ

నీవెళ్ళి లచ్చుమన్ దాదాను పిలుచుకురా! ఆఁ... అలాగే నీ దోస్తులను కూడా తీసుకురా!' నిర్మల.

'అలాగే!' అంటూ అక్కడ్నుంచి తుర్రున వెళ్ళిపోయాడు.

దళం చాలా దూరం నుంచి వస్తుండటంతో 'హమ్మయ్య' అనుకుంటూ కిట్లు దించుకున్నారు. నిర్మల రోల్‌కాల్ చేసి కవర్స్ చూపించి ఆ రోజు వర్కు గురించి మాట్లాడింది. బాగా అలసిపోయి ఉండటంతో టీ పెట్టడానికి అందరూ సిద్ధమవుతున్నారు. బచ్చు వెళ్ళి 10 నిమిషాలు కూడా కాలేదు. తన దోస్తులు జాగో, రామసింహ, రణోతి, లచ్చుమన్ దాదాలతో వస్తున్నాడు. దాదా ముందు నడుస్తుంటే నలుగురూ వెనుక మాట్లాడుకుంటూ, మధ్యమధ్యలో కిసుక్కున నవ్వుకుంటూ వస్తున్నారు.

అందులో జాగో, రణోతిలకు 7, 8 సంవత్సరాలు ఉంటాయేమో. నూనె లేకపోయినా నీటుగా దువ్విన తలతో, మోకాళ్ళ వరకు ఉన్న లంగాలతో ఉంటే, రామసింహ్ గుండీలులేని చొక్కాను పట్టుకొని అమాయకపు చూపులతో, ఒకింత సిగ్గుతో చేతులు కలుపుతూ దగ్గరికి వచ్చారు.

'ఏం జాగో? రోజూ ఎక్కడికెళ్తున్నావ్?' మున్నాల్.

'ఎద్దులు మేపటానికి' గొంతు నుండి బయటకు రాని సమాధానం ఇచ్చింది జాగో.

'రణోతి నువ్వో?'

మరింత సిగ్గుపడుతూ, తలను నేలకు వాల్చి కాలి బొటనవేలితో నేలను గీరుతూ పక్కనున్న వారిని చూస్తూ చెప్పాలా? వద్దా? అని సందేహిస్తుండగా, 'అర్రె... రణోతి చెప్పటం లేదు, ఏంటి స్కూల్ కెళుతున్నావా?' 'ఊహుఁఁ... అమ్మా, నాన్నలతో చేనుకు వెళ్ళి అక్కడ బుడ్డ చెల్లిని ఆడిస్తున్నాను' రణోతి.

'అమ్మో! ఇంకేం పెద్దదానివైపోయావన్న మాట.'

అందరూ ఒకేసారి నవ్వుకున్నారు.

'ఏరా! రామసింహ్ మరి నువ్వో?'

నవ్వుతూ.... 'నేనా? చేలో పిట్టలు కంకులు తినకుండా కాపలాకి వెళ్తున్నా.'

'అయితే మీలో ఒక్కడేనా, స్కూల్‌కెళుతుంది. అరే! ఎట్లారా? మనం కనీసం 5 వరకన్నా చదువుకోవాలిరా! అప్పుడే మనకు చదవటం, రాయటం వస్తుంది. ఇప్పుడు చూడండి నన్ను. ఇంటి దగ్గర ఉన్నప్పుడు బడికి ఎగనామం పెట్టేవాణ్ణి. ఇప్పుడు ఇలా... ఎంత కష్టపడుతున్నానో' అంటూ తన వచ్చిరానీ రాతలను చూపిస్తుంటే అందరూ ఆ రాతలను ఆసక్తిగా చూస్తున్నారు.

నిజమే, మరి బడికి వెళ్ళాలనే తపన ఉన్నా ఇళ్ళల్లో ఉన్న సమస్యలు కట్టిపడేస్తున్నాయ్. బాల్య దశ నుంచే బాధ్యతలను మీదేసుకోవాల్సిన పరిస్థితులు రావటం. ప్రభుత్వాలు నిరక్షరాస్యత గురించి మాట్లాడుతాయి గానీ దాని నివారణ చర్యలు చేపట్టవు. ప్రభుత్వాలు దీనిమీద శ్రద్ధ పెడితే పలకా, బలపం పట్టుకున్న పిల్లలే మనకు కనిపిస్తారు.

'మరి రోజూ రేడియోలో వార్తలు వింటున్నారా?'

'ఊంcc....' అందరూ ముక్త కంఠంతో అన్నారు.

'నిన్న మన వాళ్ళు చేసిన అంబుష్‌లో నలుగురు పిసిలు చచ్చారు కదన్నా.'

'ఓ... అయితే విన్నారన్నమాట. మంచిది. రోజూ రేడియో వినటం వలన ఎక్కడెక్కడో జరుగుతున్న మన ఘటనలు తెలుస్తాయి. కొత్త, కొత్త విషయాలు కూడా అర్థమవుతాయి. ఇంతకుముందే చాలాసార్లు బాలల సంఘం గురించి మీతో మాట్లాడాను. గుర్తుందా? అయితే సరే! ఇప్పుడు అది పెట్టుకుందాం. అందుకని మీకు తోడుగా ఇంకా ముగ్గుర్ని తీసుకువస్తే నిర్మాణం చేద్దాం. 'ఏం బచ్చు?' అంటూ తనకు తెలిసిన రిపోర్టును బట్టి మెదక్ జిల్లాలో 'యాదగిరి' అనే 9 సంవత్సరాల చిచ్చర పిడుగు ఎలా పని చేసిందీ చెప్పుకుపోతుంటే అందరూ ఆసక్తిగా వింటూ మధ్య మధ్యలో గుడ్లు మిటకరిస్తున్నారు.

మున్నాల్‌కు చిన్న పిల్లలంటే బాగా ఇష్టం. పిల్లలు కూడా మున్నాల్‌ను బాగా ప్రేమిస్తారు. బాలల సంఘం నుంచే పనిచేస్తూ క్రమంగా పార్టీలోకి వచ్చాడు. అందుకే పిల్లలు అంతా అభిమానిస్తారు.

* * *

సాయంత్రమయింది. ఆకాశమంతా నీలం రంగులోకి మారిపోయింది. వర్షం వచ్చేలాగా ఉంది. పైరగాలి అమాంతం వచ్చి చెవులను తాకుతుంటే... ఆహాcc.... గంగ పైరగాలికి తన పసుపు పచ్చని పూలతో నాట్యమాడుతుంది. ఆ చల్లని సాయంత్రం వేళలో చిక్కని టీతో మనసుకు స్వాగతం పలుకుతున్నారు చిచ్చర పిడుగులు. టీ తాగి సమష్టి అధ్యయనానికి వెళ్ళిపోయారు. నిర్మల గ్రామం నుంచి వచ్చిన వాళ్ళతో మాట్లాడుతుంది.

రాత్రి 8 గంటలు అయింది. భోజనాల సమయం. అన్నం తింటూ, 'ఏం బచ్చు, మున్నాల్ మాట్లాడాడా?' నిర్మల.

'నవ్వు.......'

'మరయితే సంఘం పెట్టటమే లేటన్న మాట, అవును ఇప్పటికే చాలాసార్లు వాయిదా పడింది' నిర్మల.

'నిజంగా' జాగో.

'నిజమే జాగో! మీకు తోడు ఇంకొక ఇద్దరు వున్నారు కదా! వాళ్ళ పేర్లు ఏంటబ్బా!.... ఆcc...... లచ్చి, లక్కు వాళ్ళిద్దర్ని కూడా తీసుకురండి!' నిర్మల.

అలా మాట్లాడుకుంటూ అన్నం తిని పడుకోవటానికి ఎవరి డేరాకు వాళ్ళు వెళ్ళిపోయారు. జాగో, రణోతిలు లక్ష్మి దగ్గరకు, బచ్చు, రామసింహాలు మున్నాల్ దగ్గరకు వెళ్ళి పడుకున్నారు. పడుకున్నారేగానీ మాట్లాడకుండా ఉంటే కదా! సమయం 10 గంటలు అయింది. సెంట్రీ నుంచి పడుకోండని కాషన్ వచ్చింది. కాషన్ వచ్చిందని ఇంకా నెమ్మదిగా, గుసగుసగా మాట్లాడుకుంటూ కిసుక్కున నవ్వుతున్నారు.

అలా..... అలా..... మాట్లాడుకుంటూ ఎప్పటికో నిద్రపోయారు కానీ బచ్చుకు నిద్రరావటం లేదు. పరిసరాలన్నీ ప్రశాంతంగా ఉన్నాయి. కింద సూది పడితే వినిపించేంత నిశ్శబ్దం, చిక్కని

చీకటి..... పడుకునే బచ్చు ఆకాశం కేసి చూశాడు. నల్లని ఆకాశంలో తెల్ల, తెల్లని నక్షత్రాలు మిణుకు మిణుకు మెరుస్తూ ఉన్నాయి. ఎటు చూసినా నక్షత్రాలే. లెక్కపెడదామని మొదలుపెట్టి చూస్తే...... 1, 2, 3, 4, 5 ............ అలా లెక్క పెడుతూనే ఉన్నాడు. ఊహుం.... పూర్తయితేనా? అసలు ఇన్నీ ఎక్కడి నుంచి వచ్చాయబ్బా! చూస్తుంటే మీద రాలి పడతాయేమో..... ఊహు....... అన్నీ చిన్న చిన్నవే...... మాలాగే....... తెల్లగా, స్వచ్ఛంగా ప్రకాశిస్తున్నాయ్ మా పార్టీలాగానే...... అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు.

తెల్లవారు జాము నాలుగు గంటలయింది. సెంట్రీ వచ్చి మున్నాల్‌ను లేపుతుంటే పక్కనున్న బచ్చు ఉలిక్కిపడి లేచాడు.

'ఏంటి, బచ్చు, అప్పుడే లేచావ్?' సెంట్రీ.

'తెల్లారిందనుకున్నా'.

'ఇంకా టైముందిలే, పడుకో'.

మున్నాల్ సెంట్రీకెళ్ళాడు. కానీ బచ్చుకు నిద్రరావటం లేదు. ఎప్పుడు తెలవారుతుందా? ఎప్పుడు తనదోస్తులను తీసుకువద్దామా.... అయినా పొద్దునే వెళ్తేనే దొరుకుతారు. లేదంటే తమ చిన్ని చిన్ని బాధ్యతల్లోకి వెళ్ళిపోతారనుకుంటుండగానే ఐదు గంటలయింది. అప్పుడే ఒక్కొక్కళ్ళు లేస్తున్నారు. నిర్మల రోల్‌కాల్‌కు సిద్ధమవుతూ బచ్చు హుషారును గమనించి.

'ఏం బచ్చు, అప్పుడే లేచావా? మరి నీ దోస్తులను తీసుకొస్తావా!' అంటే, రామసింహను వెంటేసుకొని కాళ్ళకు పరుగు అందించాడు.

'అరేయ్! పడతారురా, కాస్త నిదానంగా వెళ్ళండంటుండగానే' కనుచూపు మేర దాటిపోయారు.

10 నిముషాలు అవ్వకముందే ముగ్గుర్ని వెంటేసుకుని వచ్చారు. రావటంతోనే మున్నాల్ దగ్గరకు వచ్చి నవ్వు ముఖంతోనే చూపించాడు. వాళ్ళల్లో లక్కు, లచ్చి, సోనులు నవ్వు ముఖంతో నిలబడ్డారు.

అందరికీ చేతులు కలుపుతుంటే నిర్మల తదేకంగా వారినే చూస్తోంది. ఎంత అమాయకపు పిల్లలు వీరు. పార్టీ వచ్చిందంటే చాలు, పరుగెత్తుకుంటూ వస్తారు. అందరూ పేదరికం నుంచి వచ్చినవారే. పెద్ద, పెద్ద మాటలైన 'సిద్ధాంతం', 'రాజకీయాలు' అంటే అసలు తెలియవు. వారికి తెలిసిందల్లా ఒక్కటే. పార్టీ ప్రజలకోసం పని చేస్తుంది; సియాన్‌ల పెత్తనాన్ని కంట్రోలు చేస్తుందని. అంతే, దీంతోనే వారు పార్టీ వచ్చిందంటే స్కూల్, ఇళ్ళల్లో పనులు వదిలేసి దళం దగ్గరే ఉండిపోతారు. ఉన్న వాళ్ళల్లో లచ్చి మరీ చిన్న పిల్ల. చురుకైనది కూడా. పిల్లి కళ్ళతో నవ్వితే బుగ్గల మీద సొట్టలు పడి మరీ అందంగా ఉంటుంది. వీళ్ళ గురించి ఆలోచిస్తున్న నిర్మల 'లాల్ సలామ్'తో ఈ లోకంలోకి వచ్చింది.

'ఆccc..... లాల్‌సలామ్, మరి కూర్చుందామా ఇక'.

'ఓccc......' నవ్వుతూ.

అందరూ పాలీథీన్ వేసుకొని రౌండ్‌గా కూర్చుని ఒక పక్క ఖాళీ ఉంచారు. కూర్చున్నారే

గానీ నవ్వకుండా ఉంటేగా? లచ్చి, జాగో, రణోతిలు మూతికి చేయి అడ్డం పెట్టుకుని నవ్వుతున్నారు. విడి విడి సందర్భాల్లో ఎంతసేపైనా మాట్లాడుతారు గానీ మీటింగ్ వాతావరణం వచ్చేసరికి అమ్మో! పై ప్రాణాలు పైనే పోయేటట్టుంటాయి. నిర్మల వచ్చి బాలల సంఘం ఆవశ్యకత,పని విధానం గురించి అర్థం చేయించింది. మధ్యలో మున్నాల్ పిల్లల మీద పాట, అమరుల పాటలు పాడుతుంటే పిల్లలంతా వంతు పలికారు.

'మరి ఈ సంఘానికి బాధ్యుడు ఎవరుంటే బాగుంటుందో' నిర్మల.

చూపులన్నీ బచ్చు వేపే సారించాయి. 'ఏరా! మరి బాధ్యుడెవరంటే?' మున్నాల్.

నిదానంగా, మెల్లిగా లో గొంతుతో 'బచ్చు' అని చెప్పింది. లచ్చి. లచ్చితో పాటే అందరూ గొంతులు కలిపారు. 'ఏం బచ్చు' అంటే మెలికలు తిరిగిపోతూ తొర్రిపళ్ళతో నవ్వుతున్నాడు. అసలే ముందు పళ్ళు లేకపోవడంతో నవ్వుతుంటే పళ్ళ సందులు కనిపించి అందరికీ నవ్వు తెప్పిస్తున్నాయి.

సంఘ బాధ్యుడిగా బచ్చు ఎన్నికైనాడు. సంఘ కర్తవ్యాలు ముఖ్యంగా శత్రు సమాచారం సేకరించటం, అలాగే చదువుకోవటం, చదువు చెప్పించుకోవటం, పరిశుభ్రతగా ఉండడం, మీలాంటి చిన్న పిల్లలను తయారుచేయటం..... మున్నాల్ మాట్లాడుతున్నంత సేపు శ్రద్ధగా వింటూ గుడ్లప్పగించి చూస్తున్నారు. లచ్చి అయితే మరీ ఒద్దికగా కూర్చొని మోకాళ్ళ మీద చేతులు పెట్టుకొని మధ్య మధ్యలో గాలికి మొఖం మీదకు వస్తున్న వెంట్రుకలను సర్దుకుంటూ వింటున్నది.

'ఏంటి, మరి రిపోర్టు సేకరిస్తారు కదూ!' మున్నాల్.

'ఓ..... సేకరిస్తాం' అందరూ.

అప్పటికే సూర్యుడు నడినెత్తి మీదకొస్తున్నాడు. ఎండ సుర్రుమంటున్నది. పైన ఎండ వేడిమి, లోపల ఎలుకల పరుగు. వీళ్ళ పరిస్థితి గమనించి నిర్మల 'ఇంక చాలిద్దాము, అన్నం మనకోసం ఎదురుచూస్తుంది. తినకపోతే బాధ పడుతుందంటూ' లేచింది.

సాయంత్రం నాలుగు గంటలు అవుతుండగా అందరూ లాల్ సలామ్‌లతో విడిపోయారు.

* * *

దళం ఆ గ్రామానికి వచ్చినప్పుడల్లా గ్రామంలో ఉన్న శత్రువు పరిస్థితి గురించి రిపోర్టు తీసుకొచ్చేవారు. దళం చెప్పే విషయాలను శ్రద్ధగా వినేవారు. అలా నెలరోజులు గడిచిపోయాయి.

ప్లీనం ఏర్పాట్లలో భాగంగా 50 మందిమి కలిసి ఉన్నాం. ఒకరోజు ఉదయం తెల్లవారుజామున అప్పటికి అందరూ లేవలేదు. ఒక్కొక్కరే లేస్తున్నారు. బచ్చు, లక్కు హడావిడిగా పరుగెత్తుకుంటూ డేరా దగ్గరకు వచ్చారు. ఇంత పొద్దునే హడావిడిగా వస్తున్నారని ఎదురువెళ్ళి 'ఏంటి, విషయం' అనబోయేంతలో 'పోలీసులు వచ్చారు. చాలా మంది ఉన్నారు. ఇద్దర్ని పట్టుకున్నారు. ఇప్పుడే ఈ అడవివైపు వస్తుంటే చూసి మేము వారి వెనుకనుండే ఇటు వచ్చాం' బచ్చు.

'ఎంతమంది ఉన్నారు? ఎటు నుండి వచ్చారు?' క్యాంపు బాధ్యుడు. 'చాలా మందే

ఉన్నారు, కనీసం 60 మంది ఉంటారేమో. ఊరి నుంచి వచ్చినట్టున్నారు. రాత్రి అడవిలో పడుకొని తెల్లవారుతుండగా వచ్చినట్టున్నారు. అందరి దగ్గర ఎకెలు, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్లున్నాయి.

'మరయితే మీరు వాళ్ళు ఎటువైపు నుంచి వస్తున్నారో, ఎక్కడ దేరా వేస్తున్నారో చూసిరండి. ఏ మాత్రం మీరు వారికి అనుమానం వచ్చే విధంగా ఉండొద్దు' క్యాంపు బాధ్యుడు.

'ఊcc.....' అంటూ వెళ్ళిపోయారు.

బచ్చు తను వేసుకున్న షర్టు తీసి గునియాల్ పట్టుకున్నాడు. లక్కు ఎండ్రకాయలు పట్టేవాడిలాగా ఆకులతో చిన్న డొప్ప తయారుచేసుకుని దారిలో దొరికిన ఒకటి, రెండు ఎండ్రకాయలను డొప్పలో వేసుకున్నాడు.

పోలీసులు మామిడి చెట్టు దగ్గర దేరా వేస్తున్నారు. చాయ్ పెట్టుకోవటానికి పొయ్యిరాళ్ళు తెస్తున్నారు. చెట్టు దగ్గరే ఒక వాగు ప్రవహిస్తూ ఉంది. లక్కు వాగు దగ్గరికెళ్ళి ఎండ్రకాయలు ఒకటి రెండు పడుతూ తలపైకెత్తి చెట్టు దగ్గర 'ఎంతమంది వున్నారు?' 'ఏయే' తుపాకులున్నాయి? మనసులో లెక్కించుకుంటూ, వాళ్ళు చూసినప్పుడు 'అరే! తప్పించుకుపోయిందం'టున్నాడు. లక్కును చూసిన పోలీసులు వాళ్ళ పనుల్లో వాళ్ళు వున్నారు గానీ లక్కును అస్సలు పట్టించుకోలేదు.

బచ్చు గునియాల్ పట్టుకొని సమాచారం కోసం వెళ్తుండగా లచ్చి చిన్న నీళ్ళగిన్నె తీసుకొని ఎదురుపడింది.

'ఏంటి లక్కి, మనవాళ్ళు ఎక్కడ?' అంటే,

'అcc.... రుగోల..... అంటూ దూరంగా ఉన్న తన దోస్తులను చూపించింది. బచ్చు వాళ్ళందర్ని కలసి మాట్లాడుతుండగా లక్కు ఎండ్రకాయల డొప్పతో కలిశాడు. 'ఎంతమంది ఉన్నారు? తుపాకులు, సెంట్రీ పరిస్థితి...... పూర్తి వివరాలు లక్కు చెప్పటంతో బచ్చు, రామసింహను తీసుకొని దళం దగ్గరకు వస్తున్నాడు.

ఇక్కడ దళం దగ్గర సామాన్లు సర్దేసి రిపోర్టుకోసం ఎదురుచూస్తున్నారు. చుట్టూ తిరిగి దళం దగ్గరకు చేరుకున్నారు. బచ్చు, రామసింహలు రావటంతోనే 'దాదా! మరక మర (మామిడిచెట్టు) దగ్గరైతే దేరా వేసేటట్లు లేరు. టీ పెట్టుకొని తాగారు. బయల్దేరటానికి సర్దుకుంటున్నారు. బహుశా మన సెంట్రీకి ముందు ఉన్నదారికి వచ్చేటట్టున్నారు. లక్కును అక్కడే పెట్టి వచ్చారు. వాడు బయల్దేరితే మన దగ్గరకు వస్తాడంటుండగా' లక్కు రానే వచ్చాడు.

రొప్పుకుంటూ వచ్చి 'దాదా! వాళ్ళు బయల్దేరారు, అదిగో మనం నీళ్ళు తెచ్చే చెలిమ దగ్గరున్న పిల్లదారికి వస్తున్నారు' అన్నాడు లక్కు

అక్కడున్న బాధ్యులు వెంటనే ఒక టీమ్ను ఫైరింగ్ కోసం పంపించారు. వాడు మూడు ప్లాటూన్లతో వస్తున్నాడు. రెండు ప్లాటూన్లు ముందుకు వెళ్ళిపోయాయి. చివరి పిఎల్ వరిచేల గట్టు మీద నుంచి వెళ్తుంది. ఈ చివరి దానిపై ఫైరింగ్ చేయటానికి అనుకూలంగా ఉంది. మనవాళ్ళు ఫైరింగ్ ఓపెన్ చేశారు. ఊహించని విధంగా ఫైరింగ్ వచ్చేటప్పటికి గందరగోళానికి గురై ఒకళ్ళ మీద ఒకళ్ళు ఆ బురద నీళ్ళల్లో పడ్డారు. బురద నీళ్ళల్లో పడేటప్పటికి మొత్తం

మొఖం, తుపాకులు కూడా బురద, బురద. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఎదురైంది. ఫైరింగ్ శబ్దం వినగానే ముందు ఉన్న రెండు పిఎల్‌లు అటు నుంచి అటే పరుగెత్తారు. చివరి పిఎల్‌లో ఉన్నవాడు మద్దతు రమ్మంటూ వాకీలో మొత్తుకుంటున్నాడు. వాడు ఎంత మొత్తుకున్నా 'బతికి పోయాం బాబోయ్!' అంటూ ముందుకే పరుగెత్తారు. ఇక చేసేదేమీ లేక గుడ్డిలో మెల్లగా ఫైరింగ్ చేస్తున్నారు. ఒకడైతే పెద్దగా అరుస్తున్నాడు. ఒకడైతే గావుకేకలు పెడుతున్నాడు. ఎవరి అరుపులు వారివే. ఒకళ్ళదొకళ్ళు వినిపించుకునే పరిస్థితి లేదు. భయం, భయంతో ఉండుండి షెల్స్ వేస్తున్నాడు ఒకడు. అస్సలుకే సమన్వయం లేదు. బురదలో పడుకున్నవారు లేస్తే ఒట్టు. బాగా భయపడుతూ పరుగెత్తటం మొదలుపెట్టారు. పరుగెత్తేటప్పుడు బూట్లు బురదతో నిండి ఉండటంతో అంత బరువుగా ఉన్న బూట్లను మోయలేక పడుతూ, లేస్తూ...... పడుతూ, లేస్తూ పరుగెత్తుతుంటే, ఒకడైతే బురదలో పడిన బూటును కూడా తీసుకోకుండా ఒక బూటుతోనే 'బతుకు జీవుడా!' అంటూ పరుగెత్తుతున్నాడు. చూడ్డానికి మంచి మంచి తుపాకులు ఉన్నా మన గెరిల్లాల ఫైరింగ్ ముందు అంతా 'తుస్సే'.

వాడు వేసిన షెల్ ఒకటి మన కిచెన్ దగ్గర పడటంతో డేరాలో ఉన్న కొద్ది మందిమి డేరా ఖాళీ చేసి 1/2 గంట దూరం ఇవతలికి వచ్చి ఆగాము. ఒక గంట తర్వాత ఫైరింగ్ చేయటానికి వెళ్ళిన టీమ్ మాతో కలిసింది. అప్పటికే పోలీసులు వెళ్ళిపోయారు. ముందు వెళ్ళిన రెండు టీమ్‌లపై మన ఇంకొక టీమ్‌పై ఫైర్ చేసిన శబ్దం వినవచ్చింది.

రెండు గంటల తర్వాత ఖాళీ చేసిన డేరా దగ్గరకు నిర్మల టీమ్ వెళ్ళింది. మన టీమ్ అక్కడికి వెళ్ళేటప్పటికే బచ్చు బ్యాచీ సామానుకు కాపలా వున్నారు. కిచెన్ దగ్గర ఇద్దరు బచ్చు, బ్యాచీ సెంట్రీ ప్లేస్ దగ్గర లక్కి, రామసింహ్ వీరికితోడు కుక్క ఏ మాత్రం అలికిడి అయినా కళ్ళను చురుగ్గా తిప్పుతూ..... చిన్న శబ్దం వస్తే చాలు మొరిగే కుక్కలు సైతం అలికిడి, వాసన గమనించగానే చెవులన్నీ నిక్కబొడిచి, తోకను పైకి లేపి, మొఖం ముందుకు సాచి మరీ రెప్పార్పకుండా చూస్తున్నాయి. కొంచెం కదలికలు కనిపించటంతో 'ఎవరు?' గద్దించాడు బచ్చు.

'ఎవరా ఈ పిల్లగొంతు? అనుకుంటూ, గొంతును గుర్తు పట్టి 'అఁ...... మేమే' అంటూ వారి దగ్గరకు వెళ్ళింది నిర్మల టీమ్. మనం కనపడటంతో చిరునవ్వుతో ముందుకు వచ్చి చేతులు కలుపుతూనే వాళ్ళు వెళ్ళిపోయారు దీదీ! 'ఇవిగో సామాను' అంటూ ఒక చోట చేర్చిన సామానును చూపిస్తూ, 'మా వాళ్ళు ఇటువైపు ఉన్నారంటూ' వాళ్ళు ఉన్న వైపు చేయిపట్టి చూపించి, వాళ్ళను పిలవటానికి రెండడుగులు ముందుకు వేస్తుంటే,

'ఆగు బచ్చు! మన వాళ్ళు పిలుస్తారు లే! అయినా మీరెప్పుడు వచ్చారిక్కడికి?' నిర్మల

'వాళ్ళు వెళ్ళిపోగానే మేమొచ్చేశాం. అసలు మీరు ఫైరింగ్ చేసేటప్పటికి వాళ్ళకు పిచ్చెక్కినట్లయిపోయింది. ఒకళ్ళ నొకళ్ళు తోసుకుంటూ, తొక్కుకుంటూ అదుగో! ఆ బురదలో పడ్డారు. అసలు ఇద్దరే దీదీ ఫైర్ చేసింది, అది కూడా ఛస్తామనే భయంతో బురదలోనే పడుకొని కాల్చారు. అందుకే ముందు వున్న వాళ్ళు కూడా రాలేదు. ఇక వీళ్ళైతే ఒకటే పరుగులు. పడిపోతానే పరుగెత్తారు. ఒకడు బురదలో పడ్డ బూటును కూడా తీసుకోకుండా ఒక బూటుతోనే

పరుగు లంకించుకుంటే, మరొకడు బురదతో నిండిన బూట్లతో పడుతూ, లేస్తూ ఒకటే పరుగో..... పరుగో.....' వాళ్ళు చూసినదంతా కళ్ళకు కట్టినట్లు చెప్తూ గల గల నవ్వుతున్నారంతా.

'అందరూ వెళ్ళిపోయాక ఇద్దర్ని ఊళ్ళో ఉంచి మేము వచ్చాం. గబగబ ఇక్కడికి వచ్చేసి సామానంతా సర్ది మేము తిని మీరు వస్తారేమోనని ఎదురు చూస్తున్నామని' చెప్పుకుపోతుంటే,

లచ్చి, రామసింహలు మధ్యలో అందుకొని 'ఇవిగో! వాళ్ళు కాల్చిన తూటాలు' అంటూ జేబుల్లో వున్న తూటాలను చూపిస్తూ 'దీదీ! భయంతో చాలానే కాల్చారు గానీ బురదలో కలసిపోయి కనిపించలేదంటూ' చీమిడి తుడుచుకుంటూ చెప్పుకుపోతున్నాడు.

వాళ్ళు అలా చెప్తుంటే అలాగే చూడాలనిపిస్తుంది నిర్మలకు. అన్నం తిని వారితో మాట్లాడటం పూర్తయ్యాక చిరునవ్వుతో లాల్‌సలామ్ చెప్తుతుంటే బచ్చు ముక్కు ఆనందంతో పిండింది నిర్మల.

వీళ్ళు పిల్లలు కాదు పిడుగులు. నిజంగా గెరిల్లాలంటే వీళ్ళే కదా! వీళ్ళను చూస్తుంటే చైనా పుస్తకం బాల గెరిల్లాలులో చట్టిముక్కు, బండమొఖం గుర్తుకు వచ్చారు నిర్మలకు.

***అరుణతార, జనవరి-ఫిబ్రవరి 2013***

# ఇద్దరు 'శస్త్ర'కారులు

– ఎన్. డి.

**జీ**వితంలో పెద్ద నిర్ణయాలు గానీ, చిన్న నిర్ణయాలు గానీ, ఒకసారంటూ తీసుకున్నాక వూరికే ఆలోచించకూడదు, ముందుకు పోవాలి. కానీ నాకున్న పెద్ద రోగం ఏంటంటే 'నిర్ణయం తీసుకోవాలా? వద్దా? తీసుకున్న నిర్ణయం కరెక్టా? కాదా?' అని అది అటో, ఇటో తేలిపోయేవరకూ కూడా గుంజాటన పడడం. దీనికి అపవాదు నేను డాక్టర్ కావాలని తీసుకున్న ఏకైక నిర్ణయం – అది దెయ్యంలా నా నెత్తిన కూచుని నాతో అంత కష్టమూ చేయించింది. ఇప్పుడీ కష్టాలనీ తెచ్చిపెట్టింది.

ఈ ముక్కూ మొహం తెలీని యువకుడి వెనకాల ఈ చిమ్మచీకట్లో కళ్లు పొడుచుకుంటూ పోవడానికి నేనసలు ఎందుకు ఒప్పుకున్నాను? ఈ దినేష్‌గాడు ఒకడు నా ప్రాణానికి. అయినా వాడు చెప్తే మాత్రం నా బుద్ధి ఏ గాడిదలు కాయను పోయింది? మిస్టర్ హిప్పోక్రాటిస్! ఎందుకయ్యా నా వెనకాల పడతావ్, అందరు డాక్టర్లలా నన్నూ సుఖంగా వుండనివ్వకుండా!

* * *

మేం గుడిసె లోపల అడుగు పెట్టి చూసేవరకూ పేషెంట్ నీలం రంగు జిల్లీ మీద పడుకుని ఉన్నాడు. కళ్లకు పట్టీలు కట్టి ఉన్నాయి. పైన దూలానికి ఓ సోలార్ లైట్ వేలాడుతోంది. ఆ మసక వెలుతురులో చూస్తే అది మనుషులు వుండే గుడిసెలా అనిపించలేదు. పొలం పనులప్పుడు పడుకుంటారు కావచ్చు. నన్ను తీసుకొచ్చినతను, ఆనందట పేరు, నా మెడికల్ కిట్‌ని జిల్లీ మీద పెట్టాడు.

నేను పేషెంట్ పక్కనే కూచుని ముందుగా నాడి చెక్ చేశాను. నార్మల్‌గానే వుంది.

'పేషెంట్ పేరేంటి?'

'రైను'

'నాలుక చూస్తాను'

ఆనంద్ రైనుకు వాళ్ల భాషలో చెప్పాడు. నాలుక చూసి, ఎందుకైనా మంచిదని ఆనంద్‌తో చెప్పించి థర్మామీటర్ పెట్టించాను. వాచీకేసి చూస్తున్నా. ఇంతలో గుడిసెలోకి ఇద్దరు మనుషులు వచ్చారు. మిలటరీ దుస్తుల్లో ఎకె-47లు వేసుకుని ఉన్నారు. ఆ తుపాకిని మాత్రం గుర్తుపడతాను నేను. చేతులు కలుపుతుంటే అర్థమైంది ఒకరు మహిళ అని. జుత్తు కత్తిరించుకుంది. వాళ్ల

పేర్లు సోనీ, సీతూ అని పరిచయం చేసుకున్నారు. నా పేరు కునాల్ అని చెప్పాను. అసలు పేరు చెప్పద్దు అని దినేష్ చెప్పాడు. థర్మామీటర్ తీసి,

'తొంభై తొమ్మిది' అన్నా. వాళ్లు తెలుసన్నట్లు తలూపారు.

ఇంతలో ఓ 16, 17 ఏళ్ల గెరిల్లా అమ్మాయి పళ్లెంలో మూడు మగ్గుల్లో చాయ్ పట్టుకొని వచ్చింది.

'బిస్కట్లు ఇవ్వు దాదాకు' అంది సోనీ.

నేను కాదనలేదు. మోటర్ సైకిల్ దిగాక నడిచింది రెండు గంటలే అయినా చీకట్లో కావడం వల్ల చాలా అలిసిపోయాను. నయం లైట్ వేసుకోనిచ్చారు. నా ఊబకాయం నన్ను ఇబ్బందిపెట్టిన కొద్ది సందర్భాల్లో యిదొకటి. వాళ్లిద్దరూ బిస్కట్లు తీసుకోలేదు. నేనే సగం ప్యాకెట్ అవగొట్టాను చాయ్‌లో ముంచుకుంటూ.

అప్పుడే యింకో గెరిల్లా అమ్మాయి హడావుడిగా వచ్చి చేయి కలిపింది. ఆమె అప్పటివరకూ రైనును చూసుకుంటూ వుండిన 'డాక్టర్ ఇడిమే' అట. అంతకు ముందే వూర్లో ఇంకెవరో పేషెంట్‌ను చూడ్డానికి వెళ్లిందట. నేను వచ్చానని తెలిసి తన 'అసిస్టెంట్'కు ఆ పేషెంట్‌ను అప్పజెప్పి ఉరికొచ్చింది.

నలుగురం గుడిసెలోంచి బైటకొచ్చాం.

'చెప్పండి' అన్నా ముగ్గురికేసీ చూస్తూ.

సోనీ, సీతూ ఇడిమేకేసి చూశారు.

'వారం రోజుల క్రితం కంపెనీ వాళ్లు పోలీసుల మీద చేసిన దాడిలో రైనుకు ఎడమ కంటి వద్ద గాయమైంది. రెండో కంటిలో కూడా రజను పడింది. దాంతో రెండు కళ్లూ కనిపించడం లేదని పక్కనున్న వాళ్లకు చెప్పాడు. కమాండర్‌కు చెప్తే డాక్టర్ టీం వద్దకు పంపాడు. వాళ్లు వెంటనే గాయాన్ని తుడిచి, శుభ్రం చేసి పట్టీలు వేశారు. అప్పటినుండి రోజూ శుభ్రం చేసి కంటిలో డ్రాప్స్ వేస్తూ వస్తున్నారు. రజను పడిన కన్ను కొద్దిగా మసక తగ్గినట్టున్నది. కానీ ఇప్పటికీ రెండూ కనిపించనట్టే అనుకోవాలి. యాంటీ బయాటిక్స్ వాడుతున్నారు అప్పటినుండీ'

'బయటకు తీసుకు వెళ్లే ప్రయత్నం చేయలేకపోయారా కంటి డాక్టర్ వద్దకు?'

'తీసుకెళ్లాలనే అనుకున్నాం, కానీ దాడిలో మా కామ్రేడ్స్ గాయపడ్డారనేది వాళ్ళకు అర్థమైంది. అంతటా నిఘా పెట్టారు, దాంతో..' సీతూ.

'మందుల దుకాణాల వద్ద కూడా నిఘా వుంచారు. ఒక మనిషికి ఏ డాక్టర్ అయినా నెలరోజులు మందులు రాసినా 15 రోజుల మందులే ఇచ్చి మళ్లీ రమ్మంటున్నారు' సోనీ.

నాకేమనాలో తోచలేదు. నిజంగానే ప్రభుత్వం ఇంత చేస్తుందా? చేసినా ఆశ్చర్యం లేదు. రోజూ పేపర్ల నిండా వస్తున్న గ్రీన్ హంట్ కథనాలు చూస్తుంటే కావచ్చునే అనిపిస్తుంది. కానీ ఇంత వెనకబడిన ఈ ప్రాంతాలకు అలా చేయడం మామూలు ఆదివాసులకు ఎంత ప్రాణగండం!

'రోజూ డ్రెస్సింగ్ చేస్తూ, క్లీన్ చేస్తూ వస్తున్నాం' అంది ఇడిమె.

నేను ఇడిమెకేసి మెచ్చుకోలుగా చూస్తూ, 'ఇడిమె, మీరు చాలా మంచి పని చేశారు. వెంటనే ఈ జాగ్రత్తలు తీసుకోకపోయి వుంటే పేషంట్‌కి కనీసం ఒక్క కన్ను అయినా పోయేది, రెండోదీ గ్యారంటీ వుండకపోవు' అన్నా.

ఇడిమె ముఖంలో ఏం స్పందన లేదు. నాకేసి 'ఇప్పుడేం చేయాలో అసలు విషయం చెప్పండి' అన్నట్టు చూస్తోంది.

'ఇంజక్షన్స్ ?'

'అప్పుడు సెలైన్ పెట్టినప్పుడు ఇవి ఐవిలో ఇచ్చాం, ఇవి విడిగా రోజూ ఇస్తున్నాం. ఇవాళతో అఖరు చేశాం' ఇడిమె ఇంజక్షన్స్ చూపించింది.

అడవి డాక్టర్లు మరీ వెనకబడి లేరని అర్థమైంది. ఒక విధంగా చెప్పాలంటే చాలా మెరుగ్గా వున్నారనే చెప్పాలి. ఈ ఇంజక్షన్లూ, మందులూ ఇవ్వకపోయి వుంటే ఈ పాటికి తప్పక ఇన్ఫెక్షన్ వచ్చి వుండేదే.

నా మెడికల్ కిట్‌లోంచి మరో ఇంజక్షన్ తీసి ఇడిమెకిచ్చి రైనుకివ్వమన్నాను. దండకా అని సైగ చేసింది. తుంటికి ఇవ్వమన్నాను. ఇడిమె ఇంజక్షన్ యిచ్చేటప్పుడు ఎలా యిస్తోందో పరిశీలించాను. పర్‌ఫెక్ట్! కొంతమంది ఆర్ఎంపి, ఎంబిబిఎస్‌లకు కూడా ఇంజక్షన్ సరిగ్గా ఇవ్వడం రాక పేషెంట్లను తిప్పలు చేయడం నాకు తెలుసు.

'రైనుకి హిందీ అర్థమవుతుందా?'

'అర్థమవుతుంది, మాట్లాడ్డం రాదు'

'సరే అయితే నేను అడుగుతాను, తను చెప్పేవి నాకు అనువాదం చేయండి'

రైను శారీరక స్థితి గురించి కొన్ని ప్రశ్నలు వేశాను. ఇడిమె అతని సమాధానాల్ని నాకు అనువాదం చేసింది. అతని శారీరక స్థితి ముందే అర్థమైంది గానీ అతని మానసిక స్థితి కూడా ఏ మాత్రం ఆందోళనకరంగా లేదని అర్థమైంది.

సోనీని చూసి తల ఊపాను. ఇడిమె తప్ప అందరం బైటకొచ్చాం.

'ఇటు కూర్చుందాం' అంటూ సోనీ దారి తీసింది. పరిచిన జిల్లీల మీద కూచున్నాం.

'మీరు తీసుకున్న జాగ్రత్తల వల్ల పేషెంట్ కన్నుపోయే ప్రమాదాన్ని తప్పించారు. కన్ను కాదు కండ్లు అనాలేమో. మిమ్మల్ని అభినందిస్తున్నా. రేపు ఉదయం లోపల ఉన్న చర్రాల్ని తీద్దాం. చిన్న ఆపరేషన్ చేయాల్సి వస్తుంది'

'ఉదయాన్నే ఎన్ని గంటలకు?'

'ఉదయం ఇంజక్షన్స్ ఇవ్వాల్సి ఉంటుంది, ఏడు గంటలకు చేద్దాం' అన్నాను.

సోనీ, సీతూ ఒకరినొకరు చూసుకుని కళ్లతోనే 'సరే' అనుకున్నారు.

'ఇడిమె, ఇంకొకరు వుంటే సరిపోతుంది'

'ఇంకేమైనా?' అడిగాడు సీతూ.

'ఇడిమెతో చెప్తాను...'

ఎవరో వచ్చి సోనీతో ఏదో చెప్పారు.

'ఇక్కడకే తీసుకురండి' అంది సోనీ.

'ఏంటీ పేషెంటా? మనమే వెళ్దాం' అన్నా.

నేను ఆత్రుతగా అడిగిన పద్ధతికి కావచ్చు, సోనీ నవ్వి, 'కాదు, అన్నం మీకు...'

'ఎంత దూరం? మనమే వెళ్దాం కదా, దూరం కాకుంటే..'

'దూరం కాదు, పదండి'

కొద్దిగా కిందకి దిగి, పారుతున్న చిన్న పాయను దాటి అవతలకెళ్లాం. అన్నం, పప్పు, గోంగూర పల్చటి పులుసు. రుచి అదిరిపోయింది. ఎప్పుడూ లేంది మళ్లీ కొంచెం అన్నం పెడ్తానంటే ఏమనకుండా పెట్టించుకున్నా.

'పేషంట్లకు ఏమేం ఇస్తున్నారు?' మొద్దు మీద నా పక్కనే కూచుని తింటున్న సీతూ నడిగాను.

'ఇదే తిండి. జావ కూడా ఇస్తున్నాం, వీలైనకాడ గుడ్లు తెప్పిస్తాం, పండ్లు చాలా అరుదుగానే, కొన్ని ఏరియాల్లో మా పండ్ల తోటలనుండి దొరుకుతాయి'

'గుడ్లు ఉడికించి యిస్తారా?'

'ఆ'

'ఇప్పుడు దొరికాయా?'

'ఆ'

'గ్రీన్‌హంట్ ప్రభావం గుడ్లకు లేదా?' అడిగా నవ్వుతూ.

'ఎందుకు లేదు? అన్నిటికీ వుంది. కానీ మన మార్గాలన్నిటినీ మూసేయడం వాడికి సాధ్యం కాదు. సల్వాజుడుం సందర్భంగా కూడా సంతల్ని మూశాడు, కానీ ప్రజలు ప్రతిఘటించారు. వ్యాపారస్తులూ వ్యతిరేకించారు. అది వాళ్ల జీవిక సమస్య కూడా. దానితో వాడికి తెరవక తప్పలేదు. గ్రీన్‌హంట్‌లో కూడా సంతల్ని మూశాడు, కానీ ప్రజలు ప్రతిఘటించడంతో తెరవక తప్పలేదు...' అన్నాడు సీతూ.

ప్రభుత్వాన్ని 'వాడు' అంటున్నాడని అర్థమైంది.

'ప్రతిఘటన అంటే?'

'అంటే ఊరేగింపులు తీసి, ధర్నాలు చేశారు సంతలు తెరవాలని'

'ఆహా' అన్నట్టు కనుబొమలెగరేశాను.

'అయితే వాడు సంతలు తెరవడానికి మరో అంతర్గత కారణం కూడా వుందిలెండి, వాడికి సమాచారం అవసరం. లోపలకి చొరబడ్డానికి వాడికీ మార్గం అవసరం' అంది మా పక్కనే నుంచుని తింటున్న సోనీ.

'వాడు' అనేది మరింత విస్తృతమైన అర్థంలో 'ప్రత్యర్థి'కి వాడుతున్నారని అనిపించింది.

'అసలు ప్రభుత్వానికి మీ సప్లయిలన్నిటినీ తెంచేయడం సాధ్యమేనా?'

'సాధ్యం కాదు గానీ వాడి ప్రయత్నం వాడు చేస్తాడు, కౌంటర్ ఇన్‌సర్జన్సీలో భాగంగా దీన్ని ఫోర్ కట్ పాలసీ అంటున్నాడు. అంటే నాలుగింటిని తెంచేయడం, మనకందకుండా

చేయడం. అవి – సైన్యంలోకి భర్తీ, డబ్బులు, సమాచారం, సప్లయిలు' అంది సోనీ.

'సప్లయిలంటే మందులు కూడా' సోనీ పక్కన నుంచున్న ఇడిమె జోడించింది.

'అందుకనే మన పేషంట్లు రేపు కోలుకునేది ఆ స్పిరిట్‌తో కాదు, ఈ స్పిరిట్‌తో అని అంటుంది లతక్క' అన్నాడు సీతూ తన గుండెకేసి వేలితో చూపుతూ.

ముగ్గురి ముఖాల్లో అంగీకారపూర్వకమైన చిరునవ్వు.

గుండెబలం గాయాల్ని మాన్పగల్గుతుందా? నా ముఖంలో కదులాడే అపనమ్మకాన్ని వాళ్లకి కనబడనివ్వకుండా తల వంచి మౌనంగా తినడం ముగించాను.

వాళ్ల దగ్గర శెలవు తీసుకుని నాకు రక్షణగా వుంటాడని చెప్పిన కారుతో పాటు వెళ్లి పడుకున్నా. కారుకు హిందీ వస్తుంది కనుక ఏది అవసరమైనా తనకి చెప్పమనీ, ఒంటేలుకు వెళ్లాలన్నా అతన్ని లేపమనీ చెప్పింది సోనీ. వాళ్లు చెప్పకపోయినా ఆ కీకారణ్యంలో నేను చచ్చినా ఒక్కడ్నీ నాలుగడుగులు కూడా అవతలకి వేయకపోయేవాడ్నే. ఎత్తైన కొండ అంచుకు నమ్మకం అనే ఒక దారప్పోగుకు వేళ్లాడుతున్నట్లు అన్పించింది. టైం చూస్తే పదకొండు. కారు బిబిసి విని రేడియో బంద్ చేసిన చప్పుడు.

జాగరణేనా ఈ రాత్రికి? సునీతా, పిల్లలూ తానిక్కడ ఉన్నాననే విషయం తెలీకపోవడం వల్ల నిశ్చింతగా తొమ్మిదింటికే పడుకుని ఉంటారు....

* * *

నా రెక్క మీద ఎవరో చిన్నగా తడుతూ వుంటే బద్ధకంగా దొర్లాను.

'డాక్టర్ దాదా, డాక్టర్ దాదా' మంత్రంలా ఒకే స్వరంలో పదే, పదే వినిపిస్తుంటే ఎక్కడ ఉన్నాననే విషయం స్పృహలోకి వచ్చి దిగ్గున లేచి కూచున్నా.

'మగ్గులో గరం నీళ్లున్నాయి, ముఖం కడుక్కోండి, చాయ్ వస్తుంది' అంటున్నాడు ఒకతను. ఇతని పేరు ఏదో చెప్పారు, ఏంటబ్బా, ఏదో వాహనం, ఆ, కారు కదూ. టైం చూశాను. ఐదున్నర అయ్యింది. జాగరణ అవుతుందనుకుంటే ఇంత బాగా పడుకున్నానా అయితే?

బ్రష్ చేసుకునేవరకూ చాయ్ వచ్చింది. చాయ్ తాగి, కాలకృత్యాలు తీర్చుకుని కారుని తీసుకుని రైను వద్దకెళ్లాను. ఇడిమే, సోనీ, సీతూ అక్కడే ఉన్నారు. గుడిశె బయట చిన్న టెంట్ వేసి లోపల వెదురుతో ఆపరేషన్ కోసం టేబుల్‌లాగా తయారు చేశారు. దాని మీద దుప్పటి కప్పి వుంది. పక్కన పొయ్యి మీద గిన్నెలో నీళ్లు మరుగుతున్నాయి.

కారు దగ్గరున్న నా మెడికల్ కిట్‌నుండి ఇంజక్షన్ తీసి ఇచ్చాను. ఇడిమె ఇంజక్షన్ యిచ్చింది.

'ఎంత టైం పడ్తుంది?' సోనీ

'అరగంట కూడా పట్టదు'.

ఇడిమెతో కూచుని ఆపరేషన్ ఎలా చేస్తాం, ఏం అవసరం అనే విషయాలు కాయితం మీద బొమ్మ గీస్తూ వివరించాను. ఒక్క ప్రశ్న కూడా వేయకుండా అంతా విన్నది. నేనే ఒకటికి రెండుసార్లు వివరించాను. ఆ కాయితం తీసుకుని జేబులో పెట్టుకుంది.

'రైనుతో ఒకసారి మాట్లాడదాం' అన్నా. ఇద్దరం గుడిశెలోకి వెళ్లాం. రైనుకి ఆపరేషన్ గురించి చెప్పాను.

'చూడు రైనూ, నీకు ఏ మాత్రం నెప్పి తెలవదు. ఇది చాలా చిన్న ఆపరేషన్. భయపడాల్సింది ఏమీ లేదు, నీ కంటికి ఏమీ కాదు. చేయకపోతేనే ఇబ్బంది. భయం లేదు కదా?'

రైను చిరునవ్వుతో తల అడ్డంగా వూపాడు. అతనిలో ఇసుమంతైనా ఎటువంటి టెన్షనూ నాకు అవుపడలేదు. దాంతో ఇంకేం మాట్లాడాలో నాకు అర్థం కాక బైటకొచ్చేశాను. వాళ్లు తయారు చేసిన 'టేబుల్' చెక్ చేశాను. బానే వుంది. అడవిలోకి వచ్చేటప్పుడే ఆపరేషన్ గురించి తెలుసు కనుక మిగతా సరుకూ సరంజామా అన్నీ పట్టుకొనే వచ్చాను.

ఏడున్నర వరకూ ఆపరేషన్ అయిపోయింది. ఇడిమె శ్రద్ధగా సహకరించింది. రైనుని పడుకోబెట్టి మేం చేతులు కడుక్కుని కిచెన్‌కేసి నడిచాం. రైను దగ్గర ఇద్దరు గెరిల్లాలు ఆగారు.

'మీరు సాయంత్రం ఐదు గంటలకల్లా బయలుదేరాల్సి వుంటుంది' అన్నాడు సీతూ.

తలూపాను. 'ఇడిమెకు అన్నీ చెప్పి వెళతాను, మీకేం సమస్య వుండదు' అన్నా భరోసా ఇస్తున్నట్టుగా.

'సాయంత్రం వరకూ టైం వుంటుంది కనుక ఇడిమెకు ఇంకే విషయంలోనైనా సందేహాలున్నా మీరు తీర్చండి, ఉపయోగంగా వుంటుంది' అంది సోనీ.

'తప్పకుండా, టిఫిన్ తిని వెంటనే మొదలుపెట్టచ్చు' అన్నా.

'దాదాను గుడిశెలో నిన్న మాట్లాడుకున్న దగ్గరకే తీసుకెళ్లు కారూ. నా జిల్లీ అదే. ఒకసారి నేను గ్రామంలోని పేషంట్ దగ్గరకెళ్లి వస్తాను, తొమ్మిదికల్లా వచ్చేస్తాను. దాదా, అప్పటివరకూ మీరు ఆరాం చేయండి' అంది ఇడిమె.

రైను దగ్గరకెళ్లి ఒకసారి చూసి వచ్చి, ఇడిమె జిల్లీ మీద కూచున్నా. ఇడిమె మెడికల్ కిట్, మెడికల్ పుస్తకాలు అన్నీ అక్కడే వున్నాయి. ఆ పుస్తకాలు తిరగేశాను. హిందీలో ఉన్నాయవి. ప్రాథమికంగా ఉపయోగపడేవే అవన్నీ. గ్రామాల్లో చికిత్సకూ, వాళ్లకూ, గెరిల్లాలకూ సాధారణంగా వచ్చే రోగాలకూ సరిపోతాయి. కానీ వాళ్లు చేస్తామంటున్న లేదా చేస్తున్న యుద్ధానికి ఇవి సరిపోతాయా?!

గెరిల్లాలంతా కాచిన నీళ్లే తాగుతున్నారు. దాని వల్ల కొన్ని రోగాల్ని తప్పక అరికట్టగలరు. కానీ దినేష్ చెప్పినదాన్ని బట్టి చూస్తే మలేరియా వీళ్లకి శాపమే. భయంకరమైన రక్తహీనతకు గురవుతున్నారు. పుస్తకాలు మూసేసి జిల్లీ మీద వాలాను.

సునీత ఎప్పట్లా నేను రేపు ఉదయం 8 గంటలకల్లా ట్రెయిన్ దిగుతాననుకుంటూ వుంటుంది. కానీ రేపు మధ్యాహ్నానికి గానీ తనసలు చేరలేదు. అయితే వుదయాన్నే ఫోన్ చేసేంత దూరానికైతే పోవచ్చని సీతూ భరోసా ఇచ్చాడు కాబట్టి ఫర్వాలేదు. ఫోన్ చేస్తే కంగారు పడదిక.

ప్రతి శనివారం సాయంత్రం తను ట్రెయిన్ పట్టుకుని రామ్‌గఢ్‌కి వెళ్తాడు. ఆదివారం

అంతా అక్కడ చుట్టుపక్కల గ్రామాలనుంచి వచ్చిన ప్రజలకు ఉచితంగా వైద్యం చేసి మందులు కూడా తనే ఇచ్చి తిరిగి రాత్రికి ట్రెయిన్ పట్టుకుని సోమవారం ఉదయం ఆసుపత్రి సమయానికి అందుకుంటాడు. డాక్టర్‌గా ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేరాలనీ, అలాగే ఉచిత వైద్యం చేయడానికి తన గ్రామానికి వెళ్లి వస్తూ వుండాలనీ తను చదువుకున్నప్పటినుండీ అనుకున్నదే. ఇప్పటివరకూ ఆటంకం లేకుండా దాన్ని చేసుకుంటూ వస్తున్నాడు. అమ్మ చనిపోయినప్పుడూ, ఇప్పుడూ తప్ప తన రామ్‌గఢ్ ప్రయాణం తప్పింది లేదు. ఆసుపత్రి అయినా మానుకుంటాడు గానీ రామ్‌గఢ్ వైద్యాన్ని వదులుకోలేడు. దానికేదో దైవంలాంటి స్థానం వుంది తన మదిలో. ఇప్పుడు యిలాంటి రిస్క్ పని కనుక, సునీతకి చెప్పలేదు కనుక ఒప్పుకున్నాడు గానీ లేకుంటే...రామ్‌గఢ్ వెళ్లకపోవడమా?

దినేష్ ఇలా వెళ్లాలని చెప్పినప్పుడు ఈ తారీకులు అనుకూలంగా కలిసి రావడంతో సునీతకి అలాగనే చెప్పి వచ్చాడు. కాంపౌండర్ ప్రేమ్‌లాల్‌ని రామ్‌గఢ్‌కి వెళ్లమని చెప్పొచ్చాడు తను. సునీత, ప్రేమ్‌లాల్ కలిసే అవకాశం తక్కువే. ఒకవేళ ఎదురుపడినా తను ఏదో సర్ది చెప్పుకోగలడు.

టెంట్ ద్వారంలో నీడ కనబడగానే లేచి కూచున్నా. ఇడిమె సంకోచంగా నుంచుంది.

'రా ఇడిమే, ఇప్పుడే నీ పుస్తకాలు అవీ చూస్తున్నా' అన్నా.

'డాక్టర్ దాదా, ఒక పేషెంట్‌ని తెచ్చాను...'

'లోపలకి తీసుకురా'

'మీరే బైటకు వస్తే...'

వెంటనే వెళ్లాను. 16 ఏళ్లుంటాయేమో ఆ అబ్బాయికి. పాదానికి సరిగ్గా పైగా గొడ్డలి తెగింది. ఇడిమె ప్రాథమిక చికిత్స చేసి పట్టుకొచ్చింది. కానీ కుట్లు వేయాల్సిందే. ఇడిమె గతంలో ఒకసారి మాత్రమే ఇలాంటి కుట్లు వేసిందట. నేనున్నానని పట్టుకొచ్చింది. లేకుంటే తనే వేసేదేమో.

ఇడిమెనే కుట్లు వేయమన్నాను, నేను చూసి ఏమన్నుంటే చెప్తానన్నాను. బానే వేసింది కుట్లు. ఇడిమె ఆత్మవిశ్వాసానికి ముచ్చటేసింది. మామూలుగా అరవలేదు ఆ అబ్బాయి. నెప్పి తెలీకుండా అతనికివ్వడానికి మా దగ్గర ఏం లేకుండె. మందులవీ ఇచ్చి అతనితో వచ్చినవాళ్లతో అతన్ని గ్రామానికి పంపించేసింది ఇడిమె. ఆమె అతనితో సాంత్వనగా ఏమీ మాట్లాడినట్లు నాకేం కనిపించలేదు. అప్పటివరకూ అంతగా కేకలు పెట్టిన అతను కూడా ఏం జరగనట్లే వెళ్లిపోయాడు. పట్టణాల్లోలాగా తమ భావాల్ని ఎక్కువగా వ్యక్తం చేయడం వుండదేమో ఇక్కడి ఆదివాసీల్లో ?!

ఇడిమె తన పుస్తకాలూ, మందులూ అవీ రెండు నిమిషాల్లో సర్దుకుని తనున్న వైపు జిల్లీని దులిపి ఒక పొడవు నోటుబుక్కు తీసుకుని బుద్ధిగా విద్యార్థిలా కూచుంది. ఆ రెండు నిమిషాలూ మొదటిసారిగా ఆమెను పరిశీలనగా చూశాను. నలుపు వైపుకే మొగ్గే రంగు. చిన్న పిలక – పొడవూ కాదు, పొట్టీ కాదు, లావూ కాదు, సన్నమూ కాదు, ప్రత్యేకంగా ఆకర్షించే

ముఖకవళికలు ఏమీ లేవు. చాలా సాదాసీదాగా, ప్రత్యేకంగా గుర్తు పెట్టుకునేలా ఏ మాత్రం లేనట్లుగా వుంది. కానీ నాకు తెలుసు - ఆమె వేళ్లలో వుంది ఇంద్రజాలమంతా. ఎక్కువ నవ్వేలాగ కూడా లేదు. పలువరుస కన్పించిందే లేదు ఇప్పటిదాకా.

23 ఏళ్లు కూడా వుండని ఆ ఆదివాసీ గెరిల్లా డాక్టర్‌ని చూస్తుంటే నా మనసంతా ఏదో తెలీని ప్రశాంతత ఆవరించింది. ఆ ప్రసన్నమైన భావనతో నా ముఖంలో చిరునవ్వు విరిసింది.

ఇడిమె 'డాక్టర్ దాదా..' అంటూ ఏదో అడిగేలోగానే నేను ఆపుతూ,

'ఇడిమే, ముందసలు నీ గురించి చెప్పు, పార్టీలోకి ఎలా వచ్చావు, 'డాక్టర్'వి ఎలా అయ్యావు?'

సిగ్గుపడ్తూ నవ్వింది, నోరిప్పలేదు.

'అరే, మీ గెరిల్లా డాక్టర్లు ఎలా తయారు అవుతారో నాకు చెప్పవా మరి?'

'ఇంటి దగ్గర ఉన్నప్పుడు 8వ తరగతి చదువుకున్నా. 2003లో పార్టీలో భర్తీ అయ్యాను. అప్పటినుండి దళంలో డాక్టర్‌గా, టీచర్‌గా పెట్టారు. 2005లో బైటనుండి ఒక డాక్టర్ వచ్చి ట్రైనింగ్ ఇచ్చాడు. అప్పుడు మా డివిజన్‌నుండి నన్ను కూడా పంపారు. ఆ తర్వాత నన్ను డివిజన్ డాక్టర్ టీములో పెట్టారు. ఇప్పటికి ఐదేండ్లు అవుతోంది డాక్టర్ టీంలో వుండబట్టి'

'మళ్లెప్పుడైనా ట్రైనింగ్ అయినవా?'

'ఆ - 2009లో ఒక డాక్టర్ వచ్చిందు. కొన్ని నెలలున్నాదు. ఆయనతోనే ఉన్నా మొత్తం. 20 రోజులు క్యాంపులో ట్రైనింగ్ ఇచ్చిందు. మిగతా సమయమంతా ఆయనతో తిరిగాం..'

'గ్రామాల్లోనా?'

'ఆ, అంటే గ్రామస్తులకూ వైద్యం చేశాం గానీ ప్రధానంగా మా పిఎల్‌జిఎ వాళ్లకు వైద్యం చేశాం'

'మీ టీం ఎలా పని చేస్తుంది? గ్రామాల్లో తిరుగుతూ వైద్యం చేస్తారా?'

'అవును, గ్రామాల్లోనూ, మా క్యాంపుల్లోనూ, అలాగే పోలీసుల పై దాడులలాంటి వాటికి వెళ్లినప్పుడు వాటిల్లో డాక్టర్లుగా వెళ్తుంటాం'

'రైను గాయపడిన దాడి అప్పుడు ఉన్నట్టున్నావు కదా?'

'ఆ, నేనే వెంటనే ఫస్టెయిడ్ చేసింది. తర్వాత రైనుని మోశాను కూడా'

నేనింకేం మాట్లాడలేకపోయాను. యుద్ధరంగం మధ్యనే వైద్యం...ఎప్పుడైనా తామూ తూటాలకు బలవ్వచ్చు అనే ఎరుకతో వైద్యం. ఇడిమె కొద్దిగా ఇబ్బందిగా కదుల్తోందని అర్థమయ్యాక గానీ నేను తనని అలాగే మౌనంగా పరిశీలిస్తున్నానని నాకర్థం కాలేదు. కళ్లు తిప్పుకుని చిన్నగా నవ్వి,

'అదుగు ఇడిమే, నీకు వైద్యం విషయంలో ఏం సందేహాలున్నా అడుగు. సాయంత్రం వరకూ ఈ డాక్టర్ దాదా టైం మొత్తం నీదే' అన్నా.

ఇడిమె తన పొడుగు నోటుబుక్కు తెరిచి అందులో చివరి పేజీలో రాసి పెట్టుకున్నవి ఏవో చూస్తూ ఒక్కొక్కటీ అడగడం మొదలుపెట్టింది. నేను చెప్తున్నవాటిని మెల్లగా హిందీలో

పాయింట్లుగా రాసుకుంది. వేగంగా కూడా రాయలేక పోతోంది. ఒక్కొక్క అక్షరం మెల్లగా రాస్తోంది. అది చూసి నేనూ తన వేగానికి తగినట్టుగా మెల్లగా చెప్తూ పోయాను.

మెడికల్ దబ్బాలోంచి కొన్ని షీట్లు తీసి వాటిని వేటికి వాడచ్చో అడిగింది. వీళ్ళు రాసిన మందులతో పాటు రాయనివీ కలిపి వచ్చాయట. కాబట్టి వాటి గురించి తెలీదంది. తన సందేహాలు అన్నీ అయిపోయాయని నిర్ధారించుకుని ఇక నేను అడగడం మొదలెట్టాను.

'ఇడిమే, నువ్వు ఇప్పటివరకూ వైద్యం చేసిన పేషంట్లలో నీకు బాగా తృప్తినిచ్చింది ఏ పేషెంట్ విషయంలో?'

ఇడిమె అర్థం కానట్లు మొహం పెట్టింది.

'అంటే ఎవరైనా చాలా సీరియస్ పేషెంట్, లేదా చావుకు దగ్గరగా ఉన్న పేషెంట్‌ని బతికించినప్పుడు మనకు ఎక్కువ తృప్తిగా వుంటుంది కదా, అలా...'

'నాకు ఏ పేషెంట్‌కు వైద్యం చేసినా మంచిగానే అన్పిస్తుంది దాదా'

'అది అన్పిస్తది ఇడిమే, కాదనడం లేదు, నాకూ తెలుసు. పోనీ ఇది చెప్పు, చావుకు దగ్గరైన వాళ్లను ఎందర్ని బతికించి వుంటావు?'

'అలా ఎక్కువ చేసింది లేదు, ఒకసారి మా కామ్రేడ్స్ చేసిన దాడిలో మా కమాండరే తలలో గాయపడ్డాడు. మోసుకొచ్చాం. రెండు రోజులుండి మాట్లాడాడు కూడా, కానీ రెండో రోజు మధ్యాహ్నం వరకూ కోమాలోకి వెళ్లిపోయి అమరుడయ్యాడు. కాపాడుకోగలం అనుకున్నాం. అప్పుడు చాలా బాధనిపించింది. అలాంటప్పుడు మాకు ఇంకా మంచిగా ట్రైనింగ్ వుంటే బాగుంటుంది కదా అన్పిస్తుంది. చాలా మంచి కామ్రేడ్స్‌ను ఇలా కోల్పోవడం అంటే....'

నేను మౌనంగా ఉన్నాను. ఇడిమె ఒక మూడ్‌లోకి వెళ్ళిపోయినట్టుంది. మితభాషిలా కనబడిన ఆమె నోటినుండి మాటలు ప్రవాహంలా వెలువడుతున్నాయి.

'అంతే కాదు ధాదా, మేం దాడులకు పోయినప్పుడు ఎంతోకొంత మందులూ అవీ తీసుకుని, డాక్టర్ల టీమును తీసుకుని పోతున్నాం. గతంలో ఇంత తయారీ వుండేది కాదు గానీ ఇప్పుడు చాలా మెరుగైంది. ఇప్పటికీ కొన్నిసార్లు మందులు సప్లయి లేక, సరిపోకపోవడం లాంటివి జరుగుతున్నా అది తక్కువే. కానీ మా మీద హఠాత్తుగా దాడులు జరిగినప్పుడు ఎక్కువ యిబ్బంది అవుతుంది. గెరిల్లా డాక్టర్లం గతంకంటే పెరిగినాం కానీ అంతటా లేం, అలాగే అన్నిసార్లూ రక్తస్రావాన్ని అదుపు చేసే మందులు, ఇతర ముఖ్యమైన మందులూ వెంట వుండడం లేదు. గాయపడినవాళ్లనూ, చనిపోయిన కామ్రేడ్స్‌నూ తప్పక మోసుకొచ్చుకోవాలనేది మా నియమం. గాయపడినవాళ్లని మోసుకొచ్చినా ఒకోసారి బ్లీడింగ్ అదుపు చేయలేకనో, డాక్టర్లు లేక ప్రథమ చికిత్స అందకనో చనిపోవడం కూడా వుంటోంది. మాకు ఇంకెంతోమంది గెరిల్లా డాక్టర్లూ, పెద్దెత్తున మందుల సప్లయి అవసరం దాదా. అందుకనే తృప్తి అని అడిగితే ఏం చెప్పాలో తెలీడం లేదు. ఇవన్నీ చేయనప్పుడు చేసినవాటికి తృప్తి పడడం వుంటుందా దాదా?'

నిజమే అన్నట్టు తలూపాను.

'గ్రామాల్లో వైద్యానికి కూడా మేం సరిపోవడం లేదు. వందలాదిమందికి మేం డాక్టర్ ట్రెనింగ్ ఇచ్చి ఉంటాం. జనతన సర్కార్ల తరఫున కూడా డాక్టర్లకు ట్రెనింగ్ ఇచ్చి గ్రామాల్లో పెడుతున్నాం. కానీ ఇక్కడున్న పరిస్థితులకు ఇంకా ఎంతమంది ఉన్నా మంచిదే. మేం ఒక వైపు వైద్యం చేస్తుంటే ఇంకో వైపు ఇంతమంది గ్రామస్తులు రోగాలతో చనిపోయారు అని కబురు వస్తూ వుంటుంది. ఒకసారి గ్రామంలో ఒక దీదీకి ప్రసవం కష్టమౌతోంది అని గ్రామస్తులు మా వద్దకు వచ్చారు. నాకు ఇప్పటికీ ఈ విషయంలో అనుభవం లేదు. ట్రెనింగ్‌లో డాక్టర్ చెప్పిన ఒక మందు గుర్తొచ్చి వేశాను. అది వేయకపోతే కూడా ఆమె బతికేదా తెలీదు. కానీ ఈమె బతికింది. బిడ్డ చనిపోయి పుట్టింది. నేను ఇప్పటివరకూ గ్రామాల్లో చూసినదాంట్లో ఎక్కువమంది స్త్రీలు చనిపోతున్నది లేదా రోగాల పాలవుతున్నది ప్రసవంలోనే లేదా ప్రసవంతో సంబంధం ఉన్న రోగాలతోనే'

'మరి ఈ విషయంలో మీరేం చేయడం లేదా?'

'చేస్తున్నది తక్కువే. తెలిసిన మేరకు చేస్తున్నాం. మాకు రెండు విషయాల్లో ట్రెనింగ్ అవసరం దాదా, ఒకటి ప్రసవం, దానికి సంబంధించిన సమస్యల విషయంలో. దీంతో స్త్రీలను బతికించగలం. రెండు సర్జరీ – దీంతో ఎంతో విలువైన కామ్రేడ్స్‌ను బతికించుకోగలం. రక్తం గ్రూపులు కనుక్కోవడం, రక్తం ఎక్కించడం కొంతమందిమి నేర్చుకున్నాం, దాన్ని వేరే కామ్రేడ్స్‌కి కూడా మేం నేర్పగలం, కానీ పై రెండూ ఎవరైనా వచ్చి నేర్పాల్సిందే, ఇవి ఎంత అవసరమో మాకు...'

ఇడిమె నానుండి ఇవి ఆశిస్తున్నట్టుగా కూడా ఏం అనలేదు ఈ మాటల్ని, తనలో తను కూడబలుక్కున్నట్టుగా, ఒక వాస్తవాన్ని కేవలం చెప్తున్నట్టుగా వుంది ఆమె గొంతు. ఈ విషయంలో నేను ఇంకేం మాట్లాడే స్థితిలో లేను కనుక 'ఊ' కొట్టి ఇడిమె నోటుబుక్కు తీసుకుని తిరగేయడం మొదలెట్టా. ఒక్కో రోగం పేరు రాసి దాని కింద ఆ డాక్టర్ చెప్పినవనుకుంటా రోగ లక్షణాలూ, మందులూ అవీ రాసుకుంది. హిందీలో తప్పులున్నాయి. మందుల పేర్లు కొన్ని ఇంగ్లీషులో రాసుకుంది. మరీ చిన్నపిల్లల రాతలా వుంది తన ఇంగ్లీషు రాత. చెక్ చేస్తున్నా. విషయాలు సరిగానే రాసుకుంది.

'దాదా....'

ఇడిమె సంకోచంగా ఆగడంతో తలెత్తాను.

'చెప్పమ్మా'

'నువ్వు అడిగావు కదా...'

'ఊ ?'

'ఒకసారి మేం ఆంబుష్ చేశాం, మోటార్ సైకిళ్ల మీద వస్తున్న బ్యాచ్‌ని పడగొట్టాం. ప్రతిఘటించిన వాళ్లలో నలుగురు చచ్చారు. మిగతావారు గాయపడి పడిపోయారు. సరెండర్ చేశాం వాళ్లను. గాయాలైన వాళ్లకు మేమే ప్రథమ చికిత్స చేశాం. మేం ఆంబుష్ కూచోడానికి వచ్చినప్పుడు తెచ్చుకున్న బిస్కట్లు కూడా మా కామ్రేడ్స్ వాళ్లకు ఇచ్చారు. ఒకతను అయితే

'దీదీ, దీదీ నన్ను కాపాడావు' అంటూ ఒకటే నమస్తే చేస్తున్నాడు, ఏడుస్తున్నాడు. వాళ్లకి కొంచెం సేపు రాజకీయాలు చెప్పి వదిలిపెట్టాం. నాకు చాలా రోజుల వరకూ అతను 'దీదీ, దీదీ' అని ఏడవడమే గుర్తుకొచ్చేది. ఉద్యోగానికి రాజీనామా చేస్తామన్నారు వాళ్లు. ఏదో ఒకటి చేసుకుని బతుకుతామన్నారు. ఏం చేశారో తెలీదు. ఒక రకంగా చావాల్సిన వాళ్లను బతికించడమే అది. అప్పటికే సల్వాజుడుం నడుస్తుంది కాబట్టి చాలా కసితో పోయాం ఆంబుష్‌కు, కానీ వాళ్లు మారతాం అన్నాక వాళ్లకి వైద్యం చేయడం ఎందుకో మంచిగా తోచింది. ఇలాంటి తృప్తి ఎప్పుడూ కలగలేదు, అది వేరేగానే వుండింది....'

కళ్లు దించుకుని తన చేతిలోని రుమాలుని చుడుతూ, విడుస్తూ ఒక్కో మాటనూ ఆమె వెలికి తీస్తుంటే కన్నార్పకుండా తన ముఖంలోని భావాలనే చూస్తూ విన్నా. ఆమె ముగించిన క్షణంలో నాకు ఆమెను కౌగిలించుకోవాలనిపించింది.

'ఇడిమే, మీ మందుపాతర్లలో గాయమైన పోలీసులకు నేను కూడా వైద్యం చేశాను'

'లేదు దాదా, మేం ఎప్పటికీ ప్రచారం చేస్తూనే ఉంటాం, మీరూ పేదలే, పోలీసుల్లో చేరద్దు, పేద ప్రజల లడాయిలో చేరండి లేదా వేరే ఏమన్నా చేసుకుని బతకండి అని....'అంది ఇడిమె కొంచెం ఇబ్బంది పడుతూ.

నిట్టూర్చాను. కనీసం వీళ్లకి ఇది తమ జీవితానికి సంబంధించిన యుద్ధం అనే ఎరుక ఇచ్చే స్థయిర్యం వుంది. అందుకే చిరునవ్వుతో మృత్యువును ఆహ్వానిస్తున్నారు వీళ్లు. కానీ తమది కాని యుద్ధంలో బలౌతున్న ఆ జవాన్ల నిస్సహాయమైన ముఖాల్ని గుర్తు తెచ్చుకుంటే మనసంతా ఎలాగో అవుతుంది.

ఇడిమె వాచీ చూసుకుని, 'రైను దగ్గరకెళదాం' అంది.

ఇద్దరం వెళ్లాం. ఏం సమస్య లేదు. అన్నం తినే టైం అయ్యింది. ఇడిమె రైను దగ్గర వుంటాననడంతో నేనూ, కారూ వెళ్లి తినేసి వచ్చాం. ఇడిమె వచ్చేవరకూ అన్నట్టు నడుం వాల్చాను. కారు వార్తలు వింటూ కొద్ది దూరంలో కూచున్నాడు.

'కారూ, నీకేమైనా ఆరోగ్య సమస్యలున్నాయా?'

'ఏం లేవు దాదా, మలేరియా వస్తది అంతే. బాగా నడిస్తే కాలు నెప్పెడుతుంది, గాయమైంది కదా'

'గాయమైందా? ఎప్పుడు? ఎలా? ఎక్కడ?' లేచి కూచుంటూ అడిగాను.

కారు ఎడంకాలి ప్యాంటు ఎత్తి గాయమైన చోటు చూపిస్తూ, 2008లో ఆంబుష్ చేసినపుడు, ఇలా తగిలి అలా వెళిపోయింది, దాంతో ఎక్కువ సమస్య కాలేదు, నెల రోజులు కూడా పట్టలేదు మళ్లీ సైన్యంలో చేరడానికి'

'ఎక్కువ నడిస్తే నొస్తుందైతే?'

'ఆ – నాలుగ్గంటలకు ఎక్కువైతే, అప్పుడప్పుడు...' పెద్ద విషయం కాదన్నట్టు అన్నాడు.

'ఆ నెప్పి గాయం వల్ల కాకపోవచ్చు కారూ. అవును గానీ, నీకు కాలు విరుగుతుందేమో, పోతుందేమో అని భయం వేయలేదా, అప్పుడనే కాదు అసలు అలాంటి భయం ఎప్పుడైనా

వేస్తుందా?'

కారు నవ్వి, 'లడాయి కదా...' అన్నాడు క్లుప్తంగా.

'లడాయే గానీ మొత్తంగా మూలాలన పడే స్థితి వస్తే....'

కారు ఏం మాట్లాడకుండా చిరునవ్వుతో రేడియో బంద్ చేశాడు. అతని ముఖం చూస్తుంటే నేనేదో చాలా అసంగతమైన, అసందర్భమైన విషయం అడిగినట్టు నాకే తోచింది.

రైను కండ్లు పోతాయేమోనని ఎక్కువ భయపడ్డాను. ఒక్కటున్నా మంచిగుండు కదా అనుకున్నా. కాళ్లేతులకంటే కండ్లు ముఖ్యం కదా'

'మీ డాక్టర్లు ప్రథమ చికిత్స చేయకుంటే అంత ప్రమాదమూ జరిగేదే...ఇప్పుడిక ఫికర్ లేదు కారూ'

కారు చిన్నగా తలూపాడు.

'అరగంట దూరంలో పేషెంట్ల డేరా ఉన్నది. అక్కడ నాలా సీరియస్‌గా గాయాలు కాని వాళ్లంతా ఉన్నారు. వాళ్లకి మావాళ్లే వైద్యం చేస్తున్నారు. ఇలాంటి గాయాలకు ఇప్పుడు మా వైద్యం, మా డాక్టర్లు సరిపోతారు. రైనుదే సీరియస్ కేసు అని మిమ్మల్ని రప్పించారు'

'అరగంట దూరంలో గాయపడిన పేషెంట్లు ఉన్నారా?' ఆశ్చర్యంగా గొంతు పెంచుతూ అడిగాను.

'ఆ'

సరిగ్గా అప్పుడే ఇడిమే వచ్చింది.

నేను గబగబా, 'ఇడిమే, అరగంటు దూరంలో పేషెంట్లు ఉన్నారట కదా, మనం వెళ్లచ్చా?' అన్నా వాచీకేసి చూసుకుంటూ, ఒకటిన్నర అయ్యింది.

'సోనీనడగాలి'

'అడుగుదాం పద' అన్నా లేస్తూ.

'అహ, మీరు ఉండండి, తననే పిలుస్తా' నన్ను వారిస్తూ ఇడిమె వెళ్లి మరు నిమిషంలో సోనీతో ప్రత్యక్షమైంది.

'సోనీ, పేషెంట్లున్నారట కదా, పోయి చూడచ్చా?'

'చూడచ్చు గానీ...'

''నేను వెళ్లడం మీకేమైనా సమస్యా?'

'అయ్యో, అలా కాదు, మీకు శ్రమ, నడక అవుతుందని'

'అదేం ఫర్వాలేదు, వెళ్తాం, ఆ, నా ప్రయాణానికైతే ఆటంకం కాదు కదా?'

'అదే, రాత్రి నడక మీకు ఇబ్బంది అవుతుందేమో అని...'

ఒక్క క్షణం ఆలోచించాను. 'ఫర్వాలేదు, వెళ్తాను' అన్నా.

ఇడిమె, నేను, కారు మరో ఐదుగురం బయలుదేరాం. అరగంట అనేది వాళ్ల నడకకు. మేం వెళ్లేటప్పటికి రెండున్నర దాటిపోయింది. పేషెంట్లు మధ్యాహ్నం హిందీ వార్తలు వింటున్నారు. మేం వచ్చేటప్పటికి రేడియోలో చిదంబరం నక్సలైట్లు హింసను విడనాడాలి అని ఏ నూట

పదోసారో అంటున్న ప్రకటన వస్తుండింది. ఆజాద్ దాదా ఈసారి వీని మీద ఏం రాస్తాడో అని ఒక్కొక్కళ్లూ వూహించుకుని చెప్పుకుంటూ తెగ నవ్వుకుంటూ ఉండినారు.

మొత్తం ఆరుగురు ఉన్నారు. వాళ్లని ఒక్కొక్కరినీ చూసి వాళ్లకు ఏం యిస్తున్నారో, ఎట్లా ట్రీట్‌మెంట్ ఇస్తున్నారో అన్నీ తెలుసుకునే వరకూ నాలుగు కావొచ్చింది. అక్కడ గాయపడిన వాళ్లలో ఐదుగురు ఆదివాసీలే. వారిలో ఒకరు మహిళ, పేరు రుక్మతి. ఆదివాసీ కాని అతను రణదేర్, హైదరాబాదీట. ఎవ్వరి ముఖాల్లో అలసట లేదు, భయం, బెదురు అసలే లేవు. లేకపోవటమే కాదు, వాళ్లంతా ఎంతో హర్షోల్లాసంగా ఉన్నారు. వాళ్లనంత ఉషారుగా చూస్తుంటే గుండెబలంతో వాళ్ల గాయాలు మానడం నిజమైతే కాదు కదా అన్పించి నవ్వుకున్నా.

కారుతో ఆ అనుభవం అయినా గానీ రుక్మతిని అడగకుండా వుండలేకపోయాను. ఒక మహిళ అయి వుండీ ఈమె ఇలా యుద్ధం చేయడానికీ, గాయాలపాలు కావడానికీ ఏ మాత్రం వెనకాడకపోవడం నన్ను ఆగనియ్యలేదు.

'మీరీ యుద్ధాన్ని గెలుస్తామనే అనుకుంటున్నారా రుక్మతీ?'

'గెలుస్తామనుకోకుండా బహుశా ఎవరూ యుద్ధం చేయరేమో కదా డాక్టర్ దాదా. ప్రజలు ఈ యుద్ధాన్ని తప్పక గెలుస్తారు, మేం కాకుంటే మా తర్వాతి తరాల వారు'

'యుద్ధం పెరిగే కొద్దీ మీకు గాయాలయ్యే వాళ్ల సంఖ్య పెరుగుతుంది, అవి సీరియస్‌గా కూడా వుండచ్చు, మీ గెరిల్లా డాక్టర్లతో మీరు అంత పెద్ద యుద్ధంలో జరిగే నష్టాల్ని తట్టుకోగలరా? నీకసలు ఎప్పుడైనా నేను మూలన పడితే ఎలా అని అన్పించనే లేదా, ఎంత చిన్న వయసు మీ అందరిదీ? నీకెంత వుంటాయి 20 ఏండ్లుంటాయా?'

'అప్పుడు నాకు చేతనైన పని నేను చేస్తాను. ఇప్పుడు కూడా మా కామ్రేడ్స్ కొంతమంది అలా గాయపడి సైన్యంలో వుండే స్థితి లేక వేర్వేరు పనుల్లో ఉన్నారు. మా బూబీట్రాప్‌లోనే ప్రమాదవశాత్తూ గాయపడి, చచ్చి బతికినంత పనైంది ఒక కామ్రేడ్‌కు. ఆయనిప్పుడు వ్యవసాయ విభాగంలో చేస్తున్నాడు. కళ్లు లేని ఓ కామ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నాడు. కాళ్లేతులకు గాయాలై సైన్యంలో కొనసాగలేనివారికి మా ప్రజాయుద్ధంలో, ప్రజా ప్రభుత్వంలో చేయడానికి ఎన్నో పనులున్నాయి. మా జనతన సర్కార్లు ఇలాంటి వాళ్లందరి బాగోగులకూ బాధ్యత వహిస్తున్నాయి' అంది రుక్మతి ఆత్మవిశ్వాసం ఉట్టిపడుతున్న గొంతుతో.

రణదేర్ కల్పించుకుంటూ, 'మా కుటుంబం చాలా పెద్దది డాక్టర్ సాబ్, వేలల్లో, లక్షల్లో వుందది. మా ప్రజాయుద్ధం అందరినీ, అన్నిటినీ ఇముడ్చుకుంటుంది. అంతే కాదు, చూస్తుండండి, మా ప్రజాయుద్ధం అన్నిటినీ, అందరినీ సమకూర్చుకుంటుంది కూడా. ఇక మా గెరిల్లా డాక్టర్లు మా యుద్ధానికి సరిపోరనేది ఇంకెవరికంటే మాకే ఎక్కువగా తెలుసు. కానీ దానికి పరిష్కారం మీలాంటివాళ్ల చేతుల్లో కదా వున్నది' తన హైదరాబాదీ హిందీలో తడుముకోకుండా టకటకా చెప్పేశాడు రణదేర్.

'టైం అవుతోంది, మనం వెళ్లాలి దాదా' అంటోంది ఇడిమె.

అవసరమైన ఒకరిద్దరు పేషెంట్లకు మందులు రాసి ఇచ్చాను. మిగతావారికి అవసరం

లేకుండింది.

రణదేర్ భుజం తట్టి, 'మళ్లా సైన్యంలోకేనా అయితే?' అనడిగాను.

'ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా' అన్నాడు చిరునవ్వుతో.

రుక్మతికేసి కనుబొమలెగరేశాను. రుక్మతి కూడా నవ్వుతూ 'ఇంగో' అని తలూపింది.

అందరూ చేయి కలిపి లాల్‌సలాం చెప్పారు. ప్రత్యేకంగా ఒక డాక్టర్ బైటనుండి వచ్చి చూశాడు అనే భావన ఏదీ నాకు వారిలో కనిపించలేదు. మేమిటు తిరగగానే వారు తమలో తాము ఏవో మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ తమ టెంట్‌లోకి వెళ్లిపోయారు. రణదేర్ మాత్రం మాతో కాస్త దూరం వచ్చాడు.

'ఇక వుండులే' అంది ఇడిమె.

మళ్లొకసారి నాతో గట్టిగా చేయి కలుపుతూ, 'మీలాంటి డాక్టర్లు వుంటే మేమింకా బాగా యుద్ధం చేయగల్గుతాం' అన్నాడు రణదేర్ ఆశగా.

నేను చిరునవ్వు నవ్వి, 'జాగ్రత్త' అని ముందుకు నడిచాను.

ఐదు కాక ముందే సోనీ వాళ్ల దగ్గర ఉన్నాం. సోనీ, సీతూ నన్ను పక్కకు పిలిచారు.

'మీతో ఓ గంట అయినా మాట్లాడాలనుకున్నాం, కానీ అనుకోకుండా మీరటు వెళ్లడంతో కుదరలేదు' అంది సోనీ.

'ఫర్వాలేదు, చూద్దాం, మళ్లీ కలుస్తామేమో' ఈ మాట అనేశాక గానీ నేనా మాట అంటానని నాకే తెలీదు. షాక్ అయ్యాను. కానీ ఈ ఊగిసలాటలు నాకు ఎప్పుడూ వుండేవే కదా అనుకున్నా. కానీ ఆ క్షణంలో సోనీ కళ్లలో మెరిసిన మెరుపు నా మనసును పట్టి లాగింది.

'మీరు ఒకవేళ రాలేకపోయినా, మావాళ్లకు బైటే ఏదో విధంగా ట్రెనింగ్ ఇవ్వడమో, ఇప్పించడమో, మందులు, వైద్యానికి సంబంధించిన సరుకూ,సరంజామా వగైరా పంపించడమో మాకు ఎంతో వుపయోగంగా వుంటుంది. మీరు రాగల్గితే అంతకంటే కావల్సింది లేదు. ఎక్కువ రోజులు కాకున్నా ఎన్ని రోజులు వీలైతే అంతే వచ్చినా మంచిదే. మీలాగ పేషెంట్ల కోసం తపనపడే అంకితమైన డాక్టర్లు అరుదుగానే వుంటారు' అన్నాడు సీతూ.

వీళ్లంతగా చెప్తున్నప్పుడు నేను ఏమీ అనకపోవడం నాకే సరిగా అన్పించలేదు.

'తప్పక ప్రయత్నిస్తా సీతూ. ఒక్క విషయం మాత్రం గుర్తుపెట్టుకోండి. ప్రాణాంతకం అయ్యి మేమే సహాయం చేయాల్సిన స్థితి వచ్చినప్పుడు నన్ను మీరు తప్పక కాంటాక్టు చేయండి. మీరు బయటకు రాగల్గితే సులభం అవుతుంది. అనివార్యమైతే ఇలా రావడానికీ అభ్యంతరం లేదు. ఇప్పటికి యింతకంటే ఎక్కువ హామీలు నేను ఇవ్వలేను' అన్నాను.

సోనీ, సీతూ విశాలంగా నవ్వుతూ తలూపారు. మరొకసారి తమ కృతజ్ఞతను గాఢంగా వ్యక్తం చేశారు. నేను దినేష్ ఎంతగా చెప్తే కదిలాను అనేది గుర్తుకొచ్చి నాకు ఆ కృతజ్ఞతను స్వీకరించడానికి సిగ్గనిపించింది.

రైను దగ్గరకెళ్లాం.

'రైనూ, మళ్లా సైన్యంలోకేనా?' అని అడిగా.

'ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా' అన్నాడు చిరునవ్వుతో.

రణదేర్ అన్నది గుర్తొచ్చి 'ఇది వీళ్ల ఊతపదమా?' అనుకున్నా.

'నీకు పెళ్లయ్యిందా?'

'ఊ, తను వేరే ప్లాటూన్‌లో వుంటుంది'

'ఎప్పుడు కలుస్తుంది? నీ దగ్గర వుండే వీలు లేదా?'

'ఏమో, అడగలేదు, వాళ్లు చాలా దూరంలో ఉన్నారు'

'గుర్తుకొస్తుందా?'

సంకోచిస్తూ 'ఊ' అన్నాడు వినబడీ వినబడనట్టుగా.

'వారం, పది రోజుల్లో బాగైపోతావు, ఏం ఫికర్ చేయకు'

'ఫికర్ నాకేం లేదు, మీరు మంచిగా, జాగ్రత్తగా వెళ్లండి, కింద పడితే కష్టమౌతది' అన్నాడు రైను.

నేను నా శరీరం కేసి చూసుకుని ఇడిమెకేసి తిరిగి నవ్వాను. ఇడిమె నవ్వాపుకుంది.

అందరికీ చేతులు కలిపాను. సోనీ దినేష్‌కివ్వమని ఓ ప్యాకెట్ ఇచ్చింది. నా మెడికల్ కిట్టులోంచి ఇవ్వగలిగినవన్నీ ఇడిమేకి యిచ్చేశాను.

'డాక్టర్ దాదా, మాకు సర్జరీ నేర్పేవాళ్లు కావాలి, అది వస్తే మేం గెలుస్తాం' అంది ఇడిమె మాతో పాటే అడుగులు వేస్తూ. ఈసారి ఆ గొంతులో ఒక అర్థింపులాంటిదేదో ధ్వనించింది. ఇప్పుడిక ఆపుకోలేకపోయాను. ఆప్యాయంగా ఆమె తల నిమిరి 'జాగ్రత్త ఇడిమే' అన్నాను. ఆమె చప్పున తన కళ్లు తిప్పుకుని, తలూపింది.

ప్రయాణంలో నడుస్తూనే ఆలోచిస్తున్నా. పోలీసు పేషెంట్ల ముఖాలు పదే, పదే గుర్తుకొస్తున్నాయి. వాళ్ల పేదరికం, నిస్సహాయమైన ముఖాలూ, ఆత్మవిశ్వాసం లేని కళ్లూ - అచ్చం బలికి తీసుకుపోయే గొర్రెల్లాగ. తమ ముందొక గొప్ప ఆశయం వుందని గానీ, తమ వెనుక ఒక మహాప్రజ ఉన్నారని గానీ వాళ్ల హృదయాల్లో ఓ దీపం వెలుగుతున్నట్టుగా నాకు ఎన్నడూ కనిపించలేదు.

యుద్ధంలో ఈ మావోయిస్టు గెరిల్లాలు గెలుస్తారో లేదో నేను చెప్పలేను, కనీసం ఇప్పుడే చెప్పలేను గానీ ఒక యుద్ధంలో మాత్రం వాళ్లు ఇప్పటికే గెలుపు శిఖరాల మీద ఉన్నారు అని ఎందుకో పదే పదే అన్పిస్తోంది. వాళ్ల గుండెల్లో ఆ దీపపు జ్వాల నాకు స్పష్టంగా కనిపించినట్టు తోస్తోంది. ఆ జ్వాలే నాలాంటివాళ్లనూ గెలుచుకుంటుందేమో? ప్రజాయుద్ధం అన్నిటినీ, అందరినీ సమకూర్చుకుంటుంది అని రణదేర్ అన్నది యిలాగైతే కాదు కదా?

రామ్‌గఢ్‌కి నా అవసరం వుంది. దేశంలోని లక్షలాది రామ్‌గఢ్‌లను రామ్‌గఢ్‌లుగా అలాగే వెనకబడి వుండిపోనివ్వం అంటున్నారు వీళ్లు. వీళ్లకు నా అవసరం వుంది. వీళ్ల ఈ అవసరమే రామ్‌గఢ్‌ల అవసరాన్నీ తీరుస్తుందంటున్నారు వీళ్లు.

నా జీవితంలో చాలా విషయాల్లోలాగానే చివరి వరకూ ఏం చేయాలి అనేది ఆలోచిస్తూనే వుండిపోతానా? నిర్ణయం తీసుకుంటానా?

ఇదిమె నాకేమైనా ఈసారి నిర్ణయం తీసుకోడాన్ని సులభం చేస్తుందా?

(యుద్ధరంగంలోని మా ప్రజావైద్యులకూ, గాయాలను గేలి చేస్తున్న మా పిఎల్‌జిఎ యోధులకూ)

***అరుణతార, జనవరి-మార్చి, 2011***

# లక్ష్మణ రేఖ

– నిత్య

దండు కదులుతున్నది...దళం కదులుతున్నది...విప్లవ రాజకీయాల పరిచయం తొలిరోజుల్లో మేడే సందర్భంగా మొదటిసారి జననాట్యమండలి కళాకారుల గళం నుండి విన్న పాట లోలోపలే తిరుగుతుండగా దండులో కదం కలుపుతూ సాగుతున్నది రాజె.

నత్తలు, తాబేళ్లు, కుందేళ్లు, జింకలు కలిసి సింగిల్ లైన్ ఫార్మేషన్‌లో నడిస్తే...ఊహ ఆమె మొహంలో విరిసింది. రక్తం ఉరకలెత్తే యువతరం, నిదానమే ప్రధానం అంటున్న పెద్దతరం. చెంగుచెంగున గంతులు వేసే లేత కాళ్లు, అనుభవం పండి మొరాయిస్తున్న అరుగుబట్టిన కాళ్లు. విసుక్కోళ్ల రూపంలో వ్యక్తమవుతున్న తరాల మధ్యన వైరుధ్యం.

'స్పీడు స్పీడు అంటూ బొక్కబోర్లా పడితే ఉన్న మోకాలు ఊడిపోతుంది', ఓ పెట్టె మూలిగింది.

'కార్పెట్ సెక్యూరిటీ నడుమ తీరుబాటుగా నడిస్తే మన పని అయినట్టే. పరిగెత్తి నడవమని అనటం లేదుగా, ముందటివాళ్లతో కలిసి నడవమని అంటున్నాం. వెనుక నుండి అడుగడుగునా బ్రేకులు వేస్తూ పోతే మన గమ్యం చేరినట్టే', రైలింజను గులుగుతోంది.

కిలోమీటరు పొడవుతో నడిచే 60 పెట్టెల రైలుబండికి ఎర్రజెండాలూ, పచ్చ జెండాలూ ఊపుతూ బండిని నడిపిస్తున్నాడు ఆ తాత్కాలిక గెరిల్లా కంపెనీకి కమాండరు రవి.

అందరూ మౌనంగా నడుస్తున్నారు. చిమ్మచీకటి. చుక్కల వెలుగే ఆసరా. టార్చి వెలిగించకూడదు. అడవి దారులు... పొలాలు... గట్లు, కాలవలు... సెలయేళ్లు... గుట్టబోర్లు... ఎత్తుపల్లాలు అన్నింటినీ స్పర్శతోనే అంచనా వేసుకుంటూ నడవాలి. నీ అంచనా ఎక్కడ తప్పినా దబ్బుమని పడాల్సిందే. ఒక అడుగు వెనుకబడినా చీకటి ఆ దూరాన్ని ఆమడంత చేస్తుంది. అందుకే ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

రైలుబండి సాయంత్రం నాలుగ్గంటలకు బయలుదేరింది. నాలుగు గంటలు నడిచినంక ఎవరి సద్దిమూటలు వారు, ఎవరి ఫార్మేషన్లో వాళ్లే కూర్చుని మౌనంగా తిన్నారు. కమాండరు విజిలుతో తొందర తొందరగా కిట్లు భుజాలకెక్కించుకున్నారు...ఎక్కడ వెనకబడిపోతామో అని అడుగులు కలుపుతున్నారు. అయినా వెనకపడేవాళ్లు పడుతూనే ఉన్నారు.

'ఇంకెంత దూరం నడవాలి? ఈ ఎనకోళ్లు పొడుగాను. బాగా తీర్పాటంగా నడుస్తున్నారు.

కిట్ల బరువు భుజాలను ఎనక్కి ఇగ్గుతున్నది'

'తొందరగా దేరాకు పోతే ఒక కప్పు వేడి వేడి చాయ్ తాగాలి'

'కొద్దిగా వేడినీళ్లతో మోకాళ్లు కాపి కొబ్బరినూనెతో మర్దన చేయాలి. లేకుంటే నడవటం కష్టం'

'రాత్రిపూట నడుత్తాంటే ఎదురుదెబ్బ తగిలి కింద పడినప్పుడు సద్ది కట్టుకున్న గిన్నె నెత్తి నుండి కిందపడి మట్టి కొట్టుకు పాయె. దేరా వేస్తే ఏదన్న ఇంత కడుపులో పడెయ్యాలె. అల్సర్‌మంట పాడుగాను, పానం తింటున్నది'

అరవై రైలుపెట్టెలు...అరవై ఆలోచనలు...అరవై యోజనలు. ఎవరికి వారే తొందరలో ఉన్నారు.

* * *

రైలుబండి పూంబాడ్ నడిదారి నుండి నడుస్తున్నది. పది వాడలున్న పెద్ద గ్రామం. ఊరి ఈ కొస నుండి ఆ కొసకు అందడానికే గంట పడుతుంది. ఊరు దాటితే వాగు వస్తుంది. వాగు దాటి అవతల దేరా వేయాలి.

ఊర్లో సందడి లేదు. ఇంటిల్లిపాదీ ఇప్పపూలు ఏరుతున్నారు. ఈతకొచ్చిన వరి ఎండిపోయింది. కరువుతో అల్లాడిపోతున్న రైతుకు ఇప్పపూవు పంట ఊరటనిచ్చింది. ఇప్పచెట్ల కింద తెల్లగా పరుచుకున్న పూలను చూస్తూ, 'సల్వాజుడుం గాడ్పూ, అకాల వర్షాల వేడితో అల్లాడుతున్న ప్రజలకు కొంతైనా ఊరట' అనుకుంటూ నడుస్తున్నాడు చమురు.

బిబిసి రెండవ ప్రసారం వార్తలు ముగిసాయి. రేడియో కట్టేసి నడుస్తున్న కాళ్లకు సడన్ బ్రేక్ పడ్డది.

'లాల్‌సలాం కామ్రేడ్...'

చుట్టూ కలియ చూశాడు జోగన్న. ఎవరూ అవుపడలేదు. తల దించుకుని రెండడుగులు ముందుకు వేశాడో లేదో, 'ఏమయింది కామ్రేడ్...నాకు లాల్‌సలాం చేయకుండానే పోతున్నారు?'

ఈసారి అతని కళ్లు ధ్వనిని అనుసరించాయి.

చీమిడి కారుతున్న ముక్కు, చారికలు కట్టిన పాలబుగ్గలు, తెల్లని ఛాయ, నల్లని నిక్కరు. లాల్‌సలాం కోసం చాచిన బుల్లి చెయ్యి. వాడి వెనుక మరో నలుగురు. జారిపోతున్న చెడ్డీలను ఎగదోపుకుంటూ, బరిమొలతో, చేతిలో తెగిపోయిన ఉండేలుతో దూరం నుండి ఉరికి వచ్చారు లాల్‌సలాం చేయడం కోసం.

లాల్‌సలాం చేయడం కోసం వంగిన జోగన్న తన రెండు చేతులతో బాబును అమాంతం పైకి ఎత్తి గాలిలో ఎగరేశాడు. మట్టివాసన గుబాళిస్తున్న పండ్రుని గుండెలకు హత్తుకున్నాడు ఆర్తిగా. వాత్సల్యం అతని కళ్లల్లో చెమర్చింది.

ఫార్మేషన్లో తన ముందు నడుస్తున్న కమాండరు రవికి ఇక్కడే ఆగుదామని సందేశం ఇచ్చాడు.

* * *

గమ్యానికి గంట ముందే 'ఆగుదాం' అనే మాట వినేసరికి అందరికీ ప్రాణం లేచి వచ్చినట్లయింది. రవి రోల్‌కాల్ చేసి విషయం చెప్పాడు. సాయంత్రం అయిదింటికి బయలుదేరాలని చెప్పాడు. డ్యూటీల ప్రకారం ఎవరి దినచర్యలో వాళ్లు మునిగిపోయారు. పొయ్యి వంతు వచ్చిన టీం వాళ్లు పొయ్యిరాళ్లు ఎత్తుకుని తెచ్చి నిప్పు రాజేశారు. నీళ్ల డ్యూటీ వాళ్లు వాగులో చెలమ తీసి నీటిని తేటపరచి వంట కోసం ప్లాస్టిక్ క్యానులల్లో నింపుకు తెస్తున్నారు. వంట డ్యూటీ కామ్రేడ్స్ బియ్యంతో కిచిడీ చేసే ప్రయత్నాలలో ఉన్నారు.

తన పాలిథిన్ పరుచుకుని వాలిపోయాడు జోగన్న అలసటగా. గడియారం తొమ్మిది గంటలు చూపిస్తున్నది. తాము బయలుదేరి 17 గంటలు అయిందన్న మాట. మధ్యలో రెండు గంటలు మాత్రం పడుకున్నారు. అన్నం కోసం ఒక అరగంట ఆగింది తీసేసినా 15 గంటలు నడిచాం కదా అనుకుంటూ అరిగిన మోకాళ్లు సలుపుతుండగా మగతయో, కలయో లాంటి అర్ధ చేతనావస్థలో సొమ్మసిల్లాడు. అతని ఆలోచనలు గతంలోకి పరుగుతీశాయి.

* * *

గెరిల్లాజోన్ పరస్పెక్టివ్‌తో భాకపా (మా-లె) (పీపుల్స్‌వార్) దండకవనంలోకి ప్రవేశం. గోదావరి దాటిన తమ దళం బస్తర్‌కి చేరింది. ఆ రోజుల్లో ఆదివాసీ రైతు జీవితం ఎంత దయనీయంగా ఉండేది. కూడు-గుడ్డ-నీడ కోసం ఎంత పోరాటం చేసిండు. అడవి నరికి ఒక్క మడిచెక్క పొలం చేసుకోవడానికి ఎన్ని కష్టాలు పడ్డాడు. ఒక్కొక్క పొదనూ, చెట్టునూ నరికాడు. పగలు ఫారెస్టు గార్డుల భయం. రాత్రి కూడా ప్రాణం బితుకు బితుకే. రాత్రంతా మేలుకొని ఎండిన కొమ్మలు, ఆకులను చిన్న చిన్న కుప్పలు చేసి ఒక్కొక్క ఆకునూ కంట్లో వత్తులు వేసుకుని కాలబెట్టేవాళ్లు. వెలుగు బయటికి పోతే ఏ రాత్రయినా వచ్చి మీద పడతారు గార్డులు. వీరి దెబ్బలకు ప్రాణాలు కోల్పోయిన రైతులెందరో.

కడుపు కూటి కోసం ప్లాంటేషన్ కూలి పనులకు పోయే మహిళలపై ఎన్ని లైంగిక వేధింపులు. అడవిలో గుడిసెలు వేసుకోకుంటే కూలిపని దొరకదు. కూలికి పోకుంటే పూట గడవని మహిళలకు వారి షరతులకు లొంగక తప్పేది కాదు. గుడిశెల్లో పడుకున్న మహిళలను అర్ధరాత్రి వచ్చి తోడేళ్ల గుంపులా మీద పడే గార్డులను, రేంజర్లను పట్టుకుని ప్రజాపంచాయితిలో శిక్షించారు. ఆ తర్వాత కదా ఫారెస్టు ఉద్యోగులు అడవిలో అడుగుపెట్టటం ఆగిపోయింది.

'అడవిపై హక్కు ఆదివాసులదే' అంటూ హోరెత్తింది కదా పోరాటాల వెల్లువ!

స్థానిక తెగపెద్దలు బురద వడ్డె, కాయకోసాల్, కన్న వడ్డె, కల్మ దేవాల్‌లు రైతుల భూములను ఆక్రమించుకునే కదా భూస్వాములుగా మారింది. పేదోళ్లని ఎన్ని వేధింపులకు గురి చేశారని. వాడు ఆ ఠాకుర్ రాజా జయపాల్ కనిపించిన ఆడపిల్లనల్లా తన గడీలోకి రప్పించుకుని వారిపై ఎన్ని అఘాయిత్యాలు చేశాడు. ఎన్ని కాపురాలను బుగ్గి చేసిండు. తమ భార్యల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవటానికి ఎంతమంది భర్తలు చావుదెబ్బలు తిన్లేదు. ఇలాంటి క్రూరులు, పీడకులైన వారికి దండనలు వేసినప్పుడు ఆదివాసీ స్త్రీ-పురుషులు ఎంత ఆనందపడ్డారో. ఈ భూస్వాముల భూములు ఆక్రమించుకున్నప్పుడు, 'దున్నేవానికే భూమి'

అంటూ పిడికిలి బిగించిన వారి నినాదాలు ఇంకా చెవుల్లో మార్మోగుతున్నాయి.

'జోగన్నా! ఓ జోగన్నా! లాల్‌సలాం కామ్రేడ్!'

బలవంతంగా కళ్లు విప్పి వారికి చేయి కలిపి మళ్లీ మగతలోకి జారిపోయాడు.

* * *

అది 1990-91 కాలం. రైతాంగ గెరిల్లా దళం పాలోడ్ గ్రామానికి వెళ్లింది. ఆ దళానికి తానే కమాండరు. దళం వచ్చిన కబురు గ్రామస్తులకు అందించడానికి స్వయంగా తానే వెళ్లాడు. గ్రామంలోకి అడుగు పెట్టేసరికి అంతా ఒక్కరొక్కరూ మెల్లగా అడవిలోకి జారుకుంటున్నారు. ఎవరిని పలకరించినా మాట్లాడటం లేదు. మొహం తిప్పుకుని పోతున్నారు. కొంతమంది మొహం చాటేస్తున్నారు. పిలిస్తే ఏదో మీదకొచ్చి పడ్డట్లుగా పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వెళ్లిపోతున్నారు.

వంట చేస్తున్న మహిళల దగ్గరకు పోయి పలకరించబోతే వాళ్లు గుడిసెలోకి పోయి బయటికి రావటం లేదు.

బిడ్డకు పాలు తాపుతున్న తల్లిని, 'అంతా మంచిగేనా అక్కా' అని పలకరించగానే ఆమె మొఖం తిప్పుకున్నది.

పాటలు పాడితే జమ అయితరని పాటలందుకున్నారు. ఒకటి కాదు, రెండు కాదు, అయిదారు ఒడిసినయి. పాటలంటే చెవి కోసుకుంటరు కదా! దళం అంటే ప్రాణం ఇచ్చే ఊరికేమయింది. జోగన్నకు ఏమీ పాలుపోవడం లేదు.

జోగన్నకు తోడుగా ఊళ్లోకి వచ్చిన కిట్టు, పాండులకు మాత్రం సహనం నశించిపోతున్నది. కడుపులో ఆకలి కరకరలాడుతుంటే గ్రామస్తుల మీద కారాలు మిరియాలు నూరుతున్నారు.

ఊరంతా తిరిగి అలసిపోయి తను మంచంలో కూలబడ్డాడు. పక్కింట్లో ఆలుమగలు ఏదో ఘర్షణపడుతున్నారు. రెండడుగులు అటు వేసి దడి చాటున నిలబడ్డాడు.

'నా మాట ఇనయే రామే. మనం నెత్తురు బియ్యం తిని శపథం చేసి రెండే రోజులయినయి కాదే. మనకు ఆ బియ్యపు గింజలు తినిపించినోళ్లు చెప్పిన మాటలు మరసిపోనావే. నక్సలైట్లతో మాట్లాడినా, అన్నం పెట్టినా, నీళ్లిచ్చినా తలపగిలి సచ్చిపోతారని చెప్పినారు కాదె. నువ్వు బోయి గా అయ్యతో ముచ్చట చేసినావంటే నీ తల పగిలి సచ్చిపోతే నేను నా పిల్లలు ఏం గావాలె. ఒద్దు రామే, ఎల్లకు, నా మాటిను' ప్రాధేయపడుతున్నది మగ గొంతు.

'వాళ్లు రాబట్టే కదా మనకు ఇంత నీడ, బుక్కెడు బువ్వ దొరుకుతున్నది. నిలబడి నీళ్లు, కూచొని కూడు తిననిచ్చెటోల్లా గీ పెద్ద మడుసులు. గా ఫారెస్టు దెయ్యాలకు వీళ్లే కదా మద్దతిచ్చెటోళ్లు. చచ్చినా, బతికినా పార్టీని మనమే కాపాడుకోవాలి. నా పానం పోతే పోనీయి గానీ నేను పోయి గా అన్నతో మాట్లాడుతా. నా పుర్రె పగిలినా మంచిదే' అంటూ గోటుల్ వద్దకు దూసుకెళ్లింది రామే.

ఆమె వచ్చి దళపోళ్లకు చెయ్యి కలిపింది. చిన్న సరవలో అంబలి, బిందెతో బిందెడు నీళ్లు తెచ్చిచ్చింది.

తమ తమ గుడిసెల్లోంచి ఏమయితదో అని ఆందోళనగా వారామెను చూస్తున్నారు. 'ఆమె పుర్రె పగిలిపోలేదు కదా!' ఒకరినొకరు చూసుకుంటున్నారు. తమలో తాము తర్కించు కుంటున్నారు. కొద్దిసేపటి తర్వాత నెమ్మది నెమ్మదిగా ఒక్కొక్కరూ జమ కూడటం మొదలయింది. చూస్తూ చూస్తుండగానే ఊరంతా పోగుబడ్డారు.

'కల్మ మాసాల్ (మహేంద్ర కర్మ) ఇక్కడనే కదా మనకు నెత్తురు బియ్యం తినిపించిండు!'

'దంతేశ్వరి మీద ఒట్టు పెట్టించిండు కదా!'

'ఆ బియ్యం గింజలు తిని శపథం చేసినోళ్లు అన్నలతో మాట్లాడినా, చెయ్యి కలిపినా చచ్చిపోతారని మీటింగు చేసిండు కదా!'

'మనం కూడా నమ్మినం. వాని భయానికి బియ్యం తిన్నాం. మన పార్టీని మనం దూరం చేసుకునెటందుకు తయారయినం. మన గుడ్డి నమ్మకాన్ని గాయన సొమ్ము చేసుకుంటాండు.'

జోగన్నకు క్రమంగా విషయం అర్థం అయింది.

తర్వాత ఈ విషయాన్ని డివిసిలో చర్చించారు. జనజాగరణ్‌కు దన్నుగా నిలిచిన పెత్తందారులు, భూస్వాములపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గ్రామగ్రామాన సభల నిర్వహణకు రక్షణగా వచ్చే పోలీసులను ముందు వాడినైనా, చివరి వాడినైనా కొట్టాలి, వారి దూకుడును అరికట్టాలని నిర్ణయించారు. 'ప్రతిఘటనలోనే ఆత్మరక్షణ' నినాదంగా మొదటి జనజాగరణ్ దాడిని ప్రతిఘటించి దాన్ని ఓడించారు.

* * *

అన్నం తినడం కోసం పిలుపుగా లాంగ్ విజిల్‌తో జోగన్నకు మెలకువ వచ్చింది. ఒళ్లంతా కొట్టినట్టుగా బడలికగా ఉంది. గడియారం ఒంటిగంట చూపిస్తున్నది. నెమ్మదిగా లేచి కిచెన్ వైపు అడుగులు వేశాడు. శరీరం బాగా అలసిపోయినప్పుడు ఒక్కోసారి అన్నం తినబుద్ధి కాదు. ఈ రోజు జోగన్న పరిస్థితి అలాగే ఉంది. సల్వాజుడుం మొదలయినంక ప్రజలు ధాన్యాన్ని భూమి పాతర్లలో భద్రపరుచుకుంటున్నారు. దాంతో బియ్యం ముక్కవాసన వేస్తున్నది. తమతో పెట్టుకున్న పప్పు కూడా అలాంటి నిల్వదే. పప్పు మీద ఆవాల్లా పైకి తేలాయి ముక్క పురుగులు. పప్పు బద్ద లోపల గూడు కట్టుకున్న ముక్క పురుగులు కడిగినా పోవు, చెరిగినా పోవు. ఉడికే కొద్దీ పైకి వస్తాయి. పప్పు పొంగుతో తీసేయగా మిగిలినవి పైన తెట్టు తేలుతున్నాయి. అన్నం ముగించుకుని డేరాకు వచ్చాడు.

పంద్రు తన బాలల సైన్యంతో డేరాలో ఎదురు చూస్తున్నాడు. జోగన్న రావడం చూసి అందరూ లేచి వచ్చి లైనుగా నిలబడి 'లాల్‌సలాం కామ్రేడ్' అని పిడికిలి బిగించి మరీ చెపుతున్నారు.

'కూర్చుందాం పదండి' అంటూ జోగన్న జిల్లీలో కూర్చున్నాడు. పిల్లలంతా ఆయన చుట్టూ మూగారు. కోవాల్ దాదా చిన్న కొడుకు సందీప్ జోగన్న ఒళ్లో ఒరిగిపోయి కూర్చున్నాడు. మన్‌కేలి విప్లవ ప్రజా ప్రభుత్వపు అధ్యక్షుడు కోవాల్‌ను సల్వాజుడుం గూండాలు చిత్రహింసలు పెట్టి చంపారు. సందీప్ తల్లి పాలు తాగుతున్నాడు. ఇల్లు కాలిపోయింది. కట్టుబట్టలు తప్ప

కుటుంబానికి ఏమీ మిగల్లేదు. గ్రామస్తులంతా అడవిలో తలదాచుకుంటున్నారు. దళం పోతే అందరూ దళంతోనే ఉండేవాళ్లు. దళంతో ఉంటే తమకు తాము రక్షణగా భావించేవాళ్లు. తన జిల్లీలో పడుకుని అంబాడటం నేర్చుకున్నాడు సందీప్. తాను అన్నం తినడానికి పోయి వచ్చేసరికి జిల్లీలో మూత్రం పోసి మట్టిలోకి దిగిపోయి రెండు గుప్పిళ్లతో ఇసుకను జిల్లీలో పోసి చేతులతో చపచప చరుస్తూ కేరింతలు కొట్టేవాడు. కొన్నిసార్లు రాత్రిపూట తన పక్కలోనే పడుకుని రాత్రిపూట పక్క తడిపి చలికి 'యాయా' అంటూ ఏడిచేవాడు. వాడికి ఏడు సంవత్సరాలు నిండుకునే సమయానికి విప్లవ ప్రజాప్రభుత్వం నడిపే భూంకాల్ స్కూల్లో చేర్పించాడు.

అదే గ్రామంలో పిఎల్‌జిఎ గెరిల్లాలకు నీళ్లు చేరవేసి ఇంటికి తిరిగిపోతున్న మిలీషియా మహిళలు కురసం లక్కె, మొడియం సుక్కిలను సిఆర్‌పిఎఫ్ జవాన్లు ఎంత పాశవికంగా హింసించి చంపారు. కత్తులతో పొడిచి చంపి శరీరాన్ని ముక్కలు ముక్కలుగా నరికారు.

ఆ పాశవిక బీభత్సం మావోయిస్టు పార్టీకీ, దోపిడీ పాలకవర్గాలకు నడుమ స్పష్టమైన విభజన రేఖను ప్రజల ముందుంచింది. ప్రజలు మరింతగా పార్టీని స్వంతం చేసుకున్నారు. ప్రజాయుద్ధాన్ని స్వంతం చేసుకున్నారు.

పల్లి గ్రామంపై సల్వాజుడుం గుండాలు దాడి చేశారు. పురుషులంతా అడవి వైపు పరుగులు తీశారు. పడుచు పిల్లలు, మహిళలు తప్పుకున్నారు. నడివయస్సు సోమిడికి భర్త లేడు. గుండాలు ఆమెను విపరీతంగా హింసించారు. అత్యాచారం చేశారు. తలపై బలంగా కొట్టారు. చనిపోయిందనుకుని వదిలేసి పోయారు. అర్ధనగ్నంగా అచేతనంగా పడి ఉన్నది. ప్లటూన్ సభ్యులు దాడి వార్త విని ఉరుకులు పరుగుల మీద గ్రామానికి అందారు. అప్పటికే జరగవలసిన ఘోరం జరిగిపోయింది. గెరిల్లాల శుశ్రూషతో ప్రాణం పోసుకున్న సోమిడి నెమ్మదిగా కోలుకున్నది. తన కొడుకును దగ్గరకు పిలిచింది.

కొడుకు చేతిని తన తలవైపు నిలబడిన కమాండరు చేతిలో పెడుతూ కొడుకుతో, 'బిడ్డా! ఈ పాపిట్టి సర్కారు మన ప్రాణాలు తీస్తది. మనం ఉట్టి చేతులతో సావకూడదు. పోరాడి చనిపోవాలి. చనిపోయే ముందు ఒక్క పోలీసోన్నయినా చంపు బిడ్డా! మీ నాయిన ఇడిసిపోయిన బర్మారు తీస్కపో బిడ్డా...నా గురించి చింతపడకు. మేం ఎలాగో తిప్పలబడి బతుకుతాం' అంది.

పిఎల్‌జిఎ చేసిన దాడుల గురించి కుతూహలంగా ప్రశ్నలు వేసింది పంద్రు బాలసైన్యం. వాళ్ల కబుర్లతో సమయం ఇట్టే గడిచిపోయింది.

అయిదు గంటలకు ప్రయాణం మొదలయింది మరో మజిలి కోసం.

* * *

వందేళ్ల అంతర్జాతీయ మహిళా దినం వేడుకలు ఘనంగా జరుపుకోవాలని దండకారణ్యా మహిళా సబ్‌కమిటీ పిలుపునిచ్చింది. ఆ పిలుపునందుకుని పశ్చిమ బస్తర్ డివిజన్ క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘం పెద్ద బహిరంగ సభ జరపాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా దండకారణ్యా ఉద్యమంలో అసువులు బాసిన మహిళా అమరవీరుల పేరు మీద పెద్ద స్థూపం కట్టారు.

అరవై పెట్టెల రైలుబండి సభా ప్రాంగణానికి కొంచెం దూరంలో ఆగింది.

మాకు కుడివైపు కిలోమీటరు దూరంలో పిఎల్‌జిఏ రెండవ కంపెనీ డేరా వేసింది. మహాసభ రక్షణ ఏర్పాట్ల కోసం వచ్చి ఉంది. వంద యాభై గజాల దూరంలో భుంకాల్ స్కూలు పిల్లల డేరా ఉంది. మా డేరాకి దిగువున డివిజన్ కెఏయంఎస్ కార్యవర్గం, ఏరియా జనతన సర్కారు అధ్యక్షులు, కమాండర్ ఇన్ చీఫ్‌ల డేరాలు ఉన్నాయి.

శత్రువు గ్రీన్‌హంట్ పేరుతో దాడి సన్నాహాలు ముమ్మరంగా చేసుకుంటున్నాడు. కార్పెట్ సెక్యూరిటీలో భాగంగా ఏర్పాటు చేసిన క్యాంపులకు హెలికాప్టర్ల ద్వారా సప్లయిలు అందిస్తున్నారు. రోజుకు ఒక్కసారన్నా హెలికాప్టర్ దర్శనమిస్తుంది. పోలీస్ స్టేషన్లు ఉన్న దగ్గరే సంతలను ఏర్పాటు చేశారు. గ్రామాల నుండి పారిపోయిన ఎస్‌పిఒల ద్వారా మానసిక యుద్ధాన్ని నడిపిస్తున్నాడు.

'కింది నుండి కాల్బలాలు, పై నుండి వాయుసేన వచ్చి దాడి చేస్తాయి. గ్రామాల్లో ఉంటే ఉత్తిపున్నేనికి చచ్చిపోతారు. క్యాంపుల కాడికి వస్తేనే మీకు రక్షణ దొరుకుతుంది'.

ఇలాంటి వాతావరణంలో రాత్రి పగలు ప్రయాణాలు చేసి సభకు తరలివస్తున్నారు. చంటి బిడ్డల్ని చంకకు కట్టుకుని నెత్తి మీద సద్దిమూటలు, వంటపాత్రలు, బియ్యం-పప్పు, డోళ్లు-డప్పులతో పిల్లలు, యువతీ యువకులు, సుమారు 15 వేలకు పైగా స్త్రీ-పురుషులు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. డివిజన్ కెఏయంఎస్ అధ్యక్షురాలు జయమతి తెల్లని నక్షత్రం హత్తిన ఎర్రజెండాను ఎగురవేసింది. 'నారీ ముక్తి ఝుండా మనల్ తెహాకల్' అంటూ సామూహిక గానం చేసిన పిదప దౌలా షార్ట్ సర్‌ప్రైజ్ దాడిలో అమరురాలయిన కరుణ తల్లి నలభై అడుగుల స్థూపాన్ని ఆవిష్కరించింది. ప్రధాన వక్తగా జోన్ కెఎఎంఎస్ అధ్యక్షురాలు రాజే సభను ఉద్దేశించి ప్రసంగించింది. డివిజన్ పార్టీ సెక్రటరీ సోమారి ప్రసంగించింది. జిల్లా మహిళారంగం బాధ్యురాలు జమిలి, సన్ని, వసంత, బూదిలు దండకారణ్య మహిళా ఉద్యమ చరిత్ర, క్లారా జెట్కిన్ జీవిత చరిత్ర, అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం చరిత్ర, ఎల్‌టిటిఇ మహిళా గెరిల్లాలు పుస్తకాలను సభకు పరిచయం చేశారు. సాయంత్రం అయిదు గంటలకు ఆ రోజు సభా కార్యక్రమాలు ముగించి అంతా ఎవరి డేరాలకు వాళ్లు వెళ్లిపోయారు. రాత్రి సామూహిక నృత్యం కోసం వంటలు త్వరత్వరగా ముగించుకుని అందరూ తమ తమ వాయిద్యాలను తీసుకుని సభాప్రాంగణానికి వచ్చారు.

స్త్రీలు-పురుషులు ఎవరికి వారు విడివిడి జట్లుగా నృత్యం చేస్తున్నారు. పెద్ద పెద్ద డోళ్లు మెడకు కట్టుకుని లయబద్ధంగా కదం కలుపుతున్నారు.

నెగళ్ల వెలుగులో యుద్ధపు నీలినీడలకు అతీతమైన ప్రశాంతత వారి మొహాలపై ప్రతిబింబిస్తున్నది. అది వార్ డ్యాన్స్. సల్వాజుడుం ఫాసిస్టు దాడిని ఓడించి గ్రీన్‌హంట్‌ను ఓడించడానికి సన్నద్ధం కమ్మంటున్న యుద్ధభేరిలా డోళ్ల చప్పుళ్లు దిక్కులను ప్రతిధ్వనిస్తున్నాయి. వెన్నెల వారితో నాట్యమాడుతూ తూర్పున ఉషోదయానికి స్వాగతం చెపుతూ సెలవు తీసుకుంది.

* * *

రెండవ రోజు సభా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సభకు అధ్యక్షత వహిస్తున్న సన్ని అమరవీరుల కుటుంబాలను వేదిక పైకి ఆహ్వానిస్తున్నది. తల్లులు, తండ్రులు, అన్నలు-తమ్ముళ్లు, అక్కలు-చెల్లెళ్లు, చిన్నాయనలు-పెదనాయనలు అమరులను పరిచయం చేస్తున్నారు.

'నా కొడుకు పొలంలో నాగలి దున్నుతుండగా ఎటు నుండి వచ్చిన్రో తోడేళ్ల గుంపులా మీద పడ్డారు. పొలంలో బురదలో నెత్తుటి మడుగయ్యిండు'

'నా భర్త కల్లు తీసెటందుకు తాడిచెట్టు ఎక్కిండు. ఎనక వచ్చిన పోలీసులను చూడలేదు. కింది నుండే కాల్చిన్రు. పిట్టోలె రాలిపడ్డాడు'

'మా చెల్లి సీతి మా అత్తోళ్లని చూసెటందుకు పక్కూరికి పోతుండె. తొవ్వలనే దొరకబట్టి యమయాతనలు బెట్టి చంపిన్రు. ఒంటి మీద నూలుపోగు లేదు. కాళ్లు, చేతులు నరికిన్రు. శరీరం పదిహేడు ముక్కలుగా నరికిన్రు. పోలీసు కాల్పుల్లో మహిళా కమాండరు చచ్చిపోయిందని రేడియల ప్రకటించిన్రు'

'మా అన్న సోమారు, మా చిన్నాయన బిడ్డ మాసేలు పక్కూరిలో పెళ్లికి పోయిన్రు. రాత్రంతా ఆట-పాటలో పాల్గొని తెలతెల్లారంగా ఇంటికి తిరిగి రాంగ దారిలో మాటు గాసిన పోలీసులు వాన కురిసినట్లుగా తూటాలు గుప్పించిన్రు. ఇద్దరి శరీరాలు చిల్లులు పడిపోయినయి. కరడు గట్టిన నక్సలైట్లను చంపినమని పేపర్లలో రాసిన్రు'

దామన్‌జోడి దాడిలో అమరుడైన వర్గీస్ (కల్మ నందాల్) సహచరి మైకు వద్దకు వచ్చింది. కన్నీళ్లతోనే ప్రారంభించింది. భావోద్వేగంతో మొదలుపెట్టింది.

'వర్గీస్, నేను ఇష్టపడి పెళ్లి చేసుకున్నాం. ఇద్దరం సంఘాలలో పని చేసినం. ఆయనపై పోలీసుల నిఘా పెరిగింది. ఒకరోజు వచ్చి అరెస్టు చేసి తీసుకెళ్లారు. ఎన్నో చిత్రహింసలు పెట్టారు. ఒంటి మీద దెబ్బ లేని చోటు మిగలకుండా కొట్టారు. అయినా పార్టీ రహస్యాలు చెప్పలేదు. రెండు సంవత్సరాలు జైల్లో ఉండి విడుదలయ్యి వచ్చిండు. పార్టీ కలవలేదు. పార్టీని వెతుక్కుంట పోయి దళంలో కలిసిండు. పార్టీ చెప్పిన పనికి పోయి మళ్లి జైల్లబడ్డడు. తోటి ఖైదీలను కూడగట్టిండు. దంతెవాడ జైలుబ్రేక్ చేసుకుని బయటకొచ్చిండు. ప్లటూన్‌లో చేరి పార్టీ ఇచ్చిన పని మీద నారాయణపట్నాకు పోయి దామన్‌జోడి దగ్గర అమరుడయ్యిండు'

సభ నిశ్శబ్దంగా ఉంది. దూరంగా కూర్చున్నవాళ్లు దగ్గరకు వచ్చారు. ఆమె వేదనలో వేదనైనారు. శ్రోతలందరి కళ్లూ నిండుకున్నాయి.

ఆమె స్మృతులు పరుచుకుంటూనే ఉన్నాయి.

'నన్ను కూడా దళంలోకి రమ్మని ఇద్దరం పోదాం అన్నాడు. అప్పుడు నేనే వినలే. ఇప్పుడంత తెలివి లేకుండె. నేను ఇప్పుడు మహిళా సంఘంలో పని చేస్తున్నాను. నేను పార్టీని వదలను, పోరాటం వదలను. నా భర్త ఆశయాన్ని నెరవేరుస్తాను. అమర్ హై కామ్రేడ్ వర్గీస్' అంటూ ఆమె ముగించగానే సభ సభంతా 'అమర్ హై! అమర్ హై!' అంటూ మార్మోగింది.

అమరుల స్మృతులతో సభాస్థలి గుండె బరువెక్కింది.

అమరుల వియోగంతో కన్నీళ్లు కార్చింది.

'అమరుల ఆశయాలను తుదకంటా కొనసాగిస్తాం' అంటూ ప్రతిజ్ఞ చేసింది.

బలిదానాల బాటతో తాదాత్మ్యం చెందింది.

* * *

భోజన విరామం తర్వాత మధ్యాహ్నం సెషన్ ప్రారంభమయింది.

వేదికపై విల్లు-బాణాలు పట్టుకున్న మహిళలు డోల్ల చప్పుళ్ల మధ్య విన్యాసాలు చేశారు. ఈ సెషన్‌కు కా. మంగ్లి అధ్యక్షత వహించింది.

విల్లు బాణాల పోటీలలో 'బుల్' కొట్టిన మహిళలను బహుమతులు తీసుకోవడానికి వేదికపైకి ఆహ్వానిస్తున్నది.

సభా సన్నాహాలలో భాగంగా మహిళలకు విల్లు-బాణం పోటీలు నిర్వహించారు. ఆ పోటీలలో సుమారు రెండు వేలకు పైగా మహిళలు పాల్గొన్నారు.

సన్నీ పేర్లు ప్రకటిస్తున్నది. కరతాళ ధ్వనులు, డోల్ల చప్పుళ్లు మిన్నుముట్టుతుండగా మంగ్లి వారికి 'చురకత్తులు' బహుమతిగా అందిస్తున్నది. క్రమంగా వేదిక నిండిపోయింది. వారిలో యువతులున్నారు. వివాహితలు, చంటిబిడ్డలను చంకనెత్తుకున్న మహిళలూ ఉన్నారు. బహుమతుల ప్రదానం ముగిసినంక చురకత్తులు పట్టుకున్న చేతులను ఎత్తిపట్టి సభకు అభివాదం చేశారు.

ఆ అభివాదనలో సల్వాజుడుం ఫాసిస్టు దాడిని ఎదుర్కున్న ఆత్మవిశ్వాసం తొణికిసలాడింది.

గ్రీన్‌హంట్‌ను ఓడించి తీరుతామన్న ప్రతిఘటనా సందేశం ప్రతిజ్ఞగా దిక్కులను ప్రతిధ్వనించింది.

ఆ సభ జైలులో బందీలుగా ఉన్న తమ సంఘ సభ్యురాళ్లకూ, నాయకురాళ్లకూ పోరాట సందేశాన్ని వినిపించింది.

కార్పెట్ సెక్యూరిటీ మధ్యన రెండు రోజులు అంతర్జాతీయ మహిళా దినం సభ అలా విజయవంతం అయ్యింది.

* * *

డివిజన్ కెఎంఎంఎస్ జిల్లా కార్యవర్గం కొనసాగింపు సమావేశం నడుస్తున్నది.

భుంకాల్ స్కూలు టీచర్ ఆకాష్ వచ్చి కమాండర్ రవిని ఏదో అడుగుతున్నాడు.

రవి చుట్టూ కూర్చున్నవాళ్లంతా నవ్వుతున్నారు.

'నిన్ను భోజనానికి పిలవడానికి వచ్చారు. కోడిని కోశారట' రాజె గార్డు సునీల రాజెతో అంటున్నది పరాచికంగా.

అది మొహమాటపు మధ్యతరగతి మర్యాద కాదు. ఆత్మీయతను నింపుకున్న వర్గస్పర్శ. ఆ పిలుపుకు రాజే మనసు పులకరించింది. పిల్లలతో గడపడం తనకూ ఇష్టమే. సమావేశానికి అధ్యక్షత వహిస్తున్న జయమతిని అనుమతి కోరి వెంటనే పోవడానికి సిద్ధమయింది.

భుంకాల్ స్కూలు పిల్లల డేరా రెండు వందల గజాల దూరంలో ఎత్తున ఉంది.

అరవై పెట్టెల రైలుబండి కమాండరు రవి, డివిజను పార్టీ సెక్రెటరీ సోమారి, రాజెలు ఆకాష్‌ను అనుకరించారు. వారికి రక్షణగా సెక్షన్ సంఖ్యలో పిఎల్‌జిఎ కామ్రేడ్స్ ముందూ వెనకా నడుస్తున్నారు.

ఛుంకాల్ స్కూలు పిల్లలంతా లైనులో నిలబడి వారికి చేతులు కలుపుతూ 'లాల్‌సలాం' చేశారు.

సోమారిని చూడగానే పిల్లలంతా 'చేగువేరా' సినిమా చూయించాలని గోలగోల చేశారు.

'సినిమా చూడాలనుకునే వాళ్లంతా చేతులు పైకి లేపండి' అన్నది సోమారి.

పిల్లలంతా కుడిచేయి లేపారు.

'మెజార్టీ రాలేదు కామ్రేడ్స్'

పిల్లలంతా ఈసారి రెండు చేతులూ లేపారు.

పెదవి విరిచింది సోమారి మెజార్టీ సరిపోదన్నట్లుగా...

పిల్లలంతా నేల మీద వెల్లకిలా పడుకుని తమ రెండు చేతులూ, రెండు కాళ్లూ పైకి లేపారు.

'ఇప్పుడో?' రెట్టించారు సోమారిని.

ఫక్కున నవ్వింది సోమారి. అందరూ కడుపులు పట్టుకున్నారు. నవ్వుతో కళ్లల్లోకి ఉబికిన నీటిని రుమాళ్లతో తుడుచుకున్నారు.

రాజె పిల్లలతో సంభాషణలోకి దిగింది. పిల్లలంతా 5 నుండి 12 సంవత్సరాల లోపువాళ్లే. చిన్నపిల్లల స్థాయికి ఏం చెప్పడం అని ఆలోచించి కథలతో ప్రారంభించింది. చైనా నవల 'ఎర్రనక్షత్రం'లోని శీతబాబు గురించి చెప్పింది. వియత్నాం గెరిల్లా కథలు చెప్పింది.

'మీకు పాటలు వచ్చా' అడిగింది రాజె.

సోని పాట అందుకున్నది. చూపుడు వేలు చూపిస్తూ ఆవేశంగా పాడుతున్నది.

'అడవి మనది
ఇనుప ఖనిజం మనది
బైలడిల్లా మనది
రావ్‌ఘాట్ మనది
సూర్జాగఢ్ మనది
జల్-జంగల్-జమీన్‌పై హక్కు మనది
వీటిని దోచే దోపిడీ దొంగలు
సోనియాగాంధీ-మన్‌మోహన్
చిదంబరం-రమన్ సింగ్-మహేంద్ర కర్మ
వీరిని మనం పాతరపెడదాం
మన సంపదలనూ కాపాడుకుందాం'

కోరస్ మార్మోగిపోతున్నది. రాజె వారిని చూస్తున్నది తన్మయత్వంగా.

'దీదీ! మాకు రాజకీయాలు చెప్పవా?' అడుగుతున్నాడు నందు. పది వసంతాలైనా

నిండని, ముక్కుపచ్చలారని ఈ పసికందులకు ఏం రాజకీయాలు చెప్పాలి. వయసుకి మించిన మానసిక పరిణతి వారిలో కనిపిస్తున్నది. తమ బాల్యాన్ని చిన్నాభిన్నం చేసిన పాలుగారే బుగ్గలను నెత్తురుముద్ద చేసిన రాజ్యం పాశవికతపై వారి కసి ప్రస్ఫుటంగా కనిపించింది.

పిల్లలంతా న్యాయం, అన్యాయం మధ్య సంవాదం ఆటకు సిద్ధమయ్యారు. ఒక్కో జట్టుకు 15 మంది రెండు జట్లుగా విడిపోయి ఎదురుబొదురుగా లైన్లలో నిలబడ్డారు.

న్యాయపక్షం – మేం ఆదివాసులం. భారతదేశ మూలవాసులం. ఈ అడవి మాది. అడవి సంపద మాది. అడవిపై హక్కు మాది. దీని కోసం మేం చేసేది న్యాయయుద్ధం.

అన్యాయపక్షం – మేం ఈ దేశానికి పాలకులం. దేవుడిచ్చిన వరం దోపిడి బుద్ధి. టాటా–జిందల్–మిత్తల్–ఎస్సార్‌లం మేం. మాకు అడ్డం నిలిచిన వారిని కాల్చి బుగ్గి చేస్తాం. పోలీస్ మాకుంది. కోర్టులు మావి. సైన్యం మాది. అణ్వాయుధాలు మావి.

న్యాయపక్షం – దేశ జనాభాలో పిడికెడుమంది. కండబలమే తప్ప గుండెబలం లేనోళ్లు. పీడితులంతా గుతపలు బడితే మీ గుండెలు చేజారు.

అన్యాయపక్షం – మేం చేస్తాం 'శాంతివేట', మాకిష్టం 'హరితవేట', మేం గెలుస్తం.

న్యాయపక్షం – రక్తం రుచి మరిగిన పులులు మీరు. కాగితప్పులులు మీరు. మా ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం గోరి మీకు కడుతుంది.

ఆట ముగిసింది.

'సల్వాజుడుం ముర్దాబాద్!'

'ఆదివాసులపై అన్యాయమైన యుద్ధం గ్రీన్‌హంట్‌ను ఓడిద్దాం! ఓడిద్దాం!'

నినాదాల హోరులో వారి నుండి వీడ్కోలు తీసుకున్నారు.

* * *

కార్పొరేట్ పీడకులు టాటా, ఎస్సార్, జిందల్, మిత్తల్‌లు ఒకవైపు

పీడిత, తాడిత ఆదివాసీ రైతాంగ స్త్రీ–పురుషులు మరోవైపు బరిగీచి నిలబడ్డారు.

ఒక పక్షం – పొట్టలు కొట్టేది

మరో పక్షం – కడుపులు నింపేది

ఒక పక్షం – భూమి కింద నిక్షేప నిధులను కొల్లగొట్టుకోవటం కోసం

మరో పక్షం – జీవిక కోసం భూమిపై హక్కు కోసం

ఒక పక్షం – అన్యాయమైనది

మరో పక్షం – న్యాయమైనది

ఈ రెంటి మధ్య భీకర ఘర్షణ. అదే వర్గపోరు. అన్ని ముసుగులను చించేసింది. అన్ని మాలిన్యాలనూ వడకట్టింది. అన్యాయపక్షంతో చేతులు కలిపిన వాళ్లంతా పట్టణాలకు...న్యాయం వైపు నిలబడ్డవాళ్లంతా అడవితల్లి ఒడిలోకి....

***అరుణతార నవంబర్–డిసెంబర్, 2012***

dandakaranya kathalu 2005 - 2012 | virasam




జనతన సర్కార్ నేపథ్యంలో 2005 నుండి 2012 దాకా అరుణతారలో వచ్చిన పదిహేను కథలు ఇవి. ఇవ్వాల్టి అవసరంగా గత ముప్పై రెండేళ్ళుగా మూడు తరాలు తమ రక్తంతో, త్యాగాలతో నిర్మిస్తున్న పోరాటం ఇది. ప్రపంచంలోనే ఇంత సుదీర్ఘ కాలం కొనసాగిన పోరాటం మరొకటి లేదు. ఫ్రెంచి విప్లవం 70 రోజులు మాత్రమే నిలిచింది. రష్యాలో 1906 సంవత్సరంలో బోల్షివిక్ పార్టీ ఏర్పడితే అక్టోబరు 1917 వరకు విప్లవం విజయవంతమయ్యింది. అట్లాగే చైనా విప్లవం 1919 నుండి 1949 వరకు విముక్తి సాధించింది. దండకారణ్యంలో ఇంత సుదీర్ఘ కాలం - విప్లవంలో మూడు తరాలు పాల్గొన్నాయి. కనుక ఇప్పటి తరానికి ఆరంభం నుండి మొత్తం సాహిత్యాన్ని అందించవలసి ఉన్నది.

ప్రపంచ సాహిత్యంలో నిలుపగలిన స్థాయిలో యుద్ధ క్షేత్రం నుండి విప్లవాచరణలో ఉన్న రచయిత, రచయిత్రులు రాసిన ఈ పదిహేను కథలను ముందుగా ఒక సంకలనంగా విరసం ప్రచురిస్తోంది. అబూజ్‌మడ్ కొండల్లో - అనగా దండ కారణ్యంలో నుండి అనేక దశలు దాటి విస్తరించిన ప్రజాసైన్యం, జనతన సర్కారు, మావోయిస్టు పార్టీ యుద్ధరంగంలో నుండి వెలువరిస్తున్న ఈ కథా సాహిత్యం మనకాలపు విప్లవ సాహిత్యం. ప్రపంచవ్యాపితంగా వచ్చిన, వస్తున్న సాహిత్యం కన్నా భిన్నమైన మనకాలపు మన నేల మీది సాహిత్యం ఇది. కథాంశం, శిల్పం, భాష, సంఘటనలు, వాతావరణం పాత్రలు పూర్తిగా భిన్నమైనవి. సంఘర్షణ నుండి, వర్గపోరాటం నుండి పుటం పెట్టబడి రూపొందినవి. ఈ కథలు కట్టుకథలు కాదు. పుట్టు కథలు. రచయితలు యుద్ధ రంగంలో నిలబడి ఒక చేత్తో తుపాకి మరొక చేత పెన్నుపట్టి రాసినవి. ఒక ఉద్విగ్న, ఉద్రిక్త తుఫాను గాలిలాంటి పెను సంరంభంలోంచి రాసినవి. వర్గ పోరాటాన్ని, సమస్త లోతులతో వైరుధ్యాలతో - సంఘర్షణలతో చిత్రించడం ప్రపంచ సాహిత్యంలోనే మనకాలపు అరుదైన విషయం.

- అల్లం రాజయ్య